# కథకు శతమానం

(కథానికా సాహిత్య వ్యాసాలు)

సంపాదకుడు
జి. గిరిజామనోహరబాబు

Blank page

షష్టిపూర్తి ప్రచురణలు - 2

# కథకు శతమానం

(కథానికా సాహిత్య వ్యాసాలు)

సంపాదకుడు

**జి. గిరిజామనోహరబాబు**

గన్నమరాజు ఫౌండేషన్
విజయనగర్ కాలనీ, హనుమకొండ

౧

**KATHAKU SHATHAMANAM**
Edited by
**G. Girijamanoharababu**

© Editor

First Edition : January, 2012

Copies : 500

Price : 200/-

*For Copies:*
**G. Girijamanoharababu**
H.No. 2-11-501/5,
Vijayanagara Colony,
HANUMAKONDA - 506 009
Cell: 99490 13448
E-mail: ggmbabu@gmail.com

*Printed at*
**Deepti Printers**
Hanumakonda

# ఒక్కవెలుగు

"ఏ వెలుగులకీ ప్రస్థానం?" అంటూ పెద్దలంతా అనేకానేక విషయాలపై తపనపడుతూ ఉంటారు. ఆధునిక తెలుగుకథ పుట్టి వందేళ్ళు దాటింది. తెలుగు కథా ప్రస్థానాన్ని గురించి తెలుగు కథా ప్రేమికులంతా పలు పలు విధాలుగా పలుదృక్కోణాల నేపథ్యం నుండి చర్చోపచర్చలు చేస్తూనే ఉన్నారు. నేటికీ కథను గురించిన లెక్కలేనన్ని నూత్న విషయాలు బహిర్గతమవుతూ ఉన్నాయి. కొత్త వెలుగుల్ని ప్రసరింపజేస్తూనే ఉన్నాయి.

విశ్వవిద్యాలయాల స్థాయిలోనే గాకుండా, ఎందరెందరో కథను గూర్చిన పరిశోధనలు కొనసాగిస్తూ ఉండటమే దాని సజీవ చైతన్యానికి నిదర్శనం. తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ స్థాయి గౌరవాన్ని కలిగించిన తెలుగు కథ పుట్టి వందేళ్ళు గడచిన సందర్భాన్ని పురస్కరించుకొని చేసిన ఒక చిన్న ఆలోచన ఈ **"కథకు శతమానం"** గ్రంథానికి పునాది. ఎందరెందరో కథా సాహిత్యంపై తమదైన పరిశోధనా ప్రవణత్వంతో, గాఢమైన అభినివేశంతో, విస్తృతంగా చర్చిస్తున్నారు. దాని ఆధారంగా ఈ శుభ తరుణంలో ఈ వ్యాస సంకలనాన్ని అందిస్తే బాగుంటుదన్న బలమైన సంకల్పంతో పెద్దల్ని సంప్రదించడం వల్ల ఈ పుస్తకానికి గొప్ప శోభను కలిగించారు.

కొందరు ప్రసిద్ధులైన కథా విమర్శకులు ప్రత్యేక సందర్భాల్లో రచించిన కొన్ని వ్యాసాల్ని కూడా వారి అనుమతితో ఈ సంకలనంలో చేర్చాం. దానికి వారి సౌజన్యమే ప్రధాన కారణం. వారందరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు.

* * *

కథ, కథానిక – ఈ రెండింటి విషయంలో పలువిధాలైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రముఖుల్ని సంప్రదించాం. ప్రాచీన కథా నిర్మాణానికి, ఆధునిక కథా నిర్మాణానికి చాలా పెద్ద అంతరమే ఉందన్నవాళ్ళు కొందరైతే, అసలు కథకు బీజం అక్కడే ఉందన్న వాళ్ళు మరికొందరు. అనేక పురాణాల్లోనూ, ప్రాచీనమైన వైదిక సాహిత్యం లోనూ 'కథ' కనిపిస్తుందన్న పెద్దల అభిప్రాయాల్తోపాటు అత్యాధునిక కథారచయితల నైపుణ్యాన్ని వివరించే వ్యాసాలను కూడా ఇందులో పొందుపరచే యత్నం చేశాము.

ఇటువంటి వ్యాసాలతో బోటు తెలుగు కథా సాహిత్యం ఒక శాస్త్రంగా ఎలా నిలబడగలదు? చైతన్యస్రవంతి శిల్పం వంటి ఎన్నిరకాల పోకడలు కథలో

ఒదిగి పోయాయి? కథకున్న మానవీయ స్పర్శ ఎట్లాంటిది? శిల్పరీత్యా కథ అందుకున్న శిఖరాలేమిటి? ఇలా పలువిధాల వివరాల్ని ఈ వ్యాసాల్లో కనిపింపజేసే తపన పడ్డాం. ఆ విషయంలో వ్యాసకర్తలు మా ఆలోచనకి అక్షర రూపాన్నిస్తూ సహకరించారు. అది మా భాగ్యం.

ఈ వందేళ్ళలో ఆంధ్రదేశం పలురకాలైన ఉద్యమాలతో దద్దరిల్లింది. మానవ మస్తిష్కంలోని వివిధ ఆలోచనా తరంగాలు తెలుగునేల నాలుగు చెరగులా ప్రవహించి, తెలుగు సాహిత్యానికి గొప్ప వైవిధ్యాన్ని అందించాయి. ఈ వైవిధ్యానికి ఈ ఆలోచనలే పునాది. సాహిత్యంలోని అన్ని ప్రక్రియల వలెనే కథ కూడా ఆయా ఆలోచనలతో ప్రభావితమైంది. అందుకే అంత వైవిధ్యం, కథల్లోనూ చోటు చేసుకుంది.

సామాన్య పాఠకుని ఆలోచనల్ని తీవ్రంగా ప్రభావితం చేసే శక్తి కవిత్వాని కన్నా ఎక్కువన్న సత్యం మరువరానిది. కేవలం కాలక్షేపం కథకు పరమార్థం కాదు. బుద్ధి జీవిని చైతన్య పరచగలిగే శక్తివంతమైన సాధనం కథ. కథా రచయితలు ఈ సత్యాన్ని గుర్తించారు కనుకనే తమ తమ అస్తిత్వాన్ని కథల ద్వారా బహిర్గతం చేసి పటిష్ఠమైన పునాదిని వేశారు. అందుకే దళితవాదం, స్త్రీవాదం వంటి అత్యాధునిక భావజాలం కథల్లో చోటుచేసుకుంది. అట్టడుగున పడిపోయిన సగటు మనిషి ఆలోచనలకు కథ పెద్దపీట వేసింది.

అసలు ఆధునిక కథ మొదలు కావడమే సంఘ సంస్కరణ భావాలతో మొదలైంది. పుట్టుకతోనే సదాశయం పొందుపరచుకున్న ఈ కథానికా ప్రక్రియ ఇంతగా విజయవంతమవడమే పాఠకుల అంతరంగాల్లో పదిలంగా నిల్చిపోవటానికి ప్రధాన కారణం కావచ్చు.

మానవ సంబంధాల్ని, మనిషి లోపలి పొరల్లో నిక్షిప్తమై ఉన్న లోతైన భావాల్ని విపులంగా వ్యాఖ్యానించిన కథ తెలుగుదేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతంగా వికసించింది. తెలంగాణాలో కావచ్చు, రాయల సీమలో కావచ్చు, ఉత్తరాంధ్రలో కావచ్చు, సర్కారు ప్రాంతంలో కావచ్చు, గోదావరి జిల్లాల్లో కావచ్చు. ఎక్కడైనా, ఏ ప్రాంతమైన అక్కడి మనిషి జీవితాన్ని అక్కడి అస్తిత్వాల్ని అద్భుతంగా ఆవిష్కరించిన ప్రక్రియ కథానికా ప్రక్రియ.

బతుకు బాగుపడ్డానికి మనిషిచేసే పోరాటాలు, జీవన గమనంలో ఎదురౌతున్న కష్టాలకు కారణాల్ని అన్వేషించడం, తమ తమ రంగాల్లో తామెంతో కష్టించినా తగిన ఫలితాల్ని ఎందుకు పొందలేక పోతున్నామన్న భావాల్ని, ఇట్లా ఎన్నో విధాలైన ఆలోచనలు తనలో పొందుపరచుకున్న కథ వాటికి రకరకాల

పరిష్కారాల్ని కూడా చెప్పే ప్రయత్నం చేసింది. వ్యక్తికి చైతన్యాన్ని అందించింది. ఎన్నో విజయాల్ని సాధింపజేసింది.

* * *

సాహిత్య ప్రక్రియల్లో ఎన్ని విధాలైన ప్రయోగాలున్నాయో, ఇంచుమించు అన్ని ప్రయోగాలూ కథలో కనిపిస్తాయి. ప్రతిభామూర్తులైన కథా రచయితలు, రచయిత్రులు తమ తమ కథానికల్లో వస్తువైవిధ్యంతో పాటు కథన శైలిలోనూ తమదైన ముద్రవేసి అలరించారు. కథవైపు పాఠకుణ్ణి ఆకర్షించారు.

ఒక గురజాడ, ఒక సురవరం, ఒక రావిశాస్త్రి, ఒక మధురాంతకం, ఒక శ్రీపాద, ఒక ముళ్ళపూడి, ఒక కాళోజీ, ఒక వసుంధర, ఒక యశోదారెడ్డి, ఒక తిలక్, ఒక కాళీపట్నం, ఇలా చెపుతూ పోతే లెక్కలేనంత మంది కథా రచయితలు, తమ తమ కథల్లో తమదైన ప్రత్యేకతల్ని నిరూపించుకున్నారు.

రాయలసీమ కరువుగురించైనా, తెలంగాణా పోరాటాల్ని గురించైనా, సామాన్యుని బతుకు భారాన్ని గురించైనా, మధ్య తరగతి జీవి ఆలోచనల్నైనా, స్పష్టంగా, పరిష్కార పర్యంతంగా కథ దర్శింపజేసింది. అదేదాని ప్రత్యేకత.

ఈ సంకలనం కథపై సంపూర్ణ విశ్లేషణ అందించేది కాకపోయినా, కథను గురించి సాహిత్య ప్రియుల్ని ఆలోచింపజేసి మరింత ముందడుగు వెయ్యించాలన్నదే ఆశయంగా వెలువడుతున్నది.

కథ చూపించిన వెలుగులో మనం పయనించాలన్న సత్సంకల్పానికి సహకారాన్నిందించిన వ్యాసరచయితలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాము.

సాహిత్యాకాశంలో ఆరిపోకుండా నిల్చిపోయే ఒకే **'ఒక్క వెలుగు'** కథానిక.

ఈ గ్రంథం ఇట్లా వెలుగుచూడటంలో తమ వంతు పూర్తి సహకారాన్ని అడుగడుగునా అండదండల్ని అందించిన సాహితీప్రియులు శ్రీ డి.వి. శేషాచార్య గారికి, శ్రీ కుందావఝుల కృష్ణమూర్తి గారికి ప్రత్యేక ధన్యవాదాలు. దీన్ని ఇంత చూడముచ్చటగా ముద్రించి యిచ్చిన దీప్తి ప్రింటర్స్ అధినేత మలినేని కృష్ణ గారికి, వారి సిబ్బందికి కృతజ్ఞతాంజలులు.

20-11-2011
హనుమకొండ

(జి. గిరిజామనోహరబాబు)

# విషయసూచిక


**1.** కథ : సాహిత్య శాస్త్రం .... 1
- డా॥ పోరంకి దక్షిణమూర్తి

**2.** చైతన్య స్రవంతి శిల్పధోరణిలో వెలువడిన కథలు .... 6
- అంపశయ్య నవీన్

**3.** కథానిక .... 23
- కీ.శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

**4.** కృష్ణ యజుర్వేదంలో కథానికలు .... 28
- డా॥ కె. కోదండరామాచార్యులు

**5.** కథకు కాదు కథానికకు శతజయంతి .... 40
- డా. వేదగిరి రాంబాబు

**6.** గొప్ప కథ అంటే...? .... 43
- వరిగొండ కాంతారావు

**7.** మాజిక్ రియలిజం అంటే నిజంగా ఏమిటి? (కథ) .... 50
- ఆడెపు లక్ష్మీపతి

**8.** తెలుగు కథల్లో హాస్యం .... 70
- శ్రీమతి నెల్లుట్ల రమాదేవి

**9.** కథన శిల్పం .... 77
- డా॥ పి.ఆర్. హరనాథ్

**10.** తెలంగాణ కథ - సామాజిక జీవిత చిత్రణ .... 80
- డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

**11.** తెలుగు కథ - మానవీయ స్పర్శ .... 93
- డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి

**12.** తెలంగాణా కథా సాహిత్యం - దళిత కథా పరిణామం .... 107
- డా॥ కనకయ్య

**13.** తెలంగాణా కథానికా క్రమం బెట్టిదనిన... .... 125
- ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**14.** జనజీవన పరిణామ చిత్రాలు "తెలంగాణ కథలు" .... 133
- రామా చంద్రమౌళి

**15.** భిన్న రీతుల్లో సాగిన తెలంగాణ కథ .... 140
- డా॥ బి.వి.ఎన్. స్వామి
**16.** స్త్రీల రచనలు - నియంత్రణలు .... 145
- కె. వరలక్ష్మి
**17.** రెండుదశాబ్దాల స్త్రీల కథా సాహిత్య ప్రయాణం .... 149
- వి.ప్రతిమ
**18.** సురవరం ప్రతాపరెడ్డి కథలు .... 168
- ఆచార్య పి. జ్యోతి
**19.** రాయలసీమ కథాచిత్రం .... 179
- అబ్బిగారి రాజేంద్రప్రసాద్
**20.** గురజాడ కథానికలు - సామాజికత .... 189
- డా॥ వి. వీరాచారి
**21.** శ్రీపాద వారి చిన్న కథల్లో వస్తు వైవిధ్యము .... 203
- డా॥ అనప్పిండి సూర్యనారాయణ మూర్తి
**22.** కొడవటిగంటి కుటుంబరావు కథలు భావ విప్లవ సాధనాలు .... 217
- కాత్యాయనీ విద్మహే
**23.** బతుకు బరువు దించుకునే గోపీచంద్ కథలు .... 239
- వాసిరెడ్డి కృష్ణారావు
**24.** శ్రీ విశ్వనాథ వారి కొన్ని చిన్న కథలు .... 246
- డా॥ హరి సనత్కుమార్
**25.** రావిశాస్త్రి కథల్లో ప్రజాజీవనం .... 253
- డా॥ ఎన్.వి.ఎన్. చారి
**26.** పి.వి. నర్సింహారావు కథలు "సమాజం - శిల్పం" .... 259
- డా॥ సంగనభట్ల నర్సయ్య
**27.** వ్యక్తి వికాసానికి దోహదపడిన ఆర్.యస్. సుదర్శనం కథలు .... 267
- డా॥ యల్లంభట్ల నాగయ్య
**28.** కాళోజీ కథలు - ఒక పరిశీలన .... 286
- వి.ఆర్. విద్యార్థి
**29.** బి.ఎస్. రాములు కథలు - ఒక విశ్లేషణ .... 292
- కర్రె సదాశివ్

**30.** శ్రీమతి ఆర్. వసుంధరాదేవి గారి కథల్లో తాత్త్వికదర్శనం - ఒక పరిశీలన .... 303
- ఎ. పుష్పాంజలి

**31.** వసుంధర కథాశిల్పము .... 314
- డా. తాడేపల్లి పతంజలి

**32.** 'ముళ్ళపూడి మార్కు' కథల జడి .... 321
- సుధామ

**33.** తెలుగు కథ - తీరుతెన్నులు .... 327
- సి. జయపాల్‌రెడ్డి

**34.** తిలక్ కథలు - ఒక పరిశీలన .... 334
- ఆచార్య ఎస్.జి.డి. చంద్రశేఖర్

**35.** శ్రీశ్రీ కథా సాహిత్యం .... 340
- పైడిముక్కల ఆనంద్‌కుమార్

**36.** నవీన్ కథలు ఒక పరిశీలన .... 348
- నల్ల యాదగిరి

**37.** కా.రా. 'చావు' కథ - అట్టడుగు స్త్రీ పాత్రలు .... 357
- డా॥ తుర్లపాటి రాజేశ్వరి

**38.** అల్లం రాజయ్య కథల్లో దృశ్యాదృశ్య విధ్వంసం .... 364
- మెట్టు రవీందర్

**39.** దాశరథి రంగాచార్య కథలు - జీవిత భాష్యాలు .... 371
- డా॥ బన్న అయిలయ్య

**40.** కన్నీటి కహానీల'బచ్చేదానీ' .... 390
- అనిశెట్టి రజిత

**41.** వ్యథాభరిత గాథలు - శ్రీ కె.కె. మీనన్ కథలు .... 399
- డా॥ కె.ఎల్.వి. ప్రసాద్

**42.** ముదిగంటి సుజాతారెడ్డి "మింగుతున్న పట్నం" విశ్లేషణ .... 407
- డా॥ వేలూరి శ్రీదేవి

**43.** 'అలరాస పుట్టిళ్ళు' - విశిష్ట కథ .... 416
- డా॥ పంతంగి వెంకటేశ్వర్లు

# కథ : సాహిత్య శాస్త్రం

డా॥ పోరంకి దక్షిణమూర్తి

భారతీయ సాహిత్యశాస్త్రపు ఉద్భవ వికాసాలు సంస్కృత సాహిత్య రచనల పరిశీలనతో మొదలయినట్లు చెప్పవచ్చు. తొలికాలపు సంస్కృత సాహిత్య శాస్త్రవేత్తలు, కథనాత్మకమయిన ఏ రచననయినా – పద్యంలో రాసినా, వచనంలో రాసినా – 'కథ' గానే పరిగణించారు.

భారతీయ సాహిత్యశాస్త్రానికి ఆద్యుడయిన భరతముని కథను గురించి నేరుగా చెప్పలేదు. ఆ మాటా వాడలేదు – నాట్యశాస్త్రంలో. నాటక 'ఇతివృత్తం' గురించి చెప్పాడు. ఇతివృత్తాన్ని ఆయన నాటక శరీరంగా పరిగణించాడు. అది రెండు రకాలని – ప్రధాన, గౌణ లేదా ఆనుషంగిక ఇతివృత్తాలు ఉంటాయని చెప్పాడు. ఈ విధంగా ఇతివృత్తంలో కథ మరుగునపడి ఉందని తెలుస్తుంది. ఇతివృత్తానికి ఆత్మ, 'రసం', అది రసోత్పాదన కలిగిస్తుంది.

దశరూపకకారుడైన ధనంజయుడు నాటక ఇతివృత్తాలను మూడు రకాలుగా చెప్పాడు. ప్రఖ్యాతం, ఉత్పాద్యం, మిశ్రమం. ఉత్పాద్య వస్తువు నాటకానికే కాక కథకు కూడా అవసరమే.

కావ్యాలంకారకర్త అయిన భామహుడు 'కథ'ను స్పష్టంగా పేర్కొన్నాడు. ఐదు రకాల పద్యకావ్యాల్లో అది ఒకటి అన్నాడు (సర్గబంధ, అభినేయార్థ, ఆఖ్యాయిక, కథ, ముక్తక ప్రక్రియలుగా చెప్పాడు). మరొక విధమయిన వర్గీకరణలో ఆయన గద్యకావ్యాలను, పద్యకావ్యాలను వేరు చేశాడు. రెండింటిలోనూ కథ ఉంది. బాణభట్టు కాదంబరి గద్యకావ్యం; సోమదేవుడి కథాసరిత్సాగరం పద్యకావ్యం. కాని కథను గురించి ఈ వర్గీకరణ ద్వారా ఆయన ప్రత్యేకంగా ఏమీ చెప్పలేదు. సంస్కృతేతర భాషల్లో కూడా కథాసాహిత్యం ఉందని ఒప్పుకొన్నాడు, దాన్ని గురించి చర్చించడానికి పూనుకోలేదు.

కావ్యాదర్శకర్త అయిన దండి, గద్య సాహిత్య వర్గీకరణలో కథను పేర్కొన్నాడు. దానిలో రకాలను విభజన చేసి చూపించలేదు; నిశ్చితమయిన లక్షణమూ చెప్పలేదు. విషయపరంగా కథకూ మహాకావ్యానికీ భేదం చెప్పలేదు.

రుద్రటుడు తన కావ్యాలంకారంలో ప్రబంధాలను (కావ్యాలను) ప్రధానంగా రెండు వర్గాలుగా విడదీశాడు, ఉత్పాద్యం, అనుత్పాద్యం అని. వీటిలో ఒక్కొక్కదాన్ని మహాకావ్యంగాను, లఘుకావ్యంగాను విభజించాడు. ఖండకథను లఘుకావ్యవర్గంలో చేర్చాడు. మహాకథను గురించి చెప్పేటపుడు బాణుడి 'కాదంబరి', లఘుకథను గురించి చెప్పేటప్పుడు సోమదేవుడి 'కథాసరిత్సాగరం' అతని దృష్టిలో ఉన్నట్లు తెలుస్తుంది. కథకు నిశ్చితమయిన నిర్వచనం మాత్రం అతడు ఇయ్యలేదు.

ధ్వన్యాలోకకర్త ఆనందవర్ధనుడు మాత్రం సాహిత్య ప్రక్రియలను కథ, మహాకథ మొదలైనవాటిగా చర్చించలేదు. అతని అభిప్రాయంలో, కావ్యాన్ని బాహ్యరూపాలను బట్టి విభజింపగూడదు; అంతర్నిహితమయిన 'ధ్వని'ని బట్టి విభజించాలి. సరళపదాలను గాని, సమస్త పదాలను గాని ఉపయోగించినపుడు అవి కొన్ని రకాల రసాలను ఉత్పాదిస్తాయి. కరుణ రసోత్పాదనకో విప్రలంభానికో సరళపదాలు పనికివస్తాయి. వీరరసోత్పాదనకు సమస్తపదాలు ఉపయోగపడతాయి. ఈ సందర్భంలో ఆయన కొన్ని కథాబేధాలను చెప్పాడు. పరికథ, ఖండకథ, సకలకథ, సర్గబంధం, ఆఖ్యాయిక, కథ మొదలైనవి. వీటిలో ప్రతి ఒక్కదానికీ మాటలకూర్పు (పదసంఘటన)లో కొన్ని వైవిధ్యాలుండాలన్నాడు. కథా, ఆఖ్యాయికా అన్నవి చాలావరకు వచనంలో ఉంటాయి. కాని కొన్ని పద్యలక్షణాలను అవి నిలుపుకొంటాయి. రసభావాన్ని బట్టి పదప్రయోగాల ఎంపిక మారుతూండాలి.

ఆనందవర్ధనుడు కథను ఏ సందర్భంలోనూ గద్యంతో సమానం చేసి చెప్పలేదు. కథలోని పదాల ప్రయోగరీతిలో 'రసానుగుణత' ఉండాలన్నాడు. అదొక ప్రత్యేక లక్షణంగా పరిగణించాడు. కథలో రసాన్ని మరుగుపరిచేటంత ప్రాముఖ్యం ఇతివృత్తానికి ఇయ్యలేదు.

కావ్య ప్రకాశం రచించిన మమ్మటుడు, ఆనందవర్ధనుడి దారిలోనే నడిచి, పదసంఘటన పరంగానే ఆఖ్యాయికను, కథను గురించి చెప్పాడు. ఇంతకుమించి ఆ విషయం మీద చర్చ చేయలేదు.

హేమచంద్రుడు తన కావ్యానుశాసనంలో కథను గురించి, దాని విభాగాలను గురించి కొంతవరకు వివరంగా చెప్పాడు. కథలో నాయకుడు ధీరశాంతుడు (తాను సాధించినవాటిని, తన విజయాలను చెప్పుకోనివాడు) అయి ఉండాలన్నాడు.

Blank page

Blank page

15. **రుచిరా** : ఆసక్తికరంగా ఉండాలి.

16. **అద్భుత విచిత్రార్థరుచిరా** : ఆశ్చర్యం కలిగించే విషయ వర్ణనవల్ల వైవిధ్యం సమకూరి, ఎక్కువ ఆసక్తికరం అయ్యేలా ఉండాలి.

17. **ముగ్ధవిషయా** : కథా విషయం మూర్ఖుణ్ణి గురించి కూడా ఉండవచ్చు.

పై అంశాలను గమనించినపుడు సోమదేవుడి చింతనలోని పరిపక్వత, సహేతుకత మనకు తెలియవస్తాయి.

కథను గురించి సంస్కృత అలంకారికులూ, కథా రచయితలూ చెప్పిన అంశాలతోబాటు 'అగ్నిపురాణం'లో సాహిత్య శాస్త్రపరమైన అధ్యాయాల్లో 337వ అధ్యాయం కూడా పరిశీలించదగినది. అందులో కథాత్మక సాహిత్యంలోని ఐదు ప్రక్రియా విభాగాలను పేర్కొనడం జరిగింది. ఆఖ్యాయిక, కథ, ఖండకథ, పరికథ, కథానిక (337.12). వీటిలో మొదటి నాలుగింటిని ఆనందవర్ధనుడు కూడా చర్చించాడు. ఆయన చెప్పిన 'సకలకథ' అగ్నిపురాణంలో లేదు. కాని అదనంగా చేరిన ఐదోది - కథానిక - మరెక్కడా కనిపించదు. దానికి నిర్వచనం ఇలా ఉంది.

**భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః**
**అద్భుతోఽంతే సుక్లప్తార్థా నోదాత్తా సా కథానికా** (337.20)

'కథా ఇన్ సంస్కృత్ పొయటిక్స్' (1986) రచయిత్రి ప్రొ॥ సాధళే, స్వతంత్రంగా ఇచ్చిన కథానిర్వచనం ఈ విధంగా ఉంది.

**కథాయా లక్షణం జ్ఞేయం సారస్వతేన నిరూప్యతే**
**ఉత్పాద్యం సరసం హృద్యం వస్తు సంకీర్తయే కథా** (పుట. 66)

(రచయిత ఊహలో పుట్టి, రసవంతమయి హృదయాన్ని ఆకట్టుకొనే వస్తువును కథ అంటారు.)

*(సాహితీ స్రవంతి ఏప్రిల్ - జూన్, 2009)*

# చైతన్య స్రవంతి శిల్పధోరణిలో వెలువడిన కథలు

అంపశయ్య నవీన్

పాశ్చాత్యదేశాలలో రెండు ప్రపంచయుద్ధాల మధ్య (1918-1945) వెలువడిన సాహిత్యంలో సిగ్మండ్‌ఫ్రాయిడ్ కనుక్కున్న మనోవిశ్లేషణా సూత్రాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో మాత్రం 1945 తర్వాతనే ఈ ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది. ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావం వల్లనే సాహిత్యంలో 'చైతన్య స్రవంతి' అనే వినూత్న ధోరణి ప్రారంభమైంది.

తెలుగులో ఈ శిల్పానికి చైతన్య స్రవంతి అని పేరు పెట్టింది శ్రీశ్రీయే. 1941లో ఈ శిల్పానికి ఆద్యుడైన జేమ్స్‌జాయిస్ చనిపోయినప్పుడు ఆయనను గురించి శ్రీశ్రీ ఒక రేడియో ప్రసంగం చేశాడు. ఈ ప్రసంగం 1947 సెప్టెంబర్ అక్టోబర్ 'ఆంధ్రశిల్పి' అనే ద్వైమాసిక పత్రికలో ప్రచురించబడింది. ఈ ప్రసంగంలోనే శ్రీశ్రీ Stream of consciousness అనే ఇంగ్లీషు మాటకు చైతన్య స్రవంతి అని నామకరణం చెయ్యడంతో ఈ మాటే ఈ శిల్పధోరణికి సరిఅయిన మాటగా ప్రచారంలోకొచ్చింది.

నవీన్ కథల సంపుటి 'లైఫ్ ఇన్ కాలేజ్'కు ముందుమాట రాస్తూ రాంభట్ల కృష్ణమూర్తి ఫ్రాయిడ్ వాడిన ఫ్రీ అసోసియేషనే చైతన్య స్రవంతి శిల్పానికి మచ్చు అని చెబుతూ ఈ శిల్ప ధోరణికి 'ముక్తానుషంగం' అని పేరుపెట్టాడు. అయితే చైతన్య స్రవంతి అన్నమాట ప్రచారం పొందినంతగా ఈ 'ముక్తానుషంగం' పొందలేదు.

చైతన్య స్రవంతి శిల్పధోరణిని రాంభట్ల కృష్ణమూర్తి ఇలా నిర్వచించాడు.

"బహిర్ జగత్ సంసర్గం వల్ల మనస్సులో యేర్పడే ముక్తానుషంగాల ప్రవాహాన్ని సాహిత్య రూపకంగా నమోదు చేసే పద్ధతిని ఇప్పుడు చైతన్య స్రవంతి అని పిలుస్తున్నారు."

ఈ పద్ధతిలో తెలుగులో మొట్టమొదట ప్రయోగాలు చేసిన రచయిత కూడా శ్రీశ్రీయే. పాశ్చాత్య సాహిత్యంలో యేకొత్త ప్రయోగం ప్రారంభమైనా దానిని వెంటనే తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టాలని ప్రయత్నించిన వాళ్ళల్లో శ్రీశ్రీయే ముఖ్యుడు.

ఆయన 'చరమరాత్రి' పేరుతో వెలువరించిన కథా సంకలనంలో చోటుచేసుకున్న కథలన్నింటిలోని ప్రయోగాత్మకత రేఖామాత్రంగా కనిపిస్తుంది.

ఈ కథాసంకలనంలోని 'ఓసేయ్, తువ్వాలందుకో...' 'కోనేటిరావు' అన్న రెండు కథల్లో ఆయన చైతన్య స్రవంతి శిల్పధోరణి ఎలా ఉంటుందో తెలుగు పాఠకులకు చూపించాడు. ఈ కథల్ని శ్రీశ్రీ 1946లో రచించాడు.

కోనేటిరావు అనే ఓ ప్రభుత్వాఫీసులో గుమాస్తాగా పనిచేసే వ్యక్తి మస్తిష్కంలో మెదిలే ఆలోచనల్ని, గతస్మృతుల్ని, కోరికల్ని, బాధ్యతల్ని కోనేటిదినం, కోనేటిరాత్రి, కోనేటిజన్మ అన్న మూడు భాగాలుగా ఈ కథను శ్రీశ్రీ రచించాడు.

"ఓసేయ్, తువ్వాలందుకో..." అనే చిన్నకథలో ఆఫీసుకు వెళ్ళటానికి తయారవుతున్న ఓ ఉద్యోగి బాత్‌రూంలో స్నానం చేస్తున్నప్పుడు ఎలా ఆలోచిస్తాడో, సరిగ్గా అప్పుడే అతని భార్య అతన్ని ఆఫీసుకు పంపించాలన్న తొందర్లో ఎలా ఆలోచిస్తుందో రచయిత చిత్రించాడు. ఈ కథలో కాలవ్యవధి కేవలం పదినిమిషాలు మాత్రమే. ఈ రెండు కథలతో ప్రభావితుడైన రా.వి. శాస్త్రి "అల్పజీవి" అన్న గొప్ప నవలను రచించాడు. స్నానం చేస్తున్నప్పుడు ఒక వ్యక్తి మనస్సులో చెలరేగే ఎన్నో ఆలోచనల్ని ఆంతరిక స్వగతాల రూపంతో శ్రీశ్రీ ఈ "ఒసేయ్... తువ్వాలందుకో..." అన్న ఈ కథను రచించాడు.

"తలుపు తీశాడు. తోశాడు. తడుసుకుంటూ వెళ్ళాడు అలాగే. సబ్బు తెచ్చుకున్నాడు. గదిలోకి వెళ్ళాడు. మళ్ళీ తలుపు వేశాడు. మరో నాలుగు చెంబుల నీళ్ళు పోసుకున్నాడు. ఈలతో పాడుతున్నాడు. భాగ్యంపాట.

ప్రా ప్రా... షీ షీ.. ప్రా.. ప్రాషష.

ఏమిటో వెధవబతుకు.. స్నానం.. భోజనం తాంబూలం.. బట్టలు.. బోళ్ళా వెయ్యాలి. ఆఫీసుకు టైమయిపోతోంది. వంటయిందో లేదో. రోజూ ఇదే యేడుపు. వారానికి రెండు ఆదివారాలూ, నెలకు డజను ఫస్టుతారీఖులూ ఉండకూడదూ? దొరల దేశాల్లో అయితే ప్రతివారం జీతాలిస్తారట. కాని ఏంలాభం? తాగేస్తారు. దొరలకి చలివెయ్యదూ? స్నానం చెయ్యరు? ఉన్నిదుస్తులు వేసుకుంటారు. మాసిపోయిన గడ్డం చేసుకుంటే వూలుకోటు విప్పినట్టుంటుంది.

ఇలా సాగుతాయి బాత్‌రూమ్‌లో స్నానం చేస్తున్న ఓ ఆఫీసు గుమాస్తా ఆలోచనలు.[1]

శ్రీశ్రీ తర్వాత ఈ శిల్పంతో కథ రాసిన రచయిత బుచ్చిబాబు. బుచ్చిబాబు 'చైతన్య స్రవంతి' అనే పేరుతోటే ఓకథను రచించాడు.

"క్షణికమైన ఒక అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడెట్టి ఈ రెంటి తారతమ్యాలు విభజన లేకుండా వున్నది వున్నట్టే ప్రదర్శించే యత్నమే చైతన్య స్రవంతి.

గందరగోళంగా కనిపించే ప్రకృతిలోని కొన్ని విరుగులను ఏరటం, అరాచకంగా కనిపించే లోకం పోకడనుండి కొన్ని సూత్రాలు విడదీసి కళానుగుణమైన దృక్పథంతో ఒక ఆకృతిలో కేంద్రీకరించి తీక్ష్ణమైన శైలిలో ప్రదర్శించటం సంప్రదాయబద్ధమైన సారస్వత కళలక్ష్యం. విభజనతో, వడబోతతో సత్యం దెబ్బతింటుంది. కాబట్టి ఉన్నది ఉన్నట్టు మొత్తం అనుభవాన్ని చిత్రించాలి అన్న ఆదర్శం ఈ ధోరణికి మూలం. ఈ లక్ష్యం ఎవ్వరికీ సాధ్యం కాదేమో ! ఆదర్శంగానే ఉండిపోతుందేమో ! అయినా వర్జీనియా ఉల్ఫ్, గేర్‌ట్రూడ్‌స్టెయిన్, రిచర్డ్సన్ మొదలైన వారు చాలామంది ఈ పద్ధతిలో రచనలు చేశారు. కొంతవరకు ఉత్తీర్ణులైన వారిలో ముఖ్యుడు జేమ్స్‌జాయిస్" అంటాడు 'చైతన్య స్రవంతి' కథ చివర్లో బుచ్చిబాబు రాసిన చివరి మాటలో.[2]

ఈ చైతన్య స్రవంతి అన్న కథలో ఇంటర్వ్యూకు వెళ్తున్న ఒక విద్యార్థి మనోసంచారాన్ని బుచ్చిబాబు చిత్రించాడు. ఈ విద్యార్థి మనస్సులోకి ఎందరో మేధావులు చెప్పిన మాటలు ప్రవేశిస్తుంటాయి. మధ్యలో ఈ విద్యార్థి ఒక యాక్సిడెంట్‌కు గురవుతాడు. దాంతో అంతా మరచిపోతాడు. మరో యాక్సిడెంట్ జరిగి మళ్ళీ అన్ని గుర్తొస్తాయి. అతని ఆలోచనలన్నీ గజిబిజిగా, గందరగోళంగా ఉంటాయి. కేవలం ప్రయోగం కోసమే బుచ్చిబాబు ఈ కథను రాశాడనిపిస్తుంది.

తర్వాత ఈ ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సూత్రాల ప్రభావంతో కథలు రాసిన రచయితలు చాలామందే ఉన్నారు. రా.వి. శాస్త్రి, ఆర్. ఎస్. సుదర్శనం, నవీన్, కాశీభట్ల వేణుగోపాల్ మొదలైన కథకులు రచించిన కథల్లో ఈ ధోరణి కనిపిస్తుంది.

---

1. చమరాత్రి కథలు. శ్రీశ్రీ సాహిత్యం -2, వచన విభాగం - పేజి.నెం. 41
2. బుచ్చిబాబు కథ 'చైతన్య స్రవంతి'.

ఇప్పుడు ఈ మనోవిశ్లేషణ సిద్ధాంతాల ప్రభావంతో వెలువడిన కొన్ని తెలుగు నవలల్ని చూద్దాం. ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణ ప్రభావంతో తెలుగులో వెలువడిన మొదటి నవల గోపీచంద్ రచించిన 'అసమర్థుని జీవయాత్ర'. ఈ నవల 1946లో వెలువడింది. 1946 తర్వాతనే తెలుగులో ఆధునిక నవలలు వెలువడటం ప్రారంభమైందని విమర్శకుల అభిప్రాయం.

నవీన్ అన్నట్టు ఫ్రాయిడ్ ప్రభావంతో "పాశ్చాత్యదేశాల్లో 1914 తర్వాత వెలువడిన ఆధునిక నవల 1940 తర్వాత కొంతమంది తెలుగు నవలాకారులను ప్రభావితుల్ని చేసింది. అట్టివారిలో గోపీచంద్, బుచ్చిబాబు, రా.వి. శాస్త్రి, ఆర్. ఎస్. సుదర్శనం మొదలైన వారిని పేర్కొనాలి. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', రా.వి. శాస్త్రి 'అల్పజీవి' మొదలైన నవలలు తెలుగులో వచ్చిన నిజమైన ఆధునిక నవలలు. వీటినే మనోవైజ్ఞానిక నవలలని ఆర్. ఎస్. సుదర్శనం పేర్కొన్నాడు.[3]

గోపీచంద్ రచించిన 'అసమర్థుని జీవయాత్ర'లో ఆత్మన్యూనతా భ్రాంతికి లోనైన సీతారామరావు అనే ఓ విచిత్ర వ్యక్తి మానసికస్థితి చిత్రితమైంది.

"అసమర్థుని జీవయాత్ర నిజంగా ఒక హేతువాది జీవయాత్ర. హేతువాద దృక్పథం ఒక వ్యక్తి జీవితంలో కేవలం బౌద్ధిక దృక్పథంగానే ఉంటే అది కత్తెరబోనులా పరిణమించే పరిస్థితి రావటానికి వీల్లేదు. అనుభవంలో దాని లోటుపాట్లు గుర్తుకు వచ్చిన మరుక్షణంలో వ్యక్తి దాన్ని మార్చుకోవచ్చు. ఆలోచనా పరుడు, జిజ్ఞాసువు సాధారణ పరిస్థితుల్లో అలానే చేస్తాడు. కానీ ఆ దృక్పథం వ్యక్తి చేతనలోనే ఒక విషబీజంగా పరిణమించినట్లయితే ఎలా ప్రాణాంతకమౌతుందో నిరూపిస్తుంది ఈ నవల అంటాడు ఆర్. ఎస్. సుదర్శనం.[4]

సీతారామారావు జీవితంలో అన్నివిధాలా ఓడిపోతాడు. "కారణం సీతారామారావు మనస్తత్వం అతని మనోదృక్పథమే. ఇలా మనస్తత్వాన్ని ఒక్కదాన్నే ప్రధానం చేసి జీవితంలో ఎన్ని ఉన్నా, సుఖానికీ, విజయానికీ వ్యక్తి మనస్తత్వమే అన్నింటికంటే ముఖ్యమని నిరూపించిన మొదటి నవల "అసమర్థుని జీవయాత్ర".[5]

---

3. నవీన్ సాహిత్యవ్యాసాలు - పేజి. నెం. 12
4. సాహిత్యంలో దృక్పథాలు - ఆర్.ఎస్. సుదర్శనం - పేజి.నెం. 149.
5. సాహిత్యంలో దృక్పథాలు - పేజి. నెం. 151.

అసమర్థుని జీవయాత్ర గోపీచంద్ తెలుగులో ప్రవేశపెట్టిన కొత్తనవల - మనోవిశ్లేషణం ప్రధానమైన నవల అంటాడు ఆర్.ఎస్. సుదర్శనం.

ఈ నవలను గురించి కోడూరి శ్రీరామమూర్తిదీ.

"ఏది ఏమయినా, ఒక అసమర్థుడి ఆత్మన్యూనతా భ్రాంతి నుంచి తాత్త్విక చింతనపు లోతులను స్పృశించి అంతరంగ మథనాన్ని గావించిన ఈ నవల తెలుగు నవలాచరిత్రలో ఒక మైలురాయి. ఐశ్వర్యంలోనుండి దారిద్ర్యానికి దిగజారి, జీవితం ఇచ్చిన అవకాశాలను దుర్వినియోగం చేసి, అందుకు కారణాలను వెతికి చెప్పుకొని సంతోషించే అసమర్థులందరి అంతరంగాలకు ఒక గొప్ప దర్పణం" అంటాడు.[6]

'అసమర్థుని జీవయాత్ర' తర్వాత చెప్పుకోదగిన మనోవైజ్ఞానిక నవల బుచ్చిబాబు రచించిన 'చివరకు మిగిలేది'.

ఈ నవల మొదట 'నవోదయ' అన్న పత్రికలో 1946లో సీరియల్‌గా ప్రారంభమై పదహారు మాసాల తర్వాత పూర్తయింది. 1952లో పుస్తకంగా వెలువడింది. అప్పట్నించి ఇప్పటి వరకు ఈ నవలను గూర్చిన చర్చ తెలుగు విమర్శరంగంలో జరుగుతూనే ఉంది. ఆర్.ఎస్. సుదర్శనం ఈ నవలను గూర్చి:

"బుచ్చిబాబు రచన 'చివరకు మిగిలేది' మనోవైజ్ఞానిక నవల. దీనికి ప్రాతిపదిక ప్రఖ్యాత శాస్త్రవేత్త ఫ్రాయిడ్ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన ఈడిపస్ భ్రాంతి. (edipus complex).

నవలలో మనోవైజ్ఞానిక సిద్ధాంతం అంతర్గతంగా మాత్రమే ఉంటుంది. పాఠకులకు ఆ సిద్ధాంతం ఫలానా అని తెలియవలసిన అవసరంలేదు. విమర్శకుడు విశ్లేషించి గుర్తుపడితే తప్ప కనిపించని విధంగా ఉంటుంది".[7]

దయానిధి గొప్ప మేధావి. పుస్తకాలు బాగా చదివాడు సహజంగా గొప్ప భావుకుడు. అనేక విషయాలను తనలో తను తర్కించుకుంటాడు. ఎక్కడ సౌందర్యం కనిపించినా అతని హృదయం పులకించిపోతుంది. అందంగా ఉన్న స్త్రీలంటే చాలా

---

6. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ. కోడూరి శ్రీరామమూర్తి పేజి. నెం. 133.
7. సాహిత్యంలో దృక్పథాలు - ఆర్.ఎస్. సుదర్శనం. పేజి. నెం. 226.

ఇష్టం. వాళ్ళ సౌందర్యాన్ని గూర్చి రకరకాలుగా ఎంతో కవితాత్మకంగా, ఉన్నతంగా ఊహించుకుంటాడే గానీ యేస్త్రీతో కూడా శారీరకంగా కలవడానికి అతనిలోని యేదో శక్తి అడ్డమొస్తుంటుంది. యేమిటాశక్తి అంటే అతనిలో అంతరంగంలో స్థిరపడిన 'ఈడిపస్ భ్రాంతి'.

'చివరకు మిగిలేది' నవలలో తల్లి పాత్ర చిత్రితం కాలేదు. కానీ నవలంతా ఆమె నీడ పరచుకొని ఉంటుంది. దయానిధికి తల్లంటే చాలాప్రేమ. కానీ సమాజం దృష్టిలో అతని తల్లి పతితురాలైన స్త్రీ. తల్లిమీదున్న విపరీతమైన అనురక్తి కారణంగా అతడు ఇతర స్త్రీలతో సహజంగా ఉండలేదు.

కోమలంటే విపరీతమైన అనురక్తి ఉన్నట్లుగా కనిపిస్తాడు. కానీ ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోలేదు. ఓరాత్రి తనను శారీరకంగా కలుసుకోవడానికి రమ్మని కోమలి ఆహ్వానిస్తుంది. దయానిధి వెళ్తాడు. కోమలి నిద్రపోతుంటుంది. నిద్రపోతున్నామెను లేపడం ఎందుకని ఆమె తెమ్మన్న డబ్బును ఆమె దిండుకింద పెట్టేసి దయానిధి వెళ్ళిపోతాడు.

ఇక్కడ కోమలిని చూసినప్పుడు దయానిధి మానసిక స్థితిని రచయిత ఎలా వర్ణించాడో చూడండి.

"అతనికి భయమేసింది. సౌందర్యాన్ని ఎదురుకున్న మనిషి అతడు. గొప్ప సౌందర్యం అనుభవంకాదు. గొప్ప సౌందర్యం అంటే అయిపోవడంకాదు, ముందు కావటమూకాదు. అవుతూ ఉండటం. హద్దులు లేనిది అనుభవం. గొప్ప సౌందర్యానికి హద్దులులేవు. రెండింటికీ శరీరం హద్దుకాదు. కాకూడదేమో! శరీరం మరోశక్తి విడిపోయిన ఆ అనుభవానికి హద్దులులేవు. లోకం అంతట వ్యాపించి తనలో ఇమిడ్చుకున్న శక్తి.

అతడు తేరుకున్నాడు. నవ్వొచ్చింది. శరీరంతో ఉన్న మనుషులందరూ పిచ్చివాళ్ళు అనిపించే సమయం అది. ఆ అనుభవం అతనికక్కర్లేదు. అనుభవానికి హద్దుల్లేవు. కవర్లో ఉన్న ఐదునోట్లూ దిండు కింద ఉంచి, మెల్లగా లేచి వీధిలోకెళ్ళి తలుపులు దగ్గరగా మూశాడు".[8]

---

8. చివరకు మిగిలేది - బుచ్చిబాబు. పేజి. నెం. 118

దయానిధికి శరీరం.. ముఖ్యంగా స్త్రీ శరీరం అంటేనే ఇష్టంలేదు. శరీరంతో సంబంధం లేని భావుకత్వం అంటేనే ఇష్టం. బుర్రతో ఆలోచిస్తూ బతకాలనుకుంటాడు. అందుక్కారణం అతనిలో ఉన్న తల్లిమీద స్థిరీకరించబడిన ప్రేమ. (Mother Fixation).

దయానిధి ఇందిరను పెళ్ళి చేసుకుంటాడు. నిజానికతనికి పెళ్ళి చేసుకోవడం ఇష్టంలేదు. పెళ్ళిని మూణ్ణాళ్ళముచ్చట అనుకుంటాడు. పెద్దవాళ్ళ బలవంతం మీద పెళ్ళి చేసుకుంటాడు. భార్య ఇందిరంటే అతనికెలాంటి ఆకర్షణ లేదు. ఆమె నుండి దూరంగా పారిపోవాలనుకుంటాడు. వాళ్ళ శోభనానికి ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. సరిగ్గా శోభనం రోజే దయానిధిని ఆరోజు జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన సభలో పాల్గొనటానికి రావాలని అతని స్నేహితులు ఆహ్వానిస్తారు. “ఈ రోజు నా శోభనం, నేను రాలేను” అని చెప్పొచ్చు. ఇంతకుముందు అతడు ఆ రోజుల్లో, అంటే 1935లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నట్టుగా రచయిత ఎక్కడా చెప్పలేదు. స్నేహితులు రమ్మనగానే అతడు ఆరోజు జరుగుతున్న సభలో పాల్గొనడానికి వెళ్తాడు. కేవలం ఇందిర నుండి దూరంగా పారిపోవడానికే అతడీ పనిచేశాడు. ఈ సంఘటనను గూర్చి ఆర్.ఎస్. సుదర్శనం. “ఫ్రాయిడ్ సిద్ధాంతం దృష్ట్యా చూస్తే దయానిధిలోని న్యూరోసిస్ (Neurosis) నవలలో చక్కగా పోషించబడింది. (న్యూరోసిస్ అంటే నాడీరుగ్మత) తల్లి మూర్తితో దయానిధి లైంగిక ప్రవృత్తి, ముడిపడి ఉండటం మూలాన అతడు శారీరకంగా స్త్రీని పొందటానికి అతడు అశక్తుడు. ఈ అశక్తతని కప్పిపుచ్చుకోవడానికి అతను చేసే చేష్టల ఫలితమే కనిపించిన అమ్మాయిలతో చనువుగా, స్నేహంగా ఉంటూ ఇతరుల మనస్సుల్లో అపోహల్ని కల్పించటం. సంఘం అతన్ని దుయ్యబట్టి దుమారంలేపింది. అంటే అది ఒక రకంగా దయానిధి స్వయంకృతాపరాధమే. భార్యను వదిలిపెట్టి ఒంటరిగా ఉంటూ మిత్రుని చెల్లెలు శ్యామలను తన ఇంట్లో, ఆమె మానసిక వ్యాధి చికిత్సకోసం ఉంచుకోవడం న్యూరోసిస్ లేని వ్యక్తి చేసే పని కాదు. అతని జీవితమే సరిగాలేదు. ఇతరులను బాగుచేసే అధికారం, డిగ్రీద్వారా అతనికుంది. కానీ నైతికంగా అట్లాంటి అర్హత లేదేమో! అనే స్పృహ అతనికే కల్గుతుంది. అందువల్లే అతనికి న్యూరోసిస్ నుండి విముక్తి క్రమంగా సాధ్యమైంది.

స్త్రీతో శారీరక సంబంధం ఏర్పడే అవకాశం వచ్చినప్పుడల్లా దయానిధిలో కల్గే ఉద్విగ్నత, భయం, గందరగోళం అతని న్యూరోసిస్‌ను రుజువుచేస్తుంది.

నిద్రిస్తున్న కోమలి ఎదుట నిల్చుంటే ఏదోశక్తి, అతనిలో ప్రవేశించి అతన్ని కార్యశూన్యుణ్ణి చేసింది. శరీరం ఇది అన్యాయం. నేనీ పని చెయ్యలేను. నేనే సౌందర్యం ! నన్ను నేను ధ్వంసం చేసుకోలేను. ఇతరుల్నీ ధ్వంసం చెయ్యలేను. నన్ను వదిలేయ్ అన్నదట.

అమృతంతో సంభవించిన ఏకాంతం అతనికి చివరకు పరిపూర్ణమైన విముక్తిని ప్రసాదించింది".[9]

అమృతం దయానిధి తల్లి రూపానికి చక్కగా సరిపోతుంది. చివరకు నవలలోని స్త్రీ పాత్రలన్నీ దయానిధి తల్లిమీదకు యేదో ఒక రాయిని విసరడానికి ప్రయత్నించిన వాళ్ళే. ఒక్క అమృతం మాత్రమే దయానిధి తల్లిమీద ఎలాంటి అపవాదు వెయ్యదు. ఈ కారణం చేతనే అమృతం దయానిధికి చాలా దగ్గరౌతుంది. ఆమెలో అతడు తన తల్లిని చూసుకోగల్గుతాడు. ఈ కారణం చేతనే అతడు అమృతంలో శారీరకంగా యేకం కాగల్గుతాడు. ఇలా అమృతం దయానిధిలో ఏర్పడిన లైంగిక జడత్వాన్ని పోగొట్టగల్గుతుంది.

'చివరకు మిగిలేది' తర్వాత చెప్పుకోదగిన మనోవైజ్ఞానిక నవల రాచకొండ విశ్వనాథశాస్త్రి రచించిన 'అల్పజీవి'.

'అల్పజీవి' నవల 1956లో మొదట 'భారతి' మాసపత్రికలో సీరియల్‌గా వెలువడి తర్వాత పుస్తకంగా ప్రచురించబడింది. ఈ నవలను రచించిన రా.వి. శాస్త్రి ఈ నవలను గురించి ఇలా అన్నాడు.

"ఈ నవల్లోని రచనా విధానానికి ఆధారం కొంతమట్టుకు జేమ్స్‌జాయిస్ గారి రచనలు, ఎక్కువ మేరకు శ్రీశ్రీ రచనలూను. ఆ రచయితల ప్రతిభ ఈ రచయితకి లేదు. వారి ప్రభావం మాత్రం ఈ నవల్లో కనిపిస్తుంది. ఇందులో సుబ్బయ్య పాత్రకి శ్రీశ్రీ గారి కోనేటిరావు కొంతగా నమూనా, నిజజీవితంలో చాలా నమూనాలు.

ఈ నవలను గురించి ఆర్.ఎస్. సుదర్శనం. "అల్పజీవి అడ్లర్ "ఆత్మన్యూనతా భ్రాంతి" సిద్ధాంతం ప్రాతిపదికగా గల రచన. ఈ ఆత్మన్యూనతా భ్రాంతి బాల్యదశలోనే

9. సాహిత్యంలో దృక్పథాలు- ఆర్.ఎస్. సుదర్శనం. పేజి. నెం. 237

ఏర్పడుతుందని వయస్సు వచ్చిన తర్వాత అదే అసాధారణ ప్రవర్తనకు హేతువవుతుందని ఈ సిద్ధాంతం చెబుతుంది. మానవ ప్రవర్తనను తీర్చిదిద్దటంలో పరిసరాల ప్రభావం, ముఖ్యంగా బాల్యదశలో కుటుంబవాతావరణ ప్రభావం చాలా బలీయమైనదని అడ్లర్ సిద్ధాంతీకరించాడు.[10]

అల్పజీవి లోని ప్రధాన పాత్ర సుబ్బయ్య. సుబ్బయ్యలో ఆత్మన్యూనతాభ్రాంతి ఉంది. (Inferiority Complex) ఈ భ్రాంతి అతనికి అతని బాల్యంలోనే యేర్పడింది. సుబ్బయ్య ఒకరోజు రాత్రి తండ్రితో వెళ్తోంటే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులొచ్చి తండ్రిని బాగా కొట్టి వెళ్ళిపోయారు. ఈ సంఘటన సుబ్బయ్య మనోఫలకం మీద తీవ్రమైన ముద్రను వదిలి వెళ్ళింది. అప్పటి నుండి అతనిలో ఆత్మన్యూనతా భ్రాంతి స్థిరపడింది. ఈ భ్రాంతికిలోనయిన వారికి తమ మీద తమకు నమ్మకం ఉండదు. అనుక్షణం తమను తాము కించపరచుకుంటారు. యేపనీ ధైర్యంగా చెయ్యలేరు. దాంతో సమాజం వాళ్ళమీద అసమర్థులన్న ముద్రవేస్తుంది. మరోవిషయం, సుబ్బయ్యకు చిన్నతనంలోనే తల్లిచనిపోయింది. ఇది కూడా సుబ్బయ్యలో ఆత్మన్యూనతా భ్రాంతికి కారణమౌతుంది. సుబ్బయ్య ఓ ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తుంటాడు. అందరూ అతన్ని అసమర్థుడంటారు. లంచాలు తీసుకోవడం చేతకానివాడంటారు. చివరకు అతని భార్య కూడా అతన్ని అసమర్థుడని చీదరించుకుంటుంది. అతని బావమరిది ఒకతను లంచం తీసుకోమనీ, అలా వచ్చిన డబ్బును తనకిమ్మని సుబ్బయ్యను బలవంతం చేస్తాడు. బావమరిది కోసం సుబ్బయ్య లంచం తీసుకొని ఆడబ్బును అతని బావమరిదికిస్తాడు. కానీ లంచం తీసుకున్న మరుక్షణం నుండి సుబ్బయ్యలో తీవ్రమైన మానసిక సంఘర్షణ యేర్పడుతుంది. లంచం ఎందుకు తీసుకున్ననా అని అతన్నతడు దూషించుకుంటాడు. అతన్నతడు శిక్షించుకుంటాడు. ఇలా అపరాధభావనకు లోనైన ఒక వ్యక్తి అంతరంగాన్ని 'అల్పజీవి' గొప్పగా ఆవిష్కరించింది. ఈ నవలలో అక్కడక్కడ ముఖ్యంగా సుబ్బయ్య అంతరంగంలోని సంఘర్షణ తీవ్రరూపం ధరించినప్పుడు రచయిత చైతన్య స్రవంతి రచనా విధానాన్ని అనుసరించాడు. కొడూరి శ్రీరామమూర్తి ఈ నవలను గురించి:

"ఏది ఏమైనా, ఈ నవలలో మొదటినుండి చివరి వరకు ఒక అల్పజీవి 'అంతరంగం' కనబడుతుంది. ఆ అంతరంగంలో చెలరేగే సంక్షోభాలకు అద్దం

---

10. సాహిత్యంలో దృక్పథాలు- ఆర్.ఎస్. సుదర్శనం. పేజి. నెం. 243

పట్టడానికి రచయిత చైతన్యస్రవంతి విధానాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. సుబ్బయ్య చైతన్య స్రవంతిలో కనిపించే స్వగతాల్లో, సుబ్బయ్యకు చిన్నతనంలో తల్లి చనిపోవడం వలన కల్గిన Basic Anxiety పెద్దతనంలో సంఘంలో పొందిన ఆత్మన్యూనతాభావం, అచేతనలో అణచివెయ్యబడిన లైంగిక వాంఛలు ఇవన్నీ కలగాపులగంగా కనబడతాయి".[11]

ఆత్మన్యూనతాభ్రాంతి అనే సిద్ధాంతాన్ని ప్రవచించిన అడ్లర్, ఫ్రాయిడ్ శిష్యుడే. ఫ్రాయిడ్ మౌలిక సిద్ధాంతాలను కొన్నింటిని అంగీకరిస్తూనే కొన్నింటితో విభేదించాడు. ఫ్రాయిడ్, అడ్లర్, యూంగ్ ఈ ముగ్గుర్ని మనోవిశ్లేషణా సిద్ధాంతాలకు మూల పురుషులని చెప్పొచ్చు.

ఇలా తెలుగు సాహిత్యంలో ఈ మూడు నవలల మీద ఫ్రాయిడ్ మనోవైజ్ఞానిక సిద్ధాంతాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ నవలల తర్వాత వెలువడిన నవీన్ అంపశయ్య, వద్దెర చండీదాసు 'హిమజ్వాల' వినుకొండ నాగరాజు 'ఊబిలోదున్న మొదలైన నవలల మీద కూడా ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది.

## తెలుగు కథల్లో మనోవిశ్లేషణ:

తెలుగు కథల్లో మనోవిశ్లేషణా సిద్ధాంతాల ప్రభావం 1940 తర్వాత ప్రముఖంగా కనిపిస్తుంది. బుచ్చిబాబు రచించిన అనేక కథల్లో ఫ్రాయిడ్ ప్రభావం ద్యోతకమౌతుంది. ఆయన రచించిన 'బీ' అనే కథలో 'బీ' అనే ఒక ముస్లిమ్ స్త్రీ అంతరంగాన్ని బుచ్చిబాబు ఆవిష్కరించాడు. తిరుగుతున్న చక్రాన్ని అపాలనే కోరిక ప్రతివ్యక్తి అంతశ్చేతనలో దాగి ఉంటుంది. ముఖ్యంగా బాల్యంలో ఈ కోరిక ఎక్కువగా ఉంటుంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ కోరికను అంతశ్చేతనలోకి నెట్టివేయడం జరుగుతుంది. అయినా ఈ కోరిక యేదో రూపంలో బయటకొస్తూనే ఉంటుంది. 'బీ' అన్న కథలో 'బీ' అనే పద్నాలుగేళ్ళ అమ్మాయి మొదలు తిరుగుతున్న సైకిల్ చక్రాన్ని ఆపాలని ప్రయత్నం చేస్తుంది. తర్వాత తిరుగుతున్న ఫ్యాన్‌ను ఆపాలని ప్రయత్నిస్తుంది. ఈలోగా 'బీ'కి పెళ్ళవుతుంది. భర్త విమానాలు నడిపే పైలటే. బీ

11. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ కోడూరి శ్రీరామమూర్తి. పేజి. నెం. 139

లో వేగంగా తిరుగుతున్న చక్రాలను ఆపాలనే కోరిక ఇంకా తీవ్రతరమౌతుంది. విమానం టేకాఫ్ చేసుకోవడానికి ముందు విమానం ముందుండే చక్రాలు వేగంగా తిరుగుతుంటాయి. వాటిని ఆపాలని ప్రయత్నించిన 'బీ' అవి తగిలి చనిపోతుంది. ఈ కథలో బుచ్చిబాబు వ్యక్తుల్లో దాగి ఉండే మరణకాంక్షను కూడా చూపించాడు. ప్రతివ్యక్తిలోనూ జీవితేచ్ఛ, మరణకాంక్ష రెండూ ఉంటాయని ఫ్రాయిడ్ చెప్పాడు.

బుచ్చిబాబు రచించిన మరోగొప్ప కథ 'ఎల్లోరా ఏకాంతసేవ'. ఈ కథలో స్త్రీలల్లో ఈర్ష్యాసూయలు వాళ్ళ అంతశ్చేతనలో ఎంతబలంగా ఉంటాయో బుచ్చిబాబు చిత్రించాడు. తన భర్త శిల్పాలు చెక్కే శిల్పి అని ఆభార్యకు తెలుసు. అయితే ఆ భర్త తన అక్కనే మోడల్‌గా తీసుకొని ఒక శిల్పాన్ని చెక్కాడని తెలుసుకున్న ఆ భార్య అక్కకూ తన భర్తకూ సంబంధం ఉందనుకొని, అసూయతో రగిలిపోయి భర్త చెక్కిన శిల్పాన్ని ముక్కలుముక్కలుగా పగులగొడ్తూ ఒక విచిత్రమైన ఆనందాన్ని పొందుతుంది. బుచ్చిబాబు చైతన్య స్రవంతిశిల్ప ప్రయోగంతో రచించిన చైతన్య స్రవంతి అనే ఈ కథను ఇదివరకే చర్చించాను.

ఒక వ్యక్తి అంతశ్చేతనలో దాగి ఉన్న పరస్త్రీతో లైంగికంగా కలవాలనే కోరికను బుచ్చిబాబు 'అరకులోయలో కూలిన శిఖరం' అన్న కథలో చిత్రించాడు. మనిషి కొన్నిలక్షల సంవత్సరాలు జంతువులా అడవుల్లో తిరిగాడు. ఈ కారణంగా వ్యక్తుల్లో ఆటవిక ప్రవృత్తి వాళ్ళ సామూహిక అంతశ్చేతనలో అణచబడి ఉంటుందని ఫ్రాయిడ్ శిష్యుల్లో ఒకడైన యూంగ్ చెప్పాడు. ఫ్రాయిడ్ వ్యక్తుల్లోని అంతశ్చేతనను గురించి చెబితే యూంగ్ వ్యక్తులందరిలోనూ ఆనాటినుండి కొన్ని సాధారణ ప్రవృత్తులు వాళ్ళ అంతరంగంలో దాగిఉంటాయని, దీనినే సామూహిక అంతశ్చేతనగా యూంగ్ సిద్ధాంతీకరించాడు. 'అరకులోయలో కూలిన శిఖరం' కథలో పట్టణ ప్రాంతంనుండి అరుకులోయకొచ్చిన ఒక ఇంజనీర్ గిరిజన జాతికి చెందిన ఓ స్త్రీ ఒక వాగులో స్నానం చేస్తుండగా చూస్తాడు. ఆ స్త్రీ అతనికి అడవికి సంకేతంగా కనిపిస్తుంది. అతనిలోని ఒకప్పటి మానవునిలోని ఆటవిక ప్రవృత్తి మేలుకొంటుంది. అతని అంతశ్చేతనలో ఒక ఆటవిక జాతికి చెందిన స్త్రీతో రమించాలనే కోరిక దాగి ఉంది. ఆ కోరిక అతనిలో ఉన్నట్టు అతనికి తెలీదు. నదిలో నగ్నంగా స్నానం చేస్తున్న ఆటవిక జాతికి చెందిన స్త్రీని చూసినప్పుడు అతనిలోని ఆ కోరిక గుప్పుమని బయటకొస్తుంది. బుచ్చిబాబుదే మరో కథ 'కలలో జారిన కన్నీరు'లో కూడా ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ ప్రభావం కనిపిస్తుంది.

బుచ్చిబాబు తర్వాత మనోవిశ్లేషణ సిద్ధాంతాల్ని తనకథల్లో ప్రవేశపెట్టిన రచయిత ఆర్.ఎస్. సుదర్శనం. ఫ్రాయిడ్‌ను బాగా అధ్యయనం చేసిన రచయితల్లో ఆర్.ఎస్. సుదర్శనంగారొకరు. ఆయన ఫ్రాయిడ్‌నూ, జాన్‌పాల్ సార్ట్రేను, భారతీయ తత్వశాస్త్రాన్ని సమన్వయం చెయ్యడానికి ప్రయత్నించిన మేధావి. ఆయన రచించిన 'మధురమీనాక్షి' 'కొండమెట్లు' 'అమృతుడు' మొదలైన కథల్లో ఈ సమన్వయం మనకు దర్శనమిస్తుంది.

'మధురమీనాక్షి' కథలో ఒక వ్యక్తిలోని అంతశ్చేతన అతని బాహ్య ప్రవేశంలోని ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తుందో ఆర్.ఎస్. సుదర్శనం చిత్రించాడు. మధురమీనాక్షిలోని కథానాయకుడి (అతని పేరు కథలో రచయిత చెప్పలేదు. ఈ కథ 'నేను' అంటూ ఉత్తమపురుషలో సాగుతుంది) భార్య చనిపోయింది. కానీ ఆమె రూపం, అమెతో అతనికున్న అనుబంధం అతని అంతశ్చేతనలోకి నెట్టివేయబడింది. అతడొకసారి మధురకు వెళ్తాడు. అక్కడున్న మీనాక్షి అమ్మవారి దేవాలయానికి వెళ్తాడు. మీనాక్షి విగ్రహం అతన్ని విపరీతంగా ఆకర్షిస్తుంది. కారణం అతని అంతశ్చేతనలో స్థిరీకరణం చెందిన అతని భార్య రూపానికి ఆ విగ్రహం చక్కగా సరిపోతుంది. తర్వాత అతనికి దేవాలయం బయట మీనాక్షి అనే ఓ లెక్చరర్ పరిచయమౌతుంది. అమెలో అతనికి దేవత రూపంలో ఉన్న మీనాక్షి విగ్రహమే కనిపిస్తుంది. ఈ లెక్చరర్ మీనాక్షి అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారుతుంది. ఆమె, ఇతడు శారీరకంగా ఏకమౌతారు. తర్వాత ఆ లెక్చరర్ మీనాక్షి చనిపోతుంది. లెక్చరర్ మీనాక్షి చనిపోవడానికి ముందురోజు రాత్రి అతనికి ఆమె చనిపోయినట్టుగా కలొచ్చింది. మీనాక్షితో అతడు లైంగికంగా కలిసాక అతనిలో తానేదో తప్పుచేశానన్న అపరాధభావం కల్గింది. అందువల్లనే తనను తాను శిక్షించుకోవడానికి అతనికి తాను చనిపోయినట్టుగా కలొచ్చింది. అలాగే ఎంతో పవిత్రురాలుగా భావించబడ్తున్న దేవత మధురమీనాక్షి విగ్రహాన్ని చూసినప్పుడు అతనిలో సెక్స్‌కోరికలు కల్గటం కూడా అతనిలో అపరాధ భావన ఏర్పడటానికి కారణమైంది.

ఇలా మధురమీనాక్షి కథలో ఒక సంక్లిష్టమైన మానవ ప్రవృత్తికి చిత్రిక పట్టడానికి ఆర్.ఎస్. సుదర్శనం ప్రయత్నించాడు. ద్వంద్వాలు లేవు, ఉన్నది ఒక్కటే అదే అద్వైత సిద్ధాంతం, జాన్‌పాల్‌సార్ట్రే అస్తిత్వవాద సిద్ధాంతం, ఫ్రాయిడ్ అంతశ్చేతన

సిద్ధాంతం ఈ మూడు సిద్ధాంతాల సమన్వయం మనకు 'మధురమీనాక్షి' కథలో దర్శనమిస్తుంది.[12]

ఆర్.ఎస్. సుదర్శనం రచించిన మరోకథ 'కొండమెట్లు'లో కూడా మనోవిశ్లేషణా సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది.

ఈ కథను రచయిత చైతన్య స్రవంతి శిల్పంలో మలచాడు. ఈ కథలో ఓ స్త్రీల కళాశాలలో పనిచేస్తున్న వృద్ధ లైబ్రేరియన్ అంతరంగం చిత్రించబడింది.

ఈ లైబ్రేరియన్ ఆ కాలేజిలో చదువుకుంటున్న ఓ అమ్మాయికొచ్చిన ఉత్తరాన్ని ఆ అమ్మాయికివ్వకుండా తన దగ్గరే పెట్టుకుంటాడు. ఈ ఉత్తరం అందకపోవడం వల్ల ఆ ఉత్తరాన్ని అందుకోవలసి ఉన్న ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకొని చనిపోతుంది. ఆ అమ్మాయి ఆత్మహత్యకు తానే కారకుణ్ణని భావించిన ఆ లైబ్రేరియన్‌లో తీవ్రమైన అపరాధభావం యేర్పడుతుంది. ఈ అపరాధభావం కూడా ఒక బలమయిన సూత్రం. ఫ్రాయిడ్ సిద్ధాంతాల్లో ఈ అపరాధభావం నుండి విముక్తుడు కావడానికి ఆ లైబ్రేరియన్ తిరుపతి కొండకు మెట్లమీదుగా నడిచివచ్చి నీ దర్శనం చేసుకుంటానని వేంకటేశ్వరస్వామికి మొక్కుకుంటాడు. ఆ మొక్కు తీర్చుకోవడానికతడు తిరుపతి కొండమెట్లెక్కుతూ కాలు జారిపడ్తాడు. కాలువిరుగుతుంది. హాస్పటల్లో చేర్పిస్తారు. హాస్పటల్లోనే అతడు చనిపోతాడు. అపరాధభావం తీవ్రమైన కారణంగానే అతడు మెట్లనుంచి జారిపడ్డాడని ఈ కొండమెట్లు కథలో రచయిత మనకు చెబుతాడు.

'అమృతుడు' కథలో వదిన, మరిది మధ్య యేర్పడిన ఒక అసాధారణ సంబంధం చిత్రించబడింది. ఈ కథలోని ప్రసూనకు పెళ్ళయింది. మంచి భర్త దొరికాడు. కానీ అతడామె అంతరంగాన్ని తృప్తిపరచలేకపోతాడు. ఎప్పుడూ యేదో పనిలో నిమగ్నుడవుతుండే ఆమె భర్త ఆమె ఆత్మలో పలకలేకపోతాడు. ఆ పనిని ఎక్కడో చదువుకుంటూ అన్ననూ, వదిననూ చూడటానికొచ్చిన ప్రసూన మరిది, వేణు చెయ్యగల్గుతాడు. వేణు అనేక విషయాలను గూర్చి అనర్గళంగా మాట్లాడగలడు. వదిన ప్రసూనకు వేణు అనేక విషయాలు చెబుతుంటాడు. వేణు వాళ్ళ అన్న ద్వారా ప్రసూనకు లభించని సాహచర్యాన్ని వేణు ఆమెకు అందిచగల్గుతాడు. దాంతో వేణు ప్రసూనకు చాలా దగ్గరరౌతాడు. ప్రసూన అంతశ్చేతనలో వేణుతో లైంగికంగా

12. నవీన్ సాహిత్య వ్యాసాలు పేజి. నెం. 292

కలవానే కోరిక స్థిరపడ్తుంది. ఇందుకు సభ్యసమాజం అంగీకరించదని అమెకు తెలుసు. అందుకే వేణుతో కలవాలనే కోరికను ఆమె తన సుప్తచైతన్యంలో అణచేసుకున్నది. చివరకు వేణుద్వారానే ప్రసూన ఓ కొడుకును కంటుంది. మార్మికవాద అభిప్రాయాలున్న వేణు యే హిమాలయాకో వెళ్ళిపోయి తిరిగిరాడు. ప్రసూన తన కొడుకులో వేణును చూసుకుంటూ కాలం గడుపుతుంది.[13]

ఫ్రాయిడ్‌ను అధ్యయనం చేసిన తెలుగు కథకుల్లో నవీన్‌గారొకరు. ఈయన రచించిన చాలా కథల్లో ఫ్రాయిడ్ ప్రభావం కనిపిస్తుంది.

నవీన్ కథకుడుగా ప్రారంభమైన కొత్తలోనే ఆయన 'అధోలోకం' అనే కథను రచించాడు. ఈ కథను ఆయన చైతన్యస్రవంతి శిల్పంలో రాశాడు. ఆ తర్వాత నవీన్ రచించిన 'అంపశయ్య' నవలకు ఈ కథనే రిహార్సల్‌లాంటిదని చెప్పొచ్చు.

'అధోలోకం' కథలో నవీన్, కాలేజీలో చదువుతున్న ఓ విద్యార్థి మనస్తత్వాన్ని చిత్రించాడు. వీధిలో వెళ్తున్న ఈ కథలోని విద్యార్థికి అతని క్లాస్‌మేట్ నళిని, ఆమె వెంటే వస్తున్న వాళ్ళ ఇంగ్లీషు లెక్చరర్ కనిపిస్తారు. వాళ్ళిద్దర్నీ ఒకరి వెంట ఒకరు రావటాన్ని చూసిన ఈ విద్యార్థి బుర్ర వేగంగా... అతివేగంగా పనిచెయ్యడం మొదలెడ్తుంది. కాలేజిలో ఈ నళినికి, ఆ ఇంగ్లీషు లెక్చరర్‌కు సంబంధం ఉందనే పుకారు ఉంది. ఇంతకాలం వాళ్ళిద్దర్నీ అలా చూడటంతో ఆ పుకారు నిజమేనన్న నమ్మకం కల్గుతుంది. రేపు కాలేజికి వెళ్ళగానే నేను నళినినీ, మన ఇంగ్లీషు లెక్చరర్ని పార్క్‌లో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుండగా చూసినంత మాత్రాన వాళ్ళు చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నారని చెప్పడం చాలా అన్యాయమని అతనికే అనిపిస్తుంది. అతనిలో తీవ్రమైన సంఘర్షణ అలా చెప్పాలని ఒకవైపు... చెప్పి ఆ అమ్మాయికి అన్యాయం చెయ్యొద్దని మరోవైపు చివరకతడు కాలేజికెళ్ళి అందరితో నళినిని ఇంగ్లీషు లెక్చరర్‌ను పార్క్‌లో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుండగా చూశానని చెప్పేస్తాడు.

అతడెందుకలా చేశాడు? నళినితో లైంగికంగా కలవాలనే కోరిక అతని అంతరంగంలో ఉంది. ఆమె తనతో కాకుండా ఇంగ్లీషు లెక్చరర్‌తో తిరుగుతున్నదని అతడు ఆమె మీద ద్వేషాన్ని, ఇంగ్లీషు లెక్చరర్ మీద ఈర్ష్యనూ పెంచుకున్నాడు. అతని అధోలోకంలో అంటే అతని సుప్తచైతన్యంలో దాగిన ఈ ఈర్ష్యాద్వేషాలే అతన్ని ఇలా ప్రవర్తించేలా చేశాయని రచయిత ఈ "అధోలోకం" కథలో చెప్పాడు.

13. నవీన్ సాహిత్య వ్యాసాలు పేజి. నెం. 298

నవీన్ రచించిన ఈ కథను, మరికొన్ని కథల్ని గూర్చి వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఇలా అంటాడు.

"నవలా సాహిత్యంలో చైతన్య స్రవంతి కథనాన్ని సమర్థంగా ఉపయోగించిన నవీన్ మరి కొన్ని కథల్లో కూడా ఆ శిల్పాన్ని ఉపయోగించాడు. లైఫ్ ఇన్‌కాలేజి, అన్న కథా సంపుటంలోని 'అథోలోకం' 'తీరిన కోరిక' 'టెక్నికల' అన్న కథల్లో కథనం చైతన్య స్రవంతిలో సాగింది. యువతరం అంతశ్చేతనలోని భావాలను నవీన్ చాలా సమర్థవంతంగా ఆవిష్కరించగలడు".[14]

నవీన్ రచించిన 'తీరిన కోరిక' కథలో ఓ భర్త తన భార్యమీద పెంచుకున్న ద్వేషం చిత్రితమైంది. రాజారావు, సావిత్రి కొత్తగా పెళ్ళిచేసుకున్నారు. భర్త రాజారావులో ఎప్పుడూ రొమాంటిక్ భావాలుంటాయి. అతడు సాహిత్యం బాగా చదివాడు. అతని అంతరంగంలో భార్యంటే ఓ ఊర్వశిలాగానో, ఓ శకుంతల లాగానో ఉండాలని కలలు కంటుంటాడు. కవిత్వం చదివి కవిత్వాన్ని తన అంతరంగంలో ప్రతిష్ఠించుకున్న రాజారావు తన భార్యను ఓ కవితా కన్యగా ఊహించుకుంటాడు. కానీ అతని భార్య సావిత్రి ఒక మామూలు గృహిణి, ఎక్కువగా చదువుకోలేదు. ఇంటి కోసం కావలసిన కూరగాయలు, కిరాణావస్తువులు, వంటచెరకు మొదలైనవి తెమ్మని భర్తను పురమాయిస్తుంటుంది. ఎప్పుడూ ఒక స్వాప్నిక ప్రపంచంలో ఉండే ఆ భర్తకు అనుక్షణం భార్య చెప్పే సామాన్లు తెమ్మనే పని చాలా చిరాకును కలిగిస్తుంది. అలా అతడు ఆమెమీద ద్వేషాన్ని పెంచుకొని ఆమెను శిక్షించాలని అనుకుంటాడు. అతనిలో పురుషాధిక్య భావం కూడా ఉంటుంది. ఈ కారణాల వల్ల భార్యనొకసారి తీవ్రంగా శిక్షించాలన్న అతని కోరిక ఆమెను కొట్టడం ద్వారా తీర్చుకుంటాడు. అతని రొమాంటిక్ ఫాంటసీస్ (స్వైర కల్పనలు) కారణంగా ఎంత అనర్థం జరిగిందో ఈ 'తీరిన కోరిక' కథలో నవీన్ చిత్రించాడు.

ఫ్రాయిడ్ ప్రభావం నవీన్ రచించిన మరో కథ 'హత్య'లో కూడా కనిపిస్తుంది.

గురువయ్య అనే ఓ అసమర్థుడైన గుమాస్తా తనతో పనిచేయించాలని ప్రయత్నించిన అతని ఆఫీసర్ మీద విపరీతమైన ద్వేషాన్ని పెంచుకుంటాడు. ఈ గురవయ్యలో తీవ్రమైన ఆత్మన్యూనతా భ్రాంతి కూడా ఉంది. గురవయ్య తన ఆఫీసర్ మీద పగ తీర్చుకోవాలనుకుంటాడు. మామూలు పద్ధతుల్లో అతడా పని చెయ్యలేదు.

---

14. కథాశిల్పం వల్లంపాటి వెంకటసుబ్బయ్య పేజి. నెం. 70

అప్పుడతడు మరో పద్ధతిని అనుసరిస్తాడు. గురవయ్య తన ఆఫీసర్ బొమ్మనొకదాన్ని తయారు చేసి దానికి సూదులను గుచ్చుతూ తన ఆఫీసర్నే సూదులతో గుచ్చి శిక్షిస్తున్నట్టుగా ఆనందపడిపోతాడు. ఆ బొమ్మ అతని దృష్టిలో వాళ్ళ ఆఫీసర్. చనిపోయాడని భావించి ఆ బొమ్మకు అతడు అంత్యక్రియలు జరుపుతాడు. ఆఫీసర్ నిజంగానే చనిపోయాడనీ తన పగ తీరిందని అతడారాత్రి హాయిగా నిద్రపోతాడు. మర్నాడతడు ఆఫీసుకు వెళ్ళగానే వాళ్ళ ఆఫీసర్ నిజంగానే చనిపోయాడని తెలుస్తుంది. తన ఆఫీసర్‌ని తనే హత్య చేశానని ఫీలవుతాడు. అతనిలో తీవ్రమైన అపరాధభావం చెలరేగుతుంది. ఆ అపరాధభావనతో అతడు ఆత్మహత్య చేసుకొని చనిపోతాడు.

మనిషిలో ఏర్పడే అపరాధభావనకు అద్భుతమైన కథారూపమే నవీన్ రచించిన ఈ 'హత్య' అనే కథ. ఫ్రాయిడ్ మనో విశ్లేషణలో ఓ వ్యక్తి అంతరంగంలో స్థిరపడే అపరాధభావన ఆ వ్యక్తిని ఎలా కృంగదీస్తుందో విశ్లేషించాడు. డోస్టరిస్కీ అన్న రష్యన్ రచయిత రచించిన క్రైమ్ అండ్ పనిష్మెంట్ అనే నవల మనిషిలోని అపరాధభావనను గొప్పగా చిత్రించిన నవల అని ఫ్రాయిడ్ పేర్కొన్నాడు.[15]

నవీన్ రచించిన అనేక ఇతర కథల్లో ముఖ్యంగా 'రెండోపెళ్ళి' 'నిప్పురవ్వలు' 'టెక్నికల' 'కసి' మొదలైన కథల మీద ఫ్రాయిడ్ ప్రభావం కనిపిస్తుంది. 'రెండోపెళ్ళి' కథలో చాలామంది పురుషుల అంతశ్చేతనలో ఒకరికంటె ఎక్కువమంది స్త్రీలతో సెక్స్ సుఖం అనుభవించాలనే కోరికను నవీన్ చిత్రించాడు. 'నిప్పురవ్వలు' కథలో ఓ యువతిలోని అంతశ్చేతనలో అణిచివేయబడిన సెక్స్ కోరికలు ఎలా బయటపడ్డాయో నవీన్ చిత్రించాడు. 'టెక్నికల' కథలో ఓ యూనివర్సిటీ విద్యార్థికి ఓ ట్రెయిన్ ప్రయాణంలో ఓ అందమైన యువతి పరిచయమౌతుంది. కాస్సేపట్లోనే విడిపోతామని తెలిసుండి కూడా ఆ యువకుడు ఆమెను గురించిన ఎన్నో ఫాంటసీస్‌కు లోనవడాన్ని నవీన్ చిత్రించాడు.

'కసి' కథలో ఒక యువకుడికి తండ్రి మీద యేర్పడే కసి చిత్రితమైంది. ఆ యువకుడికి తల్లంటే గొప్ప ప్రేమ, తండ్రంటే గొప్ప ద్వేషం యేర్పడ్డాయి. చివరకతడు తండ్రిని చంపేయ్యాలని నిర్ణయించుకుంటాడు. ఈ 'కసి' కథలో నవీన్ ఫ్రాయిడ్ ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటైన 'ఈడిపస్ భ్రాంతి'ని చిత్రించాడు.

---

15. ............ ఫ్రాయిడ్ జీవితచరిత్ర అన్నపురెడ్డి వెంకటరెడ్డి.

ఇటీవలి కాలంలో ఆడెపు లక్ష్మీపతి, కాశీభట్ల వేణుగోపాల్ మొదలైన కథకులు రచించే కథలమీద ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది.

ఆడెపు లక్ష్మీపతి రచించిన 'జీవన్మృతుడు' కథలో కూడా చైతన్య స్రవంతి శిల్ప ప్రయోగం కనిపిస్తుంది. అటు తల్లికి, ఇటు భార్యకు మధ్య నలిగిపోయిన ఒక సున్నితహృదయుడి అంతరంగాన్ని 'జీవన్మృతుడు' కథ అద్భుతంగా ఆవిష్కరించింది. తల్లంటే ఎంతో ప్రేమ. (ఈడిపస్‌కాంప్లెక్సు) భార్యంటే ఒక భౌతిక అవసరాన్ని, అంటే సెక్స్ కోరికను తీర్చే జీవి. వీళ్ళిద్దరిలో ఎవరినీ వదులుకోలేడు. కానీ సెక్స్ కోరికే చాలా బలమైంది కాబట్టి అతడు తల్లినే వదులుకుంటాడు. తల్లికి తీరని ద్రోహంచేస్తున్నాననే అపరాధభావనకు లోనై తననుతాను శిక్షించుకుంటూ తనను తాను 'జీవన్మృతుడు'గా భావించుకునే మనస్తత్వానికి ఈ కథలో లక్ష్మీపతి ఆవిష్కరించాడు.[16]

కాశీభట్ల వేణుగోపాల్ ఇటీవలనే రచించిన కథ 'ఘోష'లో పురుషుల అంతశ్చేతనలో ఉండే, ఇన్‌సెస్ట్ అనే ప్రవృత్తిని చిత్రించాడు. ఇన్‌సెస్ట్ అంటే ఒక కుటుంబంలోని వ్యక్తులతో అంటే అక్కా చెల్లెళ్ళు, కూతుళ్ళు మొదలైన వాళ్ళతో సెక్స్ సంబంధాలు పెట్టుకోవాలనే కోరిక, మనిషి అనాగరికుడుగా, ఆటవికుడుగా అడవుల్లో తిరుగుతున్న రోజుల్లో సెక్స్ సంబంధాలు పెట్టుకోవడానికి వావివరసల ప్రసక్తి ఉండేది కాదు, మనిషి నాగరికుడుగా మారటం, కుటుంబాలు యేర్పడటం, వివాహాలు చేసుకోవడం, మొదలైనవి ఏర్పడటంతో సెక్స్ సంబంధాలకు వావివరసల్ని సమాజం యేర్పరించింది. స్వంత అక్కాచెల్లెళ్ళతో, కూతుళ్ళతో, తల్లులతో సెక్స్ సంబంధాలు సమాజం నిషేధించింది. అలాంటి సంబంధాలు అనైతికం అని ప్రకటించింది. అయినా ఒకప్పటి వావివరసలు లేని సెక్స్‌సంబంధాలు మనుషుల సామూహిక అంతశ్చేతనలో ఇంకా అణచబడి ఉన్నాయి. అవి అప్పుడప్పుడు బయట పడ్తుంటాయి. ఇలాంటి సంబంధాలనే 'ఇన్‌సెస్ట్' అనీ, ఈడిపస్ కాంప్లెక్స్ అనీ ఫ్రాయిడ్ విశ్లేషించాడు.

కాశీభట్ల వేణుగోపాల్ రచించిన కొన్ని కథల్లో ముఖ్యంగా 'ఘోష' అనే కథలో ఒక వ్యక్తిలో దాగి ఉన్న 'ఇన్‌సెస్ట్' ను చిత్రించడం కనిపిస్తుంది.

ఇలా తెలుగు కథానికా సాహిత్యంలో 1940 తర్వాత వెలువడిన అనేక కథల్లో ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సిద్ధాంతాల ప్రభావం విరివిగానే కనిపిస్తుంది.

---

16. నాలుగు దృశ్యాలు - ఆడెపు లక్ష్మీపతి కథా సంకలనానికి నవీన్ రాసిన ముందుమాట.

# కథానిక

కీ.శే. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

**(తెలుగులో ఈ ప్రక్రియకు మొదటిసారిగా 'కథానిక' అనే పేరు ప్రతిపాదించిన అలనాటి వ్యాసం.)**

కథానిక అంటే అభినవసాహిత్య సంసారానికి ఆత్మబంధువైన 'చిన్న కథ'కు పురాణ భారత సాహిత్యవేత్తలు పెట్టిన ముద్దుపేరు.

హిందీ, బెంగాలీ, తెనుగు మొదలయిన ఉత్తరదక్షిణ భారతీయ సాహిత్య ప్రపంచంలో కొత్తగా ఒక ఉన్నతపదాన్ని ఒడుచుకొని ప్రత్యేకశాఖగా ప్రవృద్ధమై నాడునాటికి అందాలు దిద్దుకొనే 'చిన్నకథ' పరసారస్వత పరిచయపరిపాటివల్లనే మనకు వచ్చిందని ఒక అపోహ అనుశ్రుతముగా ఉన్నది.

English Short Storyకి అనువాదరూపమయిన హ్రస్వకథ, 'చిన్నకథ' 'కథానకము' అనే పేర్లతో తలకొకరీతిగా మనలో కొంతమంది వాడుతున్నారు. దీన్నిబట్టి మనపూర్వ సాహిత్యంలో ఇటువంటి రచన ఉన్నట్టు మనవారికి తెలియదని తోస్తుంది.

అన్ని వాఙ్మయాల్లో వలెనే ఆంధ్రవాఙ్మయంలో కూడా చెత్తపత్రికలలోని ఊకదంపుడు కథలు తప్పిస్తే చాలామంచి 'చిన్న కథ' రచన సాగుతోన్నదని చెప్పవచ్చు. తెనుగు చిన్న కథ రచనకు – ఒకటి రెండు శరత్తులు హెచ్చుతగ్గులకేమీ – 'ఒక వెండిపండుగకాలం' సమీపించింది. కాని ఇంతవరకూ దీని పుట్టుపూర్వోత్తరాలు గురించి సూటిగా తెలుసుకొని నిర్వచించినవారు నాయెరుకకు ఎవ్వరూ కనిపించరు.

అక్కిరాజు ఆంజనేయశర్మగారు తమ సారస్వత వ్యాససంపుటిలో Short Storyకి సరియైన పేరు లేదనన్నీ, ఇంచుమించుగా హ్రాస్వకథ, 'చిన్నకథ' అనవచ్చుననీ, దీనికి మూలం బ్రాహ్మణోపనిషదాదివైదిక వాఙ్మయమూ, పంచతంత్రము, హితోపదేశము, భేతాళపంచవింశతి మొదలగునవీ కావచ్చుననీ వ్రాసి, పంచతంత్రమును ఎందరో ఖండాంతరీయులు అనువదించారనీ క్రమంగా ప్రచారం కోసం ఆయా వాఙ్మయాల్లో బయలుదేరిన చిన్న వ్యాసములు ఈ 'చిన్నకథ'కు దారి చూపి ఉండవచ్చుననీ నిరూపించారు. కాని బ్రాహ్మణాదికథలూ, పంచతంత్ర కథలూ కొన్ని అననుభూతవిషయాలను నిరూపించడానికి బయలుదేరాయి. వాటి

నుంచి క్రమంగా కథావాఙ్మయము తలచూపి ఉండవచ్చు. విశిష్టమై నానాత్వ చమత్కారిత్వ, భావశిల్పాలకు ఆలవాలమైన 'చిన్న కథ' రచన పుట్టడానికి ఎంతో వ్యవధానమూ, ప్రోద్బలమూ ఉండాలి. ఒక్క పంచతంత్రాన్ని ఖండాంతరాలు అనువదించుకొన్నంత మాత్రాన దానిలోంచి ఇంత అద్భుతరచన పుట్టి ఉండదు. పాశ్చాత్యుల Short Story వారి Novel నుంచి పుట్టియుండవచ్చు. ఇక మన 'చిన్నకథ' బ్రాహ్మణాదుల నుంచి పరంపరగా అభివృద్ధికి వచ్చిన కథాకావ్యముల నుండి ఎన్నో కొత్త అందాలను తీర్చుకొని ప్రత్యేక రచనగా ఏర్పడింది. గాని సరాసరిగా వాటినుంచి రాలేదు. మన పూర్వులే కథా ప్రవృత్తిని ప్రస్తరించి 'చిన్నకథ'ను లక్షణాలతో నిర్వచించారు. దీనికి మన సాహిత్యశాస్త్రంలో 'కథానిక' అనే పేరు సిద్ధమైయుంది.

శివశంకరశాస్త్రిగారు "ఏకాదశి" పీఠికలో మనకు కథ, కథానకము, ఆఖ్యానకము, ఆఖ్యాయిక అనే గద్య విభాగాలున్నట్టు వ్రాశారు. అయితే వాటిని శాస్త్రి గారు వివరించినందువల్ల 'చిన్నకథ' అనే గద్యరచనా విభాగం దేనికి సరిపోతుందో తెలియక అబోధోపహతం అయింది.

నేను కొన్నాళ్ళనుంచీ చిన్నకథ చరిత్ర కనుక్కోవడానికి చేసే పరిశోధనలలో అచుంబితవిషయాలు కొన్ని దొరకడం చేత వాటిని ఆంధ్రప్రముఖుల యెదుటికి తీసుకురావడానికి ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

భారతీయ సాహిత్యానికి విజ్ఞానసర్వస్వాలయిన పురాణాలు అద్భుత విషయభాండారాలు. వాటిలో ఒకటైన అగ్నిపురాణం సమూలకాషంగా సాహిత్య మీమాంస చేసింది. 337 అధ్యాయపు కావ్యాదిలక్షణ నిరూపణ సందర్భంలో గద్యకావ్యవిభాగం గురించి ఇట్లా ఉంది.

**ఆఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా**
**కథాని కేతి మన్యంతే గద్యకావ్యం చ పంచధా**

1. ఆఖ్యాయిక 2. కథ 3. ఖండకథ 4. పరికథ 5. కథానిక అని గద్యకావ్యాలు అయిదు రకాలు.

ఇందులో కథానికే మన 'చిన్నకథ'

ఈ గద్యకావ్య విభాగాలు ప్రాచీన సంస్కృతప్రాకృత గద్యకావ్యాలకు సరిపోతాయి. బృహత్కథను 'ఆఖ్యాయిక'గా చెప్పవచ్చు. కథా సరిత్సాగరము 'కథ' అనే విభాగానికి చేరుతుంది. వాసవదత్త ఖండ కథ. కాదంబరి పరికథ.

ఇక మిగిలిన 'కథానిక'కు లక్ష్యభూతాలయిన ప్రత్యేక సంస్కృత వచన రచనలేవీ కనిపించవు. కాని విక్రమార్క చరిత్ర, హితోపదేశము మొదలైన కథల పుస్తకాలలోని ఒక్కొక్కకథ ఇంచుమించు కథానికాప్రాయముగా ఉంటుంది.

అప్రకృతం కనుక పూర్వోక్త గద్యకావ్యాల లక్షణ నిర్వచనాలను విడిచిపెట్టి ప్రకృత 'కథానిక' లక్షణాన్ని ఉద్ధరించి లక్ష్యాలను పరామర్శిస్తారు.

**భయానకం సుఖపరం గర్భే చ కరుణో రసః**
**అద్భుతోంతే సుక్లుప్తార్థా నోదాత్తా సా కథానికా**

కథానికా బాహ్యలక్షణాలు రెండు 1. కథ సుదూరంగా సాగిపోక పొందికగా ఉండాలి. 2. పెద్దసమాసాలు, వర్ణనలతోను కథా శరీరం బిగిసిపోకూడదు.

అభ్యంతర లక్షణాలు మూడు. 1. పఠితను భయసంభ్రమాశ్చర్యాల్లో ముంచే విచిత్ర సంఘటనలుండాలి. 2. కథాగర్భంలో హృదయం కరిగించే కరుణసన్నివేశం కూర్చాలి. 3. పాఠకుడు అనుకోని కొత్త మలుపులతో కథ తమాషాగా ముగిసిపోవాలి. ఇది 'కథానికా' స్వభావం.

మహాకావ్యానికి చెప్పబడిన అష్టాదశవర్ణనలోనివి కొన్ని ఉన్నా ప్రబంధత్వమునకు క్షతిలేనట్టు దీనిలో బాహ్యలక్షణాలు తప్పకుండా ఉంటూ, అభ్యంతర లక్షణాల్లో ఏ ఒకటైనా లోపించవచ్చు. అయితే అద్భుత నిర్వహణం మాత్రం విడిచిపెట్టితే 'కథానిక' రక్తికట్టటం చాలా కష్టం.

ఏవంవిధ లక్షణాలతో సర్వాత్మనా తులతూగే గద్యకావ్యాలు కనిపించక పోయినా, విక్రమార్కచరిత్రాదుల్లో ఈ కథానిక నీడలు మాత్రం బాగా గోచరిస్తాయి. మచ్చుకు విక్రమార్క చరిత్రలోని 12వ కథ తీసుకోవచ్చు. ఈ కథలో మొదట సంభ్రమాశ్చర్యాల్లో ముంచే భయానకఘట్టం ఒకటి కనిపించి అది క్రమంగా వికసించి అద్భుతమయిన నిర్వహణకు తిరుగుతుంది. దీన్ని విస్తరించి బాగా దిద్దితే మంచి కథానిక అవుతుంది.

హితోపదేశంలోని ఘంటాకర్ణ, కందర్పకేతు కథలు చాలా కథానికా లక్షణాలతో ఉన్నవే. దశకుమారచరిత్రలో కొందరి చరిత్రలు ప్రత్యేకించి తీర్చితే మంచి కథానికలవుతాయి.

అగ్నిపురాణమునకు పూర్వం దండ్యాచార్యులు ఆఖ్యాయిక, ఆఖ్యానము, కథ అనే విభాగాలే చెప్పినట్టు సాహిత్య దర్పణంలో విశ్వనాథ కవిరాజు చెప్పి,

తాను కూడా వాటినే నిర్వచించి చాలా సూక్ష్మంగా ఆ భాగము వదలివేశాడు. కాని అగ్ని పురాణంలో మాత్రం ఈ గద్యకావ్యవైవిధ్యం కనిపిస్తుంది.

తరువాతి సాహిత్యశాస్త్రకారులు తమనాటికి గద్యరచనాబలం తగ్గి ప్రబంధ తత్పరత, దృశ్యకావ్యగోష్ఠి హెచ్చుడం చేత వచన రచనపైన దృష్టిలేక వాటిని నిర్వచించడం మాని ఉంటారు.

పెద్ద గ్రంథాలు కనుక, కాదంబర్యాదులు బతికి ఉన్నవి. అయినా వాటిని అసత్కావ్యాల్లో చేర్చి ఎందుచేతనో పీడిస్తూనే వచ్చారు.

'కథానిక' వంటి చిన్న రచనలు కాలగర్భంలో మణిగిపోయి ఉంటాయని నా ఊహ. ఏమంటే సాహిత్యదర్పణంలోని ఉపరూపకాలకు ఉదాహరణంగా చెప్పిన వాలివధ, ప్రేంఖణం, మేనకాహితరాసకం, మాయాకాపాలిక సంలాపకాదులు ఇప్పుడెక్కడా దొరకవు. విశ్వనాథుడు చెప్పినందువల్ల పేరులైనా తెలుస్తున్నవి, గాని లేకపోతే అవి కూడా 'కథానిక'లవలె పోయి ఉండును.

మనవారు ప్రస్తుతం విరివిగా రచిస్తున్న ఏకాంకనాటికకు (One act play) సమానమయిన అంకరూపకము ఒకటి పూర్వదశరూపకాల్లో ఉండేది. ఉదాహరణగా విశ్వనాథుడే "శర్మిష్ఠాయయాతి" అని ఒక అంకరూపకం పేరు చెప్పాడు. దాని లక్షణం ఇప్పటి ఏకాంకనాటికల లక్షణాలకు దూరంగా ఉన్నా రెండింటి పోకడ మాత్రం ఒక్కటే. చింతాదీక్షితులుగారు సరిగ్గా 'శర్మిష్ఠ' అనే ఏకాంకరూపకం వ్రాశారు. 'శర్మిష్ఠాయయాతి' సంగతే యెరగకుండా, కొన్నాళ్ళ పాటు విస్మృతప్రాయమైన అంకరూపకం నేడు రచ్చకెక్కి ఔన్నత్యము పొందినట్టే కొంత కాలం మాటుపడి ఉన్న 'కథానిక' నేడు అభినవసారస్వతులచే ఉద్ధరింపబడి, ఎన్నో కొత్త లక్షణాలనూ, అందాలనూ స్వీకరించి ఇప్పటి ప్రకృష్టస్థితికి వచ్చింది.

అగ్ని పురాణమును బట్టి నేను నిర్వచించిన 'కథానికా' ప్రధానలక్షణాలే భారతీయ 'చిన్నకథ'లలోనూ పాశ్చాత్యుల Short Story లోనూ, బహుళంగా కనిపిస్తున్నవి.

చూడండి:

వంగకవిశేఖరుడు రవీంద్రుని 'కాబూలువాలా', 'అస్థిపంజరం', 'నమ్మకమైన ఆస్తి', 'ఏటిమెట్లు' మొదలయిన కథలలో విచిత్ర సన్నివేశాలు, కరుణాలింగితచిత్త

మథనలూ, అద్భుతపరివర్తనాలు కనిపిస్తాయి. శరచ్చంద్రబాబు చాలా కథలిట్లాంటివని వినుకలి. సీతాదేవి కథలలో ఈ లక్షణాలే విరివిగా ఉంటాయి.

సుప్రసిద్ధాంధ్ర కథకులు:

| | |
|---|---|
| శివరామశాస్త్రిగారి | – 'అంతర్నాటిక', 'మాలదాసరి' మొదలైనవి. |
| మొక్కపాటి వారి | – 'భిక్షువు', 'శిల్పిద్వయం' వగైరా. |
| సుబ్రహ్మణ్యశాస్త్రి గారి | – 'తులసి మొక్కలు', 'ఇద్దరం ఒక్కచోటకేపోదాం' |
| బాపిరాజు అడవివారి | – 'తిరుపతి కొండమెట్టు |
| కాళూరి వారి | – 'గృహకల్లోలాలు' |
| వెంకటచలంగారి | – 'వేదాంతం' |
| శిరోమణి గారి | – 'ధర్మసంస్థాపనం' |
| దీక్షితులు గారి | – 'శ్యామల', 'గాలిపాటు' |

వంటి కథలు శుభ్రమైన కథానికలు.

పాశ్చాత్య కథకులు 'గోర్కీ', 'చకోవ్', 'గాల్వవర్దీ', 'వెల్స్' మొదలైనవారి కథల్లో చాలావరకు ఈ లక్షణాలు కనిపిస్తాయి.

పాదశతాబ్దికి పైగా భారతీయ సారస్వతాల్లో ఉన్నతస్థానమును ప్రాప్తించిన 'చిన్నకథ' రచన మనకెట్లా వచ్చినా ఇది మన సాహిత్యాచార్యులు తమ అద్భుత ఉపజ్ఞాప్రతిభలతో గద్యవాఙ్మయమును ప్రస్తరించి నిర్వచించినదే కాని కేవలం ఒరులదగ్గర ఎరువుగా తెచ్చుకొన్న అపురూప వస్తువు కాదు. దీనికి 'హ్రస్వకథ', 'పొట్టికథ' అనే పేర్లు కి ప్రతిబింబప్రాయములుగా వాడడం కంటె, ప్రాచ్యసాహిత్యంలో నిరూఢమైనయున్న 'కథానిక' అనే పేరుతో వాడడం ఎక్కువ ఉచితం. దీనికి తెలుగులో ప్రస్తుతం ప్రచలితమైయున్న 'చిన్నకథ' అనే పేరు కూడా చాలా సన్నిహితంగా ఉంటుంది.

*(సాహితీ స్రవంతి ఏప్రిల్ – జూన్ – 2009)*

# కృష్ణ యజుర్వేదంలో కథానికలు

డా॥ కె. కోదండరామాచార్యులు

ఆధునిక సాహిత్యంలో ప్రసిద్ధమైన రచనా ప్రక్రియల్లో కథానిక ఒకటి. దీనికే చిన్న కథ అని కూడా పేరు ఉంది. ఇది పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చింది అని కొందరంటారు కాని కథానిక అని ఇప్పుడు చెప్పబడుచున్నట్టి లక్షణములు, ఉదాహరణములు భారతీయ పురాణాల్లోనూ, వేదాల్లోనూ కన్పించుచున్నవి.

**అఖ్యాయికా కథా ఖండకథా పరికథా తథా**
**కథానికేతి మన్యన్తే గద్యకావ్యంతు పంచథా**

(అగ్ని పురాణము 337 అధ్యాయ, 12 శ్లో)

గద్య కావ్యము ఐదు విధములని చెప్పి కథానికా లక్షణాన్ని ఇలా వివరించింది.

**భయానకం సుఖప్రదం గర్భేచ కరుణో రసః**
**అద్భుతాన్తముదాత్తాచ సుక్లుప్తా సా కథానికా**

(అగ్ని పురాణము 337 అధ్యాయ, 20 శ్లో)

ప్రారంభమున భయానకమును, మధ్యయందు కరుణమును, అంతమున అద్భుతమును కలిగి ఉదాత్తమై, సంగ్రహమై ఉండునది కథానిక.

అగ్నిపురాణం ముద్దబంగారాన్ని అందించింది. దాన్ని వివిధ రూపాలలో అభరణములుగా సిద్ధం చేసుకొని ధరించి మురిసిపోయినవారు ఆధునికులు.

లక్ష్యమును చూచి లక్షణ నిర్దేశము జరుగుతుంది. అలాగే వేదాల్లో, బ్రాహ్మణాల్లో ఉన్న చిన్న చిన్న కథలను దృష్టియందుంచుకొని కథానికా లక్షణ నిర్వచనము జరిగినదని స్పష్టముగా చెప్పవచ్చును.

ప్రాచీనులు, ఆధునికులు చేసిన నిర్వచనములను పరిశీలించినచో కథానికకు నాలుగు లక్షణములు ప్రధానములు. 1. సంక్షిప్తత (క్లుప్తత), 2. ఒకే ఒక అంశమును

వివరించుట 3. ఒకటి రెండు పాత్రలతోనే కథ వర్ణింపబడుట. 4. ఉపదేశాత్మకమైయుండుట.

కథానికలు అని ప్రత్యేకముగా నామ నిర్దేశము చేయబడకున్నను ఇట్టి నాలుగు లక్షణములు కల్గిన చిన్న కథలు వేదములందు బ్రాహ్మణములందు ఎన్నెన్నో కలవు. కృష్ణయజుర్వేదమున మరియు తైత్తిరీయ బ్రాహ్మణమున నా దృష్టికి గోచరించిన కథలలో కొన్నింటిని వివరించుటయే ఈ వ్యాసము యొక్క ముఖ్య ఉద్దేశ్యము.

వైదిక సాహిత్యములోని మంత్రములకు గాని కథలకు గాని ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికములనబడే మూడు అర్థములుంటాయని, వానిని గుర్తించవలసియుందని యాస్కుడు తన నిరుక్తంలో వివరించాడు. కాని ప్రస్తుతము సామాన్యార్థమును గ్రహించి కథానికారూపమును, సందేశమును తెల్పుటకు మాత్రమే ఈ వ్యాసపరిమితి.

**చంద్రునకు పడిన శిక్ష:**

**ప్రజాపతేస్త్రయస్త్రిగ్ంశద్దుహితర ఆసన్తాః ..... ఏతయాప్యాయయతి**

(కృష్ణయజుర్వేదం 2 కాం. 3 ప్ర. 5 అను)

ప్రజాపతికి అంబ, దుల, నితత్ని, అభ్రయంతి, మేఘయంతి, వర్షయంతి, చుపుణీక అను సప్త కృత్తికలు అశ్విని, భరణి, రోహిణి, మొదలగు వారు 26గురు మొత్తం 33 మంది కుమార్తెలు. వీరిని చంద్రుడు వివాహమాడెను. కాని రోహిణి యందు మాత్రమే అధికప్రేమను చూపగా మిగిలినవారు తండ్రి పంచన చేరిరి. వెంటనే చంద్రుడు వెళ్ళి "నా భార్యలను నా ఇంటికి పంపించుడ"ని కోరగా, "అందరిని సమానముగా చూతున"ని చంద్రునిచే ప్రమాణము చేయించి ప్రజాపతి కుమార్తెలను అత్తవారింటికి పంపెను. కాని చంద్రుడు వెనుకటి గుణమును మానలేదు. అదే అతని పాలిటి రాజయక్ష్మకు కారణము అయ్యెను. పిదప పత్నులందరు కలసి సూర్యోపాసనాపరమైన యాగమును చేసి భర్తకు రోగబాధనుండి విముక్తిని కల్గించిరి.

ప్రజాపతి, చంద్రుడు, అతని భార్యలు వీరితో కథ నడిచింది. చేరదీసి కట్టుకున్న భార్యలను సమానంగా చూడాలని, లేకుంటే శిక్ష తప్పదని, అయినా భార్యలు భర్త క్షేమాన్ని కోరవలెనని చక్కని సందేశమున్న కథ.

## ప్రభువు చేసిన పాపం ప్రజలకు కొంత:

**విశ్వరూపో వైత్వాష్ట్రః పురోహితో దేవానామాసీత్**
**బ్రహ్మహత్యాయై ప్రత్యగృహ్ణాన్**

(కృష్ణయజుర్వేదం 2 కాం. 5 ప్ర. 1 అను)

త్వష్ట యొక్క పుత్రుడు, రాక్షసులకు మేనల్లుడు, దేవతలకు పురోహితుడు అయిన విశ్వరూపునకు మూడు శిరస్సులు. అవి సత్త్వరజస్తమో గుణాత్మకములైనవి. అతడు సోమపానమును, అన్నభక్షణమును, సురాపానమును మూడింటిని మూడు శిరస్సులచే చేసెడివాడు. ఒక మారు యజ్ఞమంటపమున పౌరోహిత్యము చేయుచు పైకి ఒక విధముగా ఉచ్చరించుచు లోన ఇంకొక విధముగా స్మరించుచు యజ్ఞకార్యమును నిర్వహించుచుండెను. దీనిని గుర్తించిన ఇంద్రుడు వజ్రాయుధముచే అతని శిరస్సులను ఖండించెను. అపుడా మూడు శిరస్సులు కపింజల పక్షి, కలవింక పక్షి, తిత్తిరి పక్షి రూపములను ధరించెను. కాని బ్రహ్మహత్యాపాతకము ఇంద్రుని విడచి పెట్టలేదు. దానిని భరింపలేక పృథ్విని, వృక్షమును, స్త్రీని కొంత కొంత భాగమును భరింపమని కోరగా వారు అంగీకరించిరి.

ఊషరక్షేత్రము, జిగురు, రజోవికారము ఈ మూడు క్రమముగా భూమికి, వృక్షమునకు, స్త్రీకి ఇంద్రుని నుండి స్వీకరించిన పాతకమునకు చిహ్నములుగా మిగిలినవి. తియ్యబడిన గొయ్యి దానంతటదే కొంతకాలమునకు పూరింపబడుట, ఖండింపబడిన చెట్టు తిరిగి అంకురించుట, సంతాన ప్రాప్త్యనంతరము కూడా యథాసుఖముగా జీవించుట ఇవి మూడు పుడమి, తరువు, తరుణి పొందిన వరములు.

ఈ కథ ఐదు పాత్రలతో నడచినది. అందించే సందేశము మూడు విధములు. పైకి ఒక తలంపు, లోన ఇంకొకటి తలంపు ఉండకూడదు. అది దోషము. రెండవది అనాలోచితముగా ప్రభువు చేసిన పాతకము ప్రజలకు చుట్టుకుంటుంది. ప్రభువు వరములనిచ్చే సమర్థుడైనా ప్రజలు ఆయన పాపభారాన్ని మోయవలసే ఉంటుంది. ఇది మూడో విషయం.

## వాక్కు మనసు కలహించుకున్నవి:

**యదేకయాఘారయేదేకాం ప్రీణీయాత్... ప్రజాపతయే జుహ్వతి**

(కృష్ణయజుర్వేదం 2 కాం. 5 ప్ర. 11 అను)

దేవతలు హవిర్భాగమును గ్రహించుటలో "నేనే ప్రధాన పాత్ర వహించుచున్నా"నని వాక్కు, మనస్సు రెండు కలహించుకున్నవి. తగవును పరిష్కరించుమని ప్రజాపతి కడకు వెళ్ళినవి. నీవు మనస్సునకు దూతివి. దేనిని మనసుతో ధ్యానించునో దానినే వాక్కుచే పలుకుచున్నాడు మనుజుడు. కావున నీకు స్వాతంత్ర్యము లేదు అని ప్రజాపతి వాక్కుతో పల్కెను. వెంటనే వాక్కు కోపించి "ఓ ప్రజాపతీ ! నీకీ నాటి నుండి వాక్కుచే ఎవరును స్వాహాకారము నివ్వకుందురు గాక" అని పల్కెను. అందుచేతనే కర్మ సమృద్ధికొరకు చేయబడు జయాది హోమము తర్వాత "ప్రజాపతే నత్వదేతాన్యన్యో" అనే మంత్రాన్ని బిగ్గరగా ఉచ్చరించకుండా మనసులోనే స్మరిస్తూ స్వాహాకారముల నిచ్చుట సంప్రదాయమైయున్నది.

"ఉద్ధతుల మధ్య నిరుపేద కుండ తరమె" ! పాపం ఈ సంగతి ప్రజాపతి కాలం నాటికి పుట్టలేదేమొ. వాక్కును తక్కువ చేసి మనస్సును గొప్ప చేసి చెప్పాడు. ఓ మాట పడ్డాడు. నిజంగా విచారిస్తే ఓ మనిషి మనస్సులో ఆలోచన పుట్టినప్పుడు దానిని తెల్పాలంటే మూగవాడైతే సైగల ద్వారా చెప్తాడుగా. కాన మనస్సు వాక్కు రెండూ మనిషికి ప్రధానమే.

## అగ్నికి ప్రాణభయము:

**అగ్నేస్త్రయో జ్యాయాగ్ంసో భ్రాతర ఆసన్.... తానేన తేన ప్రీణాతి**

(కృష్ణయజుర్వేదం 2 కాం. 6 ప్ర. 6 అను)

అగ్నికన్న పెద్ద వారైన ముగ్గురు సోదరులు దేవతా హవిర్భాగములను స్వీకరించి అందించు విధి నిర్వహణలోనే కాలధర్మమునొందిరట ! తరువాత "అగ్నిం దూతం వృణీమహే" అంటూ దేవతలు అగ్నిని దూతగా వరించిరట. "నేను అన్నవలెనే అగుదునేమో" నని భయపడి అగ్ని నీటిలో దాక్కొనెను. అపుడు దేవతలు అగ్ని కొరకు వెదకుచుండ "అగ్ని ఇక్కడున్నా"డని నీటిలోన చేప చెప్పెను. అందుకు కోపించిన అగ్ని "నీ వెక్కడున్నా నిన్ను పట్టుకుని వధింతురు" అని శపించెను. తర్వాత "మా అన్నలకు హవిర్భాగమును కల్పించినచో నేను దూతగానుండుటకు సిద్ధమే" అని అగ్ని పల్కెను. "స్రుక్కులోనికి గ్రహింపబడి హుతము కాని హవిస్సు యొక్క అంశము బహిఃపరిధియందు జారి పడినచో ఆ భాగము మీ అన్నలకు హవిర్భాగ"మని దేవతలంగీకరించిరి. అలా వరమును కోరి అన్నలకు హవిర్భాగమును కల్పించి తాను దేవదూతగా స్థిరపడెను.

అగ్ని, దేవతలు, మత్స్యము వీరి మధ్య జరిగిన కథ ఇది. ప్రాణభీతిలో దాగిన వారిని బయట పెట్టకూడదని, విధి నిర్వహణలో మరణించిన వారికి భాగము కల్పించవలెనని చక్కని ఉపదేశము నిచ్చినది.

## ఆస్తిని స్వయముగా సంపాదించుకొనుట:

**మనుః పుత్రేభ్యో దాయం వ్యభజత్ ........... రుద్రః పశున్నాభ్య మన్యత**

(కృష్ణయజుర్వేదం 3 కాం. 1 ప్ర. 9 అను)

మనువు తన సంపదను కుమారులకు పంచి, కడగొట్టువాడు, వేదాధ్యయనం చేయుచున్నవాడు ఆయన నాభానేదిష్టునకు భాగమును కల్పించలేదు. "ఇదేమిటీ", అని పుత్రుడు ప్రశ్నింప "సత్రయాగమును చేయుచున్న అంగిరో నామక మహర్షుల వద్దకు వెళ్ళి నీవు నేర్చిన విద్యను వారికి కావలసిన రీతిలో అందించుము, వారి యాగము పూర్తియగును. సంతసించి పశుసంపదను, దక్షిణగానిత్తురు స్వీకరించుమని" తండ్రి చెప్పెను. నాభానేదిష్టుడు తండ్రి చెప్పిన ప్రకారమాచరించి పశువులను తీసుకొని వచ్చుచుండ "ఇవి నావి" అంటూ పశుపతి రుద్రుడడ్డుపడెను. అపుడు హోమము చేసి రుద్రుని సంతృప్తి పరచి నాభానేదిష్టుడు పశు సంపదతో ఇంటికి తరలివచ్చెను. రుద్రుడు "మమ వా ఇమే పశవః" నావే ఈ పశువులు నాభానేదిష్టుడు "అదుర్వై మహ్యామిమాన్" ఈ పశువులను నాకు ఋషులిచ్చారు. రుద్రుడు "న వై తస్య త ఈశత" వారికి వీనిపై స్వామిత్వము లేదు. "యజ్ఞవాస్తే హితయే మమవైతత్" యజ్ఞభూమిలో మిగిలిన ధనము నాదే, "తస్మాద్యజ్ఞవాస్తు నాభ్యవేత్యమ్" అందుచే యజ్ఞభూమిలో ప్రవేశించకూడదు, "యజ్ఞే మా భజ" యజ్ఞమున నన్ను సేవించు, "అథ తే పశూన్నాభి మగ్ంస్య" అప్పుడు నీ పశువులను హింసించను. ఈ విధముగా రుద్ర నాభానేదిష్ట సంవాదము కథలో వర్ణించబడినది.

తండ్రి తన ఆస్తిని కుమారులందరికి సమానంగా పంచాలని, అలా కాకున్నా సంపాదనా మార్గం చూపించాలని ఈ కథ చెప్పుచున్నది. విద్యావంతుడైనవాడు తన విద్యచే సంపన్నుడు కావచ్చునని, అది ఆత్మశక్తిని, ఆలోచనా శక్తిని, కార్యదక్షతను పెంపొందించునని నాభానేదిష్టుని పాత్ర వ్యక్తము చేయుచున్నది.

## కృష్ణసారమునకు పట్టిన మహర్దశ:

**ఋక్సామే వై దేవేభ్యో..... బ్రహ్మ ణై వైనం దీక్షయతి**

(కృష్ణయజుర్వేదం 6 కాం. 1 ప్ర. 3 అను)

ఋగ్వేదాధిదేవత, సామవేదాధిదేవత ఇద్దరు కలసి దేవతలకు కనిపించకుండా ఉండాలని మృగ (జింక) రూపమును ధరించి దాగియుండిరి. అపుడు దేవతలు ప్రార్థించుచు "ఋక్సామాధిష్ఠాతృదేవతలు ఏ రూపమును ధరించారో ఆ రూపమునకు విశిష్టతను కల్గింతుమ"ని ప్రకటించిరి. తక్షణమే "మన వలన ఈ మృగమునకు విశిష్టత కల్గుతున్నద"ని ఈ మృగ శరీరములో ఒక పగలు, ఒక రాత్రి దాగియున్నామని సంతసించి అహోరాత్రముల మహిమను, వర్ణములను మృగశరీరమందుంచి ఋక్సామాధిష్ఠాతృదేవతలు దేవతలకు కనిపించిరి. నాటి నుండి ఋగ్వేదమునకు, అహస్సునకు రెండింటికి ప్రతిరూపుగా తెలుపు వర్ణము, సామవేదమునకు, రాత్రికి ప్రతీకగా నలుపు వర్ణము కృష్ణాజినమున కన్పించుచున్నవి. కావున కృష్ణాజినమును ధరించినవాడు వేదాధ్యయన దీక్ష స్వీకరించినవాడేయగును. అందుచేతనే ఉపనయనమునాడు కృష్ణాజినముతో కూడిన యజ్ఞోపవీతము బ్రహ్మచారి ధరించుట సంప్రదాయమైనది.

వేదాధిదేవతలు చేసిన కార్యము వలన దేవతల ప్రకటన వలన కృష్ణ సారమునకు కలసి వచ్చినది. ఉత్తముల కార్యములు లోకోపకారములగునని కథ స్పష్టము చేసినది.

## సవతుల కయ్యము:

**కద్రూశ్చవై సుపర్ణీ చాత్మరూపమో రస్పర్థేతాగ్ం... సాష్టాక్షరా సమపద్యత**

(కృష్ణయజుర్వేదం 6 కాం. 1 ప్ర. 6 అను)

కద్రువ, సుపర్ణి వీరిర్వురు సవతులు. సౌందర్యమున నేనంటే నేనని కలహించుకొని, ఓడినవారు గెలిచిన వారికి దాసీత్వము చేయవలెనని, లేకున్న కోరిన వస్తువును తెచ్చి యివ్వవలెనని పందెము వేసుకుని మధ్యవర్తుల వద్దకు వెళ్ళగా కద్రువ సౌందర్యవతి అని తేల్చిరి. అపుడు కద్రువ, సుపర్ణిని దాసీత్వమైనా చేయి లేదా స్వర్గలోకమునన్నున్న సోమమును తెప్పించి ఇవ్వుమని కోరెను. అపుడు సుపర్ణి తన సంతానమైన జగతీ, త్రిష్టుప్, గాయత్రీ అను ఛందస్సులను పిలిచి "కన్నవారి కష్టాలను తొలగించడం సంతతి యొక్క ధర్మము కావున నా దాసీత్వమును తొలగించుటకు సోమము తెండ"ని చెప్పెను.

14 అక్షరములు గల జగతీ ఛందస్సు వెళ్ళి సోమరక్షకులతో యుద్ధము చేసి రెండక్షరములను కోల్పోయి అచటి నుండి పశుసంపదతో తిరిగి వచ్చెను.

తర్వాత 13 అక్షరములు కల త్రిష్టుప్ ఛందస్సు వెళ్ళి సోమరక్షకులచే రెండక్షరములు హరింపబడగా 11 అక్షరములతో గవాశ్వాది రూపదక్షిణలతో వచ్చెను. చివరగా 4 అక్షరములు గల గాయత్రి ద్యులోకమునకు వెళ్ళి సోమరక్షకులతో యుద్ధము చేసి జయించి, జగతీ, త్రిష్టుప్పులు కోల్పోయిన రెండు రెండు అక్షరములను, సోమమును తీసికొనివచ్చి తల్లి దాస్యమును తొలగించెను. నాటి నుండి గాయత్రి అష్టాక్షరి అయినది.

తమను కన్నవారి కష్టాలను తొలగించడం సంతానము యొక్క బాధ్యత అన్న విషయాన్ని, యుద్ధమున కొన్నింటిని నష్టపోవుట, కొన్నిటిని పొందుట సహజమైనదని ఈ కథ వెల్లడించింది. ఈ కథను చదివినపుడు దీనికి రూపాంతరమే భారతంలోని సౌపర్ణోపాఖ్యానము అని అనిపిస్తుంది. ఈ కథలో సౌందర్య విషయకవాదము, భారతంలో ఉచ్చైశ్రవ వాలము యొక్క తెలుపు నలుపుల గూర్చిన వాదము, ఇచట దాసీత్వమును పొందినది సుపర్ణ. అచట వినత, ఈ కథలో సుపర్ణికి ముగ్గురు భారతంలో వినతకు ఇర్వురు. గాయత్రి తెచ్చినది సోమము వైనతేయుడు తెచ్చినది అమృతము. ఇలా కొన్ని భేదాలున్నా మాతృదాస్యవిమోచనము సమానమే.

ఛందశ్శాస్త్రంలో కూడా జగతీ, త్రిష్ణుప్, గాయత్రీ అనే ఛందస్సులున్నవి. వేదంలో చెప్పినట్లు జగతికి 12, త్రిష్టుప్‌నకు 11 అక్షరాలు సరిగానే ఉన్నవి గాని, గాయత్రికి ఎనిమిది అక్షరాలు లేవు. ఆరు అక్షరాలే చెప్పబడినవి. ఈ అష్టాక్షరీ గాయత్రి వైదిక ఛందస్సునకు, లేదా మంత్ర విభాగమునకు సంబంధించినదని నా అభిప్రాయము.

| | | |
|---|---|---|
| చతురక్షరీ | - | వాసుదేవ |
| పంచాక్షరీ | - | నమశ్శివాయ |
| షడక్షరీ | - | ఓం నమో రామాయ, ఓం నమో విష్ణవే |
| అష్టాక్షరీ | - | ఓం నమో నారాయణాయ |
| ద్వాదశాక్షరీ | - | ఓం నమో భగవతే వాసుదేవాయ |

వైదిక కోశములో గాయత్రీ ఛందః (146 నుండి 151 వరకు) గాయత్రీ ప్రసక్తి ఎక్కడెక్కడ వచ్చినదో అందునా అక్షరపరంగా ఎన్నిమార్లు వచ్చినదో వివరంగా వ్రాయబడింది. త్రిపదా గాయత్రీ (తాండ్ర బ్రాహ్మణం), అష్టాక్షరీ గాయత్రీ (ఐతరేయ,

కౌషతకీ, తైత్తిరీయ, తాండ్య, జైమినీయ, గోపథ, శతపథ (బ్రాహ్మణములు), నారాయణ గాయత్రీ – నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోదయాత్, ఇలా గాయత్రీ మంత్రములు 24 అక్షరములతో కూడినవి అనేకములు కలవు.

వైదిక కథలోని గాయత్రీ ఛందస్సే భారత కథలో వైనతేయునిగా రూపొందెనని చెప్పవచ్చును. అందుకు నిదర్శనములీవాక్యములే.

**యద్గాయత్రీ శ్యేనోభూత్వా దివస్సోను మాహరేత్ తేన సా శ్యేనః**

(శతపథ 34112 వైతిక కోశము 150 పుట)

"ఓ గరుత్మంతుడా ! నీవు మంచి రెక్కలు కలవాడివి. త్రివృత్తులనబడు సామములు నీ శరీరము. గాయత్రీ మంత్రము నీ నేత్రము" అంటు వర్ణించినది కృష్ణ యజుర్వేదము. భాగవతము గరుత్మంతుణ్ణి ఛందోమయునిగానే పేర్కొన్నది. ఇదే విషయమును వేదాంత దేశికులు వారి గరుడ పంచాశత్ స్తోత్రములో (మూడవ శ్లోకం) "నేత్రం గాయత్రముచే త్రివృదితి చ శిరోనామధేయం యజూంషి" అని పేర్కొన్నది.

## మూడు పట్టణాలను కొట్టిన ముక్కంటి:

**తేషామసురాణాం తిస్రః పుర ఆసన్ ..... అసురాన్ ప్రాణుదత**

(కృష్ణయజుర్వేదం 6 కాం. 2 ప్ర. 3 అను)

రాక్షసులకు మూడు పట్టణములుండెను. ఒకటి లోహమయ ప్రాకారములను, రెండవది రజతమయ ప్రాకారమును, మూడవది హిరణ్యమయ ప్రకారమును కలిగి దేవతలకు దుర్భేద్యములై వర్ధిల్లెను. "ఉపసత్తమ హోమము చేసి దేవతలు వానిని జయింప నిశ్చయించిరి. మొదటగా బాణ ప్రయోగము చేయదలచి బాణము మొదటి భాగమున అగ్నిని, మధ్య భాగమున సోమదేవుని, బాణాగ్రమున విష్ణువును, ఆవాహన చేసి దానిని ఎవరు ప్రయోగించగలరా? అని ఆలోచించి అందుకు రుద్రుడే సమర్థుడని నిశ్చయించిరి. "నన్ను పశుపతిని చేసిన, నేను బాణ ప్రయోగము చేతునని" రుద్రుడు చెప్పగా దేవతలందుకంగీకరించిరి. అపుడు రుద్రుడు త్రిదేవతాత్మకమైన బాణమును ప్రయోగించి రాక్షసులను వారి పురములను నామరూపములు లేకుండ చేసెను.

ఉత్తమ కార్యమును సాధించునెడ పరుల సహకారము కోరుట తప్పు కాదని అందుకు ప్రతిఫలముగా వారు కోరిన దానిని ఇవ్వవచ్చునని ఈ కథ వలన తెలియుచున్నది. ఈ కథ భారత, భాగవతములలో నున్న త్రిపురాసుర సంహార కథకు కించిత్ భేదముతో బీజప్రాయముగానున్నది.

**ప్రజల కొఅకే రాజు:**

**అసురాణామ్ వా ఇయమగ్ర ఆసీత్ – వైద్యై వేదిత్వమ్**

(కృష్ణయజుర్వేదం 6 కాం. 2 ప్ర. 4 అను)

మొదట ఈ భూమి రాక్షసుల స్వాధీనంలో ఉండేది. దేవతలలో ఎవరైనా ఒకరు కూర్చొని అతడు చూచినంత మేరకే దేవతల భూభాగము. కాని "మీ భూమిలో కూడ మాకుభాగము కావాలని" దేవతలు రాక్షసులనడిగారు. "ఎంత కావాలి"? అని రాక్షసులు ప్రశ్నింపగా "మూడుసార్లు సలావృకి (అడవినక్క) ఎంత భూమిని చుట్టి వస్తుందో అంత భూభాగమునివ్వండి" అన్నారు. రాక్షసులు అలాగే అన్నారు. అపుడు దేవతలకు రాజైన ఇంద్రుడు సలావృకి రూపాన్ని ధరించి మూడు పర్యాయములు భూమిని చుట్టి వచ్చాడు. ఆ భూభాగము దేవతల స్వాధీనమైనది. ఆ భూమినే "వేది" అనే పేరుతో వ్యవహరించారు.

దుష్కరమైన కార్యమును ఉపాయముతో సాధింపవచ్చును. రాజైన వ్యక్తి ప్రజలకొరకు ఏ వేషమునైనా ధరించాలి. ఏ పనినైనా చేయవలసి వస్తుంది. అని కథా సందేశము.

**ఇంద్ర వ్యాకరణము:**

**వాగ్వై పరాచ్య వ్యాకృత్యా వదత్తే దేవా ఇంద్రమబ్రువన్ ....... ఇయం వ్యాకృతా వాగుద్యతే**

(కృష్ణయజుర్వేదం 6 కాం. 4 ప్ర. 7 అను)

పూర్వము వైదికమంత్రరూప వాక్కు విభజింపబడనిదై సముద్రఘోషవలె ఏకరూపముతోనుండెను. "దానిని వ్యాకరించుమని" దేవతలు ఇంద్రుని కోరగా "నేను, వాయువు ఇర్వురమేకకాలమున సోమరసమును గ్రహించునట్లు చేయుడని" ప్రతిఫలమునాశించెను. అందుకు సురలంగీకారమును తెల్ప ఇంద్రుడు "ఇది వాక్యము, ఇది పదము. ఈ పదంలో కూడా ఇది ప్రకృతి. ఇది ప్రత్యయము" అని మంత్రరూప వాక్కును వ్యాకరించెను.

అట్టి వాక్యములే ఈనాడు పఠన, వ్యవహారములో నున్నవి. ఇంద్ర వ్యాకరణం పాణినీయ వ్యాకరణము కన్న ప్రాచీనమైనదే కాని ఇపుడది అలభ్యము.

పఠన, పాఠనములందు తెలియని అంశమును పెద్దలనడుగుట, తెల్సిన దానిని దాచుకొనకుండ వివరించి పెద్దలు చెప్పుట ఉత్తమమని కథానికా సందేశము.

## "పృథవీ" నామము:

అపో వా ఇదమగ్రే సలిలమాసీత్... తద్భూమ్యై భూమిత్వమ్

(తైత్తరీయ బ్రాహ్మణము 1 అష్టకం 1 ప్ర. 3 అను.)

ఇపుడు మనకు కన్పిస్తున్న స్థావర జంగమాత్మకమైన ప్రపంచమునకు ప్రారంభమున అంతా జలమే. అపుడు సృష్టినెట్లు చేయవలెనని ఆలోచించుచున్న సృష్టికర్తకు ఒక పద్మపత్రము కన్పించెను. "ఇది ఆధారము లేకుండ నిల్వదు. దీని నాళముననుసరించి ఆధారమును కనుగొనవలె"నని సృష్టికర్త "వరాహోరూపం కృత్వోపన్యమజ్జత్" వరాహరూపియై నీటిలో ప్రవేశించెను. కొంత దూరము వెళ్ళిన పిదప భూమి కన్పించెను. అంత తన దంష్ట్రచే మృత్ఖండమును త్రవ్వి పైకెత్తి ముందు కన్పించిన ఆ పుష్కర పర్ణమందు "అప్రథయత్" అనగా విస్తరింపచేసెను. నాటి నుండి ఆ మృత్ఖండమునకు "పృథవీ" అను నామమేర్పడినది.

కన్పిస్తున్న పుడమి తల్లి అడుగున నీరే ఉన్నదని, ఆలోచన కలవానికి ఆధారము లభించునని, అదే కార్య సఫలతకు మార్గదర్శకమగునని స్పష్టమగుచున్నది

## ఫేనమేఆయుధము:

ఇంద్రో వృత్రగ్ం హత్వా..... రక్ష సామపహత్యై

(తైత్తరీయ బ్రాహ్మణము 171 అను వాక్యంలో 6,7 మంత్రములు)

ఇంద్రుడు అనేక మంది రాక్షసులను సంహరించినా "నముచి" అనే రాక్షసుని సంహరింపలేకపోయెను. ఒకమారు నముచి ఇంద్రునితో ఇట్లు పలికెను. "ఇది ఒక ఒప్పందం. శుష్కించిన (ఎండిన) సాధనములతో కాని, ఆర్ద్రమైన (తడిగానున్న) సాధనములతో గాని, రాత్రిగాని, పగలు గాని నీవు నన్ను సంహరించకూడదు. ఇక ప్రయత్నించు" అంటూ వెళ్ళెను. కొంత కాలమునకు సమయమును కనిపెట్టి ఇంద్రుడు నురుగును ఆయుధముగా చేసుకొని ప్రభాత కాలమున నముచిని సంహరించెను. అపుడతని శిరస్సు ఇంద్రుని వెంట పడగా అపామార్గహోమము

(ఉత్తరేణి సమిధలతో హోమము) చేసి సముచి పీడను తొలగించుకొనెను. నాటి నుండి అపామార్గహోమము రక్షోగుణ వినాశమునకై చేయబడుచున్నది.

దుష్టుడు ఎన్ని ఎత్తులు వేసినా అతనిని శిక్షించుటకు సజ్జనునకు మరో మార్గం దొరుకుతుంది. సమయం కొరకు వేచియుండాలి. అపుడు సజ్జనుడు చేసిన పని లోకోపకారమే అవుతుంది. ఇది ఈ కథ ద్వారా తెలుసుకొనదగిన అంశము.

నురుగు కఠిన పదార్థము కాదు కాన శుష్కము కాదు. దాని యందు జలము లేదు. కాన ఆర్ద్రము కాదు. కాన ఇంద్రుడు ఫేనమును ఆయుధముగా ప్రయోగించుట దోషము కాదు.

ఈ కథను చదివినపుడు హిరణ్యకశిపుడు బ్రహ్మదేవుని వరములడిగిన వృత్తాంతము స్మరణకు వచ్చును.

**నాంతర్బహిర్దివానక్తం అన్యస్మాదపిచాయుధైః**
**న భూమౌ నాంబరే మృత్యుః న నరై ర్న మృగైరపి**

(శ్రీమద్భాగవతం 7336)

## లేగెదూడ కోరిక:

**అంగిరసో వై సత్రమాసత .................. అతి హి సన్ధాన్ధయతి**

(తైత్తరీయ బ్రాహ్మణము 2 అష్టకం, 1 ప్ర. 1 అను)

అంగిరసులను మునులు సత్రయాగమును చేసిరి. కాని యాగక్షీరార్థమై వారు పెంచకునే గోవు ఆహారము లేక బాధపడుచుండగా "దానికుపయోగపడని సత్రయాగఫలమెందుకని" వర్షమును కురిపించిరి. గడ్డి మొలచినది. కాని దానిని పితృదేవతలు విషమయము జేసిరి. "ఇదేమిటీ" అని మునులు ప్రశ్నింప "యాగమున భాగదేయమును కల్పించు" డని కోరి, సఫలీకృతులై గడ్డిని భక్షణయోగ్యముగా చేసిరి. గడ్డిని మేసి క్షీరసమృద్ధితోనున్న గోవుకడకు లేగదూడను విడుచుచు "యాగమునకై కొన్ని క్షీరములను విడచిపెట్టు" మని మునులు లేగ దూడనభ్యర్థించిరి. అపుడు లేక దూడవారినిట్లు వరము కోరెను.

**దశమా రాత్రీర్జాతన్న దోహాన్... అసజ్ఞనం మాత్రా సహ చరాణీతి**

"దూడ పుట్టినది మొదలు పదిరాత్రుల వరకు ఆవు వద్ద పాలను మీరు స్వీకరింపకూడదు. ఆ తర్వాత ప్రతిరోజు పాలు తీసిన పిమ్మట సంగమకాల

పర్యంతము తల్లితో తిరిగే స్వేచ్ఛను దూడకు ప్రసాదింపవలెను" అని. అపుడు మునులు లేగదూడ కోరికను అంగీకరించి "దీనికి భిన్నముగా ప్రవర్తించువాడు క్రూరుడు" అని కూడా నిర్ణయించిరి.

తాము పోషించుకునే పశుపక్ష్యాదులకు గాని, వ్యక్తులకు కాని సరియైన ఆహారమునందించుట పోషకుని బాధ్యతయని, పశువుల యొక్క పాలను దూడలను లేకుండా పూర్తిగా పోషకుడు స్వీకరించుట దోషమని స్పష్టము చేసినదీ కథానిక.

**అధ్యయనానికి అంతున్నదా:**

**భరద్వాజో హ త్రిభిరాయర్భిర్బ్రహ్మచర్యమువాస... ఏషా ఏవ త్రయీ విద్యా**

(తైత్తరీయ బ్రాహ్మణ 3 అష్ట కం. 10 ప్ర. 11 అను.)

భరద్వాజుడు మూడు ఆయుర్దాయభాగములను పొంది బ్రహ్మచర్యమును పాటించుచు వేదాధ్యయనము చేయుచుండెను. గడువు ముగిసిన వేళకు వార్ధక్యముచే కృశించి శయనించియున్న భరద్వాజుని వద్దకు ఇంద్రుడు వచ్చి "నాల్గవ ఆయుః కాలమునివ్వగలము నీవేమి చేతువని" అడిగెను. "బ్రహ్మచర్యమునందే ఉండి వేదాధ్యయనం చేయగల" నని పల్కెను. తక్షణమే ఇంద్రుడు ఋగ్యజుస్సామములను మూడు వేదములను మూడు పర్వతములుగా చూపించి మూడింటి నుండి మూడు పిడికిళ్ళను తీసి ఇంతకాలము "నీవధ్యయనము చేసినదింతమాత్రమే" యని చెప్పెను. "నీకు వేదాధ్యయన ఫలము లభింపవలెనన్న సావిత్ర్యగ్నిని ధ్యానించి ఆదిత్య సాయుజ్యమునందు"మని ఇంద్రుడు తెల్పగా, భరద్వాజుడట్లే గావించెను.

జీవితాంతము బ్రహ్మచారిగా ఉండి అధ్యయనము చేయుటకాదు. విజ్ఞానమనంతమైనది కాని లభించిన విజ్ఞానముతోనే నీవు తేజోవంతుడవై నీ చుట్టూ ఉన్నవారికి విజ్ఞానకాంతిని ప్రసాదించమని సూచించినదీ కథానిక.

కథలో సంక్షిప్తత, సమగ్రత, సంభాషణల సొగసు, ఉపదేశము, పరిమితమైన పాత్రలు ఇవన్నీ కలబోసుకొని అనేక అంశములను కథల ద్వారా విశదపరచిన అనువాకములు వేదవాఙ్మయమున ఎన్నో కలవు. కాని వానిని పరిశోధించి సామాన్య పాఠకులందించవలసిన బాధ్యత వైదిక సంప్రదాయాభిజ్ఞులపై కలదు. అందులో భాగంగానే నేను చేసిన ఈ చిన్ని ప్రయత్నము.

వైదిక సాహిత్యాన్ని అధ్యయనం చేయడానికి ఈ వ్యాసం చిన్న చిరుదివ్వె కావాలన్నది నా ఆకాంక్ష.

# కథకు కాదు కథానికకు శతజయంతి

డా. వేదగిరి రాంబాబు

కథకు శతమానం! కానేకాదు, కథకు వందల సంవత్సరాల చరిత్ర ఉంది. కాకపోతే కథానికకు వందేళ్ళు!

ఎక్కడో ఆకాశంలో ఉండేది అప్పట్లో కథ. కనిపించని దేముళ్ళ ద్వారా మనలో విలువల్ని పెంచడానికి కథలు రాసేవారు. కల్పిత ప్రధానంగా ఉండేవి. ఆ తర్వాత రాజుల చుట్టూ కథలల్లేవారు. క్రమంగా నేలమీదికి దిగింది కథ. ఎలా? ఎప్పుడు?

ఏ ప్రక్రియ అయినా ఒక్కసారిగా ఒకరితో పుట్టుకురాదు. కొంత పరిణామం తర్వాతనే ఒకరి చేతుల్లో ఆఖరికి పరిపూర్ణతని పొందవచ్చు.

1848లో ఎడ్మండ్ షార్కె సంపాదకత్వంలో 'హితవాది' అనే పత్రిక ప్రారంభమైంది. ఎడ్మండ్ షార్కె రచయిత కూడా. అందుకని భారతీయ స్త్రీల స్థితిగతుల్ని మెరుగు పరచాలనే ఉద్దేశంతో, అందుకు కావలసిన అవగాహనను స్త్రీలలో పెంచే ఉద్దేశంతో ఆంగ్లంలోని కొన్ని షార్ట్‌స్టోరీస్‌ని తెలుగులోకి అనువదించి ప్రచురించారు. అలా ఆయన మనచుట్టూ సమాజంలోని సంఘటనలు, పాత్రలను వస్తువుగా తెచ్చుకుని కథలు చెబితే బాగుంటుందనే ఆలోచనని తెలుగు రచయితలు, రచయిత్రులలో కలిగించాడు. అప్పటికి టైప్ సెట్టింగ్ కూడా రాలేదు. పేజ్ పేజ్ లని బ్లాక్ చేయించి ప్రచురించేవారు. ఇప్పటికీ కొన్ని హితవాది పత్రికల కాపీలు లండన్ మ్యూజియమ్‌లో ఉన్నాయి.

ఈ ప్రభావంతో కథావస్తువులో మార్పు వచ్చింది. సమాజంలోని కొన్ని సంఘటనలు పాత్రలకు అద్దం పడుతు కథలు రాయసాగారు. కానీ భాష మరికొంతకాలం గ్రాంథికమే నడిచింది. వ్యవహార భాషోద్యమంలో గిడుగు రామ్మూర్తి పంతులుగారు, గురజాడ అప్పారావు గారు విశేష కృషి సల్పారు. కేవలం చర్చల్లో పాల్గొనడం ప్రసంగాలు చేయడమేకాకుండా తామంతకు ముందు గ్రాంథిక భాషలో రాసిన రచనల్ని గురజాడ వెంకట అప్పారావుగారు వ్యవహారిక భాషలోకి

తిరగరాసారు. అలా ముందు గ్రాంథికంలో రాసి, తర్వాత వ్యవహారిక భాషలో తిరగరాసిన కథ 'దిద్దుబాటు'. ఆ పరిణామం మనకి గురజాడ వారి దగ్గరే కనిపిస్తుంది. ఆయనను ఆయన దిద్దుబాటు చేసుకుని దిద్దుబాటు కథానికని వ్యవహారిక భాషలోకి తిరగరాసారు. అందుకే భాషరీత్యా కథ సంపూర్ణ ఆధునికతని సంతరించుకుంది గురజాడ గారి చేతుల్లోనే. దిద్దుబాటు శిల్పరీత్యా కూడా అంతకు ముందు వచ్చిన కథలకు భిన్నంగా ఉంది. ఈ కారణాల వల్ల గురజాడ వారి 'దిద్దుబాటు' తో కథ సంపూర్ణంగా ఆధునికతని సంతరించుకుందని స్పష్టంగా చెప్పవచ్చు.

ఆధునిక కథకు ఏమని పేరు పెట్టాలని రకరకాల చర్చలు జరిగాయి. 1928లో డి.ఎ. నరసింహంగారు ఓ వ్యాసం రాస్తూ ఈ కొత్త చిన్న వచన రచనకు 'కథిక' అని పేరు పెడితే బాగుంటుందని సూచించారు. ఆతర్వాత ఆయనే మరో వ్యాసంలో ఈ నవల్స్ వచన రచనకి పేరుని 'కథానకము' అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారు సూచించినట్లుగా తెలిసింది నేనింతకు ముందు సూచించినట్లు 'కథిక' అనే పేరుగాక 'కథానకము' అన్న పేరే బాగుంది. పండితులు ఆలోచింతురు గాక. అని రాసారు.

అప్పటికే కొందరు ఈ ప్రక్రియ ఆంగ్ల షార్ట్‌స్టోరి ప్రభావంలో వచ్చిందని భావిస్తూ షార్ట్ స్టోరీకి తెలుగు పదాలైన చిన్న కథ, హ్రస్వకథ పేర్లతో పిలనసాగారు. 1936లో 'భారతి'లో ఓ వ్యాసాన్ని రాస్తూ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ఇలా కథిక, కథానకము, చిన్నకథ, హ్రస్వకథ అని తలకో పేరుతో గాక 'కథానిక' అనే పేరుతోనే అందరు పిలిస్తే బాగుంటుంది. అగ్ని పురాణంలో వచన రచనలు అయిదు రకాలన్నారు కథ, కథానిక కూడా వాటిలో ఉన్నాయి. లక్షణాల్ని బట్టి చూస్తే ఆ కథానిక లక్షణాలు, ఈ చిన్న కథ లక్షణాలు ఒకటే. అందుకే ఆ పేరు సూచిస్తున్నాను. ఆంగ్ల ప్రభావంతో ఈ ప్రక్రియ తెలుగులో రాలేదు. మన ప్రాచీన సాహిత్యంలో కథానికలున్నాయి అన్నారు.

అగ్ని పురాణం బట్టి చూసినా కథ, కథానిక రెండూ వేరు వేరు. ఆంగ్లంలో కూడా స్టోరి, షార్ట్‌స్టోరీ రెండూ ఉన్నాయి.

"పెద్ద కథను కుదించినంత మాత్రాన చిన్న కథ కాదు. పెద్ద కథ, చిన్న కథ రెండూ వేరు వేరు జాతులు. లక్షణాలు వేరు" అన్నారు 1928లోనే డి.ఎ. నరసింహగారు.

పెద్దకథ నేడు నవలగా స్థిరపడింది. మరి చిన్న కథను మనం కథానికగా ఎందుకు పిలువడం లేదు?

తర్వాత ఏమి జరుగుతుందో చదవాలన్న ఉత్కంఠ, గర్భంలో కరుణ రసం, సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తే ముగింపు - చిన్న కథ లక్షణాలు. క్లుప్తత, స్పష్టత, ఏకాంశం కూడా ప్రధాన లక్షణాలు అని చెప్పారు లాక్షణికులు.

వస్తువు అన్నింటిలో ఉంటుంది. కాకపోతే దానిని మలిచే తీరుని బట్టి ప్రక్రియ ఉంటుంది.

"లక్ష్యము, లక్షణాలు - రెండూ ముఖ్యమే. లక్ష్యాన్ని సాధించడానికి లక్షణాలు తోడ్పడుతాయి. లక్షణాలు చూపుడు వేలు లాంటివి. దిశ చూపిస్తాయి. రచయిత తన స్వశక్తితో దారి తీసుకుంటున్నా లక్షణాలు దిశని చూపిస్తాయి" అన్నారు శ్రీశ్రీ.

అంతేకాదు ఆయన "సృజనాత్మక రచయిత చీకటిలో తనదారి తాను తీసుకుంటే, విమర్శకుడు ఆ దారిలో టార్చ్‌లైట్ వేసుకుంటూ రచయిత ఎలా వెళ్ళాడో గమనిస్తాడు అంటూ రచయితల బాధ్యతతో బాటు విమర్శకుల అవసరాన్ని, బాధ్యతని కూడా చెప్పారు.

అలాగే ఇతర భాషల కథానికలు మన భాషలోకి రావాలంటే, అలాగే మన కథానికలు ఇతర భాషల్లోకి వెళ్ళాలంటే అందులో అనువాదకుల పాత్ర ఎంతో ఉంటుంది.

"రచయిత తన స్వశక్తితో తను రాస్తున్నా కథానిక శిల్పము, ఆత్మ పరిశీలనా శక్తి అందులో ఉండాలంటారు" కొడవటిగంటి కుటుంబరావు.

రచయితలు విమర్శకులు, అనువాదకులతో బాటు కథానికకు పాఠకులూ ఎంతో అవసరం. అందరూ కలిస్తేనే ఈ కథానిక పల్లకిని సక్రమంగా ముందుకు నడిపించగలరు.

# గొప్ప కథ అంటే...?

వరిగొండ కాంతారావు

సంఘటనల సమాహారమే జీవితం. ఒక్కొక్క సంఘటన ఒక్కొక్క అనుభవాన్ని కలుగజేస్తుంది. అది సుఖం కావచ్చు దుఃఖం కావచ్చు. ఆయా అనుభవాలను బట్టి మానవుడు తన ప్రవర్తనా సరళిని మార్చుకుంటూ ఉంటాడు లేదా మలచుకుంటూ ఉంటాడు.

తమ గతాన్ని వివేచనతో అనుశీలనము చేసికొనగలిగినవారు తమ అనుభవసారాన్ని పరులకు పంచే యత్నం చేస్తారు. విన్నవారికి అది కథలా తోస్తుంది. జీవితంలో గడచిపోయిన ప్రతిక్షణమూ గాథగా మారిపోతుంది. అంటే ప్రతి కథలోనూ ఒక జీవితముందన్నమాట.

నవల, నవలిక, పెద్ద కథ, కథానిక, గల్పిక ఇత్యాదులన్నీ కథ నిడివిని బట్టి, చెప్పే విధానాన్ని బట్టి నిర్ణయించబడ్డ పేర్లే. అన్నింటిలోనూ కథే ప్రాణం. కథ అంటే జీవితం.

మానవుడు తన అనుభవాన్నుండే సృష్టి సమస్తాన్నీ అర్థం చేసుకోవాలంటే సాధ్యమయ్యే విషయం కాదు. అందుకు ఒక జీవితం చాలదు. ఈ కారణంగానే – 'తెలివైన వారు పరుల అనుభవాలనుండి నేర్చుకొంటారు' అన్న సామెత పుట్టింది. పరుల అనుభవాన్ని ఎటువంటి బిడియమూ, సంకోచమూ లేకుండా సంపూర్ణమైన వివేచనతో స్వంతం చేసికొని మన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకొందుకు తోడ్పడే ఉపకరణం పేరే కథాసాహిత్యం.

సంఘటనల సమాహారంగా జీవితాన్ని చిత్రించే ప్రయత్నం నవల అయితే ప్రభావశీలత కలిగిన ఒకటి రెండు సంఘటనలను ఆధారం చేసికొని, వాని కారణంగా ఆయా వ్యక్తుల జీవితాలలో కలిగిన లేదా కలుగబోయే మార్పులను సూచించే యత్నం కథదన్నమాట. విస్తృతి నవల లక్షణం. క్లుప్తత కథకు ఆభరణం.

జీవితమంటే వాస్తవం. వాస్తవ సంఘటనను అక్షరబద్ధం చేస్తే వార్త అవుతుంది. యథార్థ సంఘటనల సమాహారం చరిత్ర అవుతుంది. ఇందుకు భిన్నమైంది కథ.

కథ వాస్తవంగా ఉండాలి. వాస్తవం కాకూడదు. వాస్తవ సంఘటనలకు కొంత ఊహ జోడింపబడాలి. నేపథ్యం కల్పింపబడాలి. సంఘటన ఆంతర్యం పాఠకుడి ఊహకు అందాలి. ముగింపులో భవిష్యత్తు దర్శింపబడాలి. అందులో సందేశ ముండాలి. ఇన్ని వున్న దాన్నే కథ అనాలి.

ఈ విశ్వమంతా భగవంతుని రచనగా పెద్దలు చెబుతుంటారు. కాని ఈ సృష్టిలోని ఏ ప్రాణీ తాను భగవంతుని చేత సృష్టింపబడినానని కాని, చేసే ప్రతి పనీ ఆయన ఆజ్ఞలకు లోబడి మాత్రమే చేస్తున్నానని కాని భావించడం లేదు. ప్రతి ప్రాణి తన ఇచ్ఛానుసారమే నడుస్తున్నాని భావిస్తున్నది. మానవుడు ఒక అడుగు ముందుకు వేసి దేవుడనేవాడు తానున్నాడనుకుంటే ఉన్నట్లు, లేడనుకుంటే లేనట్లుగా భావిస్తున్నాడు. భగవంతుని గొప్పతనమంతా ఇక్కడనే వున్నది. తన ప్రమేయమే లేనట్లుగా ఈ సృష్టిని నడుపుతున్నాడు.

కొన్ని కథల్లో పాత్రలు ప్రాణంతో నడచివస్తాయి. స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. పాఠకుడు పాత్రల సమాజంలోకి వెళ్లిపోతాడు. పాత్రలతో కలసి నవ్వుతాడు, ఏడుస్తాడు. పోరాడుతాడు, ఓదారుస్తాడు వెరశి జీవిస్తాడు. కథ చదవడం పూర్తికాగానే అప్పటిదాకా తనతో మాట్లాడిన వారేమయి పోయారా ! అని వెతుక్కుంటాడు. తియ్యని ఆ అనుభవాల్ని పొందేందుకు మరల మరల సంసిద్ధుడవుతాడు. కథ చివరి పేజీ నుండి మొదటి పేజీకి వచ్చేస్తాడు. కథలోని పాత్రలు రచయిత సృజన అన్న స్పృహ పాఠకుడికి ఉండదు. అలాంటి రచన భగవంతుడి సృష్టితో సమానం. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి 'దూమూవూలు'. విశ్వనాథ సత్యనారాయణ గారి 'చామర గ్రాహిణి' వంటి కథలు ఈ సందర్భంగా జ్ఞాపకానికి వస్తాయి.

గొప్ప రచయిత రాసిన కథలన్నీ గొప్పగా ఉండాలన్న నియమేమీ లేదు ఉంటాయన్న నమ్మకమూ లేదు. కన్ను వంకరా కాలు వంకరా భగవంతుడి సృష్టిలోనే తప్పలేదు. దేముడి ముందు మనిషెంత? కథ గొప్పతనమే రచయితకు ఆపాదింప బడుతుంది. రచయిత గొప్పతనం కథకు వారసత్వంగా రావాలని లేదు. అయితే ఒకటుంది. ఒకే విషయాన్ని ఔత్సాహికుడు కథగా రాసిందానికీ, చేయి తిరిగిన రచయిత రాసిందానికీ తేడా వుంటుంది. అభ్యాసం కూసు విద్య అన్న మాట. కథ

గుర్తులేకుండా కథకుడు గొప్పవాడు అని ప్రతిపాదించడం అసందర్భంగా తోస్తుంది. కథకుడు గుర్తులేక పోయినా కథను వినడానికి ఎవరికీ అభ్యంతరముండదు. సమాజానికి కథ వల్లనే ప్రయోజనం. కథకుడు నిమిత్తమాత్రుడు. 'యజ్ఞం' కథ లేకుండా కా.రా మాష్టారు లేరు. కనీసం 'గొల్ల రామవ్వ' కథను గుర్తు చేసుకోకుండా పాములపర్తి వేంకటనరసింహారావు గారు గొప్ప కథకుడు అని చెప్పి ప్రయోజనం లేదు.

ఆధునిక కథానికలలో తొలి కథగా చెప్పబడుతున్న 'దిద్దుబాటు' నుండి నేటివరకు ప్రతి కథకుడూ 'దిద్దుబాట'లోనే వున్నాడు. ఉత్తీర్ణతాశాతంలో తేడాలుండవచ్చును. 'దిద్దుకోవడం'లో లోపం లేదని చెప్పవచ్చును.

గురజాడ 'దిద్దుబాటు' కన్నా ముందే వ్రాయబడ్డ కథ బండారు అచ్చమాంబ 'ధన త్రయోదశి' అనే కథ. ఇది ఇటీవలే నిర్ధారింపబడిన విషయం. ఆధునిక కథానికలో ఉండాల్సిన కథా కథన నైపుణ్యం బండారు అచ్చమాంబ కథలో పుష్కలం. అది నేటి కథానికా రచయితలందరికీ ఆదర్శప్రాయం.

వస్తువు బలంగా ఉంటే కథ బలంగా వస్తుంది. వస్తువు జటిలంగా ఉంటే కథ కూడా జటిలంగా ఉండాలి. కాని కథ సరళంగా వస్తుంది. జటిలమైన సందర్భాన్ని సులభతరం చేసేవాడే గొప్ప కథకుడు. సమస్య ప్రాముఖ్యతను రచయిత తగ్గించదు. సమస్యను పాఠకుడికి అర్థమయ్యేస్థాయికి తీసుకురావడంలోనే రచయిత ప్రతిభా వ్యుత్పత్తులు ద్యోతకమవుతాయి. అలాంటి కథలకు పాఠకలోకం నీరాజనమిస్తుంది.

రచయిత తనుకన్న దాన్నో, విన్నదాన్నో, స్వయంగా అనుభవించిన దాన్నో కథగా మలుస్తాడు. విన్నదైనా, కన్నదైనా అనుభవించినదైనా ఆవిషయాలన్నీ వైయక్తికాలు. అనుభవ కేంద్రకములోనున్న వ్యక్తి దృష్టికి మాత్రమే సబబుగా తోచే విషయాలవి. అట్లాంటి వస్తువుకు యథాతథంగా అక్షరరూపాన్నిస్తే కథకుడే తన కథను తాను రెండవసారి చదువుకోలేడు. వ్యక్తిగత అనుభవం సార్వజనీనమవ్వాలి. ప్రతి పాఠకుడూ కథలో జరిగే సంఘటనలతోనో, అందలి పాత్రలతోనో మమేకం కాగలగాలి. ఏదో ఒక పాత్రలో పాఠకుడు తనను తాను చూచుకోగలగాలి. లేదా కథ లోని ఏదో ఒక పాత్రకు తన పరిచయస్తులలో ఎవరితోనో ఒకరితో ఏదో ఒక పోలిక ఉన్నట్లుగా తోచాలి. 'ఈ సంఘటన నా జీవితంలో నిజంగానే జరిగిందా !

నేను మరచిపోయివుంటానా !' అని పాఠకుడికి అనుమానం రావాలి. లేదా 'ఇలాంటి సంఘటన నా జీవితంలో జరిగితే ఎంత బాగుండును' అని కానీ, 'అయ్యబాబోయ్'! ఈ అనుభవం పగవాడికి కూడా రాకూడదు బాబూ !' అని కానీ అనిపించాలి.

ఎంతో తపస్సు చేస్తే తప్ప ఆ స్థాయిలో కథను రాయడం సాధ్యం కాదు. అందుకే అన్నారు 'నానృషిః కురుతే కావ్యం' అని. అదృష్టవశాత్తు తెలుగు వారికటువంటి ఋషితుల్యుల కొరతలేదు.

కొన్ని కథలు పాఠకుణ్ణి వెంటాడుతుంటాయి. ఓపట్టాన వదలవు. 1966, 67 ప్రాంతంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో అచ్చైందీ కథ. శీర్షిక 'ఆత్మహత్య పూర్వకథ' అన్నట్లుగా జ్ఞాపకం. రచయిత పేరు గుర్తు లేదు. బ్రతుకు తెరువు కోసం కలకత్తా వస్తాడు కథానాయకుడు. ఏమీ సాధించలేక పోతాడు. చనిపోవడమొక్కటే మార్గంగా తోస్తుందతడికి, తానెందుకు చావాలనుకుంటున్నదీ వివరంగా ఇంటికి ఉత్తరం రాస్తాడు. స్టాంపులతికిస్తాడు. రాత్రి పదిగంటలప్పుడు ఉత్తరం పోస్టు చేయడానికి వెడతాడు పోస్టు చేస్తాడు. తిరిగి వచ్చేప్పుడు అంతర్మథనం మొదలవుతుంది. ఎక్కడో టీ త్రాగుతాడు. బ్రతకాలని నిశ్చయించుకుంటాడు. విజయం సాధించి తీర్తానను కుంటాడు. ఇంటికి వస్తాడు. అతడుండే ఒంటిగది దగ్గరగా వేసి వుంటుంది. 'తాళం వేయడం మరిచానా' అనుకుంటూ చీకట్లో లోపలికి అడుగుపెడతాడు. లోపల దొంగ ఇతడాత్మహత్య చేసికొందుకు పెట్టుకొన్న వైరునుపయోగించి గొంతుకురిబిగించి చంపేస్తాడు. కథను ఇక్కడితో ఆపేసాడు రచయిత.

అతడు హత్య చేయబడ్డాడు. ఇంటివాళ్ళు ఆత్మహత్య అనుకుంటారు కదా! అన్న విచికిత్సలో పాఠకుడు మునిగిపోతాడు. కాలినడకన కలకత్తా నగరంలో రాత్రి పదిగంటలకు కథానాయకుడి వెనకాల పాఠకుణ్ణి నడిపిస్తాడు రచయిత. ఈ కథ చదివిన వాళ్ళెవరైనా కలకత్తా వెళితే కథలోని ఆ వీధి కోసం వెతుక్కుంటారు.

సుమారు ముప్పై అయిదేళ్ళ క్రిందట 'ఆంధ్రభూమి' వారపత్రిక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ ఇలా ఉంది. అతడికి సింగరేణిలో ఉద్యోగం. ఉంటుందో పోతుందో తెలీదు. భార్య పోయింది. ఇద్దరాడపిల్లలు. హైదరాబాదు నుంచి దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాడు. సీట్లు లేవు. గుమ్మం దగ్గర ఇద్దరు పిల్లల్నీ

పడుకోబెట్టుకుకూచున్నాడు. అందులో ఓ పిల్లకి వళ్ళు తెలీని జ్వరం. కాజీపేట దాటాక జ్వరం పిల్ల చచ్చిపోయింది. అంత్యక్రియలకి డబ్బుల్లేవు. రామగుండం దాటాక చచ్చినపిల్లని రైల్లోంచి గోదార్లోకి విసిరేశాడు. మంచిర్యాల వచ్చాక రైలు దిగేందుకు పడుకున్న పిల్లని లేపుతుంటే తెలిసింది అది పిల్ల కాదు శవమని. (ఈ రచయిత పేరూ జ్ఞాపకం లేదు).

ఈ కథలెప్పుడు జ్ఞాపకానికి వచ్చినా మనసు మ్లానమవుతుంది. ఇది రచయిత విజయానికి చిహ్నం.

వరుస అపజయాలు మనిషిని అథఃపాతాళంలోకి నెట్టేస్తాయి. ఏ ఆనందమూ అతణ్ణి మామూలు మనిషిని చేయలేదు. లోకమంతా తనదుఃఖాన్ని మాత్రమే కోరుకుంటున్నట్లనిపిస్తుంది. తనంతటి దురదృష్టవంతుడు ఈ లోకంలోనే లేడనిపిస్తుంది. అట్లాంటి మనిషి తన జీవితకాలపు బరువును దించేసుకుని తేలికపడ్డ మనస్సు వాడవుతాడు. కారణం తనకన్నా పదిరెట్లు ధీమాగా జీవిస్తున్న వ్యక్తికి తన కన్నా పదిరెట్ల కష్టాలున్నాయన్న సత్యాన్ని తెలుసుకోవడం. 'విహారి' గారి నిరాడంబరమనిపించే శిల్ప నైపుణ్యాన్ని దర్శించాలంటే 'స్పృహ' అన్న ఈ కథను చూడాల్సిందే.

కుంతి కర్ణుణ్ణి నదిలో వదిలేసింది. ఉంచుకోలేదు. అలా అని చంపనూలేదు. అందుకే పెట్టెలో పెట్టి యమునలో వదిలేసింది. ఆ శిశువు ఏమైనాడో కర్ణుడు తారసపడేంత వరకూ ఆమెకు తెలియదు. ఇదే కథను 'తల్లీ – పిల్లా' పేరుతో డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు రాశారు. తేడా ఏమంటే తన పిల్లని ఎవరు పెంచుకుంటారో తెలుసుకోవాలనుకుంటుంది విధవరాలైన ఆ భిక్షుకి. అందులో ఆమెకెదురైన నిరాశ గుండెల్ని పిండిచేస్తుంది.

వక్కంతం సూర్యనారాయణరావు రచించిన 'మోడల్' అన్న కథ పాఠకుడిని దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. కడుపుతో ఉన్న కోడలి నగ్నరూపాన్ని మామగారు తైలవర్ణాలలో చిత్రీకరిస్తాడు. ఇది అధర్మం. అసమంజసం అనిపిస్తుందెవరికైనా. కాని పాత్రల సంభాషణ, పాఠకుడి నిజాయితీని ప్రశ్నిస్తుంది. అతడి ద్వంద్వవైఖరిని చీల్చి చెండాడుతుంది. ఏది కళ ఏది అశ్లీలం అన్న ప్రశ్న పాఠకుడిని నిరంతరం వెంటాడుతూనే వుంటుంది.

జైలరుకు పని ఉండి పొరుగూరు వెళ్ళాలి. అందుకని ఖైదీని ఓ రోజు ముందే ఉరితీయిస్తాడు జైలరు. ఊరి నుండి తిరిగివచ్చిన జైలరు ఖైదీ ఉరిశిక్షరద్దయినట్లుగా వచ్చివున్న ఉత్తర్వులను చూచుకొంటాడు. ఇది చా.సో. గారి కథ.

పై కథల్లో ఎక్కడా రచయిత కనపడడు. రచయిత ఏమీ చెప్పడు. నీతి వాక్యాలుండవు. ఎక్కడికక్కడ పాఠకుడి హృదయానికి చిల్లులు పడిపోతూ వుంటాయి. ఇలాంటి కథలకు మరణముండదు. వాటిని సృజించిన కథకులు సైతం అజరామరులే.

వడ్డాది పాపయ్య, బాపూ వంటి చిత్రకారుల బొమ్మలకి సంతకాలవసరం లేదు. ఆ రేఖలు అనితరసాధ్యాలు, అందరికీ సుపరిచితాలు. ఎవరైనా కష్టపడి అనుకరించి ఓ బొమ్మను స్వంతంగా వేసినా 'బాపూ బొమ్మ కింద నీపేరు రాసుకొన్నా వేమిటోయ్ !' అని మందలిస్తారు తప్ప ఆ చిత్రకారుణ్ణి ఎవరూ అభినందించరు. వారి బొమ్మలే వారి సంతకాలు.

విశ్వనాథ, కొడవటిగంటి, రావిశాస్త్రి, బీనాదేవి, ముళ్ళపూడి వంటివారికి కూడా వారి కథలే వారి సంతకాలు. కథ కింద పేరు రాసుకోవాల్సిన అవసరమే లేదు వారికి.

అందరికీ అందని గొప్ప కథలూ వుంటై. చలం గారి 'ఓ పూవు పూసింది', బుచ్చి బాబు గారి – 'చైతన్య ప్రవంతి' అందుకు తార్కాణాలు. కాసారం లోతెక్కువై ఊపిరాడనివ్వని కథలు గోపీచంద్ వైతే – కాసారం తీరు తెన్నుల్ని తెలియజెప్పడానికి పూసిన కమలాలు – మధురాంతకం రాజారాం కథలు. మధ్యతరగతి మందహాసానికి మారుపేరు ఇచ్ఛాపురం జగన్నాథం కథలైతే, స్థానిక నేపథ్యాన్ని సుగంధ భరితంగా పట్టిచ్చే కథలు పొట్లపల్లి రామారావువి. నవలా సేద్యం చేసే డా॥ అంపశయ్య నవీన్ అంతర్‌పంటగా, చూడగానే తినాలనిపించే కథల కూరగాయల్ని కూడా పండిస్తూంటారు.

'గాలివాన'తో తెలుగు కథకు అంతర్జాతీయ స్థాయిని కల్పించిన పాలగుమ్మి పద్మరాజునీ, కథా శిల్పంపైన తనదైన ముద్రవేసిన బలివాడ కాంతారావునీ, గిన్నిస్

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు గుర్తింపదగిన సంఖ్యలో కథలను సృష్టించిన డా॥ కాలువ మల్లయ్యనూ ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.

కథ వ్యాసం కాదు. సిద్ధాంతం కాదు. వాదం కాదు. భేదం కాదు. కథంటే జీవితం. జీవితమంటే ప్రాణం. బ్రతికి ఉన్న మనిషి నేను బ్రతికున్నానని చెప్పుకొనే అవసరంలేదు. ప్రాణమున్న కథ కూడా అంతే. కథలో ప్రాణమున్నన్నాళ్ళూ కథకుడు జీవించేవుంటాడు.

తెలుగు సాహిత్య క్షేత్రం సారవంతమైంది. అందులో కథలను పండించే వారి సంఖ్యా గణనీయమైనదే. పండిన పంటలో పోవలసినంత తాలుపోయినా పురికట్టిన గుమ్ములలో (గాదెలలో) నాలుగు కాలాలపాటు దాచుకోవలసిన గింజగలిగిన ధాన్యమూ చెప్పుకోదగినంత వున్నది.

గుమ్ముల్లోని ధాన్యాన్ని కుంచాలతో కొలిచే శక్తి ఈ వ్యాసకర్తకు లేదు. కాని అక్కడక్కడా పురులసందుల్లోంచి బయటకు తొంగిచూస్తున్న ధాన్యపు గింజల్ని సన్నగా బయటకు లాగి 'ఇది నాణ్యమైన పంట సుమా !' అని చెప్పే ప్రయత్నం మాత్రం జరిగింది. ఉటంకింపబడని కథకులు మన్నింతురు గాక ! పాఠకులు క్షమింతురుగాక !

# మాజిక్ రియలిజం అంటే నిజంగా ఏమిటి? (కథ)

**ఆడెపు లక్ష్మీపతి**

"మాజిక్ రియలిజం అంటే ఇక్కడ లోకాన్ని సరికొత్తదిగా గుర్తిస్తాము. మనం ఒక స్వప్నంలోంచి మేల్కొన్నందు మూలంగానే కాదు – దాన్ని ఒక నూతన దృష్టిలో వీక్షించడం మూలంగా కూడా పూర్తిగా ఈ జగత్తుకు సంబంధించిన ఐహిక వస్తుజాలాన్ని వైభవంగా చూపే ఒక వినూత్నశైలి మన కళ్లముందర నిలబడుతుంది. చలామణిలో ఉన్న వాస్తవికత భావనకు ఈ సరికొత్త వస్తు ప్రపంచం ఇంకా పరాయిదే. సమస్త దృగ్విషయాలకు ఒక ప్రగాఢమైన అర్థాన్ని సమకూర్చే దిశగా మాజిక్ రియలిజం పలు సంవిధానాల్ని వినియోగించుకుంటుంది. సరళమైన, నిష్కపటమైన విషయాల నమ్మకమైన ప్రశాంతతకు ముప్పుగా పరిణమించగల వాటి నిగూఢార్థాన్ని బహిర్గతం చేస్తుంది. అస్తిత్వంలోని మహత్తూనూ, అప్పటికే తమ స్వంత ముఖాలు కలిగివున్న వస్తువుల ఆవిష్కరణనూ ఆరాధించమంటుంది. అంటే ప్రపంచంలోని అత్యంత భిన్నమైన భావనలు అంకురించి పల్లవించే ఒక సుక్షేత్రం వినూత్న విన్నాణాల్లో పునర్జయించబడిందన్నమాట ! నిజం చెప్పాలంటే బహిర్ అంతర్ చిత్రాన్ని సహజాత పద్ధతిలో ఆవిష్కరించడమే ఈ కళా ప్రయాస అంతానూ....."

నైరూప్య చిత్రకళతో విసుగెత్తిన పోస్ట్ – ఎక్స్‌ప్రెషనిస్టులు తిరిగి రూపచిత్రకళను అనుసరిస్తూన్న దశలో, అందులో కొత్తపుంతలు తొక్కిన చిత్రకారుల శాఖను శ్లాఘిస్తూ ఫ్రాంజ్‌రోహ్ అనే కళా విమర్శకుడు 1925లో "మాజిక్ రియలిజం; పోస్ట్ ఎక్స్‌ప్రెషనిజం" అనే పుస్తకం వెలువరించాడు. జర్మనీకి చెందిన ఫ్రాంజ్‌రోహ్ తనను అమితంగా ఆకర్షించిన ఆ కొత్త చిత్రకళాశైలిని 'మాజిక్ రియలిజం'గా పిలిచి, దాని స్వరూప, స్వభావాల్ని పైవిధంగా అభివర్ణించాడు. విరోధాభాసమైన అంశాలను లేక చిత్ర విచిత్ర రూపాలను పక్కపక్కనే నిలబెట్టి, మామూలు వస్తువులను మార్మికత్వం ఆవిష్కరించే కోణంలోంచి చూపుతూ ఒక అవాస్తవిక, స్వాప్నిక అనుభూతిని స్ఫురింపజేయడం, ఛాయాచిత్ర సదృశ వస్తు స్వాభావికతను ఒక స్వాప్నిక దృశ్యంలాగా ప్రతిబింబించటం ఆ ప్రక్రియ ముఖ్య లక్షణం.

రెండు ప్రపంచయుద్ధాలు యూరపుఖండంపైన అమితమైన ప్రభావం చూపాయి. వీటి మధ్యకాలంలో పలు సామాజిక, రాజకీయ ఉద్యమాలు అక్కడ

తలెత్తాయి. కొత్త దార్శనిక సిద్ధాంతాలు. భావనలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. సాహిత్య, కళారంగాల్లో పొడసూపిన మార్పులు, ప్రయోగాలు ఆ ఉద్యమాలతో మమేకమయ్యాయి. స్వీడిష్ నాటకకర్త ఆగస్ట్‌స్ట్రిండ్‌బెర్గ్ బలమైన ప్రభావంతో మొదలయిన ఎక్స్‌ప్రెషనిస్టు ఉద్యమం 1915-1925ల మధ్యకాలంలో జర్మనీదేశంలో పతాకస్థాయికి చేరుకుంది. ఈ వాదం సంగీత, సాహిత్య రంగాల్లో బాగా ప్రదర్శితమైంది. నాటకరంగంలోనైతే మరీ ప్రతిభావంతంగా వ్యక్తీకరించ బడింది. వాస్తవికతావాదం మీద మౌలికమైన ఎదురుదాడి చేయడం ఎక్స్‌ప్రెషనిజం ప్రధానోద్దేశం. ప్రపంచాన్ని యధాతథంగా మన కళ్లముందర వస్త్వాశ్రయిక ధోరణిలో నిలబెట్టడానికి బదులు రచయిత, తన లేదా ఒకానొక పాత్ర ఉద్వేగభరితమైన, కల్లోలభూయిష్టమైన, అసాధారణ స్థితిలోని మానసిక కోణంలోంచి ప్రపంచం కనపడుతున్న తీరును అంతరంగికానుభవాల ద్వారా వ్యక్తీకరించే ప్రయత్నం చేస్తాడు. దారీ తెన్నూ కానరాని గందరగోళం దిశగా గుడ్డిగా పయనిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక యుగపు సమాజంలో నిత్యం అందోళనతో, అభద్రతతో సతమతమవుతున్న ఆధునిక మానవుని మానసికస్థితిని మనకు స్ఫురియింజేయడమే ఈ ధోరణి ముఖ్య లక్ష్యమని మనం అర్థం చేసుకోవాలి. 1920లో వచ్చిన సినిమా 'The cabinet of Dr. Caligari' యూజీన్ ఓనీల్ నాటిక 'Emperor Jones' లని ఇందుకు మంచి ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఆంద్రేబ్రెటన్ అనే ఫ్రెంచి కవి విమర్శకుడు 1924లో వెలువరించిన 'Manifesto of Surrealism' తో సర్రియలిజం ఒక మూకుమ్మడి ఉద్యమంగా బయలుదేరింది. మనిషి స్వేచ్ఛాయుత ఆలోచనా స్రవంతికి అవరోధంగా నిలిచిన అన్ని అడ్డంకులనూ బద్దలు కొట్టడమే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యం. తార్కిక వివేచన, ప్రామాణీకృత నైతిక నిబద్ధత, సామాజిక, కళారంగపు కట్టుబాట్లు, పూర్వ నిర్ధారిత, లక్ష్యంతో, దురాలోచనతో కళాత్మక సృజనకు అధీనరేఖలు గీయడం, వగైరాలు సర్రియలిస్టులు భావించిన సదరు అడ్డంకులు. నిజమైన జ్ఞానానికీ, కళాసృష్టికీ ముఖ్యనిధిగా వాళ్లు ప్రతిపాదించుకున్న మనోసాగరం (deep mind) తన కర్తవ్యాన్ని నిరాటంకంగా కొనసాగించేందుగ్గాను సర్రయలిస్టులు సుప్తచేతన ప్రేరేపించిన స్వయంచాలిత రచనలకుపక్రమించారు. ఇందుకు వాళ్లు కలల సామాగ్రినీ, అర్థజాగృత డోలాయమాన స్థితినీ, సహజమైన లేదా కృతకంగా ఆపాదించుకున్న

భ్రమలనూ వాడుకున్నారు. ఈ ధోరణి ప్రాచుర్యంలోకి వచ్చేందుకు తన చిత్రకళ, శిల్పకళ, సహదర్శకత్వం వహించిన సినిమాల ద్వారా విశేష కృషి చేసిన సాల్వడార్ డాలీ 'క్రిటికల్ పారనోయా' సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఇందులో భ్రమాజనిత భావజాలంతో యదార్థ్యం మమేకమవుతుంది. తర్కంలోని వాద, ప్రతివాదనలు ఊహా ప్రపంచంలో అమోదయోగ్యమవుతాయి. స్థల, కాలాలకు సంబంధించిన సాధారణ భావన పనిచేయడం స్తంభిస్తుంది. ప్రతీదీ ఒక అమాయక దృష్టి చట్రంలోంచి దృశ్యమానం అవుతుంది. డైలాన్ థామస్ కవిత్వం, విలియం బరోస్ నవలలు ఇందుకు మంచి ఉదాహరణలు. చిత్రకళలో ఎక్స్‌ప్రెషనిజం, సర్రియలిజాల నడుమ పరివర్తన దశలో, అల్పాకాలికమే ఐనా, వెల్లువలా ఎగిసిబడ్డ మాజిక్ రియలిజం పలువురు విమర్శకులను కళాప్రియులను విశేషంగా ఆకర్షించింది. యుద్ధ భీభత్సాన్ని, యుద్ధానంతర భయంకర పర్యవసానాల్ని, మనిషి నిరాశా నిస్పృలనూ. కళాకారుని స్వేచ్ఛా తపనను కొత్త నమూనాల్లో ప్రతిబింబించి గాఢమైన ఆలోచనలు చూపరుల్లో రేకెత్తించింది. ఈ ధోరణికి మొదట్లో పికాసో, జార్జిగ్రాష్, మీరో, ఆ తర్వాత ఆక్సిడిట్టో, డీకిరికో, రినీమాగ్రిట్ ముఖ్య ప్రతినిధులు. డీకిరికో చేతిలో ఈ ప్రక్రియ పారభౌతికస్థాయికి చేరుకుంది. మెటాఫిజికల్, ఇంప్రెషనిస్టు, ఫ్యూచిరిస్టిక్ పెయింటింగుల మధ్య గల సునిశిత వ్యత్యాసాన్ని వివరిస్తూ 1925లో రాసిన ఒక వ్యాసంలో డికిరకో ఒకచోటా దృగ్గోచర దృశ్యకోణాని (perspective)కీ, పార భౌతికశాస్త్రాని (Metaphysics) కీ నడుమ గల సంక్షుభిత సంబంధాన్ని ఇలా విశదీకరిస్తారు. "కళకి సంబంధించిన ఏ పని ఐనా కానివ్వండి – అది తన భౌతిక పరిమితులకు అతీతమైనది మరేదో స్ఫురింపజెయ్యాలి. చిత్రించిన వస్తువూ, ఆకృతులూ కూడా భౌతికంగా తమ ఘనపరిమాణాల్లో ఏమి గుప్తంగా ఉంచుకున్నాయెూ కవితాత్మకంగా చెప్పాలి". ఈ ప్రక్రియ పోయి పోయి సర్రియలిజంగా పర్యవసించగల అనివార్యత గురించి చెప్తూ డీకిరికో ఇలా రాశాడు. "ఒక చిత్తరువు ఒక ప్రగాఢమైన సంవేదన ప్రతిఫలనం అన్న విషయం ఎవరూ మరిచిపోగూడదు – ప్రగాఢమైనది అంటే వినూత్నమైనది. వినూత్నమైంది అంటే స్వల్పంగా తెలిసింది లేదా పూర్తిగా తెలియనది అని అర్థం. ఒక కళాకృతి నిజంగా కలకాలం నిలవాలంటే అది మానవ పరిమితులకు ఆవల ఉండాలి. తర్కం గానీ, సాధారణ జ్ఞానం గానీ ప్రమాదకారి. అంటే అది స్వప్నానికీ, శైశవ మనస్తత్వానికీ

దాదాపు సమాన ప్రాగైతిహాస పూర్వయుగం మనకు ప్రసాదించిన అత్యంత గాఢమైన సంవేదన – భవిష్యత్ సూచనకీ, శకునాని (presage) కీ సంబంధించినది ఇది ఎల్లప్పుడూ మనతోనే వుంటుంది. విశ్వం అర్థశూన్యతకు ఇదో నిత్యనిదర్శనం లాంటిది...." కొండలాంటి వికారాకృతిలోని దుంపజాతి మొక్కలు, ఉపరితలం పాలరాతిలాగానూ, మాంసం ముద్దలాగానూ కనపడే స్థూపాలు ఈయన పెయింటింగులో కనపడతాయి 'The philosopher and the poet'. 'The seer', Hector' లాంటివి ఈయన ప్రసిద్ధ పెయింటింగులు.

ఫావిజం, కన్‌స్ట్రక్టలిజం, ఫ్యూచరిజం, కైనెటిక్ ఆర్ట్ వగైరాలు చిత్రకళని ముంచెత్తిన తరువాతి కాలంలో మాజిక్ రియలిజం మరుగున పడిపోయింది. ఫ్రాంజ్‌రోహ్ విమర్శాగ్రంథాన్ని అందరూ మర్చిపోయారు. ఆయన అమితంగా పొగిడిన ఆ తరహా చిత్రకళాశైలిని తరువాతి తరం వాళ్లు 'హైపర్రియలిజం' అనీ, 'న్యూ అబ్జెక్టివిటీ' అనీ పిలిచారు. చిత్రమేమిటంటే మాజిక్ రియలిజాన్ని చాలాకాలం వరకు కాల్పనిక సాహిత్యానికి అన్వయించడం జరగలేదు. 1970లో ఆంగ్లంలోకి అనూదితమై (1967లో స్పానిష్ భాషలో బ్యూనోస్ ఎయిర్స్‌లో వెలువడింది). న్యూయార్క్‌లో ప్రకాశితమైన 'One Hundred years of Solitude' నవల ఉభయభాషల్లో పాఠకలోకంలో ఘనవిజయం సాధించింది. ఈ నవల విలక్షణత, దీనిలోని శైలీ, శిల్పాలు చూసి అబ్బురపడ్డ విమర్శకులు కాల్పనిక సాహిత్యం మున్ముందు తీసుకోబోయే దిశను బహుశా లాటిన్ అమెరికాయే నిర్దేశిస్తుంది కాబోలు అని భావించారు. దీని రచయిత గాబ్రియెల్ గార్షియా మార్క్వెజ్ కొలంబియా దేశానికి చెందిన జర్నలిస్టు. మెక్సికోసిటి నుండి అకాపుల్కో పట్టణానికి కారులో ప్రయాణిస్తుండగా ఆ నవల ఇతివృత్తం, టెక్నిక్ అతని మస్తిష్కంలో తట్టాయి. 18 నెలల దీర్ఘకాలం ఇంటిపట్టునే కూర్చుండి నవల రచన పూర్తిచేశాడు. ఆ నవలలో ఉపయోగించిన శిల్ప సంవిధానం (technique) ఏ కోవలోకి వస్తుందా అని తర్జనభర్జనలు పడ్డ పండితులు, విమర్శకులు చివరికి అది 'మాజిక్ రియలిజం' అని సూత్రీకరించారు. వినూత్నమైన కథన పద్ధతిలో సాగిన మరికొన్ని రచనలపై దృష్టి సారించిన ఇంకొక విమర్శక వర్గం, జార్జిలూయీ బోర్గెస్ అనే అర్జెంటైనా రచయితను (Uqbar, Tion, Orbis, Tertius కథ) మాజిక్ రియలిజానికి ఆద్యుడుగానూ, ఫ్రాంజ్‌కాఫ్కా అనే చెకోస్లేవేకియా రచయితను (The Metamorphosis కథ) దానికి యురోపియన్ ప్రతినిధిగానూ పేర్కొంది. అయితే

పై రచయితలది ఫాంటసీ, వ్యంగ్యం బ్లాక్ హ్యూమర్ కలగలపిన యాంటీ-రియలిస్టు శిల్పం. సాల్మన్ రష్దీ Midnights children టోనీమారిసన్' 'Beloved', బెన్ ఓక్రీ 'The Famished Road' వంటి నవలలు పాఠకుల ఆదరణ పొందిన తర్వాతనే సాహితీ లోకంలో విస్తృతమైన చర్చ జరిగింది. వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. దరిమిలా, విస్తృతిలోనూ, నిర్వచనంలోనూ, అంతరార్థంలోనూ కొత్త సరిహద్దులను తాకిన ఆధునికోత్తరవాద శిల్పం మాజిక్ రియలిజయం అని పరిశోధకులందరూ అంగీకరిస్తున్నారు.

## 2

ఒక సమాజంలో రాజకీయ, సాంస్కృతిక, ఆర్థికపరమైన మార్పులు చోటు చేసుకుంటున్నప్పుడు మనిషి నిజ అస్తిత్వస్థితి (ontological) కి సంబంధించిన సరిహద్దురేఖలూ చెరిగిపోతాయి. అప్పటి సంక్లిష్ట వాస్తవికతను సంపూర్ణంగా చిత్రించేందుకూ, సంధికాలంలోని సదరు సమాజపు సంక్షుభిత చైతన్యాన్ని ప్రతిఫలింపచేసేందుకు అక్కడి రచయిత ఒకేసారి గత, వర్తమాన, భవిష్యత్కాలాల అవగాహనా చట్రంలోంచి కలైడోస్కోప్ లాంటి కథనం సాగిస్తాడు. ఫలితంగా, గాఢ కవిత్వం కదనుతొక్కే ఇతిహాసకావ్యం, వీరగాధ, జానపద కథ, గోథిక్ వర్ణనలు, రొమాంటిక్ సాంప్రదాయాలు, భీభత్స రస ప్రధాన స్వైరకల్పనలు, ఒళ్లు గగుర్పొడిచే సమకాలీన పచ్చి వాస్తవికత - ఈ లక్షణాలన్నింటినీ కలగలుపుకుంటూ ఒక ఫాంటాస్టిక్ శిల్పం ఆవిర్భవిస్తుంది. అది మాజిక్ రియలిజం. పై విభిన్నరీతుల్ని (modes) అనాయాసంగా కథనంలో ఇముడ్చుకుని, ఏక ప్రవాహంలాగా సాగి చదువరులను విభ్రమంలో ముంచెత్తడం ఈ శిల్పం ప్రత్యేకత.

మాజిక్‌రియలిజం అంటే ఇదీ అని నిర్వచించడానికి ఖచ్చితమైన ప్రమాణాలేవీ రూపొందకపోయినా, ఈ శిల్పం గురించిన ఒక అవగాహన కలగాలంటే ఈ పాఠ్యం ఎత్తుగడ, నిర్మాణం ఎలా ఉంటాయో పరిశీలించడం అవసరం.

కథనంలో వివిధ కాలాలకు చెందిన పాత్రలు, పురాణగాథలు, అసహజాలు రంగం మీద కొస్తూ వాస్తవికత, ఫాంటసీల నడుమ సరిహద్దురేఖలు తరచూ చెరిగిపోతుంటాయి.

కోడిపందాల తర్వాతి ఒక జగడంలో వధింపబడ్డ అగ్విలార్ ప్రేతాత్మ రూపంలో బుయెండియా దంపతులకు అప్పుడప్పుడు కనపడడం, ఎప్పుడో చనిపోయిన జిప్సీ పెద్ద మెల్కెడీస్ బుయెండియా వంశస్థులకు మూడు తరాల్లోనూ కనపడి ప్రయోగశాలలో కూర్చుని సంభాషించడం, సుందరి రియోడియోస్ కంబళి ముసుగుతో సహా గాలిలోకి లేచి ఆకాశయానం చేయడం, జోస్ ఆర్కెడియా పిస్టల్ కాల్పుకు గురై మరణించిన వార్తను అతని నెత్తుటిధార ప్రవాహం గట్టి వీధుల్లోపారి అతని తల్లి ఉర్సులాకు తెలియపర్చడం, ఉర్సులా పుట్టింటి నుండి తెచ్చుకున్న స్త్రీధనం గుప్తనిధిలా పెద్దశబ్దంతో గది ఫ్లోరింగు బద్దలు కొట్టుకుని పైకి తేలిరావడం, మకాండాలో వరుసగా నాలుగు సంవత్సరాలు కుంభవృష్టి తెరిపి ఇవ్వకుండా కురవడం... మొదలైన ఘటనలు 'One hundred years of Solitude' లో కనబడతాయి.

దివ్యదృష్టిలాంటి విచిత్రమైన సామర్థ్యం కలిగివున్న కథకుడు సలీంసినాయ్ తన స్నేహితురాలు పద్మతో చర్చిస్తూ, వివిధ శీర్షికల అధ్యాయాలుగా తన గత, భవిష్యత్, వర్తమాన జీవిత చరిత్ర రాస్తూ పోయినట్టుగా ఆగుపించే 'Midnight's children' నవలలో డాక్టర్ అజీజ్ ఆదామ్‌కు కాశ్మీరు భూస్వామి ఇంట్లో తన తల్లి గోడమీది బల్లి రూపంలో కనపడి పడవ సరంగుతాయి గొంతుకతో ధైర్యవచనాలు పలకడం, రెప్పలు అసలే ఆర్పని శిశువు సినాయ్ కనురెప్పలు చేత్తో మూస్తూ తెరుస్తూ తల్లిదండ్రులు అతనికి రెప్పలార్పడం నేర్పించడం, సినాయ్ తల్లి పాత ఢిల్లిలోని ఒక జ్యోతిష్కుడిని సంప్రదించడానికి పోయినప్పుడు ఒక పార్సీ శవం తాలూకు ఖండిత చెయ్యి ఆమె ఎదురుగా నేలరాలడం.... వగైరాలు కనపడతాయి.

తన ప్రేతలోక బంధనాలను పూర్తిగా తెంచుకోలేక, అయిష్టంగానే ఒక శ్రామిక దంపతులకు లేక లేక కల్గిన పిల్లవాడిగా భూమ్మీద జన్మించిన అజారో అనే పిల్లవాడి దృష్టికోణంలోంచి అణగారిన నైజీరియన్ ప్రజల వ్యధాభరిత జీవితాన్ని చిత్రించిన 'The Famished Road' నవలలో తరచూ వికృత, విచిత్ర రూపాల్లోని దెయ్యాలు కథకునికి తారసపడడం, బ్లాక్‌టైగర్ బాక్సింగ్ క్రీడలో రాటుదేలే క్రమంలో యెల్లో జాగ్వార్ అనే లెజెండరీ బాక్సర్ అదృశ్య ఆత్మతో పోరాడటం, కథకునిలో భావోద్వేగాలు రేకెత్తించే నిగూఢ అమ్మాయి, అదృశ్యమైపోయిన ఫోటోగ్రాఫర్ యువకుడు, బ్లాక్‌టైగర్‌ను రెచ్చగొట్టి కలియబడ్డ శ్వేతాంబరధారి... మొదలైనవి

కనబడతాయి. చనిపోయిన (చంపబడ్డ) తన కూతురు తరచూ కథానాయికకు కనపడి, ఫ్లాష్‌బ్యాక్‌ల ద్వారా నవల ప్లాట్ పునర్‌నిర్మాణమవడం 'Beloved' నవలలో కనిపిస్తుంది.

ఇలా, మన సాధారణ జ్ఞానంతో పొసగని పాత్రలు, సన్నివేశాలు, రచయిత ఉద్దేశపూర్వకంగా కథనంలో ప్రవేశపెట్టే ఫాంటసీ – హేతువు మీదనే హఠం పట్టి కూర్చున్నప్పుడు మనం చేసే తప్పిదాలు, కూరుకుపోయే అసంబద్ధతలు మనకు గుర్తుచేసేందుకు ఉద్దేశించిన మెటఫర్లు అన్నమాట. దీన్ని 'Materialization of memories' అంటారు. 'The satanic Verses' నవలలో సిన్మానటుడు జిబ్రీల్‌ఫరిస్తా ఒక కుంభకోణంలో ఇరుక్కుపోయిన సందర్భంలో – 'పత్రికల ముఖచిత్రాల మీది అతని బొమ్మలు చావుకళ సంతరించుకున్నాయి', ఆ తర్వాత 'అవి చల్లగా ముద్రిత పుటల్లోంచి అదృశ్యమయ్యాయి' అన్నప్పుడు పాఠకుడు పత్రికల ముద్రిత పుటలకు అలా ఎందుకు జరుగుతుంది అని ఆలోచించడు. ఎందుకంటే అలా జరగడం సంభవమేనన్నట్టుగా రాసి వుందక్కడ. ఏది అలా మార్చగలిగింది. ఏ శక్తి తన్ను తాను అలా వ్యక్తీకరించుకుంటున్నది అన్నదే అక్కడ ముఖ్యం. అదే విధంగా 'The Moor's last sigh' నవలలో ఒక చోట, ఒక మహిళ జీవితం అతివేగమైన సరళిలో వున్నందున ఆమె కొడుకు వయస్సు మామూలుకన్నా రెండింతలు పెరిగిపోయింది అని రాసి వుంది. ఇది పూర్తిగా ఊహాత్మక పరిణామం. ఇలా రాయడాన్ని 'Literalization of metaphor' అని విమర్శకులంటారు. 'One hundred years of solitude' నవలలో ప్రభుత్వదళాలు తిరుగుబాటుదారుడైన అరిలియానోసెగుండోను పట్టుకునేందుకు అతని ఇల్లంతా సోదాచేసిన ఘట్టం వుంది. అరిలియానో ఎదురుగానే వున్నా వాళ్లు ఆశ్చర్యకరంగా, అతని చూడరు ! లేదా అతను వాళ్ళకు కనపడడు. ఇంట్లోని స్త్రీలను ఏవో ప్రశ్నలడిగి సైనికులు ఖాళీగా వెళ్ళిపోతారు. బుయెండియా వంశజులైన వీరుల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్నీ, గౌరవాన్నీ తెలియజేసేందుకు రచయిత ఈ సన్నివేశాన్ని చిత్రించాడు. దీన్ని 'Hyperbolization of myth' అంటారు. (నైజాం పాలనకు మూలస్తంభాలుగా నిలబడ్డ దేశాయిలకు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన లిజెండరీ వీరుల గాధలు కొన్ని మౌఖికంగా మొన్నటిదాకా ప్రచారంలో ఉండినాయి. కొండలరాయుడు, సర్వాయిపాపారాయుడు. గట్టెపల్లి మురళి వంటి తెలంగాణావీరుల గాధల్లో ఇలాంటివి అనేకం కన్పిస్తాయి.)

గాఢమైన కవిత్వం కదనుతొక్కే శైలిలో స్థానిక సంక్లిష్ట వాస్తవికతా చిత్రణని ఫాంటసీ పక్కనే నిలబెట్టడం మూలంగా వ్యూహాత్మకమైన సత్తా శాస్త్రీయ విచ్ఛేదం (ontological disruption) జరుగుతుంది.

నేలవాలిన దేవదూతలు, ప్రఖ్యాత ప్రాచీన మృతవీరులు, జలాంతర్గామి నగరాలు, మనుషులుగా ద్వంద్వరూపం తీసుకునే శవాలు - ఇలాంటి ఫాంటసీ సరసనే, తన బాధాతప్త మాతృభూమి సహా యావత్ లాటిన్ అమెరికా క్రూరమైన రాజ్యవ్యవస్థలోంచి, అవిశ్రాంతంగా నిశిత పరీక్షకు బలయిన వాస్తవికత చట్రంలోంచి స్థానిక పరిస్థితుల్ని కళ్లకు కట్టినట్టు చూపిస్తాడు మార్క్వెజ్. ఉదాహరణకి.

"... అతను అలా అరిచాక, అక్కడ భయం కాదు కాని ఒక రకమైన భ్రాంతి మోహరించే సంఘటన జరిగింది. సైనికాధికారి కాల్పులకు ఉత్తరువు ఇవ్వగానే పద్నాలుగు మరతుపాకులు ఒక్కసారిగా గర్జించాయి. అయితే అదంతా వట్టి బూటకంగా కనపడింది. మరతుపాకులు ఉత్పత్తి తొడుగులతో నింపబడ్డాయేమోనన్నట్టుగా అగుపించింది. ధనాధన్‌మనే వాటి నిశ్వాసలు వినవచ్చాయి. ప్రజ్వరిల్లుతున్న వాటి తుంపరలు కళ్లకు అగుపడ్డాయి. కాని కత్తికి కత్తి వొరుసుకుపోయేలా గుమిగూడిన ఆ గుంపులోంచి లేశమాత్రంగానైనా స్పందన కనపడలేదు. ఒక అరుపుగానీ, ఒక నిట్టూర్పు గానీ వినరాలేదు. తక్షణమైన, సద్యోజనితమైన దుర్భేద్యత ఏదో దాన్ని శిలా సదృశం చేసినట్టుగా అయిపోయింది. అకస్మాత్తుగా స్టేషనుకు ఒక పక్క నుండి "అహ్... అమ్మా..." అనే చావు కేక ఒకటి ఆ మాంత్రీభూత అవస్థను బద్దలుకొట్టింది. ఒక భయకంపిత కంఠస్వరం, ఒక అగ్నిపర్వతం నిశ్వాస, ఒక ప్రభంజన ఘోష గుంపు మధ్య నుండి అపారమైన విస్తరణ శక్తితో చీల్చుకు వచ్చింది. జోస్ అర్కెడియాసెగుండో తృటిలో ఆ పిల్లవాణ్ని అందుకున్నాడు. వాడి తల్లిని భీతితో గింగిర్లు తిరుగుతున్న ఆ గుంపు కబళించివేసింది. ఎన్నో ఏళ్ళ తర్వాత సైతం ఆ పిల్లవాడు - అందరూ తనను ఓ పిచ్చివాడకున్నా సరే - తనను జోస్ అర్కెడియాసెగుండో ఎలా నెత్తిమీద కూర్చోబెట్టుకున్నదీ, దాదాపు గాలిలోనే గుంపు భయాందోళనల మీదుగా తేలుతున్నట్టుగా ఎలా పక్కనున్న వీధి సందువరకు మోసుకెళ్లిందీ చెప్పగలడు. మరతుపాకుల నుండి కాల్పులు వెలువడుతుండగా ఆ వెర్రి గుంపు ఒక మూలకు ఉరికిన వైనాన్ని ఆ పిల్లవాడు అప్పటి స్థానంలోంచి ఆ క్షణాల్లో చూడగలిగాడు. పెక్కు గొంతుకలు ఒకేసారి

అరిచాయి. "అందరూ కింద పడుకోండి.. కింద పడుకోండి!" ముందర ఉన్న జనం అప్పటికే కిందపడిపోయారు. బుల్లెట్ల ఆనవాళ్ళని కిందికి తుడిచివేసింది. బతికివున్న వాళ్లు కింద పడుకునే బదులు చిన్న చౌరాస్తావైపు వెనుకకు పరిగెత్తే ప్రయత్నం చేశారు. ఒక దట్టమైన కెరటం వ్యతిరేక దిశలో పరిగెత్తిస్తున్న మరో దట్టమైన కెరటానికి ఎదరు వెళ్లినట్టుగా వీధిలో దోవకు అడ్డంగా ఎడతెరిపి లేకుండా మరతుపాకులు మోగుతుంటే ఒక రాకాసిబల్లి తోకకు అభిముఖంగా ఉరికే మరో రాకాసిబల్లి తోకలా ఆ వెర్రిభయం రూపుదాల్చింది. దాహం తీరని మరతుపాకుల నిర్ణీత పద్ధతిలో కత్తెర వేస్తూంటే చుట్టూరా తరుక్కుపోతున్న ఉల్లిగడ్డలా ఒక దాని తర్వాత మరొకటిగా అంచులు రాల్చుకుంటూ, కొంచెం కొంచెంగా కేంద్రకం వైపు నశిస్తూన్న బ్రహ్మాండమైన సుడిగాడ్పులా గింగిర్లు తిరుగుతూ వాళ్లు సొరికెలోకి నొక్కుకుపోయినట్టుగా అయిపోయారు. చేతులు శిలువరూపంలో సాచి, నేలమీద మోకరిల్లిన ఒక మహిళను పిల్లవాడు చూశాడు. విచిత్రమైన రీతిలో, తొక్కిసలాట ప్రభావం ఆమె మీద ఏ మాత్రం పడలేదు. జోస్ అర్కేడియాసెగుండో ఆ పిల్లవాడిని అక్కడ దించుతూ తన ముఖం నెత్తుట్లో స్నానమాడినట్టుగా కింద పడిపోయాడు. మరుక్షణమే విజృంభిస్తూ, సైనికదళాలు ఆ ఖాళీ ప్రదేశాన్నీ, మోకరిల్లిన మహిళనూ, ఉన్నతమైన, క్షామపీడితమైన ఆకాశం వెలుగునూ, ఉర్సులా ఇగ్వారాన్ వెనుకటి ఎప్పుడో చాక్లెట్ జంతుబొమ్మల్ని అమ్మిన ఆ చెడిపోయిన ప్రపంచాన్నీ నేలమట్టానికి తుడిచివేశాయి' ('One hundred years of solitude' నవలలో 183, 184 పుటలు).

చరిత్ర, వర్తమానం, సమకాలీన రాజకీయాలను కలగలిపి కమ్మని చట్నీని నూరి దానికి, హాస్యం, కారికేచర్‌ల ఇంగువ పోపు దట్టించి, 'గతించిన సుదూరగతాన్ని' తరచూ కళ్ళముందర నిలబెడుతూ ఆ చట్రంలోంచి భవిష్యత్‌ను పగిలిన అద్దంలోని వక్రీభూత ప్రతిబింబ శకలాలుగా చూపే చిత్రమైన టెక్నిక్‌లో కథనం సాగించే సాల్మన్‌రష్డీ ఉన్నట్టుండి స్థానిక వాస్తవికతపై ప్రకాశవంతమైన వెలుతురు గుమ్మరిస్తాడు. ఉదాహరణకి –

".... జనం తమ అదృశ్యజీవితం గడిపే సందుల్లోకి, గంట్లుతేలిన తారురోడ్డులో క్షామం లాగా దారిద్ర్యం తినివేస్తూన్న గల్లీలోకి ఆమె ప్రవేశిస్తూనే తననేదో అకస్మాత్ రుగ్మత పీడిస్తున్నట్టుగా భావింపసాగింది. అంగుళం అంగుళాన్ని కిక్కిరిసిపోతూన్న, నిమిషనిమిషానికీ ఇరుకిరుకైపోతూన్న ఆ వీధుల ఒత్తిడికింద

ఆమె తన నగరనే[త్రాల్ని కోల్పోయింది. నగరనే[త్రాలున్నంత సేపూ నువ్వు అదృశ్యవ్యక్తుల్ని చూడలేవు. వృషణాల వరకు బోదకాలు జబ్బున్న బిచ్చగాళ్లు డబ్బాబండ్లల్లోకి నీకు తారసపడరు. భవిష్యత్ మరుగుకాల్వల కాంక్రీటు భాగాలు వి[శాంతి గృహాల్లాగా నీకళ్లకానవు. నా తల్లి నగరచూపుల్ని పోగొట్టుకుంది, ఆమె చూస్తున్న కొత్తదనం ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ కొత్తదనం వడగండ్ల వానలా ఆమె చెంపల్ని గాయపర్చింది. చూడు, అయ్యోదేవుడా, అందమైన ఆ పసిపిల్లల పళ్లు నల్లగా వున్నాయి! నువు నమ్ముతావా, అమ్మాయిలు తమ చనుమొనల్ని ప్రదర్శిస్తున్నారు ! నిజంగా ఎంత దారుణం. అల్లాతోబా... క్షమించు.. ఆ పాకీ మహిళ మొలకు అచ్ఛాదన అంటూ ఏదీలేదు... ఎంత భయంకరం ! వంగిన నడుములు, ఎండుపుల్లల్లాంటి శరీరాలు... కుల చిహ్నాలేమీ లేవు. కానీ వాళ్లు అస్పృశ్యులు, ప్రియమైన అల్లా... అంతటా దేక్కుంటూ పాకుతున్న బిచ్చపుకుర్రాళ్లు. జీవితాంతం ఆదాయం సంపాదించేదుగ్గాను, ప్రేమించే తల్లిదండ్రులు తమ కాళ్లు, చేతులు తీసివేయగా బిచ్చమెత్తుకుంటున్న పసివాళ్లు ! మామిడిపండ్ల ప్యాకేజీ డబ్బాల్లో, పారేసిన రోలర్ స్కేటింగు చక్రాలు అమర్చిన పెట్టెల్లో చిన్నపిల్లల కాళ్లతో పెద్దవాళ్లు.. అంతటా బిచ్చగాళ్లు. నా తల్లి అరిచింది. "లతీఫాదాస్, వెనక్కిపద" కానీ అతడు తన మొగంలోని నిరంతర చిరునవ్వు మళ్లా ఓసారి వెలిగించుకుంటూ అంటాడు. "మనం ఇక్కడి నుండి నడిచే వెళ్లాలి" వెనుకకు మరలే మార్గం లేదని గ్రహించిన నా తల్లి టాక్సీవాలాను వేచివుండమని అడుగుతుంది. టాక్సీవాలా అసహనంగా అంటాడు. "అలాగేనమ్మా ఒక ఉన్నత కుటుంబానికి చెందిన మహిళ అడిగితే ఎదురు చూడక తప్పుతుందా. కారు వెనక్కి తిప్పేదారి లేదు. మీరు వచ్చాక కారు రివర్స్‌గేరులో మెయిర్‌రోడ్డు దాకా పరిగెత్తించాల్సిందే." ఆలోచనల్లోపడ్డ నా తల్లి చీరకొంగు పట్టుకుని దీనంగా చూస్తున్న పిల్లలు. అంతటా అసంఖ్యాకమైన తలలు. వేనవేల తలకాయలు – ఒక భయంకర మహామృగం చేత చుట్టుముట్టబడినట్టుగా ఆమెకు అనిపించింది. మరుక్షణం నా తల్లి సంభాళించుకుంది మహామృగం కాదు పేద పేద పిల్లలు తనని చుట్టుముట్టారు. అంటే ఏమిటి? ఒక బలీయమైన శక్తి తనకే తెలియని తనబలం ఎన్నడూ ఉపయోగించుకోలేక అశక్తతతో కృశించి పోతున్నది. కాదు. వీళ్లు కృశించి పోతున్న ప్రజకాదు. 'నాకేదో భయంగా ఉంది' అనుకుంది నా తల్లి. ఎవరో ఆమె చేయి స్పృశించారు. ఆశ్చర్యంతో, నమ్మలేక

చూసింది. ఒక శ్వేతజాతి వ్యక్తి ! చిరుగుల దుప్పటి సవరించుకుంటూ "బేగం సాహిబా, నాకేమన్నా ఇవ్వండి !" అంటూ అదోరకం యాసతో ప్రాధేయపడ్డాడు. "కలకత్తాలో నాలుగు రోజుల వ్యవధిలో వేలాదిమందిని ఊచకోతకోశారు. నా పెనిమిటిని కూడా." నా తల్లి తికమకపడి నిశ్చేష్టగా చూసింది. లతీఫాదాస్‌కి ఏం చెయ్యాలో పాలుపోలేదు. అదంతా మోసమనీ, అతనో హిజ్రా (transvestite) అనీ హెచ్చరించాలనుకున్నాడు. నా తల్లి హృదయం జాలితో నిండిపోయింది. "నా పని ముగించుకుని తిరిగివచ్చేటప్పుడు నీకు ఏమన్నా ఇస్తాను", అని అన్నది. "ఉహూ... నామానం కప్పుకునేందుకు వెంటనే ఏమన్నా ఇవ్వండి..." జారిపోతున్న దుప్పటి పైకి లాక్కుంటూ మళ్లా బ్రతిమిలాడాడు శ్వేతజాతీయుడు. దుప్పటి పొరల కింద ఎండుకుపోయిన స్తనాలు నా తల్లి కంటపడ్డాయి. (Midnithg's Children 92,93 పుటలు).

ప్రేతలోకపు గగుర్పాటు కలిగించే భావదృశ్యాలు అజారో దృష్టికోణం లోంచి తరచు గుమ్మరిస్తూనే, ఆఫ్రికా ఖండంలోని పలుదేశాల్లో వేళ్లూనుకున్న నికృష్ట జీవనగతుల్ని, తీవ్రదారిద్ర్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతూ కథకుని సంవేదనని ఒక విషాధభరితమైన హిప్నాటిక్ నీడలాగా వర్ణిస్తాడు బెన్ ఓక్రీ ఉదాహరణకి...

"...పొద్దు వాలిపోతుండగా ఆ ప్రాంతానికి చెందిన ఎందరెందరో జనం మా కాంపౌండులోకి చొచ్చుకురాసాగారు. మెడల్లో తువ్వాళ్లు, చేతులకు బాక్సింగ్ తొడుగులు, నడుములకు చిన్న నిక్కర్లతో బాక్సర్లూ వచ్చారు. కొందరు తుపాకులు, మందుగుండు సామగ్రితో సహా వచ్చారు. వాళ్లల్లో కొందరు సైనికులు ఇంకొందరు పోలీసులు. వాళ్లు గుంపులు మధ్యన ఛాతీ విరుచుకు నడుస్తూ వేశ్యలతో డాబుగా మాట్లాడారు. వాళ్లు డాడీ సాహసకృత్యం గురించి విని వున్నారు. తమ కుళ్లుగతం గురించి కించిత్ గర్వంగా చెప్పుకునే మురికి వాడల మనుషులు వాళ్లు. అందరూ డాడీ గురించి అడిగారు. ఆయన ఎక్కడ ఎవరితో వున్నారో నాకు తెలియదని చెప్పాను. అందరూ డాడీకోసం ఎదురు చూస్తుండగా రోడ్డు మీద ఒక బిచ్చగాళ్ల గుంపు ఊరేగింపుగా ఎదురురావడం కనిపించింది. చూపరులను మంత్రముగ్ధులను చేసేటంత అందంగా వున్న అమ్మాయి ఒకర్తె వాళ్లకు ముందుండి నడిపిస్తోంది. వాళ్లంతా కలిసి ఏడుగురో, ఎనమండుగురో ఉంటారు. ఆ బిచ్చగాళ్లలో కొందరు కుంటివాళ్లు - కాళ్లు రబ్బరు గొట్టాల్లాగా వంగి లేస్తున్నాయి. కొందరి మెడలు

వంకరగా వున్నాయి. ఇంకొందరికి కాళ్లు, పాదాలు వాళ్ల తలకాయల వెనకాల వున్నాయి. ఒకడివి మరీ ఎగుడుదిగుడు కళ్లు. మరొకడికి మూడు కళ్లున్నట్లుగా అగుపడింది. కానీ పరీక్షగా చూస్తే ఒకటే కన్ను అని అర్థమవుతోంది – మరో కన్ను స్థానంలో మానిన గాయం తాలూకు గుంట. ఇంకొకడు పూర్తి అంధుడిగానే వున్నాడు – అయితే చితికిన గుడ్డు పచ్చసొనలా వికృతంగా పైకి తేలివచ్చిన కనుపాపల గుండా చూడగలుగుతున్నాడు. యువతి సమీపంలో కొచ్చాక గమనించాను – ఆమె ఓ కన్ను గ్రుడ్డి. గరుకునేల మీద కర్ణకఠోరంగా రాస్తున్న వాళ్ల అవయవాల కీళ్లసందుల్లో తలా ఓ కర్రా, గుడ్డమూటా మోసుకొస్తున్నారు. మురికి దుస్తులతో ఆ బిచ్చగాళ్ల బృందం రోడ్డుమీద నడిచివస్తూంటే విపరీతంగా దుమ్మురేగింది. మేము అయోమయంతో చూస్తుండగా వాళ్లు మెరిసే ముఖాలతో ఆహుతుల వైపుగా, తిన్నగా మా కాంపౌండు ముంగిట్లోకి వచ్చేశారు. యువతి వాళ్లందిరినీ అర్థచంద్రాకారంలో నిలబెట్టింది. వాళ్లంతా ఒకే కుటుంబమని అర్థమైంది. అత్యధిక అంగవైకల్యం గలవాడు తండ్రి. అందరిలోని అష్టవక్రతలు మూర్తీభవించిన వ్యక్తి అతడు పెద్దవాడి నుంచి చిన్నవాడిదాకా – సొలువుగా నిలబడ్డ వాళ్ల వయస్సులకు అనుగుణంగా వాళ్ల అంగవైకల్యంలోని స్థాయీ భేదం ప్రదర్శితమైంది. స్పష్టంగా కనపడుతున్న యువతి ఒంటికన్ను ఆఖరుది. నేను ఆ అమ్మాయి వైపు చూడకుండా ఉండలేకపోయాను. తన ప్రకాశ పరిపూర్ణతే తన తప్పిదమనే పుష్పంలా ఆమెలో విపరీతమైన ఆకర్షణ వుంది. లోకమంతా ఒక స్వచ్ఛమైన స్వప్నంలో మమేకమయినప్పుడు మధ్యాహ్న సమయాల్లో వినవచ్చే ఒక సుదూరపు సంగీతంలా, ఒక స్థానం అంటూ లేని సంగీతంలా, ఒక రహస్య బాంధవ్యం చేత బాష్పోత్సేకం చెందిన ఉల్లాసభరిత మనఃస్థితిలోని సంగీతంలా, ఆమె నాకు పరిచితురాలిలా సైతం కనబడింది. నేను బిచ్చగాళ్ల గుంపును సమీపించి ఎవరు మీరు అనడిగాను. "మేము చాలా దూరం నుండి వచ్చాము," చెప్పిందా అమ్మాయి. "ఈ ప్రాంతానికి చెందిన ప్రఖ్యాత బాక్సర్ ఒకాయన మావంటి ఆకలిగొన్న పేద ప్రజలకు విందు ఇస్తున్నాడని విని వచ్చాము. మేమెప్పుడూ క్షుద్బాధతో అలమటిస్తుంటాము. ఒక రోజంతా నడిసొచ్చి ఇక్కడికి చేరుకున్నాం...." (నవలలో 416, 417 పుటలు).

అలా, ఇంద్రజాలం (ఫాంటసీ), పచ్చి వాస్తవికత సహజీవనం చేయడం మాజిక్ రియలిస్టు పాఠ్యంలో మనం గమనించే సాధారణ విషయం చలామణిలో

ఉన్న వాస్తవికతా వాదమనేది, భావజాలపరంగా, ప్రాకృతిక, సామాజిక, వాస్తవాలను వస్త్వాశ్రయిక కోణంలోంచి చూపి, ఇదే సత్యం సుమా అని బల్లగుద్ది ఒప్పించే ఏకపక్ష వ్యాఖ్యానం. మాజిక్ రియలిజమూ భావజాలపరంగా వ్యవహరించేదే కాని ముఖం గుద్ది చెప్పకుండా విభిన్న వ్యాఖ్యానాలకు చోటు కల్పిస్తుంది. వికేంద్రీకరణ దాని ముఖ్య ఉద్దేశ్యం. బహిర్ వాస్తవికత ఇతరులకు అనుభూతమైన వైనాన్ని మన కళ్లముందర నిలబెడుతుంది. onto logical disruption అనేది రాజకీయ, సాంస్కృతికపరమైన అస్తవ్యస్తతని సూచిస్తుంది. Ontology అంటే ఏమిటో ఒకసారి పరిశీలిద్దాము.

ధర్మశాస్త్రం మానవ జీవితానికి సంబంధించిన నాలుగు పార్శ్వాల్లోంచి తత్త్వ వివేచన చేస్తుంది. నీతిశాస్త్రం (ethics), కళాశాస్త్రం (aesthetics), జ్ఞానశాస్త్రం (epistemology), అదిభౌతికశాస్త్రం (metaphysics), అధిభౌతిక (పారాభౌతిక) శాస్త్ర శాఖయే Ontology. దీన్ని తెలుగులో నిజ అస్తిత్వశాస్త్రం 'సత్తాశాస్త్రం' అని అంటారు. బహిర్ వాస్తవికతను, దానంతట దానినే – దాని అనుభూతిస్తున్న వ్యక్తితో, అతను దాన్నుండి గ్రహిస్తున్న భావ పరంపరతో సంబంధం లేకుండా – అధ్యయనం చేయ సంకల్పించేదే (ontology) భౌతిక ప్రపంచ ఆవిర్భావం, దాని నిర్మాణం గురించి అధ్యయనం చేసే భౌతిక దృగ్గోచర తత్త్వశాస్త్రానికీ, మానవ మస్తిష్క వ్యాపారాన్ని అధ్యయనం చేసే మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని (Natural philosophy)కీ, psychology నడుమ ఉండే ఒక ఊహాజనిత భావనా క్షేత్రాన్ని (a field of speculative thought) సూచించేందుకు క్రిస్టియన్ వాన్‌వూల్ఫ్ (1679-1754) ఈ పదాన్ని ప్రవేశపెట్టాడు. భౌతిక, మనోవైజ్ఞానిక శాస్త్రాల్లో ఎదురయ్యే వాటికన్నా మరీ మౌలికమైన ప్రశ్నలకు నిజ అస్తిత్వశాస్త్రం సమాధానం చెప్పాలని ఆయన అభిలషించాడు. మనలో సంవేదనల్ని రేకెత్తించే వాస్తవికత బయట ఉందనే అనుకుందాం. నిజానికి ఆ సంవేదనలు వాటిని ప్రేరేపించే వస్తుజాలం (thing-in-itself) కన్నా భిన్నమైనవి. ఉదాహరణకి కాంతి తరంగాలు, మామూలుగా అయితే వాటికి రంగులేమీ కనపడవు – వాటిని గ్రహించాక మాత్రమే మానవేంద్రియాలు రంగుల్ని విశ్లేషిస్తాయి. అవి వస్తువు అంతస్సారం (thing-in-itself) లేదా ఒక రకమైన ఇంద్రియ సంవేదనల్ని కలుగజేసే యదార్థ్యపు (Reality) పార్శ్వం. వాస్తవికత అనేది, మౌలికంగా, వైవిధ్యభరితంగా బహిర్ లక్షణాల్ని (manifestations) కల్గివున్న

ఒక స్థూలవస్తువా లేక స్థూల వస్తువుల బహుళత్వమా (a multiplicity of entities)? ఈ విషయాన్ని ప్రశ్నించే ఊహాజనిత విచారణయే Ontology. ఈ రెండింటిలో ఏదైనప్పటికీ, వాస్తవికత అనేది సాధారణ తార్కిక సూత్రాలకు లోబడివుండే ఒక సమగ్రమైన పొందికైన స్థూలవస్తువు అని మనం భావిస్తే, దాని వర్గాలనూ, వాటి సంబంధ బాంధవ్యాలనూ కనుక్కోవాల్సి వుంటుంది. ఇమాన్యుయెల్ కాంట్ తన 'Critique of pure Reason' లో ఈ విషయమే చర్చించాడు. ఒకవేళ యదార్థంలో స్థూల వస్తువుల బహుళత్వమంటే సత్తాశాస్త్రం బహుసత్తావాద సిద్ధాంతాన్ని సమర్థించవల్సి వుంటుంది. విషయి (Subject) కి విషయం (Object) బహురూపాల్లో కనపడే ఈ స్థితిలోనే మాజిక్ (ఇంద్రజాలం) ఉనికిలో ఉంటుంది.

ఇక్కడ మనకు అర్థమయ్యేదేమిటంటే రచయిత ఉద్దేశపూర్వకంగా సందోర్భచితమైన మాజిక్‌ని, సాంస్కృతిక సవరింపు (Cultural corrective)గా పాత్యంలో ప్రవేశపెడాతడు. అంటే ఫాంటసీ, యధాపూర్వస్థితికి చెందిన ఆకాంక్షలకు భావనాలోకంలో రేఖాచిత్రణ చేస్తుంది.

స్థూలంగా, ఆఫ్రికన్, ఆసియన్, పిస్పానిక్ సమూహాలకు సంబంధించిన మానవ పరిణామ శాస్త్ర అధ్యయనాలకు (Socialogical and anthropoligical studies) సమప్రతిగా తోచే ఫిక్షనల్ డాక్యుమెంటులాగా నడుస్తుంది కథనం.

వర్ధమాన, వలస, మూడో ప్రపంచ దేశాల ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబించడం మాజిక్ రియలిజం సాహితీపరమైన ముఖ్య అజెండాగా కనిపిస్తుంది. ఆ సమూహాల దృక్కోణాల్లోంచి చరిత్ర, చారిత్రక వ్యక్తుల విశ్లేషణ జరుగుతుంది. 16వ శతాబ్దానికి చెందిన బ్రిటీష్ నావికాయోధుడు సర్ ఫ్రాన్సిస్ డ్రేక్ విజృంభణ ప్రస్తావనకొచ్చినప్పుడల్లా అతన్ని సముద్ర దొంగగా మకాండో ప్రజలు పిలుస్తారని మార్క్వెజ్ రాస్తాడు. సలీం సినాయ్ దృష్టిలోంచి సమకాలీన రాజకీయ నాయకుల్ని, బ్రిటిషు అధికారుల్ని మరో కోణంలో చూపుతాడు సాల్మన్‌రష్దీ.

అనుభవ, హేతువాదాల పునాదుల మీద వ్యవస్థీకృతమైన తమ ప్రాపంచిక దృక్పథం మాత్రమే వాస్తవం అని విర్రవీగే పశ్చిమదేశాల అహంభావాన్ని దెబ్బకొట్టేందుకు నిర్హేతుకమైనదీ, అశాస్త్రీయమైనదీ అనిపించే ప్రత్యామ్నాయ దృష్టికోణంలోంచి వాస్తవికత ఇతర పార్శ్వాల్ని బహిర్గతం చేయ ప్రయత్నిస్తుంది మాజిక్ రియలిజం. పశ్చిమ ఆధిపత్య వాదానికి అడ్డుగా వలస వాదానంతర జాతుల,

ఉపజాతుల సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చేందుకు అణగారిన వర్గ (excentric foculizers or marginailized ethnic groups) దృక్కోణాల్లోంచి వాస్తవికత స్వభావాన్ని ఆత్మాశ్రయిక ధోరణిలో ఆవిష్కరిస్తుంది. చరిత్ర రచనకు తీసుకున్న ప్రాతిపదికల్ని సంస్కృతీ, సంప్రదాయాలను నిర్వచించే పదజాలాన్ని (semantics) పునర్ మూల్యాంకనం చేయాల్సిన అవసరాన్ని అంతర్లీనంగా తెలియజేస్తుందీ శిల్పం.

## 3

ఏ లక్ష్యసాధన కోసం ఈ కథన పద్ధతి ఎంచుకుంటాడు?

మాజిక్ రియలిజం సైన్సు ఫిక్షన్ కాదు. పలాయనవాదం అంతకన్నా కాదు. రచయిత ఆశించిన ఒక ప్రయోజనం మేరకే పాత్ర్యంలో ఇంద్రజాలం, వాస్తవికత చెట్టాపట్టాలేసుకు తిరుగుతాయి. ఏమిటా ప్రయోజనం, సూటిగా, సరళంగా విషయం చెప్పకుండా, పరోక్ష కథనం (beating about the bush) ద్వారా ఏమి సాధిస్తాడు? రచయిత ఎందుకంత శ్రమ తీసుకుంటున్నాడు? ఈ అంశాలు ఇప్పుడు పరిశీలిద్దాము.

జర్మనీ దేశానికి చెందిన ప్రసిద్ధ నాటకకర్త బెర్‌టోల్డ్‌బ్రెక్ట్ 1928లో తన 'The three penny opera' గురించి చెప్తూ ఇలా రాశాడు.... "... complex seeing must be practised. Thinking above the flow of the play is more important then thinking with in the flow of the play...." అంటే నిబిడీకృతమైన అంతరార్థం – ఏ రకం పోతలో రూపుదిద్దుకున్నా – అదే ప్రధానమైనది. ఒకేరకంగా కనపడే అంశాలు నిజానికి వేరువేరు. దృష్టికోణాల్లోని భేదాలు ముఖ్యం, చట్రంలోంచి పొంగి పొర్లినట్టనిపించే అవధులు (margins) ముఖ్యం. ఏ కథ కానీ ఏకరూపంగా చెప్పబడదు. కాలం గడిచిన కొద్దీ ఉపకథలు తోడయ్యి, అవసరాన్ని బట్టి కొత్త అవతారమెత్తుతుంది. సరిగ్గా ఇక్కడే, ఈ వ్యాఖ్యానానికీ, మాజిక్ రియలిజానికీ పోలిక కనిపిస్తుంది.

పోలండ్‌లో, హంగరీలో, జర్మనీలో మునుపటి సోవియట్ యూనియన్ దేశాల్లో, దక్షిణాసియా దేశాల్లో, ఆఫ్రికన్ దేశాల్లో, లాటిన్ అమెరికా దేశాల్లో స్వేచ్ఛకు అర్థమే వేరు. దురాక్రమణ, వలసపాలన, విభజన, ప్రాక్ పశ్చిమ దేశాల నుండి విరుచుకుపడ్డ కొద్దో గొప్పో కిరాతక మూకల చేత రాజకీయ మానభంగం

అనుభవించిన సుదీర్ఘ చరిత్ర ఈ దేశాలనుకున్నది. ఇక్కడ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం నినదించే గళాలు ఉరికంబమెక్కుతాయి. ప్రభుత్వాల అస్థిరత, సాయుధ తిరుగుబాట్లు, మిలిటరీ జుంటాలచే ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికయిన ప్రభుత్వాల కూల్చివేత, కీలుబొమ్మ ప్రభుత్వాల ఏర్పాటు, స్మగ్లర్లు - మాఫియాడాన్‌ల సమాంతరపాలన ఇక్కడ సాధారణంగా జరిగే సంఘటనలు, రాజకీయాల్లో తీవ్ర అవినీతి, ఆర్థిక సంక్షోభాలు, తీవ్ర పేదరికం, నిరుద్యోగం.. వగైరాలు నిత్యం పీడించే రుగ్మతలు. సాంప్రదాయిక ఆకాంక్షలు నెరవేరని అసంతృప్తి, ఆందోళనల్ని ప్రతిఫలించే ప్రజా ఉద్యమాలు ధారావాహిక దృశ్యాలు.

ఒకదేశంలో వేళ్లూనుకు పోయిన హింసాద్వేషాల్లో భాగంగా నిర్బంధాలకూ అక్కడి ప్రజలు అలవాటుపడిపోతారు. గొంతుకలు నొక్కబడి ముక్కుసూటిగా మాట్లాడలేని పరిస్థితులు కొత్త పద్ధతుల అన్వేషణకు పురికొల్పుతాయి. కవి / రచయిత తనకంటూ ఒక 'బతుకుతెరువు సాధనం' (Survival kit) సముపార్జించుకుంటాడు. ద్వంద్వార్థాల మాట (double talk) అందులో ఒక భాగం. బ్యూరోక్రసీ నిరంకుశత్వాన్ని నిరసించేందుకు 'Tin Drum' లో గుంటర్‌గ్రాస్, యుద్ధపాలసీని వ్యతిరేకించేందుకు 'Armies of the night' లో నార్మన్ మెయిలర్, 'Slanghter Housesలో కర్ట్ వోనెగట్ సరికొత్త కథన పద్ధతులు అవలంభించారు. తమ సంక్షుభిత సామాజిక వ్యవస్థలో పీడకల సదృశ్యమైన జీవితాన్నీ, అక్కడ వేళ్ళూనుకున్న వాస్తవ Erewhon (శామ్యూల్ బట్లర్ రాసిన డిస్టోపియన్ నవల Erewhon)నీ నర్మగర్భంగా చిత్రించేందుకు లాటిన్ అమెరికన్ రచయితలు మాజిక్ రియలిజం అనువైన సాధనంగా ఎంచుకున్నారు.

'One Hundred years of solitude' నవలలో రచయిత వాస్తవం, ఇంద్రజాలాల నడుమ సరిహద్దు రేఖల్ని చెరిపివేసే విధంగా కాల ప్రణాళికల్ని తారుమారు చేసినా, వివిధ కాలాలకు చెందిన ఘటనలు, వ్యక్తుల్ని పక్కపక్కన్నే నిలబెట్టినా, అసహజాల్ని, పురాణగాథల్ని, ప్రవేశపెట్టినా పాఠ్యం పొడుగునా అంతర్లీనంగా చూపెట్టింది మకాండోలో జరిగిన అంతుర్యుద్ధాలు, కన్సర్వేటివ్ పాలకులకూ, లిబరల్ పార్టీ సాయుధులకూ నడుమ సంభవించిన ఘర్షణలే. యునైటెడ్ బనానా కంపెనీ అనే బహుళజాతి గుత్తసంస్థలో పనిచేసే అరటితోట కార్మికులు సమ్మెకు దిగినప్పుడు చర్చలకని పిలిపించి, నగర కూడలిలో మూడువేలమందిని సైనికబలగాలచే ఊచకోత కోయించి, రెండువందల వ్యాగన్ల

రైలుబండిలో శవాల్ని మోసుకెళ్లి సముద్రంలో విసిరేయిస్తుంది మకాండోలోని కీలుబొమ్మ పాలకవర్గం. కొనప్రాణంతో బతికి బయటపడ్డ జోస్ అర్కెడియాసెగుండో మర్నాడు ఊళ్లో వాళ్లతో ఆ నరమేధం గురించి ప్రస్తావించినప్పుడు వాళ్లు నమ్మలేకపోతారు. 'సమ్మె జరుగలేదు. శాంతియుత ఒప్పందం కుదిరింది కదా' అని అమాయకంగా అంటారు. ఆ హింసాకాండ ఆనవాలు, అవశేషాలు మిగలకుండా పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకుంటుంది స్థానిక ప్రభుత్వం. కొన్నేళ్ళ తర్వాత, చిన్న అరిలియానో తన మేనమామ ద్వారా విన్న ఆ రక్తపాతం మాట ఎత్తినప్పుడు, చర్చి ఫాదర్ అతడినో పిచ్చివాడిని చూసినట్టు చూపి, ఇప్పుడు నువ్వూ, నేనూ, నీ పెళ్లిమాట మాత్రమే యదార్థం. మిగతాది అవాస్తవం, అభూతకల్పన' అని కొట్టిపారేస్తాడు. మిలటరీ పాలకులది పైచెయ్యి అవుతున్న క్రమంలో ఒకసారి ఒక కర్నల్ తన వాహనానికి అడ్డంగా పరుగెత్తిన ఓ బాలుడ్ని పట్టుకుని అందరూ చూస్తుండగా ముక్కలు ముక్కలుగా నరికివేస్తాడు. జనం నుండి ప్రతిక్రియ శూన్యం. "సగం భూగోళం వేటకుక్కల్లా అరిలియానో అమెడార్‌ను వెంటాడిన ఇద్దరు పోలిసుజవాన్లు బాదం చెట్ల చాటునుండి పేవ్‌మెంట్ మీదికి దుమికి పిస్టళ్ళతో రెండు షాట్లు పేల్చారు. గుళ్ళు నీటుగా బూడిదరంగు శిలువ గుర్తువున్న అమెడార్ నుదుట్లోంచి దూసుకుపోయాయి...." (345 పుట) ఆ రకంగా మిలిటరీ పాలకులు తిరుగుబాటు ప్రోత్సహించిన బుయెండియా వంశంలో మిగిలిన ఆఖరు వ్యక్తిని సైతం నిర్మూలించారు. సర్వదిగ్దర్శకంగా మకాండో జనజీవితాన్ని ప్రతిబింబించిన మాయాదర్పణం లాంటి ఈ నవలలో పై ఘటనలు ఘనీభవించిన రక్తాశ్రువులు. హిస్పానిక్ సమూహాల వర్తమాన నిజజీవితంలోని రక్తాశ్రువులే ఈ నవల రచనకు ప్రేరణా, నేపథ్యమూ అయి వుండాలి.

'The Famished Raod' నవలలో రచయిత ప్రేతలోకపు గగుర్పాటు కలిగించే భావచిత్రాలు అజారో దృష్టికోణంలోంచి తరచూ గుమ్మరిస్తాడు. నవలలో ఒకచోట అంటాడు "దెయ్యం పిల్లలు (Spirit children) భౌతిక అస్తిత్వంలోని బాధలూ, ఎన్నడూ నెరవేరని నిరీక్షణలు, గొప్పవిగా చెలామణి అయ్యే అన్యాయాలు ప్రేమ అనే చిక్కుముడుల బంధనాల్ని వ్యతిరేకిస్తారు, ద్వేషిస్తారు." నిరంకుశపాలన కింద కడు పేదరికంలో మగ్గుతున్న నైజీరియాలో భౌతికజీవనం నిజంగా ఒక పీడకల. అక్కడి ప్రభుత్వాలు ప్రజాస్వామ్య గళాల్ని అణచివేస్తాయి. అక్కడి ప్రజాకవుల్ని గుండాలు, దగ్గులు తీవ్రంగా హింసిస్తారు. అభివృద్ధి పేరున అడవులు, జనావాసాలు

నిర్మూలించబడతాయి. రోడ్లు, వంతెనలు నిర్మించబడతాయి. బలవంతులు, గూండాలు స్థలాలు ఆక్రమిస్తారు. సామాన్యజనాన్ని బెదిరిస్తూ అంతటా దోపిడీ చేస్తారు. తమ 'ధనవంతుల' పార్టీకే వోటు వేయాలి, లేకపోతే చంపేస్తాం అని హెచ్చరిస్తారు. ఎదురుతిరిగితే చితకతంతారు. చిన్నా చితకా జనం మేడం కోటోకి సలాము చెయ్యాలి. ఆమె కల్లు అంగడిపెట్టి, వేశ్యాగృహాల్ని తెరిచి, కారుకొని, బాగా సంపాయించి రాజకీయాల్లోకి దిగుతుంది. బ్లాక్‌టైగర్ (అజారో తండ్రి)ని తన వెంటే ఉండమంటుంది. కానీ అతడు 'పేదలపార్టీ' పక్షాన ఉంటాడు. ఎన్నికలముందర ప్రజలను ప్రలోభపెట్టేందుకు భూస్వాములు ఉచితంగా పాలపొడి పంపిణీ చేస్తారు. అది కల్తీ ఆహారమని గ్రహించాక జనం భూస్వాముల్ని వాళ్ల గుండాల్ని చావతంతారు. పోలీసుల రంగప్రవేశంతో ప్రజల్లో ఆగ్రహజ్వాల మరింతగా రేగుతుంది. కథకుడు ఇలా చెప్తాడు "మృతులు లేస్తుండగా నేను చూశాను. ప్రత్యర్థులు పెడబొబ్బలు పెడుతూ రెండోసారి విధ్వంసానికి దిగిన క్షణాల్లో వాళ్లు మేల్కొన్నారు. మృతులు అమాయకులతో చేతులు కలిపారు. గుండాలతో తిరిగారు. రాత్రి చీకట్లో విలీనమయ్యారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ప్రత్యర్థులను అదరగొట్టేశారు. ఆ చీకటిరాత్రిని జ్వాలలతో ప్రజ్వరిల్లుతున్న దేవతగా గుర్తించి మర్త్య సంతోషంతో ఈళలు వేశారు. దేహం రక్తంతోనూ వెండి వెలుగులతోనూ జిగేల్మన్న ఆ ప్రతిబింబిత రాత్రిలో వాళ్లు ఆనందహేలతో ఊగిపోయారు. మృతులు తమ జీవన తుప్పును వదిలించుకుని ఉక్కుని అవాహన చేసుకున్నారు. సింహనాదాలు చేస్తున్న పెక్కు గొంతుకల్ని నేను విన్నాను. నేను పోట్లాట విన్నాను. దృఢ దేహాలు మీద ఉక్కు మెరుపుల్నీ, ఎదరించే గొంతుకల్ని చీకట్లో ఉరికే అడుగుల సవ్వడినీ నేను విన్నాను" (180 పుట).

కోపోద్రిక్తులైన పేదజనం కడుపు మండి పిచ్చిగా గుండాలమీద తిరగబడ్డారు అని చెప్పే బదులు రచయిత అజారో కోణంలోంచి పూర్వీకుల ఆత్మలు పూనిన గల్లీవాసులు వీరోచితంగా విజృంభించారు అని అంటాడు. సంధికాలంలో జడంగా ఉండదలచుకున్న నైజీరియన్ చైతన్యానికీ, అక్కడి సమాజ జీవితపు నికృష్ట స్థితికీ ప్రేతలోక భావనని కొన్ని సందర్భాల్లో మెటఫర్‌గా కూడా రచయిత వాడినట్టుగా తోస్తుంది. రోడ్డు (అనేమార్పు/అభివృద్ధి) రుజుమార్గంలో సాగదు, దాన్ని పూర్తి చేయాలని తహతహలాడే ప్రతి తరమూ ధ్వంసమవుతుంది. దాని శ్రమా నాశనమవుతుంది. మళ్లా వచ్చేతరం అడుగునుంచి పని ప్రారంభించాలి అని ఓక్రీ ఉద్దేశం. అయితే ఆ రోడ్డు పూర్తవ్వాలని బ్లాక్‌టైగర్ కలలు కంటూనే ఉంటాడు.

చివరి అధ్యాయంలో చిత్తుగా ఓడిపోయి, పలాయనం చిత్తగించిన శ్వేతవర్ణ బాక్సర్ ఘట్టం ద్వారా రచయిత ఉద్దేశం మనకు సింబాలిక్‌గా అర్థమవుతుంది.

మూడు భాగాల పెద్దనవల 'Midnight's Chilrdren' లో కథకుడు ఎన్నో కథలు, ఉపకథలు వివిధ లేబిళ్లు అంటించిన పచ్చడిజాడీల్లాగా చూపించి వర్ణిస్తాడు. ఇవి నా అభిప్రాయాలు కావు సుమా అని గడుసుగా రచయిత తన్ను తాను మరుగుపర్చుకుంటూ (self effacting author లాగా) భారతదేశ సామాజిక, ఆర్థిక రాజకీయ, పరిణామక్రమాన్ని విశ్లేషణాత్మకంగా సలీం సినాయ్ దృష్టికోణంలోంచి వివరిస్తాడు. ముందుతరాల వారికి చరిత్ర పాఠ్యగ్రంథంగా పనికివచ్చే అర్హత కలిగి వుందీ నవల. జలియన్‌వాలాబాగ్ రక్తసిక్తఉదంతం, దేశ విభజన నాటి మతకల్లోలాలు, మొదటి జనరల్ ఎన్నికలు, వివిధ చట్టాల రూపకల్పన, చైనాతో యుద్ధం, బంగ్లాదేశ్ అవతరణ, రెండు సరిహద్దులు యుద్ధాలు, ఎమర్జెన్సీ విధింపు... ఇవన్నీ కలుపుకుంటూ సాగుతుంది కథనం. చరిత్ర రచనకు కల్పితగాథ (fictional text) కొన్ని సందర్భాలలో పరిపూరకమవుతుందని నవల చదివే పాఠకునికి స్ఫురిస్తుంది. కాలానికి ముందూ వెనుకా సాగే కథనంలో కాశ్మీర్, బొంబాయి, ఢిల్లీ నగరాల్లోని జనజీవన చిత్రణ అద్భుతంగా వుంది. చక్కని హాస్యం, వ్యంగ్యం వున్నాయి. భారతీయుల వేషభాషణలు, కలోనియల్ అలవాట్లు, తిండి అలవాట్లు, తినుబండారాలు తయారీ, హిందూ ముస్లిముల సాంస్కృతిక అలవాట్లు, వాటి సారూప్యత, తమ విశ్వాసాలు, చరిత్రలో చెప్పుకోదగ్గవాళ్లు.. మొదలైన ప్రస్తావనలు కథలో అతిసహజంగా (seam less joints) అతికిపోతాయి. 'కాశ్మీర్ కాశ్మీర్‌ల కోసమే' అంటూ పడవ సరంగుతాయి మాటల్లో రచయిత 'ప్లెబిసైటు' వాదాన్ని సమర్థిస్తున్నట్టుగా అగుపిస్తుంది. ముస్లింలీగ్ సిద్ధాంతాల అభిప్రాయంలో పాకిస్తాన్ వేర్పాటువాదం సరైనదేననీ, వేర్పాటు (విభజన)కు దారితీసిన పరిస్థితులకు కలోనియల్ పాలకుల కన్నా హిందూమతానికి చెందిన కాంగ్రెసు నాయకులదే ఎక్కువ బాధ్యత అని నిర్ద్వంద్వంగా అంటాడు. కాల్పనిక వచన ప్రతి ద్వారా భారత ఉపఖండం గురించి సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ చేయడంలో రచయిత ఊహాచాతుర్యం, మేధోపటిమ, పరిశీలనా నైశిత్యం పేజిపేజినా కనిపిస్తుంది.

4

తెలుగు రచయితలు కొందరు - మునిపల్లెరాజు, డా॥ వి. చంద్రశేఖర్ రావు, గోపిని కరణాకర్, డా॥ కేశవరెడ్డి - తమ కథల్లో / నవలల్లో మాజిక్ రియలిజం

వాడారు అని సమీక్షకులు, సాహితీ విమర్శకులు చెప్పుకొచ్చారు. మునిపల్లెరాజువి సాత్త్వికమైన ఇతివృత్తాలు. భావుకత, తాత్త్వికత నిండిన ఈయన శైలి శబ్దగంభీరంగా సాగుతుంది. తన ఆధ్యాత్మిక చింతనని పాత్రలకు పులిమి, కథనానికి మార్మికత జోడించి, ఒక అలౌకిక భావన అంచువద్ద కథ ముగిస్తాడు. కార్యకారణ సిద్ధాంతాన్ని పోలిన 'ఖయాటిక్ థియరీ'ని సైతం కొన్ని కథలు ప్రదర్శిస్తాయి. ఉదా॥ 'వేరే లోకపు స్వగతాల్లో'.

వి. చంద్రశేఖర్‌రావు కథలు విభ్రమం రేకెత్తిస్తాయి. ఈయనది గణనీయమైన కొత్తపంథా ఫాంటసైజ్డ్, సర్రియలిస్టు శకలాలు పేర్పుగా ఈయన కథన పద్ధతి వుంటుంది. అంతర్లీనంగా దళితవాద చైతన్యం ప్రవహిస్తూంటుంది. మాయాలాంతరు తదితర కథల్లో 'meterialization of memories' పద్ధతి కనిపిస్తుంది. గోపిని కరుణాకర్ కథన పద్ధతి parable in the abstract లాగా, జానపద బాణీలో వుంటుంది. అల్లెగరీ అనిపిస్తుంది. మొత్తానికి, ఇలా, వర్తమాన విమర్శారంగంలో మాజిక్ రియలిజాన్ని ఎవరికి తోచినట్టు వారు అన్వయించుకునే వైఖరి చెలామణిలో వుంది. భారతీయ పురాణేతిహాసాల్లో మాజిక్ రియలిజం ఉందని కొందరు పండితులంటున్నారు. అద్భుత చిత్రణ, ఫాంటసీ, జానపదబాణీ మాజిక్ రియలిజంలో ఇమిడిపోయేవే. ఎటొచ్చీ భారతీయేతరులు తమ రచనల్ని మాజిక్ రియలిస్టు ప్రణాళికలో మలిచిన సందర్భమూ, ఉద్దేశమూ వేరని మనం గమనించాలి.

*సంప్రదించిన గ్రంథాలు:*


1. One hundred years of solitude.
2. The Famished Road.
3. Midnight's Children
4. Contemporary Latin American
5. Collected short story of Gabriel Garcia Marquez
6. The Short story G A 20th century collection
7. Introuduction to fiction
8. Literature: The human Experience
9. Oxford introduction to short story
10. Adventure of Criticism
11. Literary criticism - A modern approach
12. Literary Review pages of 'The Hindu' sunday Editions.

# తెలుగు కథల్లో హాస్యం

శ్రీమతి నెల్లుట్ల రమాదేవి

నవరసాల్లో హాస్యం స్థానం ప్రత్యేకమైనది. హాస్య రచన కత్తి మీద సాములాంటిదనీ హాస్య రచన చేయగలిగిన వాళ్ళు ఇంకే రచనలనయినా అవలీలగా చేయగలరనీ కూడా అనుభవజ్ఞుల ఉవాచ. తెలుగు కథ శత వసంతాల సంబరాలు జరుపుకుంటున్న నేపథ్యంలో తెలుగు కథల్లో హాస్యం గురించి పరిశీలించినపుడు తమ రచనల్లో అధికశాతం హాస్యకథలు రాసినవాళ్ళ సంఖ్య తక్కువగానే వుండడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

నాటి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి నుండి నేటి యర్రంశెట్టి శాయి వరకు ఎక్కువగా హాస్య కథలు వ్రాసిన రచయితల కొన్ని కథలు పరిశీలిద్దాం.

ఆనాటి జాతీయ కవి కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారు ఎక్కువగా హాస్యంతో కూడిన ప్రహసనాలు, హాస్య నాటికలు, హాస్య నవలలు రచించారు. వారి రచనల్లో కొన్ని హాస్య కథలు వున్నాయి. ఇవన్నీ చిన్న కథలే. ఇందులో వ్యంగ్యమునకు, అధిక్షేపానికి ప్రాధాన్యత ఎక్కువ. సమాజంలోని కొందరు వ్యక్తుల మనస్తత్వాలను ఎత్తి చూపుతూ సన్నివేశాల ద్వారా కాక సంభాషణల ద్వారానూ, నిరాటంకంగా కథ చెప్పుకుంటూ పోయే ప్రక్రియ ద్వారా హాస్యాన్ని పండించడం వీరి ప్రత్యేకత. 'నెపముల పుట్ట', 'పూల మందిరము', 'మంచి సలహా', 'మూషిక మహాసభ' 'జనాభా లెక్క', 'అమ్మకమునకొక ఇల్లు' వంటి ఎన్నో చిన్న కథలు గ్రాంథిక భాషలో చిలకమర్తి వారు రచించారు. ఒక వస్తువును గానీ, వ్యక్తిని గానీ, సంస్థను గానీ, వ్యవస్థను గానీ అందులోని లోటుపాట్లను వరుసగా వ్యంగ్య ధోరణిలో వర్ణించుకుంటూ పోవడం చిలకమర్తి ప్రత్యేకత. ఆ తర్వాతి కాలంలో అటువంటి హాస్య కథలు వెలువడడానికి ముందు మార్గం చూపిన రచయిత చిలకమర్తి వారేనని చెప్పవచ్చు.

ఆ తరువాత హాస్యాన్ని ఎక్కువగా తమ కథల్లో పండించిన వారు మునిమాణిక్యం నరసింహరావు గారు. ముఖ్యంగా వీరు రచించిన 'కాంతం కథలు' హాస్యానికి పెద్ద పీట వేసిన రచన.

మధ్య తరగతి కుటుంబాలలో భార్యాభర్తల మధ్య నడిచే సంభాషణలు, నెలకొనే హాస్య సందర్భాలు, ఎత్తి పొడుపులు, వెక్కిరింపులు, రాజీలు వీటన్నిటినీ చమత్కార సంభాషణల ధోరణిలో వర్ణించారు మునిమాణిక్యం.

ఇందులో కాంతం అనే గృహిణి పాత్ర అత్యంత సహజంగా మన ఎదురింట్లోనో, పక్కింట్లోనో నిత్యం కనిపించే వ్యక్తిలా అనిపిస్తుంది. గడుసుగా, తెలివిగా, ఒక్కోసారి గయ్యాళిగా, అప్పుడప్పుడూ అమాయకంగా వుంటూ తన మాటల ద్వారా పాఠకులను నవ్విస్తూంటుంది. స్త్రీ స్వాతంత్ర్యం అంతగా లేని రోజుల్లో కాంతం పాత్ర భర్తను హాస్యాలాడడం, ఆట పట్టించడం, మళ్ళీ ఆప్యాయత చూపడం వంటివి మహిళా పాఠకులను విశేషంగా ఆకర్షించాయి.

ముళ్ళపూడి వెంకటరమణ గారిది ఒక ప్రత్యేక తరహా హాస్యరచన. తమ ప్రతి రచనలోనూ సున్నితమైన హాస్యాన్ని పండించిన రమణ గారు హాస్యకథలు విస్తృతంగా వ్రాసారు. ముఖ్యంగా పిల్లల కోసం, వారికి అర్థమయ్యే భాషలో హాస్య కథలు వ్రాయడం అనే నైపుణ్యం రమణ గారి సొత్తు. పాత్రలకు సహజమైన పేర్లు పెట్టడంలో ఆయన దిట్ట. ఆ పేర్లు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి పోవడం కూడా ఆయన రచనల్లో సాధ్య పడింది. 'బుడుగు' 'సీగాన పెసూనాంబ' 'రాధాగోపాలం' 'చక్రంగారావు' ' చావుల దేవుడు' 'కంట్రాక్టరు' 'క్రూరంగారావు' 'తీతా' ఇలాంటి పాత్రలను ఎన్నిటినో ఆయన కథల్లో సృష్టించారు. ఆయన కూర్చిన పదబంధాలు కూడా పాఠకులకు గిలిగింతలు పెట్టి నవ్వు తెప్పించేవి. 'డబ్బు చేసింది' 'ధనైక జీవులు' 'బాత్ రూమర్లు' ఇలాంటి వాక్యాలూ, హాస్యపు జల్లులైన సంభాషణలూ ఆయన కథల్లో నిండుగా వుండి చదువరులకు విందుచేసేవి. పాత్రికేయునిగా, నిర్మాతగా, సినిమా సంభాషణల రచయితగా ఇలా బహు ముఖీన ప్రజ్ఞ వెలువరిస్తూనే ఆహ్లాదకరమైన హాస్యానికి చిరునామాగా మారిన రచయిత ముళ్ళపూడి.

ఇక హాస్యరచనలో అందెవేసిన చేయి పురాణం సీతగారిదే. ప్రముఖ రచయిత, సంపాదకులు అయిన పురాణం సుబ్రహ్మణ్యశర్మ 1960 నుండి 1990 దాకా ఆంధ్రజ్యోతి వారపత్రికలో పురాణం సీత పేరుతో 'ఇల్లాలి ముచ్చట్లు' హాస్య, వ్యంగ్య ధోరణిలో వ్రాసారు. అవడానికి ఇవి వ్యాసాలు అయినప్పటికీ వీటిల్లో కొన్ని కథలు కూడా వున్నాయి.

ఇవి పత్రికలో వస్తున్నప్పుడూ, తరువాత పుస్తక రూపంలో వచ్చినప్పుడు కూడా పాఠకులను విశేషంగా ఆకర్షించి, బాగా చదివింపజేసాయి. ఒక మధ్య తరగతి గృహిణి ఆలోచనలూ, అనుభవాలూ, ఎదుర్కున్న సంఘటనలూ, చిన్న చిన్న ఆనందాలూ, లెక్కలేనన్ని కష్టాలూ ఇవన్నీ హాస్య ధోరణిలో వర్ణిస్తూనే, జీవితం ఇంతే. ఇంతకన్నా వేరుగా వుండటానికి వీల్లేదు. అయినా సుఖంగా, సరదాగా, ఈజీగా, హాయిగా ఈ జీవితాన్ని సాగించెయ్యాలి అనే గొప్ప పరమార్థాన్ని ఈ కథలు తెలియజేస్తాయి.

ఇల్లాలి ముచ్చట్లలోని చాలా కథలు మధ్య తరగతి ఆడవాళ్ళ హృదయాల్లోకి పరకాయ ప్రవేశం చేసి వాళ్ళపరంగా నడిపించిన కథలు. కొన్ని వాక్యాలలోని వ్యంగ్యం, సంభాషణల్లోని హాస్యం చురుక్కుమనిపిస్తూనే ఫక్కున నవ్వు తెప్పిస్తుంది. ఉత్తమ హాస్య రచనకు వుండవలసిన లక్షణాలేమిటో పెద్దలు చెప్పిన దానికి అక్షరాలా ఉదాహరణగా నిలిచే హాస్యం ఇల్లాలి ముచ్చట్లు రచన.

'వాడెవడో సప్తసముద్రాల్ని ఈదేట్ట. ఈ సంసారం ఈదమనండి చూస్తాను?' 'కొత్త చింతకాయలు తింటే డాక్టరుకి డబ్బొస్తుంది. మనకు జబ్బొస్తుంది', 'సామాన్యులు చేస్తే ప్రయాణాలు, గొప్పవాళ్ళు చేస్తే పర్యటనలు', ఇలాంటి వ్యాఖ్యానాలు ఇల్లాలి ముచ్చట్లు నిండా కోకొల్లలు. గిలిగింతలు పెట్టే హాస్యంతో పాటు 'శోషలిజం' 'హనీమునీశ్వరులు (హనీమున్ కపుల్), 'అర్ట్ ఎటాక్' 'శనిమాలు' (సినిమాలు), 'టెలిఫోన్ రాక్షసుడు' ఇటువంటి పదబంధాలు ఈ కథల నిండా వుండి పాఠకులను హాయిగా నవ్విస్తాయి.

ముఖ్యంగా ఇల్లాలి ముచ్చట్లలో తెలుగుదనం, హాస్యంతో బాటు కథ మెండుగా వున్న కథలు 'సుబ్బమ్మత్త శృంగార వీధి', 'తారుమారుభలేపెళ్లి' 'మా మామగారి శోషలిజం' 'సైంటిఫిక్ సంసారం', 'పరుపు కింద పైజామా' 'ఆంధ్రా తుగ్లక్ లేక మా పిచ్చి మామయ్య 'ఇందిరాగాంధీ నేనూ రెండూ దోసెలూ', 'పాలిచ్చే తల్లి', 'సమ్మరోపాఖ్యానం' ఇలా రాస్తూ పోతే చాలా కథలను పేర్కొనవలసివస్తుంది. ఇలా రెగ్యులర్ కథల కన్నా ఒక శీర్షిక ద్వారా హాస్య కథలను పురాణం సీత అందజేసి పాఠకులను హాస్యపు జల్లుల్లో ముంచెత్తారు.

హాస్య రచనల గురించి మాట్లాడవలసి వచ్చినపుడు ముందు వరుసలో పేర్కొనదగ్గ రచయిత్రి భానుమతీ రామకృష్ణ. ప్రసిద్ధ నటిగా, గాయనిగా, సంగీత దర్శకురాలిగా, చిత్రకారిణిగా, జ్యోతిష్యురాలిగా బహుముఖీన ప్రజ్ఞను ప్రదర్శించిన భానుమతీ రామకృష్ణ గారు రచయిత్రిగా కూడా అసాధారణ ప్రతిభను కనబర్చారు. ఆవిడ రచించిన 'అత్తగారి కథలు' ఆద్యంతం హాస్య గుళికలు. భానుమతి సృష్టించిన అత్తగారి పాత్ర తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయం. అమాయకత్వం, ఆప్యాయత, దాష్టీకం, ఛాందసత్వం, ఇలాంటి స్వభావంతో మడీ ఆచారాలు, పాతకాలపు అలవాట్లతో ఆ అత్తగారు సృష్టించే హాస్య సంభాషణలు, సన్నివేశాలు పాఠకులను కడుపుబ్బ నవ్విస్తాయి. ఈ కథలన్నీ అత్యంత సహజంగా మనచుట్టూ జరుగుతున్నట్టు అనిపిస్తాయే తప్ప ఎక్కడా కృతకంగా వుండవు. వీటిల్లో 'అత్తగారూ – ఆవకాయా', 'పన్నీరు పప్పు' 'అత్తగారూ – పనిమనిషి' ఇలాంటి కథల్లోని సంభాషణలు చదువరులను కడుపుబ్బ నవ్విస్తాయి. మన నిత్యజీవితంలో ఇంతగా హాస్యం పెనవేసుకొని వుందా అని 'అత్తగారి కథలు చదివిన ప్రతివారూ అనుకోవడం తథ్యం. అనేక నవలలూ, పలు వ్యాసాలూ, కథలూ రచించి హేతువాద రచయిత్రిగా తిరుగులేని స్థానం సంపాదించుకున్న ప్రముఖ రచయిత్రి రంగనాయకమ్మ హాస్య రచనలు చేయడంలో అందెవేసిన చెయ్యి. ఈవిడ ఎక్కువగా నవలలు రాసినా వాటిల్లోనూ, కథల్లోనూ హాస్యాన్ని విరివిగా పండించారు.

సంభాషణల్లో హాస్యం, రచనాశైలిలో వ్యంగ్యం ద్వారా చురుక్కుమనిపించేలా చేయడం రంగనాయకమ్మ ప్రత్యేకత. 'అమ్మకు ఆదివారం లేదా?' వంటి సీరియస్ కథాంశంలోనైనా, 'దొంగ – తాళం చెవులు' వంటి పూర్తి స్థాయి హాస్య కథాంశంలోనైనా పలు చమత్కార సంభాషణలు, ప్రత్యేకమైన రచనాశైలి ద్వారా పాఠకులకు ఫక్కుమని నవ్వు తెప్పించడం ఈమె కథల్లోని లక్షణం.

సమాజాన్నీ, అందులోని వ్యక్తులనూ విస్తృతమైన అధ్యయనం చేసిన పరిణతి రంగనాయకమ్మ గారి హాస్యకథల్లో కూడా కనిపిస్తుంది. ఆయా వ్యక్తులనూ, వారి గుణగణాలనూ, ప్రవర్తననూ, వివిధ సందర్భాలలో వారి ద్వంద్వ వైఖరినీ ఎత్తి చూపుతూ వ్యంగ్య బాణాలను సంధిస్తారు ఆమె. అవి చాలా సార్లు సూటిగా గుచ్చుకుని, చురుక్కుమనడమే కాదు. భుజాలు తడుముకునేలాగా చేస్తాయి.

చాలా సందర్భాల్లో వ్యక్తులు లోపలొకటీ, పైకొకటీ మాట్లాడడం, వల్లించే ఆదర్శాలు ఆచరణలో లేకపోవడం సందర్భానికనుగుణంగా మాటలు మార్చడం, అబద్ధాలు చెప్పడం, వస్త్రధారణ, భాష, జీవన విధానంలో దిగజారుడుతనం, ఇలా నిత్యం మనం గమనిస్తూన్న అనేక జీవితాల్లోని లోటుపాట్లను తన కథల్లో హాస్య, వ్యంగ్యధోరణిలో చిత్రిస్తూ, అయిదు దశాబ్దాలకుపైగా ఉత్సాహంగా రచనలు చేస్తున్నారు రచయిత్రి రంగనాయకమ్మ. మూడు నాలుగు దశాబ్దాలుగా నిబద్ధతతో హాస్య కథలు రచిస్తూ, పాఠకులను రంజింపజేస్తున్న రచయితలల్లో యర్రంశెట్టి శాయి గారిని ప్రముఖంగా పేర్కొనాలి.

సమాజంలో నెలకొనివున్న అవలక్షణాలని, చెడు సంప్రదాయలనీ, మూఢ విశ్వాసాలనీ, వ్యంగ్య ధోరణిలో చెబుతూనే, చెర్నాకోలతో ఛెళ్లున కొట్టినట్టుగా వ్రాయడం యర్రంశెట్టి గారి ప్రత్యేకత. చదివే వాళ్ళు పగలబడి నవ్వేంత హాస్యంతో నిండి వుంటాయి వీరి కథలు. సంభాషణల పరంగా కథను నడిపించడం, అతిశయోక్తిని అత్యంత సహజంగా కథలో చొప్పించడం యర్రంశెట్టి శాయి ప్రత్యేకత. వీరి కథల్లో కొన్ని పాత్రలు పర్మనెంట్‌గా వుండి ప్రతి కథలోనూ దర్శనమిస్తాయి. చిరంజీవి, భగవాన్, మిరియాల్రావ్, ఇలాంటి పాత్రల్లో కొన్ని. యర్రంశెట్టి కథల్లోని హాస్యం చాలా ఉన్నత స్థాయిలో వుండి అవినీతి పరులకూ, మోసగాళ్ళకూ, సంఘంలో మంచిపేరుతో చలామణీ అవుతూ లోలోపల దుర్మార్గాలు చేసేవాళ్ళకూ చెంపపెట్టులాగా వుంటుంది.

ముఖ్యంగా వీరి హ్యూమరాలజీ కథలు ఎంతో వైవిధ్యభరితంగా వుంటాయి. ఒకే కాలనీలో వుండే వివిధ కుటుంబాలు, వాటిల్లోని వ్యక్తులు, వారి విభిన్నమైన అలవాట్లు, ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చే హాస్యాన్ని ఈ కథల్లో చూడవచ్చు. నగరంలో బందిపోటుదొంగలు ఎక్కువయ్యారనీ, వాళ్ళు ఫలానా రోజు వస్తారంటే కాలనీ వాళ్ళు స్వాగతసంబరం ఏర్పాటు చేయడం, కొత్త కోడలు ఇంటికి వస్తూంటే అత్తగారు బోలెడు కిరసనాయిలు కొని సిద్ధంగా వుంచుకోవడం, ఇలా సమాజంలోని అవాంఛనీయ ధోరణులను అతిశయోక్తితో కూడిన హాస్యం ద్వారా ఎత్తి చూపడం ద్వారా ఎంతో మందికి అభిమాన హాస్య రచయిత అయ్యారు యర్రంశెట్టి శాయి.

చక్కటి హాస్యరచనలు చేసిన మరొక మంచి రచయిత భమిడిపాటి రామగోపాలం. వీరి కథల్లో సున్నితమైన హాస్యం, చమత్కారాలతో కూడిన

సంభాషణలు పాఠకులను ఆకట్టుకుంటాయి. వీరి హాస్య కథలతో కూడిన సంపుటి 'ఇట్లు మీ విధేయుడు' లోని కథలన్నీ ఆద్యంతం హాస్యంతో నిండి వుంటాయి. ఈ సంపుటికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

ఎక్కువగా నాటికలు వ్రాసినా మంచి హాస్య కథలు కూడా వ్రాసిన రచయిత ఆదివిష్ణు. సంఘటనల ద్వారా హాస్యం జనింపజేయడం వీరి ప్రత్యేకత. ఒక దశలో అన్ని వార, మాస పత్రికలూ ఆదివిష్ణు కథలను, ముఖ్యంగా పండుగల ప్రత్యేక సంచికలలో ప్రచురించడం ఆనవాయితీగా వుండేది. వీరి కథాంశాలను ఆధారంగా చేసుకుని పలు చలన చిత్రాలు కూడా నిర్మింపబడ్డాయి.

కథలతోబాటు నవలలను కూడా ఎక్కువగా వ్రాసినా తన అన్ని రచనల్లోనూ హాస్యాన్ని పండించి మంచి హాస్య రచయిత్రిగా పేరు తెచ్చుకున్నారు పొత్తూరి విజయలక్ష్మి. వీరు వ్రాసిన 150కి పైగా కథల్లో తొంభై శాతానికి పైగా హాస్యకథలే. అంటే వీరికి హాస్యరచనపై ఉన్న మక్కువను మనం తెలుసుకోవచ్చు.

వీరి హాస్యకథలు 'చంద్రహారం' 'మా ఇంటి రామాయణం' 'ఆనందమే అందం' 'పొత్తూరు విజయలక్ష్మి హాస్యకథలు' అనే సంపుటాలుగా వెలువడ్డాయి. వీరి హాస్య రచనలకు 2009 సంవత్సరానికి గాను శేషారత్నం స్మారక హాస్యకథా పురస్కారం లభించింది.

'పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు'లో కథలన్నీ రచయిత్రి నిజ జీవితంలో జరిగిన హాస్య సంఘటనల ఆధారంగా రచించినవే.

వీటిలో 'దొంగ అట్లు', 'కూరల పేరంటం', 'ఇంటినిండా ఇంగిలీషు' ఇలాంటి కథలన్నీ సున్నితమైన హాస్యంతో, బాల్యంలో రచయిత్రి జీవితంలో జరిగిన హాస్య సంఘటనలు. పల్లెటూరి నేపథ్యంతో అమ్మమ్మ తాతయ్యల ఛలోక్తులతో, స్నేహితులతో ఆట పాటల్లోని హాస్య సన్నివేశాలతో నిజజీవితానికి దగ్గరగా వుంటాయి. ఈ కథలకూ 'పురాణం సీత గారి ఇల్లాలి ముచ్చట్లకూ' దగ్గరి పోలిక కనబడుతుంది. బహుశా రెండూ కూడా అచ్చమైన పల్లెటూరి నేపథ్యంతో, నిజ జీవితాలను చిత్రీకరించడం వల్లనేమో అనిపిస్తుంది. ఈ కథలనూ, పాత్రలనూ, సన్నివేశాలనూ తమ ఇంట్లోనో, ఎదురింట్లోనో, పక్కింట్లోనో చూసినట్టు పాఠకుడు అనుభూతి చెందుతాడు.

కథనం హాస్యభరితంగా, కొంగ్రొత్తగా వుండి సన్నివేశాలపరంగా హాస్యం సృష్టించడం పొత్తూరి విజయలక్ష్మి ప్రత్యేకత. ఎక్కడా శృతి మించకుండా, అత్యంత సున్నితమైన హాస్యం ఈ రచయిత్రి హాస్య కథలన్నిటిలోనూ కనిపిస్తుంది. హాస్య రచనలకే అంకితమైన ఏకైక రచయిత్రిగా పొత్తూరి విజయలక్ష్మి గారిని చెప్పుకోవచ్చు.

పుంఖాను పుంఖాలుగా హాస్యకథలు రాసిన రచయితల్లో మల్లిక్ ఒకరు. స్వతాహాగా కార్టూనిస్టు అవడం వల్ల అత్యధిక సంఖ్యలో కార్టూన్లు వేసి పాఠకులను కడుపుబ్బ నవ్వించిన అనుభవంతో ఈయన అనేక హాస్యకథలు వ్రాసారు. హాస్యం ప్రధానంగా సీరియల్సు, నవలలు వ్రాసినా వీరి రచనల్లో కథలు కూడా ఎక్కువే.

'ఢాం !' 'ఫట్' 'హిట్' 'తుస్స్' 'హిహిహి' 'భలే' ఇలాంటి కొత్త కొత్త పేర్లతో, వింత వింత పదాలను సృష్టించి, పాత్రలకు కూడా నవ్వు తెప్పించే పేర్లు పెట్టడం ద్వారా పాఠకులలో కథ చదివే కంటే ముందే ఆసక్తిని రేకెత్తించడం మల్లిక్ ప్రత్యేకత. కథనం కంటే కూడా పాత్రలను వర్ణించడం ద్వారానూ, సంభాషణల ద్వారానూ హాస్యం సృష్టించడం ద్వారా మల్లిక్ అనేక హాస్యప్రియులైన పాఠకులను అలరించారు.

ఇక్కడ ప్రస్తావించిన రచయితలే కాక అడపదడపా ఒకటి రెండు కథలు వ్రాసి, వాటిల్లోని హాస్యానికి అధిక ప్రశంసలు అందుకున్న రచయితలూ ఎంతోమంది వున్నారు. స్థలాభావం వల్లనూ, వారి హాస్య రచనల పరిధి వల్లనూ వారి రచనల గురించి ఇక్కడ విపులంగా ప్రస్తావించ లేకపోవడం జరిగింది.

ఆనాటి రచయితల్లో మొక్కపాటి నరసింహశాస్త్రి అధికంగా హాస్య రచనలు చేసినవారే.

అలాగే భమిడిపాటి కామేశ్వరరావు కూడా హాస్యరచయితగా ప్రసిద్ధులు. ముఖ్య స్రవంతిగా హాస్యాన్ని రాయకపోయినా అడపాదడపా చక్కటి హాస్య కథలు రాసినవారుగా మల్లాది వెంకటకృష్ణ మూర్తి, తనికెళ్ళ భరణి, శ్రీరమణ, తంబు, ఏవీయస్, మృణాళిని (కోమలి గాంధారం కథలు), శేషారత్నం లాంటి వారెందరో చక్కని హాస్య రచయితలుగా పేరు పొందారు.

తెలుగు కథ వందేళ్ళ పుట్టినరోజు జరుపుకుంటున్న నేపథ్యంలో విశ్వసాహితీ వీధిలో ఎవరికీ తీసిపోని స్థాయిలో తెలుగు కథలను అందిస్తున్న సందర్భంలో, మరిన్ని మంచి హాస్యకథలు కథాక్షేత్రాన్ని సుసంపన్నం చేస్తాయని ఆశిద్దాం.

# కథన శిల్పం

డా॥ పి. ఆర్. హరినాథ్

వాడు చెప్పేదొకటే నిజం కాదు – అన్నీ కథలే
వాడి కర్మ ఆమె చెప్పడం బాగుంటుది.

వంటి మాటలు సాధారణంగా వింటుంటాం. కథ – కథనం మన జీవితంలో అల్లుకుపోయాయని చెప్పడానికీ మాటలు సాక్ష్యం. నిజం అయినా కాక పోయినా అందంగా చెప్పడం – కథల్లోణం అంటే కాల్పనికాంశం అన్నమాట. ఈ చెప్పడం అందరిల్లోనూ ఒకే తీరుగా ఉండదు. అది కథనం. అందుకే వాడి కంటే ఆమె బాగా చెప్తుంది – అనడం ఇది ఒక నైపుణ్యం.

'శిల్పం నిపుణ కర్మా' – అన్నారు నిపుణత ఉన్న చోట శిల్పం కనిపిస్తుంది. కథనం 'కర్మ' అయితే అందులోని నైపుణ్యం 'శిల్పం'.

'యోగః కర్మను కౌశలం' అంది గీత. కర్మలోని కౌశల్యమే యోగం. కర్మ అయితే అందులోని కౌశల్యం యోగం. అంటే శిల్పం, యోగం రెండూ ఒకటే. సిద్ధిపొందిన స్థితిలో వ్యక్తమయ్యేది శిల్పం. అవ్యక్తమైంది యోగం. ఆ దృష్టితో కథకుడు ఒక యోగి. ఒక తపస్వి.

**కవి మహర్షి తపోఽగ్నిచే క్రాగి క్రాగి**
**సర్వతేజః ఫలంబు రసంబు తుదకు చూచినట్లు** (కల్పవృక్షం)

క్షోణిజాతను చూశానని ఆంజనేయడన్నాడు ఇందులో 'కవితా రూప తపస్సు' గురించి చెప్పబడింది. కథ కూడా ఒక తీవ్ర తపస్సు కదా ! అంచేత, కథనం ఒక యోగం. కథకుడు ఒక యోగి.

తాను దర్శించిన విషయాన్ని, వర్ణింపగల నేర్పు ఉన్నవాడు కవి. ఈ విషయం కథకు కూడా వర్తించేదే. వర్ణన విషయం వచ్చే సరికి కథకుడిలోని కవి రెక్క విప్పుతాడు.

**ఆకాశం జార్చిన కన్నీటి బొట్టు**
**ఘనీభవించినట్లుంది రైల్వే హాస్పిటల్** (క్షమాభిక్షః కొలకలూరి ఇనాక్)

"ఎదురుగా రూపం పొందిన న్యూమోనియాలాంటి ఇల్లు. తడిగా ఊపిరితిత్తుల్ని డెస్పరేట్‌గా సూర్యరశ్మిలోకి పైకి లాగి ఎండవేద్దామన్న ఊహతో దగ్గుతున్నట్లు గోడల మీద సర్రియలిస్ట్ తడిమచ్చలు, చారలు, గోడవెనుక. గాలిలో నీళ్లని దులుపుకుంటూ పచ్చగా ఆకాశకిరణంలా - అరటిచెట్టు, ధైర్యంగా అమాయకరంగా పిచ్చిది.

(భగవంతం కోసం, త్రిపుర)

వంటివి కథకుడి లోని కవిని ఆవిష్కరించే సన్నివేశాలు కథాంశాన్ని బట్టి వర్ణన బలాన్ని పొందుతుంది.

తాను చెప్పిన విషయాన్ని పదిమంది వినాలని ఎవరైనా ఆశిస్తారు. అలా అందరూ వినాలంటే ఆ చెప్పే తీరును నగిషీ పడతాడు. కథకుడు చేసే పని కూడా అదే. ఆ నగిషీయే శిల్పమవుతుంది. ఈ సందర్భంగా 'అగ్ని పురాణం' పేర్కొన్న అంశాన్ని గుర్తు చేసుకుందాం.

**భయానకం సుఖపరం గర్భేచ కరుణోరసః**
**అద్భుతోఽ ంతే సుక్లప్తార్థా నోదాత్తా సా కథానికా**

ఈ మాటల్లో కథను శిల్పంగా మలచడానికి అవసరమైన సూచనలున్నాయి. కథానిక - గురించి చెపుతూ అన్న మాటలవి. 'విషయంలో క్లుప్తత ఉండాలి. సుఖంగా ఉండాలి. అంటే రీడబిలిటీ అంటున్నాం అదన్నమాట. మనకు తెలిసినందా గుప్పించేసి మరీ బరువెక్కించకుండా ఉండాలి. మనసుకు హత్తుకునేవీ మనసును ద్రవింపచేసేవీ అయిన సన్నివేశాలుండాలి. ఉత్కంఠ కలిగించాలి. ముందు ఏమవుతుందో అనిపించాలి. అనుకోని మలుపులుండాలి. కొసమెరుపుండాలి.

**నీరజకు ముప్పై అయిదు వసంతాల ప్రాయం**
**కాదు వర్షాల ప్రాయమే** (మెరుపు మెరిసింది, రావిశాస్త్రి)

అనడంలో వర్షశబ్దం మీద చేసిన శ్లేష ఒకవైపూ, ఆమె జీవన విషాదాన్ని ఒక్కమాటలో తేల్చిన క్లుప్తత మరోవైపూ కథను తళతళలాడిస్తాయి.

'సైగల్ పాట'లో రావిశాస్త్రి చూపిన చిత్రణ మరుపురానిది. కరుడు గట్టిన మనసులో కరుణ పొంగించిన పాట గురించిన కథ అది. అనుకోని మలుపుతో ముగిసిపోయే కథ. కొసమెరుపులో కరుణ చిందించిన దృశ్యకావ్యమా కథ.

ముగింపు పఠితను ఆలోచనలోకి తీసికెళ్తే ఆరంభం కథలోకి లాక్కుని వస్తుంది.

ఎగ్జిబిషన్ లోపల ఎన్నో వస్తువులు, వినోదలూ ఉంటాయి. లోని వస్తువులెంత ముఖ్యమో - ప్రవేశద్వారమూ అంత ముఖ్యం. ముందుగా ద్వారం ఆకర్షిస్తుంది. అటు తర్వాత వస్తువులు కథారంభం కూడా దాదాపుగా ఇలాగే. అందుకే ఆరంభానికి కూడా ప్రాముఖ్యం ఉంది. ఎత్తుగడ అంటున్నాం దీన్ని.

**"ఆ రాత్రి చంద్రుడు భయంకరంగా ఉదయించాడు"**

(నల్లజర్ల రోడ్డు, తిలక్)

అనే చిత్రణలో ఒక్కసారిగా లోనికి లాక్కుంటుంది. కథకుడు పన్నే అందమైన వలే కథా రచనా శిల్పం.

విషయంతో పాటు విషయావిష్కరణ చాలా కీలకమైన విషయం. కథా శిల్పంలో ఈ అంశాన్ని గుర్తించవచ్చు. Awner zis మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

"Depicting something beautiful and depictine, something beautifully are by no means synonymous. Plekhanor pointed our that to paint an old man with a beard beautifully does not mean painting a beautiful old man with a beard."

(Foundations of Marxist Aesthetics p. 1950)

ఈ మాటలు కథాశిల్పాన్ని వ్యంజిస్తాయి.

# తెలంగాణ కథ - సామాజిక జీవిత చిత్రణ

డా॥ ముదిగంటి సుజాతారెడ్డి

తెలంగాణలో రచయితలకు కవిత్వం, పాటల తర్వాత ఇష్టమైన ప్రక్రియ కథానిక. ఆ తర్వాతనే నవల. కథానిక, నవల పుట్టి పెరిగిన కాలంలో తెలంగాణలో పూర్తిగా సాహిత్యానికే పరిమితమైన వాళ్ళు లేరు. సంఘ సంస్కరణలు, తెలంగాణ విమోచనోద్యమం, తెలంగాణ పోరాటంలో పాల్గొన్నవాళ్ళు తమ అనుభవాలను అనుభూతులను ప్రత్యక్షంగా చూసిన సంఘటనలను చిత్రిస్తూ కథలు వ్రాసారు. పోరాటం చేత ప్రేరేపితులై కథలు వ్రాసారు. ఆ తర్వాత నవలలు వ్రాసారు. రొమాన్స్, రాజ కుమారుడు రాకుమారి రాక్షసుల, వీరుల అద్భుత వృత్తాంతాల కథనం నుంచి వైదొలగి సామాన్యుని జీవిత చిత్రణను చేసిన నాటినుంచే ఆధునిక "కథ" ప్రక్రియ పుట్టింది. సమకాలిక సామాజిక చిత్రణ, సంభావ్యత, నిడివి తక్కువ వుండాలనటం కథకు ప్రధాన లక్షణాలు. ఎక్కువ పాత్రలు లేకుండా ఒక సంఘటన లేదా ఒక జీవితాంశంతో కూడి ఆరంభ విస్తరణ ముగింపు అనే కథన లక్షణాలు కలిగి సరళసులభశైలిలో ఆద్యంతం ఒక్క అంశాన్నే చిత్రించేది కథ. కథ ఏకబిగిని చదివింపచేస్తుంది. పరిమాణంలో చిన్నదయినా విషయావగాహన కలిగించటంలో పాఠకుణ్ణి ఆలోచింపజేసి చైతన్యాన్ని కలిగించటంలో కథ అపూర్వమైన గొప్ప ప్రక్రియ.

తెలంగాణ రచయితలు కథ ప్రక్రియ లక్షణాలను తెలుసుకునే వ్రాసారు. సామాజికాంశాలను వ్యక్తం చేయటానికి వాళ్ళు మొదటి నుంచి కథను చక్కగా వాడుకున్నారు. తెలంగాణ ప్రాంతంలో రెండు మూడు తరాలు తెలుగు భాష వాడకం, పాలనాభాష ప్రభువుల భాష అయిన ఉర్దూ చేత అణగదొక్కబడినా 20వ శతాబ్దారంభంలో గ్రంథాలయోద్యమాదుల చేత మాతృభాషాభిమానం చేత తిరిగి తెలంగాణలో తెలుగు రచనా భాషగా విజృంభించటం మొదలైంది. ఆ విధంగా మొదలైన సందర్భంలో తెలంగాణ కథకుల్లో కొంతవరకు కథనశిల్పం, వచన రచనలో తడబాట్లు కన్పించాయి. కాని వాళ్ళ వస్తువు ఇతివృత్తం వాస్తవికతలు కథకు ఒక ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. తమకు తెలిసిన ప్రజాజీవితాన్ని ప్రజల పోరాటాలను చిత్రించాలనే తపన తెలంగాణ కథకుల కథలకు ఒక కొత్త లక్షణాన్ని కొత్త నిర్వచనాన్ని కల్పించింది. "ఏవన్ గార్డ్" లక్షణాన్ని కలిగి వుంది. తెలంగాణ కథకులు ఎప్పుడూ

కూడా కథారచనలో తమ సామాజిక బాధ్యతను విస్మరించలేదు. అందుకే ఈ ప్రాంతం నుంచి ఉబుసుపోక రాసే కథలు తక్కువగా వచ్చాయి. అసలు రానేలేదు అని కూడా చెప్పవచ్చును.

తెలుగు కథ గురజాడ "దిద్దుబాటు"తో అవతరించిందంటారు. మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర రచిస్తూ ఆదిరాజు వీరభద్రరావు అనే విమర్శకుడు, చరిత్ర పరిశోధకుడు మాడపాటి హనుమంతరావు "హృదయశల్యము" తెలుగులో మొట్టమొదటి కథ అన్నాడు. గురజాడ 'దిద్దుబాటు' కథ మచిలీపట్నం నుంచి వచ్చే "ఆంధ్రభారతి"లో 1910 ఫిబ్రవరి సంచికలో అచ్చయితే మాడపాటి "హృదయశల్యము" ఆ "ఆంధ్రభారతి"లో 1912 జనవరిలో అచ్చయింది. అయితే ఆంధ్రభారతికి మాడపాటియే కథ ముందుగా 1910 నాటికి పంపివుంటాడు. కాని ఆంధ్రభారతి వారి నిర్ణయంలో ఆలస్యమై కథ అచ్చుకావటానికి సమయం పట్టి వుంటుంది. అంతేగాని ఆదిరాజు వీరభద్రరావు అబద్ధాలు వ్రాస్తాడనటంలో సామంజస్యం లేదు. ఆ తర్వాత తెలంగాణలో గ్రంథాలయోద్యమానికి ముందు నిలిచి కృషి చేసిన ప్రజల్లో విద్య విజ్ఞానం వ్యాప్తిస్తేనే మాతృభాషాభిమానం పెరుగుతుందని విశ్వసించి ప్రచురణలు చేపట్టిన కొమర్రాజు లక్ష్మణరావు వ్రాసిన "ఏబదివేల బేరము" అనే మంచికథ 1910 ఆంధ్రపత్రిక ఉగాది సంచిక (మార్చి ఏప్రిల్)లో అచ్చయింది. అంతేగాక తెలంగాణ ప్రాంతంలో పెరిగి నాగపూర్‌లో నివసించిన కొమర్రాజు సోదరి అచ్చమాంబ మాతృభాషాభిమానం విడువకుండ 1898 నుంచి తెలుగులో కథలు వ్రాసింది. ఆమె 1902లో వ్రాసిన "స్త్రీవిద్య, బీదకుటుంబం" కథలు తొమ్మిది వరకు దొరుకుతున్నాయి. ఆమె కథలో స్త్రీజనోద్ధరణతో కూడిన సంఘసంస్కరణ భావాలు అనేకం కన్పిస్తాయి.

తెలంగాణ నుంచి 1913లో వచ్చిన మొదటి పత్రిక "హితబోధిని". 1914లో ఆ పత్రిక సంపాదకుడు బండారు శ్రీనివాసరావు రచించిన "రాజయ్య సోమయాజులు" కథ అచ్చయింది. చక్కని కథనం, కథానిర్మాణం, వ్యంగ్యహాస్యంతో కూడిన ఈ కథ  బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలను చిత్రించింది.

ఈ విధంగా ఆంధ్రప్రాంతంలో కథ పుట్టుకకు ముందే తెలంగాణలో కథ పుట్టింది, వికసించింది. ఆంధ్రప్రాంతంలో లాగానే తెలంగాణలోను మొదట

రచయితలు స్త్రీ విద్య అవసరం, స్వేచ్ఛ, పురుషుల అనుమానాలు, పురుషుల వేశ్యా గమనం, బాల్యవివాహాలు, బాలికలను ముసలివాళ్ళకిచ్చి వివాహం చేసే దురాచారాలను గర్హిస్తూ సంఘసంస్కరణ భావాలను చిత్రిస్తూ కథలు రచించారు. వీరేశలింగం వంటివాళ్ళు ఆరంభించిన సంఘసంస్కరణోద్యమం ప్రభావం పరోక్షంగా తెలంగాణ రచయితల మీద కూడా పడింది. తెలంగాణలో కొత్వాల్ వెంకటరామారెడ్డి స్త్రీల కోసం హాస్టల్ పెట్టి స్కూళ్ళు నడిపాడు. స్త్రీవిద్య మొదలైన సంఘసంస్కరణలను ప్రోత్సహించాడు. తెలంగాణ రచయితలు మొదట్లో ప్రేమ్‌చంద్ అభ్యుదయ కథలు వాటి కథన శిల్పం చేత ప్రభావితులయ్యారు. మాడపాటి మొదలుకొని ఎందరో కథకులు ప్రేమ్‌చంద్ కథలను తెలుగులోకి అనువదించారు. అంతేగాక తెలంగాణ ప్రజలు ఆర్యసమాజం తెచ్చిన సామాజిక చైతన్యం, జండర్ సమానత చేత ప్రభావితమైనారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పోరాటం వల్ల స్త్రీకి విద్య వుండాలి, బాల్యవివాహాలు బలవంతపు వివాహాలు చేయకూడదు వంటి అభ్యుదయ భావాలు ప్రజల్లో వ్యాపించాయి. స్త్రీలూ అన్నివర్గాల వాళ్ళూ పోరాటంలో చేరి ఆయుధాలు పట్టి యుద్ధం చేసారు. ఈ కారణాలన్నింటి చేత తెలంగాణ నుంచి సంఘ సంస్కరణ కథల తర్వాత అభ్యుదయ సాహిత్యమే వచ్చింది. భావకవితా ప్రభావం ఇక్కడ లేదు. విశ్వనాథ, బాపిరాజు, చలం వంటి రొమాంటిసిజం రచయితలు ఇక్కడ పుట్టకపోవడానికి కారణమదే. అయితే హైద్రాబాదు నగరంలో బూర్గుల రంగనాథరావు, నందగిరి ఇందిరాదేవి, నెల్లూరి కేశవస్వామి, ధవళా శ్రీనివాసరావు, వెల్దుర్తి మాణిక్యరావు, హీరాలాల్ మోరియా వంటి రచయితలు "సాధన సమితి" 1939లో స్థాపించి "రొమాంటిసిజం" లక్షణాలు గల కథలు రచించారు. ఆ కథలు ఎక్కువ ప్రేమ, హాస్యం, పట్టణ నాగరికతను చిత్రించే కథలు. ఇంకోవైపు తెలంగాణలో నిజాంకు వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్నది. కాంగ్రెసు, కమ్యూనిస్టులు నైజాం రాజ్య విమోచనానికి పోరాడుతున్నారు. 1946 నుంచి ఈ పోరాటం తీవ్రతరమైంది. కమ్యూనిస్టులు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా భూపోరాటం చేయటం ఆరంభించారు.

ఇంకోవైపు నిజాం పాలనను కొనసాగించాలని నైజాంను పాకిస్తాన్‌లాగా స్వతంత్రరాజ్యంగా చేయాలని ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. దానిలో భాగంగానే హిందువులకు ఉద్యోగాలు డబ్బు ఆశలు చూపి ముస్లింలుగా మార్చి

ముస్లింల జనాభాను పెంచి నిజాంను గద్దెమీద వుంచాలని కొందరు పూనుకున్నారు. "ఇత్తెహాదుల్ ముసల్మీన్" సంస్థ బయలుదేరి మతాంతీకరణకు పూనుకుంది. ఇంకోవైపు "రజాకార్లు" అనే పేరుతో వాలంటీర్లుగా ఆయుధశిక్షణను పొంది భయానకవాతావరణాన్ని సృష్టించారు. వాళ్ళకు "ఖాసింరజ్వీ" నాయకుడు. రజాకార్లకు నిజాం పోలీసులు మిలటరీ కూడా తోడయ్యారు. ఊర్లమీద పడి ప్రజలను దోచుకోవటం, స్త్రీలను మానభంగం చేయటం, వివస్త్రలను చేసి బతుకమ్మ ఆటలు ఆడించటం, హింసించటం చేసారు. గ్రామాల్లో ప్రజలు దళాలుగా ఏర్పడి రజాకార్లను ఎదిరించి వీరోచిత పోరాటం చేసారు. కె.ఎల్.ఎన్.రావు వ్రాసిన "అమరవీరుడు" అనే కథలో రేణిగుంట గ్రామంలో రాంరెడ్డి గ్రామప్రజలను సమీకరించి రజాకార్లతో పోరాడి పారదోలి ఆఖరికి వీరోచితంగా మరణించిన వృత్తాంతాన్ని రచించాడు. ఎంతోమంది భయంతో ఆంధ్రప్రాంతాలకు వెళ్ళిపోయారు. అట్లా గ్రామ ప్రజలకు పారిపోవద్దని చెప్పి రాంరెడ్డి సాయుధపోరాటం చేసాడు. నిజంగా జరిగిన సంఘట ఆధారంగానే రచయిత ఈ కథను వ్రాసాడు. రజాకార్ల ఆగడాలను మారణహోమాన్ని చిత్రిస్తూ వెంకటేశ్వరరావు "గుండాలరాజ్యం" అడ్లూరి అయోధ్యరామకవి "జననా రజాకార్, బాంబులదాడి" వంటి ఎన్నో కథలను రచయితలు రచించారు. అడ్లూరి అయోధ్య రామకవి రజాకార్ల మారణహోమం కాలంలో విజయవాడలో తలదాచుకొని అక్కడి నుండే రజాకార్ల ఆగడాలను చిత్రిస్తూ ఆరు కథలు వ్రాసి "తెలంగాణ మంటల్లో" అనే పేరుతో సంపుటిగా 1948లో ప్రచురించాడు. "చీకటిరాజ్యం" కథలో గ్రామాల్లో స్వయంసేవక దళాలు ఏర్పడి రజాకార్లను ఎదిరించి పోరాడిన సంఘటనను చిత్రించాడు. "కాలాన్ని తేవాలి" కథను అయోధ్యరామకవి ఆర్ట్స్ కాలేజీపైన భారత త్రివర్ణపతాకాన్ని విద్యార్థులు ఎగురవేసిన చారిత్రక ఘట్టాన్ని తీసుకొని రచించాడు. 1947 ఆగస్టు 15వ తారీఖున మొత్తం భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని నైజాం ఇంకా నిజాం నిరంకుశ పాలనలోనే వుంది. భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తే విదేశపతాకమనే పేరుతో మూడు సంవత్సరాలు కఠినశిక్ష అమలవుతుందని నిజాం ప్రభుత్వం ప్రకటించింది. అటువంటి సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం గీతం పాడారని విద్యార్థులను ఖాళీచేయించి హాస్టళ్ళను మూయించారు. కాని ముగ్గురు విద్యార్థులు మాత్రం వుండిపోయి తెల్లవారుజామున ఆర్ట్స్ కాలేజి బిల్డింగ్ మీదికి ఎక్కి భారత జాతీయ

పతాకాన్ని ఎగురవేస్తారు. ఇంతలో పోలీసులు అక్కడికి వచ్చి తుపాకులు పేలుస్తారు. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మరణిస్తారు. ఒక్క విద్యార్థిని మాత్రం అబ్దుల్లా అనే ముస్లిం విద్యార్థి వచ్చి రక్షించి సీతాఫల్‌మండిలో తన ఇంటికి తీసుకువచ్చి చికిత్స చేస్తాడు. నైజాంలో అబ్దుల్లా లాంటి  జాతీయ ముస్లింలు చాలామంది వుండేవారు. కాని వాళ్ళకు ప్రాణరక్షణ లేక భయపడి బయటికి రాకపోయేవాళ్ళు. అయోధ్య రామకవి అటువంటి జాతీయ భావాలు కలిగిన ముస్లిం అబ్దుల్లా పాత్రను సృష్టించాడు. ఆర్ట్స్ కాలేజి మీద ముగ్గురు విద్యార్థులు జండా ఎగురవేసి పోలీసుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయింది నిజంగా జరిగిన వృత్తాంతం. దాన్నే రచయిత ఇక్కడ కథగా మలిచాడు. ఆనాటి 1948 నాటి పరిస్థితులను ప్రతిబింబింపజేస్తూ ఈ కథ నడిచింది. ఇప్పటికీ ఆ వృత్తాంతాన్ని దృష్టిలో పెట్టుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆర్ట్స్ కాలేజి మీదనే వైస్‌ఛాన్సలర్ స్వాతంత్ర్యదినం నాడు గణతంత్రదినం రోజు త్రివర్ణ పతాకను ఎగురవేసే సంప్రదాయం నడుస్తున్నది.

నిజాం పాలనలో వున్న భూస్వామ్యవ్యవస్థలో సామాన్య ప్రజల మీద ఎన్నో అన్యాయాలు దోపిడీలు అత్యాచారాలు జరిగేయి. కులవృత్తులవాళ్ళు ఊరి దొరలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి జీతభత్యాలు లేకుండా చాకిరి చేయవలసి వచ్చేది. దాన్నే వెట్టి చాకిరి అనేవారు. తమ పనులను మానుకొని కడుపుకు తిండిలేకున్నా వెట్టిచాకిరి మాత్రం చేయవలసి వచ్చేది. ఆనాటి వెట్టిచాకిరిని చిత్రిస్తూ రచయితలు చాలామంది కథలు రచించారు. వట్టికోట ఆళ్వారుస్వామి 'పరిగె' కథలో మల్లయ్య వెట్టిచాకిరి చేసివచ్చి తినటానికి గింజలు లేక పొలంలో తోవలో వున్న తాలుధాన్యాన్ని కోసుకుంటాడు. భూయజమాని చూసి వాణ్ణి దొంగ అని చెప్పి పోలీసుల కప్పగించి జైలుపాలు చేస్తాడు. సురవరం ప్రతాపరెడ్డి "సంఘాలపంతులు" కథలో వెట్టిచాకిరి ఎంత కిరాతకంగా వుండేదో వర్ణించాడు. ఊరి షావుకారు ప్రభుత్వోద్యోగులు అడిగిన సామాన్లను ఏది అడిగినా అది డబ్బులేకుండా ఇయ్యవలసి వచ్చేది. ఆ విధంగా ప్రజలు అన్ని విధాల దోపిడీకి గురయ్యేవారు. పొట్లపల్లి రామారావు "మామూళ్ళు" కథలో దొరలు ఉద్యోగులు ప్రజల మీద పన్నుభారం ఎట్లా క్రూరంగా మోపేవాళ్ళో చిత్రింపబడింది. ఆవుల పిచ్చయ్య "వెట్టి చాకిరి దినచర్య", భాగ్యరెడ్డివర్మ "వెట్టిమాదిగ", బి. సీతారామారావు "గరీబోణ్ణి" కథలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా కలవృత్తులవాళ్ళు సంఘటితమై పోరాటానికి దిగిన వృత్తాంతాన్ని వ్రాసాడు. గ్రామాల్లో "సంఘం" పేరుతో కమ్యూనిస్టులైన యువకులు దళాలు కట్టారు. దాంతో ప్రజలకు

దొరల, భూస్వాముల అన్యాయాలను దోపిడీలను ఎదిరించే బలం, ధైర్యం వచ్చింది. ఆ చైతన్యంతోనే ఊరి ప్రజలు తమ భూములను కాజేసి కబ్జా చేసుకున్న దొరలను జాగీర్‌దార్లను ఎదిరించి తమ భూములను తిరిగి సంపాదించుకున్నారు. కాంచనపల్లి 'ఆకలి' కథలో దొరలు పేదల భూములను ఆక్రమించుకునే వృత్తాంతాన్ని తీసుకొని చక్కని కథగా మలిచాడు. "చెరువొడ్డున" కథలో కాంచనపల్లి హిందూదొర ముస్లింజాగీర్‌దారు ఒక్కటై ప్రజలను హిందూ ముస్లింలుగా చీల్చి వాళ్ళల్లో వాళ్ళకు కొట్లాట పెట్టించి తమ పొలాలకు చెరువునీళ్ళు పారించుకుంటారు. కొట్లాటకు దిగిన ప్రజలు దొరల కుతంత్రం తెలుసుకొని సంఘటితమై ఎదిరిస్తారు. తమ భూములకు నీళ్ళను మళ్ళించుకుంటారు.

పి. వెంకటేశ్వరరావు రచించిన "సంఘంచిట్టీ" కథలో ఊర్లో సామాన్య ప్రజలు సంఘంలో చేరి చైతన్యవంతులయి తిరుగుబాటు చేసిన వృత్తాంతాన్ని చిత్రించాడు. నిజంగానే ఆ కాలంలో అదేవిధంగా జరిగింది. ఊరికి పోలీసు అమీన్ దొరాకు వస్తాడు. సామాన్లను మోయటానికి వెట్టివాళ్ళను పనికి పిలుస్తాడు అమీను. "దొరా ! వెట్టిగా పని చెయ్యలేము. పైసలు ఇయ్యాలె" అంటారు ప్రజలు. అమీన్ కోపంతో తిడ్తాడు. "బోలో ఆంధ్ర సంఘానికీ జై ! వెట్టి చాకిరి నశించాలె !" అని ప్రజలు నినాదాలు చేస్తారు. ప్రతిఘటన చైతన్యంతో వారంతా ఏకమై నిలుస్తారు.

హిందూముస్లింల మధ్య వున్న సఖ్యతను చిత్రిస్తూ కథలు తెలంగాణ నుంచి చాలా వచ్చాయి. వట్టికోట ఆళ్వారుస్వామి "మెదడుకు మేత" కథలో హిందూ ముస్లింల మధ్య కొట్లాటలకు ప్రభుత్వం, బ్రిటిషువాళ్ళే బాధ్యులని చెప్పాడు. కాంచనపల్లి "చెరువొడ్డున" కథలో పై వర్గం వాళ్ళ స్వార్థమే హిందూ, ముస్లింలలో కక్షలను పెంచుతుంటాయి. సురవరం ప్రతాపరెడ్డి "మొగలాయికథలు" పేరుతో మొగలాయిల పాలనను గురించి వ్యాప్తిలో వున్న కథలను చదివించే శైలిలో ఆధునిక కథాశిల్పంతో వ్రాసాడు. ఈ కథల్లో ప్రభుత్వోద్యోగుల దోపిడి అన్యాయాలను అన్యాపదేశంగా సురవరం వర్ణించాడు. ఇంకా ఆయన "హుసేన్‌బీ" కథలో కామాక్షి తురకమతం తీసుకున్న పరిస్థితులను చిత్రించాడు. ఇటువంటిదే జి. రాములు 1945లో వ్రాసిన "ఆత్మఘోష"లో సమాజం, కులం, వెంకటేశ్వర్లు కులాంతర ప్రేమ వివాహాన్ని ఆమోదించదు. బావలు అతని చెల్లెండ్లను వదిలేస్తారు. దాంతో ఎటూతోచని పరిస్థితుల్లో వెంకటేశ్వర్లు ముస్లిం మతంలో చేరుతాడు. తన చెల్లెండ్లకు

మళ్ళామంచి ఆఫీసర్ల కిచ్చి పెండ్లిళ్ళు జరిపిస్తాడు. ఆ విధంగా ఈ కథ ఆనాటి సంప్రదాయపు ఉక్కు సంకెళ్ళను చిత్రిస్తున్నది. "మెహ్దీబేగం, అపరాధం, ఖిస్మత్" వంటి కథలలో సురవరం స్త్రీల జీవితాలను వాళ్ళ వ్యథలను చిత్రించాడు. నెల్లూరు కేశవస్వామి "చార్మినారుకథలు"లో ముస్లిం పేదరికాన్ని, సమస్యలను, బాధలను, కష్టాలను చిత్రించాడు. ఆ విధంగా తెలంగాణ కథా రచయితలు తమ చుట్టూవున్న ప్రజల జీవితాలను వస్తువుగా చేసుకొని చిత్రించారు. జనజీవితంలో భాగమైన ముస్లింల వృత్తాంతాలను కూడా తీసుకొని కథలు వ్రాసారు.

నల్లగొండ జిల్లా విస్నూరు గ్రామం దొర గుండాలు ప్రజల మీద దాడులు చేసారు. ఆ గుండాలను ఎదిరిస్తూ ప్రజలు దళాలుగా ఏర్పడ్డారు. దొరను ఎదిరిస్తూ నినాదాలతో ఊరేగింపుగా బయలుదేరారు. గుండాలు ఊరేగింపుపై కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో దొడ్డి కొమురయ్య మరణిస్తాడు. ప్రజలసాయుధపోరాటానికి నాంది అదే. దొడ్డి కొమురయ్య అమరవీరుడయ్యాడు. ఆ నేపథ్యంలో జులై 25వ తేదీన ఊరేగింపులు జరపాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. విస్నూరు, కడివెండి ఇంకా చుట్టుప్రక్కల గ్రామాల్లోని ప్రజలు ఎక్కడిపనులు అక్కడే వదిలేసి ఊరేగింపుల్లో పాల్గొన్నారు. తమ తిరుగుబాటు చైతన్యాన్ని ప్రదర్శించారు. ఈ చారిత్రక సంఘటనను కండ్లకు కట్టేట్లుగా చిత్రిస్తూ ఆవుల పిచ్చయ్య "ఊరేగింపులు" అనే కథను వ్రాసాడు.

పూర్వభారత ప్రధాని పి.వి. నరసింహారావు వరంగల్‌లో ఆ రోజుల్లో పాములపర్తి సదాశివరావు గారితో కలిసి "కాకతీయ" పత్రికను నడిపాడు. 1948లో ఆయన వ్రాసిన "గొల్లరామవ్వ" కథలో ఒక సాహసవంతుడైన యువ కార్యకర్తను గొల్లరామవ్వ పోలీసుల నుంచి కాపాడిన ఇతివృత్తం వుంది. సామాన్య ప్రజలు కూడా చైతన్యవంతులై ఉద్యమానికి ఉద్యమకారులకు తోడ్పడిన చారిత్రక సత్యం ఈ కథలో ప్రతిబింబించింది. 1948 సెప్టెంబరు 18వ తేదీన నిజాం భారత్ యూనియన్ సైన్యానికి లొంగిపోయినట్లుగా ప్రకటించాడు. నిజాం పాలన అంతమై మిలటరీ ప్రభుత్వం కొన్నాళ్ళు సాగింది. ఆ తర్వాత వెల్లోడి ప్రతినిధిగా పాలన సాగింది. ఈ కాలంలోని పరిస్థితులను చిత్రిస్తూ కథలు వచ్చాయి. నెల్లూరి కేశవస్వామి "యుగాంతం" కథలు మిలటరీ నైజాంను స్వాధీనం చేసుకుంది. రజాకార్లు లొంగిపోయారు. ఎంతోమంది ముస్లిం యువకులు తమ ఇష్టానికి విరుద్ధంగా రజాకార్లల్లో చేరినవాళ్ళున్నారు. అటువంటి యువకుడే దిలావర్. దాడుల్లో

రజాకారుగా దోచుకున్న నగలను డబ్బును తను తలదాచుకున్న హిందూ స్నేహితుడింట్లో వదిలేసి తన డిగ్రీ పత్రాలు ఏవీ తీసుకోకుండా కొత్తదేశంలో స్థిరపడటానికి దిలావర్ వెళ్ళిపోయే వృత్తాంతం వుంది. ఆ రోజుల్లో ఎంతోమంది ఆ విధంగా తమ ఆస్తులను సంపదలను వదిలేసి నిరాశ్రయులుగా పాకిస్తాన్ వెళ్ళిపోయారు. ఇల్లిందల సరస్వతీదేవి "కానికాలంవస్తే" కథలో నైజాం రాజ్యం కూలిపోయిం తర్వాత దర్జాలకోసం అప్పులు చేసి చితికిన ముస్లిం జాగీర్దార్ల కుటుంబాలు వాళ్ళ స్త్రీలు ఎట్లా నిరాశ్రయులయ్యారో వర్ణించింది. మిలటరీ ప్రభుత్వం, ఆ తర్వాత ప్రభుత్వం తెలంగాణను దోచుకునే ఇతివృత్తాన్ని తీసుకొని కాళోజి "లంకాపునరుద్ధరణ" కథగా వ్రాసాడు. హాస్యవ్యంగ్యంతో కూడిన ఈ కథ చక్కగా నడిచింది.

1950, 60 దశకాల్లో తెలంగాణ నుంచి అంపశయ్య నవీన్, దాశరథి రంగాచార్య, వంటివాళ్ళు కొందరే కథలను రచించారు. ఆ కాలంలో వస్తువు విషయంలో భాష విషయంలో రచయితలు కొంత కల్లోలంలో పడిపోయారు. తెలంగాణా కథాసాహిత్యంలో ఆ కాలాన్ని స్తబ్దతతో కూడిన ఒక సంధియుగమని చెప్పాలి. కవిత్వంలో స్తబ్దత లేదు. దాశరథి, సి.నారాయణరెడ్డి, తిరుగుబాటుకవులు, దిగంబర కవులు కవిత్వం జోరుగా వ్రాస్తున్నారు. వచనంలో లాగా కవిత్వంలో అభివ్యక్తి మాధ్యమంగా భాష గురించిన సమస్య రాలేదు. 1956లకు పూర్వం తెలంగాణ కథా రచయితలు మొదట గ్రాంథికంలో తర్వాత అభ్యుదయ కథల్లో తాము మాట్లాడుకునే తెలంగాణ నుడికారం పలుకుబడివున్న భాషను ప్రయోగించారు. 1956 నుంచి ఏ భాషలో వ్రాయాలన్నది తెలంగాణ కథా రచయితలకు సమస్య అయింది. ఈ కాలంలో ఆంధ్రప్రాంతాల ప్రామాణిక భాషను గ్రహించి కథకులు సామాన్య జనానికి దూరమైన ఇతివృత్తాలతో కథా రచన చేసారు. 1956 వరకు సమకాలిక జీవితాన్ని పోరాటాలను చిత్రిస్తూ కథలు రచించిన పదులు వందల సంఖ్యలో రచయితలు ఉన్నారు కాని 1950, 60 దశకంలో తెలంగాణా నుంచి ఎక్కువమంది రచయితలు లేరు. సురమౌళి, గూడూరి సీతారాం, యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, చక్రవర్తి రంగస్వామి వంటివాళ్ళు కథా రచనను కొనసాగించారు. వీళ్ళు తెలంగాణ మాండలికాన్ని ప్రయోగిస్తూ గ్రామీణ జీవితాన్ని చిత్రించారు. అయితే వీళ్ళ రచనలకు తెలుగు కథ ప్రధాన స్రవంతిలో అప్పుడు

అంతగా గుర్తింపు వచ్చినట్లు కనపడదు. యశోదారెడ్డి కోడలమ్మవెతలు, నిశ్చితార్థం, ఎచ్చమ్మ కథలు గ్రామీణ జీవితాన్ని కుటుంబంలోని కలతలను చిత్రిస్తున్నాయి. గూడూరి సీతారాం "నారయ్యబతుకు" జి. రాములు రచించిన కథలు వృత్తిజీవితం వాళ్ళ జీవితాల్లోని ఒడిదుడుకులను చిత్రిస్తున్నాయి. సురమౌళి "అంగుడుపొద్దు", "ముక్కోటిబలగమోయి" కథలు చక్కని మాండలికంలో వున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిం తర్వాత ఉద్యమాలు అయిపోయిం తర్వాత సామాన్యుడు పార్టీకి దూరమైన తీరును "అంగుడుపొద్దు" కథ చాలా బాగా వ్యాఖ్యానించింది. డి. రామలింగం, నెల్లూరి కేశవస్వామి, ఇల్లిందల సరస్వతీదేవి వంటివాళ్ళు పాతతరం రచయితలయినా 1981లో తమ కథలను పుస్తకంగా అచ్చు వేసుకున్నారు. వట్టికోట ఆళ్వారుస్వామి కథలు "జైలులోపల" పేరుతో 1952లో అచ్చయ్యాయి. 1956లో "పరిసరాలు" పేరుతో ఆళ్వారుస్వామి కథల సంకలనాలను ప్రచురించాడు. దీనిలో ఎక్కువమంది తెలంగాణ కథకులున్నారు. కథకులు తమ చుట్టూవున్న పరిసరాలను గురించి వ్రాస్తారు. వ్యాఖ్యానిస్తారు. తెలంగాణలో కథారచయితలెప్పుడూ తమకు తెలిసిన జీవితాన్నే సంఘటనలనే కథలుగా వ్రాసి సమకాలిక సమాజాన్ని చిత్రించారు. తెలంగాణ మాండలికాలను ప్రయోగిస్తూ చాలామంచి కథలు రచించారు. కాని వాళ్ళ రచనలు ఆంధ్రరచయితల కథల వలె ప్రసిద్ధ పత్రికల్లో అచ్చయి గుర్తింపును పొందలేకపోయాయి. అది భాషా వివక్షవల్లనే జరిగింది. 1970లో విరసం ఏర్పడిన తర్వాత ఉత్తరతెలంగాణ పోరాట కాలంలో తెలంగాణలో మళ్లా ఒకసారి కథా రచన ఊపు అందుకుంది. 1970, 80 దశకాల్లోని రచయితలు సమకాలిక సమాజాన్ని, విప్లవోద్యమాన్ని, ఉద్యమం సామాన్య ప్రజల్లో తెచ్చిన చైతన్యాన్ని, తమ కథల్లో చిత్రించారు. తెలంగాణ కథంటె విప్లవ కథనే అన్నంతగా ఈనాటి రచయితల కథలు తెలుగు కథా ప్రపంచంలో గుర్తింపును పొందాయి. ఈ క్రమంలో పాతతరం తెలంగాణా రచయితల కథలను అందరూ పూర్తిగా మరచిపోయారు. 1970కి పూర్వమున్న యాభైసంవత్సరాల తెలంగాణ కథావైభవం భూస్థాపితమైంది. ఇప్పుడు తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ అన్వేషణ కాలంలో ఆ కథా సాహిత్యమంతా బయటికి వచ్చింది. 1970, 80 దశకాల్లో అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తం రెడ్డి, పి. చంద్, బి.యస్. రాములు, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, సదానంద శారద, భూపాల్, వుప్పల నరసింహం, పులుగు శ్రీనివాస్, చెరబండ

రాజు, నిఖిలేశ్వర్ వంటి ఎందరో రచయితలు ఉద్యమ చైతన్యాన్ని ప్రజాజీవితాన్ని చిత్రిస్తూ కథలు రచించారు. "భూమి, మధ్యవర్తులు, నీల" వంటి కథల్లో అల్లం రాజయ్య ఉద్యమస్ఫూర్తిని చిత్రించాడు. "చావువిందు, జాడ, పనిపిల్ల" వంటి ఉద్యమ నేపథ్యంలో కథలను తుమ్మేటి రచించాడు. బొగ్గు గనుల నేపథ్యంతో భూ నిర్వాసితుల కథలను పి. చంద్ రచించాడు. సదానంద శారద "జాడి", వుప్పల నరసింహం "ఇత్తనపుకోడె" కథలు వ్రాసారు. బి.యస్. రాములు, కాలువ మల్లయ్య, బోయ జంగయ్య మొదలైన రచయితలు కథలు వ్రాసారు. బి.యస్.రాములు "వారసత్వం", కాలువ మల్లయ్య "ఊరుమ్మడి బ్రతుకు" కథలు వర్గవ్యవస్థను ప్రశ్నిస్తున్నాయి. మానవ సంబంధాల్లోని మమతలను గురించి వ్యవసాయంలో వస్తున్న మార్పులను గురించి బి.యస్. రాములు, కాలువ మల్లయ్య, జూకంటి జగన్నాథం కథలు వ్రాసారు. హైదరాబాదులోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల జీవితాలను వాళ్ళల్లో కలిగిన చైతన్యాన్ని చిత్రిస్తూ పులుగు శ్రీనివాస్ "ఆరు కార్మికుల కథలు" వ్రాసాడు. బోయ జంగయ్య "బొమ్మలు, ప్రయాణం" మొదలైన కథల్లో దళిత చైతన్యాన్ని చిత్రించాడు.

1990-95 ప్రాంతంలో తెలంగాణ నుంచి వచ్చిన కథల్లోని ఇతివృత్తం వస్తువులు మారాయి. తెలంగాణ కథ అంటే విప్లవ కథ, విప్లవ చైతన్యాన్ని చిత్రించే కథ అన్న భావం తొలగిపోయింది. 1990 దశకం నుంచి తెలంగాణ కథల వస్తువు పరిధి పెరిగింది. తెలంగాణ అభిమానం, తెలంగాణ భాష మీద అనురాగం పెరిగింది. తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథకు విప్లవ కథ అన్న గుర్తింపేగాని వేరే అస్తిత్వం లేకుండా వుండటం పత్రికలు పత్రికా సంపాదకులు పాఠకులు తెలంగాణ మాండలికంలో వ్రాసిన కథలను అచ్చువేయకుండా పక్కన పెట్టటం ఇంకా కొనసాగటంతో 1990 దశకం నుంచి తెలంగాణ కథకులు తెలంగాణా భాషలోనే పట్టుదలతో వ్రాయడం కొనసాగించారు. ఇంకోవైపు భాషపై ప్రపంచీకరణ ప్రభావం, ఆర్థిక విధానాల ప్రభావం విదేశీ భాష సంస్కృతుల దాడి మొదలయింది. ఈ దాడిని ఎదిరిస్తూ ప్రపంచంలో అన్ని దేశాల్లో అన్ని జాతుల్లో తమ భాష తమ సంస్కృతులను కాపాడుకోవాలనే ఆకాంక్షలు పెరిగాయి. ఆ నేపథ్యంలో తమ ప్రాంతపు భాషా సంస్కృతులను వెక్కిరింతలు, ఉపేక్ష, వివక్ష, పక్షపాతాల నుంచి సంరక్షించుకోవాలనే తపన తెలంగాణ రచయితల్లో, కవుల్లో పెరిగింది. దాంతో తెలంగాణ భాషలో స్థానిక ప్రజల జీవితాలను సంస్కృతిని చిత్రిస్తూ కథలు వచ్చాయి.

శిథిలాలవుతున్న గ్రామాల మీద, చిన్ననాటి గ్రామజీవితం మీద, తమ ఊరు, కుటుంబం, భాష, యాసలమీద 'నోస్టాల్జియా'ను ప్రకటిస్తూ తెలంగాణ కథకులు కథలు వ్రాసారు. ప్రపంచీకరణాన్ని దాంతో వస్తున్న మానవసంబంధాల్లోని అమానవీయతను ఇతర ప్రాంతాల పెత్తనాన్ని నిరసిస్తూ కథలు వ్రాసారు. మాతృభాష సంస్కృతుల మీద అభిమానాన్ని వ్యక్తం చేస్తూ కథలు వ్రాసారు. మరుగున పడిన తెలంగాణ చరిత్రను సాహిత్యాన్ని కథా సాహిత్యాన్ని వెలికితీసే ప్రయత్నాలు పరిశోధనలు జరిగాయి. ఒక విధంగా 1990 దశకం ఉత్తరభాగం తెలంగాణ సాహిత్యంలో పునరుజ్జీవనోద్యమ కాలమని చెప్పాలి. 1970ల నుంచే తెలంగాణాలో కథా రచన జరిగిందని అంతకుముందు కథా సాహిత్యమే లేదని ఒక అపోహ సాహిత్య విమర్శకులుల్లో వుండేది. ఆ అపోహ తొలగిపోయి ఆంధ్రప్రాంతంలో కథ ఆరంభమైన కాలంలోనే తెలంగాణలో కథ ఆరంభమైందన్న సత్యం బయటపడింది. ఆనాటి సమకాలిక జీవితాన్ని ఉద్యమాలను ఫ్యూడల్ వ్యవస్థను చిత్రిస్తూ ఎన్నోవందల కథలు తెలంగాణా నుంచి వచ్చాయన్న నిజం బయటపడి, తెలుగుకథల సాహిత్య చరిత్రలో ఒక నూతనాధ్యాయం తెరుచుకుంది. ఒక కొత్త పరివీక్షణం (పర్స్పెక్షన్) కలిగింది. కథల్లో కన్పించే ప్రాంతీయాభిమానం, ఉపేక్షకు వివక్షకు గురయ్యామన్న వేదన కవిత్వంలోనూ దీర్ఘకవితల్లోనూ కన్పించింది. ఒక ప్రాంతం వాళ్ళు మరో ప్రాంతం మీద దోపిడీ సామ్రాజ్యవాద పెత్తనం చలాయించటం తెలంగాణ రచయితలు కవులు నిరసించారు. తీవ్రంగా స్పందించారు. ఆ స్పందన నుంచే తెలంగాణ నుంచి రచనలు రావటం చేత దీన్నొక వాదంగా అంగీకరించవలసి వస్తున్నది. విప్లవానంతరం స్త్రీ, దళిత, ముస్లిం అస్తిత్వ వాదాలతో పాటుగా ప్రాంతీయ అస్తిత్వవాదం తెలంగాణలో ఆవిర్భవించింది. తెలంగాణ అస్తిత్వవేదనను చిత్రిస్తూ, బి.యస్.రాములు, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య, పంజాల జగన్నాథం బి.వి.ఎన్. స్వామి, కె.వి. నరేందర్, పెద్దింటి అశోక్‌కుమార్, ముదిగంటి సుజాతారెడ్డి బెజ్జారపు రవీందర్, బెజ్జారపు వినోద్‌కుమార్, బోధన్ నర్సిరెడ్డి, జాతశ్రీ దీవి సుబ్బారావు, కాసుల ప్రతాపరెడ్డి, అనిశెట్టి రజిత, గీతాంజలి, ఐతా చంద్రయ్య, వేముల మల్లయ్య, దిలావర్, అఫ్సర్ ... ఇంకా ఎంతోమంది కథలు వ్రాస్తున్నారు. పుట్టిన ఊరు మీద మమకారం, బాల్యం, చిన్ననాటి ఆటలు స్నేహితులను తలచుకొని, "నోస్టాల్జియా"ను వ్యక్తం చేయటం వీళ్ల కథల్లో కన్పిస్తున్న ఒక గుణం. దిలావర్

"మార్పు" ముదిగంటి సుజాతరెడ్డి "ఊరు బాగుపడేదెప్పుడు" బోధనం "పేగుబంధం", జగన్నాథం 'మట్టి వాసనలు' వంటి ఎన్నో కథల్లో ఈ 'నోస్తాల్జియా' చిత్రణ జరిగింది. వృత్తి పనులవాళ్ళ సమస్యలు, వృత్తిపనులు నశించటం, జీవనోపాధి లేక పనులవాళ్ళ ఆత్మహత్యలు, వృత్తి పనులను విడిచి వేరే పనుల్లో ప్రవేశించటం ఈ బాధలను చిత్రిస్తూ జూకంటి జగన్నాథం జాతశ్రీ, నేరెళ్ళ శ్రీనివాసరావు, శిరంశెట్టి కాంతారావు, ఉదయమిత్ర, కాలువ మల్లయ్య కథలను రచించారు. పర్యావరణం పల్లెల్లో ఫ్లోరిన్ దుష్ప్రభావం గురించి పి. చిన్నయ్య 'భవబంధాలు', 'పాలన' పెద్దింటి అశోక్‌కుమార్ 'పడగనీడ', ఎలికట్టె శంకర్రావు 'ఒరుగు', 'దూప', బెజ్జారపు రవీందర్ 'పీనుగ' కథలను వ్రాశారు.

కోస్తాంధ్ర నుంచి వలసలు రావడం వల్ల తలెత్తిన సమస్యలను తీసుకుని పులుగు శ్రీనివాస్ 'సంకర విత్తులు', చిన్నయ్య 'వివక్ష', 'ఇంటి దొంగలు' కథలు వ్రాశారు. పాత ఉద్యమకారులు రియల్టర్లుగా పెట్టుబడిదారులుగా మారటాన్ని చిత్రిస్తూ చిన్నయ్య 'జీవన కథలు' రచించాడు. తెలంగాణ నుంచి జీవనోపాధి వెతుక్కుంటూ బొంబాయి, దుబాయిలకు వలసలుపోవడం, అక్కడ వాళ్ళు ఎదుర్కొనే సమస్యలు ఇక్కడ వాళ్ళ బంధువులు ఎదుర్కొనే సమస్యలను చిత్రిస్తూ అంబల్ల జనార్ధన్, పెద్దింటి అశోక్‌కుమార్, బి.వి.యన్. స్వామి కథలు వ్రాశారు. అశోక్‌కుమార్ 'ఘర్షణ' కథలో భర్త మస్కట్ పోతే భార్య గ్రామంలో ఎదుర్కొనే సమస్యలను చాల వాస్తవికంగా చిత్రించాడు. తెలంగాణలోని జాతరలో సంస్కృతి విశేషాలను చిత్రిస్తూ పంజాల జగన్నాథం 'తీర్థం', తెలంగాణ వ్యథను చిత్రిస్తూ బెజ్జారపు రవీందర్ 'నిత్య గాయాల నది', ఐతా చంద్రయ్య 'డప్పు', బి.వి.యన్. స్వామి 'కుంపటి', కె. పద్మలత 'భాషా సౌందర్య' కథలను వ్రాశారు. గీతాంజలి 'బచ్చేదాన్', 'పెహచాన్' కథల్లో హైద్రాబాద్ పాతబస్తీ భాషను ప్రయోగిస్తూ ముస్లిం స్త్రీల బాధలను, కష్టాలను చాల బలంగా చిత్రించింది.

తెలంగాణ నుంచి ముస్లిం రచయితలు తమ ప్రాంతాభిమానాన్ని పండుగలు గురించి ముస్లిం జీవిత నేపథ్యంతో కథలు వ్రాసి తమ "నోస్తాల్జియా"ను ప్రకటించుకున్నారు. అఫ్సర్ 'గోరీమా', 'తెలంగీ పత్తా', షాజహాన్ 'సిల్‌సిలా', మహమ్మద్ నిసార్ 'వతన్', దిలావర్ 'గీ బూమి నాది' వంటి కథలు వ్రాశారు. దళితవాదాన్ని చిత్రిస్తూ బోయ జంగయ్య ఎన్నో కథలు వ్రాశాడు. ఆయన

అంబేద్కరిజంను విశ్వసించాడు. జ్ఞానంతోనే అభివృద్ధిని సాధించాలిగాని హింసతో కాదని జంగయ్య విశ్వాసం. వేముల ఎల్లయ్య దళితవాదాన్ని ప్రబోధిస్తూ కథలు, నవలలు రచించాడు. తెలుగు సాహిత్యంలో ముస్లిం మైనారిటీ వాదం తెలంగాణలో 'స్కైబాబా, యాకూబ్, గౌస్ మొహియుద్దీన్, ఖాజా' మొదలైన రచయితల రచనలతోనే రూపుదిద్దుకుంది. దళిత, బిసి, ముస్లిం స్త్రీలకు కులం శ్రమ రంగు, మతం పురుషాధిపత్యం అణచివేతలున్నాయి. ఇప్పుడు వాటిని గురించి వాళ్ళే మాట్లాడాలనుకుంటున్నారు, వ్రాయాలనుకుంటున్నారు. స్త్రీవాదంతో ఒక కొత్త కోణాన్ని తెలంగాణ నుంచి రచయిత్రులు ఆవిష్కరిస్తున్నారు.

ముస్లిం మైనారిటీ వాదంలో స్త్రీ గొంతును రచయిత్రి షాజహాన్ వినిపిస్తే దళిత బిసి వాదంలో స్త్రీ వేదనను గోగు శ్యామల, జాజుల గౌరి, జూపాక సుభద్ర, అనిశెట్టి రజిత వినిపిస్తున్నారు. 'రడం' కథలో గోగు శ్యామల దళిత బాలిక విద్యాభ్యాసం చేయడం ఎన్ని కష్టాలతో కూడిన పనో సంవేదనాత్మకంగా చెప్పింది. జాజుల గౌరి 'మన్ను బువ్వ' కథలో దళిత జీవితంలోని పేదరికాన్ని, బాధలను వాస్తవికంగా చిత్రించింది. జూపాక సుభద్ర కథల్లోని శైలి బలమైంది. సామాజికంగా రాజకీయంగా దళిత స్త్రీలు ఎంత వివక్షకు గురవుతున్నారో సుభద్ర తన కథల్లో చెప్పింది. అనిశెట్టి రజిత బిసి స్త్రీల జీవితంలోని బాధలను 'మట్టి బంధం' కథల్లో చిత్రించింది. తెలంగాణా కథా సాహిత్యంలోనే ముస్లిం మైనారిటీ స్త్రీల, దళిత బిసి స్త్రీల గొంతులు ప్రత్యేకంగా బలంగా వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఈ గొంతులు బలహీనంగా వున్నాయి.

తెలంగాణా కవిత్వంలో వున్న అన్ని దశలను, వాదాలను, యుగాలను కథా సాహిత్యం కూడా ప్రతిబింబిస్తున్నది. తెలంగాణా తొలితరం కథలను చదివి పరిశీలిస్తే ఆనాటి సామాజిక రాజకీయ చరిత్రను తెలుసుకోవచ్చును. తర్వాతి కాలంలోనూ తెలంగాణా రచయితలు సామాజిక బాధ్యతను మరువకుండా కథలను రచించారు. ఈ కథల ఆధారంగా తెలంగాణా వంద సంవత్సరాల చరిత్ర నిర్మాణం చేయవచ్చునంటే అతిశయోక్తి కాదు.

# తెలుగు కథ - మానవీయ స్పర్శ

డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి

ప్రపంచంలో ప్రతి అంశానికీ నిర్వచనాలు సాధించడం దాదాపు అసాధ్యం. తర్కబద్ధమైన ప్రతి విషయానికీ నిర్వచనాలు ఉంటాయి. అయితే ఈ విశ్వంలోని విషయాలన్నీ తర్కబద్ధమైనవి కావు ! ఇక్కడ వ్రాసిన మూడు వాక్యాల్లో ఎటువంటి గందరగోళమూ లేదు, అన్వయ క్రమం కూడా సరిగ్గానే ఉంది ! ఇకపోతే, మానవీయత అన్న ప్రస్తుతాంశం హృదయానికి దగ్గరగా ఉంటుంది. అందువల్ల తర్కానికి లొంగదు. అందుకే దీనికి నిర్వచనాలు లేవు. మనిషి తాను పొందిన అనుభవాలు అందిన అనుభూతుల ద్వారానే మానవీయతను అర్థం చేసుకోగలుగుతాడు. మానవుడిలో నికార్సుగా ఉండవలసిన లక్షణం మానవీయత. మరొకరికి అంతో ఇంతో ఉపకారం చేయాలన్న ఆరాటం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనుకునేతత్త్వం, మానవ సంబంధాల్లోని ఆర్ద్రతల్ని ఆవిష్కరించగలిగే తీరు – ఇవన్నీ మానవీయతకు సంక్షిప్త ఉదాహరణలు. ఆచి తూచి చెబితే ఈ వరుస మరింత పెద్దదవుతుంది. హృదయమున్న కవి తిలక్ "చావుపుట్టుకల మధ్య సందేహం వంటి జీవితంలో మంచి గంధం లాగ పరిమళించే మానవత్వం మనకున్న ఒకే ఒక్క అలంకారం" అన్నారు. మానవీయతతో కూడిన అనుబంధాన్నే మానవీయ స్పర్శ అని అభివర్ణించుకుందాం. తెలుగు కథానికల్లో కనిపించిన మానవీయ స్పర్శను సింహావలోకనం చేయడమే ప్రస్తుత వ్యాససంకల్పం.

సాహిత్యంలో మానవీయ స్పర్శ అనే భావనకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆదికావ్యమైన రామాయణంలోనే మనకు ఎన్నో ఆధారాలు దొరుకుతాయి. రాముడు మానవీయ స్పర్శను రూపుదిద్దుకున్న మహాకరుణామూర్తి. ఆయనకు పళ్ళను తినిపించిన శబరి, రాముడిని తన పడవపై పయనించమని కోరిన గుహుడు, రాముడికి అపారమైన సహకారాన్ని అందించిన హనుమంతుడు. రావణుడి కొలువులో ఉన్నా, అతడు తన అన్న అయినా అతడితో విభేదించిన విభీషణుడు – ఇట్లా ఎన్నెన్నో మానవీయస్పర్శ గల పాత్రలు ! పరమ దరిద్రుడైన కుచేలుడిని ఆదరించిన అతడి బాల్యమిత్రుడు శ్రీకృష్ణుడు మానవీయ స్పర్శకు చిరస్మరణీయ ఉదాహరణ. సంస్కృత సాహిత్యంలో విస్తారమైన రచనలు ఉన్నాయి. వీటిలో గొప్ప

వైవిధ్యమూ ఉన్న సంగతి తెలిసిందే. వ్యూహ ప్రతివ్యూహతత్త్వానికి, రాజస తామస ప్రవృత్తుల ప్రతి ఫలానికి ప్రాధాన్యత ఇచ్చిన విశాఖదత్తుడి నాటకాలకంటే మానవీయ స్పర్శనే ప్రధానంగా ఎంచుకున్న భవభూతి, అశ్వఘోష, హర్ష చక్రవర్తుల రచనలకే ఎక్కువ ఆదరణ లభించడం చరిత్ర చెబుతున్న నిజం ప్రపంచంలోని పలు ఇతర సాహిత్యాల్ని సమీక్షించినపుడు కూడా అందులో మానవీయస్పర్శకే అగ్రతాంబూలం దక్కుతుందని స్పష్టపడుతుంది. భారతీయ ఆంగ్ల రచయితల్లో అత్యంత ప్రసిద్ధులు ఆర్.కె. నారాయణ్. ఆయన రచించిన మాల్గుడి కథలు దేశవ్యాప్తంగా పరిచితమయ్యాయి. ఈ కథలు కొన్ని ప్రధానంగా హాస్య రసస్ఫోరకంగా కనిపిస్తాయి. కానీ లోనారసి వీక్షించినపుడు ఆ కథల్లో సాంద్రమైన మానవీయ స్పర్శ దోబూచులాడుతుంది. బహుశా ఈ మహత్తర గుణం కారణంగానే ఆర్.కె. నారాయణ్ కథలు చిరంజీవినులు అయ్యాయి. అన్ని కథల్లోనూ ఏదో ఒక మానవీయ కోణాన్ని నిక్షిప్తం చేయడం అందరు రచయితలకూ సాధ్యమయ్యే పనికాదు. కానీ, తనదైన వ్యక్తిత్వ సంపద, రచనా ప్రతిభలు తోడురాగా ఆర్.కె. నారాయణ్, దీనిని సాధించారు. తెలుగు నవలా సాహిత్యంలో రెండు "క్లాసిక్" రచనలు – విశ్వనాథ వేయిపడగలు, ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి. వేయిపడగలు నవలలో ధర్మారావు వంటి ప్రధాన భూమికలతో పాటు చిన్న కొట్టు పెట్టుకొని బ్రతికే నాయర్ పాత్రవరకు ఎంతోమంది మానవీయ మూర్తులు కనబడతారు. మాలపల్లిలో తక్కెళ్ళ జగ్గడిలో మానవీయ స్పర్శ ఉంది. అతడు పరోపకారం కోసమే తిరుగుబాటుదారు అయ్యాడు. ఇక ఇతర సాహిత్యేతర కళల విషయానికి వస్తే – తెలుగు సినిమా ప్రేక్షకులకు కాశీనాథుని విశ్వనాథ్‌ను కొత్తగా పరిచయం చేయనవసరం లేదు. శంకరాభరణం చిత్రం చరిత్ర సృష్టించింది. అటు తర్వాత ఆయన దర్శకత్వంలో రూపొందిన పలు సినిమాలు సరికొత్త అధ్యాయాల్ని నిర్మించాయి. ఈ అన్ని చిత్రాల్లోనూ మానవీయ స్పర్శ ఉన్న ఏదో ఒక ప్రధాన భూమిక కనిపిస్తుంది. ఆ పాత్ర యావత్ చిత్రానికి ఇరుసుగా మారుతుంది. శంకరాభరణం తులసి, సాగర సంగమం మాధవి, స్వాతిముత్యం శివయ్య – ఇట్లా ఎన్నో పాత్రలు. కళారంగంలో కూడా మానవీయ విలువల నిశ్శబ్ద అస్తిత్వాన్ని వివరించేందుకే ఈ అంశాన్ని పేర్కొనవలసివచ్చింది.

తెలుగులో వివిధసాహిత్యప్రక్రియల వ్యాప్తికి కొన్ని పరిమితులు ఉన్నాయి. పద్య కవిత్వం అందరికీ అర్థమవుతుందని చెప్పడం సాహసమే అవుతుంది. అట్లా

అని సంక్లిష్టమైన ప్రతీకలతో - కొన్ని ప్రయోగాలతో రూపు దిద్దుకున్న వచన కవిత కూడా అందరికీ అర్థంకాదు. నాటకం - అది ప్రదర్శన పొందగలిగితేనే తన లక్ష్యాన్ని సాధించినట్టు లెక్క. నవలను ఆసాంతం చదవాలంటే ఎంతో ఓపిక అవసరం. అయితే ఈ పరిమితులేవీ లేని ప్రక్రియ కథ - లేదా కథానిక. వల్లంపాటి వెంకటసుబ్బయ్య వ్రాసినట్టు "తెలివైన పాఠకుడు ఏకాంతంగా చదువుకోవటానికి ఉద్దేశింపబడ్డ సాహిత్య ప్రక్రియ కథ" స్వల్ప వ్యవధిలో పాఠకుడు కథా పఠనాన్ని పూర్తి చేస్తాడు. ప్రతిభావంతుడైన కథా రచయిత రచనను చదివిన పాఠకుడికి ఏదో ఒక చక్కని అనుభవం తప్పక వస్తుంది. అనుభూతీ అందుతుంది. నేటికీ తెలుగు పాఠకుల్లో ముప్పాతిక మువ్వీసం మధ్య తరగతివారే. తెలుగు కథ మధ్య తరగతిని చక్కగా ప్రతిబింబించింది. "తెలుగు కథకుల్లో ఎక్కువ మంది మధ్య తరగతి కుటుంబాలనుండి వచ్చినవారు. అందువల్లనే కావచ్చు ఇక రాయవలసిందేమీ లేదన్నంతగా మధ్య తరగతి వాళ్ళ సుఖ దుఃఖాలను గురించి, రాగద్వేషాలను గురించి యోగ వియోగాలను గురించి అసంఖ్యాకంగా కథలొచ్చేశాయి. వాళ్ళ స్వార్థాలు, మొండిపట్టుదలలు, కుటిల బుద్ధులు, వెకిలి చేష్టలు, విచిత్ర మనస్తత్వాలు సంకుచిత పరిధిలో నుండి బయటపడి వెలుగుకు కళ్ళప్పగించి ఆరోగ్యప్రదమైన మార్పుకోసం శ్రమించి మానసిక వికాసం కోసం తద్వారా వ్యక్తిత్వ వికాసం కోసం ఈ తరగతి ప్రజలు చేసే ప్రయత్నాలన్నీ కథల్లో ప్రతిఫలించాయి" అన్న మధురాంతకం రాజారాం విశ్లేషణ ప్రత్యక్షర సత్యం. తెలుగుకథ తన మధ్య తరగతి పాఠకులను పదిలంగా గుర్తు పెట్టుకొని ఎదుగుచూ వచ్చింది. 20వ శతాబ్ది మలి దశకాల్లో సాహిత్యేతర సిద్ధాంతాల ప్రభావం బలంగా సోకని ప్రక్రియగా కథానికను అభివర్ణించుకోవచ్చు. నవల కూడా అంతే అయినా 1980 అనంతరం ఈ ప్రక్రియల్లో ప్రవేశించిన వ్యాపార ధోరణులు దాన్ని బాగా బలహీనం చేశాయి. అయితే కథమాత్రం ఈ ధోరణులన్నిటికీ అతీతంగా నిలబడగలిగింది. ఉద్యమ కథలకంటే, జీవన వాస్తవికతను, మానవ విలువలను కళాత్మకంగా చెప్పిన కథలే బలంగా నిలబడడం గమనించవలసిన సంగతి. తెలుగు కథానిక ఏనాడూ నేలవిడిచి సాము చేయలేదు. వాకాటి పాండురంగారావు వ్రాసినట్టు "తెలుగు కథ జనాలను, వారి జీవితాలను వదిలిపెట్టలేదు. నవల వలె వెర్రిపోకడలు పోలేదు. సినిమాలకు అమ్ముడుపోలేదు. నాటకం వలె నీరసించలేదు. కవిత్వం వలె అర్థం కాకుండా సాముగరిడీలు

చేయలేదు." - అందుకే తెలుగు కథ ఇంటి ముంగిటి రంగవల్లికలవలె తమ ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నాయి. ఈ రంగవల్లికల హృదయాల్లో మానవీయ గుణం దండిగానే ఉంది.

తొలితరం తెలుగు కథారచయితలు ప్రధానంగా సంస్కరణ వాదంవైపు దృష్టి సారించారు. గురజాడతోనే ఈ ధోరణి ఆరంభమైనది. సమాజాన్ని మరమ్మత్తు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ తొలితరం రచయితలు కథలు వ్రాశారు. అయితే ఇదే సమయంలో జాతీయోద్యమం తెలుగు సీమలో ఉధృతమైంది. ఇది కూడా కొన్ని కథల్లో ప్రతిబింబించింది. ఇంగ్లీషు విద్యా విధానం వల్ల కొన్ని కుటుంబాల్లో ఏర్పడ్డ అదృశ్య ఘర్షణలు, పట్టణీకరణ విస్తరించడంలో మారిన మానవ అనుబంధాలు, సాంఘిక సంబంధాలు, మధ్యతరగతిలో పొడసూపే డాంబికాలు, వారిని అడపాదడపా ఆవరించే దారిద్ర్యం - ఇట్లా నాటి సమాజం కథా వస్తువుగా మారింది. తొలితరం తెలుగు కథల్లో అద్భుతమైన శిల్పదృష్టి ఉంటుంది. ఆనాటి కథలు కథలు కావు. కథా శిల్పులు తీర్చిదిద్దిన పాలరాతి శిల్పాలు. చింతా దీక్షితులు, అడవి బాపిరాజు, వేలూరి శివరామశాస్త్రి, మల్లాది రామకృష్ణ శాస్త్రి, చలం, మునిమాణిక్యం నరసింహరావు ఇంకా ఎంతోమంది ప్రతిభావంతులు కథా కుసుమాల్ని సృష్టించారు. ఈ వరుసలో మానవీయ స్పర్శకు పెద్దపీట వేసిన తొలిరచయితగా చింతా దీక్షితులను గుర్తించాలి. ఆదివాసుల జీవితాల్ని తొలిసారి కథాక్షరరూపంలో పరిచయం చేసిన సృజనశీలి చింతా దీక్షితులు. మానవీయ స్పర్శనే తన కథలకు ప్రధాన ప్రేరణగా మార్చుకొన్న గొప్ప రచయిత. కరుణ కుమార. ఆయన రచించిన కథలు చదివితే శుష్కమైన దుఃఖం కాకుండా, బరువైన ఆలోచనలు కలుగుతాయి. మన దృక్పథంలో మార్పు దిశ ఆరంభమవుతుంది. కరుణకుమార కథాతత్వాన్ని గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య ప్రకటించిన ఈ అభిప్రాయాన్ని పరిశీలించండి.

"ఇరవైయ్యవ శతాబ్దంలో పుట్టిన (1901) కథా రచయితల్లో జ్ఞాపకం పెట్టుకోవలసిన మొదటివాడు కరుణకుమార. ఇతడు గోదావరి జిల్లాలో పుట్టి నెల్లూరు జిల్లాలో ఉద్యోగరీత్యా స్థిరపడి ఆ జిల్లా జీవితాన్నీ, భాషనూ ఆజరామరం చేసిన రచయిత. తెలుగు రచయితల్లో కథను తప్ప మరో ప్రక్రియను స్పృశించని మొదటి రచయితగా కూడా కరుణకుమారను చెప్పుకోవచ్చునేమో. అంతకుముందెన్నడూ

లేనంతటి జీవిత విస్తృతి కరుణ కుమార కథల్లో పెరిగింది. పట్టణాలు, పల్లెలు, అగ్రహారాలు మాలవాడలూ కరుణకుమార కథల్లో కథా స్థలాలు. శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణుల నుంచి ఎరుకలూ ఏనాదులూ మాలలూ మాదిగలూ ముస్లింలూ క్రైస్తవులు అతని పాత్రలు. కులవర్ణ సంబంధాల్లోని పీడన అతని ప్రధాన కథా వస్తువు. కథా స్థలాలూ, కథా వస్తువులూ కథా వస్తువుల్ని ధరించే పాత్రలూ ఒకటిగా మిళితమై సజీవంగా రూపొందటం కరుణకుమార కథల ప్రత్యేకత. అతనికి వర్గ సిద్ధాంతం గురించి తెలుసు – వర్ణ స్వభావం తెలుసు. కానీ గాంధీ ఉన్నవల ప్రభావం అతని మీద బలంగా ఉండటం చేత ఉదారవాద మానవత్వం ఛాయలు అతని కథల్లో కనిపిస్తాయి. "కయ్యి – కాలువ" "బిళ్ళల మొలతాడు" అన్న రెండుకథల్ని చూస్తే ఈ రెండు విషయాలు స్పష్టంగా కనిపిస్తాయి. బస్ కండక్టర్‌గా గుమాస్తాగా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, తహసీల్దారుగా పనిచేసిన కరుణకుమార జీవితానుభవం విస్తృతమైంది. కాలికి బలపం కట్టుకొని పల్లె పల్లెకూ తిరిగిన అతనికి పల్లెల్లోని మానవ సంబంధాలను గురించీ సన్నజీవాల దైన్యాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసు. వాటిని నిశితంగా ఆర్ద్రంగా చూడటం తెలుసు. వాటిని చక్కని నిర్మాణం ఉన్న కథలుగా మలచడం తెలుసు. కథకూ కథా వస్తువుకూ ప్రాణం పోసేలాగ జీవిత చిత్రణ చేయడం వీటన్నిటి కంటె బాగా తెలుసు....." – మానవీయ స్పర్శ ఉన్న కథల కొక గొప్ప లక్షణం ఉంది. అందుల్లో "సిద్ధాంతాల" ప్రతిధ్వనులు వినిపించవు.

తెలుగు పాఠకులు గర్వించదగిన రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి. అనితరసాధ్యమైన శిల్పం, మంచిగంధపు తుఫానువంటి శైలి, నేల విడిచి సాముచేయని వస్తువు – రావిశాస్త్రి కథలకు మృత్యుంజయత్వాన్ని సాధించిపెట్టాయి. రచయితగా వ్యక్తిగా కూడా ఆయన మానవీయ స్పర్శ మూర్తీభవించిన మనీషి. విశాఖనగరంలో ఆయనతో పరిచయమున్న వారంతా ఈ నిజాన్ని చెబుతారు. ఆయన "కార్నర్ సీటు" అనే కథ రాశారు. చాలామంది కథా విశ్లేషకుల దృష్టిలో అది గొప్ప కథ. అందులోని సారాంశం మానవీయ స్పర్శ. ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు ఆ కథను సంక్షిప్తీకరించి ఇట్లా వ్రాశారు.

"కార్నరు సీటు" కథలో అత్యవసరంగా బయలుదేరి రద్దీగా ఉన్న రైలు కంపార్ట్‌మెంట్‌లో కార్నర్ సీటు కోసం ప్రయత్నం చేస్తాడు రాజు. అప్పటికే పచ్చకోటు తొడుక్కున్న ఆసామి ఒకడు అక్కడ కూర్చొని ఉంటాడు. రాజు అతణ్ణి గురించి

పలు విధాలుగా ఆలోచిస్తూ చికాకు పడుతుంటాడు. పచ్చకోటు ఆసామీ మధ్యలో రైలుదిగి తలకిందపెట్టి ఆత్మహత్య చేసుకుంటాడు. ఒక ఆడ కూలిమనిషి వెక్కి వెక్కి ఏడుస్తుంటే నీకతను ఏమవుతాడని ప్రశ్నిస్తారు జనం. "ఏమవుతాడు బాబూ ? మీకేమవుతాడో నాకూ అదే అవుతాడు. నిండు ప్రాణమా మరేమన్నానా, పోతే ఏడ్పురాదూ ? అని ఆమె వాళ్ళను అడుగుతుంది."

ఇక్కడ ఆ కూలిమనిషి స్పందనలో మానవీయస్పర్శ గాఢంగా ఉంది. కథల్లో మానవీయ స్పర్శకు ఇదొక అత్యుత్తమ ఉదాహరణ.

న్యాయవాదిగా జీవన ప్రస్థానాన్ని కొనసాగించిన రావిశాస్త్రి శుష్క ఆదర్శాలను ప్రవచించే కుహనా మేధావి కాదు. ఆయన తన న్యాయవాదవృత్తిలో ఎందరెందరినో చూశారు. చాలామంది కథా రచయితలు గుర్తించని జీవన కోణాల్ని ఆయన పరిశీలించారు. ఆయన కథలకు ఇవే వస్తువులయ్యాయి. రావిశాస్త్రి నిశిత పరిశీలనాశక్తి ప్రతిరూపాలే ఆయన రాసిన కథలు. కార్నర్ సీటులో మానవీయ స్పర్శను పరిచయం చేసిన రావిశాస్త్రి మామిడిచెట్టు కథలో నీలమణి పాత్ర ద్వారా అమానవీయ మనస్తత్వం ఎట్లా ఉంటుందో పరిచయం చేశారు. "Anti Thesis" (యాంటీ థీసిస్)గా ఉంటుందనే ఉద్దేశ్యంతో మామిడిచెట్టు కథను ఇక్కడ ప్రస్తావించడం జరుగుతుంది.

నీలమణి ఎటువంటివాడంటే. . . (రావిశాస్త్రి వాక్యాల్లో. . . )

రెవెన్యూ సర్వీసులో ఉండగా నీలమణి గారు రెండు ప్రపంచ యుద్ధాల తాకిడి చూసేడు. పర ప్రభుత్వపు బూటు బరువు మోసి చూసేడు. ప్రజల తిరుగుబాటు చూసాడు. గాంధీ గార్ని చూసాడు. ప్రతిరోజూ శని ఆదివారాలు కూడా ఆఫీసుకి వెళ్ళి సేవచేసి చివరికి తాశిల్దారీ చేసేడు. రిటైరయేడు. ఇల్లు కట్టేడు. నా పావు వాటా కాక మరో రెండు వాటాలు అద్దెకిచ్చేడు. అతగాడు ముష్టివాళ్ళను వెంటబడి తరుముతాడు. పసిపిల్లల్ని దూరంగా ఉంచుతాడు. బేరం ఆడిఆడి కూరలు కొంటాడు. నువ్వుకొన్న పేపరు ప్రతిరోజు చదువుతాడు. . ." ఇటువంటి ఘనతర మనస్తత్వమున్న నీలమణి ఇంట్లో రచయిత అద్దెకు దిగుతాడు. ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు అతడికి బాగా నచ్చుతుంది. అయితే ఆ చెట్టు మొదలు నీలమణి ఇంట్లోనే ఉన్నా దాని కొమ్మలు ఇటు పక్క ఇంట్లోకి, అటు వీథిలోకి విస్తరిస్తాయి. తన చెట్టు నీడ

ఇతరులకు పనికిరావడం నీలమణికి అసలు నచ్చదు. అంతటి స్వార్థపరుడు నీలమణి. పక్కింటి వాళ్ళు ఆ మామిడి చెట్టుకు దీపం పెట్టుకొని దర్జాగా పేకాడుకుంటారు. నీలమణి మండిపోతుంటాడు. ఆ ఇంట్లో పిల్లలు ఉయ్యాల కట్టుకొని ఆ చెట్టు దగ్గర ఊగుతారు. నీలమణి ఆగ్రహంతో ఊగిపోతాడు. ఇంటిముందు దారిలో ఆ చెట్టు నీడన ఒక ముసలమ్మ మొక్కజొన్న కంకులు కాల్చుకొని అమ్ముకుంటుంది. నీలమణి మనసు కోపంతో కాలుతుంది. వీరందరినీ తన చెట్టు వాడొద్దని చెబుతాడు. హెచ్చరిస్తాడు. వాళ్ళు బేఖాతరు చేస్తారు. నీలమణికి కోపం వస్తుంది. ఇతరులకు ఆనందం పంచే తన మామిడి చెట్టును వేళ్ళతో సహా కొట్టి పారేస్తాడు. ఇదీ నీలమణి అమానవీయ ధోరణి. రావిశాస్త్రి రాసిన గొప్ప కథల్లో ఇదీ ఒకటి. అయితే రావిశాస్త్రి నిరాశావాదికారు. అందుకే ముగింపు ఇట్లా చేశారు.

"ఆ ఇంటి వెధవల్ని, ఆ ఇంటి పక్కింటి వెధవల్ని వాళ్ళ వాళ్ళ తగవుల్నీ వాళ్ళు ఎక్కే కోర్టుల్నీ అక్కడి జడ్జీలనీ, ప్లీడర్లనీ, పార్టీలనీ, పోలీసుల్ని ఈ జేయిళ్ళనీ సంకెళ్ళనీ ఎరగనివాళ్ళ చుట్టూ అంతా కలిసి చుట్టే పాశాల్ని అంతా చూస్తుంటే నాకు మరి లాభం లేదు. ఈ మనిషి వెధవలు మరింక బాగుపడరు, ఈ లోకం ఇదంతా ఘోరమైన నరకం అనిపించి బతకడం దుర్భరంగా తోస్తుంది.

కాని అంతలోనే

తళతళలాడే తెల్లని ఎండా, తల్లిలాంటి చల్లని మబ్బూ పూచిన లేమామిడి మొక్క ఎండలో పల్లె పిల్ల బరువు నడకా గుర్తుకొస్తాయి. పొలాల మీద గాలి జ్ఞాపకం వస్తుంది. వర్షంలో అక్కడి మనుషులు గుర్తుకొస్తారు. పకపకలాడి పనిచేసే ప్రజా సమూహమంతా ఎదరకొస్తుంది. నీడకోసం పోరాడిన ముసలమ్మ నా దృష్టిపథంలో ఎప్పుడూ నిలిచి ఉంటుంది. అపుడు నాకు కొంచెం ధైర్యం వచ్చి ఫరవాలేదు. ఆ నరకాన్ని తోసిపారెయ్యవచ్చు కష్టపడైనా ఆనందాన్ని నిల్పుకోవచ్చు అనిపించి నాలోని ఆశ కొంతగానైనా నిలుస్తుంది. . . "

ఈ వ్యాసంలో మానవీయ స్పర్శతో వెలువడిన ఉత్తమ స్థాయి కథలన్నిటినీ విశ్లేషించడం అసాధ్యం. పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి రాసినట్టు "మంచి నవల వ్రాసిన వారి పేర్లని వేళ్ళు మీద లెక్కింపగలమేమో కాని మంచి కథకుల పేర్లు లెక్కించడానికి వేళ్ళు సరిపోవు." అందుకే మానవీయ స్పర్శకు చక్కని ఉదాహరణలుగా నిలబడగలిగే కొన్ని కథల్ని పరిచయం చేసేందుకు ప్రయత్నిస్తాను.

అవసరాల రామకృష్ణారావు కొన్ని దశాబ్దాలుగా కథలు రాస్తున్నారు. గంభీరమైన అంశాన్ని కూడా ఎంతో సున్నితమైన రీతిలో అల్లగలిగిన కథన సౌందర్యం ఆయన కథల్లో ఉంటుంది. ఆయన చాలాకాలం క్రితం రచించిన "దేవుడి పల్లకి" అన్న కథ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, వాకాటి పాండురంగారావు సంపాదకత్వంలో వెలువడిన "కథాభారతి"లో చోటు చేసుకుంది.

అవసరాల వారు ఈ కథలో రెండు పూర్తి విభిన్న మనస్తత్త్వాలున్న పాత్రలను చూపించారు. వారిలో ఒకడు జగన్నాథం, భారతీయ పట్టణ మధ్య తరగతికి ప్రతిరూపం. "భద్రలోక్" సమాజానికి ప్రతినిధి. తనకు సమస్యలు రాకుండా ఉంటేచాలు. సమాజం మంచి చెడ్డలతో తనకేమీ పనిలేదు అనుకునే తత్త్వం. ఇదొక తరహా లక్ష్మణ రేఖలు గీచుకున్న వ్యక్తివాదం. జగన్నాథం – కామేశం ఒకే తరగతిలో చదువుకునే పిల్లలు. కామేశం తరహా వేరు. కామేశం తత్త్వం ఎటువంటిదీ అంటే – "ఆ ముందురాత్రి కామేశం ఎదురింట్లో ఎవడో కన్నం వేశాడుట. కామేశానికి మెలుకువ వచ్చి వాణ్ని తరిమి పట్టుకున్నాడట. వాళ్ళమ్మ నెత్తీ నోరూ బాదుకుందిట. "బాబూ మన ఇల్లు కాదు వాకిలి కాదు నువ్వు చూస్తే కుర్రాడివి దొంగల దగ్గర కత్తులుంటాయి. ఎందుకురా ఇలాంటి సాహసం పనులు. . .?" "మొగాడ్ని గనక" అన్నాట్ట కామేశం – ఇదీ సంగతి, కామేశం మాటలకు తండ్రి మండిపడ్డాడు. దెబ్బలు కొట్టాడు. ఒంటిమీద దెబ్బల్ని చూసి తనతో చదువుకునే పిల్లలు విస్మయపోతే "ఓస్ ఈ దెబ్బలు నాకో లెక్కట్రా ! ఇవాళుంటాయ్ రేపు పోతాయ్. . నాల్రోజుల పాటు నిలబడే పని చెయ్యాల్రా. . . ఎదుటి వాడికి అన్యాయం జరుగుతూంటే ఊరుకుంటే మనకీ పశువులకీ అట్టే తేడాలేదు. మనం మనుష్యులం అనిపించుకునే పనులు చెయ్యాలోయ్" అన్న మాటల్లో కామేశం హృదయం ప్రతిబింబిస్తుంది. "దేవుడి పల్లకి" కథలో సుబ్బయ్య పేరుతో మరో పాత్రను అవసరాలకు ప్రవేశపెట్టారు. అయితే అతడి వ్యక్తిత్వం పరిచయమవుతుంది. కానీ అతడి మాటలేవీ ఉండవు. అందరికీ మంచినీళ్ళు పోసే సుబ్బయ్య నాలుగురోజుల జ్వరానికే చచ్చిపోయాడు. ఒకటి రెండు వాక్యాల్లో సుబ్బయ్య వ్యక్తిత్వాన్ని రచయిత పాఠకులకు పరిచయం చేశారు. "తెలిసినవాళ్ళ యిళ్లల్లో ఎవరి ఇంట్లో కాస్త వెచ్చగా ఉన్నా చాలు ఇక ఆ మంచం వదిలే వాడు కాడు. తల్లీ తోడూ కూడా అంటు రోగాలని భయపడి దూరంగా పోయే రోగుల దగ్గరిక్కూడా వాడు నిర్భయంగా సేవచేసేవాడు. మంచినీళ్ళ సుబ్బయ్య అనే పేరు వాడికి క్రమంగా తగ్గి మంచి సుబ్బయ్య అనే పేరు నిలబడిపోయింది. ఆఖరుకి ఆ మంచి నిలబడి సుబ్బయ్యే వెళ్ళిపోయాడు. . . ."

అందరికీ తన జీవితమంతా సేవ చేసిన సుబ్బయ్య, ఎవరి నుండీ ఏదీ ఆశించకుండా అందరికోసం పాటుపడిన సుబ్బయ్య, ఊళ్ళో ఎవరు చచ్చిపోయారని తెలిసినా తనే నాయకత్వం వహించి అంత్యక్రియలు ఏర్పాట్లు చేసిన సుబ్బయ్య. . . . అతడు చనిపోతే మాత్రం అతడి అంత్యక్రియల ఏర్పాట్లకు ఎవ్వరూ ముందుకు రాలేదు. అతడితో సేవలు చేయించుకున్న వారు కూడా సుబ్బయ్య తల్లితో శుష్కప్రియాలు మాట్లాడి పంపించేశారే తప్ప అంత్యక్రియలు చేసేందుకు ప్రయత్నించలేదు. అప్పుడు కామేశం ముందుకు వచ్చాడు. సుబ్బయ్య తల్లితో "మామ్మా మునీశ్వరుడిలాంటి నీ కొడుకు శవం మునిసిపాలిటివాళ్ళు యీడ్చే ఖర్మం ఇంకా యీ ఊరికి పట్టలేదు నేనున్నాను పద" అన్నాడు. అందరూ తలా ఒక చెయ్యి వేశారు. కామేశం నాయకత్వంలో పిల్లలంతా కలిసి సుబ్బయ్య అంత్యక్రియలు జరిపారు. సుబ్బయ్య చావు దేవుడి పెళ్ళి అంత ఘనంగా జరిగింది. సుబ్బయ్య అంత్యక్రియల నేపథ్యంలో కామేశం అన్నమాటలు – హృదయాల్లో నిలిచిపోయేవీ, హృదయాల్ని కదిలించగలిగేవి కూడా.

"మంచి పనులు చేద్దామని మళ్ళీ పెద్ద కబుర్లు చెబుతాం. అవసరం వస్తే ఆమడ దూరానికి పారిపోతాం. అలాంటిది బతుకు కాదు, చావు. మనం చేసే మంచి పనులకి ఇదే నాంది. మన సంస్కారం ఇక్కణ్ణుంచే మొదలు పెడదాం, మన స్నేహితులందరూ ఒకసారి ఈ పాడెను భుజానపెట్టుకోండి. . ." కామేశం అందరి భుజం మీద పాడెను పెట్టించాడు. అంత ఎత్తులేని పిల్లలు కనీసం ఒక్కసారి అట్నుంచి యిటయినా దూరారు. ఇటువంటి కథ చదివినపుడు పాఠకుడి మనసులో శుష్క సానుభూతి ఏర్పడదు. అతడిలో నిద్రాణమై ఉన్న మానవీయ విలువలు జాగృతమవుతాయి. రచయితపట్ల అభిమానం పెరుగుతుంది.

నూటపదేళ్ళ తెలుగు కథా చరిత్రలో దాదాపు నూరుమంది అత్యద్భుత ప్రతిభామూర్తులు కనిపిస్తారు. వారిలో మొదటి లేదా రెండో వరుసలో నిలబడగలిగే సత్తా ఉన్న రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య. కథావస్తువు ఎంపిక, కథనం, శిల్ప మర్యాదలు ఇవన్నీ ఆయనలో అనితరసాధ్యంగా ఉంటాయి. కథ నడిచే తీరును ఆరంభంలోనే ప్రతీకాత్మకంగా చెప్పగలిగిన ప్రతిభావంతుడు సుబ్బరామయ్య. అయితే ఆయన కథల్లో ప్రస్ఫుటించే నైరాశ్యం చాలామందికి నచ్చదు. కానీ ఈ నైరాశ్యంలోనూ ఏదో కొత్త అంశాన్ని కథనమయం చేయగలిగే రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య. ఆయన రాసిన "పూర్ణాహుతి" కదిలించే కథ !

రచయిత ఆత్మగతంగా కథ చెబుతారు. అతడొక శనిదానాలు తీసుకునే బ్రాహ్మణుడు. పేరిశాస్త్రి అనే పెద్ద బ్రాహ్మడి దగ్గర ఇతడు శనిదానాల ఉపాధి పొందుతూ ఉంటాడు. మొత్తంమీద అతడి జీవనాధారం శనిదానాలు. అవీ పేరిశాస్త్రి దయ ఉంటేనే వస్తాయి. కొంత కాలం సజావుగానే సాగింది. తర్వాత పేరిశాస్త్రికీ శనిదానాలబ్రాహ్మడికీ ఘర్షణ ఏర్పడింది. పేరిశాస్త్రి ఈ బ్రాహ్మడిని దూరంగా తరిమేసి ఆ దానాల కోసం రామేశం అనే మరో బ్రాహ్మడిని పెట్టుకుంటాడు. ఇది శనిదానాల బ్రాహ్మడికి కోపం తెప్పిస్తుంది. అతడు రామేశాన్ని అనేక శాపనార్థాలు పెడతాడు. అయినా రామేశం అతడిని పల్లెత్తు మాటకూడా అనడు. తన జీవనోపాధి కోల్పోయినందుకు, అందుకు రామేశమే కారణమైనందుకు శనిదానాల బ్రాహ్మడు ఉడికిపోతూ ఉంటాడు. అతడి కాలికి మేకు గుచ్చి గాయమవుతుంది. గాయంతో జ్వరం వస్తుంది. అప్పుడు అతడితో శాపనార్థాలు తిన్న రామేశమే ఆపద్బాంధవుడు అవుతాడు. రామేశం నేపథ్యాన్ని కూడా ఇక్కడ పరిచయం చేయాలి. రచయిత చెబుతున్న దాన్ని బట్టి పాఠకులకు అర్థమైనంతమేరకు - రామేశం ఒక అనాథ. ప్రపంచంలో అతడికి తన తమ్ముడు తప్ప నా అనే వారెవరూ లేరు. శనిదానాలు, ఇతర దానాదుల స్వీకరణతో వచ్చిన డబ్బుతోనే రామేశం తన తమ్ముడిని చదివిస్తున్నాడు. తిరిగి కథలోనికి వస్తే.. గాయంలో జ్వరం వచ్చిన శనిదానాల బ్రాహ్మడికి రామేశం సకల శుశ్రూషలు చేశాడు. అప్పుడు శనిదానాల బ్రాహ్మడికి దుఃఖం వచ్చింది. ఆయన మాటల్లోనే చెబితే "నాకళ్ళవెంట నీరుకారడం ప్రారంభించాయి. మూసిన కనురెప్పల సందుల్లోంచి అవిరళంగా నీళ్లు ఉబికి వచ్చాయి. నాయనా ! నిన్నేనా నేను నడి బజారులో నిలబెట్టి అసహ్యంగా మాట్లాడి అవమానం చేశాను. "కళ్ళు తెరిచి చూస్తే గ్లాసులో మందు వంచుతున్న అతడు ఒక యోగిలా కనిపించాడు. . ." రామేశం తన తమ్ముడి నుంచి వచ్చిన ఉత్తరం చూసి మురిసిపోతున్నాడు. తమ్ముడు తాను బాగా చదువుకుంటున్నానని రాశాడు. ఆ ఉత్తరం తన దగ్గరే పెట్టుకొని తిరుగుతున్నాడు రామేశం ! శనిదానాల బ్రాహ్మడి శుశ్రూషలో భాగంగా - రామేశం డాక్టరు దగ్గరకు వెళ్ళి మందు తీసుకొని వచ్చేందుకు బయలుదేరాడు. ఆకస్మాత్తుగా వేగంతో వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఉన్నది ఉన్నట్టుగా క్షణాల్లో చనిపోయాడు రామేశం. ఇంతవరకే రాసి కథకు ముక్తాయింపును పలికితే అందులో పెద్దిభొట్ల ముద్ర ఏముంటుంది? ముగింపు వాక్యాలు నిశితంగా గమనించండి. అందులో మారిన శనిదానాల బ్రాహ్మడి మానవీయ స్పర్శ తళుక్కుమంటుంది.

"కాళ్ళు తడబడుతూ వుండగా తూలిపోతూ పరుగెత్తాను. తీరా అక్కడికి పోయేసరికి అంతా అయిపోయింది. రామేశం రోడ్డుకడ్డంగా రక్తపు ముద్దలా పడి ఉన్నాడు. ఆ లారీ డ్రయివర్ ఎటువంటి రాక్షసుడో ఆగనైనా ఆగలేదు. జనం గుమికూడుతున్నారు. నేను అతనిమీదకి వంగి నీళ్ళునిండిన కళ్ళతో చూశాను. అతని చూపులు కుడిచేతి గుప్పిట మీద ఉన్నాయి. ఆ చేతిలో ఉన్నది తమ్ముడి ఉత్తరం. నేను భోరున ఏడుస్తూ ఆ ఉత్తరం తీసుకున్నాను. మందమైనలైటు వెలుతురులో అక్షరాలు కనిపించాయి. "నేను బాగా చదువుకుంటున్నాను. ఇంకా బాగా చదువుకుంటాను. మరొక్క సంవత్సరం. . . తర్వాత నిన్ను పూజించు కుంటానన్నయ్యా !. . . ." నేను కళ్ళు మూసుకున్నాను. అవును తమ్ముడూ బాగా చదువుకో... నేనున్నాను నీకు అనుకుని కళ్ళు తెరిచేసరికి పోలీసులు ప్రమాదం వివరాలు సేకరిస్తూ హడావిడిగా కనుపించారు. – ఇదీ పూర్ణాహుతి ముగింపు. ఎంతో గొప్పకథ. కథకు పేరు పెట్టడంలోనూ పెద్దిభొట్ల ముద్ర స్పష్టంగా కనబడుతుంది.

అమరావతి కథలతో సత్యం శంకరమంచి ప్రసిద్ధులయ్యారు. ఆయన రచనలన్నిటిలోనూ అమరావతి కథలే మణిపూసలుగా మెరుస్తాయి. అమరావతి కేంద్రంగా రమారమి మధ్యతరగతి కుటుంబాల్లోని మమతానురాగాల్ని సమస్యల్ని సంఘటనల్ని ఎంతో హృద్యంగా ఆవిష్కరించాయి అమరావతి కథలు. పలు కథల్లో మానవీయస్పర్శ పలకరిస్తుంది. ఈ పలకరింపు సడిలేకుండా ఉంటుంది. మంచితనాన్నే వెలుగులోకి తీసుకొని వచ్చే సానుకూల ధోరణి అమరావతి కథల్లో అడగడుగునా కనిపిస్తుంది. ప్రవాహ సదృశమైన శైలి సత్యం శంకరమంచి స్వంతం. తండ్రీ కొడుకుల అనుబంధానికి నిలువెత్తు దర్పణంగా ఉండే "నాన్ననది" అన్న కథలో సీతయ్య పాత్ర ఉంది. "సీతయ్య శరీరం కృష్ణ, సీతయ్య ఊపిరి కృష్ణ, సీతయ్య రక్తం కృష్ణ, సీతయ్య ప్రాణం కృష్ణ, సీతయ్య కన్నీళ్ళు కృష్ణ, కృష్ణ కృష్ణలో కలిసిపోతోంది, కృష్ణ కృష్ణని అడుగుతోంది నాన్న కావాలని' ఇదీ – శంకరమంచి శైలికి ఉదాహరణ. ఆయన తరహాలో రాయాలని ప్రయత్నించిన కథా రచయితలున్నారు. అయితే వారి అనుకరణలన్నీ వైఫల్య ఫలాలే అయ్యాయి.

యెర్రంశెట్టి శాయి రచనలనగానే హాస్య కథలే గుర్తుకువస్తాయి. హాస్య సృజన అంతగా పట్టుబడని తెలుగుకథా ప్రపంచంలో హాస్య కథల సౌధాలను నిర్మించిన అరుదైన రచయితల్లో శాయి ఒకరు. శిల్పం పేరుతో అనవసర వర్ణనలూ, సంక్లిష్టపాత్ర చిత్రణలూ శాయి రచనల్లోనూ కనిపించవు, శాయి రచనలు చదివితే

హైదరాబాద్ నగరంలోని కాలనీల జీవితం ఎంతో హాసమయంగా కనిపిస్తుంది. హాస్య కథలకు ప్రసిద్ధి పొందిన రచయిత గాఢమైన మానవీయ స్పర్శతోనూ వ్రాయగలడని 'సర్కస్' కథలో నిరూపించుకున్నారు యెర్రంశెట్టి శాయి. ఒక సర్కస్ కంపెనీ ప్రదర్శనకు వస్తుంది. పిల్లలు సర్కస్ చూడాలని ఉత్సాహపడతారు. మధ్య తరగతి తల్లిదండ్రులది పొదుపు ఆలోచన. తండ్రి సర్కస్ కంపెనీ వారికి అవసరమైన ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగి, ఆయన కంపెనీ వారి నుండి "ఉచిత పాసు" తెచ్చుకుంటాడు. ఇట్లా ఉచిత పాసులు తెచ్చుకునేవాళ్ళ సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. అప్పుడు ఆ ఉద్యోగి పిల్లలకు సందేహం వస్తుంది. ఇంతమందికి ఉచితపాసులు ఇస్తే ఆ సర్కస్ వాళ్ళ పొట్ట గడిచేదెట్లా? అప్పుడా పిల్లలు డబ్బులు పెట్టి చూద్దామంటేనే సర్కస్‌కు వస్తామంటారు. ఇట్లా చిన్నారుల్లోని మానవీయ స్పృహను ఎంతో హృద్యంగా యెర్రంశెట్టి శాయి తమ సర్కస్ కథలో చిత్రించారు. ఇట్లాంటి ఎన్నో కథల్ని ఉదాహరించవచ్చు. ముందే చెప్పినట్టు వ్యాస పరిధి, పరిమితుల వల్ల కొన్ని ప్రాతినిధ్య కథల్ని మాత్రమే పేర్కొనడం జరుగుతోంది.

కాలం రోజు రోజుకూ మారుతోంది. ఈ మార్పు శరవేగంతో జరుగుతోంది. మొన్నటి దాకా రాష్ట్ర రాజధానికిరావడానికే తడబడ్డ గ్రామీణ విద్యావంతుడు ఈ రోజు నేరుగా ఉద్యోగాన్వేషణ కోసం విదేశాలకు పయనమవుతున్నాడు. పొదుపు సంప్రదాయం తగ్గిపోతూ వస్తుసంస్కృతి పట్ల ప్రీతి పెరుగుతోంది. సమాచార ప్రసార సాధనాలు రవాణ సౌకర్యాలు మనకళ్ళ ముందు వచ్చి రాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనూ మానవీయస్పర్శ వంటి పాతకాలపు అనుభూతులకు, సెంటి మెంట్లకు జీవితంలోనూ, కథల్లోనూ ఇంకా స్థానం ఉంటుందా? అని ప్రశ్నించవచ్చు. ఈ సందర్భంలో చాలాకాలం క్రితం చదివిన "ఆగామి వసంతం" (స్వామి రచన) అనే కథలోని ఈ వాక్యాలు గుర్తు చేసుకోవాలనిపిస్తోంది.

"స్త్రీ పురుష సంబంధాలు అవసరాలకు అతీతమైనవి అనే అలౌకికత్వంతో నన్ను నేను మభ్యపెట్టుకోలేను. అంతమాత్రం చేత మానవ సంబంధాల్ని పరిపాలించే హక్కు కేవలం అవసరాలకు మాత్రమే ఉందని సిద్ధాంతీకరించే అమానుషత్వానికి కూడ ఒడికట్టలేను. కొత్త అవసరాలేర్పడి పాత విలువలూ సంప్రదాయాలూ తలక్రిందులు అయిపోవచ్చు. అంతమాత్రం చేత మనిషిలోని ప్రేమ స్నేహమూ సహానుభూతి కూడా తలకిందులు అయిపోతాయని అనుకోనక్కరలేదు. అద్దాన్ని తలకిందులు చేయగలరా ఎవరైనా"? - ఇవి ఎంతో విలువైన వాక్యాలు. కాలంతో పాటు శిథిలం కాకూడనిదే మానవీయ స్పర్శ అనే దొడ్డగుణం.

సమకాలీన కథా సాహిత్యంలో విభిన్న వైఖరులు కనబడుతున్నాయి. పత్రికల సంఖ్య ఎక్కువగానే ఉంది. అయితే "సీరియస్ పాఠకుల" సంఖ్య ఇదివరకటి కంటే బాగా తగ్గింది. 1970–80వ దశకం తెలుగు మేగజైన్ జర్నలిజానికి స్వర్ణ యుగమని చెబుతారు. అప్పట్లో పలు పత్రికలు ప్రధాన పండుగల సందర్భంలో ప్రత్యేక సంచికలు ప్రచురించేవి. ఈ సంచికల్లో వచ్చిన అత్యుత్తమ కథలపై సాహితీలోకం లోతుగా చర్చించడం చరిత్ర చెబుతున్న సత్యం. ప్రసిద్ధ కథా రచయిత కాళీపట్నం రామారావు రచించిన "యజ్ఞం" కథ కూడా తొలుత ఇట్లాగే ప్రత్యేక సంచికలో ఒక కథగా ప్రచురణ పొందినట్టు గుర్తు. 1990 తర్వాత ప్రసారమాధ్యమాల తీరుతెన్నుల్లో సంపూర్ణమైన మార్పు ఆరంభమైంది. పాఠకుల సంఖ్య తగ్గుతూ వీక్షకుల సంఖ్య పెరుగుతోంది. ఈ ధోరణి, నానాటికీ ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో పత్రికల నిర్వాహకులు, సంపాదకులు కూడా కాలానికి అనుగుణమైన విధానంలో ముందుకు పోతున్నారు. ప్రయాణీకులకు కాలక్షేపం అందించే కథలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వారానికి కనీసం వందకథలైనా తెలుగులో వెలువడుతున్నాయి. అయితే ఇవి వాసిలో అంత గొప్పగా ఉండడం లేదన్నది చాలామంది అభిప్రాయం. తెలుగు కథల్లో మూడు నాలుగు ధోరణులు ఉన్నాయి. ఒకటి పూర్తిగా కాలక్షేప సాధకులుగా ఉండే కథలు, విపరీతమైన శిల్ప ధోరణిలో మేధావులనుకునేవారికి మాత్రమే అర్థమయ్యేరకం రెండవ విభాగం. కథ మాత్రమే చెబుతూ శూన్య శిల్పంతో తయారయ్యే వస్తు కథలు మూడవ రకం. రకరకాల వాదాలు, సిద్ధాంతాలు, ప్రాంత ధోరణులతో ఏక పక్షంగా సాగే కథలు నాల్గవరకం. అయితే మానవీయ స్పర్శతో కూడిన కథలు బాగా తక్కువగా వస్తున్నాయి. ఎక్కడో ఒకచోట ఇటువంటి కథలు కనిపించినా అవి విమర్శకుల దృష్టిలో పడడంలేదు. అవి కూడా ఇతర కథల్లో విలీనమవు తున్నాయి. మానవీయస్పర్శ గల కథా రచన చేసే రచయితలు భవిష్యత్తులో మధురాంతకం రాజారాం రచనల్ని గుర్తు చేసుకోవాలి. "మంచి మనుష్యులతో కూడిన మంచి ప్రపంచాన్ని" తన కథలో నిర్మించి ఇచ్చిన రాజారామ్ విపరీత శిల్ప ధోరణులకు, శిల్ప రాహిత్యానికి, కేవలం గుర్తు కథారీతికి, వాదవివాదాలకు, సిద్ధాంత రాద్ధాంతాలకు వ్యతిరేకి. ఆయన పదహారణాల కథా రచయిత. మానవీయ స్పర్శను తన కథల్లో దండిగా రాసిపోసిన మహా రచయిత. "ఎడారి కోయిల" కథను చదివిన తర్వాత కళ్ళు చెమరుస్తాయి కదూ ! అందుకే రాజారామ్‌ను ఆదర్శంగా తీసుకొని రచనలు చేయాలనేది.

మానవీయ స్పర్శను చిత్రించాలనుకునే రచయిత దాన్ని గట్టిగా కాకుండా ప్రతీకాత్మక వైఖరితోనూ తన కథల్లో చూపించవచ్చు. ప్రసిద్ధ కథా రచయిత

భమిడిపాటి రామగోపాలం అభిప్రాయపడినట్లు "మన దగ్గరేదైనా మెసేజ్ ఉంటే దాన్ని చిల్లర నాణేల చప్పుడంత ఇంపైన స్వల్ప ధ్వనితో అందించాలి గాని, దుడ్డు కర్రతో బాదినట్లు బలమైన వేటుగానూ, మాంత్రికుడి వేపమండ ఊపులా విసురుగా చెప్పటం సాహితీ న్యాయం కాదు." భవభూతి శ్లోకంలోని చల్లదనం, నన్నయ పద్యాల్లో కనిపించే లాలిత్యం - ఇవీ మానవీయ స్పర్శతో కూడిన కథల్లో మనం చూడగలగాలి.

ప్రపంచీకరణ క్రమంలో సాంకేతిక విలువలు పెరిగి మానవీయ విలువలు తరగిపోతున్నాయనే బలమైన విమర్శ వింటున్నదే. ఆర్థికమే అన్నిటికీ పునాది అని మార్క్స్ చెబితే, ప్రపంచీకరణ మరో రెండడుగులు ముందుకుసాగి డబ్బు సంపాదనే జీవితలక్ష్యమని ప్రబోధిస్తోంది. ఈ ప్రబోధహోరులో సహజంగానే డబ్బు సంపాదనే జీవితపు ఏకైక లక్ష్యమవుతుంది. నైసర్గిక కళలు, మహత్తర సాహితీ సృజనలు, అపూర్వమైన మానవ సంబంధాలు ఈ ప్రపంచీకరణ తరుణంలో మసకబారుతాయి. ఈ సంక్షుభిత సమయంలో మనిషికి మనిషికి ఉండవలసిన అన్యోన్య అనుబంధాన్ని విడమరచి చెప్పే మానవీయ కథాంశాలతో రచనలు వెలువడాలి. మానవీయ స్పర్శతో కూడిన కథారచన నేటి అనివార్యమైన అవసరం.

*ఈ వ్యాస రచనకు ఉపకరించిన పుస్తకాలు:*


1. పాండురంగారావు వాకాటి, సుబ్రహ్మణ్య శర్మ పురాణం, (సం). కథా భారతి - తెలుగు కథానికలు, ఢిల్లీ : నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా.
2. కథాసాగర్; మద్రాసు : కళాసాగర్
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు, హైదరాబాదు : తెలుగు అకాడమి.
4. తెలుగు కథ వెలుగులు, బెంగుళూరు : కథా వేదిక
5. కథాశిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, హైదరాబాద్ : విశాలాంధ్ర
6. మహతి, హైదరాబాద్ : యువభారతి (1972)
7. రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు, న్యూఢిల్లి, సాహిత్య అకాడమీ

ఇంగ్లీషు:

1. R.K. Narayana - My Days (Autobiography)
2. R.K. Narayana - Malgudi Days (Collecting Stories)

# తెలంగాణా కథా సాహిత్యం - దళిత కథా పరిణామం

డా॥ కనకయ్య

**కథానిక ఎప్పుడు మొదలైంది?**: ప్రపంచ సాహిత్యంలో కథా రచన 1832లో ఆరంభమైంది. సాహిత్యంలో బుద్ధుని జాతక కథలతో కథానిక మొదలైంది. మానవుని నాగరికతాభివృద్ధికి మౌఖిక కథ కొనసాగింపే ప్రధాన సాధనం. తెలుగు సాహిత్యంలో 1910 కంటె ముందు కూడా తెలంగాణాలో అనేక కథనాలున్నాయన్నది సంగిశెట్టి శ్రీనివాస్ పరిశోధనలో తేలింది. 1901-04 వరకు అచ్చులో దొరికిన పదికథలను "భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు" పేరుతో అచ్చు వేస్తున్నాడు.[1] ఈమె తెలంగాణా వాసి. ఈమె 1898లో రచించిన 'ప్రేమ పరీక్షణము' ఎరువు సొమ్ము పఱువుచేటు' కథలు రాయసం వేంకటశివుడు నిర్వహించిన 'తెలుగు జనానా' పత్రికలో జూలై, సెప్టెంబర్ సంచికల్లో అచ్చయ్యాయని అంటున్నారు. కానీ దొరకలేదు. 'తొలి తెలుగు కథ - ఏడు అభిప్రాయాలు' అనే పుస్తకంలో ఈమె రాసిన స్త్రీ విద్య', 'ధనత్రయోదశి' కథలను పాఠకులకు కథానిలయం ట్రస్ట్ వారు 2008లో అందుబాటులోకి తెచ్చారు.[2]

1988 నుండి తెలుగులో కథా సంపుటాలు, సంకలనాలు విరివిగా వెలువడ్డాయి. ఇవి సాహిత్య ప్రయోజనాన్ని ఆశించి, ఒక ఉత్తేజాన్ని సామాజిక పరిణామ క్రమాన్ని, సంస్కృతిని, రాజకీయ, అర్థశాస్త్రాల్ని అర్థం చేయించే దృష్టితో వస్తున్నాయి. తద్వారా సాహిత్యంలో ఏ ప్రక్రియకూ లేని ప్రాధాన్యం కథలకు ఏర్పడింది. సాహిత్యం ఆధారంగా సమాజాన్ని విశ్లేషించడం సులువైంది. దాంతో సామాజిక శాస్త్రవేత్తలు బుద్ధుడి కాలం, పురాణాల కాలం రాజరికాల కాలం నుండి కూడా కథాసాహిత్యంపై ఆధారపడ్డారు. కథకు చారిత్రకంగా, సామాజికంగా గొప్ప ప్రాధాన్యం ఉందని కథలు రాసే చాలా మందికి తెలియదు. కానీ కథల ప్రాధాన్యాన్ని పత్రికలు గుర్తించాయి. తెలంగాణాలో పత్రికా దీపము చిన్నది. కానీ ఆ చిన్న దీపమే పెద్ద వెలుగుల్ని సృష్టించింది. ఆ చిన్ని ప్రమిదకు ఎందరో పెద్దలు తైలాన్ని పోశారు. దిన, వార, మాస పత్రికలు, పాఠకుని అభిరుచిని బట్టి కథలను ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. ఇపుడు కథను పెంచి పోషించే ప్రధాన బాధ్యత పత్రికలదే అయ్యిందనే సత్యం చాలామందికి బోధపడింది.

**ఏది మొదటి తెలుగు కథానిక?:** మొదటి తెలుగు కథలుగా కొంతకాలం చర్చకు తావిచ్చిన కథలు.

1) గురజాడ - దిద్దుబాటు కథానికను ఇప్పటివరకు మొదటి తెలుగు కథానికగా భావించారు. కాదు భావింపచేసారు. వ్యావహారికభాషలో ప్రారంభమైందనే భ్రమను కూడా కల్పించారు. ఇంకొక పక్క ప్రక్రియలన్నింటికీ తానే ముందని "కందుకూరి వీరేశలింగం" ప్రకటించుకుంటే, అన్నింటికీ ముందు గురజాడే అని సాహితీకారులు ఆయనకు పెద్దపీట వేసారు.

2) గుడిపాటి ప్రకారం 1912లో 'మాడపాటి హనుమంతరావు - హృదయశల్యం' కథతో మొదలైంది.[3] 1876లో శేద్యచంద్రిక మొదటి తెలుగుపత్రిక వచ్చింది. ఇలాంటి పత్రికలకు కొనసాగింపు లేకున్నా కథనం మాత్రం ఉండే ఉంటుంది. కథ మీద గుడిపాటి పరిశోధన కొంతవరకు శాస్త్రీయంగానే నిలిచింది. కానీ తెలుగుసాహిత్యం లోతుల్లోకి వెళ్లిన పరిశోధన రోజురోజుకు కొత్త ఆధారాలతో ముందుకు నడుస్తుంది.

3) 'నూరేళ్ళ పంట' కథా సంకలనం కోసం భార్గవీరావు రాసిన ముందుమాట ఇట్లా ఉంది. "1902లోనే బందరులో తొలి మహిళా సమాజాన్ని స్థాపించిన అచ్చమాంబగారు మొదటి రచయిత్రి అని గర్వంగా చెప్తూ వారి రచన 'స్త్రీ విద్య'ను మొదటికథగా వేసుకున్నాము. గురజాడవారి దిద్దుబాటు మొదటికథ అనుకోవడం పొరబాటని సవినయంగా మనవి చేస్తున్నాము".[4]

4) "తెలుగు సాహిత్య చరిత్రలో ఆనాటి రచయిత్రులకు జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు. తెలుగులో తొలి ఆధునిక కథ రాసిన అచ్చమాంబకు జరిగిన అన్యాయం గురించి కె. లలిత బయట పెట్టేవరకు ఎవరికీ తెలియదు. హిందూ సుందరి పత్రికలో 1902లోనే 'ధనత్రయోదశి' కథ రాసిన అచ్చమాంబను వెనక్కి నెట్టేసి 1911? (1910) లో గురజాడ రాసిన దిద్దుబాటును తొలి ఆధునిక కథగా సాహిత్యకారులు స్థిరీకరించారు.[5] అని సత్యవతి అభిప్రాయం.

5) 1903 కల్పలత పత్రికలో 'లలిత' కథ అచ్చయింది. పురిపండా అప్పలస్వామి దీనిని తొలికథగా ప్రకటించాడు. ఇది 1917లో ప్రకటించబడిన మూలంతో 'లలిత'తో పాటూ ప్రచురించబడిన ఆరు రచనలనూ ప్రకాశకులు నవలికలుగా పేర్కొన్నారు.[6]

6) సాహిత్యసేవాసమితి ట్రస్టు, విశాఖపట్నం వారు "యాభై మంది రచయితల కథానికలు గల 'కథామంజరి' సంకలనంలోని 'విశాఖ' (1904) కథను తొలికథగా ప్రచురించారు. గిడుగు సీతాపతి రచయితను పరిచయం చేస్తూ ".... తెలుగు కథకు శ్రీకారం చుట్టినవారు శర్మ గారు అని నిర్ధారించారు." ఈ పుస్తక ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ ఆరుద్రగారు ఈ విషయాన్ని తమ దృష్టికి తెచ్చి 'విశాఖ' కథే తొలికథగా పేర్కొన్నట్టు కూరెళ్ళ సోమేశ్వరరావు గారు చెప్పారు.[7] ఈ విధంగా మొదటి కథానిక మీద ఎవరి వాదనవారు వినిపించారు. ఇంకా వినిపిస్తూనే ఉన్నారు. మరి మొదటి కథానిక ఏది అనే ప్రశ్న ఉద్భవిస్తుంది.

**తొలి తెలుగు కథానికగా దేనిని చెప్పుకోవాలి?:** ఇప్పటివరకు ఇవే మొదటివి అనుకున్నవి మొదటివి కావని సాహిత్య పరిశోధనలో తేలిపోయింది. ఇప్పటివరకు మరుగున పడేసిన సాహిత్యాన్ని తెలంగాణా సాహితీకారులు తవ్వితీస్తున్నారు. 2009 వరకు కూడా గురజాడ 'దిద్దుబాటు' కథనే మొదటి కథగా ఎంచుకొని తెలుగు సాహిత్యకారులు ఆ కథను అనేక దిద్దుబాటులకు గురిచేసారు. ఇకముందు ఎన్ని దిద్దుబాటులు చేసుకున్నా అది మొదటి కథ అని ఆధునిక సాహితీకారులు ఒప్పుకోరు. సంగిశెట్టి శ్రీనివాస్ పరిశోధనలో బయటపడిన మొట్టమొదటి తెలుగు కథానిక 'స్త్రీ విద్య' తెలంగాణా ప్రాంతానికి చెందింది. 1902లోనే 'నూరేళ్ళపంట' కథా సంకలనంలో ప్రచురింపబడింది. కథకురాలు భండారు అచ్చమాంబ. ఈమె మొదటి కథా రచయిత్రి. "తెలంగాణ నుంచే తొలి కథానిక వచ్చిందనేది" ముదిగంటి సుజాతరెడ్డి అభిప్రాయం.[8] అయినప్పుడు ఇప్పటివరకు తెలంగాణ కథ ఎందుకు రాణించలేక పోయిందనే వాదన కూడా మొదలవ్వవచ్చు.

**తెలంగాణా కథానిక ఎందుకు మరుగున పడిపోయింది?: అనేక కారణాలున్నాయి.**

1. తెలంగాణాను పాలించిన ప్రతీ పాలనలో తెలంగాణా సాహిత్యం, సంస్కృతి, అణచివేతకు, కాల్చివేతకు, గురికావటం, 2. తెలంగాణా కథలను ఆదరించకపోవటం, 3. తెలంగాణా ప్రాంతానికి మధ్యతరగతి జీవనవిధానం ఇంకా అలవడక పోవటం, 4. నిజాం ప్రభుత్వం తమ ప్రభుత్వం భాషలో ప్రావీణ్యం ఉన్నవారికే రాయితీలు ప్రకటించటం, 5. 1900లు ముందునించే తెలంగాణాలో కథలే కాదు సాహిత్య ప్రక్రియలన్నీ వెలువడుతున్నాయని తెలిసినప్పటికీ సాహితీవేత్తలు ఆదరించకపోవటం, 6. కె. శ్రీనివాస్ మాటల్లో "ఆంధ్రదేశంలో సాహిత్య అకాడమీ

తెచ్చిన తొలినాటి తెలుగు కథల సంపుటాలు, కథల ఎంపికలు విమర్శనాత్మకంగా గమనిస్తే నాటి వాతావరణంలోని స్థిరపడిన ప్రాధాన్యాలు, అవగాహనలోనే భాగమై పోయిన పాక్షికతలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈ మధ్యకాలంలో వచ్చిన కథాసంకలనాలు 'వందేళ్ళ తెలుగు కథ' – చినవీరభద్రుడు (సం), బంగారు కథలు–వాకాటి, వేదగిరి (సం) లాంటి వారు అసంపూర్ణతలతోనే కథా సాహిత్య చరిత్రను రికార్డు చేయడానికి, తుది నిర్ధారణలు చేయడానికి ప్రయత్నించారు. అసంపూర్ణతలలో ముఖ్యమైనది 'అన్ని తెలుగు ప్రాంతాల కథా సాహిత్యానికి న్యాయమైన, అర్హమైన ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం. పైన చెప్పిన అన్ని సంకలనాలు తెలంగాణా నుంచి వచ్చిన కథా సాహిత్యానికి పూర్తిగా పరిగణనలోనికి ఇవ్వకపోవడమో లేదా తక్కువ పరిగణన ఇవ్వడమో చేశాయి."[9] అని తెలుస్తుంది.

7. **దళిత సాహిత్య విమర్శ 'లో' చూపు?:** కూడా ప్రధాన పాత్ర వహించింది. దళిత సాహితీకారుల్లో ఇనాక్, జంగయ్య, ఎండ్లూరి, పద్మారావు, శిఖామణి, జి.కె. రత్నాకర్, తెరేష్‌బాబు, కోయికోటేశ్వరరావు, సతీష్‌చందర్, దార్లలాంటి వారు దళిత సాహిత్య విమర్శకులు. దళిత సాహిత్యాన్ని పండిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలలో వర్గీకరణ ఒకపక్క, తెలంగాణా వాదం ఒకపక్క ఉద్యమాలుగా రూపొందుతున్న క్రమంలో ఆంధ్రులు తెలంగాణా వారిని మరుగున పడేయడానికి ప్రయత్నం చేసారు. ఇది సాహిత్యరంగంలో విపరీతంగా ఉంది. ఒక్కరూ ఇద్దరూ కాదు. తెలంగాణా భవిష్యత్‌తో ఆంధ్రప్రదేశ్, దేశ రాజకీయ నాయకులు కూడా ఆటలాడుతున్నారు. తెలంగాణాను పావుగా చేస్తున్నారు. నవారు అమ్ముకునే వాని దగ్గరనించి హోటళ్లు వాళ్లవే. పచ్చళ్ల షాప్‌లు, రొట్టెల దుకాణాలు, కర్రీ పాయింట్లు, స్వీట్ షాప్‌లు, చివరకు రియల్ ఎస్టేట్ వాళ్లదే. ఇవన్నీ ఒక ఎత్తయితే సెక్రటరియేట్‌లో అతి ముఖ్యమైన పదవుల్లో కూడా ఆంధ్రులే ఉండి తెలంగాణాను అడగడుగునా అణచివేయటం జగమెరిగిన సత్యం. వాళ్లు బహిరంగంగానే తెలంగాణా మంచితనాన్ని ఎగతాళి చేస్తూ జీవనం కొనసాగిస్తూ, తెలంగాణా జీవితానికి మనుగడ లేకుండా చేస్తున్నారు. వారి అవకాశాలను లాక్కుంటున్నారు. ఇది ఒక్క రాజకీయ రంగానికే కాదు. సాహిత్యరంగంలో కూడా విపరీతంగా ఉంది. వార్త దినపత్రికల్లో దార్ల ఒక కుల అస్తిత్వం గురించి రాసాడు. ఆయన జన్మస్థానం ఆంధ్రా ప్రాంతం ఈగోలో ఒక గ్రామం. ఆయన గతంలో చెన్నారెడ్డి స్థాపించిన ఒక కాలేజ్‌లో కూడా ఉద్యోగం

సంపాదించాడు. ఇప్పుడు సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్యోగాన్ని లాక్కున్నాడు. తెలంగాణ విద్యార్థులు రక్తం చిందించి, ప్రాణాలర్పించి సాధించుకున్న యూనివర్సిటీ అది. ఈ విశ్వవిద్యాలయంలో ఆయన పనిచేస్తూ, సాహిత్యంలో విమర్శకుడుగా కుల అస్తిత్వం కోసం గత పదిహేనేళ్లుగా పోరాడుతున్న మాదిగ తెలంగాణ రచయితలను, కవులను, కళాకారులను విస్మరించి కేవలం ఆంధ్రావాళ్లే సాహిత్యం సృష్టిస్తున్నారని, తెలంగాణా వారికి సత్తా లేదని బోయ జంగయ్య, శ్రమశ్రీ, కె. రామలక్ష్మణ్, మందస్వామి, మాష్టార్జీ, చిలుక భాస్కర్, దున్న యాదగిరి, సిద్దెంకి, చిత్రం ప్రసాద్, వేముల ఎల్లయ్య, కదిరె కృష్ణ, సైదులు, ఉపాలి, జిలుకర, కాశీం, కొమ్ము సుధాకర్, గూటం యాదయ్యలాంటి రచయితలను చాలామందిని విస్మరించటం ఎంతమటుకు సమంజసం? ఇలా అనేక సందర్భాలలో ఎక్కడి వారక్కడా ప్రతి ఆంధ్రుడు తెలంగాణా వారిని ఎక్కడ దొరికితే అక్కడ అనేక విధాలుగా అణగతొక్కటం వల్ల దళిత సాహిత్యంలో కూడా కొంత వెనుకబాటు తనం కనపడుతుంది.

8. **దళిత పద పరిణామం:** గాంధీ రాజకీయ రంగప్రవేశం చేసి మాల మాదిగలందరినీ 'హరిజనులు'గా మార్చివేసి ఉత్సాహపరిచాడు. కానీ దానిలోని పరమార్థాన్ని గ్రహించిన సాహితీకారులు హరిజన పదాన్ని వ్యతిరేకించారు. దళితులందరినీ ఒకచోట చేర్చి రాజ్యాంగ పరిధిలోకి తీసుకొచ్చిన అంబేద్కర్ "షెడ్యూల్డు క్యాస్ట్స్"గా పరిగణించాడు. కొంతమంది డౌన్‌ట్రాడన్ పీపుల్స్ అని, ఇంకొందరు అస్పృశ్యులని, మ్లేచ్ఛులని, చండాలురని తమ ఇష్టమైన పేర్లతో దళితులను పిలుస్తున్నారు. కొంతకాలం 'దళిత' పదాన్ని కేవలం మాలమాదిగలకే అంట గట్టాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న 'దళిత' పదాన్ని వాడకూడదని సుప్రీంకోర్టు గత రెండేండ్లకింద తీర్పునిచ్చింది. ఎన్నో సంఘాలు ఈ పదాన్ని అనుబంధం చేసుకొని పనిచేస్తున్నాయి. కానీ వీరిని ఇంకేమని పిలవాలో అర్థంకాని స్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. ఏదిఏమైనా గాంధీ, అంబేద్కర్‌లు రాజకీయ రంగప్రవేశం చేయడం దళితుల జీవితాలకు నూతనశకం ప్రారంభమైంది. గాంధీ దళితుల సమస్యను రాజకీయసమస్యగా చేశాడు. అంబేద్కర్ రాజకీయంగా ఎస్సీలు ఎదగాలని కోరుకున్నాడు. ఈ సమస్య పరిష్కారానికి దేశవ్యాప్తంగా కృషి చేయవలసి వచ్చింది. గాంధీకి పూర్వమే సంఘ సంస్కరణోద్యమం

దళితులకు బడి, గుడులు ప్రవేశానికి కృషి చేసింది. "హిందువులను హిందువులు అంటరానివారుగా చూడటం హిందూమతానికి గొప్ప కళంకం." అని గాంధీ అన్నాడు. దళితుల స్థితి సాధ్యమైనంతవరకు మార్చడానికి ప్రయత్నం చేశాడు. అయితే దళితుల మీద సంఘనాయకులు చూపే సానుభూతిని పరిశీలిస్తే అనేక ఆలోచనలు బయట పడతాయి. "భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటం కోసం ఏర్పరచుకొన్న పదం దళితపదం. కానీ కొందరు మానవతావాదులు 'దళిత' అనే పదం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ అయినటువంటి మూలవాసులందరి (రూట్స్)కి చేర్చి, దళితులు, ధనిక అనే రెండు వర్గాలే నేడున్నాయని తేల్చటానికో, కింది కులాలకు న్యాయం చేయాలనో, మార్క్సిజం పునరుద్ధరణ కోసమో, అంబేద్కర్ ఆశయసాధనకో, దళిత శబ్దాన్ని వాడుకుంటున్నారు." దళితులు కూడా వాడుకుంటున్నారు. ఇలా దళిత పదం పరిణామం చెందటం కూడా దళిత సాహిత్యం వెనుకబాటు తనానికి, అణచివేతకు కారణమే అయి ఉండవచ్చు.

**తెలుగు కథానికలో తెలంగాణా కథా స్థానం?:** కథానిక పుట్టి కాలక్రమంలో ఒక ప్రత్యేకమైన రూపును సంతరించుకొని ఉంది. కథానిక మీద అనేకమంది పనిచేస్తున్నారు. "కథంటే సమగ్ర సామాజిక చరిత్రేనని" కాలువమల్లయ్య అభిప్రాయం.[10] బి.ఎస్. రాములు కథలబడినే నడిపించాడు. సీతారాం, వెంకటేశం, ప్రతాపరెడ్డి సంపాదకులను కలుపుకొని, అనేక అభిప్రాయాలతో కూడిన '50 ఏళ్ళ కథ తీరుతెన్నులు' గ్రంథాన్ని 2003లో వెలువరించారు. దీనిలో వీరభద్రుడి 'వందేళ్ళ తెలుగు కథ' అనే గ్రంథం అనేక విమర్శలకు గురైంది. సోమసుందర్, శ్రీరామమూర్తి లాంటివారు ఆ గ్రంథం సమగ్రన్యాయం చేయలేదని విమర్శలు చేసారు.[11] సుజాతా రెడ్డి 'తెలంగాణా తొలితరం కథలు' రెండు సంకలనాలను చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఏటా ఒక సంకలనాన్ని ప్రచురిస్తుంది. వేదగిరి రాంబాబు కథానిక మీద జిల్లాకో సదస్సు పెట్టాడు. అంబల్ల జనార్దన్, మలయశ్రీ, కథంబం పేరుతో ప్రముఖుల కథలు, నల్లకలువలు అనే పేరుతో సింగరేణి కథలు వచ్చాయి. ఏ.కే. ప్రభాకర్ స్త్రీవాద కథలను ప్రకటించారు. పోరంకి, ననుమాసస్వామి లాంటివారు కథల మీద ఉత్తమ విమర్శలను వెలువరిస్తున్నారు. తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖంగా మధురాంతకం, వాకాటి, పురాణం, అఫ్సర్, నవీన్, కేతు విశ్వనాథరెడ్డి, వల్లంపాటి, కొలకలూరి, రాచపాళెంలాంటివారే కాక అనేకులు కథానికమీద

పనిచేశారు. 'తెలుగు కథకులు కథనరీతులు' పేరుతో నాలుగు సంకలనాలను సింగమనేని నారాయణ వెలువరించారు. ఎన్నో సంస్థలు కథలను వెలువరిస్తూనే ఉన్నాయి. కొత్త కథలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. కానీ తెలంగాణా కథలు అనుకున్నంత మేరలో ఆదరణకు నోచుకోవటం లేదు.

**ఆదరణకు నోచుకున్న తెలంగాణా కథలెన్ని?:** తెలంగాణాలో భండారు అచ్చమాంబ, మాడపాటి, సురవరం ప్రతాపరెడ్డి లాంటివారితో మొదలైన కథానిక యశోదారెడ్డి, అల్లం రాజయ్య, ఉప్పల నరసింహంలాంటి వారితో పదునెక్కింది. అన్ని వర్గాలకు చెందిన సంపుటాలు, సంకలనాలు ఏటా వస్తూనే ఉన్నాయి. తెలంగాణ కథలు వాటి స్థితిగతులు, వాటికి ఉన్నస్థానం ఏమిటో బి.ఎస్. రాములు సేకరించిన దానినిబట్టి 2003 నాటికే కొంత స్పష్టత చేకూరింది.[12] రామలింగం, భార్గవీరావు, ఎం.ఏ. సుభాస్, విష్ణుప్రియ, మధురాంతకం నరేంద్ర, పాపినేని శివశంకర్, తిరుమలరావు, చీకోలు సుందరయ్య లాంటి వాళ్ళు మొత్తం వేసిన తెలుగు కథలు 681. వీటిలో తెలంగాణాకు చెందిన కథలు 74 మాత్రమే ఉన్నాయి. వీరు ఒక విధంగా తెలంగాణా సాహిత్యాన్ని చిన్నచూపు చూసారదనంలో సందేహం లేదు. విశాలాంధ్ర తెలుగు కథ 1910-2000 వరకు వేసిన 108 కథల్లో తెలంగాణకు చెందినవి 20 మాత్రమే ఉన్నాయి. తెలుగు కథ 1995-2001 వరకు వేసిన మొత్తం 158 కథల్లో తెలంగాణాకు చెందిన కథలు కేవలం 43 మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2004లో తెలంగాణా ఉద్యమం తీవ్రరూపం దాల్చిన తర్వాత తెలంగాణాలో వచ్చిన కథల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పవచ్చు.

**తెలుగు దళితసాహిత్య అవిర్భావ నేపథ్యం?:** భారతదేశంలో సాహిత్యం, దళిత సాహిత్యంగానీ ఒకేసారి పుట్టలేదు. ఒకేకాలంలో వికాసం చెందలేదు. మహారాష్ట్రలోని అభ్యుదయ సాహిత్యమంతా మార్క్సిజం స్ఫూర్తితో సాగింది. కానీ అభ్యుదయ సాహిత్యం ప్రధాన సాహితీ స్రవంతి కాలేకపోయింది. కారణం మహారాష్ట్ర కేంద్రంగా ఉద్యమాలు కొనసాగించిన అంబేద్కర్ దళిత చైతన్యానికి తాత్త్వికభూమికను అందించటమే. దళిత సాహిత్యానికి పూలే, అంబేద్కర్‌ల సాహిత్యం ప్రధాన భూమికగా దళిత ఉద్యమం భారతదేశ మంతటికీ మార్గదర్శకం అయింది. మహారాష్ట్రలో "దళిత పాంథర్స్" ఏర్పడిన తర్వాత దళిత సాహిత్యం దేశమంతా బలపడింది. దేశంలో వెలువడిన దళితసాహిత్యానికి మొదటితరం రచయితగా అన్నాభావూ సాఠే సృజించిన

మరాఠీ దళిత సాహిత్య ప్రభావం కొంతమేరకు తెలుగు దళితసాహిత్యంపై ఉందని చెప్పవచ్చు. ఈయన గేయసాహిత్యంలో తెలంగాణా ఉద్యమం కూడా ప్రతి బింబించటం విశేషం.[13] ముఖ్యంగా మహారాష్ట్రలోని దళిత ఉద్యమాలు, దళిత సాహిత్యం దేశంలో అన్ని భాషా సాహిత్యాల్లో ప్రభావాన్ని చూపించాయి. ప్రజల్లో ఆధునిక ఆలోచనలు మొలకెత్తడానికి బీజాలు వేసాయి. ఈ నేపథ్యంలో దేశవిముక్తి అనేది భూవిముక్తికి సంబంధించిందని గుర్తించిన సాహితీకారులంతా దళిత పక్షాన నిలబడి దళిత సాహిత్యాన్ని పండించటం మొదలుపెట్టారు.[14] తెలుగులో 1990వ దశకంలో దళిత సాహిత్యం ప్రధాన స్రవంతిగా రూపొందింది. కారంచేడు, చుండూరువంటి చోట్ల దాడులు జరిగాయి. అనేకమంది మాదిగలు ఊచకోతకు గురి అయ్యారు. దళితులపై జరిగిన అమానవీయ సంఘటనలు, దళితచైతన్యాన్ని రేకెత్తించి, దళిత సాహిత్యాన్ని ప్రధాన స్రవంతిగా మార్చాయి. ఈనాడు దళితసాహిత్యం వస్తుందనుకుంటే దీనికి పునాది మాదిగ గూడెంలు, మాదిగ జీవితం, అన్నింటికీ మించి సామాజిక న్యాయం కోసం మాదిగలు ప్రాణత్యాగం చేయటమేనని చెప్పవచ్చు. కాబట్టి "మాదిగల జీవితం నుండే దళితసాహిత్యం పుట్టింది. కొనసాగుతుంది. మాదిగల జీవితాలే దళితసాహిత్యానికి పట్టుకొమ్మలు అవుతున్నాయి."[15] అనేది సాహిత్యకారులు గమనించాలి.

**తెలుగు దళిత కథానిక ఆవిర్భావ నేపథ్యం:** దళితులు శతాబ్దాల తరబడి హీనాతి హీనంగా, బానిసలుగా, పాలేర్లుగా, జీవితాన్ని కొనసాగించటం, అగ్రకులాలు ఎదగటానికి నిరంతరం వెట్టిచాకిరీ చేస్తూ తమ శ్రమను ధారపోయటం, కూడు, గూడు, గుడ్డలేక, గూడారాల్లోనో, చెట్లకిందనో, మోరీల సందుల్లోనో తలదాచుకొని జీవించటం, అగ్రకులాలు సృష్టించిన ఆచారాలకు, సంప్రదాయాలకూ బలికావటం, హీనంగా చూడబడటం, వీధుల్లో ఎదురుపడితే అసహనానికి గురికావటం, వీరికి బావినీళ్లు తాగడానికి, దేవాలయ ప్రవేశం చేయటానికి, విద్య నేర్చుకోవటానికి అర్హత లేకుండా చేయటం, చివరికి కష్టానికి తగినఫలితం అనుభవించకపోవటం, ఆర్థికంగా బలహీనులు కావటం, వీరి స్త్రీలు అత్యాచారాలకు గురి కావటం, దుర్భరమైన జీవితంతో సతమతమవుతూ గాఢాంధకారంలో మగ్గటం జరిగింది. ఇంకా కొన్ని చోట్ల జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో దళితులు తరాలుగా చేస్తున్న వెట్టిచాకిరికి, బానిసతనానికి, ప్రలోభాలకు స్వస్తిచెప్పాలని, వారికి నచ్చిన ఇతర

వృత్తులను చేపట్టాలని, విద్యావంతులై ఉద్యోగాలను అందుకోవాలని, సవర్ణులతో సమానంగా ఉండాలని, సవర్ణులు చేసే దురాగతాలను ఎదురించాలని తెలియజేప్పే విషయాలన్నీ తెలుగు కథానికా సాహిత్యంలో వస్తువులయ్యాయి. ఈ సమస్యపై అనేక రచనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దళితుల రచనలకంటే దళితేతరులు చేసిన రచనలే ఎక్కువగా ఉన్నాయి.

**కథానిక సాహిత్యంలో దళితులు ఎంతమంది?:** కథ వెనుకబాటు తనాన్ని దళితులు కూడా గమనించారు. కొలకలూరి, బోయిభీమన్న, బోయ జంగయ్య, ఎండ్లూరి, తెరేష్‌బాబు, కలేకూరి, సుందరరాజు, జి.కె., గౌరి లాంటివారు కథలు రాసారు. కథానిక మెలకువలను దళితులకు నేర్పటానికి ప్రయత్నం చేసారు. దళితులను చైతన్యం వైపు నడిపించారు. తిరుగుబాటు మగవాళ్లే కాదు ఆడవాళ్లు కూడా చేస్తారని నిరూపించడానికి ముందుకువచ్చిన సుభద్ర, శ్యామల. వీరి సంపాదకత్వంలో వచ్చిన 'నల్లరేగడిసాల్లు'లో వందేండ్ల వయసు గల కథలు ఉండటం విశేషం. స్త్రీవాద కథా సాహిత్యం దీనిలో చోటు చేసుకుంది.[16]

**దళితేతరులు రాసిన తెలంగాణా కథలెన్ని?:** తెలుగు సాహిత్యంలో తెలంగాణా దళిత కథలను వేళ్లమీద లెక్కించవచ్చు. కె. లక్ష్మినారాయణ, రాచపాళెం సంపాదకత్వంలో వచ్చిన 'దళిత కథలు' 25 అయితే అందులో తెలంగాణాకు సంబంధించినవి మూడు మాత్రమే ఉన్నాయి. లక్ష్మినారాయణ సంపాదకత్వంలో దళిత స్త్రీల, దళిత విముక్తి, ఆర్థిక రాజకీయ, వర్ణవివక్ష, వ్యక్తిత్వ, హక్కుల సాధన కథలు వచ్చాయి. వాటిలో గోపి – ఆచూకీ, బి.ఎస్. రాములు – తెల్లబట్ట, రియల్ ఎస్టేట్, సదువు, పాలు, దక్షయజ్ఞం, అయిదవాడు, కాలువ మల్లయ్య – వైరుధ్యాలు, నా తెలంగాణా, తెల్లవారితే, కర్రోడు, జింబో – చెప్పులు, దార్ల రామచంద్ర – బతుకుబడి, కాసులప్రతాపరెడ్డి – వెంటాడిన అవమానం, నీలి, కొత్తతరం, బి. దామోదర్ రావు – గొర్లు, ఎట్టి, ధ్వని, ఊరిబాయి. ఆళ్వారుస్వామి – పరిగె, ఆడెపు లక్ష్మిపతి – రాబందులు, జూకంటి – కళేబరం, చదువు కన్ను, దాశరథి, రంగాచార్య – చదువు, దేవరాజు – పొడవని పొద్దు, నవీన్ – నిప్పురవ్వలు, వీటిలో దళితులు రాసినవి మంగాయమ్మ – అయ్యోపాపం – ఇనాక్ – పశ్చాద్భూమి, ఆకలి, తాకట్టు, గొడ్డుదొంగ, తెరేష్ బాబు – నేనూ నా బొద్దింక, కొందరు మంచివాళ్లకథ, సవర్ణదీర్ఘసంధి, అనుబంధ ప్రశ్న, కలెకూరి – మల్లెతీగ, ఎండ్లూరి

– జాతంటే యాంది?. వీటిలో తెలంగాణా దళితులు రాసినవి బోయజంగయ్యకు చెందినవి మాత్రమే ఉన్నాయి.[17]

దళితేతరులు రాసిన వాటిలో మొదటి దళిత కథ 'పుల్లంరాజు' రచయిత శ్రీపాద. 1. సమాజంలో దళితులు వాస్తవ పరిస్థితులను ఎరిగి, తగిన నిర్ణయాలతో ప్రభుత్వం కఠినచర్యలు తీసుకొని శాసనాలు చేయాలి. 2. అగ్రకులాలలో మానసిక పరివర్తన రావాలి. ఈ రెండు ఏకకాలంలో జరిగితే తప్ప ఈ రుగ్మతలు మాసిపోవని చెప్పే కథ. మాలమాదిగలమధ్య ఏకీకరణ లేకపోవటం ఈ కథలో (నేటి దండోరా లక్షణాలు) ఉన్నాయి. అగ్రకులాలే కాదు మాలలు కూడా మాదిగలను తమ బావులలోని నీళ్లను ముట్టుకోరాదని శాసించే ఒక నిర్దాక్షిణ్య ఆచారం ఆ వూళ్లో ఉంటుంది. "మేము అవసరమైతే ఊరువిడిచి పోతాం. కానీ మాదిగలు ముట్టుకున్న నీళ్లను మాత్రం తాగమని" రాజుతో ప్రతిన పూనడం ఈ కథలో కనపడుతుంది.[18] ఇలాంటి కథలే తర్వాత వచ్చాయి. 'మాదిగపల్లె' కూడా ఇతని రచనే. శ్రీ లీలా సరోజిని – 'మాదిగవాడు', రాయసం వేంకటశివుడు – నిరంజనశాస్త్రి, అరవ వేంకటస్వామి–యీరమ్మ, కనకలింగేశ్వరరావు – గ్రుక్కెడు నీళ్లు, కరుణకుమార – కొత్త చెప్పులు, కయ్యకాలువ, పోలయ్య, చుండూరి రమాదేవి – ధర్మతల్లి, ముద్దుకృష్ణ అంటరాని పొలం, రాసాని – చావుకూడు, జింబో – చెప్పులు మొదలగు కథలు దళితుల గురించి చిత్రించినవే.

**దళితులు రాసుకున్న దళిత కథలు:** దళితులకోసం దళితులు రాసుకున్న మొట్టమొదటి కథ గొట్టుముక్కల మంగాయమ్మ – 'అయ్యోపాపం'. ఈమె మొట్టమొదటి దళిత కథా రచయిత్రి. ఈ కథ మార్చి 1935 గృహలక్ష్మి పత్రికలో ప్రచురితం.[19] అస్పృశ్యతా సమస్య నివారణ జరగాలనే ఆవేదన ఉంది. దళితులపై అగ్రకులాల వైఖరి ఏ విధంగా ఉంటుందో తెలియజెప్తుతుంది. కథానాయకులు మాలకులానికి చెందినవారు. కులరక్కసి కాటేసి బుక్కెడు నీళ్లు దొరకనీయని సన్నివేశం ఈ కథలో ప్రధానాంశం. అన్నపూర్ణ, భాస్కరులు భార్యాభర్తలు, అనారోగ్యపు తల్లిని చూడడానికి తన భర్తతో అన్నపూర్ణ బయలుదేరుతుంది. ఎండతాకిడి వల్ల దాహానికి గురై నీటి గుంటల కోసం వెదుకుతారు. ఒకచోట చలివేంద్రం కనిపిస్తుంది. సాధారణంగా ఆ చలివేంద్రం దగ్గరికి వెళ్లిన వారికి చల్లటి మజ్జిగతో దాహం తీరుస్తారు. వీరు అక్కడికి వెళ్ళారు. పోగానే ముందుగా కులాన్ని అడుగుతారు. ఈ

కుతంత్రాన్ని పసిగట్టని అమాయకులు తమకులాన్ని చెపుతారు. 'ఇక్కడ మాల ముండోళ్లకి దాహమియ్యరు. మాకు మైలగాదూ మీకు నీళ్లొస్తే. పందిరి తాకపోకండి' అంటాడు బాపడు. మరో చలివేంద్రం దగ్గరకు వెళ్తే అదే పరిస్థితి ఎదురైంది. వీధిలోనించి పోతూంటే ఒక బాపన స్త్రీ తన నౌఖరుతో వాళ్లను ఊరిబయటకు గెంటిస్తుంది. గొంతెండిపోయి అల్లాడుతున్న ఆ దంపతులకు ఒక సాయిబు దాహం తీరుస్తాడు. 'ఈ రోజు పెట్టని రోజులు కాబోలు పురిసెడు నీళ్లు కరువ'య్యాయని అన్నపూర్ణ తన భర్తతో అంటుంది. అందుకు భాస్కరుడు 'పెట్టని రోజులని పూర్వ కర్మ ఫలితాలని ఈ దొంగ వేదాంతాన్ని మనకోసమే కల్పించారు. మన రక్త మాంసాలన్నీ బాగా పిండుకొని మనకు మంచి నీళ్లయినా దొరకకుండా చేస్తున్నందుకు మనం నోరు మూసుకొని ఊరుకోవటానికి. ఇట్లాంటి పిచ్చిమాటలు నమ్మబోకు అన్నపూర్ణ' అంటాడు. దళితులు కష్టాలతో పాటు వేదాంత సారాంశాన్ని ఎరిగిన వారే. కానీ ఆర్థిక రాజకీయ బలహీనత వారిని బలహీనం చేస్తుంది. ఈ కథల మీద పరిశోధన చేసిన డా॥ లక్ష్మీనారాయణ అభిప్రాయం "ఎన్నడో రాసిపెట్టిన శాస్త్రాలను ప్రామాణికంగా తీసుకొని అస్పృశ్యులని శతాబ్దాల తరబడి అవ మానిస్తున్నారు. హింసిస్తున్నారు. ఆధునికయుగంలో కూడా వాటి ప్రకారం సమాజంలోని మానవులను తెగలుగా విభజించడం సమాజ విచ్ఛిత్తికి కారణం అవుతుందని సవర్ణులు గుర్తించలేకపోయారు. హిందూ మతంలోని హరిజనులు పలుమతాల్లో వ్యక్తి స్వేచ్ఛ కోసం చేరారు అని ఈ కథ దృక్పథం. మతం వేరైనా ఒక మహమ్మదీయుడు వారి దాహార్తిని తీర్చాడు. తోటి హిందువుల దాహం తీర్చడానికి కులం అడ్డు వచ్చింది. కనీసం వారిని ఇళ్ల దరిదాపులకు రానీయకుండా తరిమారు."[20]

దళితులు దళితులకోసం రాసుకున్న రెండవ కథ కొలకలూరి ఇనాక్ - ఊరబావి. ఇనాక్ అనేక కథలను రాసాడు. ఎన్నో సంపుటాలు, సంకలనాలను వేసాడు. తెలుగు సాహిత్యంలో ఎంతో చైతన్యాన్ని తీసుకురావటానికి ఈయన రచనలు ఎంతగానో దోహదపడ్డాయి. ఇతను ఈ మధ్యలో కూడా నాలుగు కథా సంకలనాలు వెలువరించారు. ఈయన రచనలు, బోయ జంగయ్య రచనలు కూడా పాఠ్యాంశాలుగా ఎంతోమందికి మార్గదర్శకాలు అయ్యాయి. బోయజంగయ్య బంచరాయి, ఇదా కతా, ఇంకానా ఇకపై సాగదు, పాము, దొరసాని, రంగులు, చీమలు, తెలంగాణా వెతలు, బోజకథలు, ఉప్పునీళ్లు సంపుటాలను వేసాడు.

**దండోరా ఉద్యమ మూలాలు రెడ్డిహాస్టల్‌లో పుట్టాయా?:** రెడ్డి హాస్టల్ 1927లో స్థాపించబడింది. దీని అధ్యర్యంలో ఎన్నో సదస్సులు జరిగేవి. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ప్రతీయేటా ఒక హాస్టల్‌ను జిల్లాల వారిగా పెట్టుకుంటూ పోయారు. అనేక కులాలను చైతన్యపరిచిన ప్రతాపరెడ్డి అరుంధతీయులను కూడా చైతన్య పరచాడు. 1928లో మాదిగలు ఒకచోట చేరి సమావేశం కావటానికి రెడ్డి హాస్టల్‌లో వసతి కల్పించాడు. అరుంధతీయులు తమతమ సమస్యలను క్రోఢీకరించి ప్రతాపరెడ్డికి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి అందరూ పూనుకున్నారు. ఇది చూసిన మాలలు ప్రతాపరెడ్డిమీద కోపాన్ని వెళ్ళబుచ్చారు. "మీరు మాదిగలవైపే ఉంటున్నారు. మాలలను విస్మరిస్తున్నారని" మాలలు ఆడిపోసుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మాలకులానికి చెందిన భాగ్యరెడ్డి వర్మ మాలలను ఏకం చేసాడు. అంటరానితన నిర్మూలనకు కృషి చేసాడు. కానీ మాదిగలపట్ల ఆయన కూడా విముఖతనే ప్రదర్శించాడు. ఎందుకంటే ఆనాడు అరుంధతీయుల్లో చదువుకున్నవారు లేరు. మొట్టమొదట బిఏ చేసినవారు ఇద్దరే ఇద్దరు ఒకరు బి. రాజయ్య, రెండవవాడు డా॥ టి.వి. నారాయణ. ఒక పక్క 1928లో అరుంధతీయులు ఏకం కావటం, ఇంకొక పక్క భాగ్యరెడ్డివర్మ లాంటివారు మాలలను ఏకం చేయటం, మొత్తానికి ఏదో ఒక రకంగా దళితులు చైతన్యం కావటం మొదలైంది.[21] ఈనాటికి దాదాపు 90 ఏండ్ల చరిత్రను పూర్తిచేసుకున్న దళిత ఉద్యమాన్ని అరసం సభ్యుడు ఎస్వీ సత్యనారాయణ ధోరణి అని వివిధ సభల్లో, సమావేశాల్లో చెబుతుండటం నిజంగా హాస్యాస్పదమే అనిపిస్తుంది.

1994లో దండోరా ఉద్యమం ఏర్పడింది. ఇది అనేక కులాలకు ఆదర్శప్రాయంగా నిలిచింది. దీనిమీద బి.ఎస్. రాములు "మాదిగ దండోరా భారతీయ సామాజిక ఉద్యమాల్లో ఒక మార్పు. సాహిత్య సాంస్కృతిక రంగాల్లో సైద్ధాంతిక విషయాల్లో అది తెచ్చిన మార్పు గణనీయం. కొందరి ద్వారా తిట్టుపదంగా వాడబడే మాదిగ అనే పదాన్ని వాళ్లు రావు, రెడ్డి, శాస్త్రి, శర్మలాగా గౌరవవాచకంగా మార్చారు. విలువలు మార్చబడ్డాయి. మాదిగ భాష మానవీయమైంది. మాదిగ సాహిత్యం ఉధృతమైన పాట, ప్రసంగం, వ్యాసం, కథ, నవల ప్రక్రియలన్నిటిలో విస్తరించింది. మాదిగదండోరా శ్రామిక కుల సంఘాలలో కొత్త చైతన్యాన్ని తెచ్చింది. లంబాడా, నగారా, చాకిరేవు మొదలైన కులం పేర్లతో పాత కుల సంఘాలకి భిన్నంగా వాటి

వెలుపల కొత్త సమీకరణతో ఉద్యమాలు సాగాయి" అని అభిప్రాయపడ్డాడు.[22] ఈ నేపథ్యంలో కొన్ని తెలుగు కథలు బయటకు వచ్చాయి. దళితసాహిత్యం అంటే అది మాదిగసాహిత్యం నుండే పుట్టిందనే ఆలోచనలు బలపరిచిన కథలు రాసినవాడు ఇనాక్, రెండవవాడు జంగయ్య. దండోరా ఉద్యమ నేపథ్యం నించి వచ్చిన సాహిత్యంలో తర్వాత చెప్పుకోదగినవారు ఎండ్లూరి, సుందరరాజు, తెలంగాణా ప్రాంతం నుండి జి.కె. మాదిగసాహిత్యంలో వీరు మొదటి వరుసలో లెక్కింప బడేవారు. దళిత కథల్లో కొలుకలూరి – అస్పృశ్య గంగ (కోస్తా), నాగప్పగారి – మాదిగోడు (రాయలసీమ), గుండెడప్పు కనకయ్య – 'మేమిట్లుండదం' తెలంగాణా మాండలికంలో మాదిగ సంస్కృతిని, మాదిగ జీవద్భాషను బయటపెట్టాయి.[23] ఎండ్లూరి – 'మల్లెమొగ్గల గొడుగు' కథలు మాదిగజీవిత వాస్తవాలను చిత్రించాయి. పైన తెలిపిన నాలుగు గ్రంథాలు దండోరా ఉద్యమానికి ఒక ఊపునివ్వటమే కాక తెలుగు సాహిత్య పటిష్ఠతకు దోహదకారులు అయ్యాయి. గ్రామీణ పట్టణ జీవితాలను కలబోసుకున్న ఈ మధ్యే వచ్చిన బి.పి. కరుణాకర్ సంపుటి 'అంబాలీస్'లో కొన్ని ఊత పదాలు ఉండటం వల్ల కథ కొనసాగింపు కుదరలేదు.[24]

తెలంగాణాకు చెందిన 'మేమింట్లుండం' కథా సంపుటిలో మొత్తం పది కథలున్నాయి. అక్షరాల బంగారయ్య, కొం(వి)డాకులు, యక్షగానం, దోషులెవరు? మహావీరులు, మాతంగిదాసు, బయోగ్రాఫ్‌కు చివరి లేఖ, తెలుసుకోరా మాదిగ తేటగా, చెప్పుచ్చుకొ్కదుతాం, కనకపుగుడి. వీటిలో యక్షగానం, దోషులెవరు? రెండు కథలు కూడా దండోరా నేపథ్యం నుండే చిత్రించినవి కాగా మిగతావి దళిత జీవిత చిత్రణను, మాదిగ సంస్కృతిని ప్రతిబింబించాయి. ఇప్పటివరకు మా జీవన విధానం దుర్భరంగా ఉంది. దళితుడు అనేవాడు దేశంలో ఎక్కడా ఏ విధంగానూ ఎదగకుండా చేస్తున్నారు. మేము మీ అడుగులకు మడుగులొత్తాము. ఇకముందు మేము ఇలా ఉండం, మేమిట్లుండం అని బల్లగుద్ది చెప్పే ఈ కథల మీద ప్రముఖ సాహితీ కారుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

1. డా॥ నిత్యానందరావు తెలంగాణా తొలి దళిత కథల గురించి 'చినుకు' పత్రికలో ప్రస్తావిస్తూ "గుండెడప్పు కనకయ్య పూర్తి దళిత భాషలో దళిత జీవితాన్ని, దళిత సంస్కృతిని చిత్రిస్తూ 'మేమిట్లుండం' అన్న కథాసంపుటిని ప్రకటించాడు. ఇది తెలంగాణాలో తొలి దళిత కథాసంపుటి. బోయ జంగయ్య దళితోద్యమం

రాకముందు దళిత చైతన్యాన్ని చిత్రించిన ముందుతరానికి చెందినవాడైతే, దళితోద్యమ స్ఫూర్తితో తయారైన రచయిత కనకయ్య. భౌతికంగా వృత్తి చేయనివారు జీవించడానికే అర్హులు కాదని కనకయ్య రాసిన 'ఉత్పాదకులం' కథ నిడివిలో చిన్నదైనా పెద్ద గుర్తింపునే పొందింది. ఇతనే వేసిన "ఎదురు చూపులు" (1999) మొట్టమొదటి తెలంగాణా దళిత కథా సంకలనంగా గుర్తింపు పొందటం కూడా విశేషమే"నని వివరించాడు. 2. 'మేమిట్లుండం కథలు చదివాక సాహిత్య ప్రపంచానికి ఇన్నాళ్లు తెలియని కొత్త సామాజిక వర్గాల జీవితంలోకి మనకళ్లు తెరుచుకుంటాయి" అని తొలి దళిత జీవిత చిత్రణా కథలకు స్వాగతం పలికారు కాత్యాయని విద్మహే.[25] 3. అన్యాయాలపై జరిపే యుద్ధానికి క్రోధం ఆధారం కావాలని గుర్తించినపుడే సమాజం సక్రమంగా ముందుకెళ్లుతుంది. దీనిని తెలియజేసే తత్త్వం కనకయ్య కథల్లో ఉంది. భాషలోని పదప్రయోగాలు భాషా శాస్త్రజ్ఞులకు తెలుగు భాషా విశ్లేషణలో సహాయపడగలవు. ఎన్నో మాండలిక పదాలు సమాజంలో జీవించే శబ్దాలు ఈ కథలలో మనకు లభిస్తాయని యద్దనపూడి వెంకటరమణరావు అన్నారు.[26] 4. "ఇంతవరకు సాహిత్యంలోకి ప్రవేశించని నిఘంటువుల కెక్కని ఎన్నో అపురూపపదాలు ఈ కథల నిండా ఉన్నాయి." అని శిఖామణి తన అభిప్రాయాన్ని వెల్లడించారు.[27]

మాదిగ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జి.కె. సంపాదకుడిగా 1999లో వెలువడిన సంకలనం 'ఎదురుచూపులు'. మాదిగలు ఏది కోల్పోయారో, ఎందుకు కోల్పోయారో... తరాలుగా కోల్పోయిన వాటిని ఇప్పుడు కోల్పోకూడదని ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని శతాబ్దాల తరబడి ఎదురు చూసారు. కానీ ఇప్పుడు ఎదురు చూడకూడదు. ఎవరిని వారే రక్షించుకోవాలనే హితవు పలికే కోణం నుంచి వచ్చిన కథలు ఇవి. ఈ సంకలనంలో డజను కథలున్నాయి. కాపులూరి భద్రయ్య (జి.కె.), మన్నుబువ్వ (గౌరి), కులంగాని కులం (సుధాకర్), మనువుగాడి పెండ్లి (నాగమణి) అద్దిల్లు (ఎలమంద), మనసులేని చోట (క్రాంతి), రేణుకోద్యోగం (అనిత), మావాడి మెరివిని (క్రిష్ణ), సూరీడి సుశీల (అచ్చుల), అంతరంగ తరంగాలు (గౌతమ్), వైతరణి (శ్రీరామచంద్రమూర్తి), దస్తకత్ (గౌరి). ఈ గ్రంథంలో పేదరికం, నిరుద్యోగం, గ్రామపెద్దల, భూస్వాముల అగచాట్లు, దళితుల అణచివేత, అంటరానితనం, దళితులను విడగొట్టడం, అధికారుల దురాగతాలు చిత్రించబడ్డాయి. ఈ కథల మీద ప్రముఖుల అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి.

**1. పోరంకి దక్షిణామూర్తి:** చుట్టూ చిమ్మచీకట్లు ముసిరి ఉన్నపుడు కూడా నిరాశ చెందకుండా, నీరసించి పోకుండా నిబ్బరంగా, మొక్కవోని నిశ్చయంతో నిలిచి వెలుగురేకుల వేకువను దర్శించేవి కావడం 'ఎదురుచూపులు' విశేషం.[28]

**2. నసుమాసస్వామి:** తెలుగు సాహిత్య చరిత్రలో విస్తృతమైన మాదిగోడి హీరోయిజాన్ని చరిత్ర పుటల కెక్కించి, మాదిగవాదాన్ని మానవతావాదంగా ప్రతిష్ఠిం చేయాలనే తాపత్రయం 'ఎదురుచూపుల్లో' దాగి ఉంది.[29]

**3. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి:** మాదిగ జీవితంలోని సాంఘిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక విద్యా వైజ్ఞానిక పార్శ్వాలను ప్రదర్శించి భారతీయ సమాజ నిర్మాణంలోని వెలితిని ఎత్తి చూపుతున్నాయి. ఈ సంకలనం మాదిగ జీవిత దృశ్య ప్రపంచం.[30]

మరో కథా సంపుటి జాజులగౌరి 'మన్నుబువ్వ'. 'ఇటీవలి సాహిత్యంలో ఒక దళిత రచయిత్రి కథాసంపుటిని ఇన్ని కథలతో తీసుకురావటం బహుశా ప్రథమం' అని బి.ఎస్. రాములు అంటాడు. ఈ సంపుటిలో 'విద్యార్థి, పట్టాలు, అక్షరం, నీళ్ళబాయి, కోటీలు, గుండం, సూరీడు, విచ్ఛిన్నం, మార్పు, దేవుడు, కంచె, నిట్టూర్పు, బతుకు, అమ్మ, నేన్‌నేన్‌లెక్కనే, భంగిమ, సదువు, మైల, పగటి బెల్లు, మన్నుబువ్వ, సేరుపట్ల, సిడి, దవాఖాన, పండగ, దస్తకత్' 25 కథలున్నాయి.[31] వీనిలో మన్నుబువ్వ, దస్తకత్ కథల మూలాలు ఎదురు చూపుల్లోనే కనబడతాయి. అందుకే ఈ రెండు కథలు శైలి నిర్మాణం మిగతా కథల నిర్మాణానికి చాలా తేడా కనిపిస్తుంది. ఈ రెండు కథలు దళిత జీవన సంస్కృతిని నొక్కి చెప్పినట్లు ఉంటాయి. మిగతా వాటిలో కొద్దిగా చిక్కదనం కనిపించదు.

దళితకథల్లో సమాజంలో నిత్య వ్యవహారంలో నున్న అనేక సామెతలు, జాతీయాలు ప్రయోగింపబడ్డాయి. 'గడియ రికాం లేదు, గవ్వరాకడ లేదు, సెట్టుకింద సల్లగుంది గానీ నా కడుపులో మంటగుంది, రాత్రంతా అతని కండ్లు గుడ్లగూబ కండ్లే అయ్యాయి'లాంటి శిల్పనిర్మాణ వాక్య ప్రయోగాలవల్ల కథలు సజీవత్వాన్ని పొందాయి. రచయితలు కథకుండాల్సిన వాతావరణ చిత్రణను మన కళ్ళ ముందుంచుతారు. ఈ విషయంలో స్వాతంత్ర్యం రాక ముందుకంటే కూడా తర్వాత కథలు పదునెక్కాయి. దళిత మానవజీవితంలో దొరికినంత వస్తువు, మిగతా మానవ నాగరికతలో దొరకని స్థితి ఇప్పటికీ కనపడుతుంది. చిన్నపిల్లలను గురించి రాసిన కథలు మొదలుకొని మరణించే వరకు రాసిన ఇతివృత్తాలు అత్యంత సహజంగా

కొనసాగుతాయి. ఏ కోణం నించి తీసుకున్నా మానవ విలువలకు, స్నేహానికి, దయాదాక్షిణ్యాలకు సంబంధించిన అనేక కథలు సాహిత్య చరిత్రను పరిపుష్టం చేస్తాయి. ఏ కథను చూసినా శిల్పాన్ని చెక్కినట్లే శిల్ప నిర్వహణ కనపడుతుంది. వస్తువు, పాత్రచిత్రణ, కథాకథనం, ఉత్తమ మధ్యమ పురుష, ఫ్లాష్ బ్యాక్ కథనాలు, సంఘటన, సంఘర్షణ, సన్నివేశ చిత్రణలు, ఎత్తుగడలు, ముగింపులు, శీర్షికలు దేనిని చూసినా వైవిధ్యభరితంగానే కనపడతాయి. తెలంగాణేతరులు తెలంగాణా భాషను తెలంగాణా మాండలికం అంటూ చిన్నచూపు చూడటం వల్లనే తమది తెలంగాణా మాండలికంకాదని, తెలంగాణా భాష అని పిలువాలని, మా కథల్లో నున్న తెలుగు భాష చారిత్రకతను, దానిలో దాగి వున్న ఆత్మీయతను తెలుసుకోవాలనే డిమాండ్‌ను తెలంగాణా సాహితీకారులు వెలిబుచ్చుతున్నారు. ఈ విధంగా తెలంగాణా దళిత కథానిక కొనసాగుతుంది.

**ఆధారిత గ్రంథాలు:**


1. సుజాతరెడ్డి, ముదిగంటి; 2009 తెలంగాణ నుంచే తొలి కథానిక !, ఆంధ్రజ్యోతి, తేది: 13-07-2009.
2. కథా నిలయం; 2008. తొలి తెలుగు కథ - ఏడు అభిప్రాయాలు, కథానిలయం, విశాఖ, ఎ, కాలనీ, శ్రీకాకుళం, 532 001
3. సుజాతరెడ్డి, ముదిగంటి (సం); 2002 తెలంగాణా తొలితరం కథలు, రోహణమ్ పబ్లికేషన్స్, తిలక్‌నగర్ హైదరాబాద్, పుట-6
4. 5,6,7. కథానిలయం; 2008. తొలి తెలుగు కథ - ఏడు అభిప్రాయాలు, కథానిలయం, విశాఖ, ఎ. కాలనీ, శ్రీకాకుళం. పుట - 14,20,26,35
8. సుజాతరెడ్డి, ముదిగంటి 2009 తెలంగాణనుంచే తొలికథానిక ఆంధ్రజ్యోతి దినపత్రిక 13-7-2009.
9. సుజాతరెడ్డి, ముదిగంటి (సం), 2002 తెలంగాణా తొలితరం కథలు, రోహణమ్ పబ్లికేషన్స్, తిలక్‌నగర్, హైదరాబాద్ పుట-1
10. 11,12, రాములు, బి.ఎస్.; 2003 సమగ్ర సామాజిక కథ - తాత్త్విక భూమిక, 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు, విశాలసాహితీ అకాడెమీ, హై పుట-255, 151. 168-175.

13. మనోజ.జి.; 2009. అణ్ణాభావూ సాఠే. భారతీయ సాహిత్య అకాడెమీ. న్యూఢిల్లీ. పుట - 63

14. కనకయ్య, 2004 తెలుగు కన్నడ నవలా సాహిత్యంలో దళిత సమస్యలు - తులనాత్మక పరిశీలన, దళిత రీసెర్చ్ సెంటర్, ఓయూ, హై. పుట - 281

15. కనకయ్య, గుండెడప్పు; 1996 భారతీయ దళితసాహిత్యం - తులనాత్మక పరిశీలన, దళిత రీసెర్చ్ సెంటర్, ఓయూ, హైదరాబాద్. పుట - 27

16. సుభద్ర, శ్యామల (సం).; 2006. నల్లరేగిడి సాల్లు, రోషన్ పబ్లికేషన్స్, హైదరాబాద్.

17. రాచపాళెం, లక్ష్మీ నారాయణ(సం) 2005 దళిత కథలు, 1996 విశాలాంధ్ర పబ్లికేషన్స్. హై

18. సుబ్రహ్మణ్యం, శ్రీపాద; 1935. పుల్లంరాజు, కనక్ప్రవాసి సంపుటిలో ప్రచురితం.

19. మంగాయమ్మ, గొట్టుముక్కుల; 1935. 'అయ్యోపాపం'. గృహలక్ష్మి పత్రికలో ప్రచురితం.

20. లక్ష్మీనారాయణ, కె; 1996. హరిజనాభ్యుదయం - తెలుగు కథానిక, రమా పబ్లికేషన్స్, వినాయకనగర్, పాతూరు, అనంతపురం - 515 005. పుట-49

21. దేవులపల్లి, శివారెడ్డి (సం); 1989 సురవరం ప్రతాపరెడ్డి - గోలకొండ సంపాదకీయాలు. ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, ఆంధ్రసారస్వత పరిషత్తు, హై. రెడ్డి విద్యార్థి గృహం 20-08-1932.

22. రాములు, బి.ఎస్.; 2003 సమగ్ర సామాజిక కథ - తాత్విక భూమిక, 50 ఏళ్ల తెలుగు కథ తీరుతెన్నులు, విశాలసాహితీ అకాడెమీ. హై. పుట-86.

23. ఇనాక్, కొలకలూరి; 2000 అస్పృశ్య గంగ, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్. సుధాకర్.

24. నిత్యానందరావు, వెలుదండ; 2009 చినుకు 4వ వార్షిక ప్రత్యేక సంచిక ఏప్రిల్, 2009 పుట: 205

25. 26,27 కనకయ్య, గుండెడప్పు; 1998 మేమిట్లుండం, దళిత్ రీసెర్చ్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. హై

28. 29,30 కనకయ్య, గుండెదప్పు; 1999 ఎదురుచూపులు, మాదిగ సాహిత్య వేదిక, హైదరాబాద్ విశ్వవిద్యాలయం. హై.

31. గౌరి, జాజుల; 2004. మన్నుబువ్వ, విశాల సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

32. నారాయణ, సింగమనేని (సం); 2001 తెలుగు కథకులు కథన రీతులు 1,2,3,4. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

33. గుడిపాటి; 2003 ఇతివృత్తం, ఋషి ప్రచురణలు, మెయిన్‌రోడ్, హనుమాన్ పేట్. విజయవాడ పుట -

34. సుజాతరెడ్డి, శ్రీనివాస్ (సం); 2005 తొలినాటి కథలు, కర్షక్ ప్రింటర్స్, ఓ. యు. రోడ్, హైదరాబాద్.

35. వెంకటేశ్వరరావు, దేవులపల్లి 1984. తెలంగాణా ప్రజల సాయుధ పోరాట చరిత్ర, ప్రొలిటేరియన్ లైన్ ప్రచురణలు, హై.

36. లక్ష్మి నారాయణ, కె; 1999. దళిత కథలు - 1,2,3,4,5,6,7,8., రమా పబ్లికేషన్స్, వినాయక్‌నగర్, పాతూరు, అనంతపురం - 515 005

37. బాల శ్రీనివాసమూర్తి, గుమ్మన్నగారి; 2008. ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ, ప్రసన్న శివానంద ప్రచురణలు, నిజామాబాద్.

38. 20 ప్రముఖుల కథలు, కథంబం; 2005 ప్రియదర్శిని ప్రచురణలు, హైదరాబాద్.

39. మలయశ్రీ; 2006 ఐరేనికుండలు, నవ్యసాహిత్య పరిషత్, కరీంనగర్

40. జనార్దన్, అంబల్ల; 2004 అంబల్ల జనార్దన్ కథలు, విశాల సాహిత్య అకాడెమీ, హైదరాబాద్.

41. వీర తెలంగాణా నా జ్ఞాపకాలు - అనుభవాలు - నారాయణ రెడ్డి, రావి : 1972, విశాలాంధ్ర హైదరాబాద్

42. తెలంగాణా వైతాళికులు - నరసింహారావు, ఎం.ఎల్.: 1987

43. తెలంగాణాలో జాతీయోద్యమాలు - రామానుజరావు, దేవులపల్లి : 1984

44. తెలంగాణా పోరాట స్మృతులు - రామచంద్రారెడ్డి, ఆరుట్ల : 1981, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్

# తెలంగాణా కథానికా క్రమం బెట్టిదనిన...

ఆచార్య వెలుదండ నిత్యానందరావు

జీవితంలోని ఒక ముఖ్య ఘట్టాన్ని ప్రదర్శిస్తే అది కథ. జీవితం మొత్తాన్నే ప్రదర్శిస్తే అది నవల. ఆ ఘట్టం, ఆ జీవితం తన కాలం నాటిది, తన కందివచ్చింది అయి ఉండడం మరో ముఖ్య విశ్లేషణాత్మక సూత్రంగా భావించుకొంటే తెలంగాణా కథ, ఆంధ్ర కథల గమనాలకు పరిణామ వికాసాలకు ఆ రెండు సమాజాల సాంస్కృతిక రాజకీయ ఆర్థిక భావనాత్మక వైరుధ్యాలు, వైవిధ్యాలు, స్వీయాత్మకాలు హేతువులవుతాయని గుర్తించక తప్పదు. ఆంగ్లప్రభుత్వం, ఆంగ్లవిద్య, మునిసిపాలిటీలు, గ్రామపాలనావ్యవస్థ, కాలువల నీళ్ళు, పత్రికలు - వచన రచన, బెంగాలీ ప్రభావం ఆంధ్రప్రాంత అభ్యుదయానికీ ఆంధ్ర కథ వికసనానికి దోహదమైంది. నిజాం ప్రభుత్వం, ఉర్దూ విద్య - తెలుగు నిరాకరణ, ఫ్యూడల్ గ్రామీణ వ్యవస్థ, దారిద్ర్యం, దోపిడీ తెలంగాణా జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి. అట్లాగే కవిత్వ సంప్రదాయం వారసత్వంగా వచ్చి వచన రచనా సంప్రదాయం బలపడకపోవడం, పత్రికలు అధికంగా లేకపోవడం స్వాతంత్ర్య పూర్వం తెలంగాణాలో కథా ప్రక్రియ కానీ నవలా ప్రక్రియ కానీ వికసించకపోవడానికి ప్రధాన హేతువు. 1932 నుండి 1940 దాక ఎనిమిదేళ్ళ కాలంలో 2956 ఉర్దూ పుస్తకాలు ప్రచురితమైతే తెలుగు పుస్తకాలు 288 మాత్రమే ప్రచురితమైనట్లు నిజాం సమాచారశాఖ రికార్డ్స్ సాక్ష్యమిస్తున్నాయి. ఏవో కొన్ని తెలుగు పుస్తకాలు ప్రభుత్వ రికార్డ్సుకు ఎక్కకపోవచ్చు. మరో రెండింతల పుస్తకాలు తెలంగాణవి బ్రిటిష్ ఆంధ్రప్రాంతంలో ప్రచురితమైతే కావచ్చు. ఆంధ్ర కథలకు, కథకులకు లభించిన ప్రచారావకాశాలతో పోలిస్తే తెలంగాణా కథలకు కథకులకు ప్రచారావకాశాలు స్వల్పం కావడం కూడా తెలంగాణ కథ వెనుకబాటు మరో ముఖ్యకారణం.

ఇలాంటి దుర్భర స్థితి తెలంగాణా వారిని 'హృదయశల్యం' లా పీడిస్తున్నా గురజాడ అప్పారావు దిద్దుబాటు కథ వచ్చిన రెండేళ్ళలో అదే 'ఆంధ్రభారతి' పత్రిక జనవరి 1912లో మాడపాటి హన్మంతరావు 'హృదయశల్యం' కథ వెలువరించి తెలంగాణాలో అది కథకులయ్యారు. ప్రేమ్‌చంద్ ప్రభావంతో రాసిన మాడపాటి ఏడు కథలను 'మల్లికాగుచ్ఛం' పేరుతో మచిలీపట్నంలోని సరస్వతీ నికేతనం

1915లో ప్రకటించింది. ఆ తర్వాత అణాగ్రంథమాల వారు 1940లో సురవరం ప్రతాపరెడ్డి కథల సంకలనాలు రెండు ప్రచురించేదాక మరోకథా సంకలనం రాలేదు. చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, చింతాదీక్షితులు, వేలూరిశివరామశాస్త్రి, మునిమాణిక్యం నరసింహరావు లాంటి కథా రచయితలను తెలంగాణాలో ఆ కాలంలో ఆశించడం అత్యాశ కావచ్చు. కాని ఆంధ్ర పత్రికలు ప్రచురించడానికి నిరాకరించిన చలం కథలకు తెలంగాణా పత్రిక సుజాత పట్టుకొమ్మగా నిలిచింది అంటే కథకు అనువైన హృదయగత సంస్కారం తెలంగాణలో సమృద్ధిగా ఉందన్న సంగతి దీనివల్ల తేటతెల్లమవుతుంది.

తెలంగాణా కథానికా క్రమాన్ని స్థూలంగా నాలుగు దశలుగా విభజించు కోవచ్చు.

1. అంకుర దశ (1912-1940)
2. ఆంధ్రమహాసభ, కాంగ్రెసు, కమ్యునిస్టు, తెలంగాణా సాయుధ పోరాట ప్రభావంతో వచ్చిన కథలు (1940-56).
3. ఆంధ్రప్రాంత ప్రభావం, నక్సలైట్ ఉద్యమం, గనికార్మిక పోరాటాలను చిత్రించిన కథలు. (1956-85)
4. దళిత, బహుజన, మైనారిటీ, తెలంగాణా ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలను చిత్రించిన కథలు. (1985 నుండి నేటి వరకు)
5. అన్ని కాలాల్లోను వచ్చిన భిన్న భిన్న ఇతివృత్తాలతో కూడిన కథలు.

దంపతుల మధ్య 'అనుమాన పిశాచి' రగిలించే వేదనను 'హృదయశల్యం' కథలోను, స్త్రీ పరమైన అనాసక్తత ఉందని చెప్పుకొనే డాంబికాన్ని 'నేనే' కథలోను మాడపాటి హన్మంతరావు సరళ సుందరంగా చిత్రించారు. అనుమానాలు, అన్యస్త్రీవాంఛ కథావస్తువులుగా కొన్ని వందల కథలు తెలుగులో వచ్చాయి.

తాను ఎదిగి లండన్ దాకా వెళ్ళి చదువుకొని తనమూలాలు మరచిన ఒక యువకుని 1927లోనే చిత్రించి 'తూతూ' అనిపించారు ఒద్దిరాజు రాఘవ రంగారావు గారు. విదేశాల్లో చదివిన వారు కావచ్చు, వెనుకబడిన దళిత కులాలవారు కావచ్చు, గ్రామప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చి చదివిన వారు కావచ్చు; బంధుమిత్రుల

వదాన్యుల సహాయ సహకారాలతో చదువుకొన్న వారు కావచ్చు. మొత్తం మీద చదువుకొని ఉద్యోగాలు చేస్తూ తమ ఉన్నతికి హేతువైన పల్లెలకు, వ్యక్తులకు తమ వంతు సేవ చేయని కృతఘ్నులను గురించి, వచ్చిన ఎన్నో కథలకు ఒద్దిరాజు వారి కథ ప్రాతినిధ్యం వహించిందనవచ్చు.

తెలంగాణాలో తొలి ఐ.ఏ.ఎస్. (ఆనాడు ఐ.సి.ఎస్. అనే వారు) అధికారి సిరుగూరి జయరావు. వారు సి.వి.రామన్ శిష్యులు. వారు 'పరమాణువుతో మేజువాణి' అనే వైజ్ఞానిక కథను 1927లో రాశారు. ఆంధ్ర తెలంగాణా రెండు ప్రాంతాల్లోను ఇదే ప్రప్రథమ సైన్స్‌ఫిక్షన్ కథ కావడం గమనార్హం. 1928లో ఒద్దిరాజు సీతారామ చంద్రరావు సుజాత పత్రికలో 'అదృశ్యవ్యక్తి' అనే మరో వైజ్ఞానిక కథ రచించారు.

సమాధుల పేరిట ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించడం లేదా సమాధులకు కేటాయించి దరిద్రులకు బతకడానికి భూమి లేకుండా చేయడం, ఆఖరికి మృతశిశువులను పూడ్చడానికి కూడా చోటు లేకుండా చేసే మనస్తత్వాన్ని 1945లోనే పొట్లపల్లి రామారావు 'సమాధి స్థలం' అనే కథలో తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో గాంధీ నెహ్రూ ఇందిరా రాజీవులకు కేటాయించిన స్థలాలు కాని, ఇతర చోట్లలో నాయకులకు కేటాయించిన స్థలాలను కానీ గమనిస్తే పొట్లపల్లి రామారావు ఎంత ముందుగా భవిష్యత్తును దర్శించారో తెలిసి ఆశ్చర్యం కలుగుతుంది.

సమకాలీన రాజకీయ చైతన్యాన్ని ప్రతిఫలిస్తూ ప్రబోధిస్తూ రాసిన కథలకు నిదర్శనంగా సురవరం ప్రతాపరెడ్డి 'సంఘాల పంతులు', భాగ్యరెడ్డి వర్మ 'వెట్టిమాదిగ' పి.వి. నరసింహారావు, 'గొల్లరామవ్వ', కాంచనపల్లి చిన వెంకటరామారావు 'ఆకలి' మొదలైన కథలెన్నింటినో పేర్కొనవచ్చు. ఇవన్నీ 1940–1948 ప్రాంతాల్లో వచ్చాయి. రజాకర్ ఉద్యమాన్ని, దాన్ని అరికట్టడానికి జరిగిన మిలటరీ చర్యను చిత్రించిన నెల్లూరు కేశవస్వామి 'యుగాంతం' కథ, కాళోజి 'లంకాపునరుద్ధరణ' లాంటి కథలెన్నో వచ్చాయి. ఆంధ్ర ప్రాంతీయులైన లక్ష్మీకాంతమోహన్, ఉప్పల లక్ష్మణరావు మొదలైనవారు రాసిన 'మహాశక్తి' 'గెరిల్లా' లాంటి కథలను సైతం ఈ సందర్భంలో స్మరించాలి. 1950 ప్రాంతాల్లో తెలంగాణా రాజకీయ సామాజిక జీవితాన్ని జి. సురమౌళి, గూడూరు సీతారాం ప్రభృతులు చిత్రించారు.

స్వాతంత్ర్యానంతరం విశాలాంధ్ర ఏర్పడ్డాక తెలంగాణ కథలు మరింత విస్తృతంగా రావడం మొదలు పెట్టాయి. స్వాతంత్ర్యపూర్వం పూర్తి గ్రాంథికం కానీ పూర్తి ఆధునిక వ్యావహారికం కానీ కాకుండా ఒక విలక్షణమైన శిష్ట తెలంగాణ ప్రాంతీయ భాష కథానికల్లో ఉండేది. తర్వాత క్రమేపి ప్రామాణిక భాషగా చలామణి అయి ఆంధ్ర రాష్ట్రం మొత్తాన్ని ఆక్రమించిన రెండున్నర జిల్లాల భాషలో తెలంగాణ రచయితలు రాయక తప్పలేదు. రాయకపోతే ఎవరూ గుర్తించరేమోనన్న భావన కూడా తలెత్తింది. ఆంధ్రరచయితల రచనా ప్రభావం తెలంగాణా రచయితల మీద ప్రసరించడం కూడా ఈ కాలంలోనే మొదలైంది. బుచ్చిబాబు చైతన్య స్రవంతి రచనా శిల్పం తెలంగాణ ప్రాంతంలో 1962లో 'నవీనంగా' వచ్చిన పరిణామం. 'అంపశయ్య' నవీన్ 1962 ప్రాంతంలో 'అదోలోకం', 'లైఫ్ ఇన్ ఎ కాలేజి' లాంటి చైతన్య స్రవంతి శిల్పం కథలు రాశారు. చైతన్య స్రవంతి శిల్పంలో రాయబడిన అంపశయ్య నవీన్‌కు అమితకీర్తి ప్రతిష్ఠలు తేవడమే కాకుండా ఇంటి పేరుగా స్థిరపడడం గమనార్హం.

శ్రీకాకుళం జిల్లాలో నక్సలిజం ట్రిగ్గర్ నొక్కితే కరీంనగర్ జిల్లాలో తూటాపేలింది. చెరబండరాజు 'చిరంజీవి' కథ 'చైతన్యం రెక్కవిప్పింది' ఎం.వి. తిరుపతయ్య 'పిడికిళ్ళు బిగుసుకొన్న రాత్రి' లాంటి కథలెన్నో నక్సల్ ఉద్యమాన్ని బలంగా చిత్రించాయి. తెలంగాణ పల్లెటూరి యాసను, మానవసంబంధాలను నిసర్గసుందరంగా చిత్రిస్తూ రాసిన పి. యశోదారెడ్డి కథలు కూడా ఈ కాలంలో వచ్చినవే. ఎమర్జెన్సీ తర్వాత కరీంనగర్ జిల్లాలో జగిత్యాలలో ఉవ్వెత్తున ఎగిసిన పోరాటం ముఖ్యంగా 1978 సెప్టెంబర్ 9న జగిత్యాలలో 40 వేలమందితో జరిగిన ఊరేగింపు, తత్సంబంధమైన ఉద్యమ చైతన్య ప్రతిఫలంగా అల్లం రాజయ్య లాంటి రచయితలెందరో రంగం మీదికి వచ్చారు. అల్లం రాజయ్య రాసిన 'మార్పు' 'సంఘం కథ', 'ఎదురు తిరిగితే', 'పుడమి పుత్రులు' మొదలైన అనేక కథల్లో భూస్వాముల దోపిడీలు, దౌర్జన్యాలు, భూస్వాధీనాలు, పోలీసుల దౌర్జన్యాలు, ఎన్‌కౌంటర్లు, గిరిజనులను ఫారెస్టు అధికారులు దోపిడీ చేయడం లాంటి సమస్యలు వాస్తవిక దృక్పథంతో ప్రజలు వాడే భాషలో చిత్రితమయ్యాయి. శనిగరం వెంకటేశ్వర్లు అనే రచయిత 'సాహు' అనే మారు పేరుతో గిరిజనుల మీద జరుగుతున్న దోపిడీని కేంద్రంగా చేసి రాసిన 'రక్తపింజర' లాంటి కథలు కూడా ఈ కాలంలోనే వచ్చాయి. గిరిజన స్త్రీల మీద జరిగే లైంగిక దోపిడి, గిరిజనుల అణచివేతను చిత్రిస్తూ జాతశ్రీ అనేక కథలు రాశారు. వివిధ వృత్తుల వారు తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం

వల్ల చితికి పోవడాన్ని, దొరలు పటేల్ పట్వారీల దౌర్జన్యాలకు గురి కావడాన్ని, దాని వల్ల పీడితులంతా తిరుగుబాటు దారులుగా మారినస్థితిని ఉప్పల నరసింహం 'తిరగబడ్డ భూమి' 'సాపలు', 'ఇత్తనపుకోడె' లాంటి కథల్లోను; తుమ్మేటి రఘోత్తమ రెడ్డి 'ధిక్కారం', 'పనిపిల్ల', 'కార్మిక', 'కుంపటి' మొదలైన కథల్లోను చూడవచ్చు. సింగరేణి గనికార్మికుల సమస్యలను వారి ఆర్థిక సమస్యలను, జీవితాలను కేంద్ర బిందువులుగా చేసుకొని అల్లంరాజయ్య, తమ్మేటి రఘోత్తమ రెడ్డిలు రాసిన కథలు ఈ సందర్భంలో స్మరించదగ్గవి.

1980 దశకంలో వచ్చిన బోయ జంగయ్య గొర్రెలు, ఎచ్చరిక కథా సంకలనాలకు మంచి పేరొచ్చింది. తెలంగాణాలో జరుగుతున్న దోపిడి, రాజకీయ నాయకులు, పెద్ద పెద్ద ఉద్యోగులు సామాన్య ప్రజలను ఎలా పీడించుక తింటున్నది. కరెంటు విధానం మార్కెట్ విధానం లాభం లేకుండా ఉన్న స్థితిని గొర్రెల్లాగా తెలంగాణ ప్రజలు మారిన స్థితిని బోయజంగయ్య చిత్రించారు.

బి.ఎస్. రాములు 'జరిమానా' 'దక్షయజ్ఞం' 'వైరుధ్యాలు' 'ఇల్లాలు' 'అడవిలో వెన్నెల' లాంటి కథల్లో ఉద్యమకార్యకర్తల్లో పోలీసుల దాడుల వల్ల కలిగే మానసిక వైక్లబ్యాలను, భయాలను, ఉద్యమాల్లో భాగస్వాములైన మహిళల కౌటుంబిక సంబంధాలను, సమస్యలను, కులదృక్పథాన్ని, చదువుకొన్న దిగువ తరగతి వారు అగ్రకులాలను అనుసరించడం గొప్పగా భావించే స్థితిని చిత్రించారు. విప్లవోద్యమాల్లో కార్యకర్తగా ఎదిగిన వ్యక్తిని పట్టుకోవడానికి పోలీసులు చేసే దాడుల్లో అతని కుటుంబం, అతని గ్రామం, ధ్వంసం అయిన తీరును, విప్లవాల వల్ల భూములను అమ్ముకొని పట్నాలకు చేరి మరింత ధనవంతులయిన పెత్తందారుల తీరును, విప్లవాల వల్ల వెనుకబడిన కులాల అభివృద్ధే కాదు గ్రామాల అభివృద్ధి కూడా కుంటుబడిన తీరును బి.ఎస్. రాములు దళిత బహుజన దృక్పథంతో వాస్తవిక కోణం నుండి విశ్లేషించారు.

తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ కథలు రాసిన గౌరవం డా॥ కాలువ మల్లయ్యకు దక్కుతుంది. ఏడువందల దాక కాలువ మల్లయ్య రాసిన కథల్లో స్పృశింపబడని అంశంలేదంటే అతిశయోక్తి లేదు. 1. మా కథలు, 2. కాలువ మల్లయ్య కథలు, 3. అవ్వతోడు గిది తెలంగాణ 4. రాజుకోడి లాంటి వీరి కథా సంపుటుల్లో చేరిన కథలు దాదాపు 100 దాక వస్తాయి. కాలువ మల్లయ్య 700 కథలు రచనా కాలక్రమంలో ఒక బృహత్ సంపుటిగా వస్తే తెలంగాణా సామాజిక

పరిణామాన్ని బేరీజు వేయడానికి మంచి ఆకర గ్రంథం కాగలదు. మారిన కాలంతో పాటు సర్దుకోలేకపోయే దొరల అహంకారం, ఆ దొరల ఇళ్ళల్లోనే ఆధునిక స్త్రీవాద ప్రజాస్వామ్య వాదుల తరం తయారు కావడం; ఉద్యమాలు పోరాటాలు తెచ్చే చైతన్యంతో పాటు ఎవరు ఎందుకు చంపుకొంటున్నారో తెలియని ఒక అయోమయస్థితి, రైతులను అప్పులపాలు చేసే గ్రామీణ ఋణవ్యవస్థ, చదువుల కోసం భూములు అమ్ముకొనే దుస్థితి, గ్లోబలైజేషన్‌తో ఏర్పడిన పరాయీకరణ స్థితి, ప్రేమరాహిత్యం, భూమికీ రైతులకూ ఉండే అవినాభావ సంబంధం. అది మారిపోతున్న తీరుతెన్నులు తన రెక్కల కష్టంతో ఎదిగిన కొడుకుల చేత నిరాదరణకు గురయిన ముసలి తల్లిదండ్రులు బతకడం కోసం తిరిగి డబ్బు సంపాదించుకోవలసిన స్థితి, డబ్బు హోదాలతో విలువలు పెరిగిన కొత్త కులాలు, కొత్త గౌరవాలు, మారిపోయిన మానవ సంబంధాలు ఇత్యాది ఎన్నెన్నో ఇతివృత్తాలకు కాలువ మల్లయ్య సజీవమైన తెలంగాణ భాషలో ప్రాణం పోశారు.

తెలంగాణ ప్రాంతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యమాలకు చైతన్యానికి కేంద్రబిందువు కావడంలో ఆశ్చర్యపోవలసిన పనిలేదు. అంపశయ్య నవీన్ రచనల తర్వాత ఉస్మానియా క్యాంపస్‌ను ప్రధానంగా చేసి చిత్రించిన వాటికి దృష్టాంతంగా కాసుల ప్రతాపరెడ్డి కథలను పేర్కొనవచ్చు. 'శిలువకు తొడిగిన మొగ్గ' 'ఎల్లమ్మ' లాంటి కాసుల ప్రతాపరెడ్డి కథా సంకలనాల్లో జీవితంలోని, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాల్లోని సమాజం ఆమోదించని, ఆమోదించిన ప్రేమల్లోని భిన్న భిన్న కోణాలను ఆవిష్కరించారు. మోటాటి, పాకనాటి, గూడాటి ఇత్యాది రెడ్లలోని ఉపకులాలలోని అంతర్గత వైరుధ్యాలని బహుళ కథా వస్తువులుగా ప్రస్తావించిన తొలి రచయిత కాసుల ప్రతాపరెడ్డే కావచ్చును.

పండిత సాహిత్యంలో విదుషీమణియై పరిశోధనాత్మక రచనలు చేసిన డా॥ ముదిగంటి సుజాతారెడ్డి హైదరాబాదు శివార్లలో భూముల అమ్మకాలు కొనుగోళ్ళ గురించి, తద్వారా తయారువుతున్న నయాధనవంతుల గురించి ప్రపంచీకరణ నేపథ్య దృష్టితో ప్రతిభావంతమైన కథలు రాశారు. మహ్మదీయ జీవన చిత్రణను సైతం ఎంతో వాస్తవికదృక్పథంతో సుజాతరెడ్డి జహంగీర్‌బీ, కథలో చిత్రించడం విశేషం. మహ్మదీయ మహిళల జీవన స్థితి గతులను, ఉద్యోగినుల మానసిక ఆర్థిక సమస్యలను, శ్రమదోపిడీలను మహ్మదీయ మహిళలపై మతపరంగాను కుటుంబ పరంగాను కొనసాగే అణచివేతను బాహుభార్యాత్వ సమస్యలాంటి ఎన్నో అంశాలను గీతాంజలి

(డా॥ భారతి) చిత్రిస్తూ 'బచ్చేదాని' 'పహెచాన్' లాంటి కథా సంపుటాలను ప్రకటించారు. రచయిత్రి వృత్తిరీత్యా డాక్టర్ కావడంతో ఎందరో మహిళలను స్వయంగా కలిసి వారి సమస్యలను బాధలను తెలుసుకోగలిగే అవకాశం లభించడం ఆమె కథాంశాల వైవిధ్యానికి దోహదం చేసింది.

ప్రపంచీకరణ పట్టణీకరణ నేపథ్యంలో దేవరాజు మహారాజు, నందిగం కృష్ణారావు, జూకంటి జగన్నాథం కె.వి. నరేందర్, పులుగు శ్రీనివాస్ లాంటి వారు ఎన్నో మంచి కథలు రాశారు.

దండోరా – మాలనాడు పంచాయితీయే గాక దళిత జీవన చిత్రణను, వారి సమస్యలను – ఆవేదలను చిత్రించిన కథలెన్నో బోయ జంగయ్య, పెద్దింటి అశోక్‌కుమార్, బి.పి. కరుణాకర్, డా॥ డి. కనకయ్య లాంటి వారెందరో రాశారు.

కొత్తగా ఉద్యోగంలో చేరిన వేళ కులవివక్ష వల్ల బాధపడుతున్న ఒక దళిత ఉపాధ్యాయునికి స్కూలు అటెండర్ ఏసురత్నం వద్ద సాంత్వనం లభిస్తుంది. కాని అతడు కూడా 'నేను చిన్నవాడిని మీరు చదువుకున్నవాళ్ళు. అడగకూడదు. కాని అడగకుండ ఉండలేకపోతున్నాను. మరేమనుకోవద్దు. మీరు మాలా? మాదిగా?' అని ప్రశ్నిస్తాడు. ఇది 1966లో బి.పి. కరుణాకర్ 'అంతే' అనే కథలో చిత్రించింది. ఇప్పుడు రెండుకులాల్లోని వైరుధ్యాలు విపరీతం కావడం విచిత్ర పరిణామం. డా॥ పి. కనకయ్య పూర్తి దళిత భాషలో దళిత జీవితాన్ని, దళిత సంస్కృతిని చిత్రిస్తూ 'మెమిట్లుండం' అన్న కథ సంకలనాన్ని ప్రకటించారు. ఇది తెలంగాణాలో తొలి దళితా కథా సంకలనం. బోయజంగయ్య దళితోద్యమం రాకముందు దళిత చైతన్యాన్ని చిత్రించిన ముందు తరానికి చెందినవారైతే దళితోద్యమ స్ఫూర్తితో తయారయిన రచయిత డా॥ పి. కనకయ్య. వారు దళిత సమస్యల మీద పరిశోధన కూడా చేసిన వారు కావడంతో సమస్యలను లోతుగా అధ్యయనం చేయక తప్పలేదు. భౌతికంగా 'వృత్తి చేయనివారు జీవించడానికి అర్హులు కాదని కనకయ్య రాసిన 'ఉత్పాదకులం' కథ నిడివిలో చిన్నదైనా పెద్ద గుర్తింపునే పొందింది. డా॥ కనకయ్య సంపాదకత్వంలో 'ఎదురుచూపులు' అనే దళిత కథా సంకలనం ఒకటి వెలువడింది. గోగు శ్యామల, జూపాక సుభద్రల సంపాదకత్వంలో వచ్చిన కథా సంకలనాలు 'తొలిపొద్దు', 'నల్లరేగడి చాళ్లు', స్మరించుకోదగినవి. జాజుల గౌరి 'మన్నుబువ్వ', 'దస్తకత్' 'కంచె' కథలు, 'గోగు శ్యామల 'తాటకి' 'రణం' లాంటి కథలు, జూపాక సుభద్ర, 'మాన్యం', 'సుద్దిచేయాలి' కథలు, మేరి 'మాష్టిపోషవ్వ' కథ దళిత మహిళల జీవన స్థితికి

దర్పణం పట్టేవి. ఆంధ్రాతెలంగాణా ఉమ్మడి పౌరుడు డా॥ ఎండ్లూరి సుధాకర్ రాసిన 'మల్లెమొగ్గల గొడుగు' దళిత కథాత్మక కవితాత్మక సంకలనానికి మంచి పేరొచ్చింది.

మహమ్మదీయుల అస్తిత్వాన్ని గుర్తించాలని వారి సమస్యలు వారికున్నాయని ఎలుగెత్తి చాటుతూ మహ్మద్ నిసార్, అఫ్సర్, స్కైబాబ, అన్వర్, ఖాజా, షాజహానా లాంటి వారు కథలు రాస్తున్నారు. ఇంకా పి. చంద్, జూకంటి జగన్నాథం, ఆడెపు లక్ష్మీపతి, ఐతాచంద్రయ్య లాంటి వారెందరెందరో తమదైన స్వీయముద్రతో తెలంగాణా కథా ప్రక్రియను పరిపుష్టం చేస్తున్నారు.

ఆంధ్రప్రాంతంలో బ్రాహ్మణ ఆచార వ్యవహారాలు ఎక్కువగా ప్రదర్శితం కావడం బ్రాహ్మణ రచయితలు ఎక్కువ ఉండడం విశేషం కాగా తెలంగాణా కథకులలో దీనికి భిన్నమైన స్థితి ఉండడం గుర్తించదగిన అంశం. ఉద్యమకాల్పనిక చైతన్యం ఆంధ్రకథల్లో కనిపిస్తే ఉద్యమ వాస్తవిక దృక్పథం తెలంగాణా కథల్లో గమనించవచ్చు. చైతన్య స్రవంతి మనోవిశ్లేషణ లాంటి సిద్ధాంతాలు వయ్యక్తికమైన వేదనలు ఆంధ్రకథల్లో ఎక్కువగా ఉంటే సమష్టి సమస్యలు - పీడనలు - ఉద్యమ చిత్రణం తెలంగాణ కథల్లో కనిపిస్తాయి.

తెలంగాణ సృజనాత్మక రచనలకు సరియైన ప్రచారావకాశాలు లభించలేదన్నది నగ్నసత్యం. ఇటీవల తెలంగాణ అస్తిత్వ ఆకాంక్ష ఉద్ధృతమైనాక ఈ దిశలో తవ్వకాల పరిశోధన తీవ్రతరమైంది. 'తెలంగాణా తొలితరం కథలు', 'తొలినాటి కథలు' పేరుతో డా॥ ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌లు 1912 నుండి 1956 వరకు వచ్చిన 35+46=81 కథల సంకలనాన్ని వెలువరించారు. కాలువమల్లయ్య సదానంద్ శారదల సంపాదకత్వంలో 'తెలంగాణ కథ' పేరుతో ఒక సంకలనం వెలువడింది. ఆయా రచయితల వ్యక్తిగత కథా సంకలనాలు సరేసరి. కె.కె. రంగనాథాచార్యులు ప్రకటించిన 'తొలినాటి తెలుగు కథానికలు' గ్రంథం ద్వారా వాసుదేవ రావు అనే ఒక హైదరాబాదు కథకుడు తెలియవస్తున్నాడు. డా॥ ముదిగంటి సుజాతారెడ్డి, ఆచార్య కాత్యాయనీ విద్మహే, డా॥ కాలువమల్లయ్య, కాసుల ప్రతాపరెడ్డి, గుడిపాటి, కె.పి. అశోక్‌కుమార్, సంగిశెట్టి శ్రీనివాస్ లాంటివారు తెలంగాణా కథలను వాటి విశేషాలను ప్రయత్న పూర్వకంగా విశ్లేషించి విమర్శలు చేస్తున్నారు. దీని వల్ల తెలంగాణ కథలు అందరికీ తెలిసివచ్చి వాటి పరిశోధన పరిశీలన అధ్యయన అనుశీలనలకు దోహదమేర్పడింది.

# జనజీవన పరిణామ చిత్రాలు "తెలంగాణ కథలు"

రామా చంద్రమౌళి

తెలంగాణ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఒక అగ్నిగుండమే.

ఒకసారి గతంలోకి తొంగి చూచుకుంటే..,

నిజాం రాజ్యంలో ఉన్న పదహారు జిల్లాల్లో ఎనిమిది తెలంగాణాకి, ఐదు మరాఠా, మూడు కర్ణాటకకు చెందినవిగా ఉండేవి. నిజాం ప్రాపకం పొంది జాగీర్దార్లుగా మారి అధికారం చెలాయిస్తున్న దొరల క్రింద దాదాపు ఒక కోటీ అరవై లక్షల జనాభాగల తెలంగాణ ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ బహుమతిగా పొందిన ఇనాం భూములుండేవి. 7430 గ్రామాలు కలిగిన హైద్రాబాద్ రాష్ట్రంలో 40% ప్రాంతం జాగీర్లు, సంస్థానాలు, సర్ఫ్-ఎ-ఖాస్ క్రింద ఉంటే మిగిలిన 60% భూమి 'ఖాల్సా' లేక 'దివానీ' అని పిలువబడ్తూ నేరుగా ప్రభుత్వపాలన కింద ఉండేది. రైతువారి పద్ధతి అమలులో ఉన్న ఆ కాలంలో ప్రభుత్వాధికారులు జాగీర్దార్ల ద్వారా ఈ భూమి మీద పన్నులు వసూలు చేసేవారు. ఈ ఖాల్సా భూముల్లో పన్ను వసూలు చేసే దళారీలు తర్వాతి కాలంలో దేశ్‌ముఖ్, సర్‌దేశ్‌ముఖ్, దేశాయి, సర్‌దేశాయి అనే బిరుదుల్ని పొంది అంతులేని భూమిని సంపాదించుకుని భూస్వాములుగా తయారయ్యారు. ఉదాహరణకు జన్నారెడ్డి ప్రతాపరెడ్డి కుటుంబానికి ఒక లక్షా యాభైవేల ఎకరాల భూమి, విస్నూరు రామచంద్రారెడ్డికి నలభై వేల ఎకరాల భూమి, సూర్యాపేట దేశ్‌ముఖ్‌కి ఇరవైవేల ఎకరాల భూమి ఉండేది. భూస్వామికి భూమి మీదేకాక ఆ భూమి నాశ్రయించుకుని బ్రతికే ప్రతి మనిషిమీదా హక్కు ఉండేది. భూస్వామి ఏ స్త్రీ మీదనన్నా మోజుపడ్డాడంటే ఆమె అతనికి లొంగిపోవలసిందే. ఒక స్త్రీ పెళ్ళి చేసుకుంటే మొదటి రాత్రి భూస్వామితో గడపాల్సిందే. ఆడబాపలుగా, బానిస స్త్రీలుగా భూస్వామి అవసరాలనూ, అతని కుటుంబ అవసరాలనూ తమ చాకిరితో తీర్చాల్సిందే. ఏమాత్రం తిరుగుబాటు ధోరణి కనిపించినా కఠినమైన శిక్షలు విధించేవాళ్ళు. 'నీ బాంచెన్ దొరా' అనేది తెలంగాణా రైతాంగానికి ఊతపదమైపోయింది. స్త్రీలకు మంచి బట్టలు కట్టుకోడానికిగ్గానీ, పూలు పెట్టుకోడానిగ్గానీ ధైర్యం చాలేదికాదు. దొరగానీ, దొరసాని గానీ పిలుస్తే కంచం

ముందు కూర్చున్నాసరే భోజనం వదలి వెంటనే పరుగెత్తాలి. భూస్వాముల పొలాల్లో వెట్టికి పనిచేస్తుంటే ఆడావాళ్ళను చంటిపిల్లలకు పాలివ్వడానిక్కూడా వెళ్ళనిచ్చేవాళ్ళు కారు. ఆడవాళ్ళను చెరచడం భూస్వాముల హక్కుగా ఉండేది.

ఈ నేపథ్యంలో...

తెలంగాణా అంటే పోరాటం, తెలంగాణా అంటే ధిక్కారం, తెలంగాణా అంటే ఒక కన్నీటి సముద్రం అయి 'ఈ రోజు గడిస్తే చాలు' అనే నిత్యనరకంలో బతుకులను గడిపే మనిషి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఒక ఆయుధమై ఒక కొత్త ఆలోచనూ, ఒక జ్వలించే రక్తనక్షత్రమై తన జీవితాన్ని తానే కన్నీళ్ళూ నెత్తురూ కలగలిసిన సిరాతో రాసుకుంటూ ఒక చరిత్రగా మిగిలాడు. అందుకే విజ్ఞప్తుల పర్వం నుండి విప్లవాల యుగం దాకా ఎదుగుతూ వచ్చిన దాదాపు ఒక శతాబ్ది సంక్షుభిత జనజీవితాన్ని ప్రతిబింబించగల తెలంగాణా కథా సాహిత్యాన్ని ఒక ప్రాతినిధ్య పద్ధతిలో ప్రచురించాలని సంకల్పించి ఒక బృహత్ సంపుటిగా తొంభై ఏళ్ళ సాంస్కృతిక, సామాజిక పోరాట రూపురేఖలను కూర్చి 'తెలంగాణ కథలు' గా పాఠకులకు అందించినందుకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్ వారు ఎంతైనా అభినందనీయులు. ఈ పుస్తకం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక విశిష్టగ్రంథంగా మిగిలిపోతుంది... అధ్యయనకారుల ప్రశంసలనూ పొందుతుంది.

తొమ్మిది దశాబ్దాల సామాజిక చరిత్రకు సజీవ సంతకమైన 'తెలంగాణ కథ'లో యిక్కడి మనిషి తన అస్తిత్వం కోసం పడ్డ తపన, కర్కశ పాలకుల మత విద్వేషాల పద ఘట్టనల క్రింద నలిగిన ఆక్రందన, తన సంస్కృతిపై జరిగిన దాడిని ఎదురొడ్డి తిప్పికొట్టిన తిరుగుబాటు, గర్జన, సాయుధుడై యిక్కడి నేలను నెత్తుటితో అభిషిక్తం చేసిన విప్లవ విస్ఫోటనం.. వీటన్నింటిని ఈ పుస్తకంలోని కథలు నమోదైన జీవన చిత్రాలై దర్శనమిస్తున్నాయి.

తొంభై ఏళ్ళ తెలంగాణా జనజీవితాన్ని జాగ్రత్తగా, విశ్లేషణాత్మకంగా పరిశీలించి వర్గీకరిస్తే ఆ జీవితాలను ప్రతిబింబించగల కథలను సృజించిన రచయితలను 1956 వరకు కలం పట్టిన వారిని "తొలితరం" కథకులుగా, ఆ తరువాతి కాలం నుండి 1975 వరకు కథలు రాసిన వారిని 'మలితరం' కథకులుగా, అప్పటినుండి 1990 వరకు కలంపట్టిన వారిని మూడవతరం కథకులుగా, తొంభైల

తర్వాత కథకులుగా ప్రసిద్ధులైన వారిని 'ఈతరం' కథకులుగా భావించవచ్చునేమో అనిపిస్తోంది. దాదాపు ఇదే దృష్టితో 'తెలంగాణా కథలు'కు సంపాదక బాధ్యతలు వహించిన కాలువ మల్లయ్య, సదానంద్ శారద, చంద్ర సుమారు రెండువందల యాభై కథలను పరిశీలించి ఒక విశాలమైన కాన్వాసుపై విస్తృత జీవన పార్శ్వాలనూ, తెలంగాణా జీవిత వైవిధ్యాలనూ, ఉన్నతినీ, ప్రత్యేకతనూ చాటగల తొంభై కథలను ఏరి కూర్చి సంకలీకరించారు. ఇది అంత అషామాషి వ్యవహారం కాదు. సులువైన విషయం అంతకన్నా కాదు. అందుకు సంపాదకులను అభినందిస్తున్నాను.

పోరాటకాలంలో తెలంగాణా ప్రాంతంలోని సృజనకారులు ప్రత్యక్షంగా ఉద్యమంలో నిమగ్నులై ఉండడం వల్ల కావచ్చు, కథారచన రహస్యాలు, మెళకువలు, పద్ధతుల పట్ల అవగాహన అంతగా లేకపోవడం వల్ల కావచ్చు, పరిపక్వత లేకపోవడం వలన కూడా కావచ్చు... ఎక్కువ కథలను వెలువరించలేకపోయారు. సంఖ్యాపరంగా అధిక కథలు వెలుగు చూడలేకపోయాయి. కాగా ఆంధ్రప్రాంతానికి చెంది లేదా ఆంధ్రప్రాంతం నుండి వచ్చి యిక్కడి జనజీవన సంఘర్షణలతో మమేకమై, యిక్కడి అణచివేతకు, ఫ్యూడల్ దౌర్జన్యానికి వ్యతిరేకంగా తమ సంఘీభావాన్ని ఎలుగెత్తి చాటి 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట' కాలంలో ప్రజాపక్షం వహించి వెలువరించిన రచయితల కథలు కోకొల్లలు.

వాసిరెడ్డి నవీన్ 1982లో 'తెలంగాణ పోరాట కథలు'ను సంకలనం చేసి వెలువరించారు. ముదిగంటి సుజాతరెడ్డి 'తెలంగాణ తొలితరం కథలు' పేరుతో రెండు సంకలనాలను అందించారు. ఈ కథల వివరాలతో సమగ్రంగా సంగిశెట్టి శ్రీనివాస్ పరిశోధన స్థాయిలో 'దస్త్రమ్'ను ప్రచురించారు. తొలితరం తెలంగాణ కథకుల సమగ్ర సంకలనాన్ని ఇటీవల సెప్టెంబర్ 2008లో డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ వాళ్ళు వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వంలోనే 'తెలంగాణ విముక్తి పోరాట కథలు' గ్రంథాన్ని వెలువరించి కథా జిజ్ఞాసువులకు 'తెలంగాణ కథ' పట్ల ఒక పూర్ణావగాహనను పెంపొందించే ప్రయత్నం చేశారు. ఐతే యిక్కడ 'తెలంగాణ కథ' అంటే తెలంగాణకు చెందిన రచయిత రాసిన కథా, రచయిత ప్రాంతం ఏదైనా తెలంగాణా జన జీవితాన్ని కథా వస్తువుగా మలచిన కథ అన్న మూలసందేహం పొటమరిస్తుంది. నవీన్ ఇటీవల సంకలించిన 32 కథలను 23 మంది రచయితలు రాస్తే దాంట్లో పదిమంది సర్కారాంధ్ర ప్రాంతం వారే. సి.వి. కృష్ణారావు, అట్లూరి

పిచ్చేశ్వరరావు, రాంషా, వుప్పల లక్ష్మణరావు, గంగినేని వెంకటేశ్వరరావు, తుమ్మల వెంకటరామయ్య, తెన్నేటి సూరి వంటి రచయితలు ఎంతో నిబద్ధతతో తెలంగాణ జీవితాన్ని కథలుగా గ్రంథస్థం చేశారు. ఐతే వీళ్ళ కథల్లో జీవధాతువైన తెలంగాణ నుడికారం లేదు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఎక్కువ తెలంగాణ కథలు అడవి బాపిరాజు సంపాదకత్వాన హైద్రాబాద్ నుండి వెలువడ్డ 'మీజాన్' దినపత్రికలోనూ, అరసం పత్రిక 'అభ్యుదయ'లోనూ, శెట్టి ఈశ్వరరావు సంపాదకత్వంలో వెలువడ్డ 'విశాలాంధ్ర', ప్రజాశక్తి, గోల్కొండ పత్రిక, శోభ, నవోదయ, స్రవంతి, పత్రికల్లోనూ వచ్చాయి. వీటిలో ఎక్కువమంది నిర్వాహకులు తెలంగాణా వాళ్ళు కారు.

ఐతే... విశాలాంధ్ర వెలువరించిన ఈ 'తెలంగాణా కథలు' పుస్తకంలో తెలంగాణా ప్రాంతానికి చెందిన రచయితలవి మాత్రమే ఐన తొంభై కథలను ఎన్నుకుని కాలక్రమ పద్ధతిలో కూర్చారు.

'ఈతరం' రచయితల్లో చాలామంది ఉద్వేగపూరితమైన మనిషి జీవితాన్నీ, అనుభూతుల్నీ 'కథ'గా గ్రంథస్థం చేసి విశ్రమించేవాళ్ళే తప్ప సాహిత్య సృజన ఒక ఆచరణాత్మక పవిత్రాంశంగా ఎవరూ భావించరు కాని మొదటితరంలో తెలంగాణ నుండి కథలు రాసిన వాళ్ళు కేవలం రాసి ఊర్కున్నవాళ్ళు కాదు. తెలంగాణా వికాసం కోసం, అభ్యున్నతి కోసం, విమోచనకోసం శాయశక్తులా కృషి చేసినవాళ్లే, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, పి.వి. నరసింహారావు, కాళోజీ నారాయణరావు, దాశరథి రంగాచార్య యిత్యాది రచయితలకు జీవితం వేరు సాహిత్యం వేరు కాదు. వాళ్ళకు సాహిత్యమంటే ఆచరణ. సాహిత్యమంటే ఒక నిరంతర లక్ష్యసాధన.

ప్రధానంగా మొదటితరం తెలంగాణా రచయితల 'కథ' నేల విడిచి సాము చేయలేదు. 'తెలంగాణ కథ' అన్ని విముక్తి ఉద్యమాలనూ తనలో సంలీనం చేసుకుంది. నిజాం నిరంకుశ పాలనలోని దుర్మార్గాన్ని ఎదురిస్తూ, ప్రశ్నిస్తూ, ధిక్కరిస్తూ రజాకార్ల వ్యతిరేక పోరాటాలకు అద్దంపడ్తూ తెలంగాణా భాషా సాహిత్య సంస్కృతుల రక్షణకు నడుం కట్టింది. ఉవ్వెత్తున లేచిన రైతాంగ పోరాటాలకు దర్పణమైంది. తెలుగు కథకు విప్లవ పంథాను చూపించి సోషలిస్టు వాస్తవికతవైపు పయనిస్తూ కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి వర్గాలకు దన్నుగా నిలిచింది.

1910లో గురజాడ 'దిద్దుబాటు' కథ ప్రచురించబడ్డ 'ఆంధ్ర భారతి'లోనే మాడపాటి హనుమంతరావు రాసిన 'హృదయ శల్యం' కథ 1912లో అచ్చయింది. గురజాడ కథకు పూర్వమే బండారు అచ్చమాంబ 1902 లో కథను వెలువరించినా దానికి కథానికా లక్షణాలు లేవనే కారణం మీద మొట్టమొదటి తెలుగు కథ గురజాడ 'దిద్దుబాటు' అనే పరిగణన కొనసాగుతున్న వర్తమానంలో తెలంగాణ నుండి మాడపాటి హనుమంతరావు తొలికథకుడుగా, 'హృదయశల్యం' మొదటి తెలంగాణా కథగా అంగీకరిస్తూ, యిప్పటికే 'హృదయశల్యం' ఇదివరకే కొన్ని సంకలనాల్లో వెలువడి ఉన్నందున హనుమంతరావుదే మరో కథ 'ఎవరికి'? తో ఈ తెలంగాణ కథలు' బృహత్‌గ్రంథం ఆరంభమైంది.

ఈ తొంభై కథలను చదువుతూ సాగుతున్న కొద్దీ తెలంగాణా జనజీవితం పరిణామం చెందుతూ వచ్చిన వివిధ సంక్లిష్ట దశల గురించీ, మారిన వ్యవస్థ యొక్క రూపురేఖల గురించీ, రచయితల వ్యక్తీకరణ, విధానాల గురించీ, వస్తువైవిధ్యం గురించీ అనుశీలనా విలక్షణతల గురించీ, దృక్పథాల గురించీ సుస్పష్టంగా తెలుస్తుంది. ఇది ప్రధానంగా చరిత్ర, సాహిత్య, సామాజికశాస్త్ర అధ్యయనకారులకు ఉపయోగపడే కీలకాంశం. గ్రాంథిక భాషా పరిమళాలతో ఆరంభమైన తెలంగాణా కథ సురవరం ప్రతాపరెడ్డి, నందగిరి వెంకట్రావు, అజ్ఞాతవాసి, భాగ్యరెడ్డివర్మ, నందగిరి ఇందిరాదేవి, పెండ్యాల శేషగిరిరావు, కాంచనవల్లి చినవెంకటరామారావు వరకు ఒక పరంపరంగా వెలువడి కాళోజీ నారాయణరావు, 'మనమే నయం', అడ్లూరి అయోధ్య రామకవి 'అన్నాచెల్లెలు', ఆవుల పిచ్చయ్య 'ఊరేగింపులు'. పి.వి. నరసింహారావు 'గొల్ల రామవ్వ', వట్టికోట ఆళ్వారుస్వామి 'గాలిపటం', పొట్లపల్లి రామారావు 'ఊరు–అడవి' కథలు వెలువడేనాటికి ఒక విశేషమైన, విలక్షణమైన తెలంగాణాతనాన్ని నింపుకున్న వ్యక్తీకరణగా స్థిరపడ్డది. తెలంగాణ యాస, మాండలికం, నుడికారం పలుకుబడి వీళ్ళ కథల నుండి ఒక ప్రత్యేకమైన గొంతుతో ఆవిష్కృతమైంది. తెలుగులో ఇతర ప్రాంతాలనుండి వెలువడ్తున్న కథలతో పోల్చి చూచినపుడు ఒక వైవిధ్యభరితమైన వస్తువు, శైలి, సంవిధానం, నడక ఈ తెలంగాణ కథల్లో చాలా స్పష్టంగా ప్రస్ఫుటమైంది.

తర్వాత 'మలితరం' కథా రచయితలైన తాడిగిరి పోతరాజు, నిఖిలేశ్వర్, చెరబండరాజు, చంద్ర, పి. యశోదారెడ్డి, అల్లం రాజయ్య, ముదిగంటి సుజాతారెడ్డి,

అంపశయ్య నవీన్, రామా చంద్రమౌళి, బోయ జంగయ్య, సదానంద్ శారద, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య, దేవరాజు మహారాజు, నందిగం కృష్ణారావు తమదైన సొంతగొంతుతో 'తెలంగాణ కథ' ఏ ఇతర ప్రాంత, భాషాస్థాయితోనైనా పోల్చి చూచినపుడు ఏ మాత్రం తీసిపోని పరిపుష్టతతో ఉన్నతీకరించారు. ఐతే ఇంతకుముందు చెప్పుకున్నట్టు వీళ్ళు ఏ కోణంలో తెలంగాణా జీవితాన్ని దర్శించి కథగా మలిచినా ఈ ప్రాంతపు మట్టి, యిక్కడి సంక్షుభిత సందర్భాలు, కన్నీళ్ళు, దుఃఖం, దోపిడి, తిరుగుబాటు, వలసలు, పోరాటాలు ధిక్కారాలు, కుమిలికుమిలి పొగిలిపోవడాలు వీటి గురించే ప్రస్తావించారు. విశ్లేషించారు. వెంటాడే జ్ఞాపకాలుగా కథలను రూపుకట్టించారు. చాలా సందర్భాలలో ఈతరం కథకులు రాసిన కథలను చదువుతున్నప్పుడు హృదయం భారమౌతుంది. ద్రవిస్తుంది. దుఃఖం ముంచుకొస్తుంది, మౌనం కన్నీరౌతుంది.

ఇక మూడవతరం... ఈతరం రచయితలు అత్యంతాధునికులై 'తెలంగాణా కథ'ను ప్రధానంగా మానవీయకోణంలో హృదయపు లోలోతులను తట్టి, తడిమి, యిక్కడి భౌగోళిక, రాజకీయ, ఉదాసీన సందర్భాలలో పరచుకుని విస్తరించిన కూలీల వలసలు, సాగునీరు లేక వట్టిపోతున్న భూములు, గోదావరి యిక్కడ ప్రవహిస్తున్నా పాలకుల వివక్షవల్ల సంప్రాప్తించిన వెనుకబాటుతనపు దౌర్భాగ్యం, దరిద్రం, వీటిని ఆలంబనగా చేసుకొని ఉత్తర తెలంగాణా కేంద్రంగా రూపుదిద్దుకుని విస్తరించిన తీవ్రవాద ఉద్యమాలు, ఉద్యమ విధ్వంసాలు, పోరాటాలు, ప్రత్యేక తెలంగాణా ఆకాంక్షలు, రాజకీయ కుట్రలు కుతంత్రాలు... చివరికి చితికి భయంకరంగా మోసగింపబడ్తున్న సామాన్య తెలంగాణా పౌరుడు... వీటన్నింటిని కథా వస్తువుగా స్వీకరించి అద్భుతమైన కృతులను పుంఖానుపుంఖాలుగా వెలువరించి కథారంగంలో 'తెలంగాణా కథ'ను తలెత్తుకుని నిలబడే స్థాయిలో ప్రతిష్ఠించారు. అనేక కథావార్షికల్లో 'ఈతరం' తెలంగాణ కథకులు తమదైన ముద్రను బలంగా ఆవిష్కరించి ఒక భిన్న జీవితాంతరంగాన్ని పరిచయం చేయగలిగారు. ముఖ్యంగా పెద్దింటి అశోక్‌కుమార్ 'తెగిన బంధాలు', ఐతా చంద్రయ్య 'కలికి గాంధారి', అఫ్సర్ 'గోరిమా', కె.వి. నరేందర్ 'దొర మల్లా వచ్చిండు', జాతశ్రీ 'అంతర్ముఖం' పంజాల జగన్నాథం 'మట్టి మనుషులు' జాజుల గౌరి 'మన్నుబువ్వ', బెజ్జారపు రవీందర్ 'నిత్యగాయాలనది' – కథలు కథాప్రియుల హృదయాల్లో కలకాలం నిలిచే జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి.

భారతదేశంలో ఒక విలక్షణమైన పోరాట చరిత్రా, నేపథ్యం, భౌగోళికంగా ఒక ప్రత్యేకమైన పర్యావరణం, నైసర్గికంగా ఎన్నో వనరులతో నిండిన పరిపుష్టత.. కలిగి తరతరాలుగా వివక్షకూ, దోపిడీకి, విస్మరణకూ, నిర్లక్ష్యానికీ గురై ఈనాడు ఒక చిత్రమైన 'కుమ్ములోని నిప్పు'గా మిగిలిన 'తెలంగాణ' సాంస్కృతిక రూపును పరిచయం చేయాలని సంకల్పించి 'విశాలాంధ్ర' ఈ 'తెలంగాణ కథలు' ద్వారా సాఫల్యపరచడం, విజయవంతంగా తొంభై ఏళ్ళ కాలానికి ప్రతీకలుగా తొంభై ప్రాతినిధ్య కథలను పదిలంగా దాచుకోదగ్గ పుస్తకంగా పాఠకులకు అందించడం నిజంగా అభినందించదగ్గ విషయం. ఇది చరిత్రలో ఒక 'గుర్తు'గా మిగిలిపోయే పని. ఇంత మంచి పుస్తకాన్ని కూర్చడం మామూలు విషయం కాదు. సంపాదకులు ముగ్గురూ అభినందనీయులే.

ఐతే.. ప్రపంచంలో ఎక్కడైతే మనిషి తన అస్తిత్వం కోసం, స్వేచ్ఛకోసం, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాటం చేస్తుంటాడో, ఎక్కడైతే మనిషి దుఃఖం, వేదన, దోపిడి, ఉద్యమం, తిరుగుబాటు, వీటితోనే సహజీవనం సాగిస్తూ నెత్తురోడే గాయాలతో బతుకును ఒక 'సాహసకార్యం'గా కొనసాగిస్తుంటాడో అక్కడ ఉత్తమ, ఉత్కృష్ట, ఉన్నతస్థాయి సాహిత్యం వెలువడ్తుంది. ఈ సత్యాన్ని 'తెలంగాణ కథలు' గ్రంథం మరోసారి ఋజువు చేస్తుంది.

# భిన్న రీతుల్లో సాగిన తెలంగాణ కథ

డా॥ బి.వి.ఎన్. స్వామి

మరగకాసిన నీరు తనపైనున్న మూతను తోసివేసి పొయ్యి మంటపై దూకినట్లు తెలంగాణ కథ తన ప్రజల బాధల నివారణకు నడుంకట్టింది. అందుకు తానే ఇతివృత్తంగా మారింది. ఫలితంగా నిషేధానికి గురైంది. తెలంగాణ ప్రజలకు మిగిలిన భారతావనితో బాటుగా స్వాతంత్ర్యం లభించలేదు. వారి స్వాతంత్ర్య కాంక్షను నవాబు నలిపేశాడు. అప్పుడు ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేయడానికి స్వాతంత్ర్యకాంక్ష, సామాజిక మార్పులే ఇతివృత్తంగా కథ వారికి అండగా నిలిచింది. జమీందార్లు, పటేలు-పట్వారీలు, దొరలు - దేశ్‌ముఖ్‌లు ఆనాటి నిజాం పరిపాలనా చక్రంలోని ఇరుసులు. నిజాంతో సహా వీరందరు ప్రజల మూలుగులను పీల్చి పిప్పిచేశారు. వీరందరికి సబ్బండ వర్ణాల ప్రజలు వెట్టిచాకిరీ చేసి బతుకుల్ని వెళ్ళదీశారు. నాటి ఆ వైనాన్ని కథ రికార్డు చేసింది. ఇటువంటి కథల్లో స్థానిక రాజకీయ, సాంస్కృతిక అభినివేశం కనిపిస్తుంది. విలాసాల్లో మునిగితేలే జమీందార్ల నిర్లక్ష్యాన్ని, గ్రామ వ్యవస్థను కథ చిత్రించింది. వ్యవస్థను మార్చాలనుకొనే ఆదర్శ భావాలుగల యువకుల సంస్కరణాభిలాషను అక్కున చేర్చుకుంది. సంస్కృతీ సంప్రదాయాలనూ భాషా సొగసులను తనలో ఇముడ్చుకుంది. తెలంగాణ కథ వర్తమాన సమాజాన్ని పట్టించుకుంటూనే చారిత్రక స్పృహను కూడా ప్రదర్శించింది. నిజాం ఆచార వ్యవహారాల, సంస్కృతీ సంప్రదాయాల మేళవింపయిన మొగలాయితనం కూడా కథల్లో కనపడుతుంది. ఆ విధంగా ప్రజాస్వామిక సంప్రదాయాన్ని పాటించింది. నిజాం కాలం నుండి కూడా కథ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలుస్తూ వచ్చింది.

నిజాం పరిపాలనవల్ల అస్తవ్యస్తమైన ప్రజానీకం కష్టాలపట్ల కథ ఆనాడు తన సహానుభూతిని ప్రదర్శించింది. భూస్వామ్య వ్యవస్థకు ప్రతినిధులైన జమీందార్లు, జాగీర్‌దార్లను కథ నిలదీసింది. తెలంగాణ దొరల దాష్టీకాన్ని ప్రశ్నించింది. తిరగబడ్డ జనం వైపు నిలిచింది. కష్టాలను, కడగండ్లను కడుపులో దాచుకున్న ప్రజలు తమ బాధల్ని బాహాటంగా చెప్పుకున్నారు. ఆ చెప్పుకోవడంలోనే కథ పుట్టింది. ఈ

ధోరణిలో వచ్చిన కథ కనుకనే తెలంగాణా కథకు ఉద్యమకథ అనే ముద్ర పడింది. కాని వాస్తవంలో అదొక్కటి మాత్రమే నిజం కాదు. అంతకుమించి ఆనాటి ప్రజల ఆర్తి, సుఖ దుఃఖాలు, జీవన విధాన చిత్రణలు కూడా ఎక్కువగా కనపిస్తాయి. ఒక రకంగా తెలంగాణా కథను ప్రజాకథ అని పిలువవచ్చు. ఈ క్రమంలోనే వారు తమ కష్టాలను కథలు కథలుగా చెప్పుకున్నారు. అలా చెప్పుకునే అవసరం నుండే రచయితలు పుట్టారు. వారే కలం పట్టి తమ సమస్యలను, స్పందనలను, పరిష్కారాలను కథల రూపంలో రికార్డు చేసుకున్నారు. ఇలా రాసినవారు కనుకనే వీరందరూ ప్రజా రచయితలు అయ్యారు.

పల్లెల్ని, భూముల్ని వదిలిన రైతు కూలీలను సింగరేణి బొగ్గు గనులు ఆహ్వానించాయి. బొగ్గు బాయి పని అంటే ఆకర్షణీయంగా కనబడింది. జీవనం కోసం బొగ్గు బాయిలోకి దిగిన వారి బ్రతుకులు బండ కింద బతుకులయ్యాయి. పాతాళం లాంటి బావుల్లోకి బొగ్గు కోసం దిగి అదే బొగ్గుకు బలికావడం నిత్యకృత్యాలయ్యాయి. పచ్చని ప్రకృతి మధ్య, శుభ్రమైన గాలి, నీరు, వెలుతురు మధ్య బ్రతికిన రైతులు, కార్మికులుగా అందుకు భిన్నమైన వాతావరణంలో బతకడం భరించలేకపోయారు. పల్లెల్లో దొరల దౌర్జన్యాన్ని భరించలేక పోరాడినవారు, బొగ్గు బాయి యాజమాన్యం యొక్క నిరంకుశ విధానాలను, సహించలేకపోయారు. వీటన్నింటికి వ్యతిరేకంగా, కనీస సౌకర్యాలైన నీరు, ఇల్లు లాంటి వాటికోసం, యాజమాన్య అణచివేతకు నిరసనగా కార్మికులందరు ఒక్కటైనారు. పల్లెల్లో సంఘ కార్యాకలాపాల్లో పాల్గొన్న అనుభవంతో సింగరేణిలో పోరాటాన్ని మొదలుపెట్టారు. ఆ విధంగా సింగరేణిలో కార్మికోద్యమం మొగ్గ తొడిగింది. ఈ దశలో కార్మికుల సమస్యల్ని యాజమాన్య నిరంకుశత్వాన్ని పోరాట క్రమాన్ని చిత్రిస్తూ కథలు వచ్చాయి. కథకులు స్వయంగా కార్మికులైనందున ఈ కథలన్నీ నిజజీవన ప్రతీకలుగా నిలిచాయి.

నాగరిక సమాజానికి దూరంగా కొండలు, కోనలతో నిండిన దట్టమైన అరణ్యాల్లో అటవీ ఉత్పత్తులను సేకరించుకుంటూ, పోడు వ్యవసాయంతో బతుకులను గడుపుతున్న ఆదివాసీలు ప్రకృతి మధ్య స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవనం సాగిస్తుంటారు. అడవి జంతువులతో స్నేహంగానూ, వాటి పట్ల జాగరూకతతోనూ ఉంటూ కాలం గడుపుతున్న గిరిజనులు మైదాన ప్రాంతీయుల దృష్టిలో పడ్డారు. మైదాన ప్రాంతానికి చెందిన షావుకార్లు అటవీ ఉత్పత్తులను గిరిజనుల వద్దనుండి

చౌకగా కొని వారికి తమ వద్ద ఉంటున్న సరుకులను అత్యధిక ధరకు అమ్మేవారు. వినిమయ విధానమే తెలియని గిరిజనులు అమాయకంగా మోసపోయారు. అంతేకాక గిరిజనులకు డబ్బులిచ్చి, అనేక రెట్లు వడ్డీ వసూలు చేసేవారు. వడ్డీలు చెల్లించడంలోనే గిరిజనుల జీవితాలు పూర్తి అయ్యేవి. అడవికోసం, అటవీ పుత్రుల సంక్షేమం కోసం నెలకొల్పిన ప్రభుత్వ సంస్థలు వారికి ఉపయోగపడేవి కావు. తాగునీరు కోసం మైళ్ళదూరం నడచి వెళ్ళవలసి రావడం గిరిజనులకు చెందిన విషాదం. అటవీ శాఖకు చెందిన సూపర్‌వైజర్ల, ఉద్యోగుల నియంత్రణ గిరిజనులపై అత్యంత పాశవికంగా ఉండేది. ఈ విధంగా గిరిజనులు క్షణమొకయుగంగా బ్రతుకు వెళ్ళదీసేవారు. నిజాం నవాబును ఎదిరించి పోరాడిన కొమురం భీం వారసత్వం వారిలో ఉన్నా, వారిని ముందుండి సమస్యల పరిష్కారం కోసం నడిపించేవారు లేకపోవడం నిజం. రైతాంగ, కార్మిక ఉద్యమ నాయకత్వం ఈ వాస్తవాన్ని గ్రహించి 'పొరకల సార్లు'గా అటవీ ప్రవేశం చేసింది. మైదాన ప్రాంత జులుంకు వ్యతిరేకంగా గిరిజనుల్ని చైతన్యవంతుల్ని చేసింది. అప్పుడే అడవిలో జరుగుతున్న అన్యాయాలు, బయటి ప్రపంచానికి తెలిసాయి. అలా తెలపడానికి వాహికగా తెలంగాణా కథ పనిచేసింది. అడవుల్లోకి ఉద్యమ కార్యకర్తలుగా వెళ్ళి యువకులు గోండు భాష నేర్చుకొని, వారి సంస్కృతీ, ఆచారాలను, సమస్యలను మొదలగువాటిని కథలు, కథలుగా మలిచి ప్రపంచానికి అందజేసారు.

ఈ ప్రాంతం నుండి 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి' అనే వాక్యసారాన్ని కలంలో ఒంపుకొని కథలు వెలువడ్డాయి. ఈ కథలు భారతీయ సంప్రదాయానికి పట్టం గట్టాయి. దేశభక్తి పూరితములైన ఇలాంటి కథల్లో నా భూమికి నేనేదో చేయాలనే తపన కనిపిస్తుంది. ఈ వెలుగులో కథల్ని పరిశీలిస్తే ఈ క్రింది సల్లక్షణాలు అవగతమవుతాయి.

1. మానవ స్వభావచిత్రణ 2. జాతీయ సాంస్కృతిక వాద భావనలు 3. సామాజిక సమతా వాద దృక్పథం 4. సంస్కారవాద కోణం 5. మానవీయ మూల్యాల ప్రతిష్ఠాపన 6. జాతీయ సామాజిక స్పృహ పట్ల అవగాహన 7. సందేశాత్మక ధోరణి 8. శాశ్వత మానవ విలువల ఆరాధన 9. స్వాతంత్ర్యోద్యమ ఛాయల ప్రదర్శన 10. ప్రాచీన సంప్రదాయ పరిరక్షణ 11. భౌతిక సౌందర్యం కన్నా మానసిక సౌందర్యం మిన్న అనే నమ్మకం 12. ప్రాచీన పురాణ, ఇతిహాసాల వెలుగుల్లో

సమస్యాపరిష్కారాలు 13. జాతీయవీరుల గుణవైభవ చిత్రణ 14. స్వేచ్ఛా ప్రణయభావనల ప్రదర్శన 15. పాశ్చాత్య విలువల వ్యతిరేక వైఖరులు.

ఈ లక్షణాల్ని పునాదిగా చేసుకొని పుంఖానుపుంఖాలుగా కథలు వెలువడ్డాయి. కాలక్షేప కథలకు, వ్యాపార విలువల కథలకు ఈ ప్రాంతం తక్కువ చోటును కేటాయించింది. వ్యక్తిగత కోణాల నుంచి కాక సామాజిక కోణం నుంచి వచ్చిన కథలకు తెలంగాణాలో ఎక్కువ చోటు దొరికింది.

సమాజంలో వచ్చిన అనేక మార్పుల వల్ల మధ్యతరగతి పెరిగింది. అక్షరాస్యత అన్ని వర్గాలవారికి అందింది. ఎవరికి వారు, తాము ఏ పరిస్థితిలో ఉన్నామో, తమకు కావల్సింది ఏమిటో అవగాహనకు వచ్చారు. దాంతో వర్గ స్పృహ స్థానంలో అకాంక్షలు పెరిగాయి. ఉనికికోసం, మెరుగైన జీవిక కోసం అస్తిత్వ పోరాటాలు ప్రారంభమయ్యాయి. అందులో దళితవాదం ప్రముఖంగా చెప్పుకో దగింది. భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న తెలంగాణలో దళితులు అణచివేయ బడ్డారు. భూపోరాటాలు ఫలించిన సమయంలో కూడా దళితుల పరిస్థితిలో మార్పు రాక పోవడంవల్ల ఇక్కడ దళితవాదం బలంగా వినిపించింది. అక్షరాస్యత తమ అనుభవాలను, పరిస్థితులను, జీవన స్థితిగతులను వర్ణిస్తూ కథలు రాశారు. తెలంగాణలో దళితులే కాదు. దళితేతరులు కూడా దళితవాద స్పృహతో కథలు రాశారు. ఈ దశలో కులం ప్రధాన ఎజెండాగా మారడం గమనించదగిన విషయం. ఎవరి అనుభూతుల్ని వారు కథీకరించుకోవడం వల్ల కథ శక్తివంతమవుతుందనే వాదం ఒకటి ఈ రోజుల్లో బలంగా వినబడింది. ఈ విషయమై అనేక వాదోపవాదాలు బయల్దేరాయి. మొత్తానికి దళిత చైతన్యం, ప్రజాస్వామిక స్పృహకు తెలంగాణా కథలో బలం చేకూర్చింది.

ప్రపంచీకరణ అనేది చాపక్రింద నీరులా సమాజం లోకి పాకిపోయింది. ప్రభుత్వాలు అంతర్జాతీయంగా వరల్డ్ బ్యాంక్, డబ్ల్యుటివోలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, వివిధ వేదికలపై చేసిన సంతకాలవల్ల దేశంలోని మారుమూల పల్లెటూళ్లు సైతం మార్పుకు గురి అయ్యాయి. ఈ మార్పులు సమాజంలో గణనీయమైన మార్పును కలిగించాయి. వేషభాషల్లోనూ, సంస్కృతీ సంప్రదాయాల్లోనూ, ఆచార వ్యవహారాల్లోనూ, ఆలోచనా విధానంలోనూ మనుషులు

తమ కార్యవిధానాలకు దూరం అయ్యారు. ప్రపంచం ఒక కుగ్రామంగా మారాలన్న ఆదర్శంవల్ల భిన్న సంస్కృతులకు సమాధి కట్టడం జరిగింది. సమాజంలో అంతరాలు పెరిగాయి. ఈ విషయాన్ని స్పృశిస్తూ అనేక కథలు వెలువడ్డాయి. పరాయి భాష, తమ జీవితాల్లో వేసుకున్న పెద్ద పీటను గమనించి, స్వభాషాభిమానాన్ని తెలుపుతూ కథలు వచ్చాయి. మనిషి సంకల్పాన్ని గ్లోబలైజేషన్ ప్రభావితం చేసింది. అంతిమంగా మనిషి పరాయీకరింపబడడం జరిగింది. ఈ క్రమాన్నంతా కథలు నిక్షిప్తం చేశాయి.

ఉద్యమాలు తెలంగాణా కథకు వెన్నెముకగా నిలిచాయి. అయినా కథ సిద్ధాంత ప్రచారం కోసం కాక ప్రజల జీవన వేదనలను రికార్డు చేయడం కోసం నడుం కట్టింది. ప్రజల నైతిక విలువలు, కట్టుబాట్లు, సామాజిక చిత్రణ, బతుకు కోసం ప్రజలు చేసిన ప్రయత్నాల పరంపర ఇవన్నీ కూడా కథల్లో మనకు కనిపిస్తాయి. కనుక తెలంగాణా కథను 'ప్రజాకథ'గా పేర్కొనవచ్చు. తెలంగాణా కథ కేవలం ఉద్యమ కథ కాదు, ప్రజా కథ అనీ ప్రజాసమూహాల కష్టఫలితమనీ నిరూపిత మయింది. మాండలిక భాషలో మౌఖిక సంప్రదాయాలతో తెలంగాణా కథ మరింత వన్నెదేలింది. ఒక ప్రత్యేతకను కూడా సాధించింది.

పురుషాధిక్య సమాజంలో స్త్రీలకు జరిగే అన్యాయాల్ని స్త్రీవాద దృక్పథంతో తెలంగాణా కథ కూడా చిత్రించింది. ముఖ్యంగా తెలంగాణా కథ నిమ్నకుల స్త్రీల కష్టాల్ని సమర్థంగా చెప్పింది. ముస్లిం స్త్రీలు, కరుడుగట్టిన మత సంప్రదాయాలవల్ల ఏ విధంగా కునారిల్లు తున్నారో చూపింది. కుల, మత, జెండర్ స్పృహలు అస్తిత్వ కాంక్షల రూపంలో వెల్లువగా వచ్చినట్లే. ప్రాంతీయ స్పృహ కూడా వచ్చింది. తరతరాల అణచివేత, చిన్నచూపు, నిర్లక్ష్యాల వల్ల తెలంగాణ ప్రాంతం వెనుకబడిందనే భావం ప్రత్యేక రాష్ట్ర కాంక్షగా బయల్దేరింది. తెలంగాణ బాగుపడాలంటే ప్రత్యేక రాష్ట్రసాధనే శరణ్యమనే నమ్మకాన్ని కథ అనేక రూపాల్లో వెలిబుచ్చింది. ఆ విధంగా తెలంగాణ కథ కాలంతో బాటు కదిలింది. బాధితుల పక్షాన నిలిచింది. సమస్తమైన మార్పులకు సాక్ష్యంగా మిగిలింది.

# స్త్రీల రచనలు - నియంత్రణలు

కె. వరలక్ష్మి

1902లో భండారు అచ్చమాంబ గారు వ్రాసిన 'ధనత్రయోదశి' కథతో తెలుగులో కథా రచన ప్రారంభమైంది.

మొదట్లో ఒక వర్గానికి చెందిన స్త్రీలు మాత్రమే వ్రాసిన తెలుగుకథ క్రమంగా వివిధ వర్గాలకూ విస్తరించింది. ఇంటి సమస్యలతో ప్రారంభమైన కథ ఊరికీ, సమాజానికీ విస్తరించింది. కాలానుగుణంగా తన రూపురేఖల్ని మార్చుకుంటూ, స్త్రీవాదం, మైనారిటీవాదం, దళితవాదంలో పయనిస్తోంది. ఇంకా ముందు ముందు ఎన్ని మార్పులకు లోను కాబోతోందో మరి ! కథనశిల్పం లాగే కథ కూడా నిశ్చలనిశ్చితం కాదనిపిస్తోంది.

సాహిత్యంలో ఏ మార్పునైనా పురుషుల కన్నా ముందుగా స్త్రీలే అందుకున్నారు. ప్రారంభంలో కథలు వ్రాసిన కనుపర్తి వరలక్ష్మమ్మ, వేదుల మినాక్షీదేవి, కొమ్మూరి పద్మావతి, దరిశి అన్నపూర్ణమ్మ, కాంచనవల్లి కనకాంబ మొదలైన వారు గృహ సమస్యల్ని పట్టించుకున్నంతగానే సామాజిక సమస్యల్నీ పట్టించుకుని కథలు వ్రాసారు. గృహ సమస్యల గురించి స్త్రీల పరిశీలనా శక్తి అమోఘం అన్పించేలా వ్రాసారు. కాని, పురుషులకు వచ్చినంతపేరు స్త్రీలకు రాలేదు. ఈ మధ్య కాలంలో లలిత వంటివారు పరిశోధించి బయల్పరిస్తే గాని మొదటి కథ వ్రాసినది స్త్రీయేనని నిరూపించబడలేదు.

కల్యాణ సుందరీజగన్నాథ్ వ్రాసిన 'అలరాస పుట్టిళ్లు' అద్భుతమైన కథా కథనానికి నాంది పలికింది.

ఇల్లిందల సరస్వతీదేవి, ఆచంట శారదాదేవి వంటి వారి తర్వాతి తరంలో సీరియస్‌గా కథల్ని వ్రాసినవారు రంగనాయకమ్మ, ఆర్. వసుంధరాదేవి, అబ్బూరి ఛాయాదేవి, పి. సత్యవతి వంటివారు కథా రచనలో మేటి అన్పించుకున్నారు.

పురుషులు పాటించిన పాశ్చాత్య నియమాన్ని పాటించకుండానే స్త్రీలు కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేసారు. కథా వస్తువులో, కథా శిల్పంలో మార్పు అనివార్యమైనదే కాదు, ఆహ్వానించదగినది అని నిరూపించారు.

రచయిత తనకు బాగా తెలిసిన విషయాన్ని గురించి వ్రాసేదే నిజమైన కథగా రూపుదిద్దుకుంది. అందులో రచయిత ప్రాంతీయత తప్పక తొంగిచూస్తుంది. ఇప్పుడిక భాషాపరమైన ప్రాంతీయత (మాండలికం) ఆహ్వానించబడింది. కాబట్టి పాత్రల ఉచ్చారణ బట్టిగాని, రచయిత పూర్తి మాండలికంలో వ్రాసినాగాని, కథాప్రాంతం అవగతమౌతోంది, ఇవన్నీ ఆహ్వానించదగినవే. కాని, రచయితలు ప్రాంతాలవారీగా, జిల్లాలవారీగా విడిపోవడం, ఎవరి ప్రాంతపు పల్లకీని వారు భుజాలకెత్తుకుని ఊరేగించడం – రాజకీయాల్లోలాగా సాహితీలోకంలో ఇదంతా అవసరమా? అన్పిస్తోంది, ఈ ప్రాంతీయతా నేపథ్యంలో విమర్శకుల రాగద్వేషాలు కొందర్ని ఆకాశానికెత్తడం, ప్రతిభ ఉన్నా కొందర్ని పట్టించుకోకపోవడం జరుగుతోంది. చదవకుండానే 'ఇతర ప్రాంతాలనుంచి మంచి కథలు రావడం లేదు' అని డిక్లేర్ చేసెయ్యడం జరుగుతోంది.

ఇక కొందరు విమర్శకులు అసలు స్త్రీల రచనల్నే పట్టించుకోరు. ఈ మధ్య ఒక విమర్శకుడు ఒక సభలో మాట్లాడుతూ నలభై ఏళ్ళుగా ఒక్క మంచి కథా కన్పించలేదన్నాడు, ఆయన ఎక్కడుండి, ఏం చదువుతున్నాడో మరి ! మరొకాయన మంచి ప్రేమ కథలు రావడం లేదు అన్నాడు, ఇదీ మన విమర్శకుల ధోరణి.

కోస్తా కథపైన వ్యాసం రాస్తూ కృష్ణా జిల్లానుంచో, గుంటూరు నుంచో మొదలుపెట్టి అటు నెల్లూరు దాటుకుని తడవరకూ వెళ్లిపోతారు. ఇటు విశాఖపట్నం నుంచి మొదలుపెట్టి అటు శ్రీకాకుళం వరకూ ఉత్తరాంధ్ర కథ గురించి వ్రాస్తారు. మధ్యలో గోదావరి జిల్లాలు ఎవరికీ పట్టవు. ఒకవేళ వ్రాయల్సివస్తే 'గోదావరి జిల్లాల వాళ్లకి జీవితం గురించి ఏమీ తెలీదు' అని చప్పరించేస్తారు. అంటే ఈ విమర్శక మహాశయులు ఏ సినిమా రచయితల్నో దృష్టిలో పెట్టుకుంటారు. వీళ్లూ ఇంతే, ఎవరేమనుకుంటే, మనకేం, నన్ను కాదు అని హాయిగా నిద్రిస్తుంటారు.

స్త్రీవాద కథల గురించి వ్రాయల్సివస్తే ఏ ఎన్.జీ.వో. సంస్థల ప్రభావంతోనో, ప్రోత్సాహంతోనో రాసే వాళ్లనే ప్రస్తావిస్తారు. వాళ్లూ కథ రాసి ఏళ్లూ పూళ్లూ గడిచిపోయినా వీళ్లా కథని వదలరు. మరోటి చదవరు. అప్పుడు కూడా 'వీళ్లు పల్లెల గురించి రాయరు, స్త్రీవాదం సిటీలకు అంకితమైపోయింది' అని విమర్శిస్తారు. గ్రామాల్లో ఉండి గ్రామీణ జీవితాల గురించి వ్రాసేవాళ్లు వాళ్ల దృష్టికెక్కరు.

ఇతర ప్రాంతాల్లో గ్రామీణ కథను తలదాస్తున్నట్టుగా గోదావరి జిల్లాల్లో లేదు. గ్రామీణ కథ అంటే కేవలం వ్యవసాయాధారిత కథేనా? గ్రామ జీవితాన్ని పట్టి కుదిపేస్తున్న సమస్యలు కథా వస్తువులు కావా?

గోదావరి జిల్లా అనగానే గోదావరీ పరీవాహక ప్రాతం, సారవంతమైన నేల గుర్తుకొస్తుంది. తూర్పు గోదావరి జిల్లాలో సగభాగం ఈ జగ్గంపేటవైపు అంతా మెట్ట ప్రాంతమని, వర్షాధారిత భూములని ఎందరికి తెలుసు? నేషనల్ హైవే పక్కనున్న మెట్ట సీమ స్త్రీల జీవితాలు ఎలా ఎండి మోళ్ళవుతున్నాయో ఎందరికి తెలుసు? ఆ జీవితాల లోతుల్లోకెళ్లి, వాళ్ళ మధ్య మసలుతూ రాసే కథల్లో మానవతావాదం తప్ప మరే వాదమూ కన్పించకపోవచ్చు. అందుకే విమర్శకులు దృష్టిని ఇటు మళ్లించరు. పురుషులే కాదు, స్త్రీ విమర్శకులూ అంతే. ఉదాహరణకు నా 'అతడు – నేను' పుస్తకానికి అన్ని పత్రికల్లో రివ్యూలు వచ్చేసాయి. స్త్రీలు ఎడిటర్లుగా ఉన్న రెండు పత్రికల నుంచి రెండేళ్లైనా ఇప్పటికీ రివ్యూలు రానీకుండా జాగ్రత్తపడుతున్నారు. గ్రామాల్లో నివసిస్తూ గ్రామ జీవితాల గురించి రాసే రచయితలు ఎన్.జీ.వో సంస్థలకి దూరంగా వాటి గురించి కొంత అవగాహన రాహిత్యంతో ఉండడం కారణం కావచ్చు. గిరిజన ప్రాంతంలో టీచర్‌గా పనిచేస్తూ గిరిజన జీవితాలపైన కొన్ని మంచి కథలు వ్రాసిన ఒక రచయిత్రి పత్రికల నుంచి ప్రోత్సాహం లేక ఆగిపోయింది. అసలు స్త్రీలంటేనే వివక్ష, అందునా గ్రామాల నుంచి రాస్తున్నవాళ్లంటే మరింత వివక్ష. 'మనం ఎక్కడి నుంచి రాస్తున్నా సెల్ఫ్ ప్రమోషన్ చేతనై ఉండాలి' అంది నా మిత్రురాలొకామె. వాళ్ల ప్రాంతం వాళ్లంతా కలిసి ఆమెనలాగే పైకి తీసుకొచ్చారట. సాహిత్యరంగంలో అంతకన్నా తలదించుకోవాల్సిన విషయం మరొకటుండదని నా అభిప్రాయం. సెల్ఫ్ ప్రమోషన్‌తో సెల్ఫ్‌సేటిస్‌ఫేక్షన్ ఎలా వస్తుంది? మన కథలు లోకాన్ని ఉద్ధరించనక్కర్లేదు, కనీసం మనల్ని నిజమైన మానవులుగా నిలిపితే చాలు.

ఇక, కుటుంబాల విషయానికొస్తే మన కుటుంబాల్లో హింసలు కొన్ని పైకి కనపడేవి, కొన్ని చాపకింది నీరులా పైకి కనబడనివి. అవి స్త్రీలను శారీరకంగా, మానసికంగా గొప్ప వొత్తిడికి గురిచేసి క్రమంగా వాళ్లని బలహీనుల్ని చేస్తున్నాయి. వాటిని కథా వస్తువులుగా తీసుకొని వ్రాస్తున్న రచయిత్రులూ ఆ ఒత్తిడినంతా అనుభవిస్తున్నారు. సాంఘికంగా గొప్ప మార్పు రావాలి. స్త్రీలకు ఎదుర్కొనే ధైర్యం,

పురుషులకి స్త్రీలను తమతో సమంగా చూసే సంస్కారం, మానవత్వం వస్తే గాని ఈ పరిస్థితి మారదు.

రాజకీయాధికారం, ఉద్యోగ అవకాశాలు, మహిళా సాధికారికత అంటూ సామాన్యజనానికి అర్థంకాని విషయాల్ని వేదికలపైన బల్ల గుద్దీ, ఛానల్స్‌లో గొంతు పెంచీ ఉపన్యసించే వాళ్లంతా స్త్రీల అభద్రత గురించి ఏం పట్టించుకుంటున్నట్టు? మనకి కన్పించే యాసిడ్‌దాడులు, కత్తుల్తో నరకడాలు వంటివి బైటి హింసలైతే; భార్య, కూతుళ్లు రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొని కూలిచేసి తెచ్చిన డబ్బుల్ని లాక్కుని తాగుడుకీ, జూదానికీ తగలేసి వాళ్లకి తిండి లేకుండా చేసే తండ్రులూ, అన్నదమ్ములూ సృష్టిస్తోన్న కుటుంబహింసనుంచి స్త్రీలనెలా రక్షిద్దాం? భర్తల, బంధువుల ధాష్టీకాల నుంచి స్త్రీలనెలా రక్షిద్దాం? – ఇదంతా రచయితలు మనసుపెట్టి ఆలోచించి రాసేసి చేతులు దులుపుకోవాల్సిన తరుణం కాదిది. మనదికాని జీవితాన్ని 'గురించి రాయాల్సిన తరుణం కాదిది.

ఇక, భాష విషయానికొస్తే వ్రాసే భాషలో తేడా లేకపోవచ్చు గాని మాట్లాడే భాషలో స్త్రీ పురుష తేడాలున్నాయి. పురుషులు అలవోకగా మాట్లాడే కొన్ని అసభ్య పదాల్ని స్త్రీలు ఉచ్ఛరించలేరు. స్త్రీవాద కవులు రాస్తున్న 'రతిరోత' 'వీర్యవర్షం' 'జననాంగం' లాంటి పదాలు ఉపయోగించి మాట్లాడలేరు. అందుకే భాషకు లింగ వివక్ష ఉంది. పురుషులు తమ భాషతో కూడా స్త్రీలను నియంత్రించగల్గుతున్నారు.

ఇన్ని పరిధులు, పరిమితుల మధ్య స్త్రీలు తమ సమతూకం కోల్పోకుండా రచనల్ని చెయ్యగలగడం కత్తివాదరమీద నడకలా ఉంటోంది.

ఏమైనా, నూరేళ్ల తెలుగు కథకు నూతనద్వారాలు తెరుచుకున్నాయి. అలాగని రచయితలు తాము రాసిన దానితోనే సంతృప్తి పడిపోవడం మానేసి, లబ్ధప్రతిష్ఠుల రచనల్ని చదువుతూ నిత్యవిద్యార్థులుగా ఉండడం అభిలషణీయం.

జీవితానికి అనుసంధిస్తూ వ్రాసే కథకు శైలి, సమన్వయం కుదిరినప్పుడు ఆ కథ దానంతట అదే పదికాలాలు నిలుస్తుంది. అప్పుడిక ఏ నియంత్రణలూ దాన్ని అడ్డుకోలేవు. పరుగెత్తే సింహాన్ని ఎవరూ తోకపట్టుకుని ఆపలేరు కదా !

# రెండుదశాబ్దాల స్త్రీల కథా సాహిత్య ప్రయాణం

వి.ప్రతిమ

ఆ మధ్య ఓల్గాగారోసభలో మాట్లాడుతూ క్రీ.పూ. ఆరో శతాబ్దంలోని బౌద్ధ సన్యాసినుల పాటలను గురించి ప్రస్తావించారు. అందులో సుమంగళీ మాత అన్న ఆమె పాడుకున్న పాట యిది. . .

**నేనెంత స్వేచ్ఛగా వున్నాను**
**వంటింటి చాకిరీనుంచి ఎంత అద్భుతమైన స్వేచ్ఛ**
**కఠోరమైన ఆకలి నుండి**
**ఖాళీ అన్నం కుండల నుండి**
**కర్కశమైన ఆ మగవాడి నుండి కూడా స్వేచ్ఛ . . .**

అంటూ సాగుతుందా పాట పాళీ భాషలో . .

క్రీ.పూ. ఆరో శతాబ్దం నాడు పాట అత్యంత ఆధునికంగా వున్నందుకు సంతోషపడాలో. . . యిరవై ఒకటో శతాబ్దంలో కూడా ఆ పరిస్థితి మారనందుకూ... యిదిగో యిప్పటికీ స్త్రీల అణచివేతల గురించీ, పీడనల గురించీ రోజు రోజుకు పెరిగి పోతున్న నేర ప్రవృత్తి గురించీ, సాహిత్యంలో ఈ సమాజపు ప్రతిఫలనాల గురించీ మాట్లాడుకోవలసి వచ్చినందుకు సిగ్గుపడాలో అర్థం కాని స్థితి. . .

సమాజంలోని మిగిలిన అసమానతల్ని కూడా రెండు వేరు వేరు శిబిరాలలోని వ్యక్తులవయితే స్త్రీల పట్ల వివక్ష, అణిచివేత . . . అంటే స్త్రీ పురుష అసమానతలు మాత్రం ఒకే కప్పు కింద వున్న కుటుంబ సభ్యుల నడుమవి... ఇక్కడ శత్రుస్పర్శ, ఘర్షణ మిగిలిన సంబంధాల్లోలాగా అంత త్వరగా బయటపడదు.

స్త్రీ, పురుష సంబంధాలలోని ఈ అసమానతల గురించి చలం తీవ్రమయిన ప్రతిపాదనలు చేశాడు. స్త్రీల ప్రవర్తనల మీద, లైంగికత్వంమీద, మాతృత్వం మీద అహర్నిశలూ సమాజం చేసే అదుపును చలం తన సాహిత్యంలో బట్టబయలు చేశాడు.

స్త్రీ చేతన ఒక వాదంగా పరిణమించకముందే సమాజంలో స్త్రీల అణచివేతని, పీడనని గుర్తించి రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, అబ్బూరి

ఛాయాదేవి వంటివారు స్త్రీలు చైతన్యం చెందాల్సిన అవసరాన్ని తమ సాహిత్యంలో నొక్కి చెప్పారు.

అయితే లింగ వివక్ష, జండర్ అనే భావన గురించిన పరిచయం దాని గురించిన విశ్లేషణ, కుటుంబం లోపల తెలియకుండానే జరిగే హింస, అణిచివేత, పితృస్వామ్యం, గురించిన అసలైన అవగాహన, మాతృత్వపు అదుపు మొదలయిన వాటనన్నింటినీ అర్థం చేసుకోవడం కోసం ఒక శాస్త్రీయమైన పునాది అవసరాన్ని మహిళా సంవత్సరం తర్వాత స్త్రీలు గట్టిగా గుర్తించారు.

స్త్రీ, పురుషులిరువురూ సమాజంలో భాగమయినపుడు ఈ అధీన, అధీకృత సంబంధాలెందుకు? . . . కుటుంబాలలోనూ, సామాజికంగానూ ఈ అధికార రాజకీయాలెందుకు? అన్న చిన్న ఆలోచనతో ప్రారంభమయి పితృస్వామ్య అధికారిక చట్రాన్నీ, పురుష సమాజ ప్రయోజనాల కనుగుణంగా ఏర్పరిచిన ఈ కుటుంబాలలోని బోలుతనాన్నీ లోతుగా చర్చకు పెట్టింది స్త్రీవాదం సాహిత్యం.

మొదటగా తనని మనిషిగా గుర్తించిన ఈ వ్యవస్థ ఒక అస్త్రంలా కవిత్వ రూపంలో దూసుకొచ్చినప్పటికీ. . . క్రమంగా తమకున్న సమస్యలను చర్చిందానికి ఒక విస్తృతమైన భూమికగా స్త్రీలు కథా సాహిత్యాన్ని ఎంచుకున్నారు.

ఈ కుటుంబాలలో తమకివ్వబడిన ఈ మూసపాత్రలు తమ వ్యక్తిగతమైన అభివృద్ధికి ఎంత అవరోధంగా వున్నాయో అర్థం చేసుకుని ఆ తెలివిడితో, ఆ ఎరుకతో కథా సాహిత్యంలో తమ సమస్యలను, పురుషుడి దృష్టికోణానికి అందని ఎన్నో సూక్ష్మ విషయాలను కూడా తమ కథల్లో లోతుగా చర్చకు పెట్టారు.

పితృస్వామ్య కుటుంబ సంబంధాలలో స్త్రీల శరీరాల మీద, వారి కదలికల మీద ఎంత అదుపు వుంటుందో స్త్రీలు తమకే తెలీని క్రమంలో ఎలా తమ శరీరాలలో తామే బందీలయిపోతున్నారో, స్త్రీల శరీరాలలోని ప్రతి అవయవం మీదా, అంటే జుట్టు, కళ్ళు, నోరు, గర్భసంచీ యీ అన్నింటి మీదా ఎంత పోలీసింగ్ జరుగుతూ వుంటుందో లోతుగా తడిమిన కథలు ఓల్గా 'రాజకీయ కథలు'.

'స్త్రీలు స్త్రీలుగా పుట్టరు. తయారు చేయబడతారు' అంటుంది సిమోన్-డిబోవక అంటే పుట్టినప్పటినుండీ ఈ కుటుంబం, సమాజం స్త్రీల శరీరాలనూ

నడవడికనూ ఎలా కట్టడి చేస్తూ వస్తాయో యివ్వాళ వున్న ఈ కుటుంబాలు, అందులోని నమూనా స్త్రీ పాత్రలు వాటి వెనుక అసలు స్వభావ మేమిటి? అసలు దాగివున్న కుట్ర ఏమిటి? అన్న అనేక విషయాలని, స్త్రీల జీవితాలలోని రాజకీయాలని అర్థం చేయిస్తాయి. ఈ 'రాజకీయ కథలు'.

ఒకవేళ కుటుంబంలోపల తల్లిదండ్రులుగా మనం కూతుళ్ళ మీద కొన్ని ఆంక్షలు సడలించినప్పటికి బయటి ప్రపంచంలో అమ్మాయి కట్టు, బొట్టు తీరును, ప్రవర్తనను నిర్దేశించే పనిని టీచర్లే చేస్తారు. ఈ విషయాన్ని ప్రతిబింబిస్తూ ఎస్. జయ 'మా అమ్మాయి' అన్న కథ వ్రాస్తారు. అమ్మాయి నడతను, నవ్వును, ఆహార్యాన్ని నిర్దేశించి చివరికి ఆ అమ్మాయిని ఒక మూసపాత్రలోకి ఒదిగించేస్తేనే తప్ప ఈ సమాజానికి మనశ్శాంతి దొరకదు- చాలాసార్లు అమ్మాయి స్నేహం మీద కూడ ఎంత నియంత్రణ వుంటుందో కుప్పిలి పద్మ 'తలుపులు' అన్న కథలో చెప్తారు.

అయితే యిలాటి అమ్మాయిలంతా మూసపాత్రల్లో ఒదిగిపోకుండా రెక్కలు తొడుక్కోవలసిన అవసరాన్ని గురించి తెలియచెప్తారు జయ 'రెక్కలున్న పిల్ల' అన్న కథలో. . . .

పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్ళి చేస్తానని
పంతులు గారన్నప్పుడే భయమేసింది. . .
ఆఫీసులో నామొగుడున్నాడు అవసరమొచ్చినా
సెలవివ్వడని అన్నయ్య అన్నపుడే అనుమానమేసింది

అంటుంది సావిత్రి.

పెళ్ళి అన్నది స్త్రీ పురుషుల నడమ స్నేహం, ప్రేమ, గౌరవం పరస్పరావగాహన వంటి సంబంధాల మీద కాక, పురుషుడి పెత్తనం, స్త్రీ అణిగి వుండడం అనే పునాదుల మీద నిలబడ్డం, పెళ్ళంటే స్త్రీలకి ఒక శిక్షగా, మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడిగా అంగీకృతమైపోయిన విధానమై, సమాజ నేపథ్యంలో స్త్రీ జీవితకాలం పురుషుడి అధికారంలోకి వెళ్ళిపోయింది పెళ్ళి పేరుతో.

ఆ చట్రంలో ఒదిగిపోయి అదే జీవిత పరమావధిగా భావించి ఎందరో స్త్రీలు బతుకీడుస్తుంటే ... మరి కొందరు ఆ చట్రంలో ఊపిరాడక బయటికి రాలేక

కొట్టుకులాడుతూ ఒక మహామౌనంలోకి, ఏకాంతవాసంలోకి కొండొకచో ఏడుపులోకి వెళ్ళిపోతారు. ఎవరయినా తమ సహజ శక్తులన్నీ హరించుకు పోతున్న విషయాన్ని గుర్తెరిగి బయటికి రావాలని ప్రయత్నం చేసినప్పటికీ వారిని ములుగర్రతో పొడిచి పొడిచి మళ్ళీ ఆ చట్రంలోకి నెడుతుంది ఈ సమాజం. . .

వైవాహిక జీవితంలోని స్త్రీ, పురుష సంబంధాలను విభిన్న కోణాలనుండి చర్చకు పెడుతూ పి. సత్యవతి అనేక కథలు వ్రాశారు.

ఇల్లలుకుతూ పేరు మరిచి పోయిన ఈగల కంటే యింటి చాకిరీలో మునిగిపోయి తమను తాము మరిచిపోయిన స్త్రీలు ఏమంత గొప్ప వాళ్ళు? నిరంతరం పరాయీకరించబడి బతికేస్తోన్న క్రమంలో ఉన్నట్టుండి ఒక అస్తిత్వవేదనలో తన పేరు తాను తెలుసుకోవడం కోసం విముక్తి మార్గంలో ప్రయాణించిన కథ "ఇల్లలకగానే. . . ." ఈ కథ స్త్రీవాద సాహిత్యానికి తలమానికం వంటిది. పి. సత్యవతి కథల్లోని వ్యంగ్యశిల్పం పాఠకుడ్ని అద్భుతంగా ఆకట్టుకుంటుంది.

ఈ చాకిరి చేసే క్రమంలో భర్తల యిష్టాయిష్టాల కనుగుణంగా తమ చైతన్యాన్ని, తనలోని సృజనాత్మకతనంతా మరుగునపరచుకుని, భర్త ఆశించిన స్థాయిలో వివాహచట్రంలోకి ఒదిగిపోయి, తన స్వేచ్ఛనీ అతడికంటే ఎక్కువయిన తన జ్ఞానాన్ని అతడు భరించలేడని తెలిసి తన కళ్ళకు గంతలు కట్టుకుంటుంది సరస్వతి. . . . భర్తకు లేని కంటిచూపు తనకూ వద్దని జీవితమంతా కళ్ళకు గంతలు కట్టుకుని తిరిగిన గాంధారి పాత్రను ప్రతీకగా తీసుకుని సత్యవతి 'గాంధారీరాగం' కథను నడిపించిన తీరు ప్రశంశనీయం. . . ఈ కథలో కూడా వ్యంగ్యమే ప్రాణం.

కుటుంబంలో స్త్రీలు చేస్తోన్న వెట్టిచాకిరీ అంతా ఎలా ఎందుకూ కొరగాకుండా పోతోందో. . . తండ్రులు మాత్రమే తెలివయిన వాళ్ళుగా, తమ అవసరాలూ, కష్టసుఖాలూ తీర్చగల వాళ్ళుగా పిల్లల చేత భ్రమింపజేస్తూ, నమ్మిస్తూ తల్లులు కేవలం వంటింట్లో మసిగుడ్డలుగా మాత్రమే మిగిలిపోయేటువంటి సమాజ వాస్తవాన్ని తెలుపుతూ కుప్పిలి పద్మ 'మసిగుడ్డ' అన్న కథ వ్రాస్తారు.

పెంపుడు కుక్కలయినా సరే ఒక్కొక్కసారి యజమాని అదపును భరించలేక తిరగబడతాయి. పుట్టినప్పట్నుండీ తమకి అలవాటు చేయబడిన ఈ సహన సంస్కృతి

మూలంగా కుటుంబంలోని లోలోపలి హింసని మరణించేదాక కూడా అలాగే భరించుకుంటూ పోతారు ఆడవాళ్ళు. అనివార్యమైన స్థితిలో కనీసం కుక్కకుండే తిరుగుబాటుతనమయినా, కుక్కకున్న చైతన్యమయినా స్త్రీలకు అవసరమన్న స్పృహని 'కుక్క బతుకు' అన్న కథలో మృణాళిని స్పష్టం చేస్తారు.

## II

స్త్రీల శ్రమనూ, లైంగికత్వాన్నీ, పునరుత్పత్తి శక్తినీ ఒక క్రమంలో నియంత్రిస్తూ వస్తోన్న వ్యవస్థ గురించీ, స్త్రీల వ్యక్తిగత జీవితాలలోని రాజకీయాల గురించీ 'రాజకీయ కథలు' లోతుగా చర్చకు పెట్టాయని ప్రారంభంలో మనం చెప్పుకున్నాం.

స్త్రీల శరీరావయవాల మీద ఆంక్షలకు, నియంత్రణకు గర్భసంచులు కూడా మినహాయింపేమీ కాదు.

తాము పిల్లల్ని కనాలా, వద్దా అన్న విషయం తమయిష్టం మేరకు కాకుండా భర్త నిర్ణయాధికారపు నీడలో సాగడం నిజంగా దురదృష్టకరం. . దాని మూలంగా స్త్రీలు పడుతున్న హింస ఓల్గా వ్రాసిన భిన్న సందర్భాలు అన్న కథ ద్వారానూ, పి. సత్యవతి వ్రాసిన 'గోవు' అన్న కథ ద్వారానూ గీతాంజలి వ్రాసిన 'బచ్చేదాని' అన్న కథ ద్వారానూ స్పష్టమవుతాయి.

'నిత్యం గర్భాలు మోస్తూ తన కోరిక తీరుస్తలేదని వేరే పెళ్ళి చేస్కునుడు, నాలుగు పెళ్ళిళ్ళు చేసుకునే వీలు చట్టంలో వుండడం మూలంగా మొగుడు ఎక్కడ తలాక్ అనేసో, అనకో రెండో పెళ్ళి చేసుకుంటాడన్న భయంతో అయిదుమంది పిల్లల్ని కని యింకొకరిని కడుపులో మోస్తూ పాడైపోయిన 'బచ్చేదాని'తో కాలం వెళ్ళదీస్తుంది సాదైకా. తాను బతికుండగానే యిద్దరాడపిల్లల్ని, ఒక మగ పిల్లవాడినీ వొదిలిపెట్టి భర్త యింకో పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. అది తెలిసి తలాక్ యివ్వడానికి సిద్ధపడడమే కాకుండా 'బచ్చేదాని' ని సాఫ్ చేయించుకుంటుంది. నసీం. ఈ యిద్దరు స్త్రీల ఆలోచనల్లోని వైరుధ్యాన్ని చర్చిస్తుందీ కథ.

ముస్లిం స్త్రీల జీవితాలలోని అనేక చీకటి కోణాలను బయటపెట్టి అద్భుతమైన కథలు వ్రాసిన గీతాంజలి 'బచ్చేదాని' 'పెహచాన్' అన్న రెండు కథా సంపుటాలు వెలువరించారు. స్త్రీలు జీవితాంతం పురుషులకి చేతికర్రల్లా ఎలా వినియోగ పడతారో 'గుడ్డివాడి చేతికర్ర' కథలో ఎప్పుడో చెప్పారామె.

ఇదంతా అలావుంటే స్త్రీల గర్భసంచుల మీద మరొకలాంటి నియంత్రణ కూడా వుంటుంది. దేనికయినా స్త్రీలు గోవుల్లా తలాడించాల్సిందే తప్పదు. . . గర్భసంచీని అద్దెకిస్తే రెండు లక్షలిస్తారని భార్య కాదంటున్నా ఒప్పించి గుజరాత్‌కి ప్రయాణం కట్టిస్తాడు నారాయణ. శీలాసుభద్రాదేవి వ్రాసిన 'గోవు మలాచ్చిమి' అన్న కథలో.

స్త్రీలకి పురుడంటే పునర్జన్మ కదా. ఏ గండం ఏలా వస్తుందో తన బిడ్డల పరిస్థితేమిటి? అని తపన పడుతుంది భార్య వెంకటలచ్చిమి. చివరికి తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచుకోవడం కోసమో, భర్త కోరికను మన్నించడం కోసమో తప్పనిసరిగా ఆ పనికి ఒప్పుకుంటుంది. ఈ కథలో కొసమెరుపేమిటంటే ఒకసారి గర్భాన్ని అద్దెకిచ్చి పురుడు పోసుకున్నాక డబ్బు రుచి మరిగిన నారాయణ మళ్ళీ మరొకసారి గర్భసంచీ అద్దెకివ్వమంటూ భార్య మీద ఒత్తిడి తీసుకురావడం, ఇటువంటి ఒక కొత్తకోణాన్ని స్త్రీవాద కథకు చేర్పు చేసినందుకు సుభద్రాదేవి అభినందనీయురాలు.

ఎంతోకాలంగా కవిత్వం వ్రాస్తూ వచ్చిన సుభద్రాదేవి 'దేవుడిబండ' 'రెక్కలు' అన్న రెండు కథా సంపుటులు వెలువరించడం సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది.

నిజానికి గర్భసంచీ తీసేయడం (అవయవలోపంగా తిరస్కరించడం) మీద వచ్చిన తొలికథ రాజకీయ కథే. భర్తకి ప్రమాదవశాత్తు కాలుపోవడాన్ని సహజంగా భరించే సమాజం, భార్యకి తప్పనిసరిగా గర్భసంచీ తీసేయవలసి వస్తే దాన్ని లోపంగా చూడ్డం చాలా అద్భుతంగా చెప్తుంది ఓల్గా.

## III

వెట్టిచాకిరి, గృహహింస, పరాయితనానికీ లోనయి కూడా స్త్రీలకు తమకంటూ ఖర్చుపెట్టుకోవడానికి, తమ అవసరాలను గురించి ఆలోచించడానికి అవకాశం లేకపోవడం. . అన్న విషయాలను చర్చిస్తూ. . . ఈనాటి పితృస్వామ్య కుటుంబాల ఆర్థిక నిర్మాణంపై ఒక నిశ్శబ్దపు తిరుగుబాటు పాటిబండ్ల రజని వ్రాసిన 'జేబు'.

ఇదే క్రమంలో స్త్రీల యింటిచాకిరీకి విలువకట్టే షరాబు లేదంటూ ఎస్. జయ 'ఖరీదు' అన్న కథ వ్రాస్తారు.

అలాగే పుట్టినప్పటి నుండీ వివక్షకు, దోపిడీకి, హింసకు గురవుతూ వచ్చిన తాయమ్మ సహనం. చివరికి ఎలా పోరాటమై పొంగి వెలుపలి మార్గం చూసు కుంటుందో తాయమ్మ కథ చెప్తుంది.

జీవితమంతా చాకిరి చేయించుకున్న భర్త, కుటుంబం చివరికి నీకు స్వంత సంపాదన లేకపోగా, తాను సంపాదించిందంతా ఖర్చు చేసేసిందంటూ నిందిస్తాడు భర్త. కొడుకుల మీద ఆధారపడివలసి వచ్చిన ఈ దీన స్థితికి పూర్తి బాధ్యత భార్యదేనంటూ నెపం ఆమె మీదికి పెడతాడు. పి. సత్యవతి వ్రాసిన 'ఒక వసుంధర' కథలో.

అరవయ్యేళ్ల వయసులో కూడా భర్త దాష్టీకాన్నీ, ఆధిపత్యాన్ని ఎదుర్కొవలసిన స్థితిలో వసుంధర ఒక బలమైన నిర్ణయం తీసుకుని యింట్లో ఎవరికీ చెప్పకుండా సంపాదన నిమిత్తం అమెరికాలో ఒకరింటికి 'హౌజ్ మెయిడ్'గా వెళ్ళిపోతుంది.

మారుతున్న కాలాన్నీ, కోల్పోతున్న విలువల్ని తెలిసిన జీవితానుభవంతో ఆస్తుల పెంపకంలో ఇష్టాచారపు హక్కుకోసం గట్టిగా పోరాడిన తల్లిరత్నమ్మ.... నల్లూరి రుక్మిణి స్త్రీల ఆర్థికావసరాల గురించి చాలా లోతుగా చర్చకు పెట్టిన కథ "కడపటి కాపలా కథ."

కుటుంబ భారాన్ని నెత్తిన మోస్తూ ఆర్థికావసరాలకోసం అనివార్యంగా గల్ఫ్‌దేశాలకు వెళ్ళుతున్న స్త్రీల సంఖ్య తక్కువేమీకాదు. మరీ ఈ సామ్రాజ్యవాద సంస్కృతి వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత వృత్తుల్నీ దెబ్బకొట్టిన తర్వాత, కులవృత్తులన్నీ కూడ మూలబడి పోయాక స్త్రీలు గల్ఫ్‌దేశాలకు వెళ్ళడమనేది మరింత ఎక్కువయింది. అదీ కడప, రాజంపేట, తిరుపతి ప్రాంతాలనుండి ఈ వలస మరింత ఎక్కువగా వున్న నేపథ్యంలోంచి వారి జీవితపు లోతుల్ని తరుముతూ విష్ణుప్రియ 'కువైట్ రైలు' అన్న కథ వ్రాస్తారు.

గృహిణులుగా భర్త సంపాదన మీద ఆధారపడి జీవిస్తోన్న స్త్రీల పరిస్థితి మాత్రమే యిలావుందా? ఉద్యోగాలు చేసుకుంటూ తమకాళ్ళమీద తాము నిలబడి ఆర్థిక స్వేచ్ఛను సంపాదించగలిగిన స్త్రీల సాంసారిక జీవనాలు యిందుకు భిన్నంగా ఏమయినా వున్నాయా? అనుకుంటే ఉద్యోగాలు చేస్తోన్నంత మాత్రాన యింటిపని నుంచి ఆమెకు విముక్తి లేదు. ఇంట్లోనూ, బయటా కూడా రెండు రకాల ఒత్తిళ్ళ మధ్య నలిగిపోయేదిగా మాత్రమే అవుతోంది ఉద్యోగిని స్థితి.

ఇలా రెండు రకాల బాధ్యతలనూ నిరంతరాయంగా నిర్వహిస్తూ తమ పిల్లలను అందరిలోనూ నెంబర్ వన్లుగా తీర్చిదిద్దాలనే ఆశయంతో, ఆతృతలో పడి గొప్ప తల్లులమన్పించుకోవాలనే కోరికతో తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తూ ఎప్పటికప్పుడు ఎటువంటి వైద్యసలహాలూ లేకుండా మందుబిళ్ళలు మింగుతూ వచ్చిన అనూరాధ ఈనాటి తల్లులకి ప్రతీక. అంటే స్త్రీలు యింటి చాకిరీలోపడి పరాయీకరింపబడడమే కాకుండా కుటుంబాలకోసం చివరికి శరీరాలను కూడా సమర్పిస్తోన్న వైనం. ఆక్రమంలో స్త్రీల సహజశక్తులన్నింటికీ ఎలా పాచిపట్టి పోతుందో చాలా తీవ్రంగా, గట్టిగా హెచ్చరించిన కథ పి. సత్యవతి వ్రాసిన 'సూపర్ మామ్ సిండ్రోమ్' కథ.

అలాగే భార్యలు ఉద్యోగాలు చేస్తోన్న క్రమంలో ఒక కొత్త ప్రపంచం ఏర్పడితే... ఎక్కడ తమస్థానం తగ్గిపోతుందో అని కించబడి పెళ్ళి తర్వాత స్త్రీలను ఉద్యోగం మాన్పించడమనే షరతు విధించే ఒక దశ కూడా మనకి వున్నది. ఆ విషయాన్ని చెపూ్త కుప్పిలి పద్మ 'మంచుదీపం' అన్న కథ రాశాడు.

మారుతున్న సామాజిక, ఆర్థిక అవసరాల మూలంగా భార్యలను ఉద్యోగాలు చేయనిచ్చినప్పటికీ. ఆర్థిక స్వావలంబన వారికి జీవితంలో ఉద్యోగాల్లోనయినా స్వీయ నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని ఈ సమాజం యివ్వలేదు. అంటే కుటుంబంలోనే కాకుండా భర్తల అధికారం కొండొకచో ఉద్యోగాలు చేసే చోట్లకు, వాళ్ళ విధి నిర్వహణ మీదికి, నిర్ణయాల మీదికి కూడా ఎలా విస్తరిస్తుందో ఓల్గా 'వెలుతురులోకి' అన్న కథలో తననుతాను అసహ్యించుకుంటూ ఆ ఉద్యోగిని ఎంత సంఘర్షణకు గురవుతుందో తెలుపుతుంది. అంటే సంపాదించే క్రమంలో కూడా భర్తల అధికారం స్త్రీల మీద అత్యంత మామూలుగానే చెలాయించబడుతుంది-

## IV

ఇవ్వాళ పిల్లలు కడుపులో వున్నపుడే అమెరికాకి వీసాలకోసం అప్లై చేసిపెడుతున్నారు తల్లిదండ్రులు. అమెరికా పంపడమే ధ్యేయంగా చదువులు కొనసాగుతున్నాయి. ఆస్తులన్నింటినీ అమ్మి, తలకి మించిన అప్పులు చేసి పిల్లల్ని కార్పొరేట్ చదువులు చెప్పించి వాళ్ళని ముల్లు గర్రతో పొడుస్తోన్న తల్లిదండ్రులూ

ఈ చదువుల ఒత్తిడిని భరించలేక విపరీతమైన శ్రమతో అనివార్యంగా ఆత్మహత్యల వైపుకి నెట్టబడుతున్న విద్యార్థులూ, ఈ కార్పొరేట్ అయిపోయిన విద్య అటు తల్లిదండ్రుల్నీ యిటు విద్యార్థుల్నీ ఏ గమ్యం వైపు నడిపిస్తోంది?

ఈ విషయాలన్నింటినీ కూడా స్త్రీ రచయితలు లోతుగా చర్చకు పెట్టారు. గట్లూరి రుక్మిణి వ్రాసిన 'పందేలాట', కె. సుభాషిణి వ్రాసిన 'పాఠం తప్పిపోయింది' వంటి కథలు సభ్య సమాజాన్ని నిలువెత్తు ప్రశ్నలై నిలదీశాయి. 'చీకట్లోంచి చీకట్లోకి', 'రేసుకుక్కలు' వంటి కథలు కూడా ఈ కోవలోవే.

రిజర్వేషన్లతో సీట్లు తెచ్చుకునే సన్నకారు వాళ్ళకంటే యిక్కడ ర్యాంకులు రాక యితర రాష్ట్రాలలో లకారాలతో సీట్లు కొనుక్కుని చదివేవాళ్ళు ఏమంత గొప్పవాళ్ళని? వాళ్ళదేమాత్రపు ప్రతిభ?. ర్యాంకులు, సీట్లు, మార్పులు సర్టిఫికెట్లు అంతా ఒక అంగడిలా తయారయిపోయింది. ఈ మార్కెట్ మన జీవితాల్లోని మిగిలిన అన్ని అంశాలనూ ఎలా శాసిస్తుందో అలాగే విద్య మీద కూడా పెత్తనం చేస్తోంది.

అంగళ్ళలో డబ్బులు పెట్టి వస్తువులు కొనుక్కున్నట్లుగా చదువు కూడా కొనుక్కోవడమే తప్ప మనసుని వికసింపచేసి, జ్ఞానాన్ని నేర్పే చదువులెక్కడున్నాయన్న ప్రశ్నని మనముందుకు తెస్తుంది. 'అంగడి' శీలా సుభద్రాదేవి కథ.

పిల్లల్ని చిన్నప్పటినుండీ రుద్దిరుద్దీ అమెరికాకి వెళ్ళేదాక మనశ్శాంతి చెందని తల్లిదండ్రులు. ఈ నేపథ్యంలో నుండి పి. సత్యవతి 'ఒక రాజు ఒక రాణి' 'పునాది' వంటి కథలు రాస్తారు.

స్త్రీని విలాసవస్తువుగా, సొంత ఆస్తిగా చూసేటువంటి భూస్వామ్య సంస్కృతి నుండి స్త్రీని సరుకుగా మార్చేసిన సామ్రాజ్యవాదపు సంస్కృతి విషపు నీడలో మనమివ్వాళ వున్నాం. గతంలో అయితే అమ్మాయి పుట్టిందంటే కట్నకానుకలెలారా భగవంతుడా అని మాత్రమే బాధపడేవారు, ఆలోచించేవారు. ఇప్పుడయితే ఈ దుర్మార్గమైన ప్రపంచం నుండి మన ఆడపిల్లల్ని ఎలా కాపాడుకోవాలా అన్నది మనముందున్న ప్రశ్న. . .

బడికి పంపాలన్నా కూడ భయమే. విద్యార్థినుల్ని మాస్టర్లు. ఉపాధ్యాయినుల్ని విద్యార్థులు అత్యాచారాలు చేసి చంపేయడం చాలా మామూలు విషయమయి పోయింది. ప్రేమించననంటే క్లాసురూములోనో, రోడ్డుమీదో, లేక యింటికో వచ్చి యాసిడ్ పోసిపోతారు.

మొన్నామధ్యనే సందీప్ అనే అబ్బాయి యింటికే వచ్చి ఆమె తల్లిదండ్రులు ఎదుటే ఆ పిల్ల గొంతు కోసి పోయాడు. ప్రేమించడం, ప్రేమించకపోవడమన్నది యివ్వాళ ఒక బలవంతమైపోయింది.

మన చర్మాలు ఎంత దళసరిగా అయిపోయాయంటే కొన్నేళ్ళ ముందే విజయవాడలో శ్రీలక్ష్మిని మనోహర్ హత్య చేసినపుడు మొత్తం సమాజమంతా ఉలిక్కిపడింది. ఆందోళనలు చేశారు. ఊరేగింపులు తీశారు. మనోహర్‌కి శిక్షపడేదాకా మహిళా సంఘాలన్నీ ఉద్యమించాయి.

ఇవ్వాళ యిదంతా ఎంత మామూలయిపోయిందంటే మిడియా మూలంగా యిదో అంటువ్యాధయి ప్రబలుతోంది. ఒక సుజాత, ఒక ప్రసన్నలక్ష్మి, ఒక ఆయేషా, ఒక గంగాభవాని, ఒక రోజీ యిలా ఎందరో చెల్లెళ్ళు ఈ ఘాతుక ప్రేమలకు బలయిపోయారు అయినా మనకి చీమకుట్టినట్టు కూడా వుండడం లేదు.

ఆ మధ్య వారణాసి నాగలక్ష్మి వ్రాసిన 'ఆసరా' అన్న కథ చదివినపుడు పాఠకులు ముఖ్యంగా స్త్రీలు భయంతో వణికిపోయారు. రోజురోజుకు పెరిగిపోతున్న ఈ ఘోర నేర సమాజం నుండి మన ఆడపిల్లల్ని ఎలా కాపాడుకోవాలా? అని. శీలా సుభద్రాదేవిగారి 'కంచె' అన్న కథ కూడా ఆకోవలోదే. ఈ కథ చదువుతున్నప్పుడు కూడా అదే దిగులు అదే భయం. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో అదీ ఒంటరి తల్లులున్న పరిస్థితుల్లో ఈ దిగులు రెట్టింపవుతుంది....

చాలా సార్లు ఆడవాళ్ళు నోటిని ఆయుధంగా చేసుకోవడానికి కూడా అనేక కోణాలుంటాయేమొ అన్పిస్తుంది. ఈ 'కంచె' కథ చదువుతున్నపుడు. ఈ కథలో నాగమణి వాళ్లమ్మ. . ఒక అయ్య చేతిలో పెట్టేదాకా తన కూతుర్ని ఎలా కాపాడుకుంటూ రావాలా, ఏ కంచెని నిర్మించి కాలనీలోని కుర్రరౌడీల చూపులు పడకుండా ఆపాలా అని తపించి పోతుంది. ఈ క్రమంలో ఆ పిల్ల తెలివితేటలూ, ప్రజ్ఞాపాటవాలూ కూడా ఆమెని భయపడుతూనే వుంటాయి. దిగులుచెందేలా చేస్తాయి.

ఇదలా వుంటే కొండొకచో పేపర్లు లీకయి నిజాయితీగా పరీక్షలు వ్రాసే విద్యార్థులు పట్ల శాపమై. పరీక్షలన్నీ క్యాన్సిలయి యిటు విద్యార్థులనీ, అటు తల్లిదండ్రులనీ కూడా ఒత్తిడిలోకి నెట్టే పరిస్థితిని దాసరి శిరీష 'అల' అన్న కథలో వివరంగా చెప్పారు.

ఇలా విద్యావిధానం, మారుతున్న విద్యాలయాలలోని విలువల మీద విభిన్న కోణాల నుండి స్త్రీలు కథా సాహిత్యాన్ని వెలువరించారు.

V

కేవలం ఈ వివాహ జీవితాల్లోని స్త్రీ, పురుష సంబంధాలను వాటిలోని బోలుతనాన్ని ప్రశ్నించడం, చర్చకు పెట్టడం. ఈ క్రమంలో ఎల్లకాలం యిలా యింటి పనులలోనే మునిగి వున్నట్టయితే స్వేచ్ఛను సాధించడం కష్టం అన్న విషయాన్ని గుర్తెరిగి తాము కూడా సమాజంలో భాగమని నమ్మి సమాజ సంబంధిత అనేకానేక పరిణామాలను కూడా వస్తువులుగా తీసుకుని కథా సాహిత్యాన్ని పండించడం ప్రారంభించారు. స్త్రీ రచయితలు.

సామ్రాజ్యవాద విధానాలు మన జీవితాలను ఎటువంటి ప్రకంపనలకు గురి చేస్తున్నాయో. అవి మన కుటుంబ, దాంపత్య జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో మొదట్లోనే కుప్పిలిపద్మ 'ప్రకంపనం' 'కుబుసం' 'ఇన్‌స్టంట్ లైఫ్' వంటి లోతైన కథలు వ్రాశారు. ఇవి నగరప్రాంతంలోని జీవితాలని ప్రపంచీకరణ ప్రభావితం చేసిన వైనాలయితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రపంచీకరణ ప్రవేశించి ఎలా జీవితాలని విధ్వంసం చేసిందో, పెంకుల ఫ్యాక్టరీల ప్రవేశంతో జీవితాలు ఎలా ఎగుడుదిగుళ్ళని ఎదుర్కొవలసి వచ్చిందో చాలా సహజంగా, జీవితాల్లో రక్త మాంసాలున్న పాత్రల్ని ప్రవేశపెట్టి చక్కగా తెలియజెప్తారు. కె. వరలక్ష్మి 'మట్టి – బంగారం – అన్న కథలో. వరలక్ష్మి గ్రామీణ జీవిత విధ్వంసాన్నీ, అట్టడుగు వర్గాల స్త్రీల జీవితాల్ని చక్కటి కథలుగా మలచి పాఠకుల కందించిన రచయిత్రి. ఆమె వ్రాసిన అతడు – నేను సున్నిత ధోరణిలో స్త్రీ చైతన్య పార్శ్వాన్ని అందించిన కథ. వస్తువు మాత్రమే కాకుండా వరలక్ష్మి కథల్లోని శిల్పం కూడా ఎన్నదగినది.

స్త్రీ విముక్తికి వర్గరహిత సమాజదిశగా జరగాల్సిన ప్రయత్నాలే సుగమ మార్గమని నొక్కి చెప్పిన రంగనాయకమ్మ ఆ దిశగా 'జానకి విముక్తి' వంటి నవలా సాహిత్యాన్ని అందించడమే కాక అనేక సిద్ధాంత గ్రంథాలని కూడా వెలువరించారు. గతంలో ఆమె వ్రాసిన 'డబ్బు' అన్న కథలో కట్నం తీసుకునే పురుషులనే కాకుండా, కట్నమిచ్చి భార్యలు కావడానికి సిద్ధపడుతున్న స్త్రీల దీనస్థితిని ధర్మాగ్రహంతో విమర్శకు పెడతారు రంగనాయకమ్మ. డబ్బు వ్యామోహం అన్నది తమకు కావల్సిన వాళ్ళనుండి

మనుషుల్నెంత కర్కశంగా విడదీస్తుందో తెలియకుండా మనుషులు మిగిలిపోతున్న విషాదాన్ని మేజిక్ రియలిజమ్ ధోరణిలో వ్యంగ్యశిల్పంతో చెప్తారీ కథని.

అలాగే మారుతున్న సామాజిక పరిణామాల ప్రభావం భార్యభర్తల నడుమ ఎటువంటి ఇనుప గోడలను దించుతుందో చాలా లోతుగా చర్చకు పెడుతూ రంగనాయకమ్మ 'మురళీవాళ్ళమ్మ' అన్న కథని వ్రాస్తారు.

ఇందులో ప్రధానపాత్ర అమ్మే. రుక్మిణి తాను ఏ అన్యాయాన్నయితే ఎదిరించి కొడుకుని తీసుకుని బయటికి వచ్చేసిందో అదే దుర్మార్గం తన కొడుకు చేయడాన్ని ఆమె ఎంత మాత్రమూ సహించదు. కార్పొరేట్‌కంపెనీలలో ఉద్యోగాలు స్త్రీ, పురుష సంబంధాలని ఎంత పలచన చేస్తున్నాయో ఆ క్రమంలో భార్యభర్తల మధ్య తెలీకుండానే ఏర్పడుతున్న ఖాళీలని కోడలికి అర్థం చేయిస్తుంది రుక్మిణి. భర్త తప్పుని సహించలేని దాన్ని కొడుకు చేస్తుంటే మాత్రం ఎలా సహిస్తానంటూ నిలదీస్తుంది మురళిని. కోడలికి సరయిన నిర్ణయం తీసుకోవల్సిన అవసరాల్ని సూచిస్తుంది. నిక్కచ్చిగా నిలబడి గైడ్ చేస్తుంది.

కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాల మూలంగా కుటుంబ సభ్యులనడుమ ఎంత దూరం ఏర్పడి పోతుందో. పెద్దవాళ్ళకి అనారోగ్యమై అస్పత్రులలో చేరినా, చివరికి భార్య, పిల్లలకి అత్యంత అవసరమయినప్పుడు కూడా పక్కనుండలేని స్థితిలోకి మనుషులు ఎందుకు నెట్టబడ్డారు. డబ్బు వెంట, ఆడంబరాల వ్యామోహం వెంట ఈ పరుగులు ఏ ప్రస్థానానికి? మనం చివరికి ఎక్కడికి చేరుకుంటున్నాం. మనల్ని మనం లోతుగా ప్రశ్నించుకోవల్సిన అవసరాన్ని నొక్కి చెప్తుంది. కె. సుభాషిణి వ్రాసిన "ఒకటి × రెండు = నాలుగు". గతంలో కాల్‌సెంటర్లలో పనిచేసే అమ్మాయిల మీద అన్ని కోణాలలోని ఒత్తిడినీ చర్చకుపెట్టిన సుభాషిణి విద్యారంగం మీద కూడ మంచి కథలు వ్రాసింది. ఈ యువరచయిత్రి కలం నుండి మరిన్ని మంచి కథలను పాఠకులు ఎదురు చూడొచ్చు.

కొత్తగా మన జీవితాల్లోకి ప్రవేశించిన టెక్నాలజీ ప్రపంచాన్ని కుగ్రామం చేసి మనుషుల మధ్య దూరాలను పెంచుతున్న తీరును చంద్రలత 'కోలీగ్స్' అన్న కథలో చాలా సున్నితంగా హృదయాలను హత్తుకునేలా చెప్తారు. భార్యభర్తలిద్దరు ఒకే చదువు చదివి ఒకే వృత్తిలో వున్నప్పటికీ నిర్ణయాధికారం పురుషుడికి మాత్రమే వుండడాన్ని గురించి ప్రశ్నిస్తుంది కథ.

ఇదంతా అలా వుంటే ప్రపంచీకరణ ప్రభావంలో పడి కొట్టుకు పోవడానికి యువతని ముఖ్యంగా ఆడపిల్లల్ని నిర్మాణం చేస్తోన్న ఈ వ్యవస్థని నిలదీస్తూ తమని తాము ఎలా కాపాడుకోవాలో యువతని హెచ్చరిస్తుంది. 'తిమింగల స్వర్గం' అనే పి. సత్యవతి వ్రాసిన కథ.

చాలా తక్కువ సమయంలో అస్త్రంలా దూసుకొచ్చి స్త్రీల జీవితాల మీద పురుషుడి అనేక రకాల ఆధిపత్యాలనీ, పెత్తనాలనీ విభిన్న కోణాల్లో నుండి ప్రశ్నించిన కె.యన్. మల్లీశ్వరీ తెలుగు కథా సాహిత్యానికి గొప్ప ఆశ. . . ఇటీవల ఆమె వ్రాస్తోన్న సమాజ సంబంధికథలు పలువురు విమర్శకుల దృష్టి నాకర్షించడం విశేషం. అదే కోవలో చాలాకాలంగా కవిత్వం వ్రాస్తూ యిప్పుడు కథా సాహిత్యాన్ని పండిస్తోన్న అనిశెట్టి రజిత కూడ అట్టడుగు వర్గాల స్త్రీల జీవితాలని కథా సాహిత్యాన్ని పరిచయం చేస్తోన్న ఆశావహ రచయిత్రి.

ముందే చెప్పుకున్నట్లు స్త్రీవాద కథ బలపడక ముందు నుంచీ కూడా స్త్రీ చైతన్య కథలు వ్రాస్తూ వచ్చిన అబ్బూరి ఛాయాదేవి 'తనమార్గం' వంటి అనేక స్త్రీ జీవిత కథలనే కాకుండా కార్పొరేటీకరణ చెందిపోతున్న వైద్యాన్ని గురించి 'ఆఖరికి అయిదు నక్షత్రాలు' అన్న కథ వ్రాశారు. సామ్రాజ్యవాద సంస్కృతి మన వైద్యం మీద కూడా చూపించిన ప్రభావాన్ని ఆమె చాలా లోతుగా ఈ కథలో చర్చకు పెడతారు. గతంలో కుటుంబవైద్యులు మనం అనారోగ్యంతో వెళ్ళినపుడు చాలా స్నేహ పూర్వకంగా పలకరించి క్షేమ సమాచారాలను కనుక్కునేవారు. మన ఆరోగ్యస్థితి వాళ్ళకు పూర్తిగా తెలిసివుండేది. ఇప్పటి పరిస్థితి అది కాదు. ఒక్కొ అవయవానికొక్కొ డాక్టరు. ఎవరికీ ఎవరితోనూ స్నేహంగా మాట్లాడే సమయంలేదు. చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా మొత్తం పరీక్షలన్నీ చేయించే డబ్బుసంస్కృతి మాత్రమే యివ్వాళ ఆసుపత్రులలో పెత్తనం చేస్తోంది.

ఛాయాదేవి 'తనమార్గం' కథా సంపుటికి వచ్చిన కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం స్త్రీవాద కథకి అందిన పురస్కారంగా స్త్రీవాదులంతా భావించారు.

## VI

వెనుకబడిన కులాలను, వర్గాలను అభివృద్ధిలోకి తెస్తామంటూ చిరకాలం నుండీ కల్పించబడిన భ్రమలు కేవలం భ్రమలుగానే తేలిపోయాయిచివరికి.

చుండూరు, కారంచేడు, పదిరికుప్పం సంఘటనలు తరతరాలుగా దళితుల్లో పేరుకుపోయిన అసంతృప్తిని ఆగ్రహజ్వాలలుగా మార్చి ఒక కొత్త చైతన్యాన్ని పెంపొందించాయి. ఈ సామాజిక వివక్షకు అసలైన మూలం ఎక్కడుందో తెలుసుకోవాలన్న వెదుకులాట దళితుల్లో ఎక్కువయింది.

బానిసల్లా ఒదిగొదిగి వుండకుండా స్వేచ్ఛగా జీవించాలన్న ఆలోచన, అందుకు ఒకదారిగా ఆర్థిక, రాజకీయరంగాలలో బలపడాలనుకోవడం ప్రారంభమై ఆక్రమంలో వారి తెలివిడి, ఒక ఎరుక ఉద్యమ రూపాన్ని తీసుకోవడంలో వెనుకంజ వేయలేదు.

ఈ చైతన్యంలో దళిత జీవిత నేపథ్యంలోని సామాజికార్థిక కోణాలలో దళిత కవులూ, రచయితలూ తమ జీవితాలలోని కథలూ, గాథలూ తామే ఆకర్షించుకోవడం మొదలుపెట్టారు.

అయితే స్త్రీల విషయానికొచ్చేటప్పటికి వారి మీద పురుషుడి ఆధిక్యత, కులమూ కూడా ఆమెని అణచివేతకి గురి చేస్తాయి. . .

పితృస్వామ్యంలోని లైంగిక రాజకీయాలు దళిత స్త్రీలను ఎంతగా అణిచివేస్తున్నాయో, కులవర్గ రాజకీయాలు కూడా అంతే ప్రభావితం చేస్తున్నాయని హిందూ ఆధిపత్య కులాల పురుషులు దళితులను రాజకీయంగా అణిచి వేసేందుకు దళిత స్త్రీలపై లైంగిక అత్యాచారాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించే విధానాన్ని గోగు శ్యామల నిరసిస్తారు. వారు స్త్రీలైనందుకు కాదు కేవలం దళిత స్త్రీలయి నందువల్ల మాత్రమే వారి మీద ఈ అత్యాచారకాండ అంటారామె.

దళిత స్త్రీలలో యిప్పుడిప్పుడే తిరుగుబాటు ధోరణి పదునెక్కుతోంది.

ఇటీవల సెజ్‌లకు వ్యతిరేకంగా ప్రభుత్వంతో పోరాటం చేస్తోన్న దళిత మహిళలతో మాట్లాడినపుడు వారి ఆత్మవిశ్వాసం, ధైర్యం, పోరాటపటిమ, మాట్లాడుతున్న తీరు చూసి సంభ్రమాశ్చర్యాలు కలిగాయి. ఇది చాలా అవసరమైన పరిణామమని కూడా అన్పించింది.

సాహితీ రంగంలోని దళిత స్త్రీల సృజనాత్మకత మీద 'నల్లపొద్దు' అన్న సంకలనాన్ని గోగుశ్యామల సంకలీకరించారు. 'ఏనుగంత తండ్రికన్నా ఏకుల బుట్టంత తల్లినయం' అంటారామె.

దళిత జీవన విధానాలనీ, బాధలనీ, గాథలనీ చిత్రిస్తూ వచ్చిన జాజులగౌరి 'మన్నుబువ్వ' కథా సంపుటి ఈ దశాబ్దంలోనే వెలుగు చూసింది.

దళిత స్త్రీల మీద కులం, వర్గం, పురుషాధిపత్యాలతో పాటు ప్రాంతీయత కూడా పనిచేస్తుందని అంటుంది జె. సుభద్ర. సింగరేణి బాయి పనికి స్త్రీలను అడ్డుకోవడాన్ని గురించి ఆమె నిరసిస్తుంది. అక్కడ మైసమ్మ వుంటుంది కాబట్టి స్త్రీలకి ముట్టు వుండడం మూలంగా పనికివెళ్ళకూడదట ! పనిలో స్త్రీల భాగస్వామ్యానికి ప్రాధాన్యత, గుర్తింపు లేకపోవడాన్ని ప్రశ్నిస్తుంది సుభద్ర. ప్రస్తుతం 'భూమిక'లో 'మాక్క ముక్కపుల్లగీడేపోయింది' అన్న సామాజిక కాలమ్ వ్రాస్తోన్న సుభద్ర 'శుద్దిచెయ్యాలె' వంటి కథా సాహిత్యాన్ని కూడా వెలువరించారు.

'ఒంటి నిట్రాడి గుడిసె' వంటి గొప్ప కవిత్వాన్ని అందించిన వినోదిని సభ్య సమాజం మీదికి సంధించిన అస్త్రం 'బ్లాక్' కథ.

పుట్ల హేమలత అటు కవిత్వం వ్రాస్తూనే యిటు కథా సాహిత్యాన్ని కూడా పండిస్తున్నారు. . . జి. విజయలక్ష్మి కూడా కవిత్వంతో పాటు కథల్నీ వ్రాస్తున్నారు.

పాత బస్తీలో డాక్టరుగా పనిచేస్తూ ముస్లిం స్త్రీలకు వైద్యం చేయడమే గాక మనిషిగా మానవీయ స్పర్శతో వారి దుఃఖాన్ని తన దుఃఖంగా మార్చుకుని 'పెహచాన్' కథలు వ్రాసిన గీతాంజలి పేర్కొనదగిన కథా రచయిత్రి. ఆ కులానికి చెందక పోయినప్పటికీ ముస్లిం స్త్రీల జీవితాలలోని దుఃఖాలని కథలుగా మలచి బయట ప్రపంచానికి అందించారామె. కథలు వ్రాశారు అనడం కన్నా చరిత్రలో ముస్లిం స్త్రీల జీవితాలను నమోదు చేశారనడం సరయినదేమొ.

ముస్లిం జీవితాలు, ముస్లింవాద సాహిత్యమనుకున్నపుడు మనకు చప్పున గుర్తుచ్చే రచయిత్రి షాజహానా. . . చాలాకాలంగా ముస్లిం స్త్రీల ఆవేదనను, బురఖా పద్ధతులను ఒక ధిక్కార స్వరంతో కవిత్వంలో ప్రతిబింబిస్తూ వచ్చిన షాజహానా ఈ కొత్త శతాబ్దంలో తన సాహిత్య ప్రక్రియకి ఒక విస్మృతి ఏర్పరుచుకుని కథా సాహిత్యం వెలువరించడం విశేషం.

ముస్లిం లోగిళ్లలోని, చీకట్లలోని స్త్రీల కష్టాలు, కన్నీళ్ళు, తన్నులు, ఆకలి, తలాక్, సండాస్‌ల గురించి ఆమె కథల్లో లోతుగా చర్చించారు.

ఇందాక మనం చెప్పుకున్న వినోదిని 'బ్లాక్' కథ కక్కసుదొడ్లు శుభ్రపరిచే స్త్రీల, దీన, హీన పరిస్థితిని ప్రతిబింబిస్తే. . . ఈ సండాస్ కథలో షాజహానా కొన్ని ప్రాంతాలలో ముస్లిం స్త్రీలకు కక్కసుదొడ్లు కూడా లేని ఒక స్థితి ఆ సండాస్ లోపలికి వెళ్ళినపుడు. . . లుకలుకలాడుతున్న పురుగులూ, విపరీతమైన గత్తుకంపూ చదువుతున్న పాఠకుడికే కడుపులో తిప్పినట్లయితే మరి యిక అక్కడ ఆ పరిస్థితిని స్వయంగా అనుభవిస్తోన్న మనుషుల సంగతేంటి? అన్న ఆలోచనలో పడ్తాం మనం.

ఇంతేకాకుండా "దాదీమా చెప్పినభిప్రాయాలు" "సిల్‌సిలా" వంటి ఎన్నో స్త్రీవాద కథలు షాజహానా కలం నుండి వెలువడ్డాయి.

ముస్లిం ప్రజలకు తమ జీవితాల పట్ల చైతన్యం కలిగించడంలోనూ, ముస్లిమేతరులకు ముస్లిం జీవితాల వివక్షను అర్థం చేయించడంలోనూ షాజహానా స్కైబాబాతో కలిసి విస్తృతమైన కృషి చేస్తున్నారు.

## VII

విప్లవోద్యమంతో సమాంతరంగా విప్లవసాహిత్యం ముఖ్యంగా కథా సాహిత్యం ప్రజల మధ్యనుండి, వారి పోరాటాల నుండి, సంఘర్షణ నుండి విధ్వంస సంస్కృతికి ప్రత్యామ్నాయంగా, మానవీయ సంబంధాల దిశగా ప్రయాణం చేస్తూ వస్తున్నది.

విప్లవోద్యమ కథలు వ్రాస్తోన్న స్త్రీలలో నల్లూరి రుక్మిణి, కరుణ, మిడ్కో వంటివారు చెప్పుకోదగినవారు.

వాగులూ, వంకలూ ఎండిపోయి. పిట్టలు తాగడానిక్కూడ నీళ్ళు కరువయి బీటలువారిన నేలతల్లి. పచ్చదనం నెమరువేయడానికి గడ్డిపోచ కరువై కబేళాలు కమ్ముకుంటోన్న పశువుల్లా ప్రపంచపటంలో రంగువెలిసిపోయి చెరిగిపోయిన ఈనాటి ఊళ్ళ ముఖచిత్రాల్ని మన కళ్ళముందు పరుస్తూ గడ్డికోసం ఉన్నూరా కాక, సొంతురూకాక పశువులు మేపుకోవడానికి చాలాదూరం వెళ్ళిన సుబ్బయ్య తన చిన్నప్పటికీ, ఇప్పటికీ మారిపోయిన వ్యవసాయాన్ని గురించి మథనపడ్డంలో ఈ ప్రపంచీకరణ. రైతుల్ని ఆహార పంటలవైపుకి తరిమి. . అక్కడ్నుండి ఆత్మహత్యల వైపుకు నెడుతుందో చర్చకు పెడుతూ నల్లూరి రుక్మిణి 'బీటలెత్తిన బీళ్ళ శోకం' అన్న కథ వ్రాస్తుంది.

"అక్కడ అడవుల్లో అన్నలున్నారంట ! కాల్చి పారేస్తారేమొ ! అక్కడే పోతావు" అంటూ కొడుకులు పెట్టిన అడ్డంకులు సుబ్బయ్య విషయంలో ఎలా నిజమవుతాయి.

"ఎవరు ప్రజల్ని రక్షిస్తున్నారు? ఎవరు ప్రజల్ని పిట్టల్లా కాల్చి చంపు తున్నారు? రక్షణ కోసం నియమింపబడ్డవాళ్ళు యిలా ముందూ, వెనకా లేకుండా ఎవరుదొరికితే వాళ్ళని ఇన్‌ఫార్మర్ల పేరుతో కాల్చి చంపేయడాన్ని కూడా ఈ కథ మనకి తెలియజెప్తుంది. ఇటీవల ప్రత్యేక ఆర్థిక మండళ్ళ నేపథ్యంలో ఆమె వ్రాసిన 'విక్టోరియా మళ్ళీ నవ్వింది' చెప్పుకోదగిన కథ.

ఇక మిడ్కో వ్రాసిన విప్లవోద్యమ కథల గురించి చెప్పుకోవల్సివస్తే అది ప్రత్యేకంగా వేరే వ్యాసమయ్యే ప్రమాదముంది.

భర్తను అనుసరిస్తూ ఉద్యమ జీవితంలోకి అడుగుపెట్టిన స్త్రీ తన సహచరుడు లొంగిపోతే తాను మాత్రం ధృఢంగా నిలబడుతుంది. అప్పుడు నేను చెబితే విన్నావు కదా? ఇప్పుడు వినవేంది? అని అతనంటే "నువ్వొక మామూలు భర్తవయితే నిన్ను నేను యిష్టపడేదాన్ని కాదు" అంటుంది ప్రవాహం అన్న కథలో.

మిడ్కో వ్రాసిన 'మెట్లమీద' 'బొందజూడవైతివి' వంటి కథలు తెలుగు కథా సాహిత్య చరిత్రలో నమోదు చేయాల్సిన కథలు.

విప్లవోద్యమంలో మహిళ స్థానాన్ని గురించి మిడ్కో, కరుణ వ్రాసిన కథలు చాలా లోతుగా చర్చకు పెడ్తాయి. కుటుంబంలో పితృస్వామిక అణచివేతను ఎదురించడం మొదలుకుని. మొత్తం స్త్రీల విముక్తి సమాజ మార్పుతో ముడివడి వుందన్న విషయాన్ని గ్రహించి విప్లవోద్యమ దిశగా చైతన్యం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తాయి వీరి కథలు.

పోతే ఉత్తర తెలంగాణా పల్లెల్లో చెప్పో, చెప్పకో తెలిసో, తెలీకుండానో అడవుల్లోకి వెళ్ళిపోయిన కొడుకుల కోసం కళ్ళు కాయలుకాచేలా ఎదురు చూసే తల్లుల గురించి మనందరికీ తెలుసు. ఏ క్షణంలో ఏ వార్త వినాల్సొస్తుందోనని క్షణం క్షణం కొడుకురాక కోసం ఎదురుచూపులతో కాలమై పలువరించే తల్లి గురించి 'రెక్కలచూపు' అన్న కథ వ్రాస్తారు శీలా సుభద్రాదేవి.

ఈ ప్రపంచం ఎలావుందో, ఎలా వుండకూడదో, ఎలా వుంటే బావుంటుందో అన్న ప్రాణప్రదమైన సిద్ధాంతాన్ని నమ్మి ప్రాణాలొడ్డడం చిన్న విషయమేమీ కాదు

గదా ! చరిత్ర ఎన్నెన్ని త్యాగాలనూ, రక్తగానాలనూ, ముళ్ళ కిరీటాలను చవిచూస్తేనే తప్ప ఒక భవిష్యత్తు నిర్మింపబడదు కదా !

## VIII

మహిళా సాధికారత అంటూ మనం గొప్పగా చెప్పుకపోవడమే గానీ మహిళలకు ఆ సాధికారత లభించినట్లుగా మనకెక్కడా కన్పించడం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు 108వ సవరణ పన్నెండేళ్ళకాలంగా సుదీర్ఘ ప్రయాణం చేస్తూనే వుంది. అది ఎప్పటికి సవరించబడుతుందో వున్నాడో, లేడో కాని ఆ దేవుడికే తెలియాలి.

73,74 సవరణల మూలంగా స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ వల్ల మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయినప్పటికీ ఈ మొత్తం ప్రహసనం వెనుక అధికారం చెలాయించేది మాత్రం పురుషుడే.

ఈ నేపథ్యంలో ఒకానొక వూరి సర్పంచిగా ఎన్నికయిన మహిళ తన భర్త నిర్ణయాలను అమలుపరిచే ఆటబొమ్మలా కాకుండా తనకు తాను నిర్ణయాలు తీసుకోగల సబలగా ఎదగడం అన్న వస్తువుతో కొండవీటి సత్యవతి 'ముందుడుగు' అన్న కథ రాశారు. స్త్రీలు సబలలుగా ఎదగడమనే చైతన్యంతో విభిన్న కోణాలనుండి ఆమె వ్రాసిన కథలతో 'ఆమెకల' అన్న సంపుటి వెలువడింది.

పంచాయితీ సర్పంచ్‌లుగా ఎన్నికయి పురుషాధిపత్యపు నీడలో కాకుండా స్వయం నిర్ణయాధికారంతో పరిపాలన సాగించే దిశగా ముదిగంటి సుజాతారెడ్డి 'కబ్జా' 'ధర్మపత్ని' అన్న రెండు కథలు వ్రాసారు. ఈ రెండు కథల్లోనూ మహిళలు సర్పంచులుగా నిటారుగా ఆఫీసుకి నడవడాన్ని చిత్రిస్తారామె. విస్తృతమైన వస్తు నేపథ్యంలో, శిల్ప చాతుర్యంతో మంచి కథలు వ్రాసిన సుజాతరెడ్డి గారి గురించి చెప్పుకోవడానికి ఈ చిన్న కాన్వాస్ చాలకపోవచ్చు. అదొక ప్రత్యేక అంశం.

స్త్రీలలో పూర్తి చైతన్యం రానంతవరకూ యిటువంటి రిజర్వేషన్లు దండగ. అగ్రకులాల సర్పంచులదే ఈ పరిస్థితయితే నిమ్నకులాలనుండి సర్పంచులుగా యం.పి.టి.సిలుగా, జడ్పీటిసిలుగా ఎన్నికయిన స్త్రీలది మరింత దీన పరిస్థితి. ఆ స్థితిని విపులంగా చర్చకు పెడుతూ 'నీళ్ళు' అన్న కథ వచ్చింది. జూపాక సుభద్ర వ్రాసిన 'సర్పంచ్' అన్న కథ కూడా ఈ కోవలో వచ్చిందే.

పోతే ప్రపంచీకరణ చిన్న పరిశ్రమల మీద ఎంత ప్రభావాన్ని చూపిస్తుందో నిరసిస్తూ సోమరాజు సుశీల ఒక సిరీస్‌గా మంచి కథలని పాఠకులకి అందించారు.

చివరగా నిజానికి ముందుగా ఎప్పటికప్పుడు సాహిత్యానికి కథ, కవిత, నవల వంటి వాటన్నింటినీ విమర్శకు పెట్టి ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తూ ముందుకు తీసుకెళుతున్న ప్రముఖ సాహితీ విమర్శకులూ, ఉపన్యాసకురాలు అయిన కాత్యాయనీ విద్మహేని గురించి ప్రస్తావించుకోనట్టయితే స్త్రీవాద సాహిత్యం పూర్తి కానట్టే ! అదే కోవలో స్త్రీల సాహిత్యాన్ని విమర్శకు పెడుతూ కథలు పదనుదేలుస్తోన్న చూపు కాత్యాయని స్త్రీల కథా సాహిత్యానికి గోడ చేర్పు.

ఇదలా వుంటే తాను స్వయంగా కథలు వ్రాయడమే కాకుండా స్త్రీల కథలని ఎప్పటికప్పుడు హిందీభాషలోకి అనువదించి ఆ విధంగా కథా సేవ చేస్తోన్న శాంత సుందరి గారు నిజంగా అభినందనీయులు.

ఇంతేకాకుండా మరెంతో వస్తువైవిధ్యంతో స్త్రీలు కథలు వ్రాశారు. స్త్రీలను అధీన సంబంధాలలోకి నెడుతొన్న యిప్పటి నమూనా కుటుంబాల పునర్నిర్మాణం జరగాలంటే ముందు వాటిని సమూలంగా కూడగట్టవలసి వుంది. పెళ్ళి సంస్కృతి పురుషుడికి సర్వాధికారాలనూ కట్టబెడుతోంది కాబట్టి పురుషుడికి ఆ అవకాశం, అధికారం యివ్వకుండా ప్రజాస్వామిక సంబంధాలలోకి ప్రయాణించి ఒక 'ప్రయోగం' ఓల్గా చేస్తే అదే నేపథ్యంలో యింకొంచెం మార్పుతో ఈ వివాహ చట్రంలోకి ఒదగకుండా ఒంటరిగా జీవించగలిగే ఒక నిర్ణయాన్ని కుప్పిలి పద్మ 'ముక్త' లో చెప్తారు.

ఒకింత స్పష్టంగా మాట్లాడుకోవలసి వస్తే కుటుంబాలకీ, వివాహ వ్యవస్థకీ స్త్రీవాదులెప్పుడూ వ్యతిరేకులు కాదు. అయితే ఈ కుటుంబాలలోని డొల్లతనం, ఏకపక్ష నిర్ణయాధికారాలు, ద్వంద్వ ప్రమాణాలు అన్నింటినీ సరిద్దుకుని ఒక ప్రజాస్వామికమైన, అసమానతలు లేని కుటుంబాలని స్త్రీలిప్పుడు కోరుకుంటున్నారు. అటువంటి కుటుంబాలని ఆహ్వానిస్తున్నారు. అందుకోసమే పోరాటం చేస్తున్నారు.

సింగమనేని నారాయణ గారన్నట్లు

వేల సంవత్సరాల కాలంగా ఈ సమాజం సర్వనాశనం కావడానికి కారణం పూర్తిగా మగవాడే.ఒకవేళ భవిష్యత్తులో సముద్ధరించబడుతుందనుకుంటే అది స్త్రీల వల్ల మాత్రమే సాధ్యమవుతుంది.

# సురవరం ప్రతాపరెడ్డి కథలు

ఆచార్య పి. జ్యోతి

తెలంగాణాలో కథానికా సాహిత్యాన్ని వెలువరించిన వారిలో ఆద్యులు సురవరం ప్రతాపరెడ్డి గారు. తెలంగాణా ప్రజలను మేల్కొలిపి, వారిలో వీరావేశం నింపి, తెలుగుజాతికి మార్గనిర్దేశనం చేసిన వైతాళికులు సురవరం వారు. పత్రికా సంపాదకులుగా, పరిశోధకులుగా, సంఘసంస్కర్తలుగా, విశాలాంధ్రోద్యమ ప్రేరకులుగా వారు చేసిన కృషి చిరస్మరణీయమైంది. ముఖ్యంగా వారు తెలంగాణాకు చేసిన సేవ అనన్య సామాన్యమైంది. కోస్తా ప్రాంతం నుండి వెలువడే వారపత్రికలో తెలంగాణాలో కవులు లేరని, కవితాశక్తి, వారికి లేనేలేదని, అసలు తెలుగు మాట్లాడడమే వారికి చేతగాదనే వార్తను చూసిన ప్రతాపరెడ్డి గారు ఎంతో ఆవేశపడ్డారు. మారుమూల గ్రామాల్లో ఉన్న కవులను గోలకొండ పత్రిక కార్యాలయానికి ఆహ్వానించి వారితో కవితలు వ్రాయించారు. ఎంతో శ్రమించి ఎన్నెన్నో కవితలు సేకరించి – "గోలకొండ కవుల సంచిక"ను ప్రచురించారు. ఈ సంఘటన మొత్తం ఆంధ్రదేశంలోనే గొప్ప సంచలనాన్ని కలిగించింది. తెలంగాణా ప్రజలు ఉత్తేజితులైనారు. నాటి నుండి రెడ్డి గారు తెలుగు వారి గుండెలలో శాశ్వతంగా నిలిచిపోయారు.

1926లో ప్రతాపరెడ్డి గారు గోలకొండ పత్రికను స్థాపించిన నాటి నుండి సంపాదకీయాలు వ్రాస్తుండేవారు. తెలంగాణాకు సంబంధించిన రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలకు స్పందించి ప్రజల పక్షాన నిలిచి సూటిగా, ధైర్యంగా తమ అభిప్రాయాలను ప్రకటించేవారు. ప్రభుత్వం నుండి హెచ్చరికలు వచ్చినప్పటికి లక్ష్యపెట్టక తాను ప్రజల మనిషిగానే జీవించారు. నిజంగా వారొక వ్యక్తికాదు. ఒక సంస్థ. హైదరాబాదులో ఇప్పుడున్న విద్యాలయాలతో, సాహితీ పరిషత్తులతో, ప్రచార సంఘాలతో, గ్రంథాలయాలతో వారికి అవినాభావ సంబంధమున్నది. ఆయన ఆంధ్రుల సాంఘిక చరిత్ర, రామాయణ విశేషములు, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు వంటి రచనలే కాక – కథలు, నాటకాలు, అనేక వ్యాసాలు వ్రాసారు.

మల్లంపల్లి వారు వీరు రచనలను గురించి, "ప్రతాపరెడ్డి రచనలో ఒక రమ్యత, శైలిలో ఒక ఆవేశము, భావ పరిపుష్టి, ప్రసన్నత, మధురిమ, వాటిని మించిన చురుకుదనము, ఓజస్సు, తేజస్సు ఉన్నవి. వారి పుస్తకం చేత ఉంటే చాలు ముగియు వరకూ అది మనలను వదలదు. పఠనానిభిలాషలేని పాఠకుడిని సైతం వారి శైలీపాటవం ఆకర్షిస్తుంది. వారి రచనలో పురాణశైలీ పావిత్ర్యం గాని, కావ్యశైలీ గాంభీర్యం గాని గోచరించదు. అందు స్ఫురించేది హిమవత్తుంగా పాత భాగీరథి పయోద్వేగము. చెణుకులను విసరునపుడు మర్యాదాతిక్రమణం లేకుండా హాస్యభరిత పదజాలంతో సున్నితమైన విసురులతో పఠితల హృదయాలను రంజింపజేస్తూ ముందుకు లాక్కుపోతుంది. వారి రచన కున్నంత శక్తి, మధురిమ, రసోద్వేగము ఇతరులలో అరుదు. చారిత్రక వ్యాసాలైనా, విమర్శనాత్మక గ్రంథాలైనా, పరిశోధనాత్మక పొత్తములైనా వారి రచనా వైదగ్ధ్యమునకు నికషోపలములే. అంత పొంకముగా, ఇంపుగా, భావస్ఫోరకముగా, మృదుమధురముగా రచన చేయువారు ఆంధ్రదేశములో కూడా అరుదేనన్న అతివ్యాప్తి కాదేమో" అని అభిప్రాయపడ్డారు.

ప్రతాపరెడ్డి గారు మొగలాయి కథలతో కలిపి మొత్తం ఇరవై మూడు కథలు రచించినట్లు తెలుస్తున్నది.

వీరి కథలలో "నిరీక్షణ" అనే కథ తలమానికం వంటిది. ఆయనకు శాశ్వతమైన కీర్తిని తెచ్చిపెట్టిందీ కథ. ఇది వివిధ సంకలనాలలో స్థానం సంపాదించుకోవటమే కాక హిందీ, ఫార్సీ, కన్నడ, మహారాష్ట్ర - భాషలలోకి అనువదింపబడిందంటే ఈ కథ ప్రత్యేకతను గుర్తించవచ్చు.

తిరువాన్కూరు బెస్తవారి కుటుంబంలో జన్మించిన శంకరన్, ఆయన మేనమామ కూతురు కుమారిల ప్రణయగాథ ఈ "నిరీక్షణ". చిన్ననాడే తల్లిదండ్రులను కోల్పోయిన శంకరన్ మేనమామ ఇంట పెరిగాడు. మేనమామతో ప్రతిరోజు సముద్రానికి వెళ్లి చేపలు పట్టేవాడు. ఆ మేనమామ కూతురు కుమారి. చిన్న వయసులో వంటలు వార్పులు నేర్పుగా చేయగల తెలివైన పిల్ల. రోజూ వీరిద్దరూ కన్యాకుమారి తీరంలో సముద్రపు దిబ్బలపై, ఇసుక తిన్నెలపై ఆడుకుంటూ ఉండేవారు. ఒకరిపై ఒకరికి అనురాగం పెరుగుతూ వచ్చింది. ఇద్దరూ యుక్త వయస్కులైనా ఆటపాటలు యథావిధిగా సాగుతుండేవి.

శంకరన్‌కు ఇరవై, కుమారికి పదహారు సంవత్సరాలు వయసు వచ్చిన తరువాత ఒక ఆదివారం వారి వివాహం నిశ్చయమైంది. పెళ్లికి ముందు శనివారం మధ్యాహ్నం శంకరన్ కుమారిని వెంటబెట్టుకొని సముద్ర తీరానికి వెళ్ళాడు. తమ కులాచారం ప్రకారం సముద్రంలోకి ఒంటరిగా వెళ్ళి ఏడు చేపలైనా పట్టుకురావాలని, గంటలోపల తిరిగి వస్తానని చెప్పి సముద్రంలోకి వెళ్ళిన శంకరన్ ఎంత సేపటికీ తిరిగి రాలేదు. కుమారి అతని రాకకోసం నిరీక్షిస్తూ కూర్చున్నది. మరునాడు కొంతమంది కులం వారు సముద్రంలో వెదకినా, శంకరన్ జాడ కనపడలేదు. అతడు మరణించాడని అందరూ నిశ్చయించుకున్నారు. అయినా కుమారి ఆశ చావలేదు.

తన శంకరన్ తప్పక తిరిగి వస్తాడని కుమారి రోజూ సాయంకాలం చేపల కూర, అన్నం, పెరుగు – బుట్టలో వేసుకొని సముద్రతీరానికి వెళ్ళి అతని రాకకొరకు నిరీక్షించి, నిరాశతో ఇంటికి తిరిగి వచ్చేది. శంకరన్ మరణించినాడని, తల్లిదండ్రులు మరో వ్యక్తితో పెళ్ళి చేస్తామని ఎంత నచ్చచెప్పినా అంగీకరించలేదు. తన శంకరన్ కంటె మంచివాడు ప్రపంచమంతా వెదకినా దొరకడని, ఆయన తప్పక తిరిగి వస్తాడని, తమకు చిన్ననాడే పెళ్లి అయిందని తల్లిదండ్రులతో వాదించేది.

కొంతకాలానికి తల్లిదండ్రులు మరణించగా కుమారి ఒంటరిగా మిగిలింది. అయినా దినచర్య మానలేదు. రోజూ సాయంత్రం సముద్రతీరానికి అన్నం మూట కట్టుకొని వెళ్ళి, ఎదురు చూచి తిరిగి వచ్చేది. ఆ నిరీక్షణలోనే ఆమె శంకరన్‌ను దర్శించేది. పరిపరి విధాల ఆలోచించేది. అలా పదిహేను సంవత్సరాలు గడిపింది. మానసిక వేదనతో ఒక రోజు రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురి అయింది. అంతటి అస్వస్థతలోనూ శంకరన్‌ను గురించి కలవరింతలే. అలా కలవరిస్తూనే ఆమె తుది శ్వాస విడిచింది. ఆమె శంకరన్‌తో కడసారి వీడ్కోలు పొందిన స్థలంలోనే గ్రామస్థులు ఆమెను సమాధి చేశారు. అక్కడే ఒక మందిర నిర్మాణం చేసి అఖండ ప్రేమ జ్యోతి వెలిగించారు. కన్యాకుమారి దేవతగా ఆమె నేటికీ పూజింపబడుతున్నది.

"నిన్ను పూలల్లో పెట్టి పూజిస్తాను. అందరి చేత పూజింపచేస్తాను" అని వివాహం నిశ్చయమైందని తెలిసిన తరువాత శంకరన్ కుమారితో అన్నమాటలు ఈ విధంగా నిజమయ్యాయి. "ప్రతి వస్తువుకూ ఉదయం అస్తమయం ఉన్నది"

అని సూర్యోదయ అస్తమయాల గురించి కుమారి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రెడ్డిగారు శంకరన్ నోట "పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు, గిట్టిన ప్రాణి మరల పుట్టుక తప్పదు" అని అర్థాన్నిచ్చే (జాతస్యహిధ్రువో మృత్యుః....) భగవద్గీతాశ్లోక సారాంశాన్ని చెప్పించారు.

"ఆ అలలు చూస్తివా? యెట్లా ఒకటి మీద ఒకటి పడుతున్నవో, వాటికి విరామం లేదా?" అని కుమారి అడిగిన ప్రశ్నకు "అఖండ ప్రేమ అంటే అట్లే ఉంటుంది" అని ప్రేమకుల అనుబంధాన్ని అలలతో పోల్చి మనోహరంగా వర్ణించారు. ఈ విధంగా రెడ్డిగారు ఈ కథలో ప్రేమికుల అనురాగాన్ని, ఆప్యాయతను, పరస్పర అనుబంధాన్ని ఎడబాటులోని బాధను, దుఃఖాన్ని ఒకరికొకరు మరొకరి త్యాగాన్ని - సహజంగా చిత్రించారు. కుమారి నిరీక్షణను హృదయాకర్షకంగా వర్ణించినందున ఈ కథకు "నిరీక్షణ" అనే పేరు సార్థకమైంది.

నాటి దుష్ట సమాజపు కోరలలో చిక్కి సాంఘిక దురాచారాల మధ్య నలిగి, స్వామీజీ దుష్కృత్యాలకు గురియై, తల్లిదండ్రుల చేత తిరస్కరింపబడి, తనను ఆదరించిన ఒక మహమ్మదీయ యువకుని వివాహమాడిన ఒక బ్రాహ్మణ బాలవితంతువు కథ "హుసేన్ బీ".

మధ్వబ్రాహ్మణ కులంలో జన్మించిన కామాక్షి చిన్నతనంలోనే భర్తను కోల్పోవడం వల్ల, కులాచారం ప్రకారం శిరోముండనం చేయించాలని బంధువులు ఒత్తిడి తేగా ఆమె తిరస్కరించింది. ఫలితంగా వారి కుటుంబానికి సంఘబహిష్కారం జరిగింది. ఒక రోజు తమ గ్రామానికి వచ్చిన స్వామీజీ కామాక్షికి హితబోధ చేస్తానని తన ఆశ్రమానికి కొనిపోయి, ఆమెపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. ఆమె అర్ధరాత్రి వేళ ఆశ్రమం నుండి తప్పించుకొని ప్రాణ భయంతో ఇంటికి రాగా తల్లిదండ్రులు రావద్దన్నారు.

దిక్కుతోచక దుఃఖిస్తున్న సమయంలో సికింద్రాబాదు నుండి ఆ ఊరికి వచ్చిన మహమ్మదీయుడైన తోళ్ళ వర్తకుడు ఆమెను చేరదీసి తన ఇంటికి తీసుకుపోయి వివాహం చేసుకున్నాడు. తరువాత వారికి ఇద్దరు పిల్లలు కలిగారు. ఆమె హుసేన్‌బీగా పేరు మార్చుకొని మనసు పడిన భర్తతో కాపురం చేసుకుంటూ సుఖంగా కాలం గడిపింది.

ఈ కథంతా హుసేన్‌బీగా మారిన కామాక్షి తన ఊరివాడు, చిరపరిచితుడైన రామునికి చెపుతుంది. రాముడు ఇదంతా తన స్నేహితునికి చెపితే అతడు "యేం చిత్రంరా ! మన మతంలో వుంటే ఆ బూవమ్మ ఇంత మంది పిల్లలు కంటూ వుండేనా, చెప్పు మరి" ! అని ప్రశ్నిస్తాడు. కథకుడు రామునితో "అయ్యో ! సంఘ దౌర్జన్యము వల్ల హిందూ స్త్రీ లెట్లు చెడిపోతున్నారో కదా" అని పలికిస్తాడు. ఒకానొక సంప్రదాయానికి సామాజికామోదాన్ని సంపాదించి పెట్టడంలో మతం పాత్ర ఎట్లాంటిదో, మతం స్త్రీల జీవితాన్ని ఎట్లా శాసిస్తుందో ఈ కథలో మనం గమనించవచ్చు.

నాటి సమాజంలో స్త్రీల దైన్య స్థితిగతులు, సమాజపు కట్టుబాట్లు బాల్య వివాహాలు, విధవా పునర్వివాహ నిషేధాలు, బాల విధవల తిరుగుబాట్లను ఈ కథలన్నీ ఎత్తి చూపుతున్నాయి.

పెద్ద చదువులు చదువుకున్నా వకీలు వద్ద కొంత కాలం పనిచేసిన సామాన్య వ్యక్తి వకీలుగా అవతారమెత్తి, తన వేషభాషల ద్వారా అమాయకులైన గ్రామీణులను మోసం చేసి అక్రమంగా ఆస్తులు సంపాదించి, ప్రజల మధ్య కల్లోలాలు సృష్టించి, గ్రామీణ జీవన వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, వర్గ రాజకీయాలు నడిపించి కొంతకాలం ఒక వెలుగు వెలుగుతాడు. కాని అలాంటి వారి దౌర్జన్యాలు, దురాగతాలు ఎంతో కాలం సాగనవి, వారికి అనతికాలంలోనే పతనం తప్పదని "వకీలు యెంకయ్య"కథలో రెడ్డిగారు వివరించారు.

లంచగొండులైన పోలీసు అధికారులు గ్రామాధికారుల చేతలలో కీలు బొమ్మలుగా మారి అమాయకులపై అక్రమ కేసులు ఎలా బనాయిస్తారో, వాటి ఫలితం ఎలా ఉంటుందో ఈ కథ ద్వారా విశదమవుతుంది. పరస్త్రీ వ్యామోహం. ఎటువంటి అనర్థాలకు దారితీస్తుందో, అక్రమ సంపాదన కరిమింగిన వెలగపండు వలె ఎలా మాయమవుతుందో, అలాంటి వారు ఎన్ని కష్టాలు అనుభవించవలసి వస్తుందో వకీలు యెంకయ్య జీవిత కథ ద్వారా, ఆయన ఉత్థాన పతనాల ద్వారా రెడ్డి గారు నిరూపించారు.

ఇంగ్లీషు వారి భాష, వేషధారణ, ఆచార వ్యవహారాలు ఆనాడు మన సమాజం మీద ఎంతటి దుష్ప్రభావాన్ని చూపాయో "బారిష్టర్ గోపాల కిషన్‌రావు"

కథలో రెడ్డి గారు వివరించారు. ఇంగ్లాండులో బారిష్టర్ చేసివచ్చిన బ్రాహ్మణుడైన గోపాల కిషన్‌రావు తన భార్య జానకి సంప్రదాయకమైన కట్టు బొట్టు వదలి, ఆధునికంగా తయారు కావటానికి అంగీకరించనందున, భార్యను వదలివేసి, తల్లిదండ్రులతో గొడవపడి హైదరాబాదుకు వెళ్ళి, వేశ్య అని తెలియక తన అభిరుచులకు తగిన ఆధునిక వేషధారణతో ఉన్న ఒక స్త్రీని వివాహమాడుతాడు. కొంతకాలానికి ఆమె ఒక మహమ్మదీయునితో వెళ్ళిపోతుంది.

గోపాల కిషన్‌రావు తన భార్యను మహమ్మదీయుడు బలవంతంగా లేవదీసుకుపోయినాడని కేసువేసి ఓడిపోతాడు. భార్య దక్కక, పరువుపోయి పశ్చాత్తాపంతో తిరిగి మొదటి భార్యవద్దకు వచ్చి ఆమె కాళ్ళపై పడతాడు. ఆమె మన్నించి ఆదరిస్తుంది. రాజ్యలక్ష్మి పాత్ర ద్వారా వేశ్యల హావభావ విన్యాసాలను, వారి స్వేచ్ఛా విహారాలను, మోసాలను రెడ్డి గారు వర్ణించారు. ఆ రోజుల్లో వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీల వల్ల కుటుంబాలు ఎట్లా విచ్ఛిత్తి అయ్యేవో, పితృస్వామిక వ్యవస్థ ఎంతమంది స్త్రీలను వేశ్యలుగా మార్చిందో, స్త్రీలకు అభద్రతాయుత జీవితాల్ని ఎట్లా ప్రసాదించిందో ఈ కథలో స్పష్టపరచారు.

నిజాం పాలనా కాలంలోని పోలీసు వ్యవస్థ తీరు తెన్నులకు, "సంఘాల పంతులు" కథ అద్దం పడుతుంది. పోలీసులు ప్రజలను ఏ విధంగా పీడించేవారో, గ్రామీణుల కోళ్ళు మొదలైన వాటిని ఉచితంగా ఎలా స్వాహా చేసేవారో, దళితులతో ఎలా వెట్టిచాకిరీ చేయించుకునే వారో, పోలీసులతో పాటు వారి భార్యలు కూడా అణగారిన ప్రజలపై ఎలా దౌర్జన్యాలు చేసేవారో, తమ కుటుంబ అవసరాలకు విందు వినోదాలకు వ్యాపారుల వద్ద నుండి బలవంతంగా ఎలా మామూళ్ళు వసూలు చేసేవారో, వారి అగడాలను ప్రశ్నించిన వారిని ఎలా హింసించేవారో రెడ్డి గారు ఈ కథలో వివరంగా చిత్రించారు.

అమాయకులైన గ్రామీణులను చైతన్యపరిచేందుకు సంఘాల పంతులు వంటివారు ఎవరో ఒకరిద్దరు ముందుకు వచ్చి వెట్టిచాకిరీ వంటి అంశాలను గురించి ఉద్బోధించే వారని, దానితో ప్రజలలో కొంత జాగృతి కలిగేదని, ప్రజలు పోలీసులపై తిరుగుబాటు చేసి, వారికి దేహశుద్ధి కూడా చేసేవారని ఈ కథ ద్వారా విశదమవుతుంది. ప్రజారక్షణ కొరకు పోలీసుస్టేషన్లు తమ గ్రామాలలో ఏర్పాటు చేయాలని కోరుకునేందుకు బదులు తమ గ్రామం నుండి పోలీసుస్టేషన్ ఎత్తివేస్తే

ప్రజలు ఆనందంతో జల్సా చేసుకున్నారంటే నాటి పోలీసుల దౌర్జన్యాలు ఎంత మితిమీరిన స్థాయిలో ఉండేవో, వారు ప్రజలను ఎలా పీడించేవారో ఊహించవచ్చు. "పోలీసువారు ఎన్నడున్ను చేతినుండి పైకమిచ్చి వస్తువులు కొనేది యెరుగరు పాపము" అన్న రెడ్డి గారి మాటలు ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. అవి ఈనాడు కూడా సత్యమనిపిస్తున్నాయి.

ప్రేమకు ఆస్తిపాస్తులతో నిమిత్తం లేదని, ప్రేమకుల వివాహానికి పెద్దలు అంగీకరించకపోతే వారు ఎంతటి సాహసానికైనా ఒడిగడతారని, ఒక్కొక్కమారు అలాంటి సాహసాలతో మోసకారుల వలలో చిక్కి అమాయకులైన బాలికలు అధః పాతాళానికి వెళతారని హేయమైన వేశ్యావృత్తిలోకి బలవంతంగా నెట్టివేయబడి నికృష్టమైన జీవితాన్ని గడపవలసి వస్తుందని 'మెహ్దీబేగం' కథ ద్వారా ప్రతాపరెడ్డిగారు వివరించారు.

నవాబుల సంతతికి చెందిన మెహ్దీ అనే మహమ్మదీయ యువతి, ముప్ఫయి రూపాయల వేతనాన్ని మాత్రమే పొందుతున్న తమిళనాడుకు చెందిన జబ్బార్ అనే యువకుణ్ణి ప్రేమించింది. వారి ప్రేమను ఆమె సోదరులు, తల్లిదండ్రులు తిరస్కరించారు. అయినా ఆమె జబ్బార్‌కు ముందుగా ఉత్తరం రాసి, ఒక అర్ధరాత్రి జబ్బార్ ఇంటికి చేరింది. మెహ్దీ అచూకీ గురించి వెతుకుతూ ఆమె జబ్బార్ ఇంటి వద్దనే ఉంటుందని ఆమె కుటుంబ సభ్యులు నిశ్చయించుకున్నారు. జబ్బార్ ఇంట్లో దూరి అమ్మాయిని బలవంతంగా ఇంటికి తెచ్చుకున్నారు. తమ ఇంట్లో దొంగతనం చేశాడని జబ్బార్‌పై కేసు పెట్టారు. తనను పోలీసులు అరెస్టు చేస్తారనే విషయం తన మిత్రుడైన వెంకట రామయ్య ద్వారా తెలుసుకొని, అతని సలహాపై జబ్బార్ ఒక హిందూ సాధువుగా వేషం మార్చుకొని బయటపడి రైలులో మద్రాసు వెళ్ళిపోయాడు.

మెహ్దీని తల్లిదండ్రులు నెల రోజులు గృహ నిర్భంధంలో ఉంచారు. జబ్బార్ పారిపోయాడని, తిరిగి రాడని నిర్ధారించుకొని ఆమెను వదలిపెట్టారు. అయితే జబ్బార్‌ను మరువలేని మెహ్దీ ఇంటినుండి బయటపడి జబ్బార్ కొరకు వెదుకుతూ, ఆకలికి తట్టుకోలేక బిచ్చగత్తెగా మారింది. మహబూబ్‌నగర్ నుండి మద్రాసు వెళ్ళేందుకు రైలెక్కుదామనుకున్నది. దారిలో తిమ్మంపేట అనే గ్రామంలో కొంతమంది స్త్రీలు ఆమెను ఆదరించినట్లు నటించి బలవంతంగా వేశ్యావృత్తిలోకి దించారు. ఆ ఊబిలో నుండి బయటపడలేక ఆమె దుర్భర జీవితాన్ని గడిపింది. ప్రియుడు పిరికితనంతో పారిపోగా, తల్లిదండ్రుల పట్టుదలకు ఆమె జీవితం బలి అయింది.

నాటి సమాజంలో వేశ్యలకు ఉండే గౌరవాన్ని, పుని స్త్రీలకు లభించే అగౌరవాన్ని "ఖిస్మత్" అనే కథలో రెడ్డిగారు వివరిస్తూ, దురదృష్టవంతులు ఎక్కడికివెళ్ళినా వారి దౌర్భాగ్యం వారిని వెన్నంటే ఉంటుందని ఇంత్యాజన్ పాత్ర ద్వారా వివరించారు. అయితే ఆ దురదృష్టవంతులెవరో కాదు. 'స్త్రీలే'. స్త్రీల జీవితాలలోని అధీనతను ఎత్తి చూపుతుంది కథ.

వేశ్యావృత్తిలో అగ్రగామిగా ఉంటున్న గౌహర్‌జాన్ మార్కెట్టు సమీపంలో లభించిన అనాథ బాలికను తన ఇంటికి తెచ్చి ఇంత్యాజన్ అని పేరు పెట్టి పెంచి పెద్ద చేసింది. యుక్తవయస్కురాలైన ఇంత్యాజన్‌ను కూడా వేశ్యావృత్తిలోకి దింపుదామనుకుంటుండగా ఆమె అందుకు తిరస్కరించింది. తాను వివాహం చేసుకుంటానని, వేశ్యవృత్తిలోకి దిగనని ఇంత్యాజన్ అన్నప్పుడు "మనదేశంలో హిందూ సమాజంగాని, ముసల్మాన్ సమాజం గాని చాలా అన్యాయం చేస్తున్నది. పెండ్లి చేసుకుంటివా నువ్వు గులాంకంటె, తుదకు సువ్వర్ కంటే హీనంగా ఉంటావు. సమాజం నిన్ను చాలా కష్టపెడుతుంది" అని ఆనాటి వివాహవ్యవస్థ తీరుతెన్నులను గురించి రెడ్డిగారు గౌహరుజాన్‌తో చెప్పించారు. ఈ మాటలను బట్టి ఆనాడు సమాజం స్త్రీని పితృస్వామిక సామాజిక చట్రంలో ఏ విధంగా బంధించిందో ఊహించవచ్చు.

పెంపుడుతల్లి కోరికను తిరస్కరించిన ఇంత్యాజాన్ సితార్ విద్వాంసుడైన ఒక యువకుణ్ణి ప్రేమించింది. ఇద్దరూ కలిసి ఎవరికీ చెప్పకుండా బొంబాయి వెళ్ళి అక్కడ పెళ్ళి చేసుకున్నారు. సంపాదన లేని ఆ యువకుడు కొంతకాలం ఆమెతో కాపురం చేసి, డబ్బు సంపాదించి తనకివ్వమని ఒత్తిడి చేసి ఆమెను ఒక వేశ్యమాతకు అప్పగించాడు. తల్లి మాటను తిరస్కరించిన ఆమెకు ఇక్కడ ఆ వృత్తిలోకి దిగక తప్పలేదు. ఆమె అయిష్టంగానే మూడేండ్ల పాటు ఆ వృత్తిని కొనసాగించింది. ఒక రోజు భర్త చెప్పకుండా వెళ్ళిపోయాడు. తాను నమ్మిన భర్త నట్టేట ముంచి కనిపించకుండా వెళ్ళినందుకు చివరకు ఒంటరి జీవితమే మిగిలింది.

కొంతకాలం తరువాత ఆమె వేశ్యావృత్తిని మాని ఒక అనాథ బాలికను పెంచుకొని, ఆమెకు తన పెంపుడు తల్లి గౌహర్‌జాన్ పేరు పెట్టుకున్నది. ఆ అమ్మాయికి విద్యాబుద్ధులు చెప్పించి, మంచి భోరా వర్తకునికిచ్చి వివాహం చేసింది. తాను సంపాదించిన ఆస్తిలో కొంతభాగం పెంపుడు కూతురుకిచ్చి, మిగిలింది అనాథ బాలికల సంరక్షణకు వినియోగించే ఏర్పాటు చేసి మరణించింది. తాను ఏ వృత్తిని

అవలంబించినా, తన బాల్యాన్ని గుర్తు చేసుకొని అనాథ బాలికల సంరక్షణకు చేయూత నిచ్చి వారి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నది.

తాను చేయని నేరానికి, దుర్మార్గుల మోసానికి బలి అయి, కుటుంబ సభ్యులు వెలివేయగా అమాయకురాలైన ఒక బ్రాహ్మణ యువతి వేశ్యగా మారిన విషయం "అపరాధం" అనే కథలో వర్ణించబడింది. అమాయకులైన యువతులను నాటి సమాజంలో దుర్మార్గులు ఎలా మోసగించేవారో రెడ్డిగారు ఈ కథలో వివరించారు.

కరీంనగర్ జిల్లాలోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి కోడలు రాంకుమారి. తన మామగారికి ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చేర్చగా కుటుంబ సభ్యులందరూ అక్కడికి వెళ్ళారు. రాంకుమారి ఒక్కతే ఇంటివద్ద మిగిలింది. తన మామగారికి ప్రాణాపాయ స్థితి వచ్చిందని, భర్త వెంటనే తనను తీసుకురమ్మన్నాడని చెప్పి ఖాసిం అనే ముస్లిం యువకుడు ఆమెను బండిలో బయలుదేరదీసి, గ్రామాంతరానికి కొనిపోయి మరో ముగ్గురు యువకులతో కలిసి ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. ఆమెను ఊరూరు తిప్పి మూడు నెలల తరువాత 200 రూపాయలకు మరో వ్యక్తికి అమ్మివేశాడు. పోలీసుల సహాయంతో ఎలాగోలా ఆమె బయట పడగలిగింది. ఇంటికి రాగా, ఆమె భ్రష్టు రాలయిందని కుటుంబ సభ్యులు ఆమెను బహిష్కరించారు. తన తప్పేమి లేదని, మోసపోయానని చెప్పినా వారు వినలేదు. పుట్టింటివారు కూడా ఆమె గోడు పట్టించుకోక ఈసడించారు. వారు ప్రాయశ్చిత్తం పేరుతో ఆమెను కాశీకి తీసుకుపోయి అక్కడే వదలి వచ్చారు. అక్కడ ఒక పాండా ఈమెను కొంతకాలం ఉంపుడుగత్తెగా ఉంచుకొని వదలివేశాడు. తరువాత ఆమె, గత్యంతరం లేక వేశ్యా వృత్తిలోకి దిగింది. పురుషాహంకార స్వభావం స్త్రీపై ఏ విధంగా దాడిచేసిందో తాను చేయని నేరానికి అపరాధానికి స్త్రీ ఎట్లా శిక్ష అనుభవించవలసి వచ్చిందో ఈ కథ తెలుపుతుంది.

రెడ్డి గారి కాలం నాటికి హిందువులు కోర్టు ద్వారా విడాకులు పొందే అవకాశం ఉన్నట్టు కనిపించదు. అందుకు ఉదాహరణగా "వింత విడాకులు" కథలో కమలమ్మను కమాల్‌బీగా మార్చి ఆవిడకు విడాకులు లభించిన తరువాత ఆర్యసమాజం వారిని ఆశ్రయించి తిరిగి హిందువుగా మారినట్లు వర్ణించారు. గోలకొండ పత్రికలో ప్రచురితమైన పిఠాపురం రాజాగారి కూతురు సీతాదేవికి భర్తతో లభించిన విడాకుల వార్త ఈ కథలో నాయకుడైన నంబి నరసింహులుకు కమ్మలమ్మ

విడాకుల విషయానికి స్ఫూర్తి కలిగించినట్లు రెడ్డి గారు పేర్కొన్నారు. సీతాదేవి ఇస్లాంమతం స్వీకరించి, తన భర్త ఉయ్యూరు జమీందారుకు హైకోర్టు ద్వారా విడాకుల్చి, తరువాత రెండు వారాలకే తిరిగి హిందువుగా మారి బరోడా మహారాజును వివాహం చేసుకున్నది అనే విషయం గోలకొండ పత్రికలో ప్రచురితమయింది. ఈ వార్త ఆధారంగా నంబి నరసింహులు కథ నడిపించాడు.

గ్రామ వైద్యుడు, బడిపంతులు అయిన నంబి నరసింహులు తన కూతురు కమలమ్మ వివాహాన్ని, నపుంసకుడని తెలియక చంద్రయ్యతో జరిపించాడు. తరువాత విషయం తెలిసి అతనికి వైద్యం చేసి అతని చేతిలో అవమానాల పాలైనాడు. అతనిపై ప్రతీకారం తీర్చుకునేందుకు కమలమ్మను తురుకలలో చేర్చి కమాల్‌బీగా మార్చి, కోర్టు ద్వారా నోటీసు ఇప్పించి ఆమెకు విడాకులిప్పించాడు. ఆ తరువాత ఆమెను ఆర్యసమాజం వారి ద్వారా హిందూమతంలో చేర్పించి, వారికి అన్ని విధాల సహకరించిన రంగనాయకులకు ఇచ్చి వివాహం జరిపించాడు. ఈ విధంగా రెడ్డి గారు తమ కాలంలోని సామాజిక స్థితి గతులను నిశితంగా పరిశీలించి, ఏ అంశాన్ని వదలకుండా, ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క కథలో ప్రతిఫలింపజేశారు.

మొగలాయి కథలన్నీ వినోదం కొరకు అప్పుడప్పుడు గోలకొండ పత్రికకు పేరు లేకుండా రాసుకున్నానని, వాటిని వినోద దృష్టితోనే చదవాలి గాని, వాటికి రాజకీయ అంతరార్థాలను కల్పించవద్దని - 1940లో అణాగ్రంథమాల వారు ప్రచురించిన ఈ కథల సంపుటి "నా మాట"లో రెడ్డి గారు పేర్కొన్నారు. రెడ్డి గారి కథలన్నీ చైతన్య స్ఫూర్తితో కూడి వాస్తవికతకు దగ్గరగా కనిపిస్తాయి. ఇల్లిందల సరస్వతీ దేవి గారి మాటలలో - 'మొగలాయి కథలలో నిజాం రాష్ట్రంలో ఆ కాలంలోని అధికార మదోన్మత్తులైన వారు ప్రజలను ఏ విధంగా పీడించేవారో బాగా ఎత్తి చూపించారు. అధికారుల అలసత్వముతో కూడిన గుడ్డి దర్బారును, కొందరు నవాబులలోని ఔదార్యాన్ని, అల్ప సంతోషాన్ని చిత్రించారు. వాటితో పాటు ప్రజల అసహాయతను, అమాయకత్వాన్ని చిత్రవిచిత్రంగా వర్ణించారు. నిజాం రాష్ట్రంలో అధికార భాష అయిన ఉర్దూ భాష పదాలు, ఎన్నో సామెతలు కూడా తెలుగు భాషలో కలిసి ప్రజల వాడుక భాషగా మారింది. రెడ్డి గారు అతి సహజంగా ప్రజల వాడుకభాషలో, మొగలాయి ప్రభుత్వపు వాతావరణాన్ని కల్పించి, దాని కనువైన పాత్రలను సృష్టించి కథలను రచించారు. కిచిడీ జాగీర్, బీబీ జాన్,

చద్దామంటే పుర్సత్ లేదు, బేఖూఫ్ మదార్ సాబ్, గ్యారా కద్దూ బారా కొత్వాల్ అంటూ కథలకు పేర్లుపెట్టి వాతావరణాన్ని రక్తి కట్టించారు.

కొన్ని కథలలో యువతులు మెహందీ బజారులో వేశ్యలుగా అమ్ముడు పోవటాన్ని చిత్రించారు. ఆటపాటలు నేర్చిన ఆడపిల్లలను వేలం వేయటం కూడా చూపించారు. మొగలాయి కథలలో "గ్యారా కద్దూ బారా కొత్వాల్" అనే కథలో అమాయకులైన గ్రామీణులను గ్రామాధికారులు పీడించిన విధానం వర్ణించి, ఆ గ్రామీణులందరూ తెలివితక్కువవారు కారు, వారు నవాబు గారిని కూడా దెబ్బతీయగలరని నిరూపించారు. "రంభ" అనే కథలో రంభలోని నిజాయితీని, నవాబుకు ఆమె పట్ల గల అనురాగాన్ని రెడ్డి గారు ఎత్తిచూపారు.

"గోమాజీ గణేశ్‌పీతల్ దర్వాజా" కథలో గోమాజీ గణేశ్ ఉదర పోషణార్థం పీతల్ దర్వాజా పేరుతో ఒక స్టాంపు చేయించుకొని ఊరి ముందర కూర్చొని ఊళ్ళోకి వెళ్ళే సరుకులపై వేయటం, ఆ స్టాంపు ద్వారా అతడు డబ్బు సంపాదించడం, ఆ ముద్రలేని సరుకు దొంగ సరుకుగా ప్రజలు భావించే స్థాయికి చేరడం, నవాబు కూడ ముద్రలేని సరుకును చూచి, ఆ ముద్ర గురించి విచారించడం, ఆ విచారణలో బయటి నుండి వచ్చిన సరుకుకు కరోడ్గిరి (Tax) వేయవచ్చని నిశ్చయించుకోవటం, ఈ పద్ధతిని తనకు స్ఫురింపజేసిన గోమాజీ గణేశ్‌కు నెలకు ఐదువందల రూపాయల వేతనం ఏర్పాటు చేసి, అప్పటి నుండి తన రాజ్యంలో కరోడ్గిరీని ప్రవేశపెట్టడం వంటి అంశాలు వర్ణింపబడ్డాయి. గోమాజీ గణేశ్ ఉదర పోషణార్థం అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పద్ధతి క్రమంగా ప్రభుత్వ ఖజానాకు ఆదాయ మార్గాన్ని పెంచేదిగా ఉపకరించినట్లు రెడ్డి గారు వివరించారు.

ఆ రోజుల్లో న్యాయమూర్తులు లంచాలకు ఆశించి న్యాయాన్యాయాలను ఎలా తారుమారు చేసేవారో "రుమాలను బట్టె తిని పోయింది" కథలో రెడ్డి గారు హృద్యంగా వర్ణించారు.

ఈ విధంగా ప్రతాపరెడ్డి గారు సమకాలీన సామాజిక సమస్యలకు ఉర్దూ బాహుళ్యం, తెలంగాణా మాండలికం, సున్నితమైన హాస్యం, చక్కని కథాకథనం, కథలో సారళ్యం వంటి అంశాలను మేళవించి చక్కని కథా సాహిత్యాన్ని సృష్టించి తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

# రాయలసీమ కథాచిత్రం

అబ్బిగారి రాజేంద్రప్రసాద్

ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథ, నవల, నాటికల్లాంటివి రాయలసీమలో చాలా ఆలస్యంగా ప్రారంభం కావటాన్ని చాలామంది గుర్తించే వుంటారు. 1910-45 మధ్యకాలం నాటికే కోస్తాంధ్ర ప్రాంతంలో తెలుగు కథానిక వస్తువులోనూ, రూపంలోనూ కూడా గొప్ప వికాసం పొంది వుండగా, ఆ దశలో రాయలసీమలో కథానికే ఆవిర్భవించక పోవటం కొంత వింతగా ఆధునిక జీవితం చాలా ఆలస్యంగా ప్రారంభం కావటమే ఇందుకు అసలు కారణమనిపిస్తుంది.

కోస్తాంధ్ర ప్రాంతంలో 19వ శతాబ్ది మధ్యభాగం నాటికే కృష్ణా బ్యారేజీ నిర్మాణం, నదీ జలాల వినియోగం, వ్యవసాయ సంబంధాలలో మార్పులూ, ఈ క్రమంలో తెలుగుదేశంలోని ఇతర ప్రాంతాలలో పోలిస్తే, ఆ ప్రాంతం అభివృద్ధి శీఘ్రతరమై ఉండటాన్ని గుర్తించవచ్చు. ఆ కారణంగానే అక్కడ ఆధునిక విద్య, సంఘ సంస్కరణోద్యమాలూ, రాజకీయాలూ, చిన్నపాటి పరిశ్రమలూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే ముందుగా నెలకొన్నాయి.

ఆధునిక సాహిత్య వికాసానికి మూలకారణమైన నూతన చారిత్రక శక్తులు, కోస్తాంధ్ర ప్రాంతంలో ముందుగా తలయెత్తటం వల్లనే అక్కడ ఆధునిక కథానిక ముందుగా ఆవిర్భవించింది. ప్రజా జీవితంలో విప్లవాత్మకమైన పరిణామాలు, ఆ జిల్లాలో ప్రారంభమైనందువల్లనే సాహిత్యంలో కూడా నూతన పరిణామాలు ముందుగా ప్రారంభమైనాయి.

గిడుగు, గురజాడలు వ్యావహారిక భాషోద్యమాన్ని నడుపుతున్న కాలంలో రాయలసీమ వాసులకు వ్యావహారిక భాష అంటే ఏమిటో తెలియదు. గురజాడ కన్యాశుల్కం రాసే నాటికి, రాయలసీమలో ఇంకా సంప్రదాయకవితే రాజ్య మేలుతుంది. గురజాడ ముత్యాలసరాలు కూర్చేనాటికి రాయలసీమ కవులకు మాత్రాబద్ధ ఛందస్సులో గేయకవితా ప్రక్రియే తెలియదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే పత్రికలూ, ఆధునిక విద్య, బాగా అందుబాటులోకి రావటం వల్ల రాయలసీమ ప్రాంతంలో ఆధునిక సాహిత్య సంచలనం మెల్లగా ప్రారంభమైంది.

రాయలసీమ రచయితలు భాష విషయంలో ఎదుర్కొన్న అసౌకర్యం కూడా అందుకు ఒక కారణం. అంతవరకూ సాహిత్య ప్రయోజనాలకు ఉపకరిస్తున్న గ్రాంథిక భాష ఆధునిక కథానికకు బొత్తిగా ఉపయోగపడదు. తమ ప్రాంతపు మాండలిక భాష పట్ల తమకే అనుమానం, దీనికి సాహిత్యం గౌరవం లభింపదేమోనన్న భయం. ఇక కథ రాయటానికి కొత్తగా ఒక భాషను నేర్చుకోవాల్సిన విచిత్ర పరిస్థితి ఏర్పడింది. అప్పటికే పత్రికా భాషగా రచనా భాషగా స్థిరపడి వున్న కోస్తాంధ్ర భాషను నేర్చుకొని కథలు రాయాల్సిరావటం వల్ల కూడా, రాయలసీమలో కథావేగం కొంత మందగించింది. అందువల్ల చలం, శ్రీపాద, దీక్షితులు, కుటుంబరావు, గోపీచంద్, బుచ్చిబాబు, పద్మరాజులాంటి కథకులు, ఆయా ప్రాంతాలలో విరివిగా కథలు రాస్తున్న కాలంలో రాయలసీమలో చెప్పుకోదగ్గ రచయిత ఒక్కడైనాలేడు. ఆ కారణంగా స్వాతంత్ర్యానికి పూర్వం రాయలసీమలో ఆధునిక కథానిక దాదాపు లేనట్టే.

ఆలస్యమైనప్పటికీ రాయలసీమలో కథానిక విషయంలో మంచి ప్రారంభమే జరిగింది. కె. సభాగారిని రాయలసీమ తొలితెలుగు కథకుడిగా గుర్తించవచ్చు. మధురాంతకంగారి మాటల్లో చెప్పాలంటే, రెండు బండల మధ్యగల నెరియలో నుంచి అంకురించి తన ఉనికి కోసం మనగడకోసం, ప్రకృతితో పోరాడే రావిమొక్కలా ఎదిగి శాఖోపశాఖలుగా మహావృక్షంగా విస్తరిల్లిన రచయిత కె. సభాగారు.

సభాగారి గొప్పతనం ఎక్కడుందీ అంటే, రాయలసీమ ప్రత్యేక సామాజిక, భౌగోళిక లక్షణాలను తన కథా రచన ప్రారంభ దినాలలోనే ఆయన గుర్తించగల్గటంలో వుంది. రాయలసీమ వాసులను పీల్చిపిప్పి చేస్తున్న కరువు స్వరూపాన్ని ఆయన కథాబద్ధం చేయటంలో వుంది. రాయలసీమ ప్రజల జానపద సంస్కృతీ విలాసాలకు వాళ్ళ పలుకుబళ్లకు సాహిత్య గౌరవం కల్గించటంలో వుంది. రాయలసీమలో ఒకటి రెండు సంవత్సరాలు సరిగ్గా వర్షాలు రాకపోతే తాగటానికి సైతం నీళ్లుండవు. చెరువులు ఎండిపోతాయి, బావులు అడుగంటుతాయి. చెట్లు వాడిపోతాయి. పశువులకు గడ్డి వుండదు. చేయటానికి పనులు దొరకవు. జనం తట్టాబుట్టా ఎత్తుకొని వలసలు పోతారు. సభాగారు ప్రత్యక్షసాక్షిగా ఈ దృశ్యాలన్నింటినీ తన కథల్లో చాలా వాస్తవికంగా ఎత్తిచూపించారు. ఆయన రాసిన పాతాళగంగ, అంతరంగం, ఎండమావుల్లో తిమింగలాల వేట లాంటి కథలు చదివితే ఈ విషయాలు స్పష్టమౌతాయి. రాయలసీమ రైతు నీళ్ళకోసం, బావి త్రవ్వటంలోని అనితర సాధ్యమైన

కష్టాన్ని 'పాతాళగంగ' కథలో చదివి ఎవరైనా నివ్వెరపోతారు. ఆ కథలోని రైతు బేటప్ప, తొమ్మిది మట్ల బావిని త్రవ్విన వైనం, రాయలసీమ రైతు జీవిత విషాదానికి పరాకాష్టగా భావించవచ్చు. పాఠకుడు తానే బావిని త్రవ్వుతున్నంత కష్టాన్ని అనుభూతి చెందేలా ఆయన ఆ కథ రాశారు. సభాగారి వారసత్వాన్ని స్వీకరించి, చిత్తూరు జిల్లాలో కథారచన సాగించిన వారు మధురాంతక రాజారాంగారు.

రాజారాంగారు తన కథలకు ఒక సొంపైన భాషను తయారు చేసుకున్నారు. కొంత గ్రాంథిక వాసన, కొంత శిష్టవ్యావహారికం. కొంత మాండలికం కలగలిపిన సుందరమైన భాష రాజారాంగారిది. ఆయన కథలు రాసేకాలం నాటికి, రాయలసీమలో ఆయనకు మార్గదర్శకులైన రచయిత ఒక్క సభాగారు మాత్రమే. ఆయనంత విరివిగా కథలు రాసిన రచయితలు ఇప్పటికీ రాయలసీమలో లేరు. గ్రామసీమల గురించి రాజారాంగారు రాసినన్ని కథలు బహుశా తెలుగులో ఏ రచయితా రాయలేదేమో.

రాయలసీమలో కథలు రాస్తున్న వారి సౌలభ్యం కోసం స్థూలంగా రెండు తరాలుగా మనం విభజించుకోవచ్చు. 1955-65 దశకంలో కథలు రాయటం ప్రారంభించిన వారు మొదటితరం రచయితలైతే, 1975-85 దశకం నుంచీ కథలు రాస్తున్నవారు రెండవతరం రచయితలు - ఇది ఒక రేఖా మాత్ర విభజనే.

మొదటితరం రచయితల్లో కె. సభా, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, పులికంటి, ఆర్.ఎస్. సుదర్శనం, వల్లంపాటి, ఆర్. వసుంధరాదేవి, బి. నాదమునిరాజు, రా.రా. సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి, పి. రామకృష్ణారెడ్డి, వై.సి.వి. రెడ్డి మొదలగు వారు చేరుతారు.

రెండవతరం రచయితల్లో డా॥ కేశవరెడ్డి, డా॥ లంకిపల్లె, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, నామిని, వీరపల్లె వీణాపాణి, వి.ఆర్. రాసాని, సింగమనేని, దేవపుత్ర, స్వామి, శాంతినారాయణ, సన్నపురెడ్డి, పాలగిరి విశ్వప్రసాద్, దాదా హయాత్, కుప్పిరెడ్డి, చిదంబరరెడ్డి, జి.ఆర్. మహర్షి, శ్రీనివాసమూర్తి, తుమ్మల రామకృష్ణ, రాప్తాడు గోపాలకృష్ణ సుందరరాజు మొదలగువారు వస్తారు. వీరిలో ఇటీవల కథ రచన ప్రారంభించిన వారు కూడా కొందరు లేకపోలేదు.

అనంతపురం, కర్నూలు జిల్లాల్లో మొదటితరం రచయితలు దాదాపు లేరనే చెప్పవచ్చు. అనంతపురం జిల్లాలో జి. రామకృష్ణ అనే జర్నలిస్టు 1943 ప్రాంతంలో

చిరంజీవి అన్న చిన్న కథనూ 1952 ప్రాంతంలో గంజికేంద్రం అన్న ఒక వాస్తవిక జీవన కథను రాశారు. అయితే ఆయన ఆ తర్వాత, ఒకటి రెండు కథలు మాత్రమే రాసి విరమించుకున్నారు.

రాయలసీమలో మొదటితరం కథా రచయితలు కథలు రాయటం ప్రారంభించిన కాలంలో, రాయలసీమ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే కొన్ని సంగతులు స్పష్టమవుతాయి. అప్పట్లో రాయలసీమ రైతులంతా కపిలబానలతో బావులనుండీ నీళ్ళు తోడి వ్యవసాయం చేసేవాళ్ళే. విస్తారంగా మెట్టభూములు ఉన్నప్పటికీ అందులో సాగు అంతంత మాత్రమే. పట్టా భూములకంటే శివాయి సాగు భూములే ఎక్కువ. వ్యవసాయం ప్రధానంగా అగ్రకులాల (రెడ్డి, కమ్మ) అధీనంలో ఉండేది. వర్షాధారం పంటలవల్ల ఆసక్తి చాలా తక్కువగా ఉండేది. భూములు విస్తారంగా ఉన్నప్పటికీ భూస్వాములు చాలా తక్కువ. వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ బావుల్లో నీటిమట్టం కొద్దో గొప్పో వుండేది. రెండు మూడేళ్ళ కొకసారి కరువులు వస్తున్నప్పటికీ ప్రజలు నిశ్శబ్దంగా కరువును అనుభవించేవాళ్ళు. ఏ పల్లెకూ కరెంటు లేదు. కాస్త సంపన్న మధ్య తరగతి వర్గం ఆయిల్ ఇంజన్లు ఉపయోగించి బావుల నుండి నీళ్ళు తోడేవాళ్ళు. అప్పట్లో ఆయిల్ ఇంజనే ఒక గొప్ప అద్భుతం. బావుల కింద సేద్యం నిరాఘాటంగా సాగుతూండటం వల్ల, వర్షాలు రాక మెట్టపంటలు అదృశ్యమైనా, తిండిగింజలు ఓ మేరకు పండిస్తూ జీవనం ఈడ్చేవాళ్లు. వర్షాలు కూడా అప్పట్లో ఇప్పుడంతగా అన్యాయం చెయ్యలేదు. అందువల్ల ఇప్పుడున్నంత నీటి స్పృహ అప్పట్లో రైతుకు వుండేదికాదు. వాణిజ్య పంటలు ఇంకా రైతు దృష్టిని ఆకర్షించటం లేదు. భూమికి చెప్పుకోదగ్గ విలువ లేదు.

కమ్యూనిస్టు సిద్ధాంతాలూ, పత్రికలూ, సభలూ, సమావేశాలు మేధావి వర్గాన్ని ప్రభావితం చేయటం ప్రారంభమైంది. మధ్యతరగతి యువకుల్లో అప్పుడప్పుడే ఆదర్శభావాలు మొలకెత్తుతున్నాయి.

ఈ సామాజిక నేపథ్యంలో అప్పటి రచయితలు తమ కథా రచనను ప్రారంభించారు. రచయితలందరూ గ్రామీణ కుటుంబాల నుంచీ వచ్చిన వాళ్లు కావటం వల్ల కూడా వాళ్ళ గ్రామీణ మధ్య తరగతి జీవితం ప్రధానంగా చోటు చేసుకొనింది. మధ్యతరగతి జీవితమే వాళ్ళ కథలకు ప్రధాన ఇతివృత్తమైపోయింది. మధ్యతరగతి ప్రజల నిత్యనైతిక కర్మలూ, పంటలూ, పండుగలూ, పబ్బాలూ, పిల్లలు చదువులూ, ప్రేమలూ, పెళ్ళిళ్లూ, ఉద్యోగాలూ, ఆదర్శాలూ, పట్టణ నాగరికత,

ఇలాంటి వస్తువులతో రచయితలు కథలు రాశారు. రా.రా. సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి లాంటి రచయితలు మధ్యతరగతిని ప్రధానంగా ఆర్థిక దృష్టి నుండి పరిశీలించారు. మార్క్సిస్టు భావజాలంతో ప్రభావితులైనవాళ్లు కావటం వల్ల వారి కథల్లో బౌద్ధికమైన సంఘర్షణ కూడా చోటు చేసుకుంది. మధురాంతకం, కలువకొలను లాంటి రచయితలు, భిన్న సామాజిక వ్యక్తిత్వాల గురించి, వైయక్తిక దృష్టితో జీవన వైవిధ్యాలను తమ కథల్లో ప్రతిబింబించారు. ప్రాంతీయమైన, భౌగోళికమైన విలక్షణతను, రాయలసీమవే అయిన ప్రత్యేక సమస్యలను, సభా, కేతు విశ్వనాథరెడ్డి గారు తప్ప ఎక్కువ మంది కథకులు అప్పట్లో పట్టించుకోలేదు.

రాయలసీమ తొలితరం రచయితలు. వస్తువుతో పాటు, కథా నిర్మాణంలో కూడా చాలా జాగ్రత్తను కనబరిచారు. కొడవటిగంటితో ప్రభావితులైన రా.రా. సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి లాంటి కథకులు నిరాడంబరమైన, నిరలంకారమైన శైలిలో కథలు రాశారు. అనవసరమైన వర్ణనల జోలికి పోకుండా, అనవసరమైన నాటకీయతను చొప్పించకుండా, కథలో పెద్ద మలుపులు లేకుండా, సూటిగా చెప్పటం వీరి కథాశిల్పంలోని ప్రత్యేకత. పాత్రల స్వభావాలను రచయితలే పనిగట్టుకొని చెప్పకుండా, వారి ప్రవర్తన, సంభాషణల ద్వారా వ్యక్తీకరించటం, కథా రచనలో వీరు పాటించిన సంయమనం. - చిత్తూరు జిల్లా కథకుల శైలి వీరి శైలి కంటె భిన్నమైనది. సుందరమైన, లలితమైన పదాల పోహళింపుతో, మనోజ్ఞమైన వర్ణనలతో, పొందికైన వాతావరణం మధ్య వయ్యారంగా నడుస్తుంది వీరి రచనా శైలి. అయితే వస్తువును మింగివేసే శైలీ వైదగ్ధ్యాన్ని వీళ్లెవరూ ప్రదర్శించలేదు. రాయలసీమ వాసులకు సహజమైన భోళాతనం వీరి శిల్పంలో కన్పిస్తుంది. నుడికారాలూ, సామెతలూ, లోకోక్తులూ, వీళ్ల కథల్లో విరివిగా చోటు చేసుకున్నాయి. ఈ తరం రచయితలెవ్వరూ తమ కథల్లో మాండలిక భాష పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరచకపోవటం గమనార్హం.

రెండవతరం రచయితలు కథలు రాసేనాటికి, రాయలసీమలో చెప్పుకోదగ్గ మార్పులు చాలానే వచ్చాయి. స్కూళ్లూ, కాలేజీలు, బహుళ సంఖ్యలో పెరిగాయి. సెకండరీ స్థాయి వరకూ ఉచిత విద్య లభించటం వల్ల మధ్యతరగతి విద్య అందుబాటులోకి వచ్చింది. ప్రతిపల్లెకూ కరెంటు వచ్చింది. పల్లెపల్లెకూ రవాణా సౌకర్యాలు ఏర్పడ్డాయి. కపిలమోటల స్థానంలో కరెంటింజన్లు వచ్చాయి. కొంతకాలం గడిచే సరికి గొట్టం బావులు వచ్చాయి. ఇంతకు మునుపు శ్రమను పెట్టుబడిగా

మార్చి పంటలు పండించే రైతులు ఇప్పుడు డబ్బును పెట్టుబడిగా చేసి వ్యవసాయం చేయటం వల్ల క్రమంగా చితికిపోతున్నారు. డబ్బు చేతిలో ఉంటే తప్ప సేద్యం చేయటం సాధ్యంకాని పరిస్థితి వచ్చింది. ఈ దశలోనే రైతులకు వాణిజ్య పంటల పట్ల ఆసక్తి పెరిగింది. భూమికి విలువ పెరుగుతూ వచ్చింది. బీడుగా వున్న వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వచ్చాయి.

ఈ పరిస్థితులు ఇట్లా వుండగా పల్లెల్లో ఓట్ల రాజకీయాల జోరు క్రమంగా పెరిగింది. ఓట్ల కోసం రాజకీయ నాయకులు అమాయకపు పల్లెల్ని రెండు వర్గాలుగా చీల్చటం ప్రారంభించారు. కులం మునుపెన్నడూ లేనంతగా పడగనిప్పింది. ఫ్యాక్షన్ పెరిగింది. ముఠాలు పెరిగాయి. వ్యక్తిగతంగా సైన్యాన్ని నడుపుకొనే ఫ్యాక్షన్ రాజకీయనేతలు పుట్టుకొచ్చారు. ఫ్యాక్షన్ రాజకీయాలలో పల్లెలు అగ్నిగుండాల్లా మారిపోసాగాయి. బాంబుల పేరే తెలియని మారుమూల పల్లెటూళ్లలో కూడా దీపావళి బాణసంచాల్లా బాంబులు పేలుతున్నాయి. ఫ్యాక్షన్ రాజకీయాల్లో చిక్కుకుని చాలా కుటుంబాలు ధ్వంసమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లోనయితే ఊళ్లకు ఊళ్లు బూడిదయ్యాయి. ఈ ఫ్యాక్షన్ నాయకులకు అండగా ఒక లంపేన్ కిరాయి గుండావర్గం పెరగసాగింది. మద్యం చాలా సహజ పానీయమైంది.

ఇక రైతాంగసమస్యల్ని కరువు తీవ్రతనూ పాలకవర్గాలు పట్టించుకోవటం లేదు. కరెంటు రేట్లూ, ఎరువుల ధరలూ, మందుల ధరలూ ఎప్పటికప్పుడు విపరీతంగా పెరిగిపోవటంతో, ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత రైతాంగంలో పెరిగింది. పాలక పక్షాలకు వ్యతిరేకంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని కసిగా మార్చే స్థితికి ప్రజల చైతన్యం చేరుకుంది. తాగునీటికోసం, సాగునీటికోసం కొద్దిగానైనా సంచలనం ప్రారంభమైంది.

ఈ దశలోనే పట్టణీకరణ కూడా ఎక్కువైపోయింది. ఒక కొత్త నడమంత్రపుసిరి వర్గం (కాంట్రాక్టుర్లు, రియల్ ఎస్టేట్‌దార్లు, కార్పొరేషన్లు నడిపేవాళ్లు) సమాజంలో వేళ్ళూనుకుంది. ఈ వర్గానికి నీతి, సామాజిక విలువల వంటివేవీ పట్టవు. కేవలం డబ్బు సంపాదనే ప్రధానధ్యేయం.

ఇది ఇలా వుండగా విద్య చాలా వేగంగా వ్యాపార రంగమై స్థిరపడి పోయింది. ఆంగ్లభాషపై అలవిగాని వ్యామోహాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు పెంచి

పోషించాయి. ఉన్నతవిద్య అంటే, ఇంజనీరింగ్, మెడిసన్ అన్న మిథ్యా విలువలు మధ్యతరగతి వర్గంలో పాతుకుపోయాయి. ఎంత చదువు చదివినా ఉద్యోగాల విషయానికొచ్చేసరికి అవి ఎండమావుల్లా దూరదూరంగా పరుగెత్తుతున్నాయి. యువతలో భవిష్యత్తుపట్ల భయం, నైరాశ్యం పాదుకుంటున్నాయి. ఉన్నత ఆదర్శాలు పెంచుకున్న యువకుల్లో కూడా స్తబ్ధత పెరిగిపోయింది.

ఈ రాయలసీమ సామాజిక చిత్రాన్ని రెండవతరం కథా రచయితలు, తొలితరం కథకులతోపాటుగా, ఒక క్రమపరిణామంలో తమ కథల్లో చిత్రించుకుంటూ వస్తున్నారు. మారుతున్న రాయలసీమ సామాజిక సంక్లిష్ట పరిస్థితుల మధ్య కొన్ని కొత్త వస్తువులను ఈ కథకులు తమ కథల్లో తీసుకువచ్చారు. ప్రాకృతికంగా రాయలసీమ అనుభవిస్తున్న భౌగోళిక దురన్యాయాన్ని తమ కథల్లో చిత్రించటం ప్రారంభించారు. కరువు, తాగునీటి సమస్య, సాగునీటి సమస్య, పంటలు పండకపోవటం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవటం, దళారీల దోపిడీ ఇవన్నీ కథావస్తువులయ్యాయి. రాయలసీమ ప్రత్యేక సామాజిక, సాంస్కృతిక లక్షణాలను ఈతరం రచయితలు స్పష్టంగా గుర్తించారు.

స్వామి రాసిన నీళ్ళు, వానరాలే కథలూ, దాదాహయాత్ రాసిన గుక్కెడునీళ్లు, సన్నపురెడ్డి రాసిన తడి, కేతువిశ్వనాథరెడ్డి రాసిన వానకురిస్తే, నమ్ముకున్ననేల, సింగమనేని రాసిన ఊబి, విముక్తి, చక్రవేణు రాసిన కసాయి కరవు, శాంతి నారాయణ రాసిన కల్లమయిసాయ, మహేంద్ర రాసిన ప్రతిజ్ఞలాంటి ఎన్నో కథలు ఈ పరిస్థితులను ప్రతిబింబించాయి.

దాదాహయాత్ రాసిన గుక్కెడునీళ్లు కథ గమనించండి. ఒక ముసలిదాని దాహార్తి తీర్చదానికి ఒక పదేళ్ల పసిపిల్ల చెంబుడు నీళ్లకోసం, రెండు మైళ్లు నడిచి, ఒక కోనేరులో చెంబు ముంచబోయి జారిపడి, ఆ కోనేరులోనే చచ్చిపోయిన దారుణదృశ్యం గుండెలమీద గుండు ఎత్తుతుంది.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన "తడి" కథ ఇదే సమస్యను మరికొంత దూరం తీసుకుపోతుంది. ఈ కథలోని సమస్య సాగునీటి సమస్య. అయితే ఈ కథ నీటి సమస్య దగ్గరే ఆగిపోదు. ఎంతో సన్నిహితంగా, ఆత్మీయంగా ఉండాల్సిన అన్నదమ్ముల మధ్య వాళ్ల కుటుంబాల మధ్యగల సహజమైన ప్రేమ సంబంధాలను నీటి సమస్య ఎలా ఛిద్రం చేస్తుందో ఈ కథ చూపెడుతుంది.

"ఒక్క వానకురిస్తే చాలు తండ్రీ! బతికి బయటపడతాము" అనుకుంటూ ఆకాశంలో మబ్బులకేసి చూసి అమాయకపు రైతు ఎదురుచూపులను వానకురిస్తే కథలోనూ, వానలు కురవక, పంటలు పండక, అప్పుల బాధ భరింపలేక, తాను నమ్ముకున్న నేల తన్ను దగా చేస్తే, దాన్ని తెగ నమ్ముకున్న నిస్సహాయరైతు వేదనను, నమ్ముకున్న నేల కథలోనూ, చూడవచ్చు. మడికి తడిపెట్టడానికి నీళ్లు చాలక, అత్యవసర పరిస్థితుల్లో, అప్పటికప్పుడు అప్పుచేసి బోరువేయిస్తే నీళ్ళకు బదులు బండపడి విలవిలలాడిపోయిన, చిన్నకారు రైతు దయనీయస్థితికి సింగమనేని నారాయణ రాసిన ఊబి కథలో గమనించవచ్చు. కరవు దంష్ట్రలకు చిక్కి, మేపటానికి గడ్డిలేక పశువులను కసాయివాళ్లకు అమ్ముకున్న బీభత్సాన్ని చక్రవేణు కసాయి కరవులో దర్శించవచ్చు.

శాంతినారాయణ, "దళారీ" కథలో ఒక మధ్యతరగతి రైతు తాను పండించిన ఉల్లిగడ్డలను మార్కెట్‌కు తోలితే మార్కెట్ వ్యాపారులు, లారీ బ్రోకర్ ఆఫీసువాళ్లు, ఒక పద్ధతి ప్రకారం ఎలా దగా చేశారో. "ఔరా! ఎంతమోసం" అనిపించే తీరులో చాలా సహజంగా చెబుతాడు.

ఇంకా రాయలసీమ రైతు అంతరంగాన్నీ అతనికి భూమితోగల అనుబంధాన్నీ అతడి జీవన విన్యాసాన్నీ ఆలోచనా విధానాన్ని ఆవిష్కరించిన కథలు వర్తమాన దశాబ్దంలో చాలానే వచ్చాయి. దేవపుత్ర మన్నుతిన్న మనిషి, సన్నపురెడ్డి కొత్తదుప్పటి, స్వామి వానరాలే - ఇలా ఎన్నయినా ఉదాహరించవచ్చు. రాయలసీమ రైతు జీవన సంచలనాన్ని చిత్రించిన 18 మంది కథకుల కథలు గల సీమకథల సంకలనం ఈ దశలోనే వెలువడింది.

ఈ చిత్రణంతా ఒక కోణం అయితే, మరో కోణం రాయలసీమలోని ముఠా కక్షలు, ఫ్యాక్షనిజం, హింసా రాజకీయాలు. అవి జనజీవితంలో సృష్టిస్తున్న అలజడి, సంక్షోభమూ. వీటిని కథల్లో చిత్రించటానికి సామాన్యమైన అనుభవమూ ప్రతిభా చాలదు.

తొలితరం కథకులైన వై.సి.వి. రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి గార్లు రెండు దశాబ్దాల కిందటే రాయలసీమ ముఠాకక్షల నేపథ్యంలో రాసిన కథలు గమనించదగ్గవి. వై.సి.వి. రెడ్డి ఐదు రూపాయలు కథలోనూ, విశ్వనాథరెడ్డి కూలిన బుజువు కథలోనూ ఈ ఛాయలు మనం చూడవచ్చు !

పాలగిరి విశ్వప్రసాద్ రాసిన కరవూ వచ్చె - కచ్చలూ వచ్చె కథ కడప జిల్లాలోని గ్రామకక్షలకు సాక్ష్యమిచ్చే కథ. వర్షాలు లేక ఒక ప్రక్క పైర్లు ఎండిపోతూవుంటే, ఆ ఎండిన పైరును మరో ప్రక్క దొంగగొడ్లు మేయటానికి, ప్రయత్నిస్తూ వుంటాయి. కనీసం ఆ పైరునైనా రక్షించుకోవటానికి గ్రామస్తులు కాపలా ఏర్పాటు చేసుకోవాలనుకుంటారు. అందుకోసం ఒక సమావేశం ఏర్పాటు చేసుకుంటారు గ్రామస్తులు. ఆ గ్రామం మొదటినుండీ కక్షలకు నిలయం. అందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న ఆ సమావేశంలో మాటామాటా పెరిగి పాతకక్షలు భగ్గుమంటాయి. బాంబులు పేలుతాయి. హత్యలు జరుగుతాయి. కేసులౌతాయి. అసలు సమస్య గాలికిపోయి ఒకర్ని ఒకరు చంపుకోవటమే లక్ష్యంగా చెలరేగుతారు. కక్షలకూ కరువుకూ గల సంబంధాన్ని ఈ కథలో కథకుడు వివరించే ప్రయత్నం చేస్తాడు. ఈ కథ చివర రామిరెడ్డి భార్య వీళ్ల కక్షా రాజకీయాలను అసహ్యించుకుంటూ వేసిన ప్రశ్నలో రచయిత కంఠస్వరం వినిపిస్తుంది. జాగ్రత్తగా అధ్యయనం చేయాల్సిన మంచి కథ ఇది !

ఇలాంటి వాతావరణాన్నే గమనించవచ్చు పి. రామకృష్ణారెడ్డి రాసిన ఎలిగే పెద్దోళ్లూ - నలిగే సన్నోళ్లూ కథ చాలా స్పష్టంగా కడపజిల్లా ముఠా కక్షల్ని అందులో బలియైపోతున్న బలహీనవర్గాల ఆక్రోశాన్ని ప్రతిబింబించింది.

ఫ్యాక్షనిస్టువల్ల వాళ్ల స్వంత కుటుంబాల్లోని స్త్రీలు సైతం ఎలాంటి మానసిక అశాంతికి, సాంఘిక అసౌకర్యానికి గురౌతున్నారో శాంతినారాయణ రాసిన గర్భస్రావం కథలో గమనించవచ్చు. ఈ మధ్యనే కర్నూలు జిల్లా నుండి ఫ్యాక్షన్ కథలు అన్న పేరుతో మూడు కథల చిన్న సంకలనం వచ్చింది. తుమ్మల రామకృష్ణ శ్రీనివాసమూర్తి, రాప్తాడు గోపాలకృష్ణ రాసిన ఈ కథల్లో గ్రామీణ వాతవరణంలో, కుటుంబ సంబంధాలలో ఎలాంటి అవాంఛనీయ ధోరణులు, ఈ ఫ్యాక్షనిజం కారణంగా విస్తరిస్తున్నయో మనం చూడవచ్చు. ఇటీవలే వచ్చిన మధురాంతకం రాజారాంగారి 'గాలివీడు నుండి న్యూయార్క్ దాకా' అన్న కథ చిత్తూరు జిల్లా ఫ్యాక్షనిజం నేపథ్యంలో రమణీయంగా నడచిన కథ.

రాయలసీమ ప్రత్యేక సామాజిక అంశాలతో కథలు రాసిన వారిలో ప్రత్యేకించి చెప్పుకోదగ్గ మంచి రచయిత నామిని. ఆత్మకథా మాలికలుగా నామిని ఈ కథా చిత్రాలు చిత్రించినప్పటికీ, కథా శిల్పానికి అతని కథలు ఒదగక పోయినప్పటికీ, చిత్తూరు జిల్లా గ్రామీణ జీవనంలోని శ్రమజీవన సౌందర్యమూ, ఆ

ప్రాంతపు విశిష్ట జానపద సంస్కృతీ సౌరభమూ, కళాత్మకమైన నిర్మాణంలో పాఠకుణ్ణి ముగ్ధుణ్ని చేస్తాయి. ఇంకా పులికంటి కృష్ణారెడ్డి, వీరపల్లె వీణాపాణి, మహేంద్ర, నరేంద్ర, వి.ఆర్. రాసాని, డా॥ లంకిపల్లె రాసిన కథల్లో స్థలకాలాల చైతన్యాల్ని మనం గమనించవచ్చు. నరేంద్ర రాసిన అత్యాచారం, కాకులూ గ్రద్ధలూ, నాలుగు కాళ్ళ మండపం కథలూ, మహేంద్ర రాసిన ముసలమ్మ మరణం, జర్తె కథలూ, ఆ ప్రాంతపు జీవితాన్ని పాఠకుడి ముందు పరుస్తాయి. డా॥ లంకిపల్లె రాసిన కథలన్ని కూడా వ్యావసాయిక జీవితానికి సంబంధించినవే కావటం ఒక విశేషం.

దళితవాదం తెలుగు కథాసాహిత్యంలో వేర్లూనుకుంటున్న ఈ దశలోనే, రాయలసీమ నుండి ఈ ధోరణితో ప్రత్యేక ప్రాదేశిక లక్షణాల నేపథ్యంలో మంచి దళిత కథలు పుట్టుకొచ్చాయి. కేవలం వాదం కోసం అల్లిన కథలుగా కాకుండా సామాజిక మూలాల నుండి త్రవ్వి తీసిన కథలుగావటం వీటి ప్రత్యేకత. మాల మాదిగల శ్రమజీవన మూలాల నుండే, అగ్రవర్ణాల ఆస్తులూ, ఆరోగ్యమూ అభివృద్ధి చెందుతున్నాయి. సన్నపురెడ్డి చనుపాలు కథలో వర్తమాన గ్రామ జీవిత నేపథ్యంలో వివరిస్తాడు. బి.సి.లను కూడా దళితులుగా సంభావించటంలోని ఔచిత్యాన్ని ధ్వనిపూర్వకంగా ప్రశ్నిస్తుంది స్వామి రాసిన ప్రశాంతం కథ. . . ఒక హరిజనుడు మంత్రి అయినప్పటికీ అగ్రవర్ణాల చెప్పుచేతుల్లో ఉండటంలోని అనివార్యతను నిరూపిస్తుంది. శాంతినారాయణ ఉక్కుపాదం కథ . . . . రాయలసీమ పల్లెల్లో హరిజనులకు ఇప్పటికీ దేవాలయ ప్రవేశం జరగటంలో అస్పృశ్యతను అగ్రవర్ణాలు పాటించటాన్ని వివరిస్తుంది. సింగమనేని మకరముఖం కథ. ఇంకా దేవపుత్ర రాసిన విలోమం, ఔషధం సమిధలు కథలూ, స్వామి రాసిన తల్లిమట్టి ఒక హెచ్. సరస్వతి కథలూ సన్నపు రెడ్డి అంటు, పాలగిరి విశ్వప్రసాద్ చెప్పు కింద పూలు, దాదాహయాత్ ఎలువు పేర్కొనదగ్గ మంచి కథలు. ఈ మధ్యనే వచ్చిన నాగప్పగారి సుందరరాజు రాసిన మాదిగోడు కథలు ప్రత్యేకంగా పరిశీలించాల్సిన చక్కని కథలు.

రాయలసీమ కథకులు స్పృశింపని సామాజిక రంగాలు కొన్ని మిగిలేవున్నాయి. పారిశ్రామిక రంగం గురించి, రాజకీయ రంగం గురించి ఇక్కడి కథకులు కథారచనను ఇంకా ప్రారంభించవలసి ఉంది. ఇంకా స్పష్టమైన కంఠస్వరాన్ని వర్తమానంలో రాస్తున్న యువ కథకులు సాధించాల్సి వుంది. సామాజిక వాస్తవికతకు దూరం గాకుండా, తెలుగు కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేయటంలో రాయలసీమ కథకుల పాత్ర ఎంతో విస్పష్టమైనది, విశాలమైనది.

# గురజాడ కథానికలు - సామాజికత

డా॥ వి. వీరాచారి

ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒకటి. ప్రక్రియలకు సంబంధించిన చర్చ జరుగుతున్నపుడు సాధారణంగా కథా - కథానిక అంశాలకు సంబంధించిన ప్రస్తావన తప్పనిసరిగా ఉంటుంది. ఈ రెండు పదాలను కొందరు పర్యాయపదాలుగానే భావిస్తారు. మరికొందరు Story అనే పదానికి 'కథ'ను, Short - Story అనే పదానికి చిన్న కథ లేదా కథానిక అనే పదాలను తరచుగా వాడుతుంటారు. ఇది రూపానికి సంబంధించిన అంశం. ప్రాచీన సాహిత్యంలో కూడా ఈ అర్థంలో ఆఖ్యానం (కథ) ఉపాఖ్యానం (చిన్న కథ) అనే మాటలు వ్యవహారంలో ఉన్నాయి.

కురుపాండవులకు సంబంధించిన మహాభారత కథలో, ఉదంకోపాఖ్యానం, శకుంతలోపాఖ్యానం వంటి చిన్న చిన్న కథలు ప్రధాన కథలో అంతర్భాగంగా అనేకం వున్నాయి. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యానికి సంబంధించిన ఆఖ్యానం, ఉపాఖ్యానం అనే మాటలకు, ఆధునిక సాహిత్యానికి సంబంధించిన కథ, కథానిక అనే మాటలకు స్వరూపదృష్ట్యా కొంత పోలిక వుంటే ఉండవచ్చు. కానీ స్వభావదృష్ట్యా స్పష్టమైన తేడా వుంది. ఈ తేడాను మనం గుర్తించినప్పుడు మాత్రమే గురజాడ కథానికలను అర్థం చేసుకోగలుగుతాం.

తెలుగులో లిఖిత సాహిత్యాన్ని ప్రారంభించిన నన్నయ మహాభారత కథ స్వరూప - స్వభావాలను వివరిస్తూ

**ఏయది హృద్య? మపూర్వం**
**బేయది? యెద్దాని వినిన నెఱుక సమగ్రం**
**బైయుండు? నఘ నిబర్హణ**
**మేయది? యక్కథయవినఁగ నిష్టము మాకున్** (ఆది. ప్ర.ఆ. ప. 30)

అన్నాడు నైమిశారణ్యంలో శౌనకాది మహామునులు కథ చెప్పమని సూతుణ్ణి అడిగిన సందర్భంలోనిది ఈ పద్యం. ఇందులో కథకు సంబంధించిన నాలుగు అంశాలు వున్నాయి. అవి 1. హృద్యం 2. అపూర్వం 3. ఎరుక 4. పాపపరిహరణం. స్థూల

దృష్టితో చూస్తే ఈ నాలుగు పదాలు వేరు వేరు అంశాలకు సంబంధించినవి అనే భావన కలుగుతుంది. పూలదండలోని పూలు భిన్నమైన నాలుగు రంగులకు చెందినవైనప్పటికి వాటిని ఒకటిగా కట్టి వుంచే దారం ఒక్కటే కదా ! సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ఇవీ అలాగే.

ఆధునిక తెలుగు కథానిక రచనకు ఆద్యుడైన గురజాడ కథానికల్లో కూడా ఈ నాలుగు అంశాలు మనకు కనిపిస్తాయి. కాకపోతే కథలోని వస్తువు, భావం, సమకాలీనమై శిల్పపరంగా వైవిధ్యాన్ని కలిగివుంటాయి అన్నది వాస్తవం.

గురజాడ కథల్లో వుండే ఈ విశిష్టతను అర్థం చేసుకోవాలంటే ఆధునిక సామాజిక స్వరూప స్వభావాలు మనకు తెలిసి ఉండాలి. వలసవాద పాలన, ఆంగ్ల విద్యా ప్రవేశం, విశ్వవిద్యాలయాల స్థాపన, రైలు, బస్సు వంటి ఆధునిక రవాణ సౌకర్యాల వాడకం. ఆనకట్టల నిర్మాణాలు - ఇత్యాదులన్నీ భారతీయ సామాజిక జీవితంలో అనుహ్యమైనటువంటి మార్పులను తీసుకొచ్చాయి. మధ్య యుగాల్లో యూరప్‌లో పొడసూపిన సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాల ప్రభావం. శాస్త్ర పరిశోధనల ఫలితంగా గత విశ్వాసాలు, నమ్మకాలు వెరసి సంప్రదాయాలు ప్రశ్నలకు గురి అయ్యాయి. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే క్రమంలోనే భారతదేశంలో ఆధునికత పొడసూపింది. ఫలితంగా ఈ దేశంలో సామాజిక జీవితంలోని వైవిధ్యాలు, వైరుధ్యాలను, సమస్యలను 'కర్మ'తో ముడిపెట్టడంతో సరిపెట్టుకొనే 'ధోరణి' పోయి వాటికి కారణాలను అన్వేషించే ఉత్సుకత, జిజ్ఞాస, పరిశోధనాత్మకదృక్పథం అలవడినాయి. సమకాలిక స్పృహతో ఎదిగిన గురజాడలో కూడా మనకు ఈ లక్షణాలు కన్పిస్తాయి. ఆయన రచనల్లో అవి ప్రతిఫలించాయి.

విశాఖపట్నం జిల్లా, ఎలమంచిలి తాలూకా, రాయవరం గ్రామంలో మతామహుల ఇంట్లో 1862 సెప్టెంబర్ 21న పుట్టిన గురజాడ, బి.ఏ పట్టం పుచ్చుకునే వరకు వ్యావహారిక భాషా ఉద్యమకర్త, చరిత్ర అధ్యాపకులు అయిన గిడుగురామమూర్తితో కలిసి విజయనగరంలో చదువుకున్నాడు. 1884లో విజయనగరం మహారాజా కాలేజి, హైస్కూళ్ళలో ఉపాధ్యాయునిగా, ఆంగ్ల ఉపన్యాసకునిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి విజయనగర సంస్థానం దివానుగా ఎదిగారు. 1882 నుంచే మెట్రిక్యులేషన్ చదువుతున్న రోజుల్లోనే ఆంగ్లకవితలు రాయడం ప్రారంభించిన గురజాడ 1892లో కన్యాశుల్కం అనే సాంఘిక నాటకం

రాసి, అదే సంవత్సర ఆగస్టు నెల 13వ తేదిన ప్రదర్శింప చేశారు. ఇది మొదటి కూర్పు. 1909లో రెండవ కూర్పును కూడా ప్రచురించారు. కొండుభట్టీయం, నీలగిరిపాటలు, ముత్యాల సరాలు వంటి రచనలు చేశాడు. తన చిన్ననాటి ప్రాణ స్నేహితుడైన గిడుగు రామ్మూర్తిపంతులు ప్రారంభించిన వ్యావహారిక భాషా ఉద్యమానికి తన రచనల ద్వారా జవసత్వాలను కలిగించిన గురజాడ తన జీవితపు చివరి దశలో కథానిక రచనకు పూనుకున్నాడు.

మచిలీపట్నం నుండి వెలువడుతున్న "ఆంధ్రభారతి" పత్రికలో ఫిబ్రవరి 1910లో గురజాడ రాసిన మొదటి కథానిక దిద్దుబాటు ప్రచురణ పొందింది. అదే సంవత్సరం అదే పత్రికలో ఏప్రిల్, మే, జూన్ సంచికల్లో "మనుషులు చేసిన దేవుల్లారా ! దేవుడు చేసిన మనుషుల్లారా ! మీ పేరేమిటి ! కథ ప్రచురింపబడింది. ఆ తరువాత 'సంస్కర్త హృదయం' మెటిల్డా, మతం – విమతం (పెద్ద మసీదు) అనే కథలను గురజాడ రాశారు. గురజాడ రాసిన ఈ ఐదు కథానికల్లో "మీ పేరేమిటి", సంస్కర్త హృదయం కథానికలు పెద్దవి. Stooping to Raise పేరుతో గురజాడ ఆంగ్లంలో రాసిన కథానికను అవసరాల సూర్యారావు 'సంస్కర్త హృదయం' పేరుతో తెలుగులో అనువదించారు. ఈ కథానిక 'భారతి' సాహిత్య మాస పత్రికలో ప్రచురణ పొందింది.

గురజాడ రచనల్లో ప్రధానంగా రెండు సామాజిక ప్రయోజనాలు కనిపిస్తాయి. ఆనాడు కందుకూరి వీరేశలింగం పంతులు ప్రారంభించిన సంఘ సంస్కరణ ఉద్యమాల్లోని లొసుగులను ఎత్తి చూపుతూ ఆ ఉద్యమాలకు పటిష్ఠతను కలిగించే స్ఫూర్తినివ్వటం మొదటి ప్రయోజనం. సాహిత్య ప్రయోజనం సామాన్యులకు కూడా కలగాలని గిడుగు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమానికి ఊతమిస్తూ ప్రజాస్వామ్య భావాలు, విస్తరింప చేయడం రెండో ప్రయోజనం. ఈ రెండు ప్రయోజనాలను ఆశించే గురజాడ రచనలు చేశాడు కాబట్టే ఆయన రచనల్లో సమాజంలోని మనుషులు, వారి మనస్తత్వాలు, వాళ్లు మాట్లాడుకొనే సహజ భాష మనకు కనులకు కట్టినట్లు కన్పిస్తాయి. ఎక్కడ కృత్రిమత్వం వుండదు. మనుషులు – సామాజిక బంధాలు తప్ప రచయిత పెట్టుకొన్న సంస్కారాలు ఎక్కడా గురజాడ రచనల్లో కనిపించవు. ఇంతకు మించిన సామాజికత ఏముంటుంది.

"అందరూ అన్ని విధాల సమానం కాకపోవచ్చు. కానీ, మానవులందరూ సమానమే" అన్నారు హ్యారైట్ స్కెల్. కులాలకు మతాలకు అతీతంగా ఆడమగతేడాలకు, ప్రాంతీయ భేదాలకు దూరంగా ఉండే వారిలో మాత్రమే ఈ జ్ఞానం ఉంటుంది. ఇదే సామాజిక స్పృహ. ఈ స్పృహ వున్న రచయితలు సమాజంలోని వైవిధ్యాలను, వైరుధ్యాలను విశ్లేషిస్తూనే 'మనిషికి పట్టం గడతారు. మానవత్వ విలువలకు ప్రాధాన్యత ఇస్తారు. గురజాడ కథానికలను పరిశీలిస్తే ఈ వాస్తవం ద్యోతకమవుతుంది.

గురజాడ రాసిన మొదటి కథానిక దిద్దుబాటు. ఈ కథకు ఆయన మొదట పెట్టిన పేరు కమలిని. ఇందులో కథ కథానాయిక కమలిని చుట్టే తిరుగుతుంది. కథ కథానాయకుని చుట్టు తిరిగినా, కథానాయిక చుట్టు తిరిగినా - ఆయన చెప్పదలచుక్నుది 'మనిషిని' గురించి. సమాజానికి - మనిషికి అంటే సమాజంలోని మనిషికి మనిషికి ఉండే సంబంధాలను లేదా ఉండాల్సిన సంబంధాలను గురించి, కాబట్టి 'కమలిని' అనే పేరుతో మొదలు రాసిన కథానికను దిద్ది అంటే కొంత మార్పులు చేసి ఆ కథానికకు 'దిద్దుబాటు' అనే పేరు పెట్టాడు.

దిద్దుబాటు కథానికలో కమలిని, గోపాలరావులు భార్యాభర్తలు, రాము వాళ్ళ నౌకరు. ఈ మూడు పాత్రలతోనే కథ నడుస్తుంది. అయితే ఈ కథానిక కథనంలో గోపాలరావు, రాము ఈ రెండు పాత్రలు మాత్రమే కనిపిస్తాయి. 'కమలిని' పాత్ర కనిపించదు. కానీ కథ మాత్రం ఆ పాత్ర చుట్టే తిరుగుతుంది. కారణం ఈ కథకు "కథా వస్తువు" కమలిని పాత్రే. కథకు కథా వస్తువుకు వుండే తేడాను స్పష్టంగా తన కథానికల్లో చూపడమే కాకుండా కథా వస్తువుకు సమకాలీనతను, ఆధునిక భావుకతను ఆలోచించే తత్వాన్ని అద్దిన 'ఆధునిక కథానిక' శిల్పి గురజాడ. ఇక్కడే ప్రాచీన కాలం నుండి అటు శిష్ట సాహిత్యంలోనూ ఇటు జానపద సాహిత్యంలోనూ ఉండే కథకు, గురజాడ ప్రారంభించిన ఆధునిక కథానికకు మధ్య వస్తు భావ శిల్పాల్లో వుండే తేడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

దిద్దుబాటు కథానికను ప్రాచీన పద్ధతిలో కథగా రాస్తే ఎలా వుంటుందో ఇప్పుడు పరిశీలిద్దాం.

రామారం అనే ఊర్లో గోపాలరావు కమలిని అనే దంపతులు ఉండేవారు. గోపాలరావు వేశ్యాలోలుడు. ఇంటికి ఏ అర్థరాత్రో అపరాత్రో వచ్చేవాడు ప్రతివ్రతా

శిరోమణి అయిన కమలిని ఆయన కోసం కన్నుల్లో వత్తులు వేసుకొని భోజనం చేయకుండా ఎదురు చూస్తూవుండేది. . . కథా ఇలా సాగేది. ముగింపు మాత్రం వేశ్యలతోడిదే జీవితం అనుకొని గోపాలరావు పతనం కావడం, చివరికి ఆయనకు నరకం. ఈ కష్ట నిష్ఠూరాలను భరించిన కమలినికి స్వర్గం ప్రాప్తించేది. లేదా ఈమె పతివ్రతామాహాత్మ్యం వల్ల భర్తకు కూడా స్వర్గప్రాప్తిని కలిగించడంతో కథ ముగిసేది. కథల్లో ఎన్ని మెలికలున్నా కథనంలో ఎన్ని వర్ణనలు చేసినా 'నదీనాంసాగరోగతి' అన్నట్లు మనపాత కథలన్నీ ఈ భావ సాగరంలోనే విలీనమయ్యేవి. కాబట్టి ఆ కథలను చదివిన పాఠకుడు ఆలోచించేవాడు కాదు. ఆ భావసాగరంలో కొట్టుకపోయేవాడు. అంటే వర్తమానంలో జీవించే మనిషి కష్టనిష్ఠూరాలకు, సుఖ సౌఖ్యాలకు కారణం ఎవరో కాదు. సామాజిక జీవనంలోని వాడి ప్రవర్తనే. ఎవడి సామాజిక జీవన ప్రవర్తనకు సంబంధించిన మంచి చెడులను వాడే తన జీవితకాలంలో ఎప్పుడో ఒకప్పుడు అనుభవించాలి అనే సామాజిక స్పృహ ఆ కథల్లో కనిపించదు.

గురజాడ ప్రారంభించిన ఆధునిక కథానిక స్వరూప స్వభావాలు ఇందుకు భిన్నమైనవి. కులం పేరుతో, మతం పేరుతో, వర్గం పేరుతో, స్త్రీ పురుష భేదాలతో మనిషి మానీవయ సంబంధాలకు దూరమైపోతున్న తీరును గురజాడ తన రచనల్లో స్పష్టం చేశారు. మనిషిని సంఘజీవిగా నిలబెట్టడం కోసం ఆయన కలం పట్టాడు. కాబట్టి ఆయన రచనల్లో సామాజిక అస్తిత్వంలోంచి సంఘర్షిస్తూ కనిపించే రక్తమాంసాలు వున్న మనుషులేవుంటారు. ఈ దృష్ట్యా మనం గురజాడ కథానికలను పరిశీలించి నపుడు, ఆ కథల్లో ఆయన కుటుంబ జీవితానికి సామాజిక జీవితానికి మధ్య చిత్రించిన సంఘర్షణలు వ్యక్తమవుతాయి. అంతేకాదు సామాజిక జీవనపు ఉనికికి పునాదులైన కుటుంబ జీవనానికే గురజాడ తన రచనల్లో ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చారు. అన్న భావన కలుగుతుంది.

కుటుంబం అంటే తల్లిదండ్రులు, భార్యాభర్తలు పిల్లలు బంధువులు వారి మధ్య ఉండే అనుబంధాలు ఆత్మీయతలు, కోపతాపాలు, కష్టసుఖాలు ఎన్నివున్నా కలిసి ఉండే తత్త్వం అనేది కుటుంబ జీవనానికి ప్రధానమైంది. నిజమైన సుఖం, తృప్తి అందులోనే వుంటుంది. ఏ ప్రాంతంలోనైనా కుటుంబ జీవనం పటిష్ఠంగా వున్నప్పుడే సామాజిక వ్యవస్థ పటిష్ఠంగా వుంటూ అభివృద్ధి దిశగా పయనిస్తుంది. ఈ చారిత్రక సత్యాన్ని గుర్తించిన గురజాడ "దిద్దుబాటు" కథను రాశాడు.

వేశ్యాసాంగత్యం అనేది సప్తవ్యసనాల్లో ఒకటి. అయినప్పటికి పురుషస్వామ్య వ్యవస్థ వేశ్యాసాంగత్యాన్ని సామాజిక హోదాగా భావిస్తుంది. 'దిద్దుబాటు' కథానికలోని గోపాలరావు కూడా ఈ మనస్తత్వం కలిగి వున్నవాడే కావడం గమనింపదగిన విషయం. అయితే ఆంగ్లవిద్యను అభ్యసించినవాడు కావడం మూలంగా భార్యభర్తల సంబంధాల పట్ల, నౌకరుల పట్ల సంకుచిత సంప్రదాయభావాలకు భిన్నమైన మనస్తత్వం గోపాలరావులో వుంది. కాబట్టే వేశ్యల ఇండ్లలో గానా బజానాల్లో తేలియాడి రాత్రి ఒంటి గంటకు ఇంటికి వచ్చిన గోపాలరావు ఈ విధంగా ఆత్మ విమర్శ చేసుకున్నాడు.

"ఎంత ఆలస్యం చేస్తిని? బుద్ధి గడ్డి తిన్నది. రేపటినుంచి జాగ్రత్తగా వుంటాను. యాంటినా చీనైనా, పోయి పోయి సానిదాని పాట సరదాలో మనసు లగ్నమై పోయినది. ఒక్క పాటతోనే సరదా అయిపోలేదు. పాడే మనిషి మీదిక్కూడ మనసు పరుగెత్తుతుంది. లేకుంటే, నేను పోకిరీ మనిషిలాగా కూర్చోవడవేఁవింటి? అంటూ గోపాలరావు ప్రశ్నించు కోవడమే ఆధునికత, పైగా ఆత్మ విమర్శ కూడా చేసుకొన్నాడు. కమలిని ఇంట్లో కనిపించకపోయేసరికి పుట్టింటికేమైనా వెళ్ళిందేమో అని సందేహాన్ని వ్యక్తం చేసినపుడు "అంతోరు కారనా బాబూ? కోపగించితే సెప్పజాల్నుగానీ, ఆడోరు సదువుకుంటే ఏటౌతది బాబూ?" అని నౌకరు రాముడు అంటే, "విద్య విలువ నీకేం తెలుసురా, రామా" అని వెంటనే గోపాలరావు సమాధానం ఇస్తాడు.

ఈ సమాధానాన్ని బట్టి కూడా గోపాలరావు వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇంతకు ముందే చెప్పినట్లు "దిద్దుబాటు" కథానిక "కమలిని" చుట్టే తిరిగినా కథనడిచేది మాత్రం గోపాలరావు రాముని సంభాషణలతోనే మచ్చుకు కొన్ని పరిశీలిద్దాం.

"నాఁ తొంగున్నాను కావాల బాబూ ! అలిగితే సెప్ప సాల్ను గాని బాబూ, ఆడదాయి సెప్పకుండా పుట్టినోరింటికి ఎల్తానంటే లెంపలోయించి కూకోబెట్టాలి గాని మొగోర్లాగా రాతలూ కోతలు మప్పితే ఉడ్డోరం పుట్టదా, బాబూ?" అని రాముడు అన్నప్పుడు.

"ఓరి మూర్ఖుడా ! భగవంతుడి సృష్టిలో కల్లా ఉత్కృష్టమయిన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహం పంచి యిచ్చాడు కాదా.

ఇంగ్లీషువాడు భార్యను బెటర్ హాఫ్ అంటాడు. అనగా పెళ్ళాం మొగుడికన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డాదా?" అని గోపాలరావు భార్యాభర్తల సంబంధాన్ని గూర్చి, విద్యావంతులైన స్త్రీల ఔన్నత్యాన్ని గూర్చి ప్రకటించిన మాటలు సంప్రదాయభావాలకు భిన్నమైనవి. అభ్యుదయకరమైనవి.

గోపాలరావు ఈ అభ్యుదయకరమైన భావాలు ప్రకటించడానికి కారణం. కమలిని సున్నితంగా తన బాధను, బాధ్యతను వ్యక్తం చేస్తూ రాసిన ఉత్తరమే. ఆధునిక విద్యను అభ్యసించి దాని విలువను గుర్తించిన గోపాలరావులో నివురుకప్పి వున్న అభ్యుదయ భావాలను 'కమలిని' రాసిన ఈ ఉత్తరం ప్రజ్వరిల్లేలాగా చేసింది.

"అయ్యా ! పది దినములాయె రాత్రులన్నింటికి మీరాకయే నేనెరుగను. మీటింగులకు బోవుచుంటిమంటిరి. లోకోపకారమునకై యుద్యమముల నిదురమాని చేయుచుంటిమంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింట నుండుటను గదా ! మీరు కల్లలు పలుక వలసి వచ్చెను. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశము కలుగకుండును. మీచే దినదినమును అసత్యమాడించుట కన్నను మీ త్రోవకు అడ్డుగా నుండకుండుటయే పతి మేలుకోరిన సతికి కర్తవ్యముకదా ! నేనీ రేయి కన్నవారింటికి చనియెద. సంతసింపుడు, వెచ్చము గాక ఏ పాటి మిగిలియున్న దయనుంచుడు."

ఈ ఉత్తరాన్ని చదివిన గోపాలరావు వెంటనే, "నేను పశువును" అని ఆత్మ విమర్శ చేసుకొని, తన తప్పును సరిదిద్దుకోడానికి ఆరాట పడతాడు తప్ప ఆవేశపడడు. అదే కమలిని ఉత్తరంలోని చాకచక్యం. "ధర్మచ, అర్థేచ, కామేచ, నాతి చరామి" అని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన భర్త దారి తప్పి తిరుగుతుంటే ఆ తప్పును ఎత్తి చూపకుండా, ఆ తప్పేమిటో తన భర్త తెలుసుకొని, సరిదిద్దుకునేలా సున్నితంగా "పతిమేలు కోరటం సతి కర్తవ్యం కాబట్టి ఆనందానికి అడ్డురాకుండా పుట్టింటికి వెళ్తున్నాను" అని ఉత్తరంలో రాయడం మూలంగా పతిగా తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని గోపాలరావు గుర్తించాడు, పశ్చాత్తాపపడినాడు. తన తప్పును తెలుసుకున్నాను. ఇక జీవితంలో ఇలాంటి తప్పును ఎన్నడు చేయను అని తన మాటగా చెప్పి కమలిని తీసుకొని రమ్మని, తను, తాత తండ్రుల నాటి నౌకరైన రాముణ్ణి ప్రాధేయపడినాడు. ఈ తతంగాన్నంత పందిరిమంచం కింద దాక్కొని వింటున్న కమలిని నవ్వును ఆపుకోలేకపోయింది. ఆమె నవ్వుకు కరకంకణాల రవంకూడా తోడు కావడంతో కథానిక ముగుస్తుంది.

దిద్దుబాటు తరువాత గురజాడ రాసిన రెండవ కథానిక 'మీపేరేమిటి?' పెద్దకథ. దిద్దుబాటు ప్రథమపురుష కథనంతో సాగితే మీపేరేమిటి కథానిక ఉత్తమపురుషలో సాగింది.

పురాణములను గురించి మేము శంకలు వేస్తే, మా గురువుగారు "వెధవ చదువు! మీ మతులు పోతున్నాయి. మీరు వొట్టి బౌద్ధులు" అనే వారు. అనే ఎత్తుగడతో కథ ప్రారంభమవుతుంది. "నేను" అనే ఉత్తమ పురుష ఏకవచనానికి బహువచనం "మేము". రచయిత ఈ కథానిక ఎత్తుగడలో "మేము" అనే బహుచవనాన్ని ప్రయోగించడంలో ఏదో ఆంతర్యం వుంది. ఈ కథలో "నేను" ప్రధాన పాత్ర. అదే రచయిత. ఈయనలాగే ఆంగ్లవిద్యను అభ్యసించి ఆధునిక భావాలను పెంపొందించుకున్న వాళ్ళు మరికొందరు వున్నారు. కాబట్టి రచయిత "మేము" అనే బహువచనాన్ని ప్రయోగించాడు.

ఇకపోతే పురాణాల్లోని భావాలపట్ల అనుమానాలు వ్యక్తం చేసినవాళ్ళు ఆంగ్లవిద్యను అభ్యసించిన మేధావుల కన్నా ముందే మధ్యయుగాల్లో తాళ్ళపాక పెద తిరుమలాచార్యుల వంటి వారు ఉన్నారు. ఆయన శ్రీవెంకటేశ్వర వచనాల్లో "వేదంబులు గంటవేటగాండ్రవంటివి, పురాణంబులు అర్థంబు తేటపడనీయవు" అంటూ రాశాడు. అయితే గురజాడకు పూర్వం వున్న కవులకు, గురజాడకు పురాణాల గురించి ప్రశ్నించడంలోనూ, ఆలోచించి అవగాహన చేసుకోవడంలోను స్పష్టమైన తేడా వుంది. ప్రాచీనుల ప్రశ్న భక్తి భావం పరిధిలోనే వుంటుంది. గురజాడ ప్రశ్న సామాజిక బాధ్యత పరిధిలో వుంటుంది. అది వ్యష్టిపరమైన ఆత్మతృప్తికి దోహదం చేస్తే. ఇది సమష్టి పరమై సామాజిక అభ్యున్నతికి దారి చూపింది. కాబట్టే ఆధునికతకు అడుగుజాడ గురజాడ అయ్యారు.

మీపేరేమిటి? కథలో చిన్నాచితక కలిపి ఇరవైదాక పాత్రలున్నాయి. మతం, దేవుడు ఈ రెండింటిపై మనిషికి వుండే భక్తి విశ్వాసాలను కేంద్రంగా చేసుకొని ఈ కథ సాగుతుంది. ఇందులో బౌద్ధం, కిరస్తాని, ముస్లిం మతాల ప్రస్తావన ఉన్నప్పటికి ప్రధానంగా శైవ వైష్ణవ మతాల మధ్యనే ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఈ పోరుకు సారథ్యం వహించినవారు శైవమతానికి చెందిన జంగ శరభయ్య, వైష్ణవ మతానికి చెందిన సాతాని మనవాళ్ళయ్య. ఈ ఇద్దరి మధ్యనే మతపరమైన పోరు నడవడానికి కారణం సారథినాయుడు. ఈయన ఈ కథ నడిచే ప్రాంతమైన 'రామగిరి' లో లక్షాధికారి. ఈయన బావమరిది రామినాయుడు ఆ ఊరి మునసబు.

రామగిరికి దక్షిణ ప్రాంతం నుండి నాల్గు సంవత్సరాల క్రితం వచ్చిన అయ్యవార్ల మూలంగా సారథినాయుడు వైష్ణవ తీర్థం పుచ్చుకున్నాడు. అప్పటినుండి రామస్వామివారికి సారథినాయుడు రాజభోగాలు నడిపించడం. నాయళ్ళంతా వైష్ణవం పుచ్చుకోవడం శివుని దేవాలయం వైపు వాళ్ళు తిరిగి చూడకపోవడం ఇదంతా జంగం శరభయ్యకు కంటకింపుగా ఉండేది. కళ్ళలో కారం పెట్టుకున్నంత బాధగా వుండేది. ఏ విధంగానైనా సారథినాయుణ్ణి శైవంలోకి తీసుకరావాలని జంగం శరభయ్య ఆలోచించి, హైదరాబాదు నుండి 'శివాచారులను' పిలిపించి అగ్గిగుండం తొక్కే ఉత్సవాన్ని ఏర్పాటు చేసి సారథినాయుణ్ణి ఆ ఉత్సవానికి పిలిచాడు. దాంతో సాతాని మనవాళ్ళయ్యకు గుండెలో దడపుట్టి తన శిష్య బృందంతో వైష్ణవ సభ ఏర్పాటు చేసి సారథినాయుడు 'శైవమతం' వైపు వెళ్ళకుండా ఉండాలంటే మనం కూడా అగ్గిగుండం తొక్కాలని వీరావేశంతో అంటాడు. అంతేకాదు తనకుతానే అవతారపురుషుణ్ణని ప్రకటించుకుంటాడు.

"శరభయ్యే వృషభావతారమైనప్పుడు నేను గురడాళ్వారు పూర్ణావతారం కాకపోతే కాకపోవచ్చును గాని వారియొక్క అత్యల్పాంశ వల్లనైనా జన్మించి వుండ కూడదా ! గురుడాళ్వారు నఖముల యొక్క తేజస్సు నాయందు ఆవిర్భవించివున్నది కాబట్టే, శరభయ్యను యిలా చీల్చి పేల్చుతున్నాను" అన్న సాతాని మనవాళ్ళయ్యను "అగ్గిగుండంతొక్కి మహిమ చూపే శివాచారుల్లాగా నీవే గుండం తొక్కి మహిమ చూపరాదా" ! అని మునసబు రామినాయుడు అనగానే మనవాళ్ళయ్య చల్లబడి పోతాడు. ఉరిమి ఉరిమి మంగలం మీద పడినట్లు ఇది తనకే చుట్టుకుంటుందని భావించిన మనవాళ్ళయ్య ఈ ప్రమాదం నుంచి తప్పించుకోడానికి శతవిధాల చాకచక్యంగా ఎత్తులు వేసి, చివరికి ఉత్సవ విగ్రహాల ప్రస్తావన తెచ్చి, అగ్గిగుండం దూకే బాధ్యతను రంగాచార్య మీదకు నెట్టివేసి, ప్రజల చేత ఒప్పిస్తాడు. ఈ తతంగంలోని ఆంతర్యాన్ని గ్రహించిన రంగాచార్య కోడలు, కృష్ణమాచార్యుల భార్య అయిన "నాంచారమ్మ" భర్తను అటకమీద దాచి, అగ్గిగుండం తొక్కబోతున్న మామను ఆ ప్రమాదం నుండి అతి చాకచక్యంగా తప్పించి పీరుసాబ్‌ను ఈ విధంగా ఇరికిస్తుంది.

"శైవుల్లో అగ్గిగుండం తొక్కే శివాచార్లులాగా వైష్ణవంలో కూడా "తురకలు" వున్నారు. పీరు అనేది ఏమిటనుకున్నారు. శ్రీ స్వామివారి తిరునామమే..... గనుక శ్రీరామస్వామి వారి నామం తెచ్చి పీరు కట్టి యిస్తాను. ఆ పీరు పట్టుకొని పీరు

సాయిబు గుండం దొక్కుతాడు. పీరు సాయిబుయోగ్యత మీరెరిగినదే. అతగాడు కబీరు దాసంత భక్తుడు...." అంటూ పీరు సాయిబును తన మాటల చాతుర్యంతో ఉసిగొల్పి అగ్గిగుండం తొక్కిస్తుంది. అప్పటి నుండి ఆ పీరు 'విష్ణునామం' అయిపోయి విష్ణుభక్తులకు శిరోధార్యమవుతుంది. శరభయ్య మాత్రం తక్కువ తిన్నాడా త్రిశూలాకారం గనుక ఆ పీరు శివ పీరే అంటాడు. దాంతో పెద్ద గుహలో వున్న బౌద్ధ విగ్రహాన్ని శివుణ్ణి చేసిన జంగం శరభయ్య, సాతాని మనవాళ్ళయ్య రాజీపడి పోతారు. ఈ కథనంతా చెప్పిన శాస్త్రులు గారి శిష్యుడైన శాయనభుక్త "శివుడూ విష్ణువూ పేర్లే అయినపుడు బుద్ధుడు శివుడు కారాదా" అన్న ప్రశ్నతో కథను కొసమెరుపునిచ్చి ముగిస్తాడు.

శాస్త్రులు "బుద్ధుడు విష్ణువు అవతారం గదా ! యీ జంగాలు శివుడని యేలపూజ చేస్తున్నార్రా"? అని శంకను వ్యక్తం చేసినపుడు. దాన్ని తీర్చడానికి శాయనభుక్త ఈ కథ చెప్పి బుద్ధుడు శివుడు ఎందుకు కాకూడదు? అని ఎదురు ప్రశ్న వేస్తాడు ! అంటే తెలివైన మనిషి తన పబ్బం గడుపుకోడానికి, కొత్త కొత్త మతాలను, దేవుళ్ళను ఎలా సృష్టిస్తారు. పైన కయ్యాలతో లోన నెయ్యాలతో మత పెద్దలు దేవుళ్ళ పేరుతో సర్వసౌఖ్యాలు అనుభవిస్తూ ప్రజల మధ్య చిచ్చురేపుతూ సామాజిక జీవనాన్ని ఎలా ధ్వంసం చేస్తారో గురజాడ ఈ కథ ద్వారా వ్యక్తం చేశాడు.

మీపేరేమిటి? కథానికకు కొనసాగింపు గానే గురజాడ మరో దృష్టి కోణంలో పెద్ద మసీదు కథ రాశాడు. ఈ కథానికకే "మతం – విమతము" అని మరొక పేరు. ఒక చారిత్రక ఘట్టాన్ని తీసుకొని గురజాడ ఈ కథానికను రాశాడు. అతిప్రాచీన పట్టణమైన శ్రీకాకుళం లోని శ్రీకాకుళేశ్వరదేవాలయాన్ని కూలగొట్టి షేరు మహమ్మదు పెద్ద మసీదును కట్టించడం. ఈ కథలోని ఇతివృత్తం. ఇది చాలా చిన్న కథానిక. నారాయణభట్టు పుల్లంభొట్లు ఈ రెండుపాత్రలే పెద్దవి. ఈ ఇద్దరు గురుశిష్యులు అతి చిన్న పాత్ర తురక సాహెబ్ పాత్ర.

నారాయణభట్టు తన శిష్యుడు పుల్లంభొట్లను తీసుకొని ఎంతో ఉత్సాహంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి తూర్పు దిశ నుండి తన ఊరు శ్రీకాకుళం పట్టణానికి వచ్చి చూస్తే శివాలయం వున్న చోట మసీదు కనిపించేసరికి "కాకుళేశ్వరుడి గుడి పగులగొట్టి మ్లేచ్ఛుడు మసీదు" కట్టాడేమో అన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తాడు.

అప్పుడు పుల్లంభొట్లు "దేవుడెందుకూరకున్నాడు స్వామీ !" అని అమాయకంగా ప్రశ్నిస్తాడు. నారయణభట్టు సమాధానం చెప్పలేక శిష్యుని తీసుకొని మసీదు దగ్గరకు వెళ్ళి విషయాన్ని ప్రస్తావిస్తే అక్కడ వున్న తురక సాయిబు "హాసైతాన్కాఘుర్" అని సమాధానమిస్తాడు.

ఏంపాట్లొచ్చాయీ దేవుళ్ళకి అని గురువు అంటే దేవుళ్ళకి ఏ పాట్లూ లేవు. మనసాపాటు ఆలోచించరేం ! అంటాడు పుల్లంభొట్లు. చివరకు ఆ మసీదు దగ్గర వున్న తురకను తన మామే అని గుర్తించి నారాయణభట్టు ఆవేదన చెందడంతో ముగుస్తుంది.

గురజాడ రాసిన మీపేరేమటి? పెద్ద మసీదు ఈ రెండు కథలు, "మతాన్ని స్థాపించేది దేవుణ్ణి నిలబెట్టి గోపురాలు కట్టేది మనుషులే వాటిని నాశనం చేసేది కూడా మనుషులే" అన్న చారిత్రక సత్యాన్ని వ్యక్తం చేశాయి. మనుషుల్లో వుండే స్వార్థం, భయం, అహంకారం, ఈర్ష్య వంటి లక్షణాలు అందుకు దోహదం చేస్తాయన్న సామాజిక వాస్తవాన్ని కూడా ఆ కథలు తెలియచేస్తాయి.

సంఘసంస్కరణ ఉద్యమాల్లో వేశ్యా సమస్య ప్రధానమైన అంశం. వేశ్యా వ్యామోహంలో పడిన భర్తను చక్కదిద్దుకునే ప్రయత్నాన్ని గురజాడ దిద్దుబాటు కథలో చిత్రించి కథానాయిక సఫలీకృతమైన తీరును వ్యక్తం చేస్తే ఒక వేశ్య జీవితాన్ని ఆకూపం నుంచి రక్షించి, కుటుంబ జీవితాన్ని కల్పిస్తే బాగుంటుందని ప్రయత్నించి సంయమనం కోల్పోయి తానే ఆ కూపంలో బడబోతుంటే రక్షించిన ఒక వేశ్య జీవితాన్ని కేంద్రంగా చేసుకొని 'సంస్కర్త హృదయం' కథ రాశాడు. ఇందులో సరళ అనే వేశ్య రంగనాథయ్యరు అనే ప్రొఫెసర్ చుట్టూ కథ తిరుగుతుంది.

రంగనాథయ్యరు వేశ్యా సమస్యను పరిష్కరించడానికి కంకణం కట్టుకున్న సంస్కర్త. ఒక కళాశాలలో అధ్యాపకుడు. చదువు సంస్కారం, అందం, చందం వున్న చక్కని పిల్ల సరళ. ఈమె వేశ్య. ఈ మురికి కూపం నుంచి ఎప్పుడు బయటపడదామా ! అని ఆలోచిస్తున్న సరళకు రంగనాథయ్యరు వంటి సంస్కర్త పరిచయం కొంత ధైర్యాన్ని యిస్తుంది. కానీ, ఆధైర్యం ఎంతో కాలం నిలువ లేదు. ఎందుకంటే వేశ్యా సమస్య వైయక్తికమైంది కాదు. సామాజికమైంది. దానికి పెళ్ళే పరిష్కారం కాదు. ఈ విషయాన్ని గ్రహించలేని రంగనాథయ్యరు ఈ సమస్యను వ్యక్తిగతంగా ఆలోచించి పెళ్ళే దానికి పరిష్కారం అనుకుంటాడు. ఈ దృష్టితోనే తనకు యింతకు ముందే పెళ్ళి అయిందనే విషయాన్ని విస్మరించి సరళ అందానికి

వివశుడై ఆమెను ముద్దు పెట్టుకుంటాడు. అంటే ఒకరిని సంస్కరించబోయి తన కుసంస్కారాన్ని బయట పెట్టుకున్నాడన్నమాట.

ఆనాటి సంస్కర్తలందరిలోనూ వేశ్యలంటే జీవితంలో ఓడిపోయిన స్త్రీలు అనే అభిప్రాయం బలంగా ఉండేది. అందువల్ల వీరు ఈ సమస్యను వ్యక్తిగతంగా ఆలోచించేవారు. నిజానికి వేశ్యలు జీవితంలో ఓడిపోయిన వాళ్ళు కాదు. మత సంప్రదాయాల మూలంగా రాజరిక భూస్వామ్య సంస్కృతికి పుట్టిన వికృత ఫలమే పడుపు వృత్తి. శైవులు బసవి పేరుతో, వైష్ణవులు దేవదాసి పేరుతో ఈ దుష్ట సంప్రదాయానికి మత ముద్రవేసి సామాజిక ఆమోదాన్ని పొందారు. ఆమ్రపాలివంటి అపురూపసౌందర్యవతి, ఉన్నత కుటుంబానికి చెందిన, సంపన్నురాలైన స్త్రీ ఏ విధంగా వేశ్యగా మార్చబడిందో చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. ఈ సామాజిక చారిత్రకాంశాలను విస్మరించి వేశ్యా సమస్యను వ్యక్తిగత సమస్యగా భావించడం మూలంగా కలిగే వైఫల్యాన్ని గురజాడ సంస్కర్త హృదయం కథలో వ్యక్తం చేశారు.

స్త్రీ విద్యతో పాటు స్త్రీ స్వేచ్ఛ కూడా ఆనాటి సంస్కరణ ఉద్యమాల్లో ఒక అంశమే. ఆనాడు స్త్రీల జీవితాలు బానిసలకన్నా మెరుగేమి కాదు. స్త్రీలకు పునర్వివాహం చేసుకొనే హక్కులేకపోవడం. విడాకులు పొందే అవకాశం గానీ, ఆర్థిక స్వాతంత్ర్యం గానీ లేకపోవడం మూలంగా వారి జీవితాలు నాల్గుగోడలమధ్య సజీవ సమాధిగా వున్నాయన్న అభిప్రాయం గురజాడలో వుంది. మెటిల్డా కథానికలో గురజాడ ఈ అభిప్రాయాలనే స్పష్టంగా చిత్రించారు.

నిజానికి మెటిల్డా కథానికకు, ఆపేరుకు ఏమీ సంబంధం లేదు. ఆంగ్ల సాహిత్యాన్ని గురజాడ ఆపోశనం పట్టడం మూలంగా ఈ కథానికలో చిత్రించబడిన కథానాయిక దైన్యస్థితిని దృష్టిలో వుంచుకొని గురజాడ ఈ పేరు పెట్టి వుంటారని సెట్టి ఈశ్వరరావుగారి అభిప్రాయం. ఈ కథ కూడా ఉత్తమ పురుషలోనే సాగుతుంది. ఇందులో "నేను" అనే పాత్ర కథానాయకుడు. ఈతని మిత్రుడు రామారావు. వీళ్ళతో పాటు ఇంకా పదిపదిహేను మంది విద్యార్థులు కలిసి ఒక ఇంట్లో అద్దెకుంటారు. అదే ప్రాంతంలో మెటిల్డా ఆమె వయసు మళ్ళిన తన భర్తతో కాపురం వుంటుంది. అక్కడున్న విద్యార్థులంతా ఆమె భర్తకు "ముసలిపులి" అని పేరు కూడా పెట్టారు. "నేను" పాత్రకు ఈ విషయాలు తెలియవు. కొత్తగా చదువుకోడానికి వచ్చాడు కాబట్టి, అతని మిత్రుడు రామారావు ఒకసారి "మెటిల్డా" ను చూపించి, ఇక ఎప్పుడు ఆమె వైపు చూడటంగానీ, అటువైపు వెళ్లడం గానీ చేయకు అని గట్టిగా హెచ్చరిస్తాడు. ఇక అక్కడనుంచి రమ్మంటాడు.

"ఎలా రావడం? కళ్ళు భగవంతుడు యిచ్చినందుకు యిదే కదాఫలం ! మనోహరమైన భగవంతుడి సృష్టిలో కల్లా మనోహరమైనది, సొగసైన స్త్రీ. మనస్సులో చెడు చింత లేనప్పుడు తప్పేమిటి?" అంటూ "నేను" తన నిజాయితీని ప్రకటిస్తాడు. నిజమే కానీ ఎదుటివారు కూడా సహృదయంతో అర్థం చేసుకోవాలి కదా? అన్న లోకజ్ఞానం "నేను" కు లేదు. కాబట్టి తన మిత్రుని మాటను పెడచెవిన పెట్టి మళ్ళీ ఒకసారి మెటిల్డాను చూస్తాడు. ఫలితంగా తన భర్త "ముసలిపులి" చేత ఆమె అవమానాలకు గురి అవుతుంది.

"మీరు మీనేస్తులూ నాకాపురం మననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను? తలవంచకు మీ తోవను మీరు పోతే నేను బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్ధం" అని మెటిల్డా ఒక ఉత్తరం రాసి ముసలి పులియింటి ముసలి బ్రాహ్మణుని కిచ్చి "నేను"కు ఇవ్వమంటుంది. ఈ ఉత్తరాన్ని చదివిన నేనుకు విషయం అర్థమై పోతుంది. అంతకుముందే "ముసలిపులి" తనను పిల్చి మెటిల్డా దగ్గర నానా ప్రశ్నలు వేసి ఆమెను పరమ బూతులు తిడుతూ "ఈ ముండను తీసుకపో ! నీకు దానం చేశాను. తీసుకుపో ! నాకు శని విరగడై పోతుంది" అన్న మాటలు "నేను"కు పదేపదే గుర్తుకువచ్చి హృదయాన్ని కలచివేసాయి. ఆ అద్దె ఇంట్లో నుంచి వెంటనే వెళ్ళి పోవాలనుకున్నాడు. కానీ మెటిల్డా కాపురంలో చిచ్చు పెట్టి వెళ్లిపోవడం భావ్యం కాదని, ఆమె కాపురాన్ని చక్కదిద్దితే తప్ప తన తప్పుకు పరిహారంలేదని నిశ్చయించు కొని, రామారావు సహాయంతో అనుకున్నది సాధిస్తాడు.

ముసలిపులి అనుమానంతో 'నేను'ను ఇంటికి పిలిచి మొదటిసారి ప్రవర్తించిన తీరుకు భిన్నంగా రెండవసారి అభిమానంతో "నేను"ను ఇంటికి పిలిచి "నాకు నీవూ, నీ స్నేహితుడు రామారావు మరొక గొప్ప ఉపకారం చేశారు. మీ మాటల వల్లా చేష్టలవల్లా నాభార్య యోగ్యురాలని తెలుసుకున్నాను. ఆలోచించుకోగా ఆనాటి నుంచి కళ్ళెం వొదిలేశాను. నా పెళ్ళాం బహు బుద్ధిమంతురాలు, ఇచ్చిన స్వేచ్ఛనైనా పుచ్చుకోలేదు. . . నాకు నీతోడిదే లోకం అయినప్పుడు మరి ఎవరితో ఏం పనుంది? అని అలాగే సంచరించింది. . . అంటూ కాఫీని" ఆఫర్ చేశాడు ముసలిపులి.

ఒకప్పుడు మెటిల్డాను ఎవరైనా చూస్తే సరి అనుమానపడే ఆ ముసలిపులి ఇప్పుడు మెటిల్డాను తమ మధ్య కూర్చోమని ఆప్యాయంగా అంటాడు. తన వల్ల

భార్యాభర్తల మధ్య ఏర్పడిన అపార్థాలు తొలిగిపోయి వారిద్దరూ అన్యోన్యంగా మాట్లాడుకోవటం చూసిన "నేను" సంతోషిస్తాడు. కానీ "ముసలిపులి" ఇచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకోకుండా నీతోడిదే లోకం అని మెటిల్డా అనడమే కాకుండా ఆ విధంగా జీవించడానికి అలవాటు పడటం మూలంగానే ఈ ప్రేమానురాగాలను "ముసలిపులి" ఒలకబోస్తున్నాడన్న అంతర్యాన్ని "నేను" గ్రహించలేక పోయాడు.

ఏదిఏమైనప్పటికి, పురుషుడు ఇచ్చిన స్వేచ్ఛా పరిధిలో స్త్రీ తన జీవితాన్ని మలచుకున్నప్పుడు మాత్రమే ఆమెకు గౌరవం, మర్యాద లేకుంటే మెటిల్డాలా భర్తలు పెట్టే హింసలు, చేసే అవమానాలు భరించాక చివరికి ఎప్పటికో గాని ప్రేమానురాగాలు వారిలో వికసించవు అన్న సత్యాన్ని గురజాడ ఈ కథలో వ్యక్తం చేశాడు. భార్యాభర్తలు స్వేచ్ఛగా కుటుంబ జీవనం సాగిస్తూ ఒకరి స్వేచ్ఛను మరొకరు గౌరవించుకోవడం మూలంగానే ఇల్లు స్వర్గసీమ అవుతుందన్న నిజాన్ని కూడా ఈ కథలో చెప్పాడు.

గురజాడ రాసింది ఐదే కథానికలైనా అవి సామాజిక జీవితాన్ని సహజంగా చిత్రించి మనల్ని ఆలోచింపచేసే ఆణిముత్యాల లాంటివని చెప్పవచ్చును. సామాజిక వ్యవస్థలో కుటుంబ జీవనానికి సమాజాన్ని పట్టి పీడిస్తున్న మూఢ విశ్వాసాలు, కులమతాలకు సంబంధించిన సమస్యలైనా, ఒక్కమాటలో చెప్పాలంటే సామాజిక జీవితంలోని ఏ సమస్యలనైనా సరే హేతువాద దృక్పథంతో వాటి మూలాల్లోకి వెళ్ళి ఆ సమస్యలకు కారణాలను వెతికి పట్టుకొని తన రచనల్లో నిజాయితీగా చిత్రించిన రచయిత గురజాడ. రచయితకు సామాజిక స్పృహ ఉండాలని చిత్తశుద్ధితో నమ్మి ఆచరణలో చూపిన సాహిత్య ఉద్యమకారుడు గురజాడ. ఈ దృష్ట్యానే శ్రీశ్రీ "ఆధునిక సాహిత్యానికి అడుగుజాడ గురజాడ" అన్నారు.

**ఉపయుక్త గ్రంథాలు:**


1. సెట్టి ఈశ్వరరావు (సంపాదకుడు) - గురజాడ రచనలు.
2. డా॥ వి. వీరాచారి - తెలుగునాట సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు కవులు - రచయితలు.
3. కాత్యాయనీ విద్మహే (సంపాదకత్వం) - జండర్ స్పృహ ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రతిఫలనాలు.
4. సోయి - తెలంగాణ రచయితల సాహిత్య వేదిక సాహిత్య పత్రిక - జూన్ సంచిక

# శ్రీపాద వారి చిన్న కథల్లో వస్తు వైవిధ్యము

డా॥ అనప్పిండి సూర్యనారాయణ మూర్తి

తెలుగు సాహిత్యంలో కథానికాప్రక్రియ ప్రారంభమైన కొద్ది కాలంలోనే సాహితీ వేత్తలు చాలామంది ఆ ప్రక్రియకి ప్రాచుర్యం కలిగించడటానికి ఎంతో కృషి చేశారు. అటువంటి వారిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారిని ముందుగా పేర్కొనక తప్పదు. శాస్త్రి గారు సుమారుగా ఇరవై మూడు చిన్న కథలు వ్రాసినట్లుగా కనిపిస్తున్నాయి.

1. అన్నంత పనీ జరిగింది, 2. వడ్లగింజలు, 3. శుభికే శిర ఆరోహ 4. తాపీ మేస్త్రీ రామప్పదీక్షితులు బి.ఏ., 5. గులాబీ అత్తరు, 6. మార్గదర్శి, 7. కన్యాకాలే యత్నాద్వరితా 8. గూడుమారిన కొత్తరికం. 9. అరికాళ్ళకింద మంటలు. 10. కీలెరిగిన వాత, 11. కలుపు మొక్కలు, 12. రాచపీనుగ తోడు లేకుండ వెళ్ళదు. 13. విమానం యెక్కబోతూనూ 14. తల్లిప్రాణం 15. కొత్త చూపు 16. ఇల్లు పట్టిన వెధవాడబడుచు. 17. యావజ్జీవంహోష్యామి 18. గుర్రప్పందాలు 19. ముళ్ళచెట్టూ కమ్మని పువ్వూను 20. జాగ్రత్తపడవలసిన ఘట్టాలు 21. కూతుళ్ళ తల్లి 22. నాటకం 23. షట్కర్మయుక్తా

పైన పేర్కొన్నవాటిలో చాలవరకు చిన్న కథ అని కథకులు పేర్కొన్నప్పటికి పరిణామాన్ని కథాకాలంబట్టీ, పాత్రలను బట్టీ అవి పెద్ద కథలు లేదా నవలికలు అని కూడా చెప్పవచ్చును. సాధారణంగా ఒక రచయిత భిన్నములైన లేక అనేకాలైన రచనలు చేసినపుడు వస్తువులోనో పాత్రలలోనో, సన్నివేశాల్లోనో సామ్యమో, ఐక్యమో కనిపిస్తుంది. కాని సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథల్ని పరిశీలిస్తే వస్తు వైవిధ్యం పూర్తిగా కనిపిస్తూనే సమకాలీన పరిస్థితులా కథకి మాత్రమే పరిమితాలై ఉంటాయి.

ఈ దృక్పథంతో శ్రీపాదవారి కొన్ని "చిన్న కథల్ని" పరిశీలించి విశ్లేషించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశ్యము.

**వడ్లగింజలు:** ఇది ఒక చిన్న నవల వంటిది. 1939లో దీన్ని రచించారు. 1941లో ఆంధ్రవారపత్రికలో అచ్చయింది. ఈ కథ యథార్థంగా జరిగిన సంఘటనకి రూపకల్పనమని రాజమండ్రిలోని పెద్దలు చెబుతుంటారు.

పెద్దాపురం రాజావారు మహారాజాధిరాజ, వేషణి హనుమంత, నెలవోలుగండాంక శ్రీవత్ససాయి చతుర్భుజ తిమ్మ జగపతి మహారాజు. ఆయన చదరంగంలో మహానిపుణుడు. ఆయనొక నియమాన్ని కూడా పెట్టుకున్నాడు. తనతో ఎవరైనా చదరంగమాడి తనపై ఓడిపోతే వాడి తల నరికి కోటగుమ్మానికి వ్రేలాడ తీస్తారట. అటువంటి పెద్దాపురం పట్టణానికి తణుకునుంచి తంగిరాల శంకరప్ప అనే బ్రాహ్మణుడు చదరంగం ఆటగాడు వచ్చాడు. వస్తూనే రాజదర్శనం చెయ్యాలనుకుని దివాన్జీ, ఠాణేదార్ల చేత అవమానం పొందుతాడు. పూటకూళ్ళమ్మ తన ఇంట్లోనే బస ఏర్పాటుచేసి ఆయనకి ధైర్యం చెప్పింది. ఆ కాలంలో పెద్దాపురం పట్నంలో ప్రతీ ఇంట్లో వాళ్ళకి చదరంగం ఆడటం వచ్చును. వాళ్ళ ద్వారా తన ప్రతిభని వెల్లడి చేసుకుని ప్రచారం అయ్యేటట్లుగా చేసుకోమంది. శంకరప్ప చదరంగక్రీడా నైపుణ్యం పెద్దాపురం పట్టణమంతా వ్యాపించింది. ఆ వార్త ప్రక్కనున్న సామర్లకోట మహారాజు శ్రీ రావు రాయడప్ప రంగారాయల వారికి చేరింది. వారు కూడా ఈ ఆటలో మేటి అయినవారే. పెద్దాపురం మహారాజుగారితో చదరంగం ఆడే నలుగురైదుగురిలో మొట్టమొదటి వారు. ఆ రంగారాయులు వారు శంకరప్పగారితో ఆడి ఓడిపోయారు. పంచారామల్లో ఒకటైన కుమారారామక్షేత్రానికే సామర్లకోట అని పేరు. ఈ వార్త పెద్దాపురం మహారాజుకి తెలిసింది. ఇంతకాలం వరకూ తనతో సమానంగా ఆడగలవాడు దొరక్క మహారాజు చదరంగం బల్లని పక్కకి పెట్టేసి అంతంత మాత్రం పరిచయం ఉన్నవాళ్ళు కూడా తనతో ఆడటానికి సిద్ధపడుతున్నారని తెలిసి తల తీసేస్తానని నియమాన్ని ప్రకటించాడు. అటువంటి మహారాజు శంకరప్పగారిని ఎలాగైనా ఒప్పించి తనతో ఆడటానికి తీసుకరమ్మని భటులతో పాటు పల్లకీ పంపించారు. కానీ శంకరప్ప తాను నడిచే వస్తానని భటులకి చెప్పి సున్నితంగా తిరస్కరించి మర్నాడు తన మిత్రులతో కలిసి మహారాజుగారి కోటలోకి వెళ్ళాడు. మహారాజు శంకరప్పగారిని ఆయన మిత్రుల్ని సాదరంగా స్వాగతించారు. ఆట ఉదయం ప్రారంభం అయింది. రాజుగారు ఎత్తు వెయ్యాలి. కాని ఆయన చెయ్యి బల్ల మీదికి వెళ్ళలేదు. నిజానికి ఆట కట్టేశారు శంకరప్పగారు. నెలరోజులు గడిచేయి. ఉదయం, సాయంత్రం వెళ్ళి బల్ల దగ్గర కూర్చోవడం తప్ప మరే పనేమీ లేదు. "మహారాజిక యెత్తు వెయ్యలేరు" అని అక్కడి ప్రేక్షకులు అనుకున్నారు. మహారాజు నిశ్చయించేసుకున్నారు. ఆరు మాసాలు గడిచేయి. ఒక రోజు మహారాజుగారు భటుల్ని పిలిచి శంకరప్పగారిని నిమిషాల మీద తీసుకురమ్మని

ఆజ్ఞాపించారు. శంకరప్పగారిని మహారాజుగారు కౌగలించుకొని తన సింహాసనం మీద కూర్చోపెట్టుకున్నారు. "తమరు నా ఆట కట్టేశారండి" అని రాజుగారన్నారు. ఏలినవారి ఆటకట్టడానికి నేనెంతవాణ్ణి మహాప్రభూ ! అని శంకరప్ప వినయాన్ని ప్రదర్శించారు. "అలాకాదండీ ! స్పష్టంగా నేనోడిపోయాను. చదరంగంలో నాకిదే మొదటి ఓటమి. దాసోహమ్" అని శిరస్సు వంచుకున్నాడు. నా రాజ్యంలో ఉన్నది ఏమైనా సరే తమకి సమర్పించుకుంటాను. సెలవిప్పించండి" అని రాజుగారు శంకరప్ప ఎదుట చేతులు జోడించి నిల్చున్నాడు. అప్పుడు శంకరప్పగారు చాలా నిర్లిప్తంగా బదులు చెప్పారు. "ఎదుట ఉన్నది మహాసముద్రమే కానీ నా చేతిలో ఉన్నది బుడ్డి చెంబుమాత్రమే. మహాప్రభూ ! నేను నిరుపేదను. నిరుపేదలకు కావలసినవి కూడూ, గుడ్డానూ. వీటిలో ఏలినవారు నాకొక్క అన్నం మట్టుకు పెట్టిస్తే అదే మహామేరువుగా సంతోషిస్తాను. "ఆయన మాటలు విన్నవాళ్ళంతా ఆశ్చర్యపడి ఈ పిచ్చిబాపడు ఏదో కాస్త మాన్యం కోరేస్తాడేమో అనుకున్నారు. కాని శంకరప్పగారి అమాయకపు కోరికకి ఆవేదన చెందారు. మహారాజు గారు వివరమడగ్గా "మహాప్రభూ! నా యిష్టక్రీడ చదరంగం. దానివల్లనే ఏలినవారికి నా యెడల ఆదరభావం కలిగింది. కనుక నా కోరిక దానికి సంబంధించే ఉండడం వుచితం" అని చెప్పి చదరంగానికి అరవైనాలుగు గదులు. మొదటి గదిలో ఒక వడ్లగింజ ఉంచండి. తరువాత రెండో గదిలో రెండు, మూడో గదిలో నాలుగు, నాలుగో గదిలో ఎనిమిది ఇలాగా వెళ్ళిన కొద్దీ రెట్టింపు చేయిస్తూ నాకు వడ్లగింజలు దయచేయించండి ప్రభూ !" అని శంకరప్పగారు ప్రార్థించారు. సభలో ఉన్న వాళ్ళకి ఏమీ బోధపడలేదు. మిత్రులకి మాత్రం అందులో కూడా ఏదో చాతుర్యం ఉందని తోచింది. ఉండుండి "మళ్ళీ మధ్యాహ్నం కలుసుకుందాం" అన్నారు మహారాజు. సభ ముగిసింది. పెద్దాపురం పట్టణం అంతా కోటలో ఉంది. కోట అంతా సభాభవనంలో ఉంది. మహారాజు శంకరప్పతో సింహాసనం అలంకరించాడు. ఆ సన్నివేశం సూర్యచంద్రులిద్దరూ ఒక్క మాటే, ఒక్క చోటే ఉదయించినట్టుందట. లెక్క తేలిందా? అని మహారాజుగారు షరాబు నడిగారు. "చిత్తం తేలింది మహాప్రభూ! అయితే వారి కోరిక తీర్చాలంటే పెద్దాపురం రాజ్యంలోనే కాదు త్రిలింగదేశం అంతటా వరుసగా నూరు సంవత్సరాలు పండిన ధాన్యం అయినా చాలదు" అంటూ షరాబు కాగితం మహారాజుకి అందించాడు. మహారాజు శంకరప్పగారూ ! వడ్లగింజతో కూడా నన్ను ఓడించేశారు తమరు. అందుచేత నా రాజ్యాన్నంతనీ మీకు

సమర్పించేస్తున్నాను తీసుకోండి ! అన్నారు రాజుగారు. తమరు రాజ్యంలో ఉన్నది ఏదైనా ఇస్తానన్నారు గాని రాజ్యాన్నిస్తానని మాట ఇవ్వలేదు. అని శంకరప్ప పలకగా అయితే తమ వాంఛితార్థమేమిటో సెలవిమ్మన్నారు మహారాజుగారు. "ఒక బ్రాహ్మణుడు సుఖంగా జీవించటానికి చాలినంత వృత్తి దయచేస్తే నాకదే మేరువు జగత్ప్రభూ !" అని శంకరప్ప బదులు చెప్పారు. రాజుగారు శంకరప్పకి సర్వాగ్రహారాన్ని ఇచ్చి గజారోహణ సత్కారాన్ని చేశారు. ఇది సూక్ష్మంగా కథా వస్తువు. దీన్లో రెండు ప్రధానాంశాలున్నాయి. ఒకటి చదరంగం క్రీడ. రెండవది వడ్లగింజల లెక్క. ఈనాటి వరకు ప్రపంచవ్యాప్తంగా చదరంగక్రీడలో అగ్రస్థానాన్ని పొందినవారిలో తెలుగు వాళ్ళున్నారు. ఈనాటికీ అగ్రగణ్యంగా ప్రపంచకీర్తిని సాధించిన చిరంజీవి కోనేరు హంపి చాల చిన్న వయస్సులోనే "గ్రాండ్ మాష్టర్" బిరుదుని దక్కించుకుంది. పై కథనిబట్టి మనరాష్ట్రంలో చదరంగక్రీడా నిపుణులు ఆబాలగోపాలమూ ఉన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన క్రికెట్టు కూడా తెలుగు పల్లెల్లో పుట్టిన బిళ్ళా - కర్రా, గోటీబిళ్ళా, గూటేబిళ్ళా అనే పేర్లతో పల్లె పిల్లలు ఆడే ఆటకి ప్రతిరూపమే అని చెబుతారు. ఈ విధంగా మన తెలుగు క్రీడాతేజం అంతర్జాతీయఖ్యాతి పొందిన విషయంపై కథ మనకి తెలియజేస్తుంది. రెండవది గణితశాస్త్రం. చదరంగం బల్ల మీద ఉన్న అరవైనాలుగు గళ్ళలోనూ శంకరప్పగారు చెప్పినవిధంగా ప్రతీగడిలోనూ రెట్టింపు చేస్తే ఎంత ధాన్యం వస్తుందనేది ఎవ్వరికీ సమాధానం దొరకని ప్రశ్న. పై కథ యథార్థమైతే శంకరప్పగారికీ లేకపోతే రచయితకి మాత్రమే తెలిసి ఉండాలి. ఆధునిక కంప్యూటరు వేత్తలు కొందరు అయిదువేల కోట్ల కోట్లు అని చెప్పారు. కానీ అవి ఎన్ని క్వింటాళ్ళు లేక టన్నుల బస్తాల ధాన్యం అవుతుందనేది నిపుణులైన కంప్యూటర్ శాస్త్రవేత్తలు ఈ లెక్కని గణించి క్వింటాళ్ళ రూపంలో తెలిపితే వాళ్ళ ప్రజ్ఞా, రచయిత ప్రజ్ఞా రెండూ వెలుగులోకి వస్తాయి.

**కన్యాకాలే యత్నాద్వరితా:** "కన్యా-కాలే=యుక్త వయస్సులో యత్నాత్ = ప్రయత్నము వలన వరితా = వరించబడింది అని ఈ శీర్షికకి అర్థం. ఇది కూడా చిన్న నవల వంటిదే. కథాకాలం కూడ చాల రోజులు గడిచేయి. పరిమిత కాలానికి సంబంధించి కాదు. అయితే ప్రధాన పాత్రలు రెండే ఆసాంతం ఉంటాయి. ఆ రెండు పాత్రలు లేకపోతే కథే లేదు. రచయిత దీన్ని కూడా చిన్న కథ అనే పేర్కొన్నారు. కందుకూరి, గురజాడల ప్రభావం ఈ రచయిత మీద, తద్వారా కథలో పూర్తిగా

కనిపిస్తుంది. అయితే పైన చెప్పిన రెండు పాత్రలూ పాఠకుల సానుభూతిని పొంది వాళ్ళ హృదయాల్లో నిలిచిపోతాయి. బాల్యవివాహాలు ప్రబలంగా ఉన్న రోజులు. అందునా, శ్రోత్రియులు తమ కుమార్తెలకి రజస్వలాత్పూర్వమే అంటే ఎనిమిదవ యేటనే పెళ్ళి చెయ్యాలనీ లేకపోతే తమకి రౌరవాది నరకాలూ కలుగుతాయనీ, కన్యాదాన ఫలితం దక్కదనీ భావించే రోజులు. అటువంటి రోజుల్లో పార్వతీశం రంగనాయికని పెళ్ళి చూపులు చూశాడు. రెండు పక్షాల పెద్దలకీ నచ్చింది. అమ్మాయి, అబ్బాయిల ప్రమేయం ఎంతమాత్రం ఉండదు. పెళ్ళి ముహూర్తం పెట్టేశారు. అయితే ముహూర్త సమయానికి పార్వతీశం తండ్రి చనిపోయాడు. రంగనాయికకి పన్నెండో యేట ఇంకో అబ్బాయితో పెళ్ళి చేసేశారు. తరువాత పార్వతీశం జానకిని పెళ్ళి చేసుకున్నాడు. ఈలోగా రంగనాయిక భర్త చనిపోయాడు. వితంతువుగా అన్నగారింటికి వచ్చి ఉంది. ఆ వూళ్ళోనే జానకీ పార్వతీశాలున్నారు. జానకీ రంగనాయికమ్మలు చెరువు దగ్గర కలిసేరు. రంగనాయిక జానకికి బాగా దగ్గరైంది. ఎంత దగ్గరంటే ఒకళ్ళనొకళ్ళు "ఒసే అక్కా ! అంటే ఏమే చెల్లీ" అని పిలుచుకునేవరకూ. ఒకళ్ళనొకళ్ళు పెనవేసుకుపోయారు. ఒకనాడు రంగనాయిక జానకిని ఏమే చెల్లీ ! నన్ను నీఇంట్లో ఉంచుకుంటావటే ! అంటే అంతకంటే భాగ్యం మరేం ఉంటుందే అక్కా ! అని జానకి బదులు చెబితే మీ ఆయన ఊరుకుంటాడా? అంటే నేను ఒప్పిస్తానుగా అని భరోసా ఇచ్చింది జానకి. అయితే ముగ్గురం కలిసే ఉందామా? అని పార్వతీశంతో అనుబంధాన్ని వ్యక్తం చేసింది. దానిక్కూడా సంతోషంతో ఒప్పుకున్న అమాయకురాలు జానకి. రంగనాయిక ఒక రోజు పార్వతీశాన్ని తన ఇంటికి పిలిపించుకుంది. పార్వతీశం రంగనాయిక అందానికి పరవశత్వం చెంది తన స్థితిని మర్చిపోయాడు. అటువంటి పరిస్థితుల్లో రంగనాయికమ్మ అన్న వెంకటేశం వచ్చాడు. పార్వతీశం దెబ్బకి వెంకటేశం ఎదురు తిరగలేక రంగనాయిక మీద తన పరాక్రమాన్ని చూపించాడు. గ్రామ కచేరీలో విచారణ జరిగింది. రంగనాయిక స్వయంగా సభలోకి వెళ్లి తానే స్వయంగా పార్వతీశాన్ని పిలిపించాననీ ఆయన తప్పేమీ లేదనీ వాఙ్మూలమిచ్చింది. ఆమె మేజరని, స్వతంత్రురాలని ఆమె ఇష్టం ఉన్నచోటికి వెళ్ళవచ్చని కచేరీ అధికారి తీర్పునిచ్చారు. జానకి సాదరంగా స్వాగతం చెప్పింది. జానకీ రంగనాయికలిద్దరూ పార్వతీశం భార్యలుగానే జీవనం సాగించారు.

ఇక్కడ ప్రయత్నంచేత వరించబడినది వితంతువే కానీ కేవలం కన్య కాదు. బాల్య వివాహాల దుష్పరిణామాలెలా ఉంటాయో వివరించే ప్రయత్నంలో రచయిత అసహజమైన సమాజవిరుద్ధమైన ముగింపునిచ్చారు. రంగనాయికమ్మ బాల వితంతువు. యుక్తవయస్కురాలైంది. గతంలో తనని పెళ్ళి చేసుకుంటాడని నమ్మింది. ఆ యువకుడు మళ్ళీ ఎక్కడైనా కనిపిస్తే ఆమె మనస్సతనిపట్ల చలించడం సమంజసం కావచ్చును. సరే పార్వతీశం స్త్రీ వ్యామోహంతో అందునా తనకై తాను వరించిన స్త్రీని లోబరచుకోవడం సహజం కావచ్చును. కానీ జానకిలాంటి స్త్రీ ఎంత అమాయకురాలైనా పరాయి స్త్రీ అంతకుముందెన్నడూ ఎరగనిదీ, తనతో పరిచయం లేనిదీ చెల్లీ ! అంటూ వరస కలిపేసి పలకరించినంత మాత్రాన తనతో పాటుగా తన భర్తకి మరో భార్యగా ఏ స్త్రీ కూడా ఒప్పుకోదు. వాళ్ళిద్దరిదీ అక్రమ సంబంధమే అవుతుందిగానీ భార్యాభర్తలు కాలేరు. అక్రమసంబంధం ఎప్పుడూ రహస్యంగానే జరుగుతుందే కాని వెల్లడికాదు ఒక వేళ వెల్లడైనా సమాజమా సంబంధాన్ని సహించదు. పైగా కచేరీ తీర్పు పూర్తిగా ధర్మవిరుద్ధమే కానీ హిందూధర్మశాస్త్ర సమ్మతం కాదు. కథక చక్రవర్తిగా కీర్తి పొందిన శ్రీపాదవారు ఇటువంటి కథను వ్రాయడం, దానికి ఈ విధమైన ముగింపునివ్వడంలోని ఆంతర్యం ఏమిటో విజ్ఞులు పరిశీలించవలసి ఉంది. ఏమైనా శ్రీపాదవారి కథా తులసివనంలో ఈ కథ ఒక గంజాయి మొక్కలా నాకు కనిపిస్తున్నది. బహుశా ఈ కథని ఆధారంగా తీసుకునే కావచ్చును కొన్ని మౌలికమైన మార్పులతో ఇటువంటి ముగింపుతో మనవూరి మారాజు అనే సినిమా కూడవచ్చింది. తరువాతి మరొక చిన్న కథ – "శుభికే శిర ఆరోహ"– ఇది పెళ్ళి మంత్రాల్లోని ఒక మంగళ వాక్యము. సామ వేదంలో ఒక సూక్తం.

**ముఖగ్ంహి మమ శోభయ భూయాగ్ం సం చ భగం కురు**
**శుభికే శిర ఆరోహ శోభయంతీ ముఖం మమ**

శుభికమంటే బాసికము. ఇది పెళ్ళి సమయంలో వధూవరులకు నుదుటను కట్టే ఒక ఆభరణము. దీన్ని లలామము అంటారు. "ఓ బాసికమా ! నా ముఖాన్ని శోభిల్ల చేస్తూ నా తలపై ఆరోహించుము. నాకు అధికమైన ఐశ్వర్యాన్ని కలిగించుము" అని ఈ మంత్రానికి అర్థము. ఈ మంత్రంతోనే మంగళహారతి ఇప్పిస్తారు.

ఈ కథలోని ఇతివృత్తం సాధారణంగా బ్రాహ్మణ కుటుంబాల్లో ఆనాటి నుంచి ఈనాటి వరకు జరుగుతూ ఉన్న సహజమైన వస్తువు. ఇందులో వాస్తవికతో పాటు వైదిక బ్రాహ్మణ కుటుంబాల్లో మేనరికపు వివాహాలు సర్వసాధారణమైన ఆచారంగా జరుగుతూ ఉన్నది. మేనమామ కూతుర్ని మేనత్త కొడుకుతో పెళ్ళి చెయ్యడం మేనరిక వివాహమంటారు. సోదరుడు సంపన్నుడై ఒక్కతే కూతురున్నట్లైతే అతని అక్క చెల్లెళ్ళు ఎవరిమటుకు వారు తమ కోడలిగానే చేసుకోవాలని రకరకాల ఒత్తిళ్లు తెస్తారు. ఈ కథ సుమారుగా 1939లో వ్రాయబడింది. ఇతివృత్తంలోని వాస్తవికతతో పాటు ఇందులో నాటి సామాజిక పరిస్థితుల్ని కూడ కథకుడు చాల అందంగా ప్రతిబింబింప చేశాడు. ఈ కథా వస్తువుకి కేంద్ర స్థానం రాజమండ్రి పట్టణం.

జగ్గప్ప, రత్తమ్మ అనే దంపతులకు జానకి అనే కూతురుంది. జగ్గప్పకి గంగమ్మ, రత్తమ్మ అనే ఇద్దరు అక్కలున్నారు. గంగమ్మ కొడుకు కలకత్తాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతగాడికి తెలుగు ప్రాంతమన్నా తెలుగు భాష అన్నా తెలుగు సంగీతమన్నా ఇష్టం ఉండదు. ఉత్తర భారతీయులు మాత్రమే తెలివైనవారని వాళ్ళ ఆహార వ్యవహారాలే గొప్పవనీ దక్షిణ భారతీయులు తినే వరి అన్నం వట్టి చెత్త అనీ అలాగే చింతపండు కూడ తినకూడని పదార్థమనీ వాదిస్తాడు. అంతేకాదు తన పేరేమిటని అడిగితే రొమేష్ అని చెప్పాడు. తెలుగు వాళ్ళు అ ఆ లని సరిగా పలకడం కూడ చేతకానివాళ్ళనీ ఉత్తర భారతదేశంలో ఆకారాన్ని ఒకారంగా పలుకుతారనీ చెప్తాడు. రొమేష్ అన్నావేమిటోయ్ నీ పేరు? రామేశం అన్న పేరు పనికి వచ్చింది కాదూ? అని జగ్గప్ప అడగ్గా రాముడికి ఈశ్వరుడేమిటి, తెలివితక్కువ కాకపోతే? అని ఎదురు సమాధానం హేళనగా చెప్పాడు. మరి రొమేష్ అంటే ఏమిటి? అని అడిగితే లక్ష్మీదేవికి భర్త అని అర్థం చెప్పాడు. అది ఏ భాష అని అడిగితే "సంస్కృతం" అని ఇంగ్లీషు ఉచ్చారణతో చెప్పాడు. అతని తల్లి గంగమ్మ కూడ కొడుకు చాల తెలివైనవాడని, కొడుకు మాట్లాడేదే సరియైన భాష అనీ వత్తాసు పలుకుతుంది. ఆ రొమేష్ తల్లిని గొం-గామాయ్ అని పిలుస్తాడు. అలా పిలుస్తాడేమిటని జగ్గప్ప అక్క గార్ని అడిగాడు. ఆవిడ చాల గర్వంగా "మా తోటికోడలి పేరు మంగమ్మ కాదూ? నా నాయనకి ఆవిడ మీద కూడ నా మీద వున్నంత భక్తి ఉంది. అందుచేత మా ఇద్దరిలోనూ భేదం తెలవడానికి, మమ్మల్ని చూసి ఈ మంచి

పద్ధతి ఇతర్లు నేర్చుకోడానికి, ఆవిణ్ణి "మొం-గామాయ్" అనీ నన్ను "గొం-గామాయ్" అనీ పిలుస్తాడు. అదేమిటో ఆ పిలుపు వింటే నాకు ప్రాణాలు లేచివస్తాయి. మా తోటికోడలు పొంగేపోతుంది" అంది కళ్ళు తిప్పుకుంటూ. హిందీ మాట్లాడే వాళ్ళే హిందువులు, అసలు బ్రాహ్మలంటే ఆర్యులుట. అంచేత హిందీలో మాట్లాడుకోకపోతే మనకి బ్రాహ్మణ్యమే నిలవదుట." అని సమాధానమిస్తుంది.

జానకి చేత సంగీత కచేరీ చేయించాలని కూర్చోబెట్టారు. సంగీత విద్వాంసుడు తబలా సిద్ధం చేశాడు. పురోహితుడు ముహూర్తం పెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు. మొదట్లో ఇష్టం లేకపోయినా అందరి బలవంతం మీద సంగీతోపాధ్యాయుడు కాంభోజీ రాగం వాయించగా జానకీ కంఠంలో ఆవర్తాలు రేపింది. జానకి "ఇతర దైవముల వల్ల నిలను సౌఖ్యమా" అని త్యాగరాజ కీర్తన యెత్తుకుంది. రాముణ్ణి సంబోధిస్తూ "మత భేదము లేక సదా మదిని మరులు గొన్న తనకితర దైవముల వల్ల సౌఖ్యమా? అని అనుపల్లవి నందుకుంది. రొమేష్ చింత పండు పులుసుకీ దీనికీ భేదం యేమి"టని ఈసడించుకున్నాడు. ఆ భావం కలగ్గానే ఉపాధ్యాయునిమీద యెంతయినా అసహ్యభావం కలిగిందతనికి. అంతలో జగ్గప్ప మరొక అక్క రత్తమ్మ తన కొడుకు రామేశాన్ని వెంటబెట్టుకుని వచ్చింది. వాళ్ళని చూడగానే రొమేషుకీ, అతని తల్లికీ తప్ప పెళ్ళికూతురితో పాటు అందరికీ ఆనందం కలిగింది. జానకి "మనసు దెలిసి బ్రోచినను మరచినను నీవే తనవాడన తరుణమిదే, త్యాగరాజ సన్నుత" అని చరణం పూర్తి చేసి, స్వరం వేస్తోంది. జానకి పాడిన పాట మధురంగా ఉండటం చేతనూ అందరూ ఆనందించటంచేతనూ రొమేష్ గుండెల మీద కొరడాలాగా తగిలింది. ఇలాంటి పాడు పాటల్ని నేర్పి మీరెంతమంది పిల్లల్ని పాడుచేస్తున్నారండీ? అని సంగీతోపాధ్యాయుణ్ణి దురుసుగా ప్రశ్నించాడు. అందరూ తెల్లపోయారు. కర్ణాటక గానం అనబడే కూతల తోటీ, త్యాగరాజు పడవ పాటలతోటీ, తెలుగుదేశం వొక్కటే కాదు, దక్షిణదేశమంతా పర్రా, దిబ్బా అయిపోయాయి. హిందూస్థానీ సంగీతమే సంగీతమనీ వాదించాడు. ఆ చెప్పడంలో ఆవేశం కూడ కనపరిచాడు. "సత్యం ఆవిష్కరించాననీ జాతీయతను తొలిచేస్తున్న చీడపురుగేదో దాన్ని బయటపెట్ట గలిగానని అతను ధన్యవాదాలు కూడా చెప్పుకొన్నాడు.

ఇది ఆనాటి ఇంగ్లీషు వ్యామోహంలో ఉన్నవారికి తెలుగు భాష, సంస్కృతి, తెలుగు సంగీతం మీద ఉన్న అభిప్రాయానికి నిలువుటద్దమని చెప్పతగి ఉంది.

ఇంతలో అక్కడికి మెడలో హార్మోనియాన్ని తగిలించుకొని ఒక యువకుడు, హిందూస్థానీ సంగీతమనే పేరుతో గార్దభ స్వరంతో గొంతెత్తి పెద్ద అరుపులాంటి ఆలాపననీ చేస్తూ లోపలికి వచ్చారు. రొమేష్, అతని తల్లీ మహా ఆనందాన్ని పొందుతున్నారు. ఒక పావుగంట గడిచిన తరువాత యెగిరి యెగిరి అలసిపోయి యువతీ, తిరిగి తిరిగి బడలిపోయి కుర్రాడూ చతికల బడ్డారు.

నాలుక పీక్కుపోయి, రొమేష్, అరగన్నులతో అప్పటికి అసలైన స్థాయి అందుకున్నాడు. కొడుకు రసానుభూతి చూసుకుని గంగమ్మ గర్వపర్వత శిఖరం యెక్కేసింది. ఏం జరుగుతోందో తెలియని పరిస్థితిలో అందరూ జడావస్థలో ఉండగా పురోహితుడు వాళ్ళ ఇద్దరి పరిస్థితినీ అర్థం చేసుకుని "శుభికే! శిర ఆరోహ శోభయన్తీ ముఖం మమా--" అని మంగళ హారతి సామయిక మంత్రం అందుకున్నాడు. ఆ పవిత్ర వేదఘోషలో వుత్తరాది భూతబాధ విముక్తి కాగా, వెంటనే సంగీతోపాధ్యాయుడు ఫిడేలందుకొని "నీ నామ రూపములకూ నిత్య జయ మంగళం" అన్న త్యాగరాజ కీర్తనని సౌరాష్ట్ర రాగంలో యెత్తుకొని పల్లవి మాత్ర, సంగతులన్నీ వేసి వాయించేశాడు.

ఈ కథ 1942 లో భారతిలో ప్రచురితమైంది. ఈ కథలో కథకుడు పైన చెప్పినట్లుగా తెలుగువారి మనః ప్రవృత్తుల్నే కాకుండా ఆనాటి యువకుల్లో ఉన్న పరభాషావ్యామోహంతో పాటు తెలుగు సంస్కృతి మీద ఉన్న ఏవగింపుని విస్పష్టంగా చిత్రీకరించాడు.

**తాపీ మేస్త్రి రామదీక్షితులు బి.ఏ.:** ఇది ఒక ఉపదేశాత్మకమైన చిన్న కథ. ఈ ఇతివృత్తానికి కూడ రాజమండ్రియే కేంద్రము. బ్రాహ్మణులు వైదిక విద్యని విడిచి లౌకికమైన ఇంగ్లీషు విద్య చదివి బి.ఏ. పట్టా పొందినప్పటికీ ఉద్యోగం లేక ఎన్ని అవస్థలు పడేవారో, అటువంటి కుటుంబాల్లో ఇంటి యజమాని చనిపోతే ఆ ఇల్లాలు వితంతువై పిల్లల్ని పెంచడానికి అగ్రహారాలను విడిచి రాజమండ్రి పట్టణానికి వచ్చి డిగ్రీ చదివిన కొడుకులు ఉద్యోగాలకై తిరిగి తిరిగి నానా అవస్థలను అనుభవించడమనే సామాజిక నేపథ్యంతో కథని వాస్తవికతకి భంగం కలగనీయక మధ్యతరగతి బ్రాహ్మణుల్లోని స్త్రీల నైజం ఎలా ఉంటుందో కళ్ళకి కట్టి చూపించాడు కథకుడు. అంతే కాక కుల వృత్తికి తగిన విద్యకున్న ప్రాముఖ్యాన్ని గుర్తించలేకపోతే ఇతర వృత్తుల మీద గౌరవంతో వాటిని కూడ చేయవలసి వస్తుందనీ అలా కాక భేషజాలకి పోతే ఉన్నది కాస్తా పోయి నీచస్థితికి దిగజారవలసి వస్తుందనే చక్కని

సందేశాన్ని కథకుడీ చిన్న కథ ద్వారా ఈనాటికీ ఉన్న అటువంటి కుటుంబాలకి అందించాడు. ఈ కథలో ఇంతకుముందు పరిశీలించిన కథలలోని వస్తువుకి పూర్తి వైవిధ్యం కనిపిస్తుంది.

ఇద్దరు వితంతు స్త్రీలు. ఒకరు కోనసీమ నుంచి, మరొకరు జల్లి సీమ నుంచి రాజమండ్రి వచ్చారు. ఇద్దరూ వైదిక బ్రాహ్మణులే. ఒకావిడకి ఒక కొడుకు, ఒక కూతురు, రెండవ ఆవిడకి ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఇద్దరి కొడుకులూ బి.ఏ. డిగ్రీ కలిగిన వాళ్ళే. ఇద్దరూ ఉద్యోగం కోసమే వచ్చారు. ఇద్దరూ ఒకరికి తెలియకుండ ఒకరు ఒకే చోటికి ఉద్యోగాలు వెతుక్కుంటూ తిరుగుతున్నారు. వీళ్ళ తల్లులు ఇద్దరిలో ఒకావిడకి కొంచెం బంగారం ఉంది. చాలా డాబు, దర్పం ఆమె మాటల్లో కనిపిస్తాయి. తన కొడుక్కి ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదనీ ఊరికే తిని కూర్చోకుండగా మంచి హోదా ఎక్కువ జీతం ఇచ్చే వాళ్ళ దగ్గరే ఉద్యోగం చేస్తాడని చెప్తుంది.

రెండవ ఆమె తన పేదరికాన్ని పైకి చెప్పుకుని పొట్ట నింపుకోవడానికి తన కొడుకు ఏ ఉద్యోగమైనా చేస్తాడని చెపుతుంది. ఆవిడ కొడుకు ఒక కాంట్రాక్టరు దగ్గర తాపీ పని వాళ్ల మీద మేస్త్రీ (సూపర్వైజరు)గా చేరాడు. ప్రారంభంలో కొంచెం జీతం తక్కువైనా క్రమంగా పెరుగుతూవచ్చింది. ఈ లోపులో మొదటి ఆవిడ ఒంటిమీద ఉన్న నగలన్నీ రోజుకి కొన్ని చొప్పున మొత్తం మీద ఆవిడ అమ్మిన నగలన్నీ రెండవ ఆవిడ కొడుకు కొన్నాడు. ఓడలు బళ్ళూ, బళ్ళు ఓడలూ అయ్యాయి. ఇద్దరి పరిస్థితీ తారుమారైంది. సూక్ష్మంగా కథ ఇది. తిండికి లేకపోయినా సినిమాలూ, నాటకాలూ చూస్తూ భర్త ఉన్నంత కాలం విచ్చలవిడిగా తిరిగి ఆ భర్తపోయిన తరువాత కూడా ఆ అలవాట్లను మానుకోలేక కష్టాలను పెంచుకుంది మొదటి ఆవిడ. రెండవ ఆవిడ తన పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని సంసారాన్ని జాగ్రత్తగా నడుపుకుంటూ తన కొడుకు చేస్తున్న పని ఏదైనా అది గౌరవప్రదమైనదే అని క్రమంగా కొడుకు సంపాదనతో తన పేదరికాన్ని దూరం చేసుకుంది.

1-12-1946 తేదీ నవోదయ సంచికలో ప్రకటితమైన శ్రీ రావూరి గోవిందాచారి గారి "కూటికోసం" అనే చిన్న కథ చదివి దాని ప్రేరణతో శ్రీపాద వారు ఈ కథని వ్రాశారట !

తరువాతి చిన్న కథగా పేర్కొనబడిన వాటిలో "మార్గదర్శి". ఇది నూట పదహారు పేజీల్లో ఉంది. ఇది ఒక విధంగా నవలే అని చెప్పవచ్చును. ఇదీ సందేశాత్మక మైనదే. ముఖ్యంగా బ్రాహ్మణ నిరుద్యోగ యువకులదే. ఇది కూడ రాజమండ్రిలోనే జరిగింది. ఈ కథ 1928 జనవరి భారతిలో ప్రచురితమై, తరువాత 5-1-1947 మొదలు "ఆనందవాణి"లో సీరియల్ గా ప్రచురితమైంది. ఇందులో తాత్విక విచారమూ, నిత్య జీవితంలో ద్వైతముయొక్క అవసరమూ అద్వైత ఫలితమూ నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల జీవన విధానమూ, బ్రతుకు తెరువుకై వాళ్ళ పోరాటమూ ఇవన్నీ చిన్న కథ అనబడే ఈ నవలలో చాలా విస్తృతంగా వర్ణింపబడి పాఠకుని చేత వాస్తవ పరిస్థితుల్ని ఆలోచింపచేస్తాయి. తరతరాలుగా సంచితమైన బ్రాహ్మణ ప్రతిభ ఎంత ఎక్కువున్నప్పటికీ "దానికి కారణం ఆత్మగౌరవం లేకపోవడం" దానిక్కారణం "ఆత్మ విశ్వాసం కలక్కపోవడమూ" ఆత్మజ్ఞానం అంటే ఏమిటో యెరక్కనేపోవడం.

"ఐహిక జీవితం జయావహంగా గడుపుకోవాలంటే ఆత్మజ్ఞానం ఎంత అగత్యమైనదో అంతమంది గురువులున్నారుకాని ఒక్కరు కూడ ఆ విషయం చెప్పరు. చివరికి తండ్రి కూడ చెప్పడు. వేలాది, లక్షలాది బ్రాహ్మణ యువకులు తప్పుదారిలో పడిపోవడానికి, అదిగో, అక్కడ పుట్టింది హేతువు" విజాతీయ విజ్ఞాన బోధ వలన రుచి మారిపోయిందనుకున్నా ఆ విజాతీయతలో ఉన్న విశిష్టత మన వాళ్ళకి బోధ పడలేదు. బుద్ధికి ఆ సంస్కారం అంటలేదు. విజాతీయుల ఆ సత్తా యేమాత్రం సంక్రమించలేదు. దృక్పథం సరిగ్గా మారలేదు. ఆ జాతి క్రమవికాసం ఎలా సాధ్యపడిందో మన ఇంగ్లీషు విద్యావంతులకి మన దౌర్భాగ్య దశ అవగాహన కాలేదు. కనకనే మన వాళ్ళు దాస్యంతో ప్రీతి పొందుతున్నారు. ఏ.బీ.సీ.డీ.లు వచ్చాయంటే చాలు నౌకరీ మీదికి పోతుంది చూపు. "నౌకరీ కోసమే అసలు ఏ.బీ.సీ.డి.లు ఆరంభించడం."

"వర్ణధర్మం యేమిటి? అన్న ఆలోచనే లేదు. "కుటుంబ సంప్రదాయం యెలాంటిది? అన్న విచారణ లేదు. చదివిన శాస్త్రాల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో అది గుర్తులేదు. రుచి అసలే లేదు."

"కళాశాల విడిచింది మొదలు - ఇక వొక్కటే ధోరణి, నౌకరీ, నౌకరీ అని"

"మునసబు కరణాల కొడుకులకూ నౌకరీయే కావాలి. తహసీల్దారు కొడుక్కీ, కలెక్టరు కొడుక్కీ, గవర్నరు కొడుక్కీ నౌకరీయే కావాలి. అగ్రహారీకుని కొడుక్కీ, మొఖాసాదారు కొడుక్కీ నౌకరీయే కావాలి. జమీందారు బిడ్డ దాకా యెందుకూ, ఆ జమీందారుకే నౌకరీ కావాలి అవధాన్లు కొడుక్కీ, శాస్త్రి కొడుక్కీ నౌకరీయే కావాలి. వర్తకుని కొడుక్కీ, పెద్ద కాపు కొడుక్కీ నౌకరీయే కావాలి. చాకలి, మంగలి, తలారి – వీళ్ళ కొడుకులకూ నౌకరీయే కావాలి. వంట బ్రాహ్మడి కొడుక్కీ, పురోహితుడి కొడుక్కీ నౌకరీయే కావాలి. పది ఇళ్ళల్లో భోజనానంతరం స్థల శుద్ధి చేస్తూ పొట్ట పోసుకునే వితంతువు కొడుక్కీ నౌకరీయే కావాలి.

"చదువుకోవడమే తటస్థపడితే ముష్టి వాడి కొడుక్కీ నౌకరీయే కావాలి, మరోటి పనికిరాదు. "ఇన్ని తరహాల వాళ్ళూ ముసురుకోవడం వల్ల చివరికి ఈ నౌకరీకి "ఉద్యోగం" అని ముద్దుపేరు. "గవర్నరు భార్యా తన భర్త ఉద్యోగస్తుడనే చెప్పుకుంటుంది. వెట్టివాని పెళ్ళాము తన పెనిమిటి ఉద్యోగస్తుడనే చెప్పుకుంటుంది."

"ఈ వ్యామోహం ఎంతవరకు వెళ్ళిందంటే తల్లి, తన కొడుక్కి నౌకరీయే కావాలని కోరుకుంటూ ఉంటుంది. అత్తగారు, తన అల్లుడు నౌకరీ చేస్తూ వుంటేనే అతనితో సంబరపడుతూ మాట్లాడుతుంది. కన్య తనని పెళ్ళాడే వాడు నౌకరీ చేస్తూ ఉంటేనే మురిసిపోతూ పీటలమీద కూచుంటుంది. పిల్లలు, తమ తండ్రి నౌకరీ చేస్తూ వుంటేనే "ఫలానా ఆయన బిడ్డలం" అని వెన్ను విరుచుకు తిరుగుతారు." దీనికంతకీ కారణం ఏమిటంటే రాజ్యాంగం ప్రజల చేతుల్లో లేకపోవడం. అందుచేత గొప్ప పండితుడూ, మహాకవీ, అఖండ శాస్త్రవేత్తా, పెద్ద కాపూ, కోట్లకు పడగలెత్తిన వణిక్ శిఖామణి, సాటిలేని పారిశ్రామికుడూ, చివరికి పత్రికా సంపాదకుడూ కూడ బంట్రోతుకి కూడ యెదురు చెప్పడానికి వీల్లేదు. దాసోహమ్మనవలసిందే. అక్రమమైన ఈ అధికార దర్పం చూసే ప్రతీ ఏ.బీ.సీ.డీ. కూడ నౌకరీకే యెగబాకడం."

రెండు–ఫలితం విషయమై తనకేమీ బాధ్యత లేకపోవడం, సాధ్యమైనంత వరకూ వొళ్ళు దాచుకోవడానికి వీలుండడం, యజమాని యేమంటే యేమిపోయింది. నెల తిరిగేటప్పటికి జీతండబ్బులు చేతిలో పడతాయి గదా ! అనే సిగ్గుమాలినతనం ముదిరిపోవడం.

వృత్తులు నీచాతి నీచాలు అన్న భావం అస్థిని పట్టిపోవడం వల్ల వచ్చిన పుట్టిమునక ఇది. ఈ విధమైన భావజాలంతో కథకుడు సమాజ చిత్ర పటాన్ని ముందుగా ఆవిష్కరింపచేసి తరువాత కథ మొదలు పెట్టాడు.

తూర్పుగోదావరి జిల్లాలో రామచంద్రపురం తాలూకాలో మహేంద్రవాడ అగ్రహారంలో ఒక పేద బ్రహ్మణుడు తంబురా వాయించుకుంటూ ఇంటింటికి వెళ్ళి భిక్షాటన చేసి కొడుకుని భార్యని పోషించుకుంటూ ఉన్నవాడు అకస్మాత్తుగా చనిపోయాడు. ఒకరోజున తల్లి కొడుకు దగ్గరికి వచ్చి "పది కుంచాల బియ్యమూ, రసవర్గమూ, పది రూపాయల రొక్కమూ ఉన్నాయి. నెల దినాలు గడిచి పోతాయి. మరి తరవాత కాలం యెలా గడుస్తుందీ? ఏమాలోచించావు తండ్రీ? అని అడిగింది. తండ్రి ఉన్నంత కాలమూ అన్నం కలిపి ముద్ద నోటికందించినావిడ ఆ తండ్రి పోయిన పది దినాలూ గడిచేటప్పటికి మాతృవాత్సల్యంలో కొత్త రుచి చూపించింది. అంటే అంతవరకు కొడుకు కడుపు నింపడానికి పాటు పడిన అమ్మ ఇప్పుడు ఆ కొడుక్కి తన కడుపు తానే నింపుకోవడానికి ప్రయత్నించాలని సూచన చేసిందన్న మాట ! పిల్ల వాడికి చదువు పూర్తి కాలేదు. పేదరికం వాని చదువుకి ఆటంకం కలిగించి అతి కష్టం మీద థర్డ్ ఫారం చదివేడు. వాళ్ళ ఇంటి ఎదటే ఒక పేద కోమటి చిన్న దుకాణం పెట్టుకుని జీవనం గడుపుతున్నాడు. అతని కొడుకుతో ఈ బ్రాహ్మణ పిల్లవాడికి స్నేహం ఏర్పడింది. ఒకనాడు ఈ బ్రాహ్మణ పిల్లాడు ఆ కోమటి పిల్లాడు పక్క వూరికి తీర్థానికి వెళ్ళారు. బ్రాహ్మణ పిల్లాడు తల్లి దగ్గర రెండు అణాలు తీసుకున్నాడు. కోమటి పిల్లాడు ఒక అణా తెచ్చుకున్నాడు. తీర్థంలో ఏదో ఒకటి కొనుక్కుని తినాలని బ్రాహ్మణ పిల్లాడు ఉవ్విళ్ళూరుతుండగా కోమటి పిల్లాడు తన దగ్గర ఉన్న అణాతో తమలపాకులు కొని కిళ్ళీలు కట్టి అంగట్లో అమ్మడానికి తిరుగుతున్నాడు. అతగాడలా అణాతో ప్రారంభించి సాయంత్రానికి ఒక రూపాయి అయిదణాల పందోమ్మిది కాసులు సంపాదించాడు. ఒక్క అణాతో ఎన్ని రెట్లు సంపాదించాడో అని ఆశ్చర్యపోయాడు బ్రాహ్మణ బాలుడు. ఆ కోమటి పిల్లాణ్ణి మార్గదర్శకునిగా భావించి వర్తకానికి పల్లెటూరు కంటె పట్టణమైతే బాగా రాణించవచ్చుననుకున్నాడు. తల్లితో కలిసి రాజమండ్రి వచ్చాడు. రాజమండ్రిలో ఆర్యాపురంలో ఒక చిన్న గది అద్దెకి తీసుకుని ఉన్నారు. ఏ వ్యాపారం చెయ్యాలనే ఆలోచనలో పడ్డాడు. వాళ్ళ ఇంటికి ఎదురుగా ఒక వకీలు గారున్నారు. ఆయన భార్య చాల ఉత్తమురాలు. ఆవిడ దగ్గర ఒక రూపాయి అప్పుగా తీసుకున్నాడు. రాజమండ్రి ఆనాడూ ఈనాడూ కూడా వ్యాపార కూడలి. అక్కడ రోజుకి నూరు రూపాయల వ్యాపారం నుంచి పది లక్షల రూపాయల వరకు రకరకాల వ్యాపారం నడుపుతుంటారు. బ్రాహ్మణ పిల్లాడు తన చేతిలో ఉన్న రూపాయిని పట్టుకుని ఒక బట్టల దుకాణంలోకి వెళ్ళి నాలుగు తువ్వాళ్ళు కొన్నాడు. వాటిని భుజాన వేసుకుని

వీధుల్లో తిరిగి వాటిని రూపాయిన్నరకి అమ్మేడు. మర్నాడు రూపాయిన్నరతో నాలుగు తువ్వాళ్ళు, ఒక అంగవస్త్రం కొన్నాడు. వాటిని లాభానికి అమ్మేశాడు. అలా అలా పెరిగి క్రమంగా ఒక కూలి వాని చేత బట్టల మూటని పట్టించుకుని వీధుల్లో తిరిగి అమ్మి ఆ తరువాత మొదట తాను రూపాయితో తువ్వాళ్ళు కొన్న కొట్టు పక్కనే ఒక గది అద్దెకి తీసుకుని బట్టల దుకాణం పెట్టాడు. ఈ వ్యాపారంలో అతనికి ఒక మార్వాడీ సహాయం చెయ్యడమే కాకుండా వ్యాపారంలో ఉన్న విశేషాలననేకం చెప్పాడు. ఆ విధంగా ఆ బ్రాహ్మణుడు క్రమంగా వ్యాపారం పెంచుకుంటూ లక్షాధికారి అయిపోయాడు.

"వినాశకాలం దాపరించడం వల్ల జగద్గురుత్వం వెలిగించిన బ్రాహ్మణ జాతి నౌకర్ల జాతిగా తయారయిపోయిందిప్పుడు. దీని వల్ల బ్రాహ్మణులే చెడడం కాక బ్రాహ్మణేతరులు కూడ పరమోత్కృష్టాలైన ఉత్పాదక శక్తీ, ఉత్సాహ శక్తీ, ప్రభు శక్తీ బుద్ధి పూర్వకంగా చంపుకుని ఉద్యోగాలకెగబాకి ఆత్మ వినాశం తెచ్చిపెట్టు కుంటున్నారు.

"కనక నేనమ్మా బ్రహ్మం మొగం నుంచి వూడిపడ్డానని యెత్తెత్తి కాళ్ళు వెయ్యక, రైతాంగంతో సహకరించడం నేర్చుకుని వ్యవసాయం చేసుకోమని, లేక పోతే యేదో వర్తకం సాగించమనీ, పెద్ద యెత్తు లేకపోతే, యే కాఫీ హోటలు దగ్గరో కిళ్ళీ దుకాణం పెట్టుకుంటే రాజాలాగా బతకవచ్చుననీ పాతిక రూపాయల పెట్టుబడితో. అది కూడా చేతకాక పోతే పొద్దుట పూట స్టీమర్ల దగ్గరా, సాయంత్రం సినిమాల దగ్గరా తిరిగి అమ్ముకోవచ్చును. అది కూడ ఇష్టం లేకపోతే కుట్టు మిషను పెట్టుకుని బట్టల అంగడి దగ్గర కూర్చుంటే బట్టలు కుట్టుకుని బతకవచ్చునని ఒక సందేశాన్నిచ్చి కథని పూర్తి చేశాడు కథకుడు.

ఈ విధంగా వైవిధ్యభరితమైన ఇతివృత్తాలతో తన కాలం నాటి సామాజిక స్థితిగతులను సార్వకాలీన సమస్యలూ, వాటి పరిష్కారాలూ విభిన్న వ్యక్తుల మనః ప్రవృత్తులూ చిత్రీకరిస్తూ పాఠకుల్ని కథతో పాటుగా తీసుకొని వెళ్ళగలిగే శైలిలో వ్రాసి చిరస్థాయిగా తెలుగు లోకంలో కథక చక్రవర్తిగా శాశ్వత కీర్తినార్జించారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. 1891లో తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రపురం తాలూకాలో జన్మించి వృత్తి రీత్యా రాజమండ్రి పట్టణంలోనే మొట్టమొదటి ఆయుర్వేద వైద్యునిగా గొప్ప పేరుని పొంది ప్రవృత్తిరీత్యా కథక చక్రవర్తియై తెలుగు సాహితీలోకంలో చిరంజీవులయ్యారు.

# కొడవటిగంటి కుటుంబరావు కథలు
# భావ విప్లవ సాధనాలు

కాత్యాయనీ విద్మహే

"సంఘ వ్యాధులు ప్రజాచైతన్యంతో తప్ప నిర్మూలం కావు... ఇటువంటి చైతన్యం రాజకీయ చైతన్యరూపం పొందే ముందు భావచైతన్యంగా పెరిగి రావాలి". (1962 జనవరి 21, విశాలాంధ్ర దినపత్రిక)[1]

"ఉన్న పరిస్థితులపైన జుగుప్సా, ఆగ్రహమూ సాంస్కృతిక విప్లవానికి కాళ్ళు. సాయుధ విప్లవానికి సాంస్కృతిక విప్లవం వాహనం. సామాజిక విప్లవం రావటానికి అడ్డంగా వున్న ప్రతి ఆటవిక, జమిందారీ, బూర్జువా లక్షణాలన్నీ చించి చెండాడటం విప్లవ రచయితల సాంస్కృతిక వైఖరి కావాలి". (1971 సెప్టెంబరు, సృజన)[2]

మార్క్సిస్టు తత్త్వవేత్తగా సాహిత్య ప్రపంచంలో అందరికీ తెలిసిన కొడవటిగంటి కుటుంబరావు భావచైతన్యం గురించి, సాంస్కృతిక విప్లవం గురించి అరవై డెబ్భై దశకాలలో చెప్పిన ఈ మాటలసారం పందొమ్మిది వందల ముప్ఫయిలనుండే అంటే కథా రచయితగా జీవితం ప్రారంభించిన తొలినాళ్ళ నుండే ఆయన కథాసాహిత్య వ్యూహంగా వుందంటే అది అతిశయోక్తి కాదు. అత్యంత వాస్తవం.

అలాగని కొకు పుట్టుకతోనే మార్క్సిస్టు అని చెప్పటం ఉద్దేశం కాదు. నిజానికి వర్గసంఘర్షణ, వర్గపోరాటం ఆయన కథలకు ఎప్పుడూ ప్రత్యక్ష వస్తువు కాదు. అయితే జీవితం పట్ల భౌతిక వాస్తవిక దృష్టి, విమర్శ తొలినుండి ఆయన సంస్కారంలో భాగం అయ్యాయి. నిత్యజీవితంలో అంతఃస్రవంతిగా కలిసి పోయి, ఉగ్గు పాలతో రక్తంలో జీర్ణించుకుపోయిన దురన్యాయం, దుర్మార్గం, అనాగరికత, కుసంస్కారం మొదలైన వాటిలో బందీలైన మనుషులు, స్వస్వరూప జ్ఞానం సంపాదించి స్వీయవిముక్తికి ప్రయత్నపరులు కావాలన్న ఆకాంక్ష ఆయనలో 1930ల నాటికే బలీయంగా వుంది. జీవితాన్ని ఎవరికి చాతనయిన విధంగా వారు, ఎవరికి చాతనయినంత వరకు వారు విమర్శించి అటువంటి విమర్శనంతా సాహిత్యరూపంగా

పోగుచేస్తే అది అందరికీ ఉపయోగపడుతుందని కొకు భావించాడు.[3] కథ అందుకు ప్రధాన సాధనం అన్నాడు. భౌతిక సామాజిక దృష్టికోణం నుండి జీవితాన్ని ఆరోగ్యకరంగా మలచుకొనాలనుకొనే సామాన్య లౌకిక జ్ఞానం కల ఏబుద్ధి జీవికి అయినా జీవితం పట్ల ఎంత బాధ్యత వుంటుందో అంత బాధ్యతతోనూ కొకు తన కథాసాహిత్య సృజనావ్యాసంగాన్ని ఒక భావ విప్లవ సాధనంగా పదునెక్కించుకొంటూ నిర్వహిస్తూ వచ్చాడు.

1948 నాటికి కొకు మార్క్సిస్టు జ్ఞాన చైతన్యాలతో పరిణితి చెందే ప్రక్రియ దాదాపు పూర్తయింది. 1949 సెప్టెంబరులో వ్రాసిన నా కథా రచన అన్న వ్యాసంలో ఆయన నేను 'అభ్యుదయవాదిని' అని స్పష్టంగా చెప్పుకొన్నాడు. అయితే మధ్య తరగతి బుద్ధిజీవిగా తన పరిమితులు తెలిసినవాడు కనుక మధ్యతరగతి సంస్కారంలో ప్రజాసాహిత్యం, శ్రామిక వర్గ సాహిత్యం సృష్టించలేవని కూడా చెప్పుకొన్నాడు. కాని మధ్య తరగతి వారిలో ప్రజాజీవితానికి అనుకూలించే పరివర్తన తెచ్చే అవకాశం తనకుందన్న ఎరుక ఆయనకు వుంది.[4] భిన్న జీవిత సందర్భాలలో సంఘర్షణకు లోనయ్యే మనుషులకు, సమస్యలను ఎదుర్కొనే మనుషులకు అవసరమైన చైతన్యాన్ని ధైర్యాన్ని ఇయ్యటం, వ్యక్తిత్వం కోల్పోయినా వాళ్ళకు వ్యక్తిత్వం ఇయ్యటం ప్రయోజనంగా కొకు కథారచన సాగింది.

ఈ క్రమంలో పెళ్ళి, పిల్లల పెంపకం, కౌటుంబిక సామాజిక రాజకీయ సంబంధాలు మొదలైన వాటి సంబంధంలో శిథిలమయిపోయే సనాతన శక్తులతో ఆధునిక జీవితరంగస్థలం మీద మనుషులు చేస్తున్న వివిధ పోరాటాలను చిత్రించిన కొకు కథల అధ్యయనం చాలా ఆసక్తికరంగా వుంటుంది.

## I

ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల పేరిట స్త్రీల పట్ల అనాగరికంగా, సంస్కార రహితంగా ప్రవర్తిస్తున్న సమాజంలో మార్పుకు కొన్ని పరిష్కారాలతో ముందుకు వచ్చింది. సంస్కరణోద్యమం స్త్రీ పునర్వివాహం అందులో ఒకటి. వితంతు వివాహాలకు జీవితకాలపు కృషి చేశాడు. వితంతు వివాహానికి చట్ట బద్ధత అయితే లభించింది కానీ 1930ల నాటికి కూడా అది మానవజీవిత సంస్కారంలో భాగం కాలేదు. ఆ రకంగా ఆ సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఉద్యమాల

వల్ల, చట్టాల వల్ల కాని పనిని జీవితంలో సాధించటానికి ఎవరి మార్గాలు వారు వేసుకోవలసిందే. పురోగమనానికి అవరోధంగా వున్న దుష్టశక్తులను ఎదుర్కొని బుద్ధి చెప్పవలసిందే. ఆ అవసరాన్ని తీర్చటానికి, ఆ రకమైన చైతన్యాన్ని, జనంలో కలిగించటానికి కొకు వ్రాసిన కథ సనాతనిస్టు విభ్రమం. (1935 నవంబరు). ఒక పల్లెటూళ్ళో లచ్చయ్యగారు, ఆయన కూతురు సరోజిని బాలవితంతువు. ఇంగ్లీషు చదువులో పెట్టాడు. మళ్ళీ పెళ్ళి చెయ్యాలన్న ఆలోచనలో వున్నాడు. ఇంగ్లీషు చదువు, వితంతు పునర్వివాహం రెండూ హిందూమత ధర్మానికి కూడనివే నన్న గట్టి నమ్మకం వున్న పెద్దమనుషులున్న వూళ్ళో వీళ్ళను తట్టుకొనటం సరోజిని వివాహానికి సానుకూలవాతావరణం ఏర్పరచటం ఎట్లా? ఈ వైరుధ్యాన్ని పరిష్కరించే క్రమంలో రూపొందిందే ఇందులోని ఇతివృత్తం.

కాలాన్ని వెనక్కుతిప్పాలని చూస్తున్న మూర్ఖులలో ఒకడుగా యాజులు పాత్రను సృష్టించాడీ కథలో కొకు. సనాతనవాది కనుక సనాతనిస్టు అయినాడతను. అతనికి సైదోడు ఆ వూళ్ళో సీతాపతి, శంకరయ్య వంటి వాళ్ళు. లచ్చయ్య కూతురికి చదువు చెప్పించటం, ఆ పిల్ల జుట్టు దువ్వుకోటం, పూలు పెట్టుకోవటం అన్నీ వాళ్ళకు అభ్యంతరకరాలే. పెళ్లెట్లా చేస్తాడో చూద్దాం అన్నది యాజులు సవాల్. పెళ్ళి చేస్తే ఊళ్ళో ఉండనిస్తామా అన్నది అతని ధీమా. ఈ పరిస్థితులలో లచ్చయ్య ఇంటికి వచ్చిన ప్రసాదరావు, తన గురించి ఆరా తియ్యమని యాజులు పంపిన శంకరయ్యను వ్యూహం ప్రకారం తన వైపు తిప్పుకొనటం, యాజులు ప్రవర్తనను అనుమానించేట్లు చేయటం, యాజులను ఒక అపరాధ పరిస్థితిలోకినెట్టి సరోజని పెళ్లి గురించి ఆమె తండ్రిని ఇబ్బంది పెట్టగల సాహసానికి ఒడిగట్టనీయని పరిస్థితిని కల్పించటం సనాతనిస్టు విభ్రమంలోని ఇతివృత్తం.

ప్రసాదరావు కాలానికి అనుగుణంగా మారుతున్న యువతకు ప్రతినిధి. మార్పుకు అవరోధంగా వున్న శక్తులతో పోరాడుతూ కొత్తమార్గాలు వేసుకొంటూ పోవటం ఆధునికుల స్వభావం. సరోజినికి అతను పినతల్లి కొడుకు. సరోజిని వివాహం అయిన మరుక్షణం ఆమె తండ్రిని వెలివేయటానికి సిద్ధంగా వున్న యాజులుని కోరలు తీసిన పామును చేయటం లక్ష్యంగా అతనావూరికి వచ్చాడు. అనుకొన్నది సాధించాడు. యుగధర్మం ఎప్పటికప్పుడు ఆ సమాజ అవసరాలను బట్టి మారతుంటుందని, అది అనుసరించదగినదని సనాతన ధర్మం మార్పుకు

లోనుగాని జడత్వస్థితిలో వుంటుందని అది లెక్క చేయతగినది కాదని ప్రసాదరావు చేత శంకరయ్యకు చెప్పించాడు కొకు.

శంకరయ్య యాజుల కూటమిలో వాడే అయినా గాంధీపట్ల అభిమానం అతనిని వారికంటే భిన్నంగా కొంత అభ్యుదయకరంగా నిలబెట్టింది. ఏ సమస్యనయినా అర్థం చేసుకొనటానికి అతనికి గాంధీ ప్రబోధమే గీటురాయి. అది తెలిసిన వాడు కనుకనే ప్రసాదరావు అతనిని కలుపుకొచ్చుకొనటం ఉపయోగకరంగా వుంటుందనుకొన్నాడు. తద్వారా యాజులు బలాన్ని తగ్గించగలిగాడు. సరోజిని పెళ్ళి తరువాత తన పెత్తంద్రికి వూళ్ళో పెద్ద వ్యతిరేకత లేకుండా చేయగలిగాడు. పెత్తంద్రిని వేలు పట్టి చూపగలిగిన పరిస్థితి యాజులకి లేకుండా చేశాడు. వితంతు పునర్వివాహం పెద్ద సమస్యకాదు కొకు దృష్టిలో. ఆ వివాహం చేసుకొని నిలబడగల జీవిత సంస్కారాలు యువతలో స్థిరపడటం, అలాంటి వివాహాన్ని ఆమోదించగల సంస్కారం కుటుంబ పెద్దలలో స్థిరపడటం, వ్యక్తుల జీవితాల మీద పెత్తనాలు చేసే భూస్వామ్య పెత్తందారీతనపు కుసంస్కారాలు చుట్టూ జనంలో తగ్గుతూ రావటం అత్యంత ముఖ్యమైనవి. పెళ్ళి చేసుకోవలసిన సరోజిని ఆ చైతన్య స్థాయికి వచ్చింది. వీరేశలింగం గారి కాలంలో లాగా ఆమెను ఇంటినుండి దొంగచాటుగా తప్పించి పెళ్ళి జరిపించవలసిన పరిస్థితి కూడా లేదు. తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు ఆమెకు పునర్వివాహం చేయగల సంస్కారాన్ని అభివృద్ధి చేసుకొన్నారు. ఉన్న అభ్యంతరమంతా గ్రామంలో సనాతన ధర్మానికి ప్రతినిధులం అనుకొని విర్రవీగే వాళ్ళనుండే, వాళ్ళను నియంత్రించటానికి ప్రసాదరావు పన్నిన వ్యూహం అందరికీ అన్నివేళలా సరిపోయింది కాకపోవచ్చు. కానీ ఎప్పుడయినా ముందడుగు వేయదలచుకొన్నవాళ్ళు తమను ఆపే శక్తులను ఎలా గుర్తించాలో ఎలా 'చెక్' పెట్టాలో తెలుసుకొనటానికి, జాగ్రత్త పడటానికి మాత్రం ఇది ఒక ప్రేరణ అవుతుందని కొకు భావిస్తాడు.

యుద్ధంలో ప్రత్యర్థి స్వభావాన్ని బలబలాలను బట్టి వ్యూహాలు మార్చాల్సి వస్తుంది. సనాతనిస్టు విభ్రమం కథలో ప్రత్యర్థి ఊళ్ళోని పెద్దమనిషి. అతని కోరలు తీయటం అతనినొక ఇబ్బందికరమైన పరిస్థితులలోకి నెట్టి అనుమానంతో తలవంచుకొని నోరుమూసుకొని వెళ్ళే విధంగా చేయటం ద్వారా సాధ్యమైంది. అయితే అన్ని సందర్భాలలో ప్రత్యర్థులు బయటివాళ్ళే కారు. ఇంట్లో వాళ్ళు, మనవాళ్ళే అయినప్పుడు వారి పట్ల కూడా ఇలాంటి వ్యూహాలు సరిపోతాయా అంటే సరిపోవు.

అది మరింత సున్నితంగా నిర్వహించాల్సిన కార్యం. 'పాత సంప్రదాయం' (1931 సెప్టెంబరు) కథను ఆ కోణం నుండి చూడాలి.

సంఘ సంస్కరణోద్యమం అతిబాల్య వివాహాలను వృద్ధులతో వివాహాలను కూడదన్నదే కానీ రజస్వల పూర్వ వివాహాలను ఎక్కడా కాదనలేదు. 1940ల వరకు రజస్వల పూర్వ వివాహాలు యథేచ్ఛగా సాగుతూనే వున్నాయి. చదువుకొన్న వారిలో, ఉద్యోగస్తుల కుటుంబాలలో పట్టణీకరణ ప్రభావంతో ఆధునిక సామాజిక అవసరాల దృష్ట్యా సర్దుబాట్లు చేసుకొంటూ అభివృద్ధి క్రమంలోకి ప్రయాణిస్తున్న వారిలో, స్త్రీ విద్య పట్ల సానుకూలత బలపడిన సందర్భం నుండి రజస్వల పూర్వ వివాహాల పట్ల వైముఖ్యం పొడసూపింది. అట్లా ఆధునికులైన వాళ్ళు ఏ రకం సమస్యను ఎదుర్కొనే అవకాశం వుందో చూపిన కథ 'పాత సంప్రదాయం'.

పట్టణంలో న్యాయమూర్తిగా వున్న సోమసుందరం గారింట్లో అంతా నూతన సంప్రదాయం. పన్నెండేళ్ళు నిండిన పిల్లకు పెళ్ళి చేయకుండా హైస్కూలు చదువుకు పంపటం ఆ నూతన సంప్రదాయంలో భాగమే. హైస్కూలు చదువు పూర్తయ్యాకనే పిల్ల పెళ్ళి తలపెట్టాడు. రజస్వల అయిన పిల్లను పెళ్ళాడటానికి విద్యావంతులు ఆధునికులు అయిన మధుసూదనరావు వంటి యువకులు అంగీకరించవచ్చు. కానీ వాళ్ళ బంధువులు అంగీకరిస్తారా అంటే అంగీకరించకపోవచ్చు. అయినా 'ఇది నా వివాహం' నా యిష్టం అనే హక్కు యువకులకు వుంది. బంధువులను పట్టించుకోకుండా వదిలేసే వీలుంది. అయితే కన్నతల్లి నుండే తన చర్యకు ఆమోదం లేకపోతే ఆమెనలా వదిలెయ్యటం సాధ్యమా? సముచితమా? ఈ సమస్యను మధుసూదనరావు ఎలా పరిష్కరించుకొన్నాడన్నదే 'పాత సంప్రదాయం' లోని ఇతివృత్తం.

మధుసూదన్‌రావు కొత్త సంప్రదాయంలో వాడు. కనుక రజస్వల అయిన లీలను పెళ్ళాడటం అతనికి ఇష్టమే అయింది. తల్లి యిష్టాయిష్టాలను అతను ప్రత్యేకంగా అడగలేదు. తల్లి హనుమాయమ్మకు రజస్వలానంతర వివాహం ఇష్టం కాదు. తన ఇష్టాన్ని చెప్పే అవకాశం ఆమెకు దొరకలేదు. పెళ్ళయిపోయింది. తల్లి వచ్చి తనతో వుండటానికి ఇష్టపడక పోవటంతో సమస్య మొదలైంది. భార్యతో సెలవులకు తల్లి దగ్గరకు వెళ్ళి వున్న కాలంలో ఆ సమస్య తీవ్రత తెలిసింది. కొడుకు కోడళ్ళతో సరిగా మాట్లాడక పోవటం, కోడలిని సాధించటం - పిల్ల

పెద్దది, చదువుకున్నది కావటం వల్ల భర్త పట్ల అత్తపట్ల భయభక్తులు చూపించి సేవ చెయ్యదన్న అనుమానంతో చూడటం - ఇది కనిపెట్టిన దంపతులు ఆడిన నాటకం హనుమాయమ్మలో మార్పుకు కారణమవుతుంది. కోడలు అత్త వెంట పనులకు దిగటం, అత్త కసిరినా, దెప్పినా సమాధానం చెప్పకుండా తలదించుకొనటం, కొడుకు తల్లి ముందు కోడలిని కసురుకోవటం, కోపగించుకోవటం ఇదీ నాటకం. ఈ క్రమంలో హనుమాయమ్మ కోడలిని అభిమానించి దగ్గరకు తీయటం, కోడలిని వేధించవద్దని కొడుకుకు హితవు చెప్పటం - ఇదీ పరిణామం. మధుసూదనరావు లీలను ఇష్టపడి చేసుకొన్నాడు. ఆమెను దగ్గరనుండి అర్థం చేసుకొన్నాడు కనుక నెత్తిన పెట్టుకొన్నాడు. తల్లి కూడా ఆమెను అర్థం చేసుకొని నెత్తిన పెట్టుకోవాలన్నది అతని ఆంతర్యం. వాదించటం నచ్చచెప్పటం, కోడలిపట్ల తల్లి వైముఖ్యాన్ని కొడుకును కొంగుకు కట్టేసుకొందన్న భావాన్ని పెంచటానికే తోడ్పడుతాయి తప్ప ఫలితముండదు. ఆలోచించగల వివేకం వికసించిన స్థితిలో లేదు కనుక తల్లిని ఒప్పించటం చర్చలతో, సంభాషణలతో సాధ్యం కాదు. ఆమె మనసును గెలుచుకొనటం ఒక్కటే మార్గం. మిత్ర వైరుధ్యాల పరిష్కారానికి అవలంబించాల్సిన వ్యూహమూ కొంత ప్రత్యేకంగానే వుండాలి. సరళసుందరంగా ఫలితాన్ని సాధించేటట్లు వుండాలి. పాత సంప్రదాయాలలో చిక్కుకొన్న హృదయాన్ని ప్రేమ సంబంధాలతో మేల్కొల్పటం మధుసూదన్‌రావు వ్యూహం సాధించిన విజయం.

## II

యువతరం వ్యక్తిత్వంతో జీవించాలంటే కుటుంబాలలోని నిలువనీటి సంప్రదాయాలతోనూ, జీవితపద్ధతులతోనూ, వైఖరులతోనూ - సంఘర్షించటం ఎంత అవసరమో నిలువనీరు, అక్కపెళ్ళి, పెళ్ళి చెయ్యకుండా చూడు వంటి కథలలో చిత్రించి చూపాడు కొకు.

1940 ల నాటికి కౌటుంబిక ఆర్థికసంబంధాలలో 'దత్తత' ఒక ప్రత్యేకాంశం. స్త్రీలకు ఆస్తిహక్కు లేకపోవటం వలన, పుత్రుడు పున్నామనరకం నుండి తప్పిస్తాడన్న విశ్వాసం వలన వితంతు స్త్రీలు, ఆడపిల్లలున్న పురుషులు కూడా మగపిల్లలను దత్తు తెచ్చుకొనటం ఆచారంగా వుండేది. దత్తత వెనుక వున్న ఆర్థికసంబంధాల మీద దృష్టి పెట్టి అవి మనుషుల సంబంధాల మీద వేసే ప్రభావాలను వ్యాఖ్యానిస్తూ

కొకు వ్రాసిన కథలలో 'నిలవనీరు' (1945) ఒకటి. ముగ్గురు కూతుళ్ళున్న వెంకటప్పయ్య వంశం నిలబెట్టుకొనటానికి దత్తు చేసుకోదలచుకొన్నాడు. శ్రీరాములును దత్తు ఇయ్యటానికి సిద్ధపడ్డాడు అతని తండ్రి. దారిద్ర్యనరకం తప్పించుకొనటం దత్తు వల్ల ప్రయోజనం అని అతని నమ్మకం. శ్రీరాములు పద్దెనిమిదేళ్ళవాడు. అతను తమ ఇంట్లో అతుకుతాడో లేదో పరీక్షించి చూచుకొనటానికి వేసవి సెలవులు రెండు మూడు నెల్లు తమ దగ్గరకు పంపమని వెంకటప్పయ్య అడిగాడని తండ్రి శ్రీరాములును రైలెక్కించటంతో కథ ప్రారంభమవుతుంది.

శ్రీరాములు ఇంటి నుండి బయలుదేరినప్పుడు వదినెగారు ఎదురొచ్చింది అని చెప్పి ఆ పిల్లకిటువంటి విషయాల్లో పట్టుదల జాస్తి అంటాడు కొకు. నిలవనీటి సంప్రదాయాలలో 'శకునాలు' భాగం. జీవితంలో అతి సహజభాగంగా అవి కొనసాగుతున్న స్థితిని సూచించాడు కొకు. ఆ మాట ద్వారా 'శకునం' రాబోయే మంచి చెడులకు సంకేతాలనుకొంటే వదినగారు శ్రీరాములకు ఎదురురావటం అతనికి మంచి జరగాలని, అంతరాత్మను 'యావత్తు చంపుకుని లంజటక్కులన్నీ వినియోగించి' వారి మెప్పు సంపాదించు అని తండ్రి శ్రీరాములకు చేసిన బోధను గమనిస్తే అంతరాత్మను చంపుకున్నాక, ఆత్మవంచన చేసుకొని పరవంచనకు పాల్పడ్డాక ఇక జరిగే మంచి ఏముంటుంది అన్న ప్రశ్నరాకమానదు. గతానుగతికంగా ఒక మూసపద్ధతిలో యంత్రాలలాగా మనుషులు ప్రవర్తిస్తూ వుండటమే జీవితాన్ని గుంటగా మారుస్తుంది. రొచ్చు చేస్తుంది.

వెంకటప్పయ్యగారింటికి వెళ్ళాక పద్దెమినిదేళ్ళ శ్రీరాములు ఆ కొత్తవాళ్ళను అమ్మానాన్నలుగా పిలవటానికి స్వీకరించటానికి పడిన హింస ఒక ఎత్తయితే వెంకటప్పయ్య గారి చిన్న కూతురు హైమవతిని చెల్లెలి వరుసతో అనుకొనటానికి పిలవటానికి పడిన యాతన మరొక ఎత్తు. హైమవతి పట్ల కలిగిన స్నేహం, ఇష్టం ప్రేమగా మారుతుంటే చెల్లెలి వరుస అడ్డు తగులుతున్నది. చెల్లెలుగా ఆమెను నమ్మటానికి, సహజమైన కారణాలు ఏవీ లేవు. ఈ పరిస్థితులలో అతడు తాను పడే ఘర్షణను అత్తింటి కాపురానికి పోయిన ఆడవాళ్ళ కష్టం వంటిదేనని అర్థం చేసుకోగలుగుతాడు. పరాయి వాళ్ళను కొత్తవాళ్ళను వరుసలు పెట్టి పిలవాల్సి రావటం, లోపలలేని ప్రేమను, గౌరవాన్ని చూపాల్సిరావటం, తనకు సంబంధించిన

విషయాల్లో శ్రద్ధ తీసుకోవాల్సి రావటం – మొగుడూ. అత్త, పై నుండి చేసే నిర్బంధం కన్నా మించిన నిర్బంధం అనుకుంటాడు శ్రీరాములు. ఇది స్త్రీ తనను తాను ఒక నిర్బంధంలోకి సర్దుబాటు చేసుకోవటం. 'ఆకారమైనా లేని ఆచార పిశాచానికి దాస్యం' అంటాడు కొకు దీనిని. దత్తుకొడుకుకు అయినా కొత్తకోడలుకయినా ఇది సామాన్యమే. ఈ రకమైన సంఘర్షణ తీవ్రతరమయ్యే కొద్దీ శ్రీరాములు నిలువనీట జీవితంలో కదలిక ప్రారంభమైంది క్షయవ్యాధితో బాధపడుతున్న హైమవతి భర్త మరణించటంతో ఆ కదలిక కొంత స్పష్టస్వరూపాన్ని తీసుకొంది. చెల్లెలిని పలకరించటానికి వచ్చిన మాణిక్యం తన మాటలతో, హెచ్చరికలతో ఆ నిలవనీటిని ప్రవాహంగా మార్చింది. 'వెధవముండగా అక్కుపక్షల్లేబతకదలచుకున్నావా?' అని ఎగతాళిగా మాట్లాడి మళ్ళీ పెళ్ళి చేసుకొని నీ విధిని నిర్వర్తించమని చెల్లెలిని హెచ్చరించింది. శ్రీరాములికి తన చెల్లిని పెళ్ళి చేసుకోమని చెప్పింది. చెల్లెలి వరుస అని అతడంటే ఇదెక్కడి చెల్లెలి వరుస అని తిరస్కరించి పారేసి దత్తుకు ఒప్పుకోవద్దని సలహా ఇచ్చింది. 'గోత్రం' అని అతను ప్రశ్నార్థకం మొహం పెడితే గోత్రాలేమిటి అవెప్పటివి అని నిరసించింది. దానితో శ్రీరాములు హైమవతి అక్క సలహా ప్రకారం చేసేద్దామా అన్న అభిప్రాయానికి వచ్చేస్తాడు.

తల్లిదండ్రులు చేసిన పెళ్ళి చేసుకొనటం, భర్త, అత్తింటివారికి అధీనంలో సంప్రదాయం నిర్దేశించిన చట్రంలో బతికెయ్యటం, భర్త మరణిస్తే వితంతువుగా శరీరం, కోరికలు లేనట్లుగా తనను తాను నమ్మించుకొంటూ జీవచ్ఛవంగా బతుకీడ్చటం స్త్రీల జీవితంలోని గతానుగతికత్వం. సంపాదించటం, ఏ పద్ధతిలోనైనా సంపాదించటం, పెళ్ళి చేసుకొని వంశాభివృద్ధి చేయటం, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించటం, మగవాడి జీవితంలోని గతానుగతికత్వం. కులం, గోత్రం, ఆచారం, సంప్రదాయం, అలవాట్లు, ఆనవాయితీలు ఇవన్నీ గతానుగతికత్వంలో భాగమే.

ముగ్గురు ఆడపిల్లలను కనిపెంచి అంతులేని డబ్బు వ్యయం చేసి పెళ్ళిళ్ళు చేసి ఆడపిల్లలు 'ఆడ' పిల్లలే కానీ 'ఈడ' పిల్లలు కాదన్న గట్టినమ్మకం వల్ల వంశోద్ధారకుడు ఒక్క కొడుకు వుండాలని దత్తు చేసుకొనటానికి సిద్ధపడ్డ వెంకటప్పయ్య, పండగకు తీసుకురాలేదని, పెట్టుపోతలు సరిగాలేవని సాధించుకు తినే పెద్దకూతురు జీవితంలో పురోగమనానికి అడ్డుగా వున్న శక్తులకు ప్రతినిధులు.

పెళ్ళిళ్ళు కనుక ఏకకులంలో చేసుకొన్నట్లు దత్తు కూడా అదే కులం నుండి చేసుకొనటం, దత్తు తెచ్చుకొనే పిల్లవాడిని సగోత్రీక కుటుంబం నుండి ఎంచుకొనటం కూడా జీవితంలో చలనచైతన్యరాహిత్యానికి సంకేతాలు.

చైతన్యం కల ఈ కథలో గతానుగతికత్వాన్ని బద్దలు కొట్టే పిల్ల మాణిక్యం. మొగుడు చనిపోతే వితంతువుగా జీవించటానికి ఇష్టపడక నచ్చినవాడితో వెళ్ళిపోయిన అమ్మాయి. తన జీవితంలో వెలుగు కోసం తన ప్రయత్నం తాను చేసుకొన్న ఆ అమ్మాయి తండ్రి వంశానికి కళంకం తెచ్చిన అపవాదును మోయాల్సి వచ్చింది. ఇంట్లో అందరూ తనను నిరసించినా బహిష్కరించినా తొణక్కుండా నిలబడటం ఆ అమ్మాయి ప్రత్యేకత. ఎవరేమనుకొంటారోనని కాక తానేమనుకొంటున్నదో అది మాట్లాడటం, చేయటం ఆమె స్వభావం.

జీవితంలో పురోగమనానికి అడ్డుగా వున్న సర్వశక్తులను తుఫాను వేగంతో తుడిచిపెట్టగల వ్యక్తిత్వం ఆమెది. నిలవనీరు కథలో ఆ పాత్ర ప్రవేశం కూడా తుఫాను రాకలాగానే వుంటుంది. అయిదు నిముషాలు కూడా పూర్తిగా మాట్లాడిందో లేదో హైమవతితో తన పెళ్ళికి దత్తువల్ల అవరోధంగా నిలబడ్డ వావివరుసలను సగోత్రాన్ని ధిక్కరించగల చేతనను శ్రీరాములుకు, శ్రీరాములు పెళ్ళాడటానికి అవరోధంగా వున్న వితంతువునన్న న్యూనతను ధిక్కరించగల చేతనను చెల్లెలికి ఇయ్యగలిగింది మాణిక్యం. మాణిక్యం, శ్రీరాములు, హైమవతి వంటి వాళ్ళు ఆ రకంగా ముందుతరపు దూతలు.

'పెళ్ళి' అనేది ఒక ఆడిపిల్లకు, యిక మగపిల్లవాడికి సంబంధించిన విషయమే అయినా నిర్ణేతలుగా వుండేది తల్లిదండ్రులు. పిల్లలకు సంబంధాలు చూడటంలో వాళ్ళ ఆలోచనలు, విధానాలు, ప్రాధాన్యాలు ఎంత అసమంజసంగా, అవివేకంగా వుంటాయో చూపిస్తూ అవి పిల్లల అభివృద్ధికి అవరోధంగా వున్న విషయాన్ని సూచించాడు కొకు 'అమ్మాయి పెళ్ళి' (1955) వంటి కథలలో. భార్యాభర్తల మధ్య అవగాహన, విశ్వాసం, గౌరవం కొరవడిన దాంపత్యాలలో పిల్లల పెళ్ళి వాళ్ళ వాళ్ళ ఆధిక్యాలనో అభిప్రాయాలనో స్థాపించుకొనే ఒక అవకాశంగా ఆడే ఒక చెడుగుడు ఆట అయినప్పుడు దానిని ఎదుర్కొని తమ జీవితాలను నిర్మించుకొనే వివేకం పిల్లలకే వుండాలి. 'అక్కపెళ్ళి' కథలో (1960-63) సీత ఆకోవకు చెందిన అమ్మాయి.

ఒకరినొకరు లక్ష్యం చేసుకొని ఒకరినొకరు దెప్పుకుంటూ, వెక్కిరించుకొంటూ అకారణంగా అనవసరంగా తల్లిదండ్రీ చేసే నిరంతర యుద్ధాన్ని చూస్తూ పెరిగిన సీత మానసికంగా దృఢంగా, బలంగా వుండటానికి కృషి చేస్తూ వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్నది. అక్క కల్యాణికి పెళ్ళి చెయ్యటానికి తల్లిదండ్రి చేస్తున్న ప్రయత్నాలు గమనిస్తూ వున్నది. బిఎ చదివి నెలకు రెండువందల యాభై సంపాదించుకొంటూ అందంగా వున్న పాతికేళ్ళ యువకుడు తన అన్నగారి కుటుంబ పోషణ భారం తన మీద వున్నందువల్ల తనకు కట్నంగా కొంతమొత్తమో, నెలకు రెండువందలు సహాయమో చేస్తే పెళ్ళికి సిద్ధం అన్నప్పుడు తల్లి నాగరికత లేని మనిషి అని ఆ సంబంధాన్ని కొట్టి పారేసింది. తండ్రి అమ్మాయి అభిప్రాయం తెలుసుకొందామన్నప్పుడు అక్క కల్యాణి తల్లి వంక చూసి ప్రైవేటు మాస్టార్ని పెట్టినట్టు నెల జీతం మీద నాకు మొగుణ్ణి పెడతారా? నాకిష్టం లేదు, ఆ మనిషి అంత స్పష్టంగా డబ్బుకోసం పెళ్ళి చేసుకుంటుంటే నెనెట్లా ఇష్టపడతానూ? అని దీర్ఘం తీసి తల్లి అభిప్రాయాన్ని బలపరిచింది. కల్యాణి పట్ల తండ్రికి వుండవలసినంత ప్రేమ లేదని సీతే ఆయనకు ఇష్టమైన కూతురు అని గాఢంగా నమ్మే తల్లి మాటమీద మాటగా ఇలాంటి సంబంధం సీతకు వస్తే ఒప్పేసుకుంటారా ! అని సవాల్ విసిరింది. 'నెనైతే ఈ సంబంధానికి ఒప్పుకుంటానమ్మా' అని సీత తన నిర్ణయాన్ని ప్రకటించటంతో కథ ముగుస్తుంది.

పెళ్ళికి కట్నం కావాలని ఖచ్చితంగా అడిగాడని అతనిని నిరాకరించవలసిన పనిలేదని సీత స్వబుద్ధితో నిరాకరించుకొన్నది. అన్న చదువు చెప్పించాడన్న కృతజ్ఞత. అన్న మరణంతో అనాథలైన పిల్లల మీద ఆపేక్ష కలిగిన మనిషి కనుకనే అతను కుటుంబ పోషణ బాధ్యతను స్వీకరించాడు. అందుకు కొంత ఆసరా పిల్లనిచ్చేవారి నుండి కోరుతున్నాడు. అటువంటి మనిషి విలువలు కలిగినవాడేనన్నది సీత అభిప్రాయం. తల్లి ఆలోచనలను, అభిప్రాయాలను తనవిగా చేసుకొనే కల్యాణి కన్నా జీవితాన్ని నిర్మించుకొనే శక్తి సీత వంటి వారికే వుంటుందన్నది కొకు దృక్పథం.

పెళ్ళి చెయ్యకుండా చూడు (1967) కథలో కాంతం, పట్టాభి పెళ్ళిని తమ చేతుల్లోకి తీసుకొని జీవితాన్ని నిర్మించుకొన్న తీరు మరొకరకం. పట్టాభి తండ్రి కనకయ్యకు కాంతం తండ్రికి స్నేహం వుంది. కాంతాన్ని తన కొడుక్కు చేసుకోవాలని ఆ రకంగా ఒకే ఒక్క కూతురున్న కాంతం తండ్రి సంపాదనంతా కలిపేసుకోవచ్చునని

ఆశ వుంది. కనకయ్య ఆలోచనలు పసిగట్టి అతని కొడుకుకు తన కూతురుని ఇవ్వరాదన్న నిర్ణయమూ కాంతం తండ్రికి వుంది. అయినా ఇద్దరూ మనసులో మాటలు బయటపెట్టకుండా రోజూ కలుస్తూనే వుంటారు. వీళ్ళ యిష్టాయిష్టాలతో పనిలేకుండా కాంతం పట్టాభి ఒకరినొకరు ఇష్టపడటం - రిజిస్టరు వివాహం చేసుకొనటం ఈ కథకు ముక్తాయింపు. పెళ్ళిలో డబ్బు ప్రమేయాన్ని నిరాకరించటం ఈ కథలో ముఖ్యాంశం. కట్నం తీసుకొని పెళ్ళాడటం కన్నా బ్రహ్మచారిగా వుండటమే మేలనుకొనే చైతన్యం పట్టాభిది. తండ్రి ఆస్తి మీద ఆశ వదులుకొనటం కాంతం చైతన్యం. ఇరువైపుల పెద్దల ఆర్థిక అధికారాలను, వారసత్వాలను ధిక్కరించి, వాటినుండి విముక్తి చెందగల చేవ చైతన్యం వున్న యువతరమే జీవితాన్ని తమ చేతుల్లోకి తీసుకొని తమ ఇష్టానుసారం నిర్మించుకోగలుగుతుంది. ఆరకంగానే పట్టాభి, కాంతం పెద్దల ప్రమేయం లేకుండా తమకు ఇష్టమైన పద్ధతిలో పెళ్ళి చేసుకోగలిగారు.

అక్క పెళ్ళి కథలో కట్నాన్ని ఆమోదించిన కొకు పెళ్ళి చేయకుండా చూడు కథలో కట్నాన్ని తిరస్కరించాడు. పట్టాభి ముఖంగా ఏవగించుకొన్నాడు. కట్నం లేని పెళ్ళిని అందరికీ ఆదర్శంగా ప్రబోధించలేదు కదా అన్న సందేహం వస్తుందిక్కడ. ఆదర్శాలు ప్రబోధించటం కాదు కొకు పని. భిన్న సందర్భాలలో, భిన్న ప్రత్యేకతలు కలిగిన మనుషులు ఎదుర్కొనే సమస్యలు ఎంత భిన్నభిన్నంగా వుంటాయో చూపించటం, అందువల్ల పరిష్కారాలు కూడా భిన్న భిన్నంగా వుండటానికి వీలుందన్న అవగాహననియ్యటం, సమస్యలను ఎదుర్కొనటంలో మనుష్యులు అభివృద్ధికర చైతన్యంతో వున్నారా? లేరా? స్వంత వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తున్నారా? లేదా? అన్నది గీటురాయిగా విలువలను నిర్ధారించటం కొకు చేసిన పని. విలువలు సాపేక్షమైనవే కానీ సార్వజనీనం కావు. సార్వకాలికం కావు.

## III

కుటుంబంలోను, సమాజంలోను వున్న వ్యత్యాసాలు, అధికారం అణచివేత, ధర్మం పేరు మీదనో, ఆచారం పేరు మీదనో, సంప్రదాయం పేరు మీదనో తరతరాలకు కొనసాగివస్తుంటే ఆ గతానుగతికత్వానికి అలవాటు పడే క్రమంలో ప్రతి కొత్త తరం ఎంత పెనుగులాటకు వేదనకు లోనవుతుంటుందో, చూపే కథలు వ్రాశాడు కొకు. ఆ పెనుగులాటలో, వేదనలో ఒక ధిక్కారం, నిరసన అంతర్లీనంగా వుంటాయి. తాతయ్య (1940), ఆడ బ్రతుకే మధురం (1947) ఆ రకమైన కథలు. పిల్లల కోణం నుండి కథనడపటం వీటిలోని ప్రత్యేకత.

తాతయ్య కథేతివృత్తం తాతయ్య కేంద్రంగా మనుమడిలో సాగిన ఆలోచనా పరంపర. కథాక్రమాన్ని ఆలోచనా స్థాయిని బట్టి ఆ మనుమడు పది పన్నెండేళ్ళ వాడయి వుంటాడనుకోవచ్చు. తాతయ్య మనుమడి వరకు తెచ్చిన భావాలు, ఆచారాలు ఎటువంటివో చూపటం మనుమళ్ళను తాతయ్యలుగా తయారు చేసే తర్ఫీదు కుటుంబంలో ఎలా ఇయ్యబడుతుందో సూచించటం ఈ కథ చేసిన పని. బ్రాహ్మలకు శూద్రులకు, బ్రాహ్మలలో వైదికులకు నియోగులకు సంప్రదాయలలో పుట్టి పెరిగిన వాళ్ళకు ఇంగ్లీషు చదువులు చదువుకున్న వాళ్ళకు మధ్య ఎక్కువ తక్కువ భేదాలున్నాయని, మాలవాళ్ళు, సాయెబులు వీళ్ళకన్నా మరింత తక్కువ వారని, శూద్రుల చేతి నీళ్ళు తాగరాదని, మజ్జిగ చుక్కవేస్తే దోషం పోతుందని, మాలవాళ్ళు తాకితే మైలపడతామని - ఇలా ఎన్నెన్నో విషయాలు మనమడికి తాతయ్య వల్ల తెలిసివచ్చాయి. కొద్ది కొద్దిగా మార్పుకు లోనవుతున్న ప్రపంచ వైఖరిపట్ల తాతయ్య అసహనం కూడా ఈ కథలో మనమడు గుర్తించి చెప్తాడు. మడి, మైల, ఏది ఎప్పుడు తినాలి ఎవరింట్లో తినవచ్చు, ఎలా ఏ పద్ధతిలో తినాలి, ఎవరిపట్ల ఎలా మెలగాలో, ఎలాంటి ప్రవృత్తులు అలవరచుకోవాలి - ఈ మొదలైన ఆచారాలు జీవిత పద్ధతులు ఎన్నో పిల్లలకు మప్పటం సమాజంలో ఎలా జరిగిపోతున్నదో ఈ కథ సూచిస్తుంది.

ఈ ప్రక్రియలో తన ప్రమేయం ఏమీ లేకుండా శిక్షణ పొందుతున్న మనుమడికి అందులోని వైరుధ్యం ఏదో చూచాయగా తెలుస్తున్నది. ఆ స్థితిలో అతని మెదడులో కదులుతున్న ఆలోచనా స్రవంతిని నమోదు చేయటంగా 'తాతయ్య' కథా రచన జరిగింది. తాతయ్య మరణం మనవడి ఆలోచనా స్రవంతిలో ఒక అంశం. 'తాతయ్య ఎంతమంచి బ్రాహ్మడైనా నరకానికే పోతాట్ట ! అమ్మ చెప్పింది' అనుకొంటాడు ఆ పిల్లవాడు. మంచి బ్రాహ్మడంటే బ్రాహ్మణులలో సాంఘికస్థాయిలో పైనున్నవాడు వైదిక బ్రాహ్మడు. మరి అతను నరకానికి పోవటం ఎందుకు? కులభేదాలు పట్టింపు వుండటం వల్ల రైళ్ళూ, రహదార్లూ వచ్చి లోకమంతా మాలకూడై పోయిందని వాపోవటం వల్ల, రైతులతో పోట్లాడినందు వల్ల, ఇలా ఎన్నో కారణాలు ఈ కథలో కనబడతాయి. 'మనమంతా ముసలివాళ్ళమయిన తరువాత తాతయ్యల్లేనే చచ్చిపోతాం' అన్న వాక్యంతో ఈ కథ ముగుస్తుంది. లోకంలోని పాపం పుణ్యం తెలియని పసివాళ్ళంతా తాతయ్యల శిక్షణలో తాతయ్యలుగా తయారై తాతయ్యల

వలెనే మరణించే ఒకానొక గతానుగతికత్వం గురించిన విషాదం ఈ వాక్యంలో ధ్వనిస్తుంది. తాతయ్యల భావవారసత్వాన్ని నిరాకరించి మనుమళ్ళు 'నవజీవన బృందావన నిర్మాతలు' కాగలిగినప్పుడే ఈ విషాదం నుండి విముక్తి. దీని గురించి హెచ్చరించటానికే కొకు ఈ కథ వ్రాశాడు. కుటుంబరావు ఈ కథ వ్రాసి చాలా గొప్ప పనిచేసినట్టు సంతోషించటం, సంతృప్తి పడటం[5] తానాపని సరిగా నిర్వర్తించ గలిగానన్న నమ్మకం కారణంగానే అయివుంటుంది.

'ఆడ బ్రతకే మధురం' (1947) కథ, ఆడపిల్లలకు ఇవ్వబడుతున్న శిక్షణ క్రమంలో పెరుగుతూ, ఆడవాళ్ళ స్థితిగతులను గమనిస్తున్న పదిపన్నెండేళ్ళ అమ్మాయి ఆలోచనల పరంపర. తాతయ్య కథలోని మనుమడి కన్నా చైతన్యం ఒక పాలు ఎక్కువ వున్న అమ్మాయి. అక్కడ మనుమడు తాతయ్యలాగానే తయారవుతాడా, తాతయ్యను తాతయ్య నమూనాను ధిక్కరించి స్వతంత్రుడుగా ఎదుగుతాడా అన్నది నిర్ధారితాంశం కాదు. ఈ కథలో అమ్మాయి అలా కాదు. స్త్రీ పురుష అసమానతల్ని గురించి అదొక ధర్మంగా, సంప్రదాయంగా బోధించే కుటుంబ వ్యవహారాలపట్ల, సామాజిక నీతిపట్ల నిరసన ఆమె ఆలోచనలలో భాగంగా మనకు స్పష్టంగా తెలుస్తూనే వుంటుంది.

తాతయ్య అమ్మమ్మని, నాన్న అమ్మని, బావ అక్కయ్యను మొత్తం మొగవాళ్ళంతా ఆడవాళ్ళను కొట్టి తిట్టే ఆచారమే కొనసాగివస్తుంటే, మహా పతివ్రతలు కూడా వచ్చే జన్మలో ఆ మొగుడే కావాలని కోరుకోవటం ఆ అమ్మాయికి నచ్చదు. ఆడజన్మే వద్దని కోరుకోవచ్చుకదా అన్నది ఆ అమ్మాయి అభిప్రాయం. ఆడవాళ్ళు చదువుకోరాదని, చదువుకుంటే చెడిపోతారని నమ్మే సమాజంలో ఆడవాళ్ళు 'ఖర్చు' కారకులనుకొనే సమాజంలో, పిల్లల్ని కనటానికి చచ్చి బ్రతికటమో, చావటమో ఆడవాళ్ళ జీవితంగా వున్న సమాజంలో, మొగుడుడెటువంటివాడైనా, తిట్టినా కొట్టినా సాధించినా భరించటం పుణ్యం అని చెప్పే సమాజంలో ఇమిడిపోవటానికి తిరస్కరిస్తున్న అమ్మాయి ఆ అమ్మాయి. ఆడ బ్రతుకే మధురం అని చెప్పే మాటలకు, పాడే పాటలకు, జీవిత వాస్తవానికి వున్న వైరుధ్యాన్ని ఆ పిల్ల పట్టేసింది. "నేను పెద్ద దాన్నయితే కొట్టే మొగుణ్ణి మాత్రం చేసుకోను. పుణ్యం లేకపోతే పీడాపాయె" అని నిశ్చయంగా అనుకొన్న ఆ అమ్మాయి స్త్రీల జీవితం చుట్టూ నిర్మించబడిన గోడలను కూలగొట్టటానికి 'ఆధునిక మహిళ' సత్తా పుంజీభవించి వుంది.

## IV

'తాతయ్య' కథకి కొనసాగింపు వంటివి రంగయ్యా తాత కథలు. రంగయ్యా తాత కేంద్రీకృత కుటుంబాధికారం. కుటుంబమంటే స్వంత ఆస్తి. రక్తసంబంధం కల మనుషులు. ఆస్తి మీద పెత్తనం, తరతరాల మనుషుల మీద అధికారం. ఉమ్మడి కుటుంబవ్యవస్థ అనే గొడుగుకింద నిర్లక్ష్యం చేయబడే మనుషుల ఆకాంక్షలు, అవసరాలు, అభిరుచులు మొత్తం మీద వ్యక్తిత్వం లేని సమూహాన్ని, జీవచ్ఛవాల్ని తయారు చేయటం - ఇదీ దాని నగ్న స్వరూపం. రంగయ్యాతాత కథలు ఈ నగ్న స్వరూపాన్ని బయటపెట్టటానికే వ్రాశాడు కొకు. రంగయ్య తాత మీద తిరుగుబాటు (24 సెప్టెంబరు 1944) కథ అరవైఏళ్ళ రంగయ్య తాత అధికారం కింద గిడసబారిన ముప్ఫైమంది ప్రాణుల ఆర్తరవాన్ని మనుమల తరం తిరుగుబాటు గీతంలో కలిపి వినిపిస్తుంది. ఆస్తి మీద పెత్తనం అధికారానికి మూలం. రంగయ్యతాత తండ్రి చచ్చిపోతూ ఆస్తి మీద పెత్తనం అతనికి అప్పగించటంతో కుటుంబానికి తిరుగులేని అధికారి అయినాడు అతను. కుటుంబంలో అందరూ తమ అవసరాలకు తన మీద ఆధారపడి వుండేట్లు చక్రం తిప్పాడు. వ్యక్తుల సంపాదనల మీద పెత్తనం సంపాదించాడు కానీ వ్యక్తుల సంక్షేమం అతనికి పట్టలేదు. మంచి తిండి బట్టా, చక్కని వసతి అందరికీ కరువే అయ్యాయి. వైద్య సహాయంలేక, మనోవ్యాధులకు గురియై అసంతృప్తులకు లోనై మరణించినవాళ్ళు, ఆత్మహత్యలు చేసుకొన్నవాళ్ళు ఆ కుటుంబంలో వున్నారు. ఆయన అధికారం దుర్భరమనిపించిన యువతరం తమ చదువులకు సైతం ఆయన మీదనే ఆధారపడి వున్నామని, తమ తండ్రుల కష్టార్జితం, వారసత్వపు ఆస్తి అన్నీ అతని దగ్గరే పోగుపడివున్నాయని తెలిసి కూడా తిరుగుబాటుకు సిద్ధపడుతుంది.

ఆస్తి పోతే పోయింది కానీ తమ జీవితాల మీద రంగయ్యతాత పెత్తనం లేకుండా చేసుకొనటం వాళ్ళకు అత్యవసరం అయింది. అడుక్కుతినవచ్చు, కట్టెలు కొట్టుకోవటమో మరేపనో చేసి బ్రతికెయ్యవచ్చు. కానీ తమ పెళ్ళాల్ని రంగయ్య తాత నిర్ణయించకూడదు అన్నది వాళ్ళ అభిప్రాయం. యిష్టం వచ్చిన వాళ్ళని పెళ్ళాడి వాళ్ళతో ప్రేమగా కాపురం చేయటం వాళ్ళ కల. 'పుల్నీళ్ళయినా స్వతంత్రంగా తాగుదాం' అని పదిమంది ఒక్కసారి రంగయ్యతాత అధికార ఛత్రచ్ఛాయ నుండి బయటికి వచ్చేశారు. రంగయ్య తాత ఆస్తి పంచుకొనే వాళ్ళకు, పంచుకొందామని ఆశగా ఎదురుచూస్తూ అతని పంచనే పడి వున్న వాళ్ళకు స్వాతంత్ర్యం వల్ల, స్వీయ

జీవితాల మీద సాధికారత వల్ల లభించే ఆనందం ఎప్పటికీ రాదని వాళ్ళు అనుకొంటారు. పదిమందీ ఒక్కటిగా, ఒకరికోసం ఒకరు, ఒకడి కోసం అందరూ ఆలోచించగల పనిచేయగల సంఘబలం కూడా తమకుందని వాళ్ళు గొప్ప ఆత్మవిశ్వాసంతో ప్రకటించటం ఈ కథకు ముగింపు.

సరియైన చదువులు లేక రంగయ్య తాత ఆశ్రయాన్ని ఆస్తులను వదులుకొని వచ్చిన వాళ్ళు ఎలా బ్రతుకుతున్నారన్న దానికి ఒక సమాధానంగా వ్రాసిన కథ రంగయ్య తాతగారి పరువు మర్యాదలు (డిసెంబరు 1944) లోకం దృష్టిలో మరీ ముఖ్యంగా డిప్టీ కలెక్టర్, మెజిస్ట్రేట్, లోకల్ ఫండ్ ఇంజనీరు మొదలైన వాళ్ళ దృష్టిలో రంగయ్య గారు ఎంపిక చేసిన మనిషి. ఆయనను ధిక్కరించి మనుమలు బయటకు రావటం ఒకడు కాఫీ హోటల్లో ప్లేట్లు అందిస్తూ, మరొకడు హార్మోనీ వాయిస్తూ, ఇంకొకడు కులగోత్రాలు లేని వితంతువును పెళ్ళాడి ఆమె పోషణలో వుంటూ, మరొకడు ఇంజనుబాగు చేసి పొట్టపోసుకొంటూ బ్రతకటం వూరందరికీ రంగయ్య తాతగారి పరువు మర్యాదలను మంటకలపటంగా అనిపించింది. ఆ విషయమే ఒక పెద్దమనిషి నిలదీసి అడిగినప్పుడు ఒక మనుమడు ఇచ్చిన సమాధానం వాళ్ళ జీవితం ఇప్పుడు ఆత్మగౌరవంతో ఎంత హాయిగా వెళ్తున్నదో స్పష్టం చేస్తుంది. చేతిలో డబ్బులేక, ఇంట్లోనే దొంగతనాలు చేసే స్థితికి, కాఫీకి సిగరెట్టుకు మొహంవాచిన స్థితికి సినిమాలు షికార్లు నిషేధించబడి నిర్బంధ జీవితాన్ని జీవించాల్సిన స్థితికి, రంగయ్య తాత గారి గౌరవానికి ఎప్పుడు ఏ హాని కలుగుతుందోనని, తమ ప్రవర్తనలను తామే నియంత్రించుకొనే దుస్థితికి దిగజారిన వాళ్ళ వ్యక్తిత్వాలు ఇప్పుడు తమ కోసం తాము, తమ ఇష్ట ప్రకారం తాము జీవించే స్థితికి వికసించటం ప్రారంభమైందని రంగయ్య తాత మనమడు ఆ పెద్ద మనిషికి స్పష్టం చేయగలిగాడు. స్వేచ్ఛ లేనిచోట, స్వేచ్ఛగా భావాలు వ్యక్తీకరించలేని చోట మనుషులలోని సృజనాత్మక శక్తులన్నీ అడుగంటిపోతాయి. రంగయ్య తాత నుండి విముక్తి తమలో సృజనాత్మక శక్తులను, జీవించే కళను ఉద్దీపింపచేసిందని మనుమడి అనుభవం. మనుషులను హింసించే వాళ్ళకు, పేదవాళ్ళ మీద, బలహీనులమీద పెత్తనం చెలాయించే వాళ్ళకు పరువు ప్రతిష్ఠలుండవని అంటాడు మనుమడు. "దోపిడీ చేసే దొంగ వెధవలకి పరువు ప్రతిష్ఠలేమిటి? కష్టపడి పనిచేసుకునేవాడికి పరువు ప్రతిష్ఠా, మానాభిమానాలు గాని" అన్నది అతని ఉద్దేశం.

పరువు ప్రతిష్ఠలు, వంశగౌరవం ఇవన్నీ మాయ. మనుషులను గతానుగతికమైన జీవన చక్రంలో బిగించి వుంచటానికి ఉపకరించే మరమేకులు. తాతగారి నాన్నగారి ఆస్తులకు వారసత్వాన్ని అట్లే వుంచుకొనే ఆశపోతులకు భావదాస్యం అస్వతంత్ర జీవితం తప్పవు. వాటిని అసహ్యించుకోగలిగిన వ్యక్తులే జీవితాన్ని స్వతంత్రంగా స్వేచ్ఛానుసారం కిందినుండీ నిర్మించుకొంటూ రాగలుగుతారు. అందుకు ఉద్యమించిన రంగయ్య తాత మనుమళ్ళ క్రియాశీలక స్వభావమే యువతకు ఆదర్శం.

కీర్తి, కుటుంబగౌరవం, వంశప్రతిష్ఠ అనేవి వట్టిడొల్లమాటనే తప్ప సారవంతమైనవి కావని, వాటి పేరు మీద జీవితాల మీద అమలయ్యే అదుపు అధికారం దౌర్జన్యం తరచు అవినీతికి దారితీస్తుంటుందని 'ఒంటిస్తంభం మేడ' వంటి కథలల్లో నిరూపించి చూపాడు కొకు.

## V

మత లౌకిక నీతుల గురించిన కొత్త చైతన్యం ఇవ్వటానికి కుటుంబరావు సూరి ప్రధానపాత్రగా 'సూరి సిద్ధాంతం' శీర్షికతో నాలుగు కథలు వ్రాశాడు. ఉత్తమ పురుషలో సంవాదాత్మకంగా నడిచే ఈ కథలలో కథకుడి స్నేహితుడు సూరి. మనుషుల బుద్ధి వికాసానికి, ఎదుగుదలకు అవరోధంగా వున్న శక్తులను, వ్యక్తులను, వ్యవస్థలను, విధానాలను వ్యాఖ్యానించటం సూరి పని. అందుకు తక్షణ కారణం కథకుడు శ్రోత కూడా అతనే. సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలంటే భిన్న పరిస్థితులలో భిన్న అవసరాలలో వున్న మనుషులు చేయాల్సిన పోరాటాలు ఎన్నెన్ని వుంటాయో కథకుడికి సూరికి జరిగిన సంభాషణల ముఖంగా సూచిస్తాడు కొకు.

"వాళ్ళూ వాళ్ళూ అనేక విషయాల గురించి అనుకుంటున్న మాటలన్నీ జ్ఞాపకం వుంచుకొని వాటిని నిజం కింద అంగీకరించి వాటి ప్రకారం ఆచరించటం బుద్ధిని ఉపయోగించటం కాదు. దేని గురించైనా నీ అభిప్రాయం ఒకటి ఏర్పరచుకోటం బుద్ధి' అంటాడు. సూరి సిద్ధాంతం 1 కథలో సూరి కథకుడితో. అభిప్రాయం ఒకటి ఏర్పరచుకొనాలంటే సత్యశోధన ఎంతయినా అవసరం. అది బాధ్యతతో కూడుకొన్నపని. ఈ కథలో మతానికి, ఆచారాలకు, నీతి అవినీతులకు సంబంధించిన గతానుగతికంగా వస్తున్న భావాలను విమర్శకు పెట్టాడు కొకు.

మతం ఎవరికి వారు సృష్టించుకోవలసిందే తప్ప తాత తండ్రుల మతాలను యథాతథంగా అనుసరించరాదన్నది సూరి అభిప్రాయం. మతం అంటే అతని దృష్టిలో జీవనవిధానం. తమ వరకు అందివచ్చిన జ్ఞాన చైతన్యాలను బట్టి తమ అవసరాలను బట్టి ఎవరి జీవనవిధానం వాళ్ళే నిర్ధారించుకొంటారు. 'మతం కూడా ఆస్తుల్లే, గుణాలల్లే, రోగాలల్లే వంశపారంపర్యంగా వస్తుందా ఏమిటి? అని హేళన చేయటంలో అంతరార్థం అదే.

మతం వంశపారంపర్యంగా వచ్చేదే అయితే శూద్రులతో భోజనం చేసినప్పుడు, స్టీమరెక్కి విదేశాలకు పోయినప్పుడు, వితంతువును పెళ్ళి చేసుకొన్నప్పుడు ఎలా పోతుందని ప్రశ్నిస్తాడు. మతం వంశపారంపర్యంగా రావటం, కొన్ని పనుల వల్ల పోవటం. ఒక పని వల్ల పోయిన మతం అట్లాగే పోక ఏ పని చేద్దామనుకొన్నప్పు డయినా అడ్డుగావచ్చి నిలవటం, ఎంత హాస్యాస్పదమైనవో సూరి మాటల వల్ల స్పష్టమవుతుంది. ఆహారం వంటి ప్రాథమికావసరాలు కూడా తీరని జనానికి వాటికి బదులు మతాన్నిస్తే మూఢనమ్మకాలు వంటి జబ్బులు ప్రబలిపోతున్నాయంటాడు సూరి. మానవ జీవితంలో అభివృద్ధికి, మనుషుల మధ్య సమానత్వానికి, స్నేహానికి మతం అడ్డు అవుతున్నది కనుకనే కొకు దృష్టిలో చీల్చిచెండాడాల్సిన అంశాలలో అది కూడా ఒకటి అయింది.

ఆచారాలే మతమనుకొనటాన్ని ఖండిస్తూ ఒకప్పుడు ఒక సామాజిక జీవితావసరాలలో భాగంగా రూపొందిన ఆచారాలు యథాతథంగా అన్ని కాలాలకు ఉపయోగపడవని, కాలానుగుణంగా మనిషి జీవితంలో రావలసిన వికాసం గురించిన అవగాహన వున్న వాళ్ళెవరయినా గ్రహిస్తారు. మనిషి ఉపయోగం కోసమే ఆచారాలు కానీ ఆచారాల కొరకు మనుషులు కాదని అంటూ సూరి నిజంగా లాభించే ఆచారాలను నిలువుకొంటూ పనికిరానివి, పరులకు హాని కలిగించేవి అవమానపరిచేవి అయిన ఆచారాలను వదిలించుకోవాలంటాడు. స్నానం చెయ్యటం, సంధ్యవార్చటం, మడికట్టుకోవటం, తద్దినాలు పెట్టటం వంటి ఆచారాలు ఎవ్వరకీ అపకారం కలిగించేవి కాదు కనుక అనుసరించవచ్చు. వితంత్రు స్త్రీకి పెళ్ళి చెయ్యక పోవటం, మాలవాళ్ళను వెలివెయ్యటం - అనుసరించదగిన ఆచారాలు కావని ఖచ్చితంగానే చెప్తాడు.

మాలవాళ్ళు ఊళ్ళో ఇళ్ళమధ్య తిరగరాదని, ఊరి బావి నీళ్ళు తోడరాదని అది ఆచారం అడుగుదాటరాదని అంటే, ఆ ఆచారం తప్పక ధిక్కరించవలసినదే

అవుతుందని సూరి అభిప్రాయం. మాలవాళ్ళతో సంబంధం వద్దని బహిష్కరించిన వాళ్ళు తెగిన చెప్పులు బాగు చేయించుకొనటానికి చచ్చిన గొడ్లను ఈడ్చెయ్యటానికి వాళ్ళ మీదే ఆధారపడుతున్నారని అంతేకాక వాళ్ళ స్త్రీల మానాభిమానాల మీద పెత్తనం కూడా చేస్తున్నారని 'ఆచారవంతుల' ఆచారాలలోని అనాచారాలను, కుసంస్కారాలను, అసంబద్ధతలను వేలెత్తి చూపాడు.

ఆచారాలకు వ్యతిరేకంగా నడవటం, అవినీతి అవుతుందేమోనన్న సందేహాన్ని కథకుడు వ్యక్తం చేస్తే 'నీతి' సాపేక్ష విలువే కానీ నిరపేక్ష విలువ కాదంటాడు. 'ఆడవాళ్ళ ఎదుట బూతులు మాట్లాడటం అవినీతి అని తలచనైనా తలచలేరని సూరి సవాల్ చేసి చెప్తాడు. ఆ రకంగా నీతి స్థాయీ సందర్భాలను బట్టి మారే విలువ అని సూరి అంటాడు. ఒక స్త్రీ పట్ల తప్పు చేసి లోకం చేత అవినీతి పరుడుగా తిరస్కరించబడ్డవాడు కూడా లోకంలోని అబద్ధాలు, దుర్మార్గం చూచి ఏవగించుకొంటున్నాడంటే వాడు నీతిపరుడు కాకుండా పోతాడా? అన్నది సూరి తర్కం.

'సూరి సిద్ధాంతం – 2' కథలో కొకు లోకంలోని కుసంస్కారాలు జీవన వికాసానికి అవరోధంగా వున్నప్పుడు చూసి చూడనట్లు ప్రవర్తించటం కాక, వాటిని మార్చటానికి ఎవరి పద్ధతులలో వాళ్ళు పనిచేయటం ఎంత మానవీయసుందరంగా వుంటుందో రెండు ఉదంతాల ద్వారా చెప్పించాడు సూరితో. సూరి స్నేహితుడి చెల్లెలి ఉదంతం ఒకటి. పార్వతీశం ఉదంతం మరొకటి. సూరి స్నేహితుడి చెల్లెలికి పెళ్ళయింది. ఆమె భర్త మెతకమనిషి. ఇంట్లో అందరికీ ఆమె చులకన. ఆలోగా ఆమె ఆడపిల్లకు జన్మనిచ్చినందువల్ల మరీ తిరస్కారానికి లోనయింది. రెండోసారీ మూడోసారీ కూడా ఆడ పిల్లలే. ఆమె కష్టాలు తెలిసి అన్న అగ్గిరాముడయ్యాడు అత్తవారింటి మీదికి దండయాత్రకు బయలుదేరాడు. అప్పుడు సూరి అతన్ని ఆపి చెల్లెలి నడిగి అన్ని విషయాలు రాబట్టి ఆ మొగుడికి ఆమె మీద ఏ మూలానో వున్న పిరికి ప్రేమను రెచ్చగొట్టేట్లు చిన్న ఉత్తరం వ్రాసి వ్యవహారం చక్కబెట్టాడు. మళ్ళీ ఆడపిల్ల పుట్టిందని చెల్లెలు విషం తాగి చావు బతుకుల్లో వుందని సూరి వ్రాయించిన ఆ ఉత్తరం ఆశించిన ఫలితాన్నే ఇచ్చింది. తన భార్యను వేధించుకు తింటున్న అందరిమీద ఇంతెత్తున లేచి తన భార్య బతక్కపోతే అందరినీ చంపి పారేస్తానని ప్రతిజ్ఞ చేసి వచ్చాడతను. భర్త తనకోసం ఆపని చేసినందుకు భార్య తిరిగి అతనిని

అభిమానించటం మొదలు పెట్టింది. కొడుకు విజృంభణ చూచి కోడలు అరడజను మంది ఆడిపల్లలను కన్నా నోరెత్తకుండా మర్యాదగా ప్రవర్తించటం మొదలుపెట్టారు ఆమె అత్తమామలు, అని సూరి తన స్నేహితుడి చెల్లెలి ఉదంతం ముగించాడు.

కోడళ్ళను బానిసలుగా చూచే ఆచారం, ఆడపిల్లల పుట్టుక వద్దనుకొనే ఆచారం రెండూ ఒక ఆడదాని జీవితాన్ని దుఃఖభరితం చేశాయి. తండ్రి, అన్న, అక్క, తన భార్య పట్ల పశువుల వలె ప్రవర్తిస్తుండటం దగ్గర నుండి చూస్తూ కూడా చూడనట్లే వున్నాడు భర్త. ఆడపిల్లను ప్రసవించటంలో ఆమె కష్టాలు రెండింతలైనాయి. దీనిని కూడా ఆ భర్త చూస్తూవున్నాడే కానీ ఆ సమస్యలు తనవి అని గానీ, వాటిని పరిష్కరించటం ఆమెకే కాక తనకూ ఇంత సుఖసంతోషాలనిస్తాయని గానీ తెలుసుకోలేక పోయాడు. మన ఇళ్ళల్లో మన చుట్టూ మనవాళ్ళ మధ్య వుండే ఈ పశులక్షణాలను తగాదాలతో, వాగ్వివాదాలతో సంస్కరించటం సాధ్యం కాదు. అలాగని చూస్తూ వూరుకొనటం వివేకం కాదు. సూరి అందుకొక ఎత్తుగడ వేశాడు. అది పారింది. "ఆడిపల్ల పుడితే ఏడిచే వాళ్ళకుండే ఒక్కటే శిక్ష ! అటువంటి వాణ్ణి ఆడవాళ్ళంతా బహిష్కరించి దగ్గరికి రానీకుండా వుంటే సరి ! ముష్టి ఆచారాలను అతిక్రమించలేక, ఆడపిల్ల పెళ్ళి గొంతుకు వురల్లే చేసుకుంటు ఆడపిల్ల పుట్టిందని వలవలా ఏడుస్తారు" అని సూరి లోకం పోకడ మీద చేసిన వ్యాఖ్యానం జీవితంలో బాధాకరంగా అవమానకరంగా, ప్రాణాంతకంగా వున్న ముష్టి ఆచారాలను అతిక్రమించటానికి జరగాల్సిన యుద్ధాలను సూచిస్తున్నది. కొకు ఈ కథ వ్రాసిన (1934) డెబ్బై ఏడు సంవత్సరాలకు కూడా ఆడపిల్ల పుట్టుక గురించిన సామాజిక దుష్ట సంస్కారాలను సవరించగల యుద్ధం ఇంకా ప్రారంభమే కాకపోవటం పెద్ద విషాదం.

సూరి సిద్ధాంతం 2 కథలోనే పెళ్ళి చేసుకొందామన్న బలమైన కోరిక వున్న వితంతువు శారద, పెళ్ళి కూడదంటున్న తల్లిదండ్రులకు తెలియకుండా చొరవ చేసి ఉత్తరం వ్రాస్తే ఆమెలోని జీవలక్షణానికి ముగ్ధుడై ఆమెను పెళ్ళాడాలన్న నిర్ణయంతో వచ్చిన పార్వతీశం చిన్న నాటకమాడి ఆమెను తల్లిదండ్రుల అనుమతితో గుంటూరు తీసుకొనివెళ్ళి పెళ్ళి చేసుకొన్న ఉదంతం వుంది. వితంతువుకు పెళ్ళి చేస్తే రౌరవాది నరకాలు వస్తాయని, బహిష్కరణకు, వెలికి గురి కావల్సివస్తుందని కాలం చెల్లిన ఆచారాలకు బానిసలై తల్లిదండ్రులు ప్రవర్తిస్తున్నప్పుడు ఆ ఆచారాలను ధిక్కరించి జీవితంలో వెలుగు నింపుకోవలసిన యువతీయువకులు ఏం చెయ్యాలో శారదా పార్వతీశం అదే చేశారు. రౌరవాది నరకాల గురించి బహిష్కరణ గురించి

వున్న భయాలకంటే పెద్ద భయం ఒకటి కల్పించటం ద్వారా పిల్లపెళ్ళికి తల్లిదండ్రులను సుముఖులను చేశాడు పార్వతీశం. శారదను నెలతప్పినట్లు నాటకం ఆడమన్నాడు. విధవ కూతురు గర్భవతి అయిందంటే ఎంత అపకీర్తి అని బెదురుపెట్టాడు. గర్భస్రావం చేయిస్తే శిశుహత్య దోషం నరకానికి దారితీస్తుందని హెచ్చరించాడు. ఎవరికో ఒకరికి ఇచ్చి వెంటనే పెళ్ళి చేయటం తప్ప మరొక మార్గం లేదని వాళ్ళను నమ్మించాడు. ఇట్లా జీవితాన్ని జయించుకొనటానికి ఎప్పటికప్పుడు మనుషులు ఎంత కార్యోత్సాహంతో వుండాలో కొకు తన కథలలో భిన్న మార్గాల ద్వారా సూచిస్తాడు.

సూరి సిద్ధాంతం 4 కథలో కొకు పిల్లల శారీరక మానసిక వికాసాలకు అభివృద్ధికి అవసరమైన అద్భుతమైన తల్లిగా ప్రతి ఆడది పరివర్తన చెందటానికి అవరోధంగా వున్న ఆచారాలు, ప్రవృత్తుల మీద ధ్వజం ఎత్తాడు. పిల్లల పనులన్నీ మీద వేసుకొని చెయ్యటమే తల్లి లక్షణంగా ధర్మంగా చెప్పే లోకంలో తల్లికి నిరంతర చాకిరి – పిల్లలకు తమ కాళ్ళ మీద తాము నిలబడగల శక్తి, తమ పనులు తాము చేసుకోవాలన్న బాధ్యత కొరవడటమే ఫలితం. దాని తల్లి ఆలనా పాలనా చూస్తుంది. తల్లి కడుపు చూస్తుంది. మొదలైన లోకోక్తులు రీతులు పిల్లలను పరాన్నజీవులుగా మార్చే పెంపకం రూపాన్ని తీసుకొంటున్న వైనాన్ని సూరి కొంత కఠినంగానే విమర్శిస్తాడు. తల్లులు పిల్లలనీ రకంగా పాడు చేయటం ప్రేమ లేకపోవటం వల్లనా అంటే కాదు. అజ్ఞానం వల్ల మాత్రమే ఇతరత్రా తమకు లేని అధికారం, ఆధిక్యత, నాది అన్నభావం, పిల్లల చుట్టూనే నిర్మించుకొనవలసిన పరిస్థితులలోకి నెట్టబడటం వల్ల మాత్రమే.

"గట్ల మధ్య ప్రవహించే నదిమాదిరిగా కుర్రవాడి ప్రకృతి తల్లి ప్రకృతిని ఒరుసుకుంటూ తల్లిదండ్రుల యొక్క ప్రకృతుల మధ్యగా ప్రవహిస్తుంది.... తల్లికి పిల్లవాడికి బంధం జాస్తి. ప్రవాహానికి వెలుపలిగట్టుతో సంబంధం తక్కువ. లోపలిగట్టు ఎన్ని వంకర్లు తిరిగితే ప్రవాహం అన్ని వంకర్లు తిరుగుతుంది. తల్లుల్లో ఎన్ని లోపాలుంటే పిల్లవాడు అన్ని లోపాలతోనూ బాధపడతాడు. ఆడదాన్ని చేతులారా దాస్యంలో ఉంచుతున్న ఈ వివాహ చట్టం తోనూ, ఈ న్యాయచట్టంతోనూ, ఆడదాన్ని పిరికిదాన్ని చేసేస్తున్న తండ్రి దౌర్జన్యంతోనూ, భర్త దౌర్జన్యాంతోనూ, ఆడదాన్ని పశువు కన్న హీనం చెయ్యాలని ప్రయత్నం చేస్తున్న మత సంబంధమైన మోసంతోనూ స్త్రీ ధర్మ శాస్త్రాల మోసంతోనూ" – తల్లులుగా తర్ఫీదు పొందిన స్త్రీలు పిల్లలతో

రోజుకు ఒక గంట గడపటానికైనా అర్హులు కాని స్థితికి చేరారని సూరి చెప్పిన మాటలు భావిపౌరులను తీర్చి దిద్దాల్సిన తల్లి, భవిష్యత్తును నిర్మించుకొనవలసిన శిక్షణను పిల్లలకు ఇవ్వాల్సిన తల్లి – నిజమైన తల్లి ఎదుగుదలకు అవరోధంగా వున్న సనాతన ఆధునిక మత న్యాయచట్ట శక్తుల విశ్వరూపాన్ని, వికృత రూపాన్ని కూడా ఏకకాలంలో చూపాయి. వీటి నుండి విముక్తికి తల్లులుగా స్త్రీలు చేయాల్సిన పోరాటాలు, వాళ్ళకు మద్దతుగా జాతిజాతి చేయాల్సిన పోరాటాలు ఎంత అవసరమైనవో సూచించటం ఈ కథ చేసిన గొప్ప పని. 'ప్రతి ఆడదాన్ని అద్భుతమయిన తల్లిని చేయటం' ఏకైక కార్యక్రమమే అయినా దానికై సాంస్కృతిక రంగంలో, రాజకీయార్థిక రంగంలో ఏకకాలంలో జరగవలసిన బహుముఖ పోరాటాల గురించి కొకు డెబ్బై ఏడేళ్ళ క్రితమే ఊహించగలిగాడు. వాటిని ఆచరణ వాస్తవం చేయగల వ్యూహరచనకు అవసరమైన సైద్ధాంతిక బలమైతే సమకూడింది. కానీ పోరాటాలు చెదురుమదురుగానో తత్కాల సంభవాలుగానో, స్వతంత్ర రూపాలతోనో సాగటం వర్తమాన చరిత్ర. ఇవి మహాప్రవాహంగా, ఉప్పెనగా మారేందుకు అవరోధంగా వున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ ఆర్థిక వ్యవస్థలతోనూ, ప్రపంచీకరణతోనూ కొత్త యుద్ధాలు చేయాల్సిన సందర్భం ఇప్పుడొక సవాల్.

ఇక్కడ మరొక విషయం కూడా గుర్తించాలి. ప్రతి ఆడదాన్ని అద్భుతమైన తల్లిగా తయారు చెయ్యటం అంటే స్త్రీని తల్లిపాత్రకు కుదించటం అని అర్థం కాదు. స్త్రీ వ్యక్తిగా వివేకంతో వికసించటం. విస్తరించటం, స్త్రీ జీవితంలో నిర్వహించాల్సిన వివిధ బాధ్యతలలో తల్లిపాత్ర ఒకటి. ఆ సందర్భం నుండి ఆమె వ్యక్తిత్వం గురించి మాట్లాడటమంటే ఆవికసన ప్రభావం ఆమె జీవితాన్ని, ఆమెతో సంబంధంలో వున్న అందరి జీవితాలను వెలుగుతో నింపాలనుకోవటమే.

జీవితాన్ని సత్య శివ సుందరాత్మకంగా తీర్చి దిద్దుకొనేందుకు సర్వ సంభారాలు సమకూర్చుకొనటం, సర్వశక్తులు వినియోగించుకొనటం ఎవరికైనా ఆదర్శంగా వుండదగిన విలువ అని కొకు అభిప్రాయం. ఈ విలువకై నిలబడ్డ వాళ్ళు కలబడ్డవాళ్ళు కొకు కథాసాహిత్యంలోని నాయికానాయకులు. వాళ్ళ విఫలయత్నాలను, అసంపూర్ణ యుద్ధాలను, గాయాల విజయాల చరిత్రను నమోదు చేయటంగా ఆయన కథా సాహిత్య రచన జరిగింది. తనకు బాగా తెలిసిన బ్రాహ్మణ కుటుంబాల సంస్కారాల చుట్టూ మాత్రమే కథేతివృత్తాలను నిర్మించిన పరిమితి

వున్నా పీడితులలో కెల్ల పీడితులుగా స్త్రీలు సనాతనధర్మంపైన, సామాజిక కౌటుంబిక ఆచార వ్యవహారాలపైన, నీతులపైన నిశ్శబ్దంగా చేసిన తిరుగుబాట్లే తరచు ఆయన కథలకు వస్తువు కావటం గమనించదగింది. స్త్రీలను అణగద్రొక్కే, స్త్రీలపై దౌర్జన్యానికి నెపం అయ్యే ఏ సనాతన ధర్మంపై కొకు ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేస్తూ వచ్చాడో ఆ సనాతన ధర్మమే బ్రాహ్మణాధికత్యను స్థాపిస్తూ తదితర వర్ణాలవారిలో, మరీముఖ్యంగా పంచములలో తొణికిసలాడే జీవశక్తిని అపహాస్యం చేస్తున్నదని, అవమానిస్తున్నదని గుర్తించాడు. జీవశక్తి అంటే కొకు దృష్టిలో కర్మశక్తి. సూరి సిద్ధాంతం 3 కథలో బ్రాహ్మణులను జీవశక్తి మందగించిన వాళ్ళుగా, ఇతర కులాలవాళ్ళని జీవశక్తి ఇంకా చావని వాళ్ళుగా వర్గీకరించి చెప్పాడు. భౌతిక కర్మ నుండి ఉత్పత్తి నుండి వైదొలగిన వర్గం వారిదయితే తదితర కులాలు ఉత్పత్తిసంబంధంలో వున్న వర్గం. విధి నిషేధాల రూపంలో ఉత్పత్తి కులాలను అదుపు చేసే బ్రాహ్మణుల జ్ఞానశక్తిని తీవ్రంగా నిరసించాడీ కథలో. "సనాతన మతం అన్నవాడినల్లా జైలులో పారెయ్యి! ఒక సంవత్సరం లోపల ఈ హరిజనుల్లో నుంచి సూపర్‌మాన్ రాకపోతే నా పేరు సూరి కాదు" అన్న మాటలద్వారా కొకు వారి సర్వతోముఖ వికాసానికి ఎదుగుదలకు అభివృద్ధిలో సమానవాటా పొందేందుకు అవరోధంగా వున్న సనాతన మతంపై యుద్ధాన్ని కూడా ఒక కార్యక్రమంగా ఇచ్చినట్లయింది.

ఆ రకంగా కొకు కథా సాహిత్యం ఈనాటి భిన్న సామాజికవర్గాల ఆకాంక్షల పరిపూర్తికి అవసరమైన నైతిక సంస్కారాలను కూడగట్టగల శక్తిగా ప్రత్యేకమైనది.

**పాదసూచికలు:**

1. కళాకారుడి పాత్ర - (వ్యా). చూడు: కొకు వ్యాస ప్రపంచం, 5, సాహిత్యవ్యాసాలు (కూర్పు, కృష్ణాబాయి, ప్రసాద్) విరసం ప్రచురణ, మే 2001చ పు. : 302
2. పెట్టుబడి దారీ సంస్కృతి (వ్యా) చూడు : కొకు వ్యాస ప్రపంచం 3, సంస్కృతి వ్యాసాలు (కూర్పు, కృష్ణాబాయి, ప్రసాద్) విరసం ప్రచురణ అక్టోబరు 1999, పు. : 34
3. కథా - కల్పన (వ్యా) కొకు వ్యాస ప్రపంచం, 5, సాహిత్య వ్యాసాలు (కూర్పు, కృష్ణాబాయి, ప్రసాద్) విరసం ప్రచురణ మే 2001, పు. : 191
4. నా కథా రచన (వ్యా) పైదే పు. 160
5. పైదే, పు : 159

# బతుకు బరువు దించుకునే గోపీచంద్ కథలు

వాసిరెడ్డి కృష్ణారావు

అందమైన, తీయనైన తెలుగు కథకు వన్నె కూర్చిన కథా రచయితలు ఎందరో ఉన్నారు. అందులో మల్లాది, శ్రీపాద, గోపీచంద్, చింతా, చలం, వేలూరి మున్నగువారు ముందు వరుసలో నిలిచినవారు. జనాభ్యుదయం కోసం కథలను అల్లి కథాప్రక్రియకు మహోన్నతరూపం కల్పించారు. అపార అనుభవం, ప్రతిభ, మానవత్వం మీద అచంచలమైన నమ్మకం గల ఈ రచయితలు శాశ్వత విలువలు పెంచే కథల్ని సృష్టించారు. జీవితమంటే ఏమిటో, ఎలా జీవించాలో సమాజానికి నేర్పించారు.

త్రిపురనేని గోపీచంద్ (1910-62) కథా రచయితగా, నవలాకర్తగా వ్యాసకర్తగా, నాటకకర్తగా సినీరచయితగా, సినీదర్శకునిగా, సాహితీవేత్తగా పేరొందాడు. ఎం.ఎన్. రాయ్, అరవిందుని రచనలు గోపీచంద్ జీవితాన్ని ప్రభావితం చేశాయి. ఆయన రాసినకథలు జన హృదయాల్ని ఆకట్టుకున్నాయి. సంక్షిప్తత, సూటితనం, నిర్మలత్వం, మానవతావాదంతో కథావిపంచికను మీటిన గోపీచంద్ తెలుగు కథను రంజింపచేశారు. గోపీచంద్ రాసిన పెక్కు కథలు, కథా సంపుటాలుగా రూపుదిద్దుకున్నాయి. భార్యల్లోనే వుంది, దేశం ఏమయ్యేట్టు?, గీతాపారాయణం, తండ్రీ కొడుకు, ధర్మాసుపత్రి మున్నగు కథా సంపుటులు మానవజీవితం లోతుపాతుల్ని సార్థకతను ప్రబోధించాయి.

నవభారత్ బుక్‌హౌస్ వారు 'భార్యల్లోనే వుంది' అనే పేరుతో 168 పేజీలు గల పదిహేను కథల్ని సంకలనంగావించి తెలుగు ప్రజలకు అందించారు. ప్రధానమైన కథ 'భార్యల్లోనే వుంది' ఒక అద్భుత ప్రయోగం మంచి కథాశైలితో, గొప్ప శిల్పంతో సాగిన ఈ కథ ప్రత్యేకతను సంతరించుకుంది. స్త్రీవాదంతో సాగిన ఈ కథ మకుటాయమానంగా నిలుస్తుంది.

మానవత్వాన్ని చేదిపోసే మమకారం, మానవత్వాన్ని బోధించే మహోన్నతజ్ఞానం, బతుకు బరువును దించుకునే తాత్త్వికత గోపీచంద్ కథల్లో అడుగడుగునా కన్పిస్తుంది.

ఈ సంపుటిలోని 15 కథల్ని విశ్లేషించుకుంటే మనకు రచయితపట్ల, రచనపట్ల ఎనలేని గౌరవం పెరుగుతుంది. రచయితకున్న సామాజిక బాధ్యత ప్రతి కథలోను గోచరిస్తుంది. మచ్చుకు ఈ ఒక్క సంపుటిని అధ్యయనం చేసినట్లయితే రచయిత కథాబలాన్ని, నిర్వహణను, సామాజిక ప్రయోజనాన్ని గూర్చి ఒక అంచనాకు రావచ్చును. ఇందులో కథాక్రమం ఇలా ఉంటుంది. 1). భార్యల్లోనే వుంది 2) డబ్బు ! డబ్బు ! డబ్బు !!! 3) సిగ్గు 4) బస్సు ఆగింది - పోయింది 5) భూతదయ 6) పాపిష్టిసంఘం 7) పీడిత హృదయం 8) హిందూపాతివ్రత్యం 9) పాపాయి యిల్లు 10) భార్యాభర్తలు 11) మనకవి 12) పుస్తకాలు అమ్మువాడు 13) పెద్దల సుద్దులు 14) ఆడమళయాళం 15) నేనూ - నా పాత్ర

కథకు పేరు పెట్టడం దగ్గర్నుండి కథకు ఎన్నుకున్న ఇతివృత్తం, పాత్రలు, సంఘటనలు సహజసిద్ధంగా ఉంటాయి. గోపీచంద్ మూడుమడతల్లో చెప్పిన కథ నుండి పెద్ద కథ వరకు ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశించి కథల్ని అల్లారు. ఒక్కొక్క కథను చదివిన తర్వాత మనసంతా నిండిపోయి, ఇంకిపోతుంది. దాన్ని మన మేధ తీరిగ్గా విశ్లేషించడం మొదలెడుతుంది. వాటి ఆలోచనలు మనలో మంచి కదలికలు సృష్టించి, బతుకు భారాన్ని తగ్గించుకునే ప్రయత్నాన్ని ప్రారంభిస్తాయి.

కథల విశ్లేషణ: 'భార్యల్లోనే వుంది' అన్న శీర్షికనే ఆలోచనాత్మకంగా నిలిచింది. ఎవరిజీవితాన్ని వారు ఆలోచించుకోవాలి అనే సామాజిక అంశాన్ని తెరపైకి తెచ్చింది. భార్యల్లోనే అచేతనత్వం ఉందని, వారు చైతన్యస్ఫూర్తిని పొందినపుడే వారి జీవితం భారంగా ఉండదని నిరూపించినదీ కథ ! మనిషి లావు, సన్నాలు కావడం వారి వారి చేతుల్లో మాత్రమే ఉందా ! అనే ప్రశ్న మనల్ని చురుక్కుమన్పించి, మాలిన్యాన్ని తొలగింపజేస్తుంది.

'తాయరమ్మ' అనే సాధారణ గృహిణి, లావుగా ఉన్నావనే భర్త ఈసడింపు భరించలేక పుట్టింటికి పయనమై, బస్టాండుకు వస్తుంది. తమ ఊరు బస్సు వచ్చేలోపునే జ్ఞానోదయంతో తిరిగి భర్త పంచకే చేరుతుంది.

తాయారమ్మ రూపమే కాదు, పేరు కూడా భర్తకు నచ్చలేదు. పుష్పావతి, శ్యామల అంటూ రకరకాల పేర్లు అంటించాలని చూసినా ఏవీ అతకవు. లావు తగ్గించుకోవాలని చేయని ప్రయత్నం లేదు. భర్తకు చెప్పకుండానే బయల్దేరిన తాయారమ్మ, బస్టాండ్‌లో సన్నగా ఉండే యువతిని చూసి ఈర్ష్య పడుతుంది. ఆ

యువతి తాయారమ్మను చూసి ఎలా లావయ్యావో చెప్పి తన కాపురం నిలపమని ప్రాధేయపడుతుంది.

ఒక భర్తకు లావు నచ్చకపోతే, మరో భర్తకు సన్నదనం నచ్చదు. ఒకరికి కంటే నచ్చదు, మరొకరికి కనకుంటే నచ్చదు. అన్నీ భార్యవైపే నష్టాలు, లాభాలన్నీ భర్తవని గ్రహించిన తాయారమ్మ ఆలోచనలో పడుతుంది. పురుషులు తమ దృష్టికోణం మార్చుకోవాలని, ఆ మార్పు తేవాలనే నిశ్చయంతో యింటికి వస్తుంది. ఆ సన్నటి యువతి అభ్యర్థనను పట్టించుకోకుండానే తాయారమ్మ రావడం బాధనిపించినా, తనదాకా వస్తేనే అన్నీ తెలుస్తాయిలే అని పాఠకులు సర్దుకోకతప్పదు మరి. అయినా ఆ కాలపు పరిణతి అంతవరకేనని విమర్శకులు చేతులు ముడుచుకోవాల్సిందే ! దటీజ్ తాయారమ్మ. 'భార్యల్లోనే వుంది' అనే నిజం తాయారమ్మే కాదు స్త్రీ జాతి అంతా గుర్తించాలని గోపీచంద్ ఆరాటం !

... 'భారత నారీమణి కష్టాలను ఏ విధంగా ఎదుర్కొంటుంది నష్టాలను ఎదుర్కొలేక ఏడ్చి ఏడ్చి చివరకు పతివ్రత అయి వూరుకుంటుంది. ... ఈ విధంగా నడుస్తూ వుంది హిందూదేశం' అనే మాటల్తో కథా ప్రవేశం జరుగుతుంది.

ఆ ఊళ్ళో రాలిన ఆకులకన్నా పురుషులు ఎక్కువ. తొక్కినా తొక్కకపోయినా అంటయ్ అని స్త్రీ పాత్రల మాటలు మన మనసుల్ని చివుక్కుమన్పిస్తాయి. కాఠిన్యంతో నిండిన పురుష పుంగవులు తమ స్వభావాన్ని మార్చుకుంటేనే స్త్రీ జాతికి రక్షణ అనే అంతరార్థం మనకు స్ఫురిస్తుంది. మహిళామనోదర్పణాన్ని చాటి చెప్పిన గోపీచంద్ కలకాలం కథా రచయితగా నిలుస్తారు.

"ఈ భర్తల్లో ఇన్ని జాతులా? ఏ జాతి భర్తకు అనుకూలంగా ఆ భార్య తయారవ్వాలి? భార్యకు వేరే జీవితం లేదూ? భర్త జీవితంలో కలిసి అల్లుకు పోవడమేనా? ఆపని భర్తలెందుకు చెయ్యరు?" అనే మాటలు పాఠకుల చెవుల్లో గింగురుమంటాయి.

"అన్నిటికీ భార్యలదే బాధ్యతా? ఇలా ఎందుకు జరగాలి? తప్పెవరిది? భర్తల ఆజ్ఞల్ని ప్రశ్నించకుండా పాలించే భార్యలదేనా? నేనెందుకు లావు తగ్గాలి? నాకు మల్లే మా ఆయన ఎందుకు లావు అవగూడదూ?" అనే మాటలు పురుష సమాజాన్ని ఆలోచింపజేసే వాస్తవాలు.

"పురుషులంతా పసిపిల్లలే. ప్రవర్తించుటలో భేదం గాని అంతా అమాయకులే? అనాదినుంచి స్త్రీ జాతిలో జీర్ణించుకుపోయిన బానిసత్వం (కవిత్వ భాషలో మాతృహృదయం) పైకి ఉబికింది" అని చెప్పడంతో స్త్రీ క్షమాహృదయం తళుక్కుమంటుంది.

"అతని కోపం చూస్తే ఆమెకు ఆనందం కలిగింది. అతని కోపం ఆమె బానిస హృదయానికి ఆహ్లాదాన్ని కల్గించింది. జీవితంలో ఒక్క గడియ నూతనాభిప్రాయాలతో నలిగి, ఉడికి, బాధపడ్డ ఆమె మనస్సుకి అప్పుడు శాంతి లభించింది" అనే ఉపశమన వాక్యాలతో కథముగుస్తుంది.

మళ్ళీ జీవితంలో యథాలాపంగానే కొట్టుమిట్టాడుతూ సాగుతున్నదనే నిజాన్ని కథ ముగింపులో అందంగా చెప్పిన రచయిత మానవ ప్రవృత్తిని ఎత్తి చూసారు. 'ఛీ ! ఎంతలావుగా చతికిలబడింది అని అతడు తనలో తాను అసహ్యించుకొని బయటకు వెళ్ళాడు' అని అనడంతో పురుష అహంకారం ధ్వనిస్తుంది. స్త్రీలలో మార్పు వచ్చినా, పురుషుల్లో కూడా మార్పు అవసరమని ఈ మాటతో తేల్చి చెప్పారు గోపీచంద్. బతుకు పండాలంటే పురుషుల్లో మార్పు రావాలనేదే కథకుని తాపత్రయం.

డబ్బు ! డబ్బు !! డబ్బు !!! అనే శీర్షికలో కన్పించే ఆశ్చర్యార్థకాలు డబ్బు మానవుడిని ఎన్ని సర్కస్ ఫీట్లు చేయించుతుందో తెలియజెబుతుంది. మానవుని అసహజ ప్రవర్తనకు నిగూఢరహస్యమేదో ఉంటుందని గుర్తించమనే హెచ్చరిక దాగి ఉంది.

కథానాయకుడు గోపీ తండ్రి కన్నా పెదనాన్ననే ఎక్కువ ప్రేమిస్తాడు. ఆ పెద్దనాన్న కూడా అంతే ! చావు బతుకుల్లో ఉన్న పెద్దనాన్నను కడసారి చూడటానికి కూడా వీలు లేకుండా చేసింది డబ్బు. తన జేబులో ఉన్న డబ్బును తండ్రికి యిచ్చి, తను మాత్రం శవాన్ని కూడా చూడలేక పోయినా గోపీ నిందలపాలవుతాడు. అప్పు ఇచ్చినవారు లేరు కాని, తన ప్రమేయం లేకుండానే కేవలం డబ్బు మాత్రమే గోపీని దోషిని చేసింది. మరణశయ్యమీద కలవరించిన పెద్దనాన్నను చూడలేదని గోపీని నిందించి ఇంట్లోనుండి వెళ్ళగొడతాడు. గోపీ డబ్బు లేకనే రాలేదనే వాస్తవం లోకానికీ తెలియదు, కన్నతండ్రికి అంతకన్నా తెలియదు. మమతల్ని, మమకారాన్ని పంచుకోడానికి అడ్డుగా నిలిచిన డబ్బును ఈసడించుకొని విశాల ప్రపంచపు

ఒడిలోఒంటరిగా చేరిన గోపీ త్యాగాన్ని, నిజాన్ని గ్రహించని తండ్రి కర్కోటకాన్ని పాఠకులు తేలిగ్గా గుర్తిస్తారు. అపార్థాలు రానంతవరకే బతుకు తేలిగ్గా ఉంటుందని గోపీచంద్ సులభంగా తేల్చి చెప్పారు.

'సిగ్గు' అనే కథలో సమయసందర్భాలు లేక వెకిలి చేష్టలు చేసిన వ్యక్తిని నటీమణి అతితేలిగ్గా క్షమించడం, మరచిపోవడం జరుగుతుంది. జీవితంలో యాదృచ్ఛికంగా జరిగే సంఘటనల్ని మరవగలిగేతేనే సౌఖ్యమనే నిజాన్ని పల్కించారు కథారచయిత.

ప్రేమించడంలో ఆనందముందని ఆ ప్రేమ గాంధీమీద, సుభాష్ మీద, రష్యామీద కావచ్చని చెబుతూ దేశం మీద మరల్చుకుంటే జీవిత మాధుర్యమని చెప్పిన కథ బస్సు ఆగింది - పోయింది.

ఆంధ్రులకు ఆలోచనలెక్కువ, ఆవేశం ఎక్కువ కార్యశూరులు కాదు అంటూ అధిక్షేపించిన కథ 'భూతదయ'. అపాత్రదానంతో ఆలోచనలోపడి అనవసరమైన భూతదయను చూపానని సంకటంలో పడిన యువకుడు మానసిక శాంతిని ఎలా కోల్పోతాడో చూపినదీ కథ.

'పాపిష్టి సంఘం' కథలో మానవ గుణాలను సరిదిద్దాల్సిన సంఘం చెడునే సమర్థిస్తున్నదని తెలియజెప్పింది. 'చచ్చిపోయేటప్పటికి వీలైనన్ని అప్పులు చేసి వుంచుకో. ఈ పాపిష్టి సంఘాన్ని మోసం చేయగలిగానేనన్న తృప్తి ఉంటుంద'ని ఉపదేశించిన తండ్రి మాటను కాదని లోకంతోనే మోసగింపబడి ఒక్క పిట్టయినా చూడటానికి చివరిచూపుకు రాలేదని బాధపడే కొడుకును చూసి జాలిపడక పాఠకులు ఉండలేరు. అప్పులు చేసిన తండ్రి మంచం చుట్టూ మనుష్యులే, తనకేమో శూన్యం అన్న కొడుకు ఆత్మక్షోభను చూసి ఈ సమాజాన్ని నిలదీయాలన్పిస్తుంది. చెడుకే వన్నెలెక్కువ. వెల కూడా ఎక్కువేనని నిరూపిస్తుంది ఈ సంఘటన. సంఘం ఇప్పటికయినా తన నడవడి మార్చుకుంటేనే 'మంచి' బట్టకడ్తుంది. లేకుంటే రావణరాజ్యమే ఆదర్శమవుతుంది. కథా ప్రపంచంలో మంచి స్థానాన్ని పొందిన గోపీచంద్ ఈ కథలో మరింత ఉన్నతిని పొందారు. మూడు పేరాల చిన్న కథ మానవతకు, మానవ సమాజానికి మార్గోపదేశం చేసింది.

'పీడిత హృదయం' కథలో పీడించుకుతినే మేనమామ కామయ్య, మేనల్లుడు రామును భయపెట్టి ఇల్లు వదలిపోయేట్లు చేశాడు. 'మనమంతా బానిసలం. బానిసలక్షణాలు మన రక్తంలో జీర్ణించి పోయినయ్ అందుకని పరదేశమొచ్చి గడపలో అడుగుపెట్టినా మనకు చలనం లేదు' అనే మాటలు స్వతంత్ర జీవితాన్ని, పాలనాకాంక్షను రచయిత దృక్పథంగా ఎత్తి చూపుతున్నాయి.

'హిందూ పాతివ్రత్యం' అనే కథలో భార్య ఇంట్లో పాతివ్రత్యం వండుతూ ఉంటే, భర్త మరో ఇంట్లో వెచ్చాలు కొంటూ ఉంటాడని చెప్పడం సగటు హిందూదేశభర్తల మనస్తత్వాన్ని చాటి చెప్పింది. ఎవరెవరికీ పడటం లేదు. ఒకేయింట్లో ఒక కప్పుకింద కాపురం చెయ్యాలి, దుర్గంధం బయటకు రాకుండా కిటికీ తలుపులు మూసుకొని కూర్చోవాలనే మాటలో ఎంతో నిగూఢమైన బాధ దాగి ఉంది. ఇంగ్లండు వ్యాసానికి ఫ్రాన్స్ విలాసానికి, జర్మనీ సైన్యానికి, హిందూదేశం ప్రాతివ్రత్యానికి ప్రసిద్ధి చెప్పడం మన సమాజపు డొల్లతనం చూపడమే ! ఈ మేడిపండు తత్త్వం పోతేనే హిందూదేశ కాపురాలు బాగుపడతాయని కథకుని నమ్మకం.

'పాపాయి ఇల్లు' పసిపాపల హృదయ ఘోషను చాటిన కథ. చదివి తీరాలి. 'భార్యభర్తలు' కథను కొన్ని దృశ్యాలుగా చిత్రించి, భార్యాభర్తల జీవితాల్లో ఏముండాలో తెలియజెప్పారు ఈ రచయిత. సరళ, ప్రసాద్‌లు భార్యాభర్తలు. సరళ భర్త భౌతికజీవితాన్నే కాని మానసిక జీవితాన్ని ప్రేమించలేదు. భర్త మానవసేవాగుణాన్ని హర్షించలేదు. అందుకే విడిపోయి, దూరంగా పోయి హేమ అనే ఆమెను పెండ్లాడి ప్రసాద్ జీవిస్తుంటాడు. సరళ అక్కడకు చేరి వారి అన్యోన్యతను భౌతిక, మానసిక కలివిడిని ఆమోదించినా, తనకు చోటును అభ్యర్థించడం చూసి పాఠకుల కళ్ళు చెమర్చుతాయి. కలిసి ఉన్నప్పుడు తెలియనిబంధం ఎడబాటులోనే విలువతెలుస్తుందని సందేశాత్మకంగా భార్యాభర్తలకు బోధించింది.

'మనకవి' కథ మనసుకవి గురించి విప్పిచెప్పింది. 'పుస్తకాలు అమ్మేవాడు' కథలో అశ్లీలవర్ణనలు చెప్పి పుస్తకాల అమ్మేవ్యక్తి మాటలకు పురుషులంతా వినోదిస్తూ ఉంటారు. ఆ గుంపులో ఒక ప్లీడరు ఉంటాడు. ఒక ఆధునిక యువతి ప్లీడరును మెత్తగా మందలిస్తుంది. పరిహసించే వారిని చూసి సహించిన వారు కూడా

నేరస్థులేనని యువతి చెప్పిన తీరు హృద్యంగా ఉంది. మరి నన్ను పరిహసించారుగా అన్నమాటలు నవ్వును తెప్పిస్తాయి. అనుమానం ఆడవారినే కాదు అందర్నీ బాధించేదని చెప్పిన నవీనత మానవగుణాన్ని అభినందించాలి.

'పెద్దల సుద్దులు' కథలో మనవారి మాటలు ఒకదానికొకటి విరుద్ధంగా ఉంటాయి. ఆలస్యం అమృతం విషమంటే, తొందరపాటు మంచిది కాదనే పరస్పరం వ్యతిరేకవాక్యాలు. 'పండితపుత్రః పరమశుంఠః' అనే వాక్యం, పులి కడుపున పిల్లి పుడుతుందా అనే వాక్యం ఇటువంటిదే. సమయ సందర్భశుద్ధితోనే పెద్దల సుద్దులు స్వీకరించాలనే కథకుని వాదన బతుకుమాధుర్యాన్ని పెంచుతుంది.

'ఆడమళయాళం' అనే కథ 'జంబలకిడిపంబ'లా ఉంటుంది. స్త్రీ పురుషుడుగాను, పురుషుడు స్త్రీ గాను మారితే ఎలా ఉంటుందో తెలియజెప్పి పురుషస్థితిని సరిదిద్దే ప్రయత్నం చేశారు రచయిత.

చిట్టచివరి కథ 'నేనూ – నా పాత్ర' అనే ఐదు పేరాల చిన్నకథ నిజమైన కథకుడు ఎదుటి వారి జీవితంలోని అంశాలు తీసుకుంటాడు కాని యధాతథమైన జీవితాన్ని కాదని తెలియజెప్పి సాహిత్యపరిధిని, చిత్రణను శాసించారు గోపీచంద్.

ఈ విధంగా గోపీచంద్ తాత్త్వికునిగా, సాహితీవేత్తగా సమాజానికి, స్త్రీపురుషులకు మంచి సాహితీ వైద్యాన్ని అందించి బతుకు బరువును తగ్గించి, జీవితంలో ఆనందసుమాలను వికసింపజేశారు.

# శ్రీ విశ్వనాథ వారి కొన్ని చిన్న కథలు

డా॥ హరి సనత్కుమార్

కవి సమ్రాట్, కళాప్రపూర్ణ, పద్మవిభూషణ, శతాధిక గ్రంథకర్త శ్రీ విశ్వనాథ సత్యనారాయణ ఆధునిక సాహిత్యంలో హిమాలయోత్తుంగ శిఖరం. అనేక కావ్యాలు, నాటకాలు, నవలలు, చిన్న కథలు, విమర్శగ్రంథాలు, సంపాదిత గేయాలు, కవితలు, నాటికలు, వ్యాసాలు, ఇంటర్వ్యూలు, రేడియో ప్రసంగాలు, పీఠికలు, సంస్కృత రచనలు, అభిప్రాయాలు, ఆశీస్సులు, ఇలా ఎన్నో వ్రాసారు. రచనల్లో ఒక చిన్న అంశం చిన్న కథ. విశ్వనాథ కథలు కూడా వ్రాసారు అనడానికి ఉదాహరణలే ఈ చిన్న కథలు. ఈ చిన్న కథ ఎంత సొగసుగా సాగాలో విశ్వనాథ వారి మాటల్లోనే పరిశీలిద్దాం. విశ్వనాథ నవలల్లో కథలు, కవితల్లో కథలు, ఇతర రచనల్లో కూడా అనేక చిన్న కథలు చోటు చేసుకున్నాయి. కొన్ని స్వతంత్ర కథలైనాయి. కొన్ని కథలు కవితలైనాయి. ఇలా సర్వం కలబోసుకున్నాయి. 16-02-1953నాడు ఆంధ్రసారస్వత పరిషత్తు ఆధ్వర్యాన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో కథకుల ఇష్టాగోష్ఠి సమావేశం జరిగింది. ఖండవల్లి లక్ష్మీరంజనం గారు అధ్యక్షులు, ప్రఖ్యాత కవులు చాలామంది పాల్గొన్నారు. అప్పటికి విశ్వనాథ లబ్ధప్రతిష్టులు, అప్పటికే ఆంధ్రదేశము పట్టనంత కవి. అప్పటికే కొన్ని కథలు వ్రాశారు. ముద్రింపబడ్డాయి.

శ్రీ విశ్వనాథ "ఉత్తమ కథా లక్షణము" అనే అంశంపై ప్రసంగిస్తూ "కథలే కావ్యాలుగా వచ్చాయని, ఎంతటి కావ్యానికైనా కథయే మూలమని అన్నారు. కథానికా రచనలో ఒక భావన చెప్పవలెనంటే రెండు విధాలున్నవి. ఒకటి విస్తరించి చెప్పడం, మరొకటి కుదించి చెప్పడం. ఆధునాతన పద్ధతి ఏమిటంటే కుదించి చెప్పడం. చిన్న కథలో భావసాంద్రత Density of Thought అధికంగా ఉండవలెను. నలోపాఖ్యానం, ముద్రారాక్షసం మున్నగు కావ్యాల కథా కథన ప్రాశస్త్యాన్ని విశదీకరిస్తూ పెద్ద విషయాలను తగ్గించి చెప్పడంలోనే ప్రతిభ ఉన్నది. కాబట్టి చిన్న కథకీనాడు విశేష వ్యాప్తి కలిగినది."

శృంగార రసం గల కథలలో శబ్దాల స్వరూపం ముఖ్యం. ఇతివృత్తాన్ని బట్టి రచనావిధానం ఉండాలి. కథలో అనేక తరహాలున్నవి. కొన్ని ప్రయోజనం

కలవి. కొన్ని ప్రయోజనం లేనివి. మరికొన్ని సంఘ సంస్కారాన్ని సూచించేవి. ఏ కథకైనా కావల్సింది టెక్నిక్. కథకు భాషా పాండిత్యం. కథా వస్తువు ముఖ్యమైనవి. కావు. ఎలా చెపితే కథకు ప్రాముఖ్యం వస్తుందో దానిని రచయిత అవలంబించవలెను. అతడు అవలంభించిన ప్రతిభపైనే అతని ప్రతిభ ఆధారపడియుండును. అయితే టెక్నిక్ అంటే ఏమిటి? desired effect ను produce చేసేదే టెక్నిక్. ఒక effect తేవాలంటే పెద్దవాక్యంలో చెప్పాలా? చిన్నవాక్యంలో చెప్పాలా? చిన్న వాక్యం ఎంత ఉండాలి? వీటినన్నిటినీ నిర్ణయించుకునే తీరే టెక్నిక్. ఒక్కొక్కమారు reflection కూడా టెక్నిక్‌గానే ఉపయోగిస్తున్నది. టెక్నిక్ యొక్క స్వరూపం కథలో వచ్చే effect పైన ఆధారపడి ఉంటుందని తెలుపుతూ రచయితలు విశేషంగా సాహిత్యాన్ని చదివి, భావనను పెంపొందించుకొని, భావోద్రేకం కలిగినప్పుడే కథా రచనకుపక్రమించవలె నన్నారు.

ఇన్ని భావనలు నాటి కథలో తొంగిచూస్తున్నాయి. ఇవన్నీ విశ్వనాథ చూస్తున్నవే. ఐనా కథాకథన సాహిత్యం వైపుకు విశ్వనాథ తొంగిచూసింది తక్కువే. మహానవల కథనంలో వక్కనోట్లో వేసుకుని నవల చెప్పే సామర్థ్యం కల విశ్వనాథకు చిన్న కథ వైపుకు మక్కువ తక్కువేనేమో అనిపిస్తుంది. వారి పెద్ద నవలలు అమృతమయాలు. అనంత విషయాలు దాంట్లో ద్యోతకమౌతాయంటారు. అందువలన అమృతం గ్రోలుతున్న వ్యక్తి మంచినీళ్ళవైపుకు పరుగుపెట్టడు కదా !

ఇక విశ్వనాథ కథల రాసి చూద్దాం. వారి సర్వసాహిత్య ప్రక్రియల్లో ఇది సహస్రాంశం. అన్నీ కలిపితే పాతికలేవు. విశ్వనాథ నవలల్లోనే కథలు వ్రాశారు. పాత్రల సంభాషణల్లో అనేకాంశాలు వ్యక్తీకరింపబడ్డాయి. ఇంకా కొత్తగా కథలెందుకు అన్న భావన విశ్వనాథను 'కథ' అనే పేరుతో వ్రాయించేలా చెయ్యలేదేమో అని అనిపిస్తుంది. వీటిల్లో కొన్ని చిన్న పిల్లలకథలున్నాయి. కొన్ని పెద్దలవి. కొన్ని స్వదేశీ, కొన్ని విదేశీ, తనకి నచ్చిన అంశం కథాంశం అయింది.

ఇక కథాకథన శిల్పం మరింత చిత్రమైంది.

శ్రీ విశ్వనాథ విస్తృత, విస్మృత సాహిత్యాన్ని దాచి మనకందించినవి, నాటి రోజుల్లో సాహితి, శారద, ప్రబుద్ధాంధ్ర, ఆంధ్రపత్రిక, ప్రతిభ, రూపవాణి, తెలుగు స్వతంత్ర, ఆనందవాణి, కృష్ణాపత్రిక, జయంతి, భారతి, పుస్తక

ప్రపంచంలాంటి పత్రికలు. 1923 నాటికి విశ్వనాథ తెలుగు కవిగా పేరు సంపాదించుకున్నారు. ఆ రోజుల్లో కథలు పుడుతున్న తొలిరోజులు. విశ్వనాథ తాను కథారచయిత కావాలనుకున్నారు. అందునా 1923లో కొన్ని కథలు వ్రాశారు.

నచ్చిన కథల్ని శారద, సాహితిలు ప్రచురించాయి. ఈ కథలు వారి సర్వరచనలకు బీజాలు. తరువాత కాలంలో నవలలు వ్రాయడానికి ఇవే మార్గదర్శకాలైనాయి. ఆ తరువాత విశ్వనాథ కథలు చెదురుముదురుగా వచ్చాయి. ఇక విశ్వనాథ కథలెన్ని ఉన్నాయో చూడండి. సాధ్యమైనంత వరకూ కాలక్రమంగా వ్రాసే యత్నం చేశాను.

| క్రం. | సంవత్సరం | మాసం | పత్రిక | కథపేరు |
|---|---|---|---|---|
| 1. | 1923 | ఏప్రియల్ | సాహితి | భావనాసిద్ధి, |
| 2. | 1923 | ఏప్రియల్ | శారద | జమీందారుని కొడుకు |
| 3. | 1923 | మే | సాహితి | రోధము |
| 4. | 1923 | మే | శారద | వియోగిని |
| 5. | 1923 | జూన్ | సాహితి | పరిపూర్తి |
| 6. | 1923 | ఆగష్టు | శారద | విస్మృత |
| 7. | 1923 | ఆగష్టు | -- | పరివర్తనము |
| 8. | 1925 | జనవరి | | అల్లాకే ఫకీర్ |
| 9. | 1925 | జనవరి | భారతి | తిరోధానము |
| 10. | 1926 | | | కలాలీలు |
| 11. | 1926 | అక్టోబర్ | భారతి | నీ ఋణం తీర్చుకున్నా |
| 12. | 1930 | ఆగష్టు | భారతి | పుణ్యప్రేమము |
| 13. | 1931 | ఆగష్టు | భారతి | రాజు |
| 14. | 1933 | మార్చి | భారతి | పరిశోధకులు |
| 15. | 1935 | మార్చి | ప్రభుద్ధాంధ్ర | య్యోర్విషిఖెయ్ |
| 16. | 1935 | నవంబర్ | ప్రభుద్ధాంధ్ర | దయాన్‌ధాస్ |
| 17. | 1936 | | ప్రభుద్ధాంధ్ర | కాళిదాసుని అపకీర్తి |
| 18. | 1941 | ఏప్రియల్ | ఆంధ్రపత్రిక | జీవుడి ఇష్టము |

| | | | | |
|---|---|---|---|---|
| 19. | 1941 | ఆగష్టు | ప్రతిభ | మాల్లే దుర్గంలో కుక్క |
| 20. | 1943 | డిసెంబర్ | భారతి | ఆద్యంతములు |
| 21. | 1945 | మార్చి | రూపవాణి | గోలీ మహల్ |
| 22. | 1948 | మే | ఆంధ్రశిల్పి | ద్విజాత |
| 23. | 1949 | ఏప్రియల్ | ఆంధ్రపత్రిక | కపర్ది |
| 24. | 1949 | ఉగాది | ఆంధ్రపత్రిక | ఏమి సంబంధము |
| 25. | 1949 | ఏప్రియల్ | తెలుగు స్వతంత్ర | శకుంతల విధికి ఎవరు కర్తలు |
| 26. | 1950 | డిసెంబర్ | ఆనందవాణి | ఉరి |
| 27. | 1951 | జనవరి | భారతి | ముగ్గురు బిచ్చగాళ్ళు |
| 28. | 1954 | ఏప్రియల్ | కృష్ణాపత్రిక | దొరగారు - దీవాన్జీ |
| 29. | 1959 | ఫిబ్రవరి | జయంతి | వెలుగు - మెట్లు |
| 30. | | | ప్రతిభ | జూ |
| 31. | | | | ఇంకొక విధము |
| 32. | | | | సప్తాశ్వము |
| 33. | | | కృష్ణాపత్రిక | చామర గ్రాహిణి |
| 34. | | | పుస్తక ప్రపంచం | ప్రతీక్ష |

ఇలా విశ్వనాథ వారి కథలు 34 కన్పిస్తున్నాయి. ఇంకా లభించవలసినవి ఉండవచ్చు. వీటిల్లో కొన్నిటిని పరిశీద్దాం. కొన్ని కథలు అనువాదాలు. కొన్ని నవలల్లో కథలుగా మిగిలాయి. కొన్ని కథలు ఖండకావ్యాలైనాయి. పద్యంలో కూడా అద్భుతంగా కథ చెప్పే లక్షణం విశ్వనాథలో భాసిస్తుంది. కథ అంటే వచన ప్రక్రియే అన్న నిబద్ధతకు విశ్వనాథ కథ లొంగి ఉండదు. కథలో కవితలుంటాయి. కథ గేయంగా విశ్వనాథ రచనల్లో రూపుదిద్దుకుంటుంది. ఇలా వ్రాయటం ఇతర కవులల్లో కన్పించదు. ఈ వింత లక్షణమే విశ్వనాథను విలక్షణ రచయితగా ఆంధ్రసాహిత్యంలో నిలబెట్టింది. నవలలోని కొన్ని భాగాలు విడిగా వ్రాస్తే కథలౌతాయి. ఖండకావ్యాలు కథలౌతాయి. కొన్ని అనువాదాలైతే, కొన్ని స్వతంత్ర కథలు - విశ్వనాథ కథల్లో పట్టే భావానికి నిబద్ధుడు కాడు అందువలన అతి స్వల్ప కాలంలోనే నవలా

రచోన్ముఖుడైనాడు. అందుకోసం కథలు వెనుకంజవేశాయి. ఏదో ప్రక్రియా వైవిధ్యం స్పర్శకోసం విశ్వనాథ వ్రాశారామో ! అనిపిస్తుంది.

ఒక్కొక్కసారి ఎప్పుడో పుట్టిన కథ తరువాత కాలంలో ఒక గొప్ప గ్రంథంగా మారుతుంది. 1958-59ల్లో వ్రాసిన "శాకుంతలము యొక్క అభిజ్ఞానత" బీజం, 1936లో "కాళిదాసుని అపకీర్తి" కథ.

గురజాడ వారి దిద్దుబాటు తరువాత కథలు పెద్దగా రాకపోయినా, కవిత్వం ఆదరింపబడుతున్న కాలం కావటంతో విశ్వనాథ వారు కూడా కాకతీయుల చరిత్రలో కథలను ఖండకావ్యాలుగా వ్రాశారు. ఇవి ఆంధ్రప్రశస్తిలో కన్పిస్తాయి. బందరు సముద్రం ఒడ్డున జరిగిన దృశ్యము బానిసల సముద్రమనే ఖండిక అయింది. రైలు ప్రయాణానుభవం బిచ్చగాడైంది. బౌద్ధజాతక కథ ఒక జాతక కథ అయింది. భారతకథ భీష్ముడైంది. వేదంలో కథ అమృతకలశం అయింది. ఇలా ఎన్నో కథలు కవితలు నవలల్లో కథలు - కథలు నవలలుగా మారటం విశ్వనాథ రచనల్లో కలబోసుకొని సృష్టింపబడ్డాయి. ఈ కవితలు భ్రష్టయోగి, కేదారగౌళలలో కన్పిస్తాయి.

కథకు పుట్టుక ఇదీ అని చెప్పటం సాధ్యం కాదు. ఏదైనా చూసి, చదివి, విని, స్పందించి దాన్ని వ్రాసే సహృదయ హృదయావిష్కరణమే కథ. ఇది ఇలా ఉండాలి అనే సూత్రం కన్పించదు. సమాజం, చదివిన పుస్తకం, జీవితానుభవం, ఏదైనా కథా రూపంగా దిద్దుకోవచ్చు. కథ అంతా అయ్యాక దానికో మకుటం. అదే శీర్షిక చాలా పేజీలు సాగితే పెద్ద కథ. కొన్ని పుటలకే పరిమితమైతే చిన్న కథ. అంతకంటే చిన్నది కథానిక. దానికంటే చిన్నది కాలం దాటని కథ.

ఇక కొన్ని విశ్వనాథ కథలు పరిశీలిద్దాం.

"య్యోర్విషిఖెయ్" అన్నది కాంగో దేశపు కథ. ఇతడు నీగ్రోల కవి. యూరపు దేశ సంగీతం ఈయన వలన వృద్ధి పొందింది. దీంట్లో "కిసావ్లఇకా" అనే పిట్ట కన్పిస్తుంది. "ఇటికే" అనే నదీ కన్పిస్తుంది. ఈ నది సన్నగా వుండి ఒక కొండలోయలో ఒకె రాతి బెజ్జము నుండి జారిపడి అక్కడ చెట్లపై పడినప్పుడు ఒక సన్నని ధ్వని విన్పిస్తుంది. కిస్సోలికా కూత ఇటిరి "యాకు" మీద పడుధ్వనిలాగా ఉందంటాడు కవి. దాంట్లో ఫ్రాంసు తుపాకి ధ్వనులు విన్పిస్తాయి. దాంతోనే తియ్యని పాట మాయమైపోవునంటాడు. ఇలా కివు మీద కిసోలిన్నా కిసోలికా కివుపై కిసోలికా అంటూ పాట వ్రాశారు విశ్వనాథ. దీంట్లో కొంచెం ముందుకు పోయాక "ఉరిఖిలా"

అనే వ్యక్తి విషిఖెయ్ కాంగోనది మీద వ్రాసిన పాటపాడతాడు. నల్లని కాంగో తెల్లని బుడగలు, పడవలయానం, కడవలు నింపడం, కమ్మనిపాట జిమ్మని చలి ఇలా ప్రస్తావిస్తారు విశ్వనాథ.

వాషిఖెయ్ కవిత్వం ఎలాంటిదో మనకు తెలియదుకదా ఆ భావాలను విశ్వనాథ కథాంశమధ్యంలో అక్కడక్కడా తనదైన శైలిలో వ్యక్తీకరిస్తారు. ఇలా కథల మధ్యలో పాటలు విశ్వనాథ కథలో కన్పిస్తాయి. ఆనాటి రోజుల్లో రచయితల్లోని బహుభాషా పాండిత్యం విశ్వనాథను ఈ కథ వ్రాసేలా చేసింది.

1931 ఆగస్టు భారతిలో "రాజు" కథ కొంతకాలం క్రితం పదవ తరగతి పుస్తకంలో పాఠ్యాంశంగా రాష్ట్రప్రభుత్వం వినియోగించుకుంది.

1945లో రూపవాణి మాసపత్రిక జన్మదిన సంచికలో ముద్రిత కథ "గోలీ మహల్". ఈ కథలో పాదుషా, జాన్వర్‌లు కన్పిస్తారు. జాన్వరులో గల బలం, పాదుషాపై గల విశ్వాసం ప్రదర్శింపబడుతాయి. భాష సరళ గ్రాంథికం. అదొక చీకటి కొట్టుకథ. ఆ చీకటి కొట్టుల్లో స్త్రీ ఆక్రందనము. ఇది 30 ఏళ్ళ కారాగార శిక్ష కథ. ఇందులో ఇద్దరూ ఖైదీలే. ఇందులో వీరు స్త్రీ పురుషులు.

ఆమె 'సుందర చిత్రమును' చిత్రకారుడు గీయనంత సొగసుగా వర్ణించినారు విశ్వనాథ. ఆమె మనసు ఒక పేదపై కూడుకొన్నది. ఆమె తండ్రి ఆమె కోరిక ననుసరించి వివాహం చేశాడు. వాళ్ళు ప్రేమమయైక జీవులు.

పాదుషా ఆమె భర్తకు ఉద్యోగం ఇచ్చి పరాయిప్రాంతానికి పంపుతాడు. అక్కడ ఒక యుద్ధము. దాంట్లో అతడి మరణము. గోరీకట్టబడిన భర్త ఋణము తీర్ప పాదుషా మందిరమునకు పిలుస్తాడు. మళ్ళీ ఆమె అక్కడినుండి తిరిగిరాలేదు. తన బంధువులకు పాదుషా ఉద్యోగమిచ్చినాడు. ఆమె కృతజ్ఞతా భావము ఆమెను పాదుషా భార్యను చేసినది. లైలామజ్నూ భావన ఆమె ప్రతిబింబస్వరూపముగా పాదుషాలో ఒక కవితగాని, పాటగాని, చిత్రముగా పాదుషా సృష్టించలేదు - ఆమె బందీ - ఒక రోజు ఆమె భర్తను చంపినట్లు పాదుషా చెప్పినాడు - కానీ ఆమెకు తన భర్త జీవించే ఉన్నాడని నమ్మకం. ఆమె మరణిస్తే పాదుషా గోరీకట్టిస్తానన్నాడట. అదే గోలీ మహల్. ఆ చీకటి వెలుగులలో 30 ఏళ్ళ జీవనము చేసినది. తన

ప్రియుడు కరీంతోనే ఉన్న ఆలోచన బిగికౌగిలి ఊహల్లోకథ ముగుస్తుంది. ప్రేమ మాధుర్యాన్ని విశ్వనాథ  అందంగా చిత్రీకరించారు.

1948 నాటి కథ "ద్విజాత" ఆంధ్రశిల్పి సచిత్ర మాసపత్రిక ముద్రించింది. ఇది మద్రాసులో విశ్వనాథకు తెలిసిన వృత్తాంతము. విశ్వనాథ చూసిన వృత్తాంతము. నేను చూసిన సామాన్యవ్యక్తి అనతికాలంలోనే మద్రాసులో మహానటి కావడం. ఇవన్నీ మద్రాసు రంగులు. ఈ రంగుల కల విశ్వనాథను ఆ కథ వ్రాసేలా చేసింది. విశ్వనాథకు మద్రాసు జీవితం జీర్ణం కాలేదు. రెండు మూడు కథల రచనతో మద్రాసునుంచి మళ్ళీ ఆంధ్రదేశంలోనే అడుగుపెట్టారు విశ్వనాథ.

1933 మార్చిలో భారతిలో ముద్రితకథ పరిశోధకులు ఇంగ్లీషు భాషా శ్రవణ పఠనాసక్తత ఈ కథాబీజం. ఇతర భాషాకథలు నాండీటేల్‌గా లేదా పాఠ్యపుస్తకంలో భాగంగా ఉంచడం సంప్రదాయం. యం. సీతారామయ్య, జి. రామచంద్రారావు అనే టీచర్ల కథ - ఒక పున్నా అనే శబ్దం punna పన్నాగా చదవాలా, పున్నాగా చదవాలా అనే ఘర్షణ కథా బీజమై - ఇంట్లో పిల్లవాడు చదువుతున్న శిశిర ఋతువు వచ్చెను. వృక్షముల పర్ణములు రాలెనులో పర్ణశబ్దం నుంచి పున్న శబ్దం పుట్టుకొచ్చిందని సమర్థిస్తాడు సీతారామయ్య. రామచంద్రయ్య గారికి ఇలాంటిదే వేదన.

ఇద్దరూ మద్రాసు బయలుదేరారు. మొదటిరోజు పిచ్చిది, రెండోరోజు వెధవముండ, మూడోరోజు కొడుకులు ఎదురొచ్చారు. మొత్తం మీద మద్రాసు చేరారు. అక్కడ ఓ బ్రిడ్జి ప్రక్క మిత్రుడు కన్పించాడు. వీళ్ళ అసలు విషయం చెప్పాలి. మీ సమాధానం మీ ఊళ్ళోనే మీకు ఎదురువచ్చి నాళ్ళు తెలిపారని చెప్పాడు వాడు. ఎదరొచ్చిన వాళ్ళ పదాలన్నీ కలుపుకుంటే వాళ్ళేమైనారో వాళ్ళకర్థమైంది.

ఇలా అక్కరలేని శబ్దపరిశోధనలు జరుగుతున్నాయి. విశ్వనాథ వారి సమయ చమత్కారం - ఇంకా పరిశోధనలున్నాయని వెక్కిరిస్తారీ కథలో విశ్వనాథ.

ఇలా చిన్న చిన్న అంశాలు విశ్వనాథలో కథలుగా మారాయి.

# రావిశాస్త్రి కథల్లో ప్రజాజీవనం

డా॥ ఎన్.వి.ఎన్. చారి

జగద్ధితం సాహిత్యం అన్న ఆర్య ప్రమాణాన్ని పరిపూర్ణంగా విశ్వసిస్తూ తన కలాన్ని, గళాన్ని సమాజ సౌభాగ్యం కోసం వెచ్చించిన, అద్భుత రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి. రావిశాస్త్రిగా జగత్ప్రసిద్ధుడైన ఈయన కథా ప్రపంచంలోనూ, నవలా సాహిత్యంలోనూ తనదైన చెరగని ముద్ర వేసాడనంలో అతిశయోక్తి లేదు. నిజాన్ని నిర్భయంగా చెప్పగల ధైర్యం, నమ్మిన దాన్ని ఆచరణలో చూపుతూ, అక్షరాల్లో ముద్రించే నిబద్ధత కల్గిన రచయిత సమాజాన్ని చైతన్యవంతం చేస్తాడని, ప్రజల్ని వివేకవంతులుగా తీర్చిదిద్దుతాడనడానికి రావిశాస్త్రిని నిదర్శనంగా తీసుకోవచ్చు.

1922 జూలై 30న శ్రీకాకుళంలో సీతామహాలక్ష్మి, నారాయణమూర్తి దంపతుల సంతానంగా ఈ లోకంలో కన్ను తెరిచిన రాచకొండ తన పదమూడవ ఏటనే కథా జగత్తులో పెన్ను తెరిచాడు. దేవుడే చేసాడు, అభాగిని, దయ్యాలకు ద్వేషాల్లేవంటూ కథానిక, రంగస్థలంపై అరంగేట్రం చేసిన నటశేఖరుడాయన.

మత కల్లోలాలకు చలించిన ఆయన హృదయం, మనుషులకే ఈ విద్వేషాలు, దయ్యాలకు ఈ కులమతాలగోలలుండవంటూ ఆక్రోశించింది. "సుందరిని వివాహమాడి నిర్విచారంగా, సంతతానందంగా, ప్రేమోపాసకుడై జీవితం గడపడమా? కష్టపు బ్రతుకుకాలి, తిండికిలేక అల్లాడే రైతుల కష్టాల్ని నిర్మూలించడమా"? అంటూ తొలి కథలోనే తన హృదయాన్ని ఆవిష్కరించాడు. ఆయన మనసు త్రాసు ముల్లు, రెండవ మార్గానికే మొగ్గింది. ఫలితంగా రావిశాస్త్రి గొప్ప ప్రజా రచయితయ్యాడు.

బాల్యం నుండే తన చుట్టూ ఆవరించియున్న స్వార్థ వాతావరణాన్ని పేదరిక ప్రపంచాన్ని ఆయన దర్శించాడు. స్వయంగా పేదరికాన్ని అనుభవించాడు. తండ్రి న్యాయవాదవృత్తిని వారసత్వంగా స్వీకరించాడు. ఆదిలో కఠోర కాంగ్రేసువాదియైనా 1960 నుంచి మార్క్సిస్టు సిద్ధాంతాలచే ప్రభావితుడయ్యాడు. కోర్టులోనే కాదు. తన కథల్లోనూ ఆయనే న్యాయవాది. బీద, బడుగు జీవులకు ఎదురవుతున్న అన్యాయాలను, అధర్మాలను ఖండిస్తూ, ఆర్థిక, సామాజిక న్యాయం కోసం వారి

తరఫున వాదించే న్యాయవాదిగా, ప్రతి కథలో కనిపిస్తాడు. న్యాయమూర్తిగా తీర్పులనూ వినిపిస్తాడు.

సమాజంలో అట్టడుగు పొరల్లో అణగారి పోతున్న, దుఃఖార్తులను పాత్రలుగా చేసుకొని, వారికి జరుగుతున్న దోపిడీని, వారి బాధల్ని అక్షర ఆయుధాలుగా చేసుకొని వాటిని సూటిగా గుండెల్లో నాటేలా చేసి పాఠకుల సానుభూతిని పొందగలిగిన దిట్ట రాచకొండ. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం మాండలికంలో, అట్టడుగు వర్గాలు మాట్లాడుకొనే భాషలో స్పష్టంగా, సమర్థంగా కథనాన్ని పాఠకుల హృదయాలకు హత్తుకొనేలా చేయగల్గిన ప్రతిభాశీలి.

న్యాయవాదిగా జనజీవితాన్ని విస్తృతంగా, పరిశీలించడం, పట్టణ జీవితంలో వస్తున్న మార్పులు, ఆయనలోని రచయితను నిత్యజాగరూకుణ్ణి చేసాయి. అమానుషత్వం పెరుగుతున్న సమాజంలో కష్టాల కడలిలో కూరుకొని, ఊపిరాడక గిలగిలా కొట్టుకొనే వారి ఆరాటాన్ని కథలుగా చిత్రీకరించాడు.

ధనికబంధువుల మధ్య తమది బీద కుటుంబం కావడంవల్ల తనకు కల్గిన ఇబ్బందులూ తోటమాలి కొడుకు అప్పలస్వామి కుటుంబాన్ని పరిశీలించడంవల్ల ఏర్పడ్డ భావనల ప్రభావంతో, ఆయన రచనలు పేద ప్రజల జీవితాలతో ముడివేసుకుని ఉన్నాయని చెప్పవచ్చు.

రావిశాస్త్రి సాహిత్యం నిజానికి, జీవితానికి మిక్కిలి దగ్గరగా ఉంటుంది. పాఠకునికి ఉద్వేగాన్ని కల్గిస్తుంది, కళ్ళకు నీళ్ళను రప్పిస్తుంది. మనసు చెలిమలో కారుణ్యపు ఊట ఊరుతుంది. ఈ వ్యవస్థపై కసి ఏర్పడుతుంది. వ్యవస్థలోని అవస్థలన్నింటినీ తొలగించడానికి పాఠకునికి ఉత్ప్రేరకమవుతుంది.

హాస్య వ్యంగ్యశైలి, చక్కని కథా శిల్పం, కదిలించే కథన విధానం, పాత్రలు పాఠకులకు చిరపరిచితాలైనవిగా ఉంటూ, సంభాషిస్తున్నట్లుగా కనిపించడం, రాచకొండ కలానికి ఎంతో బలంగా చెప్పవచ్చు. పఠనీయత ఆయన రచనల్లో చక్కని ఆభరణం.

కథ వ్రాసినా, నవల వ్రాసినా, అది మధ్యతరగతి పునాదుల్ని కదిలిస్తుంది. డైనమేటై పేలుతుంది. మధ్య తరగతి పేదరికంలో కక్కుర్తి, స్వార్థపరత్వం, దైన్యం, ప్రతి కథలోనూ దోబూచులాడుతూ ఉంటాయి. లంచగొండితనం, ఆశ్రిత పక్షపాతం,

దోపిడి, ఆకలి, అశాంతి, పిరికితనం వంటి రుగ్మతలపై కథాస్త్రాన్ని సంధించే అక్షర యోధుడవుతాడు రావిశాస్త్రి.

దేవుళ్ళూ, రాజులూ, రచయితలూ, మంచిగా ఉండాలి. సంతానానికి సన్మార్గాన్ని చూపించాలని విశ్వసించే రాచకొండ తన కథల్లో, నవలల్లో, అట్లాంటి మంచిమార్గానికి బాటలు వేసాడని చెప్పవచ్చు.

మీరే ఆలోచించండి ! అంటూ రామస్వామి పాత్ర ద్వారా ఒక నిరుపేద కార్మికుడు, ధనికస్వామి ధనమదానికి ఎలా బలయ్యోడో తెల్పుతూ, Haves and Have nots చింతనల్లో తన మార్గాన్ని సుస్థిరం చేసుకున్నాడు. రాచకొండ దృష్టిలో కక్కుర్తి పడి సంపాదించి దాచుకున్న గుమస్తా, దాన్ని అర్ధరాత్రి దోచుకొన్న దొంగ ఇద్దరూ ఒకటే ధార్మిక సంపాదనే స్థిరంగా ఉంటుందన్నది ఆయన విశ్వాసం.

రాచకొండ కథలూ నవలలూ తెలుగు ప్రజల భాషలో అద్భుతంగా ఉంటాయి. 'ఉపమాకాళిదాసస్య' అంటారు పెద్దలు. రావిశాస్త్రి కథల్లోకి వెడితే ఉపమారాచకొండస్య అని మనం అనకతప్పదు. 'సాయంకాలం అస్తమిస్తున్న సూర్యుడిలాగే వాడి ఆశలన్నీ అస్తమించాయి' వంటి అద్భుత ఉపమానాలు ఆయన రచనల్లో కొల్లలుగా ప్రకాశిస్తాయి.

ఆయన రచనా మైదానాల్లో అక్షరాలు జవనాశ్వాలౌతాయి. భావఝురులు ప్రవహిస్తూ, ఆహ్లాదాన్ని కలుగజేస్తాయి. ఆలోచన్ని రేకెత్తిస్తాయి. ఆయన వాక్యాలు, అద్భుత రసాయనాలౌతాయి.

'అత్యవసర పరిస్థితుల్లో నిరుపేదల మీదకే తప్పులన్నీ తోసెయ్యాలన్న న్యాయసూత్రాన్ని ప్రకటించి, నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితిని అవి విశదీకరిస్తాయి.

"దారిద్ర్యం ఎంత దుర్భరమో"

"మరొక అమాయక శిశువును భూమ్మీద కష్టాలపాలు చేయకుండా వెళ్ళిపోయింది"

"దొరకని సౌఖ్యాలకొరకు, తీరని కోరికల్తో, తీరని బాధలతో ఈ జీవితం ఆఖరయ్యే వరకు ఇంతే"

వంటి వాక్యాలు పాఠకుల మనసుల్ని కదిలించి, మానవత్వాన్ని మేలుకొల్పుతాయి.

ప్రిస్క్రైబ్ చేసిన మందులన్నీ మింగి బ్రతకాలని తంటాలుపడ్డ ఎదురింటి మాస్టారుగారూ - అయిదు ప్రాణాలు అకస్మాత్తుగా విడిచేసారు వంటి వ్యంగ్యాస్త్రాలు సంధించి, మధ్య తరగతి సగటు జీవి, జీవితాల్లోని 'విత్త' రహస్యాల్ని, శోధనల్నీ, ఆశా, నిరాశల్నీ ప్రతిబింబింపజేసాడు.

రాచకొండ కవితాత్మ వర్ణనల రూపంలో అనేక కథల్లో, ముఖ్యంగా నవలల్లో ప్రకాశిస్తూ ఉంటుంది. స్వభావోక్తులతో కూడిన వర్ణనలన్నీ సందర్భోచితంగానే సాగుతాయి. అవసరమయినప్పుడే మెరుస్తాయి.

కోర్టులనూ, ప్లీడర్లనూ, డాక్టర్లను, గుడెసెల జనాలను అనునిత్యం పరిశీలిస్తూ సామాన్యుల జీవితాల్ని కథల్లో, నాటకాల్లో, నవలల్లో వ్రాసిన తీరు అనితర సాధ్యం. తనచుట్టూ జరుగుతున్న సంఘటనల్ని కథలుగా మార్చి, సామాన్య జనాన్ని ఏమార్చే వారి జీవనసరళిని పాఠకలోకం ఏవగించుకోనేలా చేసాడు. తన మిత్రుడు దంతవైద్యుడు తన ప్రత్యర్థి శివరాత్రి నాడు మరణించినప్పుడు అసంకల్పితంగా రాచకొండతో "మరి వాడి పాపాలన్నీ ఏటైపోనూ" అన్నాడు పర్యవసానంగా 'పాపి' కథ ఆవిర్భవించింది. అరుసారో కథల్లో చేరింది.

తాను ఏ ఇజాన్ని నమ్మినా నిజాన్ని వీడలేదు, మంచి, చెడుల మధ్య స్పష్టమైన అవగాహనతో, తన అవసరాలనీ, ఆశయాల్నీ గుర్తించి, అవసరాలకంటే ఆశయాలకే పెద్ద పీట వేసిన మహానుభావుడు విశ్వనాథశాస్త్రి.

మద్యపాననిషేధచట్టం తెచ్చిపెట్టిన అనేక దుష్పరిమాణాలను చిత్రిస్తూ అసామాన్యంగా వ్రాసిన "ఆరుసారా కథలు" తెలుగు సాహిత్యంలో ఒక కొత్త విప్లవాన్ని సృష్టించాయి.

శ్రీశ్రీ చెప్పినట్లు రసం లేనిదే సృజనకాదు సృజన కానిదే రచనకాదు. రావిశాస్త్రి రచనల్లో రసానుభూతి సమృద్ధిగా ఉంటుంది. ఆ రసాన్ని కొలిచే తూనికరాళ్ళు లేవు - అది అనుభూతి ప్రధానమైంది. రచయితల్లో రసదృష్టి ఉన్నందువల్లే స్వార్థం మీద, దౌష్ట్యం మీదా పోరాటం సాగుతూ ఉంటుంది. తెలుగునాట ఆ మూగవాని ప్రక్కన నిలబడి, బడుగు మనిషికి అండగా రచనా శతఘ్నుల్ని పేల్చిన కవి శ్రీశ్రీ అయితే కథకుడు రావిశాస్త్రి అవుతాడు. శ్రీశ్రీ సాహిత్య ప్రభావం రాచకొండపై ఉంది. అందుకే కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, అరటితొక్క వంటివి కావేవీ కథకనర్హం అంటూ 'బుక్కుల్ని' అద్భుత కథలుగా ఆవిష్కరించాడు.

ముళ్ళపూడి వెంకటరమణ "ఋణానందలహరి" వ్రాస్తే రాచకొండ 'బాకీ' కథల్ని సృజించాడు. ఆయన కథల్లో రచయిత కనిపించడు. పాత్రలే పలకరిస్తాయి. బాధల్ని పంచుకుంటాయి. పాఠకులు తమతో అనుబంధం పెంచుకొనేలా చేస్తాయి. రాచకొండ రచనలు రాశిలోనూ వాసిలోనూ అగ్రతాంబూలం పొందాయి. కథాసాగరం, ఆరు సారా కథలు, రాచకొండ కథలు, ఆరుసారో కథలూ, కలకండి, బానిస కథలు, ఋక్కులు, కాలాను క్రమంగా వెలువడి, వాడి, వేడిగల కథలుగా పేరుగాంచాయి. రాచకొండను కథక సామ్రాజ్య సింహాసనాధీశుణ్ణి చేసాయి. శ్రామిక వర్గానికి, మధ్యతరగతి సమాజపు వ్యక్తులకు, వారి సమస్యలకు తన కథల ద్వారా సులభమైన రీతిలో, పరిష్కారాలు చూపించిన బాధ్యతగల రచయిత రాచకొండ.

సమాజంలో సగమైన స్త్రీకి జరుగుతున్న దురాగతాలను విశాలాక్షి, ముత్యాలు, మరిడీ మహాలక్ష్మి, విమల వంటి పాత్రల ద్వారా ప్రశ్నించి, సమాజంలో ఆడదాన్ని అంగడిబొమ్మలాగా చేసి ఆడించే స్థితిని నిరసించడం రాచకొండ కథలో కనిపిస్తుంది.

"జేబుల్లో డబ్బులేసుకు వెళ్ళే వాళ్ళు ప్రజలు! అవి కొట్టేసి బ్యాంకులో దాచుకొనేవాళ్ళు ఎంటర్ ప్రైజ్‌గాళ్ళంటూ" దోపిడీ విధానాన్ని చెప్పాలన్నా,

"ఈ కమర్షియల్ సివిలైజేషన్లో, ధరల్లేని బజారులో, ఒకనాటి రాత్రి వెలలేనిదాని విలువ రూపాయిన్నరంటూ" పతనమవుతున్న విలువలను బాధా తప్తహృదయంతో వివరించాలన్నా, స్త్రీని "ఒక వస్తువుగా భావించే క్రయవిక్రయాల మార్కెట్లో అంగడి బొమ్మగా" నిలపడాన్ని నిరసించాలన్నా,

"మనలాంటి వాళ్ళం కడుపు కక్కుర్తికి నిన్నూన్నా, బక్కరి బిక్కిరి పాతికరాళ్ళు సంపాదిస్తే, గెద్దలన్ని చేరి పిచికలమీద ఆరోపణల్లా, వాటి గురించి విచారణలు చేస్తూ, ఆపైన శిక్షలూనూ" అంటూ న్యాయవ్యవస్థపై, దోపిడి రాజ్యంపై, వ్యంగ్యాస్త్రాలు విసరాలన్నా,

"మరొక అమాయక శిశువుని ఈ భూమ్మీద కష్టాలపాలు చేయకుండా ఆవిడ వెళ్ళిపోయింది" అంటూ మోసగించబడ్డ అభాగినుల బాధల్ని తలకెత్తు కోవాలన్నా,

"నీరజ ఆల్‌వేస్ మిసెస్ ద బస్" ఎప్పటికి మిస్‌గానే మిగిలిన నీరజలాంటి వ్యథార్థ, యదార్థ జీవితాల్ని ఆవిష్కరించాలన్నా,

"బొట్టు లేని ముఖాన్ని తన పైటచెంగుతో తుడిచింది" అంటూ ధ్వనితో వాస్తవాన్ని మెరుపు మెరిపించాలన్నా,

"మానవులం ఉండేది మూన్నాళ్ళు, అందరం కలిసి శ్రమపడితే అందరికీ సుఖం ఉంది. ఆపాటి దానికి మరొకర్ని మాపేసి మనమే బాగుపడాలంటే అది ఆఖరికి బెడిసికొడుతుంది రంగమ్మా" అంటూ ఒక పరివ్రాజకునిలా బోధ చేయాలన్నా, జీవిత మార్గాన్ని బోధించాలన్నా.

రాచకొండ లాంటి రచయితకే సాధ్యం. నిబద్ధతా, సమాజానికి మేలు చేయాలన్న తపన, అట్టడుగు వర్గాల బాధల్ని తన బాధలుగా భావించే రచయితల కలాల్నుండే అమృతవర్షం కురుస్తుంది. సమాజంలో వివేకం నింపుతుంది. రాచకొండ కథల్లోని, ప్రతినామక పాత్రలన్నీ, నిజజీవితంలో కనిపిస్తూనే ఉంటాయి.

ప్రతివాడూ తాను వ్రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో ఏ చెడ్డకు ఉపకారం కలిగిస్తుందోనని ప్రతి రచయితా ఆలోచించాల్సిన అవసరం ఉంది. మంచికి హానీ, చెడుకు సహాయం చేయకూడదు" అంటాడు రాచకొండ.

పేదరికాన్ని ద్వేషిస్తూ, పేదల్ని ప్రేమిస్తూ జీవితంలోనూ, సాహిత్యంలోనూ నిజాయితీగా, నిబద్ధంగా వ్యవహరించాడు. రచనల్లో గొప్పదనం ప్రయోజనాన్ని బట్టి ఉంటుంది. దాని ప్రయోజనం సంఘంలోని జన సామాన్యపు ప్రయోజనాలతో కలిసిపోతే, దానితో కళానైపుణ్యం చేరిపోతే అది కలకాలం నిలిచిపోతుంది అన్న భావనతో వెలువడ్డ రాచకొండ రచనలు సార్వజనీనమైనవి.

"సర్వజీవజాలాన్ని సమన్వయపరచి, సమానత్వాన్ని సాధించి, న్యాయం నిలబెట్టి ధర్మ సంస్థాపనకు తాపత్రయపడేది మానవుల్లో కోటికి ఒక్కడే! కోటికి ఒక్కడైనా మానవుడు మానవుడే" అంటూ ఇల్లు కథని ముగించి, 1993 నవంబర్ 10నాడు తన పెన్నును శాశ్వతంగా మూసాడు.

పీడితతాడిత ప్రజల పక్షాన న్యాయంకోసం పోరాడుతూ, విరసం వ్యవస్థాపకులలో ప్రముఖుడై నిలిచి, బాధాసర్పదష్టులకోసం, దగా పడ్డ తమ్ములకోసం అవిశ్రాంతం కలంతో, గళంతో పోరాటం చేసి విశ్రమించిన, రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలు ప్రజాజీవితాలను ప్రతిబింబిస్తూ అజరామరాలయి నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

# పి.వి. నర్సింహారావు కథలు "సమాజం - శిల్పం"

డా॥ సంగనభట్ల నర్సయ్య

భారతదేశానికి ప్రప్రథమ దక్షిణభారతీయ, తెలంగాణ ప్రాంతీయ ప్రధాని శ్రీ పి.వి. నర్సింహారావు గారు. కరీంనగర్ జిల్లావారైన శ్రీ పాములపర్తి వెంకటనరసింహారావు గారు వివిధ రాజకీయ పదవులు నిర్వహించినా, మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధాని పదవుల్లో అనేక నిమ్నోన్నతాలు చవిచూసినా, వస్తుతః రాజకీయ కోవిదుడు (స్టేట్‌మన్)గా, దీర్ఘదర్శిగా, దేశభక్తునిగా, సామాజిక విప్లవకారునిగా, ఆర్థిక సంస్కరణాశీలిగా, దేశప్రజల, రాజకీయ నాయకుల మేధావుల నీరాజనాలందుకొన్నాడు.

పి.వీ. మౌనాన్నే భాషగా మలచుకొన్నవాడు. ఆలోచనలకు, ఆచరణలకు దూరం తగ్గించినవాడు, పరిస్థితుల వాడికి, వేడికి వ్యూహాత్మకంగా ఆలస్యపు చల్లదనాన్ని జోడించినవాడు, అసంధిగ్ధాల్లో సంధిగ్ధాన్ని, సంధిగ్ధాంశాల్లో అసంధిగ్ధాన్ని చాతుర్యవంతంగా ప్రదర్శించినవాడు, దార్శనికుడు, దృఢమనస్కుడు, ఫలాపేక్ష లేక అపకీర్తికి వెరవక నమ్మిన ఆదర్శాలను ఆచరించిన నాయకశిఖామణి.

ఈ లక్షణాల వెనుక అతని మేధ, నిరంతర చింతన, బహుముఖీన భాషా సాహిత్యాధ్యయనం, బహ్వాంశగ్రంథపఠనం, అనుశీలన, అనుసృజనాశక్తులు చోదక శక్తులుగా ఉన్నాయి. ఇతర రాజకీయ నాయకులలో కన్పించని సాహిత్యకోణం ఈయనలో, సృజనాత్మకతతో నిబిడీకృతమై, రచయితగా, సామాజిక నిబద్ధతను మృదుహృదయాన్ని, కళాత్మతకను ఆవిష్కరించింది.

బహుభాషా ప్రాంతాల్లో విద్యార్థిగా నివాసం, ఉద్యమ జీవితం, పాశ్చాత్య భాషాజ్ఞానం, న్యాయవాదివృత్తి, బూర్గులవారి సాహచర్యం, ఓరుగల్లు మిత్రుల కూరిమి ఇవన్నీ అతన్ని పరిపూర్ణమైన సాహితీమూర్తిగా నిలబెట్టాయి. బహుభాషా పండితుడైన పివీ నాలుగు భాషల్లో రచనలు చేశారు.

1945-52 సం.ల మధ్య పాములపర్తి సదాశివరావు గారితో కల్సి వరంగల్ నుండి 'కాకతీయ' పేరుతో పత్రిక నడిపారు. 'జయవిజయ' పేరుతో రచనలు చేసారు. ఈయన తెలుగు కథలు రెండు 1. రామవ్వ, 2. మంగయ్య అదృష్టం ఈ

సంచికల్లోనే. 'మంత్రిగారు' అనే మరో కథ అచ్చైందిట ! మారుపేరుతో మరికొన్ని కథలు రాసినా వాటికర్తృత్వం గూర్చి నిర్ధారణ చేసే వారెవ్వరూ నేడు బతికిలేరు.

పీవీ నర్సింహారావు గారి రచనల్లో ముఖ్యమైనవి నవలల్లో ఇన్‌సైడర్ (ఆంగ్ల నవల – మౌలిక రచన), సహస్రఫణ్ (విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు'కు హిందీ అనువాదం), అబల (ఆప్టే రాసిన మరాఠీ నవలకు తెలుగు అనువాదం) అనేవి. కథల్లో బెంగాల్ క్షామం గూర్చిన ఆంగ్లంలో రాసిన కథ, దేశవిభజన కాలం నాటి దురాగతాలపై రాసిన బ్లూ సిల్క్ సారీ (అంగ్ల కథ) తెలుగులోరాసిన (గొల్ల) రామవ్వ, మంగయ్యా అదృష్టం అనే రెండు కథలు. (ప్రస్తుత వ్యాసం ఈ రెంటి మీదే). సాహిత్య విమర్శా వ్యాసాల్లో 'ఛాయావాదీ కవయిత్రి మహాదేవీవర్మ రచనా వైశిష్ట్యం', 'విశ్వనాథ సాహిత్యం' (ఆంధ్రప్రభ 1971) వేయిపడగలు – పండిత ప్రశంస (హిందీలో), డాక్యుమెంటరీ (వాస్తవచిత్రణ) గా 'బాబ్రీమసీదు' అనేగ్రంథం (తెలుగులో అనువాదం ఐంది కూడా), కవితల్లో "నిర్మాణ నిశీథిని మానిసి మేల్కొంచినాడు" వంటివి ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

పీ.వీ. కథల్లో ముద్రితాలై అందుబాటులో ఉన్న రెండు తెలుగు కథలు 1. గొల్ల రామవ్వ, 2) మంగయ్యా అదృష్టం అనే వాటిని పరిశీలిద్దాం.

గొల్ల రామవ్వ కథ ముద్రణలో గొల్ల అనే పేరు లేదు. తరువాత ఎవరో పెట్టింది. ఈ కథ ఒక్కటి చదివితే చాలు పీవీ ఎంత గొప్ప కథకుడో తెలుస్తుంది. ఈ కథావిర్భావానికి నేపథ్యం చాలానే ఉంది. పీవీ స్వయంగా వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నవాడు. ఉద్యమ వీరుల గాథలు, రహస్యజీవితం, విప్లవసాహిత్యం, విప్లవ సామగ్రి గురించి ప్రత్యక్షంగా ఎరిగి ఉన్నవాడు. కథాకాలానికి తెలంగాణలో ప్రతి సభను నైజాం ప్రభుత్వం రాజకీయ సభగా భావించి, నిషేధించింది. ఇంగ్లీషు వాళ్ళ తొత్తరికం, స్వదేశ జనుల నుండి వైరం ఈ రెండు నిజాం ప్రభుత్వంలో మిగతా రాజరికానికంటే భిన్నమైన అణచివేతకు కారణాలైనాయి. నిజాం పక్షమే వహించిన తొలినాటి ఆంధ్రమహాసభ ఖమ్మంలో 3వ ఆంధ్రమహాసభ జరుపుకోవడానికి అనుమతికై 3 సం.లు (1931-34) ఆగవలసివచ్చింది. ఆర్యసమాజం (ఏడవ) నిజాంపై ప్రత్యక్షపోరు ప్రకటించింది. హిందూ మత పౌరు హక్కులకోసం పోరాడింది. నాటి జాతీయోద్యమానికి ఇది ఈ ప్రాంతంలో అదనపు

ఉద్యమంగా సాగింది. 1938 ప్రాంతంలో ఇది ఒక పెద్ద ఉద్యమంగా తెలంగాణలో సాగింది. నిజాం ఏలుబడి కారణంగా స్వాతంత్ర్యోద్యమం ఒకింత ఆలస్యంగా తెలంగాణాలో మొదలైనా, ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమం, ఆర్యసమాజం, తెలంగాణ రైతాంగ పోరాటం 20వ శతాబ్దిలో 1920,30,40,50 దశకాల్లో తెలంగాణని ఉడికించాయి. పీవీ ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం కల్గి ఉన్న కారణంగా ఈ కథను ఇంత బలంగా చిత్రీకరించగలిగినాడు.

గొల్ల రామవ్వ కథలో ఉద్యమకారుడైన యువకుడు పోలీసుల నుండి తప్పించుకొని రామవ్వ ఇంట్లో జొరబడగా, రామవ్వ ఉద్యమం పట్ల సానుభూతి పరురాలైనందున అతణ్ణి ఆత్మీయునిగా భావించి రక్షించడం ఇందులో కథ.

మంగయ్య అదృష్టం రాజకీయ వ్యంగ్యకథ. దేవతల లోకంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, అక్కడి ఆచరణలోని లొసుగులు, దేవతలు మానవాధముణ్ణి పరీక్షకు నమూనాగా తీసికొనుట, చేతగాని చవట ఐన మంగయ్య రాజకీయాల్లో ప్రతిభాహీనుడైనా అద్భుతంగా రాణించినట్లు వ్యంగ్యంగా చిత్రించడం జరుగుతుంది.

రామవ్వకథలో సూటిదనం ఉంటుంది. వ్యంగ్య స్పర్శలేదు. మంగయ్య అదృష్టంలో వ్యంగ్యం అధికం రామవ్వకథలో జానపద నేపథ్యం గ్రామీణ పాత్రలు, 'మంగయ్య'లో స్వర్గం, పట్టణాలు నేపథ్యం, పరిణత పాత్రలు ఉన్నాయి. 'రామవ్వ'లో వ్యవస్థను వ్యతిరేకించే విప్లవపాత్రలు, 'మంగయ్య'లో వ్యవస్థలోని పాత్రలు రాజకీయాలు, చట్టసభలుంటాయి. 'రామవ్వ' భాష, సంభాషణలు, ప్రవర్తనలు పూర్తిగా జానపదం. "మంగయ్య"లో భాష పూర్తిగా దేవతల భాష. సంస్కృత సమాస భూయిష్ఠం. కథనం (పీవీ కథనంలో కూడా) సంస్కృత మిశ్రిత తెలుగే కనబడుతుంది. భాషను ఈ రెండు కథల్లో పీవీ చాలా చాతుర్యంతో సంకేతాత్మకంగా చిత్రించాడు. 'రామవ్వ' నేలను వదలనిది మట్టి వాసనలది. 'మంగయ్య' ఆకాశంలోనివాడు. దేవతాసంబంధి. నాగరిక వాసుడు.

'మంగయ్య అదృష్టం' రాజకీయ వ్యంగ్యం భూమికగా గలది. దేవతలలోకంలో మానవలోకంలో వలె ఉన్న ప్రజాస్వామ్య ప్రభుత్వం. ఇక్కడివలెనే లొసులుగు, నిర్లిప్త అధికార యంత్రాంగం, తిరుగుబాట్లు వంటివి కనబడతాయి. ఏ అర్హతా లేని ఒక మానవుణ్ణి (మంగయ్యను), నిరర్థకమైన వ్యక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎలా చేయవచ్చో, ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్యం ఎలా పరిహాస

పాత్రమయిందో వ్యంగ్యంగా చిత్రించడం జరిగింది. కథనిండా వ్యంగ్యం ప్రాణంలా నడుస్తుంది. ప్రతి దేవతా ప్రవర్తన మనిషి ప్రవర్తనలానే ఉంటుంది. ఈ కథనం పాఠకునికి మనిషి ప్రవర్తనపై కొరడాలా ఛళ్ళుమనిపిస్తుంది.

"మానవులకు వలెనే దేవతలకు కూడా ఇష్ట్యాకన్నా తగాదా ప్రాముఖ్యమే అధికం". "దేవలోక సమన్వయ సంఘపు ప్రత్యేక సమావేశం దేవలోక అసాధరణ గెజిట్లో ప్రకటించి ఏర్పాటు చేయడం జరిగింది". "సమావేశంలో ప్రతి సభ్యుడు టి.ఎ., డి.ఎ., అలవెన్స్ ఫారాలు తీసుకొని తప్పులు లేకుండా నింపుతున్నారని సభాకార్యక్రమంపై దృష్టి లేకుండా సభ్యులు వ్యవహరిస్తున్నారని" పీవీ చెపుతారు.

దేవతలు మనిషి సృష్టించుకున్నవే అయినా పీవీ భాషలో ఈ అంతస్సారం ఇలా వ్యంగ్య భూయిష్ఠంగా ఉంటుంది. గాడిద తన ఇష్టదేవతను ఊహించుకొమ్మంటే ఒక మహాగాడిదను ఊహించుకుంటుంది అని అంటారు. మనుషులు కూడా తమ ఇష్టదేవతలను, ఊహామూర్తులను మనుష్యుల్లాగే ఊహించుకుంటారు. విష్ణువెలా ఉంటాడు. శివుడెలా ఉంటాడు. మనిషిలానే ఉంటాడు. మనిషిలాగా ఆలోచిస్తాడు. మనుష్యులు కుత్సితాలను, కుతంత్రాలను, కొట్లాటలను, సయోధ్యలను దేవతలకాపాదిస్తారు. మొత్తం కథంతా వారి మీదే నడుస్తుంది. పురాణపాత్రలు, వాటి స్వభావాలు ఇక్కడ కథలో చక్కగా వివరింపబడతాయి.

సృష్టిని నిర్వహించే విష్ణుమూర్తి, అంతం చేసే శివుడు, డబ్బు దస్కం ఆధిపత్యం వహించే లక్ష్మీదేవి, ఆరోగ్యదేవత ధన్వంతరి, ప్రైవేట్ సైన్యంలాంటి ప్రమథగణాలు.. ఆర్థికమంత్రి కుబేరుడు - ఇలా శాఖలు, శాఖాధిపతులు, వాళ్ళ విధులు మనుష్యుల ఆలోచనల్లోంచే పుట్టాయిగదా ! గాడిద ఊహల్లో స్వర్గం అంటే స్వర్గాధిపతి ఇంద్రుడూ గాడిదలానే ఉంటాడు గదా (ఇంద్ర గాడిద). మనిషి తన ఊహల్లో పులినో, గాడిదనో, లేడినో మనిషిపై స్థానాల్లో ఊహించడుగదా ! పురాణ పాత్రలు మనుషుల్లా ప్రవర్తించి, దేవతల లోకసభ సమావేశాలు వగైరానడుపుతారు.

వ్యంగ్యంతోబాటు ఈ కథలో పీవీ సునిశిత హాస్యాన్ని కూడా ప్రదర్శించారు.

1. బ్రహ్మగారి నాలుగు ముఖాలపై ఆదితాళంతో చెంపదెబ్బలు చరిచినట్లు వినపడ్డాయి. (సరస్వతీదేవి ప్రసంగం తరువాత చప్పట్ల గురించి రాస్తూ అంటాడు)

2. బ్రహ్మ సభను కలియతిరిగి చూసే అవసరం లేదు(ట) నాలుగు ముఖాలతో సభను కట్టడి చేసారు(ట) !

3. బాంబులు పెట్టడం వల్ల "...... అక్కడే హాజరై ఉన్న యమరాజుకు తలవని తలంపుగా బోనస్‌కింద అనేక ప్రాణాలు హస్తగతమయ్యాయి."

4. మంగయ్యకు పార్టీ అభ్యర్థిగా నిలబడ్డ ఎన్నికల సమయంలో ఐన చిన్న గాయానికి – అనేకంగా – కట్లుకట్టి "...... అపుడో ఇపుడో చచ్చిపోవడం ఖాయం అన్నట్లు ఓటర్లందరికి కనిపింప జేసాడు(ట) డాక్టరు.

5. "తనకు చేతకాని పనిని పక్కవాడి ఒడిలో పడేయడంలో కలిగే హాయి".

6. "కంటి స్పెషలిష్టుకు కాలెక్కడుంటుందో తెలియనట్లు" (ఈ కథ పీవీ రాసేనాటికి వైద్యలోకంలో స్పెషలిస్టు ప్రభంజనం ఇంకా అంతగా రాలేదు. మన శరీరాల్ని అంగాంగాలు పదులకొద్దీ స్పెషలిస్టు డాక్టర్లు పెంచుకోవడం పీవీ క్రాంతిదర్శిగా 50వ దశకంలోనే రాయడం అద్భుతం. ఈ కథ యాభై ఎనిమిది సంవత్సరాల క్రితంది.

'మంగయ్య అదృష్టం'లో భాష కూడా ఇతివృత్తంలాగా గంభీరంగా ఉంటుంది. సంస్కృత సమాసాలు విరివిగా వాడినాడు. 'మనోమోహకంగా', 'శుభ్రవస్త్రావృతా' (సరస్వతీదేవిని గూర్చి "యాకుందేందు" శ్లోకంలోనిది వాడుకున్నారు), 'భాగ్యలేఖనశాఖ' 'మహోద్యమానికి సారథ్యం' 'ఉద్రేకాతిరిక్తం', 'మనోవాచామ గోచరాలైన' (విష్ణు భగవానుని లీలలు), 'గతంగోష్ఠి' జోరుగా సాగుతోంది. వాక్యంలోని గతం గోష్ఠి ('గతంగోష్ఠినకర్తవ్యం' లోనిది సందర్భసహితంగా వాడినాడు) "ఒక నిరంతర నిరాశవాది దేవుడు", "మాతృదేశసేవాసందర్భం", 'కింకర్తవ్యతామూఢులు', 'బ్రహ్మవిరోధదేవతామూరా', "భక్తసమూహంతో ఓతః ప్రోతంగా" వంటి ప్రయోగాల వెనుక పీవీగారి సాంప్రదాయిక అధ్యయన బలం, సంస్కృతభాషా పరిచయం ఉంది. దేవతల మధ్య జరిగిన కథగనుక ఈ భాషను విశేష సంస్కృత రూపంగా వాడుకొన్నాడు.

'గొల్లరామవ్వ' అద్భుతమైన కథ. ఒక మహోత్కృష్ట కథా రచయితగా పీవీని నిలబెట్టే కథ. భాషలో, సంభాషణల్లో, కథన రీతిలో, నాటకీయతలో, వేగోక్తిలో, పరిసర కథనంలో, ఏకపాత్రాశ్రిత కథా సంవిధానంలో, ఉద్వేగభరిత

ఘటనాశ్రయంలో, దానికదేసాటి. ఉద్యమకారుడైన యువకుడు పోలీసుల నుండి తప్పించుకొని, గొల్లరామవ్వ గుడిసెలో చొరబడతాడు. రామవ్వ ఉద్యమం కోసం, సమాజం కోసం అతని అవసరాన్ని గుర్తించి పోలీసులను మాయచేసి, వారిని నమ్మించి, యువకుని తన ఇంటివానిగా చూపించి, ధైర్యంగా సమస్యను అధిగమిస్తుంది. ఇందుకోసం ఆమె నాటకీయంగా ప్రవర్తించే విధానం, ఆమె వ్యూహాలు, ఆమె భాష, ముగ్ధత్వం, ప్రౌఢత్వం, ధైర్యం కథను అసమాన సదృశంగా నడిపిస్తుంది. ఈ కథన కళలో పీవీ అద్భుత ప్రతిభ కనపరిచాడు.

వేగోక్తి కథనం ఈ కథలో మరో విశేషం. కాలక్రమం అవసరమై, మధ్యలో సంఘటనల కాలాన్ని నిర్విశేషమైనపుడు కత్తిరించి, ఒడుపుగా కథను వేగవంతం చేస్తాడు. ఆ కథ కాలాన్ని జవాబులక్కర్లేని రామవ్వ సణుగుడు ధోరణిలో ప్రదర్శించి, అవతలి పాత్ర జవాబులక్కర్లేకుండా కథ నడుస్తున్నట్టు చిత్రించడంలో పీవీ నైపుణ్యం సాధారణ పాఠకునికి కూడా అందుతుంది. దీంతో కథా విస్తృతి తగ్గి, సంక్షిప్తత పాటింపబడింది.

"నీకెందుకే మొద్దుముండా? గిదేందీ? గదేంది? ఎప్పటికీ అడుగుడే? ఏదో మునిగిపోయినట్టు - అన్నీ నీకేకావాలె" రామవ్వ యొక్క ఈ సంభాషణలో తెలంగాణ మాండలికం ఉంది. 'మంగయ్య అదృష్టం' కథకు భిన్నమైన భాష. తెలంగాణ భాషలో మొదటి మాండలిక భాషా కథ ఇది. పీవీకి ముందు తెలంగాణ మాండలికంలో కథ గాని నవలగాని లేదు. ఐతే దీంట్లో కథనం సాధారణ వ్యవహారికంలో, సంభాషణలు మాత్రం (గొల్ల రామవ్వవి) తెలంగాణ మాండలికంలో నడుస్తాయి. గుడిసెలోకి హఠాత్తుగా చొరబడిన ఆగంతుకుణ్ణి (విప్లవవీరుణ్ణి) చూసి ముసలి రామవ్వకు ముందు భయం, తరువాత విశ్వాసం కల్గాయట ! "విశ్వాసం రాదు, విశ్వాసేచ్ఛ, విపద్దశలో గోచరించిన ఏకైక తరుణాధారం" ఇలా కథన భాష నడుస్తుంది.

రామవ్వ భాష మీద రామవ్వే వ్యాఖ్యానించడం ఈ కథలో విశేషం. పోలీసులను మోసం చేసి, ఉద్యమకారుణ్ణి, తన ఇంటివాడనీ తన మనుమరాలు భర్తనీ, నిరూపించడానికి చేసిన యత్నంలో అతనికి గొల్లవాని వేషం వేయిస్తుంది. వేషం వరకు పర్వాలేదు. గొల్లవాని భాష రావాలి పోలీసులతో మాట్లాడితే ఇతని భాషతో బయటపడిపోతాడు. "అచ్చం ఎర్రగొల్లోనోలిగేనే ఉంటవు. ఎవడన్న

మాట్లాడతే గొల్లోనోలె మంచిగ మాట్లాడాలె" ! అని రామవ్వ సంభాషణ భాషతో పట్టుబడే అవకాశం ఉందని హెచ్చరిక చేస్తూ మాట్లాడిందాంట్లో "గొల్లోనోలె మంచిగ" అనడంలో 'మంచి' అనేది గొల్లవాని మాండలికం తన భాష మంచిదనీ, గొల్లయాస, బాస అని రెండు రకాల సూచన ఉంది.

కథలో నరాలు తెగే ఉత్కంఠ నిర్వహింపబడింది. యువకునికేమో పారిపోవాలని, రామవ్వకేమో ఇతన్ని గుడిసెలోనే ఉంచి, పోలీసుల ముందు అబద్ధాలు చెప్పి, వారిని మోసగించి, ఈ యువకుణ్ణి (ఉద్యమకారుణ్ణి) కాపాడాలని యువకునికి ముసల్దాని ప్రణాళిక అర్థంకాదు. పైగా తనను మోసం చేసి పట్టిస్తుందేమోనని, లేదా అశక్తస్థితిలో (పారిపోలేని స్థితిలో) పోలీసులకు దొరికిపోతానేమోనని భయం. తన మనుమరాలి మగనివలె నటింపజేసి దాచాలనుకుంది. ఒక్కో ప్రణాళికలో గొల్లరామవ్వ చూపే నేర్పు - యువకునికీ అర్థం కాదు. పాఠకునిక్కూడా.

మనుమరాలితో బాటు యువకుణ్ణి మంచంలో పడుకోమన్నప్పుడు (భార్యాభర్తల్లా నడిస్తూ), తాను ఇక పట్టుబడటం ఖాయం అనుకొంటాడు. "యువనికునికెటూ తోచలేదు. ఇంతకూ తుదకు పట్టుబడటమే నొసట వ్రాసియున్నట్లుంది. ఇలా మంచంలో పడుకోవడం వల్ల లాభమేమో ఇతనికి బోధపడలేదు. రామవ్వ ప్రణాళిక సగటు పాఠకునికి కూడా అర్థం కాదు. ఆమె అంత త్యాగం (పరపురుషుని పక్కలో మనుమరాలిని పడుకోబెట్టడం - పోలీసుల కన్నుగప్పడంకోసం) చేస్తుందని అనుకోలేం. చదువురానిది, పల్లెటూరిది, ముసల్ది, సంప్రదాయాలకు ప్రాణమిచ్చేది - ఉద్యమం కోసం ఇంత సాహసం చేస్తుందను కోలేం.

కథను నడపడానికి వాడే 'వేగోక్తి కథనమే' గాక పాత్రల మధ్య ఘర్షణాత్మక భావాలు, అంతరంగ కథనాలు ప్రదర్శించడంలో పీవీ గొప్ప కథకునిగా నైపుణ్యం ప్రదర్శించాడు. "ఏమంటుందో? ఈ వృద్ధురాలు? శతాబ్దాల దాస్యమనుభవించి దళితమైన ఈ అమాయక గ్రామీణ సమాజంలో తేజమెక్కడ శేషించింది? ఎలాగైనా ఈ 'గుడిసె ఆశ్రయం' నుండి తనకుద్వాసన జరిగి తీరుతుందని అతనికి తోచింది". కథనమే కాదు ఉద్వేగభరిత వర్ణనం కూడా సాగిన తీరు అసదృశం. "తుపాకి గుండ్ల మధ్య విహరించే ఆ వీరయువకుడు, రాక్షసులనైనా నిర్భయుడై ఎదిరించే ఆ శూరశిఖామణి, దేశకల్యాణానికి ప్రళయాన్నైనా ధిక్కరించే ఆ తరుణసింహం, నేడొక్కడబ్బైయేండ్ల ముసలవ్వ ప్రశ్నకు జంకాడు" వంటివి ఉదాహరణలు.

మరే కథలో కనబడని బొమ్మాబొరుసు వంటి సంభాషణా చాతుర్యం రామవ్వలో కనబడుతుంది. గుడిసె తలుపు అవతల పోలీసుల పిలుపు, తలుపులోపల యువకుణ్ణి దాచే ప్రణాళిక ఆచరణ, ఒకే వ్యక్తి (రామవ్వ) నోట రెండురకాల సంభాషణలు. పోలీసులకు గట్టిగా 'ఆకాశభాషణం'లో జవాబులు, లోపల మెల్లగా తగ్గుస్వరంతో త్వరగా ఏర్పాట్లు, పోలీసులతో వాళ్ళను పోలీసులుగా గాక దొంగలనుకుంటున్నట్లు భావింపజేస్తూ గట్టిగా మాట్లాడుతూ కాలయాపనచేయడం, ఈ సమయాన్ని లోపల మెల్లనైన గొంతుతో, వెర్రిమనుమరాలికి సూచనలు, ప్రణాళిక అర్థం కాని యువకునితో ఆచరింపచేయడం, ఇక్కడ పీవీ సంభాషణా నిర్వహణం అద్భుతం. అందుకే బొమ్మాబొరుసు సంభాషణశైలి అన్నాను. నాణెం బొమ్మను చూపి, తక్షణమే బొరుసును చూపుతున్నట్టు రామవ్వ సంభాషణ, లోపలివారికోసం, బయటివారికోసం, నిర్విరామంగా, అఖండంగా, చాతుర్యంతో నడుస్తుంది.

పోలీసులు లోపలికి వచ్చాక వారితో సంభాషణ, మధ్య మధ్య అమాయకత్వం ప్రదర్శన, నటిస్తూ మాటలు, తన చాతుర్యం పాఠకునికి కనబడేలా మాట్లాడేపద్ధతి, ఆమె చుట్టూ కథ వలయంలా తిరుగుతుంటుంది. వలయం స్పృశించే విధంగా మూడుకోణాల్లో ముగ్గురు - 1) పోలీసులు, 2) మనుమరాలు, ఉద్యమకారుడు, 3) పాఠకులు ఉండి, కథావలయాల్లో మునిగిపోతారు. ఇక్కడ కథనం ఏ మాత్రం ఉండక, సంభాషణల దొంతరలతో రామవ్వ కథ నడిపిస్తున్నట్టుంటుంది. ఈ కథన కౌశల్యం గొల్లరామవ్వ కథలో శిఖరాగ్రాన నిలుచుంది. పీవీ రాసిన కథల్లో ఈ ఒక్క కథే ఆయనను అత్యున్నత స్థాయికి తీసుకపోయింది.

కథా నిర్వహణ, మలుపులు, సంభాషణలు, కథనం, భాష, ఉత్కంఠావహంగా కథాగమనం అన్నిటిలో పీవీ నర్సింహారావు గారు అనితరసాధ్యుడు. కథకునిగా పీవీ అసదృశుడు.

# వ్యక్తి వికాసానికి దోహదపడిన ఆర్.యస్. సుదర్శనం కథలు

డా॥ యల్లంభట్ల నాగయ్య

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆర్.యస్. సుదర్శనం (రాచకొండ సుబ్బయ్య సుదర్శనం) సుప్రసిద్ధులు. వీరు సాహిత్యంలో దృక్పథాలు, సమాజము-సాహిత్యము, సాహిత్య నేపథ్యం, నూరు సమీక్షలు అనే విమర్శ గ్రంథాలు, అనుబంధాలు, మళ్ళీ వసంతం, అసురసంధ్య, సంసార వృక్షం నవలలు మధుర మీనాక్షి, కాలం తెచ్చిన మార్పు, కథాసంపుటాలు, సాగర సంగమం, రేగుపండు రుచి, అముద్రిత కథలు, నిశాంతం కవితా సంపుటి రచించిరి. ఇవన్నీ వ్యక్తి వికాసానికి ప్రాధాన్యమిస్తూ రచింపబడిన రచనలే.

సమాజంలో వ్యక్తులకు ఆశయాలు, ఆదర్శాలు ఉండటం సహజము. అందులో కొందరికి ప్రత్యేకమైన వారి జీవిత దృక్పథాలు ఉంటాయి. సమాజానికి మేలు చేసే రచయితలను ఈ విషయంలో ముందు చెప్పుకోవాలి. కనుక రచనలను రచయిత తాత్త్వికదృష్టి నేపథ్యంతో ఆలోచించాలని సుదర్శనం భావన. దీనికి అనుగుణంగానే వీరి రచనల్లో చాలావరకు వివిధ తాత్త్విక విషయాలకు సంబంధించిన చర్చలు కనబడుతాయి. తత్త్వశాస్త్రం, మానసిక శాస్త్రములను అభిమానించే సుదర్శనం భావవాదానికి భౌతికవాదానికి ప్రాచ్య పాశ్చాత్య భావాలకు సమన్వయాన్ని కల్పించి అద్వైత ధోరణిని నెలకొల్పడానికి తన రచనల్లో ప్రయత్నం చేసినట్లు గమనింపవచ్చు.

అస్తిత్వం అంటే వ్యక్తి ఉనికి. అతని అంతఃచేతనలో ఏర్పడి సంతృప్తినిచ్చేది. వ్యక్తి వికాసానికి వైశిష్ట్యానికి స్వేచ్ఛకు ప్రాధాన్యమిచ్చే ఈ దృక్పథమే అస్తిత్వవాదంగా ప్రచారం పొందింది. ఇది ఆంగ్లంలో Existantionlism అని పిలువబడింది. వ్యవస్థాధర్మానికి వ్యక్తి ధర్మానికి సంఘర్షణ ఏర్పడినప్పుడు అస్తిత్వవాదం వ్యక్తి ధర్మానికి ప్రాధాన్యం యిస్తుంది. ఒక పనిని చేయడానికి తనకుతానే ఇష్టపూర్వకంగా అంగీకరిస్తాడు గనుక దాని వలన కలిగే సుఖమైన దుఃఖమైనా ఇతరుల మీదికి నెట్టకుండా తాను భరించడానికి ఇష్టపడడం అస్తిత్వవాది ప్రధానలక్షణము. ఇందులో తన నడవడికను సమాజం ఇష్టపడుతుందా? లేదా? అని కాక మనస్సుకు తృప్తినిస్తుందా? లేదా? అని ఆలోచిస్తాడు. ఆర్.యస్. సుదర్శనం అస్తిత్వవాద

స్వభావాన్ని తెలుపుతూ "అస్తిత్వవాదం మేధో విన్యాసంచే కప్పబడిన అస్తిత్వపు అనుభూతినీ, దాని నుంచి రూపం దిద్దుకునే వైయక్తిక వైవిధ్యాన్నీ, వైశిష్ట్యాన్నీ ప్రాథమికమైన విలువలుగా ఎత్తి చూపుతుంది. మనిషిని జడవస్తువుగానో, యంత్రంగానో, ప్రకృతిలో, సమాజంలో ఒక ప్రయోజనానికి సాధనంగానో ఉపలక్షించే దృక్పథాన్ని వ్యతిరేకిస్తుందీ దృక్పథం. సామూహికమైన నినాదాలలో ఒత్తిడులతో మనిషిలోని సృజనాత్మక శక్తిని, నవనవోన్మేషిత్వాన్ని అంతమొందింప జూచే ధోరణులను ప్రతిఘటిస్తుంది. సమాజ ప్రగతిని నిరోధించని దాని జోలికి పోని అనుభూతి వ్యక్తిలో ఎంత మేర ఉన్నది? రాజకీయ సామాజిక వ్యవస్థ అనవసరంగా దానితో కల్పించుకొని దాన్ని నియంత్రించి, శాసించే పనికి పూనుకోకపోతే చాలు ! మనిషిలో సృజనాత్మకత నశిస్తే మనిషి వ్యక్తిగానూ సామూహికంగానూ కూడా మరణిస్తాడు. మనిషి చావకూడదు." అని దాని ఆవశ్యకతను స్పష్టంగా వివరించాడు.

ఆర్.యస్. సుదర్శనం రచనలు అస్తిత్వవాదధోరణి ప్రధానాంశంగా సాగుతాయి. అందులోను వీరి నవలలు, కథలు వంటివాటిలో ఇది స్పష్టంగా తెలుస్తుంది. రచనలోని పాత్రలు చాలావరకు తాత్త్విక నేపథ్యాన్ని కల్గి ఉంటాయి. అందువల్లనే వీటిని ఒకటికి రెండు మార్లు చదవాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే రచయిత చెప్పదలచుకున్న విషయం పూర్తిగా అర్థం చేసుకోగల్గుతాము. జీవిత గాంభీర్యాన్ని గ్రహించగల్గుతాము.

ఆర్.యస్. సుదర్శనం రచనలను విశ్లేషిస్తూ అంపశయ్య నవీన్ "ఆర్. యస్. సుదర్శనం రచించిన కథల్లో తాత్త్విక చింతన ప్రధానమైన నేపథ్యంగా ఉంటుంది. ఆత్మాన్వేషణ, అంటే మనిషి తనను గూర్చి తాను తెలుసుకోవాలన్న ప్రయత్నం ఆయన కథల్లో ప్రధానవస్తువు. ఆయన పాత్రల్లో నేనెవరు? ఈ జీవితం ఎందుకు? ఈ బ్రహ్మాండమైన విశ్వాంతరాళంలో మానవుడి పాత్ర ఏమిటి? ఈ సృష్టికి మానవ జీవితానికీ అర్థమేమైనా ఉందా? మతం, తత్త్వశాస్త్రం దేవుడు మొదలైనవి మానవుడిలో ఉత్పన్నమయ్యే ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలుగుతాయా? అన్న పరిశోధనాశీలం ఉంటుంది. ఆయన పాత్రలన్నీ వ్యవస్థా ధర్మానికంటే వ్యక్తి ధర్మానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాయి. కాబట్టి ఆయన కథల్ని అస్తిత్వవాదాన్ని ప్రవచించే కథలని చెప్పొచ్చు. అస్తిత్వవాదాన్ని తెలుగు కథల్లోను,

నవలల్లోను ప్రవేశపెట్టిన కొద్దిమంది రచయితల్లో ఆర్.యస్. సుదర్శనం గారొకరు" అని పేర్కొనిన మాటలు వాస్తవాలు.

ఆర్.యస్. సుదర్శనం రచించిన కథలు 'మధురమీనాక్షి', 'కాలం తెచ్చిన మార్పు' సంపుటాలుగాను, 'సాగరసంగమం', 'రేగుపండురుచి' అముద్రితాలుగాను ఉన్నవి. మధురమీనాక్షి కథల సంపుటిలో మధురమీనాక్షి, ప్రతిబింబం, కొండమెట్లు, పాపజాతి, ఏకాంతం, కన్నుల వెలుగు, ఎరుపు, కల్యాణోత్సవం అనునవి. కాలం తెచ్చిన మార్పు కథల సంపుటిలో కాలం తెచ్చిన మార్పు, మొగలిపువ్వు, ఆత్మజ్ఞానం, సమర్థుడు, అమృతుడు, నీరు పల్లమెరుగు, పంకజం అనునవి. అముద్రితాలుగా సాగర సంగమం, రేగుపండురుచి కలిపి మొత్తం పదిహేడు కథలు కనిపిస్తున్నాయి. ఈ కథల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క విశిష్టతను కల్గి ఉంది. ఉత్తమ పురుషలో నడచిన ఈ కథల్లో సుదర్శనం గారే ప్రధాన పాత్ర రూపంలో కనిపిస్తాడు.

'మధురమీనాక్షి' కథలో కథా నాయకుడి పేరు చెప్పలేదు. ఇతడు మేధోపజీవి. మనశ్శాంతికై మధురలోని తన స్నేహితుణ్ణి కలవాలని వెళ్ళి అక్కడి మీనాక్షి దేవాలయాన్ని సందర్శించాలని బయలుదేరుతాడు. మొదటి రోజు చొక్కాతో వెళ్ళగా అక్కడి నియమాల ప్రకారం లోపలికి ప్రవేశం దొరకదు. రెండవరోజు చొక్కా లేకుండా వచ్చి దైవాన్ని దర్శనం చేసుకొని బయటికి వస్తాడు. అక్కడి విగ్రహం శృంగార దేవతగా అతనికనిపిస్తుంది. కాసేపటికి వెనక్కి తిరిగి చూడగా తాను లోపల చూసిన దేవతలాంటి ఒక స్త్రీ అతని వెనక వస్తున్నట్లు కనిపిస్తుంది. అతడు దేవతా విగ్రహం, ఈ స్త్రీ మూర్తి ఒక్కరే అన్న భావన పొందుతాడు. ఆమె పేరు మీనాక్షి. మధురలో ఒక కళాశాలయందు ఫిలాసఫీ లెక్చరర్‌గా పనిచేస్తుంది. భార్య చనిపోయినప్పటినుండి స్త్రీలంటే దూరంగా ఉండే అతనికి ఆమెను చూడగానే ఒకరకమైన ఆకర్షణ కల్గుతుంది. మరుసటి రోజు ఆమెను దేవాలయంలో పరిచయం చేసుకుంటాడు. క్రమంగా వారి మధ్య సాన్నిహిత్యం పెరుగుతోంది. అప్పటి నుండి ఆమెను చూడలేక ఉండలేని స్థితికి అతడు చేరుకుంటాడు. మీనాక్షి అతన్ని ఒక రోజు తమ ఇంటికి ఆహ్వానిస్తుంది. ఇంతవరకు అస్పష్టంగా నున్న కథానాయకుని అస్తిత్వం ఆమె సమాగమంలో అలౌకికానందాన్ని పొందుతాడు. కొద్ది రోజులు ఆమె కనబడక పోయేటప్పటికి ఆమె యింటికి వెళ్ళుతాడు. అక్కడ మీనాక్షి చనిపోయిందని తెలుస్తుంది. వివరాలు తెలుసుకోవడానికి ఆమె లెక్చరర్‌గా

పనిచేస్తుందని తెలిసి పట్టణంలోని అన్ని కళాశాలలను తిరుగుతాడు కాని అడ్రసు దొరకదు. అప్పుడు మధురలో నున్న దేవతా విగ్రహమే మీనాక్షి రూపంలో స్త్రీగా తనకు పరిచయమై అద్వైతానుభూతిని కల్గించిదని భావిస్తాడు.

ఈ కథను విశ్లేషిస్తే ఆసక్తికరమైన అనేక విషయాలు తెలుస్తాయి. సంఘం కట్టుబాట్ల ప్రకారం సాధారణంగా అందరికి దేవతా విగ్రహం అంటే భయం, భక్తి, గౌరవభావాలు ఉంటాయి. కాని ఇందులో కథానాయకుడు విగ్రహాన్ని శృంగార దేవతగా భావించాడు. బయట కనిపించిన మీనాక్షి, దేవాలయంలోని దేవతా విగ్రహమైన మీనాక్షి ఒక్కరుగానే అతనికి కన్పిస్తారు. పైగా తనకు పరిచయమైన మీనాక్షితో సమాగమాన్ని పొందుతాడు. ఇదంతా సంప్రదాయవాదికి ఒక షాక్‌లాగా అనిపిస్తుంది. ఇక్కడే అస్తిత్వవాది వ్యక్తిత్వం స్పష్టమవుతుంది. సమాజాన్ని గూర్చి అస్తిత్వవాది పట్టించుకోడు. తన అంతరాంతరాల్లో పుట్టి తనను ముందుకు నడిపించే చేతన ప్రకారమే వ్యక్తి నడుచుకొంటాడు. అదే అస్తిత్వవాదంలో ప్రధానాంశము. కథలో కథానాయకుడు ఆ విధంగానే ఆలోచించాడు. కనుకనే మధురమీనాక్షి కథ అస్తిత్వవాదానికి సరియైన ఉదాహరణమగుచున్నది.

లెక్చరర్ మీనాక్షి పరిచయమైన తర్వాత ఆమెను చూడలేక ఉండలేని స్థితిని పొందిన కథానాయకుడు ఆమె చనిపోయిందని తెలిసినప్పుడు, మీనాక్షి దేవతా విగ్రహము ముందు నిల్చున్నప్పుడు తనలో కల్గిన నిశ్చలత్వానికి తానే ఆశ్చర్యపోతాడు. తన మనసులో ప్రేమమయంగా నిలిచిన భౌతికంగా చనిపోయిన భార్యయే లెక్చరర్ మీనాక్షిగాను కనిపించి, భార్య, లెక్చరర్ మినాక్షి చనిపోయి విగ్రహరూపమైన దేవతా రూపంలో కలిసిపోయారనే అద్వైతభావాన్ని పొందుతాడు. అతనిలో సమభావం ఏర్పడుతుంది. లోకమంతా ఒక్కటిగా కన్పిస్తుంది. ఇంతవరకు జీవితంలో నున్న అసంబద్ధత పోయి సుఖదుఃఖాలకు అతీతమైన ప్రశాంతత అతనిలో కల్గుతుంది. ప్రశాంతత కొరకు ప్రతి వ్యక్తి ఇలాంటి సాధన చేయాలని ఈ కథ సూచిస్తుంది.

అస్తిత్వవాది స్వేచ్ఛా జీవి కనుక ఆర్.యస్. సుదర్శనం పాశ్చాత్య అస్తిత్వవాదానికి ప్రాచ్య వేదాంతానికి సమన్వయాన్ని ఏర్పరిచి ఆత్మజ్ఞానాన్ని పొందడమే వేదాంత ప్రయోజనం, అది వ్యక్తి అస్తిత్వం ద్వారా, పొందగలిగితే అదే వేదాంత అస్తిత్వవాదమవుతుందని 'సాహిత్య నేపథ్యం' అనే వ్యాస సంపుటిలో ఒక

కొత్త ప్రతిపాదనను చేసి దానికి ఉదాహరణంగా మధుర మీనాక్షి కథను రచించాడు. ధూర్జటి శివరాత్రినాడు వేశ్యపర్యంకం మీద ఉండి, ఆమె స్తనాన్ని శివలింగంగా అర్చించినట్లు చెప్పబడిన ఐతిహ్యం మధుర మినాక్షి కథను రాయడానికి ప్రేరకమైనట్లు రచయిత స్వయంగా తెలిపారు. సరిగ్గా ఇదే దృక్పథంతో సుదర్శనం గారు 'సంసారవృక్షం' నవల కూడా రూపొందించారు.

'ప్రతిబింబం' కథలో వ్యక్తి ప్రతిబింబాలే లోకంలో వివిధ రూపాలుగా కనిపిస్తాయని రచయిత తెలిపాడు. జీవితం శాశ్వతంగా ఎప్పటికి ఒకే రూపంలో ఉండదని, విధివ్రాత అనేవి ఏమీ లేదని, వ్యక్తి స్వేచ్ఛగా తీసుకునే నిర్ణయాన్ని బట్టి మార్పులు చెందుతుందని కూడా ఈ కథ సూచిస్తుంది. ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసులో పనిచేస్తున్న ఒక ఉద్యోగి తన కూతురు ఇతర కులస్థునితో లేచిపోయేసరికి మానసికంగా కృంగిపోతుంటాడు. ఆ సమయంలో కలిసిన ఒక ముష్టివాడు వేదాంత ధోరణిలో ఒకరికి మరొకరితో సంబంధం ఉంటుందని భావించడం భ్రమ అని చెప్పిన మాటలు కొంత ఊరట కల్గిస్తాయి. ఆరు సంవత్సరాల తర్వాత ఆ ఉద్యోగి ప్రమోషన్ కొరకు హైదరాబాదులో ప్రయత్నిస్తున్నప్పుడు గతంలో తారసపడిన ముష్టివాడే కనబడి అడగక ముందే అతనికి ప్రమోషన్ వస్తుందని జ్యోతిషం చెప్తుతాడు. కాని దానికి వ్యతిరేకంగా అతని ఉద్యోగం పోతుంది. కొంతకాలం తర్వాత ఆ ఉద్యోగి కుమారుడు చనిపోయినప్పుడును తిరిగి ముష్టివాడు తారస పడుతాడు. ఇలా ముష్టివాడు కనబడినప్పుడే తన కష్టాలు వస్తున్నాయని భావించిన ఉద్యోగి మనసులోని అశాంతిని పోవడానికి ఉపాయం చెప్పమని అక్కడ కనబడిన ముసలివాడిని కోరినప్పుడు అతని చెవిలో ఒక మంత్రం ఉపదేశించేసరికి కొద్ది సేపు స్పృహ తప్పి పడిపోయి తేరుకొని చూచేసరికి ముసలివాడు కనబడడు. అప్పుడు లోకం అంతా కొత్తగా కన్పిస్తుంది. మూడు నాలుగు అద్దాలున్న గదిలో ఒక్కడి రూపమే అనేక ప్రతిబింబాలుగా కన్పించినట్లుగానే భగవంతుని అద్దాలమహలు అనే ఈ లోకంలో ఒకే మనిషిలోని భావాలే వేరు వేరు వ్యక్తులుగా కనబడతారని ఇదే సృష్టి రహస్యమని ముష్టివాడి రూపం కూడా తనలోని ఒక భావమేననే అద్వైత భావనను పొందుతాడు. ఇందులో ఊహలతో కాలం గడుపుతున్న వ్యక్తిని తన అస్తిత్వాన్ని గూర్చి ఆలోచింపచేయుట తెలుస్తుంది. వ్యక్తి స్వేచ్ఛగా తీసుకునే నిర్ణయాలే అతని జీవితాన్ని నిర్దేశిస్తాయన్న అస్తిత్వవాదాలు నమ్మిన లక్షణం ఈ కథలో చెప్పబడింది.

'కొండమెట్లు' కథలో తన జీవితంలో ఎవరికి సహాయం చేయని వ్యక్తికి ఇతరులచే సహాయం చేయించి జ్ఞానోదయం కల్గించబడుతుంది. ఇందులోని కథానాయకుడు ప్రభుత్వోద్యోగం చేసి రిటైరు అయిన తర్వాత తిరుపతి దేవస్థానం వారి కళాశాల గ్రంథాలయంలో అధికారిగా పనిచేస్తుంటాడు. కొద్ది కాలం తర్వాత భార్య చనిపోతుంది. ఇతని ప్రవర్తన ఇష్టపడని కొడుకు బొంబాయిలో ఉంటూ తల్లి చనిపోయినప్పుడు కూడా ఇంటికి రాడు. ఇతర కులస్థునితో తిరిగిందని కూతురు కమలాక్షికి వివాహం కూడా చేయడు. కళాశాలలో పనిచేస్తున్నప్పుడు అమ్మాయిలకు వచ్చిన ఉత్తరాలను నోటీసు బోర్డుమీద పెట్టాలి. కాని ఇతడు అట్లా చేయకుండా తన వద్దే అట్టిపెట్టుకొంటుండేవాడు. ఒకసారి జానకి అనే విద్యార్థినికి ఆమె ప్రియుడు రాసిన ఉత్తరం అందకుండా చేస్తాడు. దీనితో తన ప్రేమికుని దగ్గర నుండి జవాబు రాలేదనే కారణంతో జానకి చనిపోతుంది. ఈ విధంగా కథానాయకుని వల్ల ఇంటా బయటా ఎవరూ సుఖపడరు. తను ఆ ఉత్తరం వెంటనే ఇవ్వకపోవడంవల్లనే ఆమె ఆత్మహత్య చేసుకుందని తెలుసుకున్న కథానాయకుడు పాప పరిహారార్థం ఏడుకొండలు కాలినడక వెళ్ళి తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకోవాలనుకొంటాడు. ఒక రోజు గుమస్తా గరుడయ్యతో కలిసి బయలుదేరుతాడు. మార్గమధ్యంలో వర్షం కురవడం వల్ల కథానాయకుడు కాలుజారి మెట్ల మీద పడిపోతాడు. వెనకనే వస్తున్న ప్రేమనాంచారి అనే భక్తురాలు తన కారులో హాస్పిటల్‌కు చేర్పించి అతని బాగోగులు చూస్తుంది. బొంబాయినుండి కొడుకు కూడా తండ్రి దగ్గరికి చేరుకుంటాడు. తిరిగి కొండమీదికి తీసుకెళ్ళుతానంటాడు. ఇంతవరకు తాను చేసిన పొరపాట్లవల్ల అతనిలో కల్గిన పాపభీతిచే కొండ మీదికి వద్దంటాడు. ఆత్మవంచన (Badfaith) పాపము – శిక్ష అనే లక్షణాలు అస్తిత్వవాదంలో చెప్పబడినవి. ఇవి ప్రస్తుత కథానాయకునిలో రచయిత వర్ణించినాడు. అందుకే కథ చివరలో రచయిత "వద్దు... ఈ దేహం యిక పనికిరాదు. స్వామి నన్ను కొండకు రమ్మన్నాడు. ఎక్కడానికి యింకో దేహం కావాలి. కిచ్చా ! నాయనా ! ఈ దేహానికి అగ్ని సంస్కారం చెయ్యటానికి వచ్చావు. చేసిపో !" అని కథానాయకునితో అనిపిస్తాడు.

'పాపజాతి' కథా నాయకుడు ఆదర్శభావాలు కల్గిన వ్యక్తి. కాని వాటిని ఆచరణలో పెట్టే సాహసం లేక సతమవుతుంటాడు. మగపిల్లలు లేని తాతయ్య యితన్ని పెంచుకుంటాడు. ఆ పెద్దమనిషి ప్రతి విషయంలోను తను చెప్పినట్లుగానే

ప్రవర్తించాలని పట్టుబడుతూ నిరంకుశంగా ప్రవర్తిస్తూ ఇతనికేమాత్రం స్వేచ్ఛను యిచ్చేవాడు కాదు. కథానాయకునికి తన తాతయ్య స్వభావం నచ్చలేదు. కాని ఎదురు తిరిగే సాహసం చేయలేక పోతాడు. ఇంటిలో పనిచేసే పాలేరు బిడ్డ సుబ్బులంటే ఇతనికి చాలా యిష్టము. ఆ అమ్మాయితో కలిసి తిరగడం తాతయ్యకు కోపం తెప్పిస్తుంది. శాంతితో పెండ్లి అయిన తర్వాత కథా నాయకుడు మారడానికి ప్రయత్నిస్తానని భార్యతో చెప్పుతూనే సుబ్బుల్ని పెండ్లి చేసుకుంటానికి రహస్యంగా మాటిస్తాడు. వీటి మధ్యలో కథానాయకుడు తన అస్తిత్వానికి కావాల్సిన చైతన్యం, స్వయం నిర్ణయశక్తి లేక అశాంతితో రోజులు వెళ్ళదీస్తుంటాడు. సమయం దొరికినప్పుడు ఎదురు తిరుగుతుంటాడు. కొంతకాలం తర్వాత తాతయ్య చనిపోవడం వల్ల ఇంటి బాధ్యతతో పాటు స్వేచ్ఛ దొరుకుతుంది. అనుభవం ద్వారా తన అస్తిత్వం మాత్రమే మిగలటం గమనిస్తాడు. సుబ్బుతో సంబంధం దూరం చేసుకొని భార్యతో జీవితం సాగించడానికి నిశ్చయించుకొంటాడు. ఇందులో అస్తిత్వపు స్పృహ తెలియనప్పుడు సతమతమైన వ్యక్తి అది గుర్తించిన తర్వాత పొందిన ఆత్మ తృప్తిని కథానాయకుడి పాత్ర చిత్రణలో చక్కగా కనబడుతుంది. కథలో పాములను చంపడం అలవాటుగా నున్న తాతయ్య చివరికి పాములను చంపబోయి దాని కాటుతో మరణించడం ప్రతీకాత్మకంగా ఉంది. పాము స్వేచ్ఛాజీవి. ఆ స్వేచ్ఛను హరించడానికి ప్రయత్నించిన తాతయ్యను అదే కాటు వేసింది. అస్తిత్వవాది కూడా తన అస్తిత్వానికి భంగం కల్గుతున్నప్పుడు ఎదురు తిరగాలని అప్పుడు జీవితానందాన్ని పొందుతాడని రచయిత సూచిస్తున్నాడు. చివరికి కథానాయకుడు చేసిన పని కూడా అదే.

'ఏకాంతం' కథలో రచయిత అస్తిత్వవాద లక్షణాలను చక్కగా పొందు పరిచినాడు. కథానాయకుడు ఆనందరావుకు సిగరేట్ తాగడం అలవాటు. అది శరీరానికి హానికరం అని తెలుసు. దానివల్ల అతని ఆరోగ్యం కూడా చాలా చెడిపోతుంది. అతని భార్య సిగరేట్ మాన్పించడానికి చాలా ప్రయత్నం చేస్తుంది. చివరికి ఒక గదిలోపెట్టి తాళం వేస్తుంది. అయినా అతడు మానలేకపోతాడు. సిగరేట్ తాగుతూ అతడు పొందే గొప్ప ఆనందం, ప్రశాంతమైన ఏకాంతం మిగతా సమయాల్లో పొందలేకపోతాడు. అప్పుడు అతనికే తెలియని అనుభూతి అనభవంలోకి రావడం గమనిస్తాడు. ఒక్కొక్కసారి తన భార్యాపిల్లలు, సమాజం ఆ ఆనందానికి ఆటంకాలు కల్గిస్తున్నాయని కోపం చెందుతాడు. ఇతరులతో సంబంధం లేకుండా

వ్యక్తిగా తనను అంటిపెట్టుకొని ఉండేదే ఏకాంతం. దీనిలో వ్యక్తికి పూర్తి స్వాతంత్ర్యం ఉంటుంది. మొదట్లో ఇది అర్థం కాకపోయినా సిగరేట్‌కు తనకు గల సంబంధాన్ని గూర్చి ఆలోచించి, అది తన అస్తిత్వపుటంచులు ముట్టిన ఆనందానికి కారణమని గ్రహించిన ఆనందరావు చివర్లో "హేతువాదం దృష్ట్యా, ఆరోగ్య సూత్రాల దృష్ట్యా, బాధ్యత దృష్ట్యా వదలి పెట్టవలసిన సిగరేట్‌ని తను ఎందుకు వదలి పెట్టలేకుండా ఉన్నాడో కూడా అర్థం తెలిసి వచ్చింది.

చీకటిలో మెరుస్తూ తన ఊపిరితో పాటు స్పందించే ఈ సిగరేట్ కొస, ఈ నిప్పు కణిక, వికసించి ముకుళించే ఈ ఎర్రగులాబీ మొగ్గ, ఇది తన ఏకాంతం ! తనలోని 'తన' స్వరూపం; జీవితానుభవాలు అనే పూసలకి అర్థాన్ని ఆకారాన్ని కల్పిస్తున్న అంతఃసూత్రం ఏకాంతం అని నిర్ణయానికి రాగలుగుతాడు. ఆయా వ్యక్తుల అస్తిత్వానుభూతి వేటితో సమన్వయం చెందుతుందో ఆ వ్యక్తి మాత్రమే గ్రహించగల్గుతారని ఈ కథ ధ్వనింపచేస్తుంది.

'కన్నుల వెలుగు' కథలో విజయ్ చదువుకునే రోజుల్లో ప్రేమలతను ప్రేమిస్తాడు. కాని కొన్ని కారణాల వల్ల ఆమెను పెండ్లి చేసుకోలేకపోతాడు. తర్వాత తల్లిదండ్రులు కుదిర్చిన ధర్మవేణితో పెండ్లి జరుగుతుంది. అయినా భార్యతో సన్నిహితంగా ఉండలేక ప్రేమలతను మరువలేక కాలం గడుపుతుంటాడు. భార్యా భర్తలిద్దరిలో ఉన్న 'అహం' వల్ల కూడ ఒకరికొకరు దగ్గర కాలేకపోతారు. ధర్మవేణి కంటి చికిత్సకోసం హాస్పిటల్‌కు వెళ్ళగా అనుకోకుండా అక్కడ ప్రేమలతయే కంటి డాక్టరుగా ప్రత్యక్షమవుతుంది. అనుభవం పెరిగినకొద్ది జీవిత విధానాల్లోను మార్పులు చేసుకుంటూ పోవాలని గతాన్ని స్మరించుకుంటూ జీవితాన్ని వృథా చేసుకోవద్దని ఆమె మందలించటంతో కథా నాయకునిలో అస్తిత్వం మేల్కొంటుంది. పొరపాటును గ్రహించి భార్యపై అనురాగాన్ని పెంచుకొంటాడు.

ధర్మవేణి వివాహమైనప్పటి నుండి కూడా తనవాదనే సరియైందని, తన మాటే నెగ్గాలని చూడడం వల్ల భర్తకు దూరమవుతుంది. దీపావళినాడు చిచ్చుబుడ్లు కాలుస్తుంటే అనుకోకుండా నిప్పు రవ్వలు ఆమె కంటిలో పడుతాయి. కంటిచూపు పోయేసరికి ఆమెకు లోకమంతా అయోమయంగా ఉంటుంది. విజయ్ చాలా డబ్బు ఖర్చుచేసి అనేక వ్యయ ప్రయాసలకోర్చి ఆమెకు కంటి చూపు వచ్చేటట్లు చేస్తాడు. ఈ సంఘటన ధర్మవేణిలో పెద్ద మార్పు తెస్తుంది. ఇన్ని రోజులు అతిగా

ప్రవర్తించినందులకు భర్తను క్షమించమని వేడుకుంటూ అతనే తన కన్నుల వెలుగంటుంది.

'ఎరుపు' కథలో క్షయరోగంతో బాధపడుతున్న సారథి డాక్టర్ సలహా ప్రకారం శారీరకమైన సెక్స్‌కు దూరంగా ఉంటాడు. భార్య పుట్టింటికి వెళ్ళుతుంది. జబ్బువల్ల శారీరకమైన సెక్స్‌కు దూరమైన ఇతడు మానసికమైన సెక్స్, ద్వారా ఆనందాన్ని పొందడానికి ప్రయత్నిస్తాడు. అందుకే మేడమీది వసారలో కూర్చొని ప్రక్క గుడిసెలో నున్న రాజ్యలక్ష్మి ఉదయం సాయంత్రం నగ్నంగా స్నానం చేస్తున్నప్పుడు చూచి ఆనందాన్ని పొందుతుంటాడు. కాని అంతర్గతంగా అతనిలోని శారీరక వాంఛ రగులుతూనే ఉంటుంది. ఆమెతో సెక్స్‌ను అనుభవించటం వల్ల కల్గే ఆనందానికి ఇలా మానసికంగా ఊహించుకోవడం వల్ల కల్గే ఆనందానికి అంతగా తేడా ఉండదని తన మనస్సుకు నచ్చ చెప్పుకుంటాడు.

కొన్ని రోజులకు సారథికి క్షయ తగ్గుతుంది. రాజ్యలక్ష్మితో పరిచయం పెంచుకొని ఆమెతో శారీరకమైన సెక్స్‌ను అనుభవిస్తాడు. అప్పటి ఆ అనుభూతి చాలా కొత్తగా తృప్తిగా ఉంటుంది. ఇంతవరకు శారీరకమైన సెక్స్ మానసికమైన ఆకర్షణ స్థాయిని అందుకోలేదని చేసుకున్న అతని సిద్ధాంతం నిరాధారమైనదిగా తేలుతుంది. మనస్సు మనస్సుగా అందుకోలేని శిఖరాగ్రాన్ని దేనినో ఆ అనుభవంతో అందుకుంటున్నట్లు భావిస్తాడు. ఆమె రాకకు ఎదురు చూడడమే అతని మనుగడకు అర్థం పరమార్థంగా ఉంటుంది. అతనికి ఒక్కొక్కసారి అప్పటి అనుభూతి శరీరాన్ని, మనస్సును అధిగమించిన దివ్యానుభూతిగా కూడా కనిపిస్తుంది. అప్పుడు సారథి ఇదే తన అస్తిత్వంగా గుర్తించి, ఈ అనుభూతిని శాశ్వతంగా నిలుపుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. అందుకే రాజ్యలక్ష్మి ఊరు విడిచి తన భర్తతో కలిసి వెళ్ళి పోతున్నప్పుడు తనకు కల్గిన ఆనందానుభూతి దూరమవుతుందని భావించి, ఆపిల్స్‌కోసే కత్తితో ఆమెను హత్య చేస్తాడు. మృత్యువ్యుతో ముగింపు చేయబడిన ఈ కథలో 'మృత్యోర్మా౾ మృత్యంగమయ' అనే వ్యాసం కథ చివరలో కనబడుతుంది. జీవితాన్ని గూడ తన ఆలోచనలతో హత్య చేస్తాడు. బుద్ధి జీవియైన సారథి రాజ్యలక్ష్మిని చంపడం ఇక్కడ అదే విషయాన్ని సూచిస్తుంది. వ్యక్తికి సమాజానికి సంఘర్షణ వచ్చినప్పుడు అస్తిత్వవాదం వ్యక్తి విజయానికే ప్రాముఖ్యమిస్తుంది. సమాజం ఏర్పరచిన దాంపత్యబంధం విజయవంతం కాకుండా ఉండటానికే అందులో ఒకరైన రాజ్యలక్ష్మి సారథిచే హత్య చేయబడుతుంది. జీవితంలో ఏర్పడే అనేక విషయాలకు

అసంబద్ధత ఉంటుందని భావించే అస్తిత్వవాదుల లక్షణానికి ఉదాహరణాలుగా కథలో సారథి, రాజ్యలక్ష్మిని హత్య చేయడం, శ్రీకాకుళం వెళ్ళి నక్సలైట్లలో కలిసిన సారథి స్నేహితుడు విశ్వాన్ని పోలీసులు పట్టుకపోవడం అను సంఘటనలు వర్ణింపబడినవి. ఈ విధంగా అస్తిత్వవాదపు అనేక లక్షణాల కలయికగా 'ఎరుపు' కథ నిలుస్తుంది.

'కల్యాణోత్సవం' కథలో సూర్యారావు, సువర్చలలు భార్యభర్తలు. వీరు హైదరాబాదులో ఫ్యాక్టరీ పెట్టి లాభాలతో నడుపుతుంటారు. వెంకటేశ్వరస్వామి మీద అపారమైన భక్తి కల్గిన సువర్చల రోజు కొన్ని గంటల తరబడి పూజామందిరలోనే ఉండేది. ప్రతిసారి లాగానే ఆ సంవత్సరం కూడా ఇన్‌కంటాక్స్ గొడవలు రానందుకు తిరుపతికి వెళ్ళి కల్యాణోత్సవం చేయిస్తుంది. ఆ దేవుడే చెప్పమన్నట్లుగా సువర్చల ఇన్‌కంటాక్స్ తప్పించుకోవడానికి తన భర్తకు సలహాలిస్తుంది. ఇన్ని చేస్తున్నా తన సంపదను ఎవరు దోచుకోపోతారోననే భయం ఆమెలో ఉంటుంది. ఇవన్నీ అస్తిత్వవాదంలో చెప్పబడే ఆత్మవంచన లక్షణాలు. దానికి తోడు వారి ఫ్యాక్టరీలో పనిచేస్తున్న బంధువుల అబ్బాయి వెంకటరమణకు చాలా తక్కువ జీతం యిస్తుంటారు. అతని వివాహ విషయంలో అవసరమైనప్పుడు సహాయం కూడా చేయరు.

ఇటువంటి పాపాలకు శిక్ష కూడా ఉంటుందని అస్తిత్వవాదం తెలుపుతుంది. ఫ్యాక్టరీలో తమ వద్ద పనిచేసే వెంకటరమణ ప్రసాద్ అనే పిల్లవాడు వచ్చి గుండెల మీద కూర్చున్నట్లుగా గొంతు నొక్కేసినట్లుగా చంపడానికి ప్రయత్నం చేసినట్లుగా సువర్చలకు కల వస్తుంది. అనుకున్నట్లుగానే ఇన్‌కంటాక్స్ వాళ్ళు హఠాత్తుగా సూర్యారావు ఇంటిని జప్తు చేస్తారు. పూజాగృహాన్ని ప్రవేశించి వెంకటేశ్వరస్వామి వెనకాల అలమరలో ఉంచిన యాభైవేల కరెన్సీ బంగారు బిస్కెట్లను తీసుకుపోతారు. ఫ్యాక్టరీ మూత పడుతుంది. భగవంతుడికి పూజలు అనేకంగా చేసి కానుకలు సమర్పించినా చేసిన పాపానికి శిక్ష తప్పదని ఈ సంఘటన సూచిస్తుంది.

ఆర్. యస్. సుదర్శనం గారి రెండవ కథల సంపుటి 'కాలం తెచ్చిన మార్పు'. ఇందులో కాలం తెచ్చిన మార్పు, 'మొగిలిపువ్వు', 'ఆత్మజ్ఞానం', సమర్థుడు, అమృతుడు, నీరు పల్లమెరుగు, పంకజం' అను ఏడు కథలున్నాయి. 'కాలం తెచ్చిన మార్పు' కథలో కాలం గడుస్తున్న కొద్ది వ్యక్తుల ఆలోచనల్లోను, ప్రవర్తనలోను మార్పులు

వస్తుంటాయి. వాటిని మనం గౌరవించడం, గుర్తించడం అవసరమనే భావన కనబడుతుంది. ఇందులో సూర్యనారాయణ అనే ఆదర్శవంతుడైన పెద్దమనిషి ఉంటాడు. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొనిన యితడు తర్వాతి రాజకీయాలు నచ్చక వాటికి దూరంగా ఉంటూ కాలం గడుపుతున్న నిస్వార్థజీవి. స్వాతంత్ర్య పోరాటంలో అతని కొడుకు చనిపోతాడు. తర్వాత కొద్ది కాలానికి కోడలు మరణిస్తుంది. వైధవ్యంతో కూతురు రుక్మిణమ్మ ఇక్కడే ఉండి ఇంటి బాధ్యతలు చూసుకొంటుండగా కొడుకు కూతుళ్ళు అయిన విమల, స్వరాజ్యం యిద్దరిని సూర్యనారాయణ తన సంరక్షణలో పెంచుతాడు. స్వరాజ్యాన్ని తన ఆదర్శాల కనుగుణంగా డాక్టరును చదివించి సమాజ సేవ చేయించాలనుకుంటాడు. కాని దీనికి భిన్నంగా ఆమె వివాహం చేసుకొని త్వరగా జీవితంలో స్థిరపడిపోవాలని భావిస్తుంది. తనకు పరిచయం అయిన 'సత్యం' అనే యువకుణ్ణి ఇష్టపడుతుంది. ఈమె తన అభిప్రాయాన్ని తాతయ్య ముందు చెప్పలేకపోతుంది. అతడు కూడా గ్రహించలేకపోతాడు. విశ్వనాథం అనే మధ్య వ్యక్తి ద్వారా స్వరాజ్యం ప్రేమ వృత్తాంతం తెలిసినప్పుడు మొదట సూర్యనారాయణ ఆశ్చర్యపోతాడు. కాని కాలం గడుస్తున్న కొద్ది దానికనుగుణంగా వ్యక్తుల ఆలోచనల్లోను మార్పులు రావడం సహజం. వాటిని గౌరవించడం సమంజసంగా ఉంటుందని భావించి స్వరాజ్యం – సత్యం పెండ్లికి సూర్యనారాయణ అంగీకరిస్తాడు. తన జీవితంలో జరుగుతున్న సంఘటనలన్నింటిని భగవద్గీతాసారంతో సమన్వయించుకొనునట్లు సత్యనారాయణ పాత్ర రచయిత చిత్రించడం వల్ల కథలో తాత్త్వికత చోటు చేసుకుంది. స్వరాజ్యం వివాహ విషయం తెలిసిన తర్వాత సూర్యనారాయణ ఇలా ఆలోచిస్తాడు. "చిహ్నాలను విసర్జించితే కాని విముక్తి భగవంతునిలో ఐక్యం సాధ్యం కాదు. చిహ్నాలనేవి బాహ్య చిహ్నాలే కావు. మనో దృక్పథాలు. ఆదర్శాలు కూడా చిహ్నాలే. జీవితరంగంలో కర్మ చేస్తున్నంత సేపు త్యాగదృష్టి, మానవసేవ ధర్మసాధనకు పరికరాలు గాండీవంలాగా. . . ధర్మసాధన అయిపోయిన తర్వాత వాటినంటిపెట్టుకోవడం. వాటి మీద మమకారం బంధన హేతువు. . . అన్ని కర్మలు జ్ఞానంలో పర్యవసిస్తాయనీ, చివరకు జ్ఞానం కూడా 'యజ్ఞ' వస్తువుగా అర్పితం కావాలనీ, గీత చెబుతున్న మాటకు యిప్పుడే అర్థం తెలిసి వస్తోంది."

సూర్యనారాయణతో చర్చిస్తున్న సందర్భంలో విశ్వనాథం మాటల్లో వ్యక్తి అస్తిత్వానికి ప్రాముఖ్యం యివ్వాల్సిన ఆవశ్యకతను రచయిత "అందువల్ల ఆదర్శాల

మేరకు వ్యక్తిత్వాన్ని సాగదీసి నాశనం చేయ్యటం కన్నా, వ్యక్తిత్వం మేరకు ఆదర్శాలను కుదింపు చెయ్యటమే మంచిదేమోనని నా ఊహ." అని స్పష్టంగా పేర్కొంటాడు.

'మొగిలిపువ్వు' కథలో శ్రీనివాసరావుకు రాధతో పెండ్లి అవుతుంది. సంతానంగా ముగ్గురు పిల్లలు కూడా ఉంటారు. కాని అతడు సంసారంలో సంతృప్తిని మానసిక ప్రశాంతతను పొందలేకపోతాడు. దీనికి తోడు కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. చిన్నతనం నుండి కూడా తన స్వంత ఆలోచనలు అంటూ లేకుండా శ్రీనివాసరావు ఇతరులు చెప్పినట్లు జీవితాన్ని సాగిస్తున్నాడు. మొదట్లో వాళ్ళ నాన్నగారు బి.ఎ. చదువమంటే చదివినాడు. ఫలానా వారితో స్నేహం చెయ్యొనద్దంటే మానేశాడు. కో-ఆపరేటివ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగంలో చేరమంటే చేరాడు. వివాహమయిన తర్వాత భార్య మొహం కడుక్కోండి, కాఫీ తాగండి, స్నానం చెయ్యండి, భోజనం చెయ్యండి, బజారుకు వెళ్ళండి, ఇక పడుకోండి దీపం ఆర్పివేస్తాను అంటే అలాగే చేస్తున్నాడు. ఒక రోజు జీవితమంటే ఇంతేనా అని ఆలోచించి, ఇక చేయడానికి ఏమీ లేక పోతే జీవితం నుండి నిష్క్రమించడం మేలనుకొంటాడు.

ఇట్లా నిర్లిప్తతతో జీవితాన్ని సాగిస్తున్న శ్రీనివాసరావు ఉద్యోగరీత్యా మధ్యమధ్యలో మొగుళ్ళపాలెం గ్రామం వెళ్లాల్సి వచ్చేది. అక్కడ గ్రామంలో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న సుజాతతో ఏర్పడిన పరిచయం ఇతనికి మానసిక తృప్తినిస్తుంది. శారీరకంగాను యిద్దరు ఒక్కటవుతారు. ఆమె దగ్గర ఉన్నంతసేపు ఆనందాన్ని పొందిన శ్రీనివాస్‌రావు తిరిగి తన భార్యా పిల్లల దగ్గరికి వచ్చేటప్పటికి అసంతృప్తికి లోనవుతుంటాడు. చుట్టూ ఉన్న సమాజంలో సర్దుబాటు చేసుకోలేకపోతాడు. చిరాకుతో ఆత్మహత్య కూడా చేసుకుందామనుకుంటాడు.

అదే రోజు రాత్రి పక్కింటివారు ఇచ్చిన మొగిలిపువ్వులు పెట్టుకొని భార్య అప్పుడే బయటినుండి తిరిగి వచ్చిన శ్రీనివాసరావు దగ్గరికి వస్తుంది. ఆ మొగిలిపువ్వుల సువాసనలోంచి తనకు మొగుళ్ళపాలెం అక్కడ సన్నిహితమైన సుజాత ఆమె జ్ఞాపకాలు మనస్సులో మెదిలి అతనిలో మళ్ళీ జీవించాలనే ఉత్సాహాన్ని కల్గిస్తాయి. రైలు ప్రమాదంలో మరణించినప్పటికి సుజాత అతని మనస్సు మీద చెరగని ముద్ర వేస్తుంది. అప్పుడు శ్రీనివాసరావు "ప్రత్యక్షానుభవంగా వున్నప్పుడు భయమూ, బాధ కల్గించినా దాని మూలంగానే (సుజాతతో ప్రణయం) ఆ రహస్యం

వల్లే. . . మొగిలిపూవు వాసన, నక్షత్రాలు, ఆకాశం, వీటితో పాటు తనూ ఉంటాడు" అని అనుకొంటాడు.

మొదట్లో జీవిత పరమార్థం తెలువక నిర్లిప్తుడైన శ్రీనివాసరావు సుజాత పరిచయంతో తన అస్తిత్వపుటంచులను తాకి ఆనందించుట ఇక్కడ గమనింపదగిన విషయము. ఆయా వ్యక్తులు వారి జీవితంలో తటస్థపడిన అనేక సంఘటనలలో ఏదో ఒక దానితో తన అస్తిత్వపు స్పృహను గుర్తించగల్గుతారు. అందరికి ఒకే సూత్రం వర్తించదని రచయిత ఈ కథలో సూచిస్తున్నాడు.

'ఆత్మజ్ఞానం' కథలో ప్రకాశం ఆత్మవంచన నుండి బయటపడి, ఆత్మజ్ఞానాన్ని సాధించిన పద్ధతిని కథకుడు వర్ణించినాడు. కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రకాశం తనకు మంచి పర్సనాలిటీ ఉందని దాని చేత ఇతరులు ఆకర్షింపబడుతారనే భావనతో ఉంటాడు. ఈ నమ్మకంతో భార్య సరోజ తన అభిప్రాయాలకు అనుకూలంగా ప్రవర్తించలేదని కోపగించుకొంటాడు. తనను చాలా యిష్టపడుతుందనుకొన్న అమ్మాయి మీద ప్రేమ ప్రకటిస్తే, ఆమె అతని చెంప ఛెళ్ళుమనిపిస్తుంది. ఈ సంఘటనతో తన అంచనాలు తారమారయ్యేసరికి తన పొరపాటును గ్రహిస్తాడు. అప్పుడు తన అస్తిత్వాన్ని గుర్తించిన ప్రకాశం లెక్చరర్ ఉద్యోగాన్ని వదులుకొని గతంలో అతని నాన్నగారు కోరినట్లు గ్రామానికి వెళ్ళి వ్యవసాయం చేసుకుంటూ ప్రశాంత జీవితాన్ని గడుపుతాడు. తన స్నేహితునితో ప్రకాశం అన్న ఈ మాటలు అతని జీవితంలో వచ్చిన పరివర్తనను స్పష్టంగా తెలుపుచున్నవి. "మనిషిలో 'నేను' అనేది బాహ్య ప్రమాణాల మీద, లోకం మెప్పు మీదా ఆధారపడినంతవరకూ మనిషికి పునాది అంటూ వుండదు. గాలిమేడలాగా, తేలిపొయ్యే మబ్బులాగా వుంటాడు. నిలకడలేక, పైవాళ్ళ అభిప్రాయాల కోసం, పొగడ్తల కోసం ప్రాకులాడుతుంది మనస్సు. దీనికి మూలకారణం ఒక రకమైన భయం. అంటే పైవాళ్ళ ఆదరణ లేకపోతే 'తనులే'దన్న భావం. అందుకే బాహ్య ప్రమాణాలని సొంతం చేసుకోవడం.. ఇలాంటి మనస్తత్వం కల వ్యక్తి నిజస్వరూపమేమిటో, తనకేం కావాలో ఏది అక్కర్లేదో నిర్ధారణ చేసుకోలేడు. ఎప్పుడూ అసంతృప్తి వెంటాడుతూ ఉంటుంది. దానివల్ల అవకతవగ్గా ప్రవర్తించి యితరులకు బాధ కలిగిస్తాడు. స్వయంగా బాధ పడుతాడు. ఆ వ్యక్తికి ప్రేమించటం చేతకాదు. కాని లోకం తన మీద మోపే 'విలువల' భారాన్నుంచి తప్పుకోవటం ఏమంత సులభం కాదు. ఏదో ఒక సంఘటనవల్ల ఒక

షాక్‌తో అటువంటి విముక్తి కలగాలి. దాన్నే ఆత్మజ్ఞానం అంటాను. దాని మూలంగానే తృప్తిని సాధించటానికి వీలవుతుంది. ఇది నా స్వానుభవం." ఈ స్వానుభవమే అస్తిత్వాన్ని గుర్తించటం. ఇది ప్రకాశంలో స్పష్టంగా కనిపిస్తుంది.

'సమర్థుడు' కథలో లోకం దృష్టిలో ఎంతో సమర్థుడుగా కనిపించే కథా నాయకుడు రాఘవయ్య నిజానికి ఎంత అసమర్థుడో చూపించబడింది. రాఘవయ్య తనను గూర్చి యిట్లా అనుకుంటాడు. బి.ఏ. కాగానే ఏ రెవెన్యూ డిపార్టుమెంటులోనో గుమస్తాగా చేరవలసింది. పొరపాటున బి.యిడిలో చేరాను. అనుభవిస్తున్నాను. సహో ఉద్యోగులు ఇతన్ని గూర్చి అనుకునే మాటలు యిట్లా ఉంటాయి. "రాఘవయ్య బలవంతుడు. సమర్థుడు నీతి – అవినీతి అనే భయం అతనికి లేదు. ముందుకు పోవటానికి ఎన్ని సందుదార్లూ, అడ్డదార్లూ వున్నాయో అవన్నీ తెలుసు. తనకు ఎదురువచ్చిన వాళ్లెవరైనా సరే వాళ్ళ అంతుచూడగలడు."

రాఘవయ్య స్కూల్ టీచర్‌గా పనిచేస్తుంటాడు. కాని అతనిలో విషయ జ్ఞానముండదు. పిల్లలకు బోధించలేడు. పైరవీలు చేసుకుంటూ పనులు సాధించుకొంటాడు. ఇతని దురుసుతనం చూచి ప్రధానోపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులు ఎదురు మాట్లాడరు. ఇతని సబ్జక్ట్ గణితమైనా తెలుగులో ఎం.ఏ. పట్టా సంపాదించి, విద్యార్థులను ట్యూషన్‌కు రప్పించుకొని పైరవీతో వాళ్ళకు మార్కులు వేయిస్తాడు. ఈ విషయాలేవి తెలియని యితరులు ఇతన్ని సమర్థుడను కొంటారు.

అర్హత లేకున్నా హెడ్‌మాస్టరు ప్రమోషన్ వస్తుందని ప్రచారం చేసుకొని, దానికొరకు శాయశక్తులా ప్రయత్నాలు కొనసాగిస్తాడు. అడ్డదారులు తొక్కుతాడు. అయినా ఆ ప్రమోషన్ ఇతనికి కాకుండా వేరొకరికి వస్తుంది. దానితో మనోవ్యాధికి గురియై పక్షవాతాన్ని తెచ్చుకుంటాడు. ఇంతవరకు డాంభికంగా ప్రవర్తించినా రాఘవయ్య తనని చూడడానికి వచ్చిన ఉపాధ్యాయులముందు చంటి పిల్లాడిలా ఏడుస్తాడు. కొంతకాలం తర్వాత చనిపోతాడు.

ఆత్మవంచన, పాపము, శిక్ష వంటి అస్తిత్వవాదలక్షణాలకు రాఘవయ్య పాత్ర సరిగ్గా సరిపోతుంది. రచయిత ఇతన్ని గూర్చి ముగింపులో అన్న మాటలు పాత్ర స్వభావాన్ని చక్కగా విశ్లేషిస్తాయి. "అవినీతి, అడ్డదారులు అనేవి బలానికి

కాదు. బలహీనతకే చిహ్నాలు కాబోలు. రాఘవయ్యకు నిజంగా తెలుగులో పాండిత్యమూ, ప్రతిభా వుంటే అతను మంచి నాటకాలే వ్రాయగలిగితే, అతను విద్యార్థికి బాగా చదువు చెప్పగలిగితే, తన బుకాయింపుతో, డిప్లమసితో, చిరునవ్వుతో నన్నూ, యితర్లనీ బాధపెట్టే అవసరమే వుండేది కాదు కాబోలు ! అతనిలో నిజంగా లోపించింది సామర్థ్యమే ! ఇక ఆత్మవిశ్వాసం మాత్రం ఎలా వస్తుంది? అంతే అనుకోవాలి. లేకపోతే మనిషి యిలా కుప్పకూలిపోతడా?"

'అమృతుడు' కథలో మంచి ఉద్యోగం, సంపద ఉన్న వ్యక్తితో ప్రసూనకు వివాహం అవుతుంది. ఉద్యోగం బిజీలో భర్త ఎక్కువ సమయం ఆమెతో గడపలేక పోతాడు. కోరిన నగలు, చీరలు, సొంతకారు, కావాల్సినంత తీరిక ఉన్నప్పటికి ఆమె సంతృప్తికరంగా ఉండలేకపోతుంది. కారణం ఆమెకు కూడా అర్థం కాదు. మొదట ఉన్న ఆసక్తి, ఉత్సాహం ఆమెలో క్రమక్రమంగా తగ్గిపోతాయి. వీటితో పాటు ఇంతవరకు సంతానం కలుగలేదనే ఆవేదన ఆమెలో ఉంటుంది.

ఈ సమయంలో ఇతర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేస్తున్న ప్రసూన మరిది వేణు ఇల్లు చేరుకుంటాడు. తత్త్వశాస్త్రం చదివిన ఇతడు వదిన గారికి కల్గిన చాలా సందేహాలకు సమాధానాలు వివరిస్తాడు. ప్రతిదీ హేతువాదంతో శాస్త్రీయంగా చూడగూడదని అట్లా చూస్తే జీవితాన్ని అనుభవించలేమని అంటాడు. జీవితం మీద ఆసక్తిని పెంచుకోవాలని, కోరికలు తీరినప్పుడు కొత్త కోరికలను పెంపొందించు కోవాలని సూచిస్తాడు. వేణ ప్రవర్తనలో విరక్తితో నున్న ప్రసూనలో జీవితం మీద ఆసక్తి పెరుగుతుంది. తన వివాహం ప్రసక్తి వచ్చినప్పుడు కూడా వదినలాంటి అమ్మాయి కావాలంటాడు.

కొంతకాలం ఇంటివద్ద ఉన్న వేణు ఉద్యోగం కొరకు ఇంటర్వ్యూ అని ఢిల్లీ వెళ్ళిపోతాడు. అప్పుడు తిరిగి ఆమె జీవితంలో నిరాసక్తత ఏర్పడుతుంది. కొన్ని రోజుల తర్వాత వేణు ఢిల్లీ నుండి తిరిగి వచ్చినప్పుడు మళ్లీ ప్రసూన జీవితంలో ఉత్సాహం ఏర్పడుతుంది. మొదటిసారి కంటె చాలా సన్నిహితంగా ఇద్దరు మెదలుతారు. అప్పుడు వేణును గూర్చి ఆమె "భర్త తత్వజిజ్ఞాస పట్టదు. ఏ విషయాన్ని గూర్చి గాని లోతుగా ఆలోచించటం, తర్కించటం హాస్యాస్పదంగా కనిపిస్తుంది. ఆయనకు కనిపించేది జరిగేది జీవితం. అంతకు మించిన ఊహలు, నమ్మకాలు

అనవసరం ఆయన దృష్టిలో. . . వేణు భావుకుడు, తాత్త్వికుడు, ప్రతి విషయాన్ని గూర్చీ ఏదో పరీక్ష చేస్తాడు. అన్వయం కోసం వెదుకుతాడు..." అని ఒక నిర్ణయానికి వస్తుంది.

భర్త వీలు కాదని తెలుపగా ప్రసూన వేణు, అత్తయ్యలతో కలిసి హంపీక్షేత్రాన్ని చూడడానికి వెళ్ళుతుంది. అక్కడి శిథిలాలను చూస్తూ వేణు తన పూర్వజన్మను గుర్తు చేసుకుంటాడు. వేదాంత ధోరణిలో వదిన సందేహాలకు సమాధానాలు వివరిస్తాడు. అక్కడ ఉన్న భూగర్భ దేవాలయాన్ని చూడడానికి ఇద్దరు కలిసి వెళ్ళినప్పుడు భయానకమైన పరిస్థితి ఉన్న గుహవంటి ప్రదేశంలో కనబడిన పామును చూచి భయపడిన ప్రసూన వేణును గట్టిగా చుట్టుకొని అతని వీపున ఆమె ముఖం దాచుకొంటుంది.

త్రాచుపామును చూస్తే మనిషికి భయమెందుకని ప్రసూన వేసిన ప్రశ్నకు వేణు కొత్త ఆలోచనలతో తాత్త్వికంగా "సౌందర్యము, శక్తి, చైతన్యము, మృత్యువు యివన్నీ త్రాచుపాములో మూర్తీభావం పొందుతాయి వదినా, మన మనస్సులో మృత్యుభావనకు సౌందర్యం, చైతన్యం లేదు. అలాగే సౌందర్యభావనకు మృత్యు సంబంధం లేదు. కాని యీ భిన్న ప్రవృత్తుల సంఘర్షణ కాదు. సమీకరణ ఒక్క త్రుటిలో మన అనుభూతికి తెస్తుంది త్రాచుపాము. ఆ అనుభూతి అసామాన్యమైనది. అందుకే అది వెర్రి భయం ! యోగవిద్యలో మనవాళ్ళు కుండలినీ శక్తికి సర్పరూపాన్ని నిర్దేశించడానికి కూడా యిదే కారణమనుకుంటాను." అని సమాధానం చెప్పుతాడు.

ఆ తర్వాత వేణు మళ్ళీ వెళ్ళతాడు. అక్కడి నుండి హరిద్వార్ మొదలైన ప్రదేశాలు చూచి కొంతకాలం తర్వాత వస్తానని ఉత్తరం రాస్తాడు. కాని తిరిగిరాడు. అతడు చనిపోయాడని తల్లి బాధపడుతుంది. కాని ప్రసూన అతడు హిమాలయాల్లో తిరుగుతున్నాడని తప్పక తిరిగి వస్తాడని భావిస్తుంది.

ఈ సంఘటన తర్వాత ప్రసూన గర్భవతి అవుతుంది. తన కుమారునికి వేణు అని పేరు పెట్టుకుంటుంది. పందొమ్మిదేండ్ల కొడుకు కళ్ళముందు తిరుగుతుంటే వేణు 'అమృతుడు' అని ఆనందంగా అనుకొంటుంది.

సమాజంలో వదిన మరిది అనుబంధం గౌరవప్రదంగా ఉంటుంది. వదిన మరిదిని కొడుకుగను, మరిది వదినను తల్లిగను భావించాలని వ్యవస్థ సూచిస్తుంది.

కథలో ప్రసూన మరిదియందు తన భర్త కంటె కూడా అనురాగాన్ని పెంచుకొంటుంది. వేణు తన వాదనకు కల్గిన సందేహాలను తార్కికంగా తీరుస్తూ జీవితమందాసక్తిని కల్గిస్తాడు. వ్యవస్థ నిర్ణయించిన దానికంటే భిన్నంగా అస్తిత్వవాది ఆలోచిస్తాడు. ఇక్కడ ప్రసూనలో అదే విధమైన ప్రవర్తనను వర్ణించి రచయిత అస్తిత్వవాద లక్షణాలకు అనుగుణంగా కథను మలిచాడు.

'నీరు పల్ల మెరుగు' కథను కూడా ఆత్మవంచనకు ఉదాహరణంగా చెప్పుకొనవచ్చు. కథానాయకుడు కృష్ణ మేనమరదలు భవానిని పెండ్లి చేసుకోవాలను కుంటాడు. కాని తనకంటె ఎక్కువ చదువుకుంటాననంటే ఇష్టపడడు. ఈ కారణం వల్ల వారికి వివాహం జరుగదు. కృష్ణ అనసూయ అనే మరొక అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. సంతానం కూడా కల్గుతుంది. వివాహం కాని భవాని తల్లితో కలిసి ఒక రోజు బావయింటికి వచ్చి వెళ్ళుతుంది. గతంలో వలె కన్పించే మరదలు తనను యింకా ప్రేమిస్తుందని భావించిన కృష్ణ హైదరాబాదులో పని ఉందని ఇంట్లో తెలిపి అక్కడ ఉన్న భవాని ఇంటికి వెళ్ళతాడు ఆమెను తనదానిగా చేసుకోవడానికి ప్రయత్నించగా ఆమె తిరగబడుతుంది.

చదరంగం ఆట ఆడుతూ ఆమె చెయ్యిపట్టుకున్న కృష్ణతో "నువ్వేదో మంచివాడివనుకున్నాను" పెళ్ళయింది పిల్లలున్నారు. ఏమిటీ బుద్ధి. నీ పెళ్ళికీ మన బంధుత్వానికీ సంబంధం లేదని నీకు తెలియజేయాలనే సద్భావంతో నీయింటికి అమ్మకు నచ్చచెప్పి తీసుకొచ్చాను. నేను చదువుకుంటానంటె నీకు భయం వేసి నన్ను చేసుకోనన్నావు. అందుకు నేనేం పడి ఏడవలేదే?! ఇప్పుడు నీ బుద్ధి చూపిస్తున్నావు. నాకు పెళ్ళి నిశ్చయమైంది. నన్ను తాకటానికి నీకేమిటి హక్కు? అని కోపగిస్తుంది. అప్పుడు తన ఆలోచనలోని అనౌచిత్యాన్ని గ్రహించిన కృష్ణ యింటికి తిరిగి వచ్చి భార్యతో తృప్తిగా ఉంటాడు.

'పంకజం' కథ సామాజిక సమస్య ఇతివృత్తంగా రాయబడింది. ఇందులో వేశ్యావృత్తితో దీనంగా, హీనంగా జీవితాన్ని సాగించిన 'పంకజం' అను పేరు కల్గిన ఒక సెక్స్ వర్కర్ జీవితం చిత్రించబడింది. ముసలివాడితో పెండ్లి కాగా అది ఇష్టంలేని పంకజం లారీ వెంకయ్యతో లేచిరాగా అతడు ఈమెను వేశ్యావృత్తిని నడుపుతున్న వహిదాబేగమ్‌కు అమ్మి మోసం చేస్తాడు. అక్కడ సంపాదించిన డబ్బు ఆమె చీరలకు,

డాక్టరు బిల్లులకే సరిపోతుంది. వహీదా బేగం ఒక రోజు బలవంతంగా ఆమెను పోలీసు ఇన్‌స్పెక్టరు యింటికి పంపుతుంది. అప్పటి పంకజం బాధ వర్ణనాతీతం. చనిపోయినా బాగుండుననుకొంటుంది. తన దగ్గరికి వచ్చిన కుక్కకు నాలుగు రోజులు అన్నం పెట్టేసరికి అది పంకజం దగ్గరే ఉండిపోతుంది. కుక్క అంటే యిష్టంలేని యజమానురాలు పంకజం లేని సమయంలో బస్తాలో కట్టి బయటపడవేయించగా లారి తగిలి చనిపోతుంది. అప్పుడు పోలీసు ఇన్‌స్పెక్టరు ఇంటికి వచ్చిన పంకజం విషయం తెలిసి చాలా ఆవేదన చెందుతుంది. ఇట్లా ఒక వీధికుక్కకు పంకజం జీవితానికి సమాంతరంగా ప్రతీకాత్మకంగా ఇతివృత్తం మలుపులు తిరగడం ఈ కథలోని ప్రత్యేకత.

పై రెండు కథా సంపుటాలతో పాటు అముద్రితాలుగా ఆర్.ఎస్. సుదర్శనం రచించిన రెండు కథలు సాగర సంగమం, రేగుపండురుచి ఉన్నాయి. 'సాగర సంగమం' కథలో పూరిలో సముద్రం ఒడ్డున ముగ్గురు స్నేహితులు కలుసుకొంటారు. అందులో లక్ష్మీప్రసాదు భౌతికవాదానికి ప్రాముఖ్యం యిస్తాడు. సంగమేశం భావవాదాన్ని సమర్థిస్తాడు. ఈ ఇద్దరి వాదనలను విన్న మూడవవ్యక్తి చావటమెట్లా? అని ఆలోచించే బదులు బతకడానికి మార్గాలు చూడడం మంచిదని సూచిస్తాడు. భావవాదం, భౌతికవాదం రెంటిని వ్యతిరేకిస్తాడు. భావవాదం వికటించి సంగమేశానికి పిచ్చిలేస్తుంది. చివరికి సముద్రంలోపడి చనిపోతాడు. శ్రీమంతుడైన లక్ష్మీప్రసాదు సముద్రం ఒడ్డున స్నానం చేస్తూ అల్లుళ్ళిద్దరూ సముద్రంలో మునిగి పోయారన్న షాక్‌తో చనిపోతాడు కాని తర్వాత అల్లుళ్ళిద్దరు బతుకుతారు చనిపోయిన అతనికి ప్రయోజనం ఏమీ ఉండదు.

జీవన్మరణ రహస్యాల్ని తెలుసుకోవడంతో భావవాదం, భౌతికవాదం రెండూ వ్యర్థమేననీ ఆర్.యస్. సుదర్శనం ఈ కథ ద్వారా సూచిస్తున్నట్లు గమనింపవచ్చు.

'రేగుపండురుచి' కథలో తాత, మనమరాళ్ళ మధ్య ఉండే అనుబంధాన్ని రచయిత వివరిస్తాడు. మనమరాలు రేగుపండ్లు తెచ్చి తాతయ్యను తినుమని యిస్తుంది. వాటిని తింటున్నపుడు బాల్యంలోని అనేక సంఘటనలు అతని స్మృతిలోకి వస్తాయి. అప్పుడు తన స్నేహితురాలు లీలతో కలిసి తిన్న రేగుపండ్లురుచి కూడ గుర్తుకొచ్చి చాలా ఆనందాన్ని పొందుతాడు. రేగుపండు బాల్యానికి సంకేతంగా నిలిచి చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకొనే వీలు కల్పించడంవల్ల తాతయ్య

"అందమైన ఎండ, చెట్టు, పచ్చదనం, రేగుపండురుచీ, చిట్టితల్లి ఆప్యాయతా - అన్నీ వున్నాయి. అది గతం కాదు. యిప్పుడు యిక్కడేవుంది. ఆ లోకం ఈ లోకంతో కలిసే ఉంది. జీవిత రహస్యం బోధపడింది. తనకు ముసలితనం లేదు" అని అనుకుంటాడు.

ఈ విధంగా ఆర్.యస్. సుదర్శనం అస్తిత్వవాదం ప్రధానంగా వ్యక్తి వికాసానికి దోహదపడే అనేక జీవిత రహస్యాలను తాత్త్విక ధోరణిలో తన కథల ద్వారా సమాజానికి అందించడానికి ప్రయత్నం చేశాడు.

*పరిశీలించిన గ్రంథాలు:*


1. మధుర మీనాక్షి కథల సంపుటి - ఆర్.యస్. సుదర్శనం.
2. కాలం తెచ్చిన మార్పు కథల సంపుటి. ఆర్.యస్. సుదర్శనం.
3. సాహిత్య నేపథ్యం వ్యాసావళి - ఆర్.యస్. సుదర్శనం.
4. సాహిత్య వ్యాసాలు, వ్యాసావళి - అంపశయ్య నవీన్

# కాళోజీ కథలు - ఒక పరిశీలన

వి.ఆర్. విద్యార్థి

అన్ని సామాజిక సేవల్లాగే రచనలు చేయడం గూడా ఒక విధంగా సామాజిక సేవేనని విజ్ఞులు చెబుతారు. ఒక ఉత్తరం, స్కెచ్, కథ, నవల, వ్యాఖ్యానం, కవిత్వం లేదా వీటి విలువల్ని తూచే విమర్శ-ఏదైనా కావొచ్చు ఆ ప్రక్రియ సామాజిక సేవలో ఒక భాగమే.

ఒకటి రెండు సంఘటనల్ని అక్షరాల్లో చిత్రించి రచయిత తాను ప్రత్యక్షంగా కనిపించకుండానే తన అభిప్రాయాన్నీ, అభిమతాన్నీ తెలియజేసినప్పుడు అది కథ అవుతుంది. ఒక పెద్ద కాన్వాసును తీసుకుని ఒక కాలంలో జరిగిన అనేక సంఘటనల్నీ, ఉద్యమాల్నీ, మార్పుల్నీ క్రోడీకరించి కథనల్లుతూ తన అభిప్రాయాల్నీ, తాను నమ్మిన సిద్ధాంతాల్నీ తాను పయనించిన తాత్త్విక లోకాన్నీ చెప్పగలిగే రచనను నవలగా చెప్పుకోవచ్చు. ఇందులో చారిత్రక, సాంఘిక, సాంకేతిక మొదలగు సమాచారం ఉంటుంది. ఇంకా అనేకమైన రచనలూ ఉన్నవి.

సుమారు ఒక శతాబ్ద కాలాన్ని చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా ప్రభావితం చేసిన కాళోజీ నారాయణరావు (1914 - 2002) తెలంగాణా జాతిపిత లాంటివారు. వీరి జీవిత కాలమంతా ఉద్యమాల ప్రవాహమే! ఈ ప్రవాహం అనేకానేక కోణాల్లో, అనేక రూపాల్లో సాగింది. వీటిలో రచనా వ్యాసంగము కూడా సాగింది. కథ, కవిత్వం అనే రెండు ప్రక్రియల్లో నడిచిందీ వ్యాసంగం. నిప్పులాంటి కథలు చెప్పినారు. జ్వాలామయమైన కవిత్వం సృజించినారు.

ప్రజా సంబంధాలున్నవారు గనుక ప్రజా ఉద్యమాలు నడిపిన వారు గనుక ఆ ఉద్యమాల ప్రచారానికి ఎక్కువగా కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నవారు గనుక కాళోజీ కథకులుగా కంటే 'ప్రజాకవి'గానే ప్రసిద్ధులయినారు. కథకులుగా కాళోజీ రాసింది రాసిలో తక్కువే, అయినా వాసిలో ఎక్కువేననడానికి నిదర్శనం ఆనాడు అణాగ్రంథమాల తన 24వ ప్రచురణగా 'కాళోజీ కథల'ను, మళ్ళీ ఇటీవల 2000 సంవత్సరంలో వరవరరావుగారు 'కాళోజీ ఫౌండేషన్' పక్షాన ఆ 'కాళోజీ కథలు' రెండోసారి ప్రచురించడం. 'కాళోజీ కథలు'కు ముందు మాట రాస్తూ చివరగా

అన్నమాటలు తెలుగు వాళ్ళంతా గుర్తుంచుకోవలసినవి "కాళోజీ తెలుగుజాతి 87 ఏళ్ళ సంచలన జీవితానికి ఇవి నిలువుటద్దం. తెలుగుజాతి అన్నప్పుడు, అది ఆంధ్రుల ఆత్మగౌరవం అనే ఒక పడికట్టుమాటవంటిదికాదు. కుల లింగ, మత, వర్గ, ప్రాంత వివక్షకు గురయిపీడనకు, అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా బానిసవ్యవస్థకు వ్యతిరేకంగా స్పార్టకస్‌వలె 'నీ బాంచెన్ దొరా' వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణా కట్టుబానిసవలె, ఆకాశంలో గద్దకు వ్యతిరేకంగా తల్లికోడివలె నిర్ఛిద్రపోరాటం చేస్తున్న కాళోజీ మనకళ్ళముందు నడుస్తున్న చరిత్ర".

సరే ఇప్పుడు కాళోజీ కథా ప్రవాహాల్లో ఈదుతూ మాట్లాడుకుందాం.

'కాళోజీ కథలు' 54 పేజీల చిన్నసంపుటి. ఆలోచనలో మగ్నమయిన కాళోజీ ఫోటో ముఖచిత్రంగా, అట్టవెనుక కాళోజీ కవిత 'స్వగతం' అచ్చువేయబడి ఆకర్షణీయంగా ఉంది. పుస్తకం 1/8 డెమ్మీసైజులో. ఆరు పేజీల వరవరరావుగారి ముందుమాట, ఎనిమిది కాళోజీ స్వంత కథలు, ఒక మరాఠీ కథకు అనుసరణ, రెండు మరాఠీ కథల అనువాదాలూ, ఒక ఇంగ్లీషు కథ అనువాదం దీనిలో ఉన్నాయి. 2000లో ప్రచురించిన సంపుటిలో 'భూతదయ' అనేది సంపుటిలోని మొదటి కథ. దీన్ని కాళోజీగారు తన మిత్రులైన వెల్దుర్తి మాణిక్యరావు, అవధానిగారల సహకారంతో రచించినారు.

ఒక గుడిప్రాంగణంలో ఓ రోజు ఎవరో పసికూనను కనివదిలేసి వెళ్ళిపోతారు. పాప ఏడుస్తుంటే జనం చుట్టూ మూగుతారు కాని ఎవరూ అ పాపను ముట్టుకోరు. ఇంతలో ఒక రక్షణాధికారి అక్కడికొచ్చి పాపను చూసి ఎవరైనా ఆదుకొండని ఎంత అభ్యర్థించినా ఎవరూ ముందుకురారు. చివరికి ఒక క్రైస్తవమత గురువు పాపను పెంచుకోవడానికి ముందుకొస్తాడు.

అదే గుడి ప్రాంగణంలో మరొక రోజు ఒక విగ్రహం పడి ఉంటుంది. జనం పోగవుతారు. భక్తితో దండాలు పెట్టుకుంటారు. ఇంతలో ఒక శాస్త్రుల వారు జనాన్ని పక్కకు తోసుకొంటూ మూర్తిని సమీపించి భక్తితో దాన్ని గుండెలకత్తుకుంటాడు. భక్తి గీతాలు ఆలాపించడం ప్రారంభిస్తాడు. జనం స్పందించి డబ్బు ప్రోగుచేసి ఆమూర్తికి ఆలయం కడతారు. ప్రాణమున్న అనాధ శిశువును పట్టించుకోని జనం రాతి విగ్రహానికి మాత్రం నీరాజనం పడతారు. ఇది లోకం పోకడని చెప్పడమే కథలోని ఉద్దేశ్యం.

ఇంతకూ ఆ రాతి విగ్రహం దేవాలయ ప్రాంగణానికి ఎట్లా వొచ్చిందో కథ చదివిన అందరికీ ఇట్టే అర్థమయిపోతుంది.

మరో కథ 'మనమే నయం'లో రెండెడ్ల మధ్య సంభాషణ. జంతుసంరక్షణ సమితివారు ఒక ఉత్సవం ఏర్పాటు చేసి అందులో అనేక జంతువుల్ని అలంకరించి ఊరేగింపుచేస్తారు. ఒక రైతు తన రెండెడ్లను గూడా ఉత్సవంలో పాల్గొనేందుకు తీసుకెళతాడు. ఉత్సవం రోజు తమకు పనిలేకపోవడం వల్ల ఎడ్లు సంతోషిస్తాయి. పరస్పరం మాట్లాడుకుంటూ జంతు సంరక్షణ సమితిని స్థాపించి నిర్వహించే సంపన్న కుటుంబీకులకు జంతువుల గురించి ఏమీ తెలియదని చెప్పుకుంటూ ఇంతగా హడావుడి చేసే ఈ పెద్దమనుషులు తోటి మానవుల్ని మాత్రం జంతువులకంటే హీనంగా చూస్తారని చెప్పుకుని మనుషులకంటే మనమే నయమని అభిప్రాయపడతాయి. సంపన్నులు చేసే పనుల్లో డొల్ల తనం తప్ప మరేమీ లేదని తెలియజెప్పడం ఈ కథ ఉద్దేశ్యం.

'తెలియక ప్రేమ తెల్సి ద్వేషం' అనే కథ ఆలోచింపజేసేది. ఎంతో తాత్వికత ఉందీ కథలో.

భారత స్వాతంత్ర్య సంగ్రామం రోజులో అనేక ఉద్యమాలు వచ్చాయి. స్వాతంత్ర్యానికి కొంచెం ముందు రోజుల్లో కాంగ్రేసువారు ప్రముఖంగా నడిపిన 'హరిజనోద్ధరణ' ముఖ్యమైనది. ఉద్యమంలో హరిజనుల్ని దేవాలయ ప్రవేశం చేయించడం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నారు ఉద్యమ నాయకులు. కానీ దేవాలయాల్నీ హిందూత్వాన్ని అడ్డుపెట్టుకొని బతుకుతున్న అగ్రకులాలవాళ్ళు, ముఖ్యంగా బ్రాహ్మలు ఊర్కుంటారా? ప్రతిఘటించడం జరిగింది. హరిజనులూ, బ్రాహ్మలూ కొట్లాడుకున్నారు. ఘర్షణలో ఒక హరిజనుడు బాగా దెబ్బలు తగిలి ఒక బ్రాహ్మడు తలతెగి మరణిస్తారు. ఇరువురి ప్రాణాల్ని యమదూతలు లాక్కెళ్ళి మధ్యలో ఆగినారు. అప్పుడు రెండు ప్రాణాల మధ్య సంభాషణ. ఎంతో ప్రేమతో, ఆత్మీయతతో ఒక ప్రాణంతో ఒక ప్రాణం సంభాషించడం జరిగింది. ఒకరి వివరాల్ని ఒకరు అడిగి తెల్సుకుంటారు. ఇద్దరూ ఆ 'దేవాలయంలో హరిజన ప్రవేశం' ఘర్షణలో ప్రాణాలు పోగొట్టుకున్నట్లు అందునా ఆ రెండు ప్రాణాలే ఒకర్నొకరు చంపుకున్నట్లు తెల్సుకుని అప్పటిదాకా ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రేమను ఒక్కసారిగా

మరచిపోయి పరస్పరం తిట్టుకోవడం ప్రారంభించినారు. ఎవరేమిటో తెలియనంత వరకు ఏ ద్వేషమూలేదు. తెలియగానే కోపం ద్వేషం పెల్లుబికి దూషించుకోవడం ఇదీ కథా సారాంశం. ఇందులో గొప్ప తాత్వికత ఉంది.

అనాదిగా జరుగుతున్నదిదే! 'గుర్తింపు', 'నామకరణం' వల్లనే అన్ని చిక్కులు. కులాలకూ, వర్గాలకూ, ప్రాంతాలకూ, మతాలకూ అతీతంగా మనిషి ఉండగలిగుతే అంతటా శాంతియే. కాని ఏదీ? ఇది చెప్పడమే ఈ కథరాయడంలోని ఉద్దేశ్యం.

మరోకథ 'లంకాపునరుద్ధరణ' ఇది చరిత్ర గమనం ఎట్లా ఉంటుందో తెలియజేసేది. సార్వకాలీనమైనది. కానైతే రామాయణంలోని చివరి ఘట్టమే కాని పురాణగాథేగాని ఇది నిన్న జరిగిన యుద్ధానికి వర్తిస్తుంది. యుద్ధానంతర పరిస్థితులను చెప్తుతుంది. ఈ కథ చదివితే ఇరాన్, ఇరాక్ యుద్ధం గుర్తొస్తుంది. బంగ్లాదేశ్ విమోచన యుద్ధం గుర్తొస్తుంది. మళ్ళీనిన్నటి అఫ్గాన్, ఇరాక్‌లో జరిగిన మారణకాండ గుర్తొస్తుంది. కథలో రావణసంహారం పిదప లంకకు ఎవరిని అధిపతిని చేయాలనే సంశయంలో రాముడు, అతని అనుయాయులు ఆలోచనపడి, విభీషణుడు అప్పుడే అధికారం చేపట్టే పరిస్థితిలేదని వానర ప్రముఖులకు అప్పజెప్తుతారు లంకను. వానరులు లంకను కొల్లగొడుతారు. అనేక రకాల దోపిడీ దౌర్జన్యం జరుగుతుంది. ఈ పరిస్థితిని విభీషణుడు రాముడి దృష్టికి తేగానే విచారణ జరిపిస్తాడు రాముడు. వానరులు ఇదంతా మైరావణాది రాక్షసుల కుట్ర అనీ, లంక ప్రశాంతంగానే ఉందనీ వాదిస్తారు. కాని లంక పరిస్థితి ఘోరంగా ఉందని స్వయంగా గుర్తించిన విభీషణుడు మళ్ళీ రాముడి దృష్టికి తేవడం వల్ల ఇక తప్పదనుకున్నాడో ఏమోగాని తానే స్వయంగా వెళ్ళి లంక పరిస్థితుల్ని చక్కబరచి విభీషణునికి పట్టంకడతాడు. ఇదీ కథ. ఈ కథ చదివితే మనకు వెంటనే 1948 సెప్టెంబర్ 17 హైదరాబాద్ రాష్ట్రపరిస్థితులూ యావద్ భారతదేశ పరిస్థితులూ గుర్తుకొస్తాయి.

'ఆగస్టు పదిహేను' కథలో మనదేశ స్వాతంత్ర్యం కోసం గాంధీతోబాటు ఎందరో కాంగ్రెస్ నాయకులు ఎన్నోత్యాగాలు చేయడం (ఇతర పార్టీలవాళ్ళూ చేసినారు) స్వాతంత్ర్యం రాగానే త్యాగమూర్తుల్ని పక్కకునెట్టి కాంగ్రెస్‌లోని స్వార్థపరులైన నాయకులు తమ అనుయాయులు అసమర్థులైనా వారికే అనేక ఉన్నత

స్థానాల్లో అధికారం కట్టబెట్టి తమ పెత్తనం చెలాయిస్తూ వచ్చినారనేది (ఇది నగ్న సత్యమే!) చెప్పడం జరిగింది.

'రెండు గింజలు' కథలో నిరాశావాదం ఆశావాదం ఈ రెంటిలో మనుగడకు ఏది మంచి చేస్తుంది. ఏది చెడు చేస్తుంది. అనే విషయాన్ని రెండుగింజల సంభాషణ, ప్రవర్తన ద్వారా చెప్పడం జరిగింది.

'అనుభవం లేని ఆందోళన' అనే కథలో చీకట్లో కళ్ళు తెరిచిన గుడ్లగూబ వెలుగు కిరణాల్ని చూసి తట్టుకోలేక అరుస్తుంది. సూర్యోదయాన్ని ఒక ఉపద్రవంగా ఎంచి గోలపెడుతుంది. గ్రహణం పట్టి సూర్యుడు కనిపించకపోతే అది తన ప్రతిభవల్లే అని గంతులేస్తూ అన్ని పక్షులూ, తమ జాతి పక్షులూ తనను అందలమెక్కించాలని అనుకుంటుంది. కోరుతుంది. కాని ఏ పక్షీ దాన్ని ఖాతరుచేయదు. అన్ని పక్షుల్ని తిడుతున్న గుడ్లగూబ గ్రహణం విడిచిన సూర్యుడు మళ్ళీ ప్రకాశవంతంగా కనిపించగానే భంగపడి, భయంతో గూటినుండి కింద పడిపోతుంది. మూర్ఖుల మనస్తత్వానికి అద్దంపట్టే కథ ఇది. మరాఠీ కథకు ఈ కథ అనుసరణ.

'జాజితీగ' అనే కథ మరాఠీ కథకు అనువాదం. తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో పెంచుకున్న ఆశలూ, పిల్లల అభిరుచుల్నీ తెలియజేసే కథ ఇది. ఒక తండ్రి తనకూతురుకు ఒక చక్కని సంబంధం తీసుకొస్తాడు. కాని కూతురు మాత్రం తమ దగ్గర వారాలు చేసుకొని చదువుకునే అబ్బాయిని ప్రేమిస్తుంది. అతడితోనే జీవితాన్ని పంచుకోవాలని సన్నిహితంగా ప్రవర్తిస్తుంది. ఇది గమనించిన తండ్రి నిరుత్తరుడవుతాడు. ఈ సన్నివేశాన్నే జాజితీగను పొగడచెట్టు పాకించాలనుకుంటే జాజితీగ మాత్రం ఎండిపోయిన రేగు మొద్దును మాత్రమే అల్లుకుంటుంది. జాజితీగను తన కూతురితో పోల్చడం జరిగింది.

'అపోహ' అనే కథ ఆంగ్లానువాదం. ఇతివృత్తం చిన్నదే నాణాలు సేకరించే అతడు వోడలో ప్రయాణం చేస్తున్నప్పుడు తోటి ప్రయాణీకులకు తాను సేకరించినవి చూపిస్తూ ఒక అరుదైన నాణాన్ని పోగొట్టుకుంటాడు. సేకర్త తన నాణెంకోసం అందరి జేబులూ వెదుకుతాడు. ఒక ఇంగ్లీషు జెంటిల్మన్ తన జేబును వెదకనీయడు. అట్లావెదికితే ఘనత వహించిన తన దేశానికే పరువు నష్టం అని తన క్యాబిన్‌లోకి

వెళ్ళిపోతాడు. మరునాడు ఆ అరుదైన నాణెం ఒక పిల్లవాడికి దొరకగా దాన్ని తెచ్చి పోగొట్టుకున్న అతడికి ఇస్తాడు. అందాకా ఇంగ్లీషు జెంటిల్మన్ పై అనుమానపడ్డ అతడు వెళ్ళి తన జేబు ఎందుకు వెదకనివ్వలేదో అడుగుతాడు. అప్పుడు ఆ జెంటిల్మన్ నాణేల సేకర్త పోగొట్టుకున్న అరుదైన నాణెంవంటిదే తన దగ్గర ఉందనీ, వెదికితే అదే నాణెం కనిపించినా అది తనదేనని సేకర్త శంకించే అవకాశముండి తాను దొంగగా ముద్రపడే ప్రమాదముంది గనుక తన జేబుల్ని వెదకనీయలేదంటాడు. కథ అనువాదం చాలా బాగా సాగింది.

'విభూతి లేక ఫేస్ ఫౌడర్' అనే కథ ఒక సెటైర్. వంగ్యంతో కూడుకుని ఈ కథ పాఠకుల్ని బాగా నవ్విస్తుంది.

ఈ సంపుటిలోని కథలు కొన్ని పూర్వపు లాటిన్ అమెరికా కథల్లాగే ఉన్నవి. పశుపక్ష్యాదులు పాత్రలై జీవిత సత్యాల్ని వెల్లడిస్తాయి. మన సాహిత్యంలోని పంచతంత్ర కథల్లాగా గూడా అనిపిస్తాయి. 'దివాంధ', జాజితీగె, కొనమెరుపు అనే మూడు కథలు అనువాదాలే అయినా శీర్షికలతో సహా రచయిత స్వంత కథల్లాగే తోస్తాయి. ఇవి కాళోజీ అనువాద నైపుణ్యాన్ని తెలియజేస్తున్నాయి.

ఒకవేళ కాళోజీ కథలు, నవలలు రాయడంపై దృష్టిసారించి ఉంటే ఎన్నో విలువైన రచనలు సృజింపబడేవి. కాని ప్రజా ఉద్యమాల్లో తలమునకలైన కాళోజీకి సమయమేది?

కాళోజీ రచించిన ఈ కొద్ది కథలు తెలుగుకథా సాహిత్యంలో ఆణిముత్యాలని చెప్పవచ్చు.

# బి.ఎస్. రాములు కథలు - ఒక విశ్లేషణ

కర్రె సదాశివ్

బి.ఎస్. రాములు పూర్తి పేరు బేతి శ్రీరాములు. ఆధునిక సామాజిక తత్త్వవేత్తగా, ప్రఖ్యాత కథా రచయితగా తన రచనల ద్వారా సుప్రసిద్ధులు. వీరి కథలు తెలంగాణ ప్రజల జీవన సరళిని, సామాజికాంశాలను, చరిత్రను నిక్షిప్తం చేస్తున్న కాలనాళికలు. వీరి కథలు, నవలలు వ్యాసాలు వందేళ్ళ సామాజిక జీవితాన్ని మనకు సాహిత్య రూపంలో అందిస్తున్నాయి. భారతీయ చారిత్రక భౌతికవాద సిద్ధాంత వేత్తగా పలు రచనలు చేశారు.

వీరు 150కి పైగా కథలను రూపొందించినారు. 100కి పైగా కథలు కథాసంపుటాలుగా ముద్రించినారు. సుమారు 25 కథా సంకలనాలను వీరి కథలు అలంకరించాయి. చిన్నయసూరి 'బాల వ్యాకరణం'లా తెలుగు కథకులకోసం 'కథలబడి-కథా సాహిత్య అలంకారశాస్త్రం'ను 'వెలువరించినారు. '50 ఏళ్ళ తెలుగు కథా తీరుతెన్నులు' విమర్శనాత్మకంగా సమీక్షించి వెలువరించినాడు. విమర్శకుల కోసం 'కన్యాశుల్కం'ను ఇప్పుడెలా చూడాలి' రూపొందించినారు.

'నేను పరిశీలనలోకి తీసుకున్న కథాసంపుటాలు. 'పాలు', 'స్మృతి' 'మమతలు మానవ సంబంధాలు' 'వేపచెట్టు' 'బతుకుపయనం. కథాసంపుటాలను విశ్లేషించాను. భారతీయ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక, చారిత్రక పరిణామాల్ని బి.ఎస్. రాములు తన కథల్లో సంక్షేపించారు.

## 1. గ్రామీణ భూస్వామ్య కులవ్యవస్థ - ప్రజల మధ్య సంబంధాలు:

బి.ఎస్. రాములు కథలు గ్రామానికి, చిన్న పట్టణాలకు మధ్య వారధి నిర్మిస్తాయి. భూస్వామ్య వ్యవసాయ సమాజం, మధ్యతరగతి సమాజం పరస్పరం ప్రభావితమవుతున్న తీరును ప్రధానంగా చేసుకున్నారు. కులవృత్తులు గిట్టుబాటు కాకుండా పోవడం వల్ల పెరుగుతున్న వలసలు, సృష్టిస్తున్న పరిణామాలు వీరి కథల్లో మరో ప్రధానాంశం. 'స్మృతి' కథల సంపుటిలో 1970 నుండి 1997 వరకు తెలంగాణ సమాజంలోని చారిత్రక ఘటనలను కథా వస్తువులో విలీనం

చేశారు. ఎక్కడా మనకు చరిత్ర చెబుతున్నట్లు కనపడదు. భూస్వామ్య వ్యవస్థ క్రమక్రమంగా మారుతున్న తీరును ఈ కథల్లో చూడవచ్చు. విప్లవం తెచ్చిన మంచి పరిణామాలను 'స్మృతి' కథలో చక్కగా చిత్రించారు. అదే సమయంలో విప్లవకారులుగా మారే ఉత్తేజాన్ని 'వైరుధ్యాలు' కథలో విశ్లేషించారు. 'ప్రేమ' కథలో విద్యార్థులు, యువతరం విప్లవకారులుగా మారాలనే కాంక్షను వ్యక్తపరిచారు. "దక్షయజ్ఞం' కథలో పేద కులాలనుండి విప్లవంలో చేరిన వారికి అభివృద్ధికి బదులుగా జీవితం ఓడిపోయే క్రమాలు ఇచ్చిన విప్లవ వ్యూహం ఎత్తుగడలను సమగ్రంగా చిత్రించారు. విప్లవోద్యమానికి ప్రధాన కారణం 1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వచ్చినప్పుడు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుచేయకపోవడమే అని స్పష్టం చేస్తారు. తెలంగాణలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యే జై తెలంగాణ ఉద్యమానికి, నక్సలైట్లు ఉద్యమానికి ప్రధాన కారణమని ఆంధ్ర వలసవాదులు అన్నిటినీ ఆక్రమించుకోకపోతే తెలంగాణ ప్రాంతంలో సామాజిక పరిణామాలు శాంతియుతంగా సాగివుండేవని విపులంగా వివరిస్తాడు. అందుకు బి.ఎస్. రాములు జీవితమే ఒక తార్కాణం.

'సదువు' కథలో విప్లవం గురించిన తన అభిప్రాయాలను దగ్గరగా వుండే ఈ వాక్యాలను ఒక పాత్రచేత అనిపిస్తాడు. "విప్లవం అనేది నీ కోరిక. నీ కోరికను ప్రజల కోరికగా మార్చాలన్నదే సిద్ధాంత పోరాటమంతా ! నీ కోరికల్ని ప్రజలమీద రుద్దుతున్నావు. ప్రజలుకొందరు ఔననడంతో అది ప్రజల కోరిక అని మభ్య పెడుతున్నావు. నీవు ప్రజలకోసం పనిచేయడం అంటే ఏమిటి? నీకంటూ నీకే కోరికలూ లేని స్థితికి నీవు చేరుకుంటున్నప్పుడు కదా నువ్వు ప్రజలకోసం పనిచేయడం సాధ్యపడేది? అంటే నీ కోరికల్ని నీవు జయించావా? నీ మనస్సును నీవు జయించావా?" అని ప్రాచీన బౌద్ధ తాత్విక దృష్టితో గంగాధరి వేసే ప్రశ్నలు పాశ్చాత్య తాత్విక దృక్పథంతో పనిచేసే ఉద్యమకారులను ఆశ్చర్యంలో పడవేస్తాయి.

'స్మృతి' కథలో వెనకటి సమాజం ఎలా వుండేదో దుబ్బక్క మాటల్లో వివరంగా చిత్రించారు. భూస్వామ్య సమాజం మారుతున్న క్రమాన్ని 'మెరుగు' 'తెల్లబట్ట' కథలు అపూర్వంగా చిత్రించాయి. విప్లవం చేయని వారిలో విప్లవ ప్రభావం తెచ్చిన పరిణామాలు ఈ కథల్లో కనబడుతాయి. ఇలా వ్యవసాయ, భూస్వామ్య సమాజం, సంస్కృతి వాటి పరిణామాలు, తాత్విక నేపథ్యం ఆర్థిక నేపథ్యం, వాటి

కుల పునాదితో సహ సమగ్రంగా 'స్మృతి' కథల సంపుటి మనముందుంచుతుంది. అందువల్ల ఇది కేవలం కథల సంపుటికాదు. ఇది సామాజిక చరిత్రను పునర్మిస్తున్న సామాజిక, చారిత్రక కథనం.

'దక్షయజ్ఞం' కథలో భూమిపై మొదట ఎవరి యాజమాన్యం లేదని 1840 నుండి 1860ల మధ్యకాలంలో బ్రిటీష్ వారి వలస పాలన కింద పన్నుల వ్యవస్థ కోసం పెట్టిన బిల్‌కలెక్టర్లు భూస్వాములుగా, జమీందార్లుగా ఎదిగారని స్పష్టంచేస్తారు. ఇలా భూస్వామ్య వ్యవస్థ ఇటీవలే పుట్టి పెరిగిందని తెలుపుతారు. ఇంతదాకా భూస్వామ్య వ్యవస్థ వేల ఏళ్ళ నుంచి ఉందని చెబుతున్న చరిత్రను పూర్వపక్షం చేస్తారు. భారతదేశంలో అతిపెద్ద రాజ్యమైన నైజాంరాజ్యంలో భూమిపన్ను, పంటపన్ను వసూలు చేయడానికి పెట్టుకున్న యంత్రాంగం భూస్వాములుగా, జమీందారులుగా, దోపిడీదార్లుగా, స్థానిక పరిపాలకులుగా మారడాన్ని, తెలంగాణా భూస్వామ్య సమాజాన్ని, దాని పుట్టుపూర్వోత్తరాలను, సమాజంతో భూ సంబంధాలను మారిన క్రమం వీరి కథల్లో కొత్త కోణాల్లో చిత్రించబడ్డాయి.

## 2. నీటి పారుదల ప్రాజెక్టులు - ప్రజల చరిత్ర పరిణామాలు

బి.ఎస్.రాములు కథల్లో పంచవర్ష ప్రణాళికల వల్ల గ్రామీణ సమాజంలోని అగ్రకులాలే లాభపడ్డారు. పేదలు వున్న వృత్తులు కోల్పోయి మరింత పేదలయ్యారు, కూలీలయ్యారు. వారికి ఇటు ఆధునిక అభివృద్ధి అందలేదు. అటు పాతవృత్తులు పనికి రాకుండాపోయాయి. ఈ క్రమాలనుండి చదువుకొని మధ్య తరగతిగా ఎదుగుతున్న శ్రేణులను కూడా మార్పు, బందీ, తల్లిసాలు పిల్లడు, దుస్తులు, గాడిద కథల్లో చిత్రించినారు.

స్వాతంత్ర్యానంతరం కొన్ని వ్యవసాయ కులాలు ఎలా ఎదిగి ధనికులుగా కాంట్రాక్టర్లుగా మారినారో 'స్మృతి' 'వారసత్వం' కథల్లో చిత్రీకరించారు. చేతివృత్తి కులాలవాళ్ళు చదువుకొని చిన్న చిన్న ఉద్యోగాలు సంపాదించుకొని మధ్య తరగతి కుటుంబాలుగా ఎదిగిన క్రమాన్ని కూడా ఈ కథలో చిత్రించారు. అదే సమయంలో సన్నకారు రైతులు పల్లెటూళ్ళలో ఎలా చితికిపోతూ వస్తున్నారో 'వరుసలు' కథలో చిత్రించారు.

'వరుసలు' కథలో నూనె గానుగలు నడిపేవాళ్ళు, వ్యవసాయం చేసేవాళ్ళు. భూమిని నమ్ముకున్నవాళ్ళు, కాలక్రమంలో నూనె మిల్లులవల్ల, పరిశ్రమలవల్ల,

వ్యాపార పంటలవల్ల పూర్తిగా చితికిపోయారు. ఒకప్పుడు పల్లెటూరు పిల్లని పట్టణానికి ఇవ్వడానికి భూమిలేదు. వ్యవసాయంలేదు. ఇంటిముందు స్థలంలేదు. అని పల్లెటూరివాళ్ళు నిరాకరించేవాళ్ళు. కాలక్రమంలో పట్టణంలో ఉండేవాళ్ళు కాస్త చదువుకొని ఉద్యోగాలు సంపాదించుకొని మధ్యతరగతిగా ఎదిగారు.

50 ఏళ్ళలో పరిస్థితి తిరగబడింది. ఇప్పుడు పల్లెటూరి పిల్లల్ని పట్టణాల పిల్లలు చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. ఈ పరిస్థితి 'వరుసలు' కథలో చూస్తాము. చదువుకుని బావ ఎదగడం, తను బీడీ కార్మికురాలిగా, తన భర్త మిల్లు కార్మికుడుగా మిగిలిపోవడం సరవ్వను కలచివేస్తుంది.

"ఏమైనా బావా! నాయనా అవ్వా ఒకరేమిటి మా యీ పల్లెల్లో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికిన వాళ్ళున్నారు గానీ బాగుపడ్డవారు లేరు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరతలేదు. కాని జంతువులు కూడా ఏదో తిని బతుకుతాయి. మా మీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఃఖాలననుభవిస్తున్నారు. మేమేమో వెనుకబడిపోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాలకోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అందుకే నువ్విట్లా ఎర్రగా బుర్రగా నునుపుతేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు" అంటే వ్యవసాయదారులు పేదరికంలో మగ్గిపోతున్న తీరును, చదువుపట్ల అశ్రద్ధ వల్ల వ్యవసాయం గిట్టుబాటుగాక, ఇతర ప్రాంతాలకు కూలీలుగా, కార్మికులుగా వలసలు సాగించిన తీరును, అరబ్‌దేశాలకు కూడా వలసలుగా పోయిన ఎందరినో కథల ద్వారా చూపిస్తారు.

వ్యవసాయ గ్రామీణ అగ్రకులాలు, పట్టణాల్లోని మధ్య తరగతి కుటుంబాలు, పారిశ్రామిక అభివృద్ధితో ఎదుగుతున్న వర్గాలు విద్యావంతులైనవారు, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకున్న అగ్రకులాలు ఎదగడానికి వ్యవసాయంలో పంచవర్ష ప్రణాళికలే కారణం. అవి ఇతర కులాలకు సరిగ్గా అందకపోవడానికి కూడా అవే కారణమని ఈ కథల ద్వారా రచయిత నిర్ధారిస్తారు.

ఇలాంటి క్రమంలో అగ్రకుల స్త్రీలు ఫెమినిజం సిద్ధాంతాలను ధరించి సమాజంలో స్త్రీలకు సమాన హక్కులు కావాలని వచ్చారని 'మమతలు' 'ప్రేమికులు' 'మలుపులు' 'ఐదవవాడు' కథలు స్పష్టం చేస్తాయి. బి.సి.లకు 1932 నుండి

రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే ఇప్పుడు ఎదిగిన అగ్రకులాలతో బాటుగా బి.సి.లు కూడా ఎదిగి ఉండేవారని 'మమతలు' కథ ప్రతిపాదిస్తుంది. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్‌లు వారివి వారికి పోగా అగ్రకులాలు అదనంగా అనుభవించేదంతా బి.సి.లకు చెందాల్సిందే. దాన్ని బి.సి.లకు దక్కనీయకుండా రాజకీయాలు, పంచవర్ష ప్రణాళికలు ఎలా చేస్తాయో 'మమత' 'రాజకీయం' కథలు చిత్రించాయి.

భూమి ఎవరిది వారికి ఇప్పించకుండా, భూసంస్కరణలు అమలు జరపకుండా పంచవర్ష ప్రణాళిక ద్వారా, నీటి ప్రాజెక్టుల ద్వారా, స్వాతంత్ర్యం అనంతరం జరిగిన అభివృద్ధి వందేళ్ళ క్రితమే అన్యాయంగా స్వంతం చేసుకొని ఎదిగిన భూస్వామ్య దోపిడి కులాల ఎదుగుదలకే మరింత ఉపయోగపడ్డాయి. ఏమీలేనివాళ్ళు కూడా ధనిక రైతులుగా ఎదగడం ప్రారంభమైంది. ఆ తరువాత వాళ్ళు అన్ని రంగాలను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకుని రాజకీయ ఆర్థిక రంగాల్లో ఎదిగి స్థిరపడ్డారు. ఈ కథల్లో నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా నీళ్ళు అందిన భూముల వాళ్ళు భూస్వాములుగా, ధనిక రైతులుగా మారిన క్రమాన్ని తెలుసుకోవచ్చు. 'మమతల' కథలో దశాబ్దాల స్నేహం సరవ్వ, కాంతయ్యల పెళ్ళి జరగకుండా పోవడానికి కులాలు, ప్రాజెక్టులవల్ల జరిగిన అభివృద్ధి ఎలా కారణమైందో చూడవచ్చు.

## 3. దళితుల జీవితం-విద్య-సామాజిక పరిణామాలు

బి.ఎస్.రాములు కథల నిండా దళితుల జీవితం విస్తారంగా పరచుకొని ఉంటుంది. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రజల జీవితాలను అధ్యయనం చేస్తూ కథలుగా, సైద్ధాంతిక వ్యాసాలుగా మలుస్తూ వేలాది ప్రసంగాలు చేశారు. దళిత వాదకోణంలో మానవతా వాదాన్ని ప్రధానం చేసి చిత్రించిన దళిత కథలు వీరివి. వీరి దళిత కథా వస్తువులో మొత్తం సమాజం అద్దంలో కొండలా కనబడుతుంది. ఆధునిక విద్యలందుకున్న దళితుల గురించి, అందుకోలేక పోతున్న దళితుల గురించి చేయూత, వేపచెట్టు, రియల్ ఎస్టేట్, అయిదవవాడు కథల్లో అనేక కోణాల్లో చిత్రించారు. విప్లవాల్లో దళితులు ఓడిపోతున్న తీరును "దక్షయజ్ఞం" కథలో చిత్రించారు. చదువుపట్ల పేదలకు గల ఆర్తిని 'పాలు' 'బడి' కథల్లో చిత్రించారు. చదువుకొనే దళిత విద్యార్థులు విప్లవం వైపు ఎలా ఆకర్షితులయ్యారో సామాజిక పరిణామాలకు ఎలా కారకులయ్యారో 'సహజాతాలు' కథలో చిత్రించారు.

వ్యవసాయ కూలీలు, పాలేర్లు, పనిమనుషులు మధ్యతరగతిగా ఎదగాలని, మంచి చదువు చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలని ఎన్నోకలలు కన్నారు. అలాంటి తల్లుల కలలను 'పాలు' కథలో చూడవచ్చు. చదువుకొని బాగుపడాలనుకునే విద్యార్థుల గురించి 'బడి' సహజాతాలు, వేపచెట్టు, 'చేయూత' రియల్ ఎస్టేట్ 'బందీ' 'మార్పు' 'సదువు' 'తల్లిసాలుపిల్లడు, కథల్లో చిత్రించారు.

దళితుల జీవితాలు బాగుపడాలని ఎన్నో ఆశలు 'పెంచుకుని, అంబేద్కర్ రాజకీయ, ఉద్యోగ, విద్యారంగాల్లో రిజర్వేషన్లు సాధించారు. దానివల్ల కొందరు ఎదగడానికి అవకాశం చిక్కింది. కాని అందరూ ఇంకా ఎదగవలసి ఉన్నది. విద్యావ్యవస్థ. పాఠ్య ప్రణాళికలు, పరిసరాలు అందుకు అనుకూలంగా లేవు. ఈ విషయాల్ని 'బడి' 'పాలు', సహజాతాలు, 'సదువు' చేయూత, 'వేపచెట్టు' కథలు చిత్రించాయి.

'బందీ' 'రియల్ ఎస్టేట్' 'మార్పు' 'దుస్తులు' 'గాడిద' 'తల్లిసాలుపిల్లడు' 'తెల్లబట్ట' 'మలుపులు' 'ప్రేమికులు' 'అయిదోవాడు' మొదలైన కథలు, చదువు ద్వారా పైకొచ్చిన బి.సి. ఎస్సీ కులాల మధ్యతరగతి గురించి, విద్యావంతుల గురించి వారు సంస్కృతిలో, అవగాహనలో మారుతున్న తీరు గురించి చిత్రించారు.

అయితే విద్య, ఉద్యోగం, ఆర్థికఅంతస్తు, వారి కులంపట్ల ఉన్న చిన్నచూపును పోగొట్టుకోలేకపోయాయని 'బందీ' 'రియల్ ఎస్టేట్' 'తెల్లబట్ట, కథలు స్పష్టం చేస్తాయి. అందువల్ల కుల అంతరాలను తొలగించే కృషి చేయని మార్క్సిస్టులు అంతిమంగా అగ్రకులాలకే మేలు చేస్తారని 'రియల్ఎస్టేట్' కథలోని ఒక పాత్ర ద్వారా వివరిస్తారు. భారతదేశంలో చారిత్రక భౌతికవాదం ఎలా ఉండాలో ఆ పాత్ర ద్వారా స్పష్టం చేస్తారు.

"రియల్ ఎస్టేట్' వ్యాపారమంటే చాలామంది యిళ్ళు జాగల వ్యాపారం అంతేగదా! అనుకుంటారు. 'రియల్ ఎస్టేట్' వ్యాపారమంటే మానవ సంబంధాల్ని వ్యాపారంగా మార్చుకోవడం. మనుషులున్నచోట మానవ సంబంధాలున్నచోట రద్దీ పెరుగుతుంది." అంటూ మానవ సంబంధాలు వ్యాపారమయం అవుతున్న తీరును తెలుపుతారు.

"అంబేద్కర్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త కావడంవల్లే కుల నిర్మూలనా తత్త్వవేత్తగా ఎదగడం సాధ్యమైందనే విషయాన్ని తానే కనుక్కున్నంత సంబరపడిపోయాడు

మల్లయ్య. కుల నిర్మూలనా తత్త్వవేత్త కాకుండా ఎవడూ గొప్ప ఆర్థికవేత్త కాలేడీ ఈ దేశంలో అని మల్లయ్య యిప్పటి విశ్వాసం. ఏమంటే కులవ్యవస్థ గొప్ప అర్థశాస్త్రం కూడా" అంటూ మల్లయ్య పాత్ర ద్వారా తెలియజేస్తాడు. చదువు వల్ల సామాజిక అభివృద్ధి కలిగి తద్వారా కులవ్యవస్థ మారిపోయి, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని 'స్మృతి' 'బందీ' రియల్ ఎస్టేట్, 'మార్పు' కథల్లో చర్చించి తీవ్రంగా ఆలోచింపజేస్తాడు రచయిత.

ఇంకా దళితుల ఎదుగుదల క్రమంలో వారు ఎదుర్కొంటున్న పరిస్థితుల పరిణామాలున్నాయి. 1977 నుండి తెలుగునాట సామాజిక జీవితంలో వస్తున్న పరిణామాలు చదువు. ఆర్థిక అసమానతలు. అవి రూపాంతరం చెందుతున్న తీరు తెన్నులు, రిజర్వేషన్లు ఉన్నప్పటికీ అందుకోలేని అవరోధాలు, భావజాల రంగంలో వస్తున్న పరిణామాలు మొదలైనవి చిత్రిస్తూ ఒక క్రమంలో పాలు-చదువు, సహజాతాలు కథల్లో చెప్తూ, 25 ఏళ్ళలో ఇక్కడి సమాజంలో ఏమేమి మార్పులు వచ్చాయో, ప్రజలు ఎలా అభివృద్ధి చెందారో, ఎలా అభివృద్ధి చెందలేకపోయారో ఈ కథలు స్పష్టం చేస్తాయి. 'పాలు' 'బడి' కథలు 1977లో తెలంగాణలో విప్లవోద్యమం ప్రారంభమైనపుడు ప్రజల జీవితాల్లో అవగాహనల్లో వస్తున్న చైతన్యం, మార్పులను చిత్రీకరించడం జరిగింది. దళిత బహుజనులు చదువుకోవాలనే ఆరాటాన్ని ఈ కథలు చిత్రించాయి. 'సహజాతాలు' కథ ఆ క్రమంలో విద్యార్థులు విప్లవకారులుగా మారడాన్ని తెలియజేస్తాయి.

విప్లవ రంగంలోకి కార్యకర్తలుగా ఎదగాలనుకున్న విద్యార్థిని స్త్రీవాద దృక్పథంతో అలా మారాల్సిన అవసరం లేదని జీవితాన్ని గెలుచుకోవడం. మార్చుకోవడం పరోపకారం ముఖ్యమని, మారిన క్రమాన్ని 'ప్రేమ' కథలో ఒక మాజీ నక్సలైటు తన మరదలు అరుణ జీవితాన్ని చెప్తూ "అరుణ తనను తాను తెలుసుకోవడంలో చలం పాత్ర ఎక్కువా? రంగనాయకమ్మ పాత్ర ఎక్కువా? ఓల్గా పాత్ర ఎక్కువా? స్త్రీవాదమే ఆమెను నా అంచనాలకు భిన్నంగా ఎదిగేట్టు చేసిందా?" అంటూ ఈ కథలోని మాజీ నక్సలైటు అయిన జర్నలిస్టు అభిప్రాయపడుతాడు.

'సదువు' కథ ప్రస్తుత విద్యావ్యవస్థ గ్రామీణ మెజారిటీ ప్రజల జీవితాలకనుగుణంగా లేదని తెలియజేస్తుంది. 'సదువు' కథలో లచ్చయ్యసారు తన శిష్యుడు గంగాధరి చదువుకోనని మొండికేయడంతో ఓదార్చి మనసులో "అయినా

పాఠాలను అందుకోగలవాడే తన స్వేచ్ఛకేదో అడ్డంకిగా ఈ చదువు నోట్సూ మారిందనుకున్నాడు. ఈ పాఠ్య పుస్తకాలు పట్టణవాసపు అగ్రకులాల మధ్య తరగతి పిల్లలకోసం రాసినట్టుంటాయి. పల్లెటూరి పిల్లలకు అందునా దళితులకు అవి ఏమాత్రం ఆసక్తిలేని విధంగా ఉంటాయి. చిన్నప్పుడు తాను ఎదుర్కొన్నదీ సమస్య" అంటూ విద్యావ్యవస్థ గ్రామీణ మెజారిటీ ప్రజలకు, దళితులకు ఆసక్తికరంగా లేకపోవడాన్ని  తెలుసుకోవచ్చు.

'చేయూత' కథలో ఇంజనీర్ కావాల్సిన దళిత విద్యార్థిని ఉపాధ్యాయురాలిగా మారిన తీరును తెలుపుతుంది. "చాలా ఆనందంగా ఉంది మేడం. టీచర్ ఉద్యోగంలో యింత తృప్తి, జాబ్ సాటిస్ఫాక్షన్ ఉంటుందని టీచర్ అయ్యాకే తెలిసింది. ఇంజనీర్ కాలేకపోయాననే చింత తగ్గుతుంది." అంటూ హాస్టల్ మాట్రాన్ లలితతో అరుణ అంటుంది. ఈ ఆధునిక విద్య డబ్బుమయమైపోయి పేదలకు అందుబాటులో లేకపోవడం వలన తనకన్న తక్కువమార్కులు తెచ్చుకున్నవాళ్ళు కోచింగ్‌లతో సీట్లు సంపాదించి, ఇంజనీర్లై అమెరికాకు వెళ్తుంటే ఈ డబ్బుతో చదువు కొనుక్కొనే పోటీల్లో పోటీపడలేని విద్యార్థులు కృంగిపోయి గెలుచుకోగలిగే జీవితాన్ని కూడా ఎలా ఓడిపోయారో 'వేపచెట్టు' కథలో చూడవచ్చు. "మహేష్! నువ్వా! నువ్వు ఇంజనీర్‌వి కాలేదా? ఇంతముసలివాడిలా అయిపోయావేంది? అసలేం జరిగింది" అంటూ రాజేశ్వర్‌రావు ఆశ్చర్యపోతాడు 'చేయూత' కథలో.

దళితులు రిజర్వేషన్ల ద్వారా అభివృద్ధి అందుకోవాలని ప్రైవేటీకరణ వల్ల గ్లోబలైజేషన్ వల్ల పేదవారికి జరిగే నష్టాలను చెప్పి గెలుచుకున్న జీవితం పట్ల నిరాశ పెంచకూడదని బి.ఎస్. రాములు చెబుతాడు. 1986లో తెలుగుదేశం ప్రభుత్వం జూనియర్, డిగ్రీ కళాశాలకు హాస్టల్ సౌకర్యం లేకుండా చేయడంవల్ల చాలామంది దళితులు ఏ విధంగా చదువుకోకుండా నష్టపోయారో తెలియజేస్తాడు. స్త్రీలకు ఉద్యోగ భద్రత ఇచ్చే ఆత్మవిశ్వాసం, కట్నాలతీరు, చదివిన అమ్మాయిల పట్ల తల్లిదండ్రులకు కలిగే భావనలను చిత్రించారు.

అంబేద్కర్, భాగ్యరెడ్డి వర్మ, ఆధునిక భారతదేశంలోని మొట్టమొదటి మహిళా టీచరు సావిత్రిబాయిపూలే. మహాత్మజ్యోతిరావు పూలే మొదలగు వారి స్ఫూర్తి గురించి,

దళితులు ఎదగాల్సిన అవసరం గురించి ఈ కథలోని పాత్రల ద్వారా రచయిత చిత్రించాడు.

**బి.ఎస్. రాములు కథలు-ప్రపంచీకరణ-పరిణామాలు**

కథ, నవల జీవితంలో భాగంగా మానవసంబంధాలను, సంస్కృతిని, సామాజిక పరిణామాలను పాత్రలద్వారా, సంఘటనల ద్వారా, సన్నివేశ చిత్రణల ద్వారా చిత్రిస్తుంది. బి.ఎస్. రాములుగారు 'బతుకుపయనం' 'వేపచెట్టు' కథాసంపుటాలలో తెలంగాణా ప్రపంచీకరణ వల్ల మారుతున్న సమాజం తీరును కథల్లో చిత్రించారు.

బి.ఎస్. రాములు 'బతుకు పయనం' కథల సంపుటి తెలంగాణాలో ప్రపంచీకరణ ప్రభావంతో రకరకాల వృత్తులు, కులవృత్తులు, దెబ్బతింటున్న తీరును, నూతనంగా అభివృద్ధి చెందుతున్న ప్రజలను, తద్వారా మానవ సంబంధాల్లో, స్వభావాల్లో వస్తున్న పరిణామాలను వాటి మంచి చెడ్డలను మనకు తెలియజేస్తుంది. ఈ కథల సంపుటిలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రపంచీకరణ ప్రభావం పలుకోణాల్లో చిత్రించబడింది.

'నానమ్మ' కథలో చేనేత కులాల కులవృత్తి మిల్లుల పోటీలో గిట్టుబాటు కాకుండా పోవడంవల్ల ఆగిపోతున్న జీవితాల్తో తెగిపోతున్న మానవ సంబంధాలు తిరిగి ఎలా నిలబెట్టుకోవాలో కూడా చిత్రించిన కథ.

గ్లోబలైజేషన్ ప్రభావం నొసటి మీద లేబిల్ వేసుకున్నట్టు, పచ్చబొట్టు పొడిపించుకున్నట్టు స్పష్టంగా కనపడదు. ఎందుకంటే 'ప్రపంచీకరణ' అనే పదం ఒక దృశ్యంకాదు. అది ఒక భావం. ఒక దృక్పథం. జీవితంలో జరుగుతున్న, జరగబోయే మార్పులకు ఒక సంకేతపదం ప్రపంచీకరణ. ఆ మార్పులను పట్టుకోవడమే సాహితీవేత్తల కర్తవ్యం.

బతుకు భారమై నేతవృత్తి. మరమగ్గాల నేత వృత్తి కూడా బతుకు నియ్యలేకపోవడం వల్ల ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎదిగిన కూతురు ఎవరితోనో లేచిపోయింది. "పెళ్లి చేయలేదని బాధపడకు, మా బాధలేవో మేము పడతాం" ! అని ఉత్తరం రాసిపెట్టిపోయింది.

"గాంధీతాతా! రాట్నం జెండా నెక్కించారు. మా బతుకులకేమిచ్చావు ఆధారం" అంటూ మూగగా ప్రశ్నించింది ఇది చెప్పేటందుకే కథ రాసాడని తెలిసిపోతే అది రూపం కోల్పోయి వ్యాసం అయిందంటారు.

'నానమ్మ' కథలో ప్రపంచీకరణ తెస్తున్న పరిణామాలు నేపథ్యంగా మానవ సంబంధాలను పొదిగిన తీరు రచయిత పరిణతికి సంకేతం.

'రాత్రిపూలు' కథలో ఒక విస్తారమైన తాత్వికాంశాన్ని అన్నా చెల్లెళ్ల అనుబంధంలో భాగంగా చిత్రించిన తీరు అపూర్వం. ప్రపంచీకరణ పోటీ ప్రపంచాన్ని మరింత ఉధృతం చేసింది. త్యాగమే తప్పు, పరోపకారమే తప్పు పోటీ ప్రపంచంలో ఇతరుల కన్న ముందుండాలే అనే వ్యక్తిత్వ స్వభావ నిర్మాణం ముందుకు తెచ్చింది. ఆ క్రమములో "విజయం సాధించడమెలా" అనే వందలాది గ్రంథాలు వెలువడ్డాయి. ఈ ప్రపంచీకరణ విజయానికి నూతన మానవ స్వభావాలకు భిన్నంగా మానవీయ అంశంతో పోటీలో, పోటీ పడకుండా తనకు నచ్చినదాన్ని సమాజంకోసం కుటుంబంకోసం చేస్తూ జీవితాన్నే త్యాగం చేసిన ఒక విషాదాంత ఆదర్శపాత్ర చిత్రణ, 'రాత్రిపూలు, ఇది ప్రపంచీకరణపై తిరుగుబాటు చేసిన ఆదర్శపాత్ర.

"ప్రమీ! నా భావాలే నన్ను బ్రతికిస్తున్నాయి. నీవు సమాజం కోసం చేస్తున్నానని అంటున్నదంతా నిజానికి నాకోసమే. అదే నా ఆనందం. నా భావాలు వదులుకోమనడం నన్నుచనిపోవాలని కోరడం తప్ప వేరొకటి కాదు'' ఇది అంతరించిపోతున్న ఆదర్శస్వభావ పాత్రచిత్రీకరణ.

'బతుకుపయనం' కథలో తెలంగాణా ప్రజలకు కూడా ప్రపంచీకరణ తెరిచిన కొత్త ద్వారాలు కనబడతాయి. జీవితంలో ఎన్నడూ ఊహించలేని స్థాయికి అట్టడుగు పేదలు కూడా ఎదిగి, ఇంజనీర్లయి అమెరికాలో స్థిరపడేదాకా సాగిన ప్రస్థానాన్ని చిత్రిస్తుంది. 'ప్రశాంతం' కథలో తెలంగాణాలోని ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ బరువు వల్ల తొలి దశలోని పారిశ్రామిక కార్మికులు కూడా తమ వృత్తులు కోల్పోవడం ఎలా జరిగిందో చిత్రిస్తుంది. 'జైలు జీవితం' కథ తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచీకరణ నేపథ్యంలో జరుగుతున్న ప్రజావుద్యమాలను వాటిలో పాల్గొంటున్న ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను చిత్రిస్తుంది. 'ఇంటల్లుడు' కథలో తెలంగాణలోని

ప్రపంచీకరణ ప్రభావం ప్రత్యక్షంగా కనబడదు కాని కాస్తా ఎదిగినవాడు అభివృద్ధిని అందుకోలేకపోతున్న బంధుమిత్రులకు చేయూత నివ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది.

'జీవనయానం' కథలో కష్టపడి పైకి రావడం ఒక ఎత్తయితే పైకి వచ్చిన తరువాత సోషలిస్టు దృక్పథం నిలుపుకొని తమచుట్టూ వున్న సమాజంలో అంతర్భాగంగా ఒక సోషలిస్టు బృందాన్ని తయారుచేయడం ఎలా సాధ్యమో తెలుపుతుంది. కుటుంబంలో ఒకరు ఎదిగితే ఎన్ని జీవితాల్లో మార్పులొస్తాయో ఈ కథలో చూడవచ్చు.

ఇలా కథలన్నింటిలో మారుతున్న తెలంగాణా సమాజం, ప్రపంచీకరణ వర్తమాన సమాజ తీరుతెన్నులు కనబడతాయి. జీవితంలోంచి మానవ సంబంధాల్నించి తెలంగాణా ప్రపంచీకరణను వెలికితీసి చెప్పడం కష్టం. ఆ కష్టాన్ని సుసాధ్యం చేసిన కథలు 'బతుకుపయనం' కథల సంపుటి. రచయిత, తత్త్వవేత్త కాకుండా ఇలాంటి కథల్ని రాయడం సాధ్యమా? అన్న ప్రశ్న ఎవరికైనా కలుగుతుంది. తత్త్వవేత్తగా ప్రపంచీకరణ పరిణామాలను తన తాత్త్విక గ్రంథాల్లో విస్తృతంగా చర్చిస్తున్న సమయంలోనే వాటిని కథల రూపంలోకి మలచడం జరిగిందని చెప్పవచ్చు. అందువల్లే తెలుగులో ఇలాంటి కథల్ని బి.ఎస్. రాములు గారే రాయగలరు అని అన్పిస్తుంది.

# శ్రీమతి ఆర్. వసుంధరాదేవి గారి కథల్లో తాత్త్వికదర్శనం - ఒక పరిశీలన

ఎ. పుష్పాంజలి

ఏ కథలోనైనా తాత్త్విక చింతన కథకొక నిండుతనాన్ని, గౌరవాన్నీ ఇస్తుంది. రచయిత యొక్క లోతైన ఆలోచనా సరళికి అద్దం పడుతుంది. వసుంధరా దేవి కథల్లో కథావస్తువు ననుసరించి అంతర్లీనంగానో, లేక బహిర్గతంగానో సాగే ఈ తాత్త్విక చింతనలు ఆమె కథలనొక సమున్నత స్థానంలో నిలిపాయి. మానవ జీవితాల్లో జరిగే అనేక సంఘటనలకూ చిత్ర విచిత్రంగా సాగే మానవుని ప్రవర్తనకూ, ప్రవృత్తులకు అసలు కారణాలుంటాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చిక్కుముళ్ళే. వసుంధరాదేవి కథల్లో కనిపించే తాత్త్విక స్పర్శలు ఆ చిక్కుముళ్ళను విడదీసే ప్రయత్నం చేస్తాయి. అవన్నీ అర్థంలేని, ఆలోచనలకు అందని, అతి సహజమైనవేనని తెలియజేస్తాయి. అనేక లౌకిక సంఘటనల్లో ప్రగాఢమైన అలౌకికతను వ్యక్త పరుస్తాయి. ఇటువంటి ధోరణులు బుచ్చిబాబు గోపీచంద్ గార్ల రచనల్లో ద్యోతకమవుతుంటాయి.

వీరి కథలన్నింటిలోనూ మకుటాయమానంగా నిలిచిన కొన్ని కథలను తీసుకుని అందులో గల తాత్త్వికతను విశ్లేషించిచూద్దాం. మొదట 'పెంజీకటి కవ్వల' అనే కథను పరిశీలిద్దాం. చావంటే భయపడే జయలక్ష్మి ఇద్దరు ఆడపిల్లలకు తల్లి, ఈ ఆడపిల్లల్లో చిన్నపిల్ల వికలాంగురాలు. ఈ పిల్లను చూసి తనెందుకు కలతచెందుతూ ఉంటుందో పెద్ద పిల్లని చూచి ఎందుకు సంతోషిస్తుందో జయలక్ష్మి ఈ విధంగా విశ్లేషించుకుంటుంది.

"పిల్లలు బాగుండాలని కోరుకోడం తల్లి ధర్మం. నా బిడ్డ బాగుండాలని కోరుకోడం తప్పా? అలా అయితే నేను నా ఆశల్నీ, కోరికల్నీ ప్రేమిస్తున్నానే కాని నిజంగా నా పిల్లల్ని ప్రేమించడం లేదు అర్థం చేసుకోడం ఒప్పుకోడం అన్నీ ఒకటేనా? ఈ బాగోగుల మనస్సు ఎట్లా ఏర్పడ్డది? ఆలోచనలు, కోరికలు అన్నీ అబద్దాలేనా?" మనిషి ప్రేమిస్తున్నాను అనుకొనేది తన ఆలోచననీ కోరికనే నన్న గొప్ప సత్యాన్ని తాత్త్వికంగా వెలికితీశారు.

ఇంకొకచోట పొడైన మానవ సంబంధాలను క్యాన్సర్‌తో పోలుస్తారు. పక్క కణంతో సంబంధం తప్పిపోయిన కాన్సర్ కణం ఏ విధంగా తన పక్క కణాలను నాశనం చేస్తూ పోతుందో, అదే విధంగా తోటి మానవులతో వాళ్ళ కష్ట నిష్ఠూరాలతో సుఖ దుఃఖాలతో సంబంధం కోల్పోయిన మానవుడు జాతిని రోగగ్రస్తం చేస్తాడని ఆక్రోశిస్తారు.

ఇదే కథలో జర, రుజ, మరణాల మూలాలను అన్వేషించడానికి, సృష్టి రహస్యాన్ని ఛేదించడానికీ గొప్ప పరిశోధన చేశారు వసుంధరాదేవి గారు.

"మనసు చావు బ్రతుకుల మధ్య ఊగిసలాడుతూ ఈ ఊగిసలాట అర్థంలేనిది, చావు తథ్యం" అని జయలక్ష్మి ద్వారా చెప్పిస్తారు. ఈ ఆలోచనతో మనసు రాజీపడితే, ఊగిసలాటలా సంఘర్షణలు అదృశ్యమై మనసు నిశ్చల స్థితిని చేరుతుందన్న సందేశాన్ని పాఠకుడు అందుకుంటాడు.

పెంజీకటి కవ్వలలో జయలక్ష్మి పాత్రను ఆవిష్కరించిన తీరు అనన్య సామాన్యమైనది. చావంటే భయపడే ఈ జయలక్ష్మి చివరకు తనకే కాన్సర్ అని తెలుసుకున్న నాడు ఆమె ఆలోచనలెలా సాగినయ్? ఆమె ఒక నిశ్చల స్థితిని, తన మరణాన్ని సంతోషంగా అంగీకరించే స్థితిని, ఎలా చేరగలిగింది? ఆమెలో ఈ శ్రేణీపరమైన మార్పు ఆమె ఆలోచనతోనే సాధించింది. నేనెవరు? అన్న అన్వేషణలోనే సమాధానాన్ని పొందగలిగింది.

"చావు పిచ్చివాడి చేతిలో రాయిలా వచ్చి పడ్తుంది. కొద్దిపాటి తేడాతో ఆ రాయి వేటనుంచి తప్పించుకోవచ్చు. ఐతే ఆ అవకాశాన్ని చేజిక్కించుకోడం ఎలా? అసలు అవకాశం అనేది ఉందా? ఉన్నట్టు కనిపిస్తూ మురిపిస్తూ అనిశ్చితస్థితిలో మనిషిని నిలిపి ఆడిస్తున్నది అది" అంటూ, "చావు కూడా బ్రతుకులో ఒక భాగమే"నన్న నగ్నసత్యాన్ని మనముందు ఆవిష్కరించారు.

అందరూ ఏడుస్తూ నవ్వుతూ జీవిస్తూ ఉంటే తనుమాత్రం అదృశ్యమై పోతుందా? ఎందరో ముసలివాళ్ళూ, రోగులూ, అప్రయోజకులు, మూర్ఖులు బ్రతికి ఉండగా తనుమాత్రం చచ్చిపోవడం అన్యాయం. తను లేకుంటే అంతా నశించిపోతుంది. అన్న ఆశల ఆపోహాల్లో ఊగిసలాడ్తుంది జయలక్ష్మి.

తనకెవరైనా మళ్ళీ జీవించే అవకాశం ఇస్తే తన బ్రతుకు ఏ మలుపు నుంచి ప్రారంభించాలో ఆమెకి అర్థం కాదు.

"మానవుని ఆలోచనలకు బైట జరుగుతున్న సంఘటనలకూ మధ్య సంబంధం ఎక్కడో తప్పి పోతున్నది. మానవుడి ఆలోచనలు ఎప్పుడూ ఆశాజనకంగా పాజిటివ్‌గా సాగుతవి. ఐతే జరిగే సంఘటనలు మాత్రం అనూహ్యాంగా అవాంఛనీయంగా ఉంటాయి. ఈ రెంటినీ సమన్వయం చేసే 'లయ' ఏదీ లేదు. సృష్టి ఎప్పుడూ స్వతంత్రంగా, యధేచ్ఛగా సాగుతూనే ఉంటుంది" అన్న నగ్నసత్యాన్ని జయలక్ష్మి ఆలోచనల్లోనుంచి వెతికి రప్పించారు రచయిత్రి.

జయలక్ష్మికి తన మనసు ఒక కృతకపు విలువలు సృష్టించుకొన్న మహమ్మారిలా కనిపిస్తుంది. ఎందుకంటే ఇది జ్ఞాపకాలూ కోరికలను కలబోసుకుని ఏర్పరచుకొన్న 'కొలబద్ధ' కాబట్టి. ఈ కొలబద్ద ఆధారంగా మానవుడు కోరికలను ఆరాధిస్తూ, కనిపించే వాస్తవాలను నిరాకరిస్తూ కృతకపు విలువలను సృష్టించుకొంటారు. ఆ కాలమానం ఇష్టప్రకారమే జరిగితే హెచ్చు తగ్గుల ప్రమేయం చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తన కూతుళ్ళిద్దరూ ఆ కాలమానానికి సరిపోరన్న నిర్ణయానికి వస్తుంది జయలక్ష్మి. "మనసుకూ ఎక్కువ తక్కువ లోకానికీ మూలతత్వం వినాశం" అని తీర్మానించు కుంటుంది.

సృష్టిని శాసించే అలౌకిక శక్తిని ప్రస్తావిస్తూ "జయలక్ష్మినీ, ఆమె మనసునూ రక్షిస్తున్నది ఆమె మనఃస్థాయికి సంబంధించినది కాదు. కార్యకారణ సంబంధాన్ని అధిగమించిన మరోస్థాయి నుంచి వస్తున్న కృపావరం అది" అంటారు.

ఇవన్నీ కేవలం జయలక్ష్మి మనసులో మెదిలే ఆలోచనలు కాదు. ఊపిరినింపుకుని సజీవంగా మసలే మానవ జీవితాన్ని అన్వేషించాలనుకున్న ప్రతిమనిషీ మనసులో మెదిలే అలోచనలు. చివరికి తన ఆవేదన నుంచే జయలక్ష్మికి సమాధానాలు లభిస్తాయి. ఆమె ప్రశ్నలూ సమాధానాలు ఏవీ లేని ఒక నిశ్చల స్థితిని చేరుకుంటుంది.

"మనిషికుండే పరిమితులు జీవితానికి అర్థం స్వేచ్ఛ అన్నీ ద్వంద్వ స్వరూపమైన మనసుకు సంబంధించిన అనవసరమైన ప్రశ్నలు. కాలంకూడా మనసుకు సంబంధించినదే గాని సత్యంకాదు. శరీరధారియైన మనిషికి ఈ క్షణం ఒక్కటే సొంతం. కాలం అనేది ఊహ. అనేకమైన క్షణాలున్నాయి. ఒక క్షణానికీ మరొక క్షణానికీ మధ్య సంబంధం నిజంకాదు. ఈ సంబంధాన్ని కల్పించేది మనస్సే".

పై సత్యాన్ని అనుభూతించిన జయలక్ష్మి మనసు నిశ్చలస్థితిని చేరుకొంటుంది. అప్పటికా అనుభూతి సత్యమూ, నిత్యమూ అనిపించినా అది మళ్ళీ అందుకోలేని ఒక అస్పష్టమైన అనుభవంగానే మిగిలిపోతుంది ఆమెకు.

అది ఒక జ్ఞాపకంగానే మిగిలినా ఆమెలో భయం ఎరుగని నిబ్బరం ఏర్పడి ఆలోచనల్లో కొత్త జీవం ప్రవేశిస్తుంది.

ఈ కథ చివరలో 'తమాషా బంగ్లా' చూపే వాడొస్తాడు (ఇదొక మాజిక్ పెట్టె). దాన్లో వాడు చూపే తమాషాలన్నీ మనకు నిజ జీవితంలో తారసపడే ప్రాపంచిక విశేషాలేనని పాఠకుడు గ్రహించాలి.

జీవన్మరణాలను అర్థం చేసుకోడానికి వేదవేదాంగ పఠనం, సన్యాసం, తపస్సు, ప్రార్థనా ఏవీ అవసరం లేదు. 'నేనెవరు' అన్న అన్వేషణ ఒక్కటి చాలు. దీన్నే జిడ్డు కృష్ణమూర్తి 'స్వస్వరూప' జ్ఞానం లేక 'ఎరుక' అంటారు. మనిషి ప్రకృతిలో ఒక భాగమే. అకురాలినట్టు ఆత్మలు కూడా రాలిపోవాల్సిందే. మరణానికర్థం గ్రహించలేక దాన్ని చూసి భయపడ్డంతవరకూ మనిషి 'పెంజీకటి'లోనే ఉంటాడు. దీని కర్థం ఆకళింపు చేసుకున్న మరుక్షణం నుంచీ అంతా ఆనందమే. నిర్భీతే, స్వేచ్ఛే. ఇదే "పెంజీకటి కవ్వల" ఉండే విశేషం.

'పెంజీకటి కవ్వల' తెలుగు కథా సాహిత్యంలో ఒక అరుదైన ప్రయోగం. ఇది ఒక తత్త్వవిచారాల మూట.

ఒక మొగ్గ పుడుతుంది. ఒక పువ్వు పూస్తుంది. మరొకటి వాడి రాలిపోతుంది. అన్ని విషయాలు ఎంతో సామాన్యంగా జరిగిపోతాయి. మనిషి జీవితమూ అంతే. ఆ సంఘటనలకు పరస్పర సంబంధాన్నీ ఆరోపించేదీ అర్థం కల్పించేదీ మనస్సు. జరిగేవి మాత్రం ఏ ఆర్భాటమూ లేకుండా జరిగిపోతుంటాయి. – ఇది 'పిచ్చి గీతలు' కథలో కొన్ని మాటలు. కథ ఏవైనా మనిషి కోరికలకు, జరిగే సంఘటనలకూ సంబంధం ఉండదన్న నిజాన్ని మనిషి ప్రకృతిలో ఒక భాగమని, ఇతడి అస్తిత్వానికి ప్రకృతి ఏమీ ప్రాముఖ్యం ఇవ్వదని రూఢీ చేసే మాటలివి. ఈ కథ చివరలో చనిపోయిన చైతన్య హఠాత్తుగా వచ్చి ఒక కాగితం ఇస్తాడు. అతని స్నేహితుడు దాన్ని విప్పి చూస్తే దాన్నిండా పిచ్చిగీతలుంటాయి. జీవితానికర్థం అన్వేషిస్తే, కనిపించేవన్నీ పిచ్చిగీతలే.

తన 'తోలు బొమ్మలు' కథలో రామయ్య అనే పాత్రచే ఈ కింది విధంగా తత్త్వాలు పాడించారు.

**ఒస్తా ఒట్టిది పోతా ఒట్టిది, ఆశ ఎందుకంట**
**పంచభూతముల తోలుబొమ్మలతో ప్రపంచమాయెనట**
**అంతము వరకూ కించిదాశతో పెంచును జగమంతా**

జీవుల ఆవిర్భావం సృష్టిలోని పంచభూతముల కలయికవల్ల ఏర్పడ్డదని ఈ తత్త్వం భావం. కాబట్టి జగతిలోకి రావడం పోవడం అంతా రూపాలమార్పేనన్న ఓ సృష్టి రహస్యం బోధిస్తుందీ తత్త్వం.

'మనుషులు - బొద్దింకలు' - కథలో కథకురాలికి బొద్దింకలంటే పరమ చీదర. వాటిలో తెల్లరంగులో ఉన్న రక్తాన్ని చీముగా భావించి అసహ్యించుకుంటూ ఉంటుంది. ఎక్కడో సైంటిఫిక్ జర్నల్‌లో "మనుషులంతా అంతరించాక చివరికి మిగిలేది బొద్దింకలేనని చదువుతొందామె. తన దగ్గర పనిచేసే రాముడు-కిష్టుడూ అనే ఇద్దరి వ్యక్తిత్వాలను పోల్చి చూసుకుంటూ ఉంటుంది. రాముడికి అన్నీ అమర్చినా సంతోష పడడం తెలియదు. కిష్టుడు మటుకు న్యాయంగానో అన్యాయంగానో చిల్లరలు సంపాదించి బతకడం నేర్చుకుంటాడు. అంటే రాముడి కన్నా కిష్టుడికే సంతోషంగా జీవించడం చేతనౌనన్నమాట. తన భర్త ఆఫీసులో ఖాళీగా ఉన్న ఉద్యోగం కిష్టుడి కివ్వమని కథకురాలు చెప్పినా వినకుండా ఆమె భర్త బాగా పనిచేసే రాముడికి ఇస్తాడు. కథ చివరలో రచయిత్రి రెండు మాటలంటుంది.

"మనుషులే పోయి బొద్దింకలే బతకడం సాధ్యమా? కావచ్చు. కాని, కాని... తెలివిగల మనిషి చివరికి మిగిలేది బొద్దింకలే నని గ్రహించి చివరికి తానే బొద్దింక అయి మిగుల్తాడేమో? ఎంతఘోరం" రాముడి లాంటి మనుషులు అందరికోసమూ జీవిస్తారు. కాని తెలివిగల మనుషులు తమకోసమే తాము జీవిస్తారు. బొద్దింకలు ఎవరికోసమూ జీవించవు. వాటికోసమే అవి జీవిస్తాయి. చివరికి మిగుల్తాయి. ఎంత ఘోరం!

తాత్త్విక చింతనలో 'పెంజీకటి కవ్వల' కథ స్థాయిలో మరే కథా నిలబడక పోయినా చాలా మంచి కథలకోవలోకి వచ్చే 'అమ్మా! ఇక సెలవు' కథని పరిశీలిద్దాం. ఈ కథలో ఐదునక్షత్రాల వైద్యశాలలు పెరిగిన నాగరికతకు నిదర్శనాలే గాని మూర్తీభవించిన మానవత్వానికి కాదన్న నిజాన్ని నిరూపించారు. ఈ కథ

చదువుతున్నంత సేపు ఇది ఒక సహజ సంఘటనలాగా దర్శనమిస్తుంది. ఐదు నక్షత్రాల ఆస్పత్రిలో సిబ్బంది హృదయమూ, బాధ్యత రెండు లేకుండా ప్రవర్తించిన తీరు కళ్ళకు కట్టించారు. అబ్బూరి ఛాయాదేవి గారి "ఐదు నక్షత్రాలు" మరొక సారి దృక్పథంలో మెదుల్తుంది. ఐతే ఈ 'అమ్మా! ఇక సెలవు'లో తల్లీ కూతుళ్ళ మధ్య పెనవేసుకున్న ప్రగాఢమైన అనురాగం, అనుబంధం హృదయాలనాకట్టు కుంటాయి. ఈ ప్రపంచంలోనుంచి అంచెలంచెలుగా బంధాలు తెంచుకొని మృత్యువుకు దగ్గరైన తల్లి క్షణక్షణం అనుభవించిన నరకయాతనకు సాక్షిగా నిలిచిన ఒక కూతురి ఆత్మఘోష ఈ "అమ్మా ఇక సెలవు" తల్లిని ఎడబాసిన కూతురి హృదయంలోనుంచి పుట్టిన ఒక ఆలోచన..... "కాని ఇప్పుడు నాకు తెలుసు. మనుషులు పుడతారు ఎప్పుడో ఒకసారి చచ్చిపోతారు. మనిషి పుట్టడం ఎంత సహజమో, చచ్చిపోవడమూ అంతే సహజమని చూపించావు. ఎంత ప్రశాంతంగా, ఎంత సహజంగా చచ్చిపోయావు! చావులో భయం లేనేలేదు. ఎండుటాకులు రాలడంలో, ఎండుకొమ్మల్ని తుంచేస్తే చెట్టు బలం పుంజుకోవడంలో ఏ ప్రకృతి సూత్రం ఉందో మనిషి శరీరం రాలిపోవడంలోనూ ఒక పరమార్థం ఉండే ఉంటుంది."

జనన మరణాలు అతి సహజమని గుర్తించిన మనిషికింక చావుభయం ఉండదు. పుట్టినది మొదలు చివరిగడియ వరకూ మనిషికి ఎన్నో అన్వేషణలు, ఆరాటాలూ, వెంపర్లాటలూ ఐతే వసుంధరా దేవి కథలు చదివాక వాటినర్థం చేసుకున్న ప్రతివ్యక్తీ కర్తవ్య శూన్యతకు విముఖత చూపుతూ, తనని తాను, తనకు సంబంధించిన జననమరణాలు - వీటిని అర్థం చేసుకుంటూ శాశ్వతానందాన్ని పొందడానికి కావల్సిన మానసిక చైతన్యాన్ని సమకూర్చుకోగలడు.

తన సేవలకి గుర్తింపు లేని ఇంటిచాకిరీకి అంకితమైపోయిన అమ్మను గురించి కూతురిలా అనుకుంటుంది. "నీ ఆత్మను మా కర్పించావన్న నిజాన్ని ఇప్పుడే తెలుసుకున్నాను... ఎక్కడో వాస్తవాన్ని మరుగు పరుస్తున్న ఘోరమైన పొరపాటు ఉన్నది. మానవ సంబంధాల్లోకి పుచ్చు వచ్చి చేరింది. అమూల్యమైందేదో జారి పోతున్నది. చిన్న పరిధిలో, కుటుంబ బాంధవ్యాల్లో నిలుపుకోలేని సంబంధమూ, ఆర్ద్రతా, ప్రేమా విస్తృతమైన సమాజ పరిధిలో ఊహించబోవడం ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెక్కాలని ఆశించిన చందాన అవాస్తవికం అవుతుందా".

మానవ సమాజంలో పుచ్చు ఉంది అది రకరకాల దురాచారాల రూపంలో, స్త్రీల పట్ల చూపే వివక్షరూపంలో, అమ్మలు ఇంటి చాకిరీకే పరిమితమన్న ఆపోహల రూపంలో సమాజంలో వ్రేళ్ళూని ఉంది. అమ్మ చూపే అద్భుతమైన ప్రేమను బిడ్డ ఎప్పటికో గాని అర్థం చేసుకోలేడు. అది పూర్తిగా అర్థమై పిల్లలు విచారపడే నాటికి అమ్మలింక ఈ ప్రపంచంలోనే ఉండరు.

అమ్మ ప్రాణాలు వదిలినాక కథకురాలు ఇలా అనుకుంటుంది. "మనిషికీ మనిషికీ మధ్యన ఉండగల సంబంధంలోతు ఎంత? ఆలోచనకు అందని ఆ సంబంధం స్వరూపం ఎలాంటిదో, దాని మూలం ఎక్కడుందీ? అమ్మా! నీవు ఎవరు? ఈ జీవనలీలలో నీపాత్ర ఏమిటి? ఇప్పుడు నీవు లేవు. నేను తేలికై పోయాను. బాంధవ్యాలు బరువులో లేవు. బాధ్యతల ఎల్లలూ లేవు. ఎంత స్వేచ్ఛ! ఒంటరి తనంలో ఏకాకినై... సంపూర్ణనై... అమ్మనై పోతున్నాను. 'అమ్మా! ఇక సెలవు'... అంటూ కథ ముగించారు.

అమ్మలందరూ ఏకాకులే. సంపూర్ణలే. అమ్మలు అమ్మలే.

వసుంధరాదేవి గారి కథల్లో మరో చెప్పుకో దగ్గది "జాన్ పాల్ చేసిన బీరువా కథ" ఈ కథలో కథకురాలు ఒక పాత పాటను ప్రేమిస్తూ ఉంటుంది. ఆ పాట తనలో "అందరానిలోతుల్లో ఉండే సత్యాలను వెలికితీస్తుంద్నన్న" అనుభూతికి లోనవుతూ ఉంటుంది. ఐతే ఆమెకి చెప్పకుండా ఆమె కొడుకు ఆ పాటపై వేరొక పాటను రికార్డు చేస్తాడు. అప్పుడు కథకురాలు తనకు ప్రత్యేకంగా ఒక బీరువా ఉండాలన్న అవసరాన్ని గుర్తిస్తుంది. అనేక ఆధారాలను బట్టి తన బీరువా చేయడానికి జాన్‌పాలే తగినవాడని నిర్ణయించుకుంటుంది. ఇందుకు జాన్‌పాల్ యొక్క 'గతకీర్తి' కూడా ఒక కారణం. ఆ గతకీర్తి వివరాలు అతను చెప్పినవే. కొన్నాళ్ళకి జాన్‌పాల్ పైకి చూపించేటంత వినయ విధేయత కలవాడు కాదని అర్థం చేసుకుంటుంది. ఐతే పాల్ సరిగ్గా పని చేయడు. మధ్య మధ్యలో పని ఎగ్గొట్టి మాయమవుతూ ఏదో వంకరటింకర సాకులు చెప్తూ దాటేస్తుంటాడు. కూలి పూర్తిగా తీసుకున్నా ఇక బీరువా పూర్తవుతుందనగా, అతని వస్తువులు కథకురాలి ఇంట్లోనే వదిలేసి, మళ్ళీ అదృశ్యమవుతాడు. జాన్‌పాల్‌కి ఒక సోమరిపోతు కొడుకుంటాడు. వాణ్ణి విపరీతంగా ప్రేమిస్తుంటాడు జాన్. వాడేది చెప్తే దాన్ని వేదం వల్లిస్తున్న అనుభూతితో ఆరాధనతో కథకురాలి ముందు చెప్తుంటాడు. జాన్ టక్కరివాడు– తాగుబోతు. నిలకడలేనివాడు. పొగరుబోతు. ఇటువంటివాడిలో కొడుకు అప్రయోజకపు మాటలు ఎటువంటి

ప్రభావం కలిగిస్తాయి? అనుకుంటూనే 'జాన్ అసాధారణ వ్యక్తి' అనుకుంటుంది కథకురాలు.

పరస్పర విరుద్ధమైన ఈ జాన్‌పాల్ వ్యక్తిత్వ విశ్లేషణలో జాన్‌పాల్‌కి ఉన్న దుర్గుణాలతో బాటు "అసాధారణ వ్యక్తిత్వం ఎక్కణ్నుంచి వచ్చిందీ?" వ్యక్తుల మధ్య నున్న సంబంధాలు ఆ వ్యక్తుల లాగానే క్లిష్టము, సంకీర్ణము అయి ఉంటాయి. అసలు మనుషుల మధ్య నిజంగా సంబంధం అనేది ఉంటుందా? వుంటే దాని స్వభావం ఎలాంటిది? అన్న సందేహపూరిత విశ్లేషణకు లోనవుతుంది కథకురాలు.

"ఈ ప్రపంచం ఒక అస్పష్టమైన వర్ణచిత్రం' అందులో మనం గుర్తించగలిగేది అంతకుముందే మనసులో ఎరుకగా ఉన్న దానిని మాత్రమే. తనలోపలి గుర్తునే బయటా గుర్తిస్తాము. ఒక మనిషి జీవితానికి అర్థం ఇందునుండే ప్రాప్తించాల్సి ఉంది. ఆ జీవితం ముందు నుంచే అతనిలో నిబిడీకృతమై ఉన్నదే!

హఠాత్తుగా జాన్‌పాల్ అమితంగా ప్రేమించే కొడుకు మలిదేవి వరదలో కొట్టుకపోయి, చచ్చిపోతాడు. అతని చావు జాన్‌పాల్‌లోని టక్కరిదనాన్నీ అతి వినయాన్ని పోగొట్టి అతన్లో 'హుందాని, నిండుతనాన్నీ' తీసుకవస్తాయి.

నిగనిగలాడే బీరువా, అందంగా ఉన్న బీరువా తయారు చేసిస్తాడు. "మనిషిని ధరించిన మనస్సు అనంతమూ, మహాశక్తిమంతమూ అయినది" అని కథకురాలు అనుకోగానే ఆమెలో స్వేచ్ఛానందాలు వెల్లి విరుస్తాయి. తన నాన్న మరణాన్ని గుర్తు చేసుకుంటుంది కథకురాలు. ఆయన చనిపోయినప్పుడు తానెంత గాభరా పడ్డది, అదీ ఆకాశంలో అనంతమైన చుక్కలు తనకి తెలియక పోయినందువలన తనెంత ఆందోళనకి లోనైందీ గుర్తు చేసుకుంటుంది. చివరికి "ఆయన బ్రతికుండగా కూడా వీటిని గురించి నాకు తెలిసింది లేదు. ఇప్పుడు అంతే. ఇక ఆందోళన దేనికీ అనుకుంటుంది. చివరకీ ఆ బీరువా తాను ఉపయోగించుకున్నా ఉపయోగించుకోక పోయిన రెండూ ఒక్కటే" నన్న నిర్ణయానికి వస్తుంది. కథ ముగుస్తుంది.

సాధారణ విషయమైన ఒక బీరువా చేసిన వైనంలో అంతులేని అసాధారణతనే కాక సృష్టి సహజప్రకృతిని చూపడానికి ఒక విశేష తార్కాణంగా వాడుకున్నారు రచయిత్రి. సాధారణ వ్యక్తులను, సంఘటనలను అసాధారణంగా విశ్లేషించడం, తాత్వికచింతన వెన్నెముగా సాగే ఆలోచనా సరళికే సాధ్యం. సాధారణ

వ్యక్తి అయిన జాన్‌పాల్‌నీ అతని టక్కరి ధోరణినీ అవలోకిస్తూనే, కొడుకు మరణం పట్ల అతను చూపించిన నిబ్బరం అతని మానసిక బలానికీ అతని ధైర్యానికీ చిహ్నాలుగా భావిస్తుంది కథకురాలు. "అందమైన బీరువా తయారీ" మనిషి వాంఛించే అంతమైన జీవితం. ఆ అందమైన బీరువా తయారీకోసం జాన్‌పాల్ ఎన్నో ముప్పు తిప్పలు పెడుతాడు. భయపెడుతాడు. సంఘర్షణకి లోను చేస్తాడు. కాని చివరకి "బీరువా ఉపయోగించినా ఉపయోగించకున్నా ఒకటే" నన్న కథకురాలి అభిప్రాయం, శూన్యంలో ఉన్న సంపూర్ణతకూ, సంపూర్ణతలో ఉన్న శూన్యతకూ ప్రతీకలు.

'పాపం' అన్న కథలో పాపపుణ్యాల గురించి అవి కేవల రెండు మాటలేనని, అవి నిజానికి మనిషిలోని జీవశక్తికి మారు పేర్లనీ, మనిషిలోని దుష్టత్వం ఈ రెండు మాటలను ఆయుధాలుగా చేసుకొని సాటి మనిషిని హింసిస్తున్నదనీ పాపపుణ్యాల స్వరూపాన్ని విశ్లేషించారు రచయిత్రి.

గొప్ప తాత్త్వికత కలిగిన చిన్న కథ "శివరావు కోట" శివరావు సైకోఫిజిక్స్, సైకోడైనమిక్స్‌లో పరిశోధనలు చేసిన గొప్ప శాస్త్రజ్ఞుడు. తన ప్రేయసికోసం ఊరిబైట గుట్ట మీద ఎదురుచూస్తుంటాడు. మానవ అనుభవాలను నిత్యసత్యంగా మార్చాలనే శోధనలో ఉంటాడు. అతనిలో ఆలోచనలు ఈ విధంగా సాగుతయ్. "దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకిలోనవుతున్నాడు. అందులో చాలా భాగం అర్థం లేనివీ, వ్యర్థమైనవి. అందులో కొన్నింటిని నెమరువేసి, సాగదీసి అనుభవిస్తాడు. కాని ఒక్కటి కూడా అతనికి మిగలడం లేదు. రుచికరమైన పదార్థాలెన్నో తింటాడు. 'రుచి' అన్న అనుభవం ఎక్కడికి పోతుందో మరి, ఆ క్రియతోటి అది మాయమై పోతుంది. వాసనా సుఖమూ, భోగమూ, నవ్వూ, ఏడుపూ అన్నీ ఏమైపోతున్నవో? చాలా భాగం కొద్దికాలం వరకూ జ్ఞాపకాలుగా నిలిచినా తరువాత జారిపోతాయి. తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవ జీవితానికి పరిపూర్ణత వస్తుంది. లేకపోతే మానవ జాతికి నిజమైన మనుగడ లేదు" అనుకుంటాడు.

హఠాత్తుగా అతని నోటినుంచి సుఖం, చలి, మంచితనం లాంటి మాటలు వస్తాయి. ఆశ్చర్యకరంగా అవి రంగురంగుల శిలారూపాలను సంతరించు కుంటాయి. ఆ రాళ్ళలో కోటకట్టుకుని, అందులోనే ఉండాలనుకుంటూ ఉంటారు. అప్పుడు అతని ప్రియురాలు గౌరి వస్తూ కనిపిస్తుంది. అంతవరకు దరిదాపుల్లో ఉన్న ఏముసలివాడినైతే అసహ్యించుకుంటు ఉంటాడో గౌరి కూడా అదే విధంగా

అస్తిపంజరంలా కనిపిస్తుంది. ఆమె తనను సమీపించకుండా ఉండడానికి 'ప్రేమ' అను పదంతో ఒక రాయి చేసి కోటద్వారం మూసివేస్తాడు. అందులో ప్రాణ వాయువు లేక ఊపిరితిరక్క చచ్చిపోయిన అతన్ని చూసి ముసిలాయన జాలి పడతాడు.

ఈ కథను మనం ఇలా అన్వయించుకోవచ్చు. విపరీతంగా పెరిగిన శాస్త్రజ్ఞానం ఫలితం వెర్రితలలు వేస్తున్న ఆలోచనలేనా ? దీని పర్యవసానం ఏమిటి? తనని తను మూసేసుకుని సహజప్రేమను చంపుకోవడమేనా? చివరికి ప్రేమ రాహిత్యంలో శిలీకరించుకపోయిన మనసుతో మనుగడ అంతం చేసుకోవడమేనా? మనిషిలో సహజంగా సాగే సాత్విక భావాలకూ, స్పందనలకూ ప్రాధాన్యత నివ్వనినాడు ఆ మనిషి నశించిపోయినట్టే. అతడికి ప్రాణ వాయువు అందనట్టే!

'గడియారం' కథలో ఇండియాలో ఉన్న అక్క 'ధర్మ' అమెరికాలో ఉన్న తన చెల్లి మనోమోహినికి తనకు లూకీమియా అని తెలిపే ఉత్తరంతో బాటూ తమ తండ్రికి చెందిన ఒక పాత గడియారాన్ని పంపుతుంది. కాని కథ ఈ గడియారం గురించి కాదు. నిరంతరం ఆగకుండా పరిభ్రమించే, క్రమం తప్పని సృష్టి గడియారం గురించి.

ఈ కథలో ఒక వాడిన పువ్వు తీగనుంచి వ్రేళ్ళాడి చివరికి కింద పడిపోతుంది. అది "మట్టిని తాకి స్వస్థత పొందింది" అంటారు రచయిత్రి. ఈ 'స్వస్థత' అన్న పదంలో ఎంతో గూఢార్థం దాగి ఉంది. "ఆ పువ్వు పరిణతీ, దాని లక్ష్యం. దాని సత్యం ఆ మట్టితోనే ముడివడి ఉన్నాయా? జీవితానికి సార్థకత జీవించడమేనా? ఏమీ సాధించాల్సిన అవసరం లేదా? అనంతమూ, సంకీర్ణము అభేద్యము అయిన జీవితం ముందు మానవ ప్రయత్నం ఇంత చిన్నదా" అని 'మనో' అబ్బురపడ్తుంది.

అలా కాసేపు విచారించాక తన దైనందిన జీవితంలో పడిపోతుంది. అక్క చనిపోకముందే తన జ్ఞాపకాల్లో సమాధి కప్పేస్తుంది. అక్క ఒక స్మృతిగా అందరాని చోట నిలిచిన ఒక బరువుగా ఆఖరైపోతుంది.

నిజమే! మరణం ఎంత దుఃఖభరితమైనా, భరించలేని వేదన కలుగచేసినా, అది ఒక స్మృతిగానే నిలిచిపోతుందే తప్ప అనుక్షణమూ బాధించే ఒక ముల్లుకాదు. అది జీవన గడియారంలో ఒక సహజ కృత్యం. పువ్వులో ఇతర ప్రాణులూ చివరకు మట్టిలో 'స్వస్థత' పొందినట్టు, మానవులు కూడా మట్టిలోనే స్వస్థత పొందుతారు. జీవన గడియార భ్రమణం సాగుతూనే ఉంటుంది.

మదనపల్లె నివాసి శ్రీమతి ఆర్. వసుంధరా దేవిగారు నలభై ఎనిమిది కథలు రాశారు. వీరి ఆలోచనల్లోని తాత్త్విక చింతనలను కథలుగా మలిచారు. దానికి తగ్గ కథావస్తువులను తను నివసించే ప్రదేశాలనుంచే ఎన్నుకొన్నారు. వీరి మాటల్లో అలౌకిక భావనలు తాత్వికత ఉట్టి పడుతుంటాయి. ఈ నలభై ఎనిమిది కథల్లో కూడా తాత్త్వికమర్మం లేని కథలే లేవు. తెలుగు విమర్శనా సాహిత్యంలో పేరెన్నిక గన్న స్వర్గీయ శ్రీ ఆర్.యస్. సుదర్శనం గారి సతీమణి ఈమె. ఉద్యోగ రీత్యా భర్తతో పాటు అనేక ప్రదేశాల్లో నివసించారు. ఈమె కథలపై దేశకాల పరిస్థితుల ఛాయ బాగా ఉంటుంది. వివిధ జిల్లాల్లోని ఆయా కాలాల పరిస్థితులను, నాగరికతలను, సంప్రదాయాలనూ, సాంఘిక జీవనాన్నే కాక ఊర్ల పేర్లను, పాత్రలను సందర్భోచితంగా ఎన్నుకొని ప్రాంతీయతకు జీవం పోశారు.

మనిషిలో నిద్రాణంగా ఉన్న తాత్త్విక చింతనలను తట్టి లేపి, సత్యాన్వేషణ వైపు, ఆత్మ జ్ఞాన విశ్లేషణవైపు మళ్లించే కథలు వీరివి. ఇవి మానసిక రుగ్మతలకు, ఊరట కలిగిస్తూ, తాత్కాలిక చింతనలకు సాంత్వన నిస్తాయి. "చింతలన్నీ తాత్కాలికాలే" నన్న హితవు చెబుతాయి.

సాహిత్య విషయంలో తన భర్త ప్రభావం తనపై లేదంటారు వసుంధర గారు. తన కిష్టమైన పుస్తకం త్రిపురా రహస్యం అని, గురజాడ వారి 'పూర్ణమ్మ' ఎన్ని మార్లు చదివినా తన కళ్ళు అశ్రుపూరితాలవుతాయనీ చెప్పారు.

వీరి కథలన్నీ కలిపి 'ఆర్. వసుంధరా దేవి కథలు' అన్నపేరిట పుస్తకంగా వెలువరించారు. వీటిలో తొమ్మిది కథలు గాలిరథం పేరుతోనూ, పన్నెండు కథలు 'నీడలు' పేరుతోనూ పుస్తక సంకలనాలుగా వెలువడ్డాయి. ఈ కథలన్నీ దాదాపు అన్ని పత్రికల్లో అచ్చయినవే. 'శివరావు కోట' కథ విస్తరణ పొంది "రెడ్డమ్మ గుండు" పేరుతో భారతి మాసపత్రికలో ధారావాహికంగా వెలువడినది.

తన ప్రచురణకు ముందు మాటగా "కథ ప్రయోజనం ఆలోచనా పరులైన, సహృదయులైన పాఠకుల ముందుకు వచ్చి వారి ఆలోచనల్లో నిలువడమే" నంటారు వసుంధర గారు. ఆ ప్రయోజనాన్ని పుష్కలంగా నెరవేర్చుకున్న వీరి కథలు గంభీరంగా, బరువుగా సర్వజనీన సాహిత్యపు కోవలో శాశ్వతాలై నిలబడతాయి.

# వసుంధర కథాశిల్పము

డా. తాడేపల్లి పతంజలి

"జీవితంలో వ్యక్తులు, సన్నివేశాలవల్ల కలిగే అనుభూతుల స్పందనని నేరుగా పాఠకుడి హృదయంలోకి బట్వాడా చేయటానికి-జాగ్రత్తగా ఎంపిక చేసిన మాటల పొందికే శిల్పమని మధురాంతకం వారి భావన". రచన 2008 డిసెంబర్ మాసపత్రికలో మధురాంతకంవారి కథలను సమీక్షిస్తూ వసుంధర కోట్ చేసిన వాక్యమిది.

శిల్పమంటే ఎన్నెన్నో నిర్వచనాలు మనకు కనిపిస్తాయి. అన్నింటిలోకి నన్ను ఆకర్షించిన శిల్ప నిర్వచనమిది. అందుకే దీనిని ఆధారం చేసుకొని వసుంధర కథాసంపుటి "రసికరాజతగువారముకామా" ! కథల సంపుటిలో శిల్పాన్ని ఆకాశదర్పణ న్యాయంగా (అద్దంలో అకాశం కనబడినంత) పరిశీలించటం ఈ వ్యాసోద్దేశ్యం.

వసుంధరకి ఒకనమస్కారబాణం వేయకుండా ముందుకి వెళ్ళటం మర్యాదకాదు. (పార్థు బాణపాత ప్రకారంబులు ప్రణామకుశలంబులుగనంత రంగంబుల గనికొని-విరాటపర్వము 40వ ఆశ్వాసము-255వచనం) గదాధరుడులా వసుంధర కథాధరుడు. కథలపుట్ట.

పలకరిస్తే పద్యాంలా, ఆ "వాగర్థావివ సంపృక్తౌ" దంపతులు జొన్నలగడ్డ రామలక్ష్మి, రాజగోపాలరావులు వసుంధర పేరుమీదుగా కథాక్షేత్రాన్ని వాడుక భాషలో చెప్పాలంటే ''దున్నేస్తున్నారు''. ఆ పంటని కోసుకోగలిగినంత వారికి కోసుకోగలిగినంత. కొన్ని కథల్లో వారి రచనాశిల్పాన్ని "హృదయం దగ్గరపెట్టుకొని" పరిశీలిస్తాను.

**రేపటిదాకా ఆగు:** ఒక అప్పులవాడి కథ ఇది. అందినకాడికి- అప్పులు చేసి తీర్చలేక కనబడ్డ ప్రతివారికీ రేపటిదాకా బాకీకోసం ఆగమని చెప్పి ఆ 'రేపటిరోజున' చనిపోతాడు. అతడు చనిపోయిన మర్నాడు (రేపు) లక్షాయాభైవేల లాటరీ ప్రైజ్ వస్తుంది. అంతమందిని రేపటిదాకా ఆపిన రమణయ్య రేపటిదాకా ఆగలేకపోయాడని రచయిత కథని ముగిస్తాడు.

ఈ కథలో ప్రాణశిల్పం ప్రాణాలుపోగొట్టుకొన్న రమణయ్య రేపటిదాకా ఆగలేకపోయాడనే కథకుల చివరివాక్యంలో ఉంది. ఇది గుండెలనిమెలిపెట్టే వాక్యం. కథకులు కావాలని వ్రాస్తారో లేక సన్నివేశపరంగా పదాలు వాటంతటవే దిద్దుకొంటాయో కాని, ఈ కథా ప్రారంభంలో (ఒక అప్పులవాడిని చూపిన సందర్భంలో) "రమణయ్యకి వణుకువచ్చి దిగవలసిన స్టేషన్ ఇంకా రానప్పటికీ ముందే దిగిపోయాడని" కథా ప్రారంభంలో వ్రాసారు. ఇంకా కథ మధ్యలో ఒకచోట ముకుందం అనేవాడితో మాట్లాడుతూ "ఎల్లుండినుంచి నువ్వు నన్ను బాకీ అడగవు" మొదలైన వాక్యాలు గమ్యం వైపు పట్టుకెళ్ళేతాళ్ళలా కనిపిస్తాయి. దీనిని భవిష్యత్కథా సూచనాశిల్పం అంటే అభ్యంతరమేముంది?

**నా రెండో కథ :** ఈ కథను రెండో కథగా కథా సంపుటిలో ప్రచురించటం-ఒక చమత్కారం.

గాంధీగారిలా సత్యాన్వేషణ చేసే ఒక రచయిత మొదటికథ వ్రాసిన పాతిక సంవత్సరాల తర్వాత రెండోకథ వ్రాస్తాడు. ఇంచుమించుగా మొదటి కథలానే అది కూడా ఉంటుంది. ఈ విషయం ఒకపాఠకుడి ద్వారా తెలుసుకొన్న రచయిత "భావావేశంతో, సమగ్రంగా ఉండాలనుకొనే తనలాంటి రచయిత రెండో కథ రాసే అవకాశం ఈ దేశంలో ఎప్పుడు వస్తుందో. అసలు వస్తుందో, రాదో అన్న విషయానికి జవాబు ఎవరు చెప్పగలరని" దిగులుపడటంతో కథ ముగుస్తుంది.

సాధారణంగా పాతికసంవత్సరాల తర్వాత అనేకరకాలుగా దేశం మారుతుంది. మార్పుకు తగినట్టు రచయిత కొత్తరకంగా రాయలేకపోయాడు. అంటే దేశం అతనికి నూతనభావావేశం తెప్పించలేకపోయింది. దీనికికారణం దేశమా? రచయితా? రచయితల్లో స్పందించే గుణానికి లోటులేదని కథ మధ్యలో ఒకచోట కథకులు ఇలా చెబుతారు. "చిన్నారిపాపల ముఖాలుచూస్తూ వాళ్ళ కబుర్లు వింటూ పొందే ఆనందంలో వేదాంతగ్రంథాల పారాయణ ఇచ్చే ఆనందం ఏపాటిది?"... ఇలా చక్కటి భావాలతో స్పందించే మనస్సున్న వాడు రచయిత అని చెప్పటంలో - కథకుల ఉద్దేశ్యం వెల్లడవుతుంది. దేశం శాస్త్ర విజ్ఞానంలో మానవుడిని సుఖపెడుతోంది కాని సహృదయుడిని భావావేశంతో ఆనందింపజేయలేకపోతోంది. ఈ మాటలు ప్రత్యక్షంగా కథకులు వ్రాయలేదు. కాని పరోక్షంగా కథ చదివే సహృదయుడి మనః ఫలకపై వ్రాసారు. ఇదొక శిల్ప సరిగమ.

**మర్రిచెట్టు-గుమ్మడికాయలు:** "బతకలేక బడిపంతులైన శ్రీకాంత్ మేష్టారు బడిపంతులైనాక బతకటం ప్రారంభించాడు."

కథా ప్రారంభంలో నాలుగయిదు వాక్యాలయిన తర్వాత కథకులు ఒక పాత్రను పరిచయం చేసినతీరది. 'కాపురం చేసే కళ కాలిగోళ్ళనిబట్టి తెలుస్తుంద'ని తెలుగులో ఒక సామెత. కథలో ఉన్నది పట్టా! గాలికిపోయే పేలాల పొట్టా?! అనేది విమర్శకులు ఇటువంటి వాక్యాలవలన అంచనా వేస్తారు. ఇది కథాప్రారంభంలో పరిణతిచెందిన కథకుల మాటల శిల్పం.

ఈ కథలో మేష్టారి ఆలోచనా పరంపర నీడనిచ్చే చల్లనిచెట్టుకింద జరుగుతుంది. ఉపాధ్యాయుడు చెట్టులాంటివాడు అనే అనుభూతిని పాఠకుడికి అందిస్తూనే "చెట్టునీడనుంచి బయట పడగానే ఎండ ఆయనను బాధించసాగిందని" సమస్యలని ఎండలతో పోలుస్తూ కథకులు ఒక విసురు విసిరారు. "అయినా మేష్టారు ఆ బాధను గుర్తించలేదని (అంటే తృప్తిపడితే సమస్యలు బాధించవనే సత్యాన్ని తెలుసుకొన్నారని వ్యంగ్యం) వ్రాస్తూ మధురాంతకంవారు చెప్పిన మాటల శిల్పాన్ని వసుంధర జగజ్జేగీయమానంగా పాటించారు.

**నకిలీ ముత్యాలు:** కథలని ముత్యాలతోను, సంపాదకులను ముత్యాల వ్యాపారులతోనూ పోల్చటంతో ఈ కథ ప్రారంభమవుతుంది. సంపాదకుడిని ముత్యాలవ్యాపారి అనవచ్చా?! అని 'కుంచెం' (ముళ్ళపూడి పేటెంట్) బెంగపెట్టుకొనే పాఠకులు రామ్మోహన్ వంటి పత్రికాసంపాదకులను చూసిన తర్వాత 'నిజమేస్మీ' అని బుర్రకాయలూపుతారు. కథలో ముందొక స్టేట్మెంట్ పడేసి దానిని సమర్థించుకొనే బాధ్యత పాఠకుల మీద పడేయటం చేయి తిరిగిన కథారచయితల శిల్పం. వసుంధర దీనిని తన కథాముత్యం సాక్షిగా పాటించారు.

ప్రతిభావంతుడైన రచయిత మీద పగతో పత్రికను పెట్టిన రామ్మోహన్ కొ.కు.ఫోటోకు కాగితాల పూలమాల వేయటం గమనించి బాధపడిన రచయిత 'కుటుంబరావు ఛాయాచిత్రానికి పూలమాల వేస్తే వేసారుకాని ఆయన మీద వ్యాసం వ్రాయెద్ద"ని సంపాదకుడితో చెప్పటం ఈ కథలో కొసమెరుపే కాదు. అరకొరజ్ఞానంతో వ్యాసాలు వ్రాయవద్దని వ్యాసకర్తలకు కూడా ఒక పూల చెమ్కీదెబ్బ కూడా.

**గుడ్డికన్ను:** "గుడ్డికన్ను ఉన్నా ఒకటే... పోయినా ఒకటే" అని ఒక తెలుగు సామెత. జీవనోపాధికి ఉపయోగించుకోలేనప్పుడు ఆ చదువు ఉన్నా ఒకటే...

లేకపోయినా ఒకటే... ఇది చెప్పదలుచుకొన్న కథకులు "గుడ్డికన్ను" అని కథకు పేరు పెట్టారు. ఇది వసుంధర శీర్షికా శిల్పం.

కథలో తాను పెట్టిన శీర్షికను ఏదో రకంగా ఇరికించటానికి చూడటం కంటే కథ మొత్తం చదివిన తర్వాత పాఠకుడే రచయిత కథకి ఈపేరు ఎందుకు పెట్టి ఉంటాడబ్బా! అని ఆలోచించాలి. నిజమైన ఆలోచనామృతము అదే! దానిని ఈ కథ కలిగిస్తుంది.

**సర్ప దష్ట:** మనం మంచి అనుకొనే ఒకరిని ఇంకోలా ఊహించలేం. ఇంకోలా వాళ్ళు ప్రవర్తిస్తే మనంబతకలేం. ఈ సర్పదష్ట కథ ఈ భూమిక మీదనడిచింది. ఎంతో మంచివాడనుకొన్న తనభర్త తనపై చీకటిలో అత్యాచారం చేసినవాడని తెలిసిన కథానాయిక వెంటనే చచ్చిపోతుంది.

ఈ కథలో నాయికపేరు సునంద. అనగా మంచితనంలో ఆనందించేది. విలన్ లాంటి నాయకుడి పేరు రంగారావు. రంగ శబ్దానికి తగరమనిఅర్థం. **త్రపతే అగ్ని సన్నిధౌ ద్రవతీతి త్రపుహః** తగరం అగ్ని సన్నిధిలో సిగ్గుపడుతుంది. కరుగుతుంది. రంగారావు కూడా సునంద అనే సుశీలవతిని పాములా కరచాడు. కాని చివర్లో నిజాన్ని గ్రహించి కరిగాడు. ప్రయోజనమేముంది.

ఇతివృత్తానికి అనుగుణమైన పేర్ల పొందికతో కూడిన శిల్పము ఈ కథలో ఉంది.

**బ్రహ్మాస్త్రం:** ఇలా కూడా స్త్రీమూర్తిని పురుషుడు మోసం చేస్తున్నాడా! అని బాధతో గుండె బరువెక్కేటట్లు చేసే కథ ఇది. వేటిల్లోనూ పార్వతమ్మ మాటకు విలువని ఇవ్వని భర్త, పిల్లలు, పెళ్ళిలో కట్నం మాట్లాడుకొనే దగ్గర పార్వతమ్మ మాటకు విలువ ఇస్తారు. తన మాటకు విలువ ఇచ్చారని పార్వతమ్మ పొంగిపోతుంది.

కట్నం ఎక్కువ అడగిన చెడ్డపేరు తన మీదికి తోయటానికి, తన మాటకు ఇంట్లో పురుషపుంగవులు విలువ ఇచ్చారని పార్వతమ్మ గ్రహించలేకపోయింది. దీనికి రచయిత చూపినపోలిక బ్రహ్మాస్త్రం. ఇంద్రజిత్తు వేసిన బ్రహ్మాస్త్రానికి, తప్పించుకొనే శక్తి ఉన్నప్పటికీ బ్రహ్మాస్త్రం మీది గౌరవంతో ఆంజనేయుడు కట్టుబడ్డాడు.

ఈకథలో ఇంద్రజిత్తు- పార్వతమ్మ.

బ్రహ్మాస్త్రం - ఆవిడ మాట్లాడిన కట్నం.

ఆంజనేయుడు-పార్వతమ్మ భర్త.

విజయం ఇంద్రజిత్తుది కాదు. విజయం పార్వతమ్మది కాదు. ఈ విషయం ఆడవాళ్ళు ఎప్పటికి గ్రహిస్తారో అని రచయితలు కథ ముగిస్తారు. అంటే ఈ పురుషస్వామ్య వ్యవస్థలో స్త్రీని ఇలా కూడా మోసం చేస్తున్నారని రచయితల ఆవేదన.

ఈ కథలో శిల్పమంతా ఇంద్రజిత్తుతో పార్వతమ్మను పోల్చటంలో ఉంది. ఇంద్రజిత్తు ఒకరుచెబితే యుద్ధానికి వెళ్ళేవాడేకాని, తనంతట తాను నిర్ణయం తీసుకొని యుద్ధానికి బయలుదేరిన సందర్భం మనకు కనిపించదు.

పార్వతమ్మ లాంటి స్త్రీ మూర్తులు కూడా అంతే. భర్తో, కొడుకో, చేసిన నిర్ణయాలు ఆచరించేవారే కాని, నిర్ణయించేవారు కాదు. తనవల్లే ఆంజనేయుడు బంధింపబడ్డాడని ఇంద్రజిత్తు పొంగిపోతాడు. పార్వతమ్మ లాంటి మహిళలు కూడా అంతే.

తమ మాటకి విలువ ఇచ్చారని ఆడది పొంగుతుంటే, పురుషుడు ఆమెను అదే మత్తులో ఉంచి, ఆమెద్వారా తన పబ్బం గడుపుకొంటుంటాడు. ఇంత అర్థాన్ని నింపుకొన్న ఇంద్రజిత్తు పద ప్రయోగం వసుంధర కథా శిల్ప పరిమళము.

**తల్లి ప్రేమ :** ప్రేమలాగా, తల్లి కూడా ఎవర్గ్రీన్ సబ్జెక్ట్. ఆ మాటకొస్తే తల్లికి పర్యాయపద శబ్దాల్లో ప్రేమను కూడా చేర్చాలి. సాహిత్యకారులందరూ దీనితో తప్పనిసరిగా ఏకీభవిస్తారు కాబట్టి భవిష్యత్కాలంలో ముద్రించే పర్యాయపద నిఘంటువుల్లో అమ్మకు పర్యాయపదాల్లో ప్రేమను చేర్చుదురుగాక! తల్లిప్రేమ అనే పాదులో సాహిత్యంలో వచ్చిన అనేకానేక వాడిపోని పుష్పాల్లో వసుంధరగారి ఈ కథ ఒకటి. పుట్టకముందు కడుపులో దాచుకొని రక్షించే తల్లి పుట్టుక తర్వాత కూడా పెద్దవాడయి ఉద్యోగం చేస్తున్నపుడు కూడా రక్షించగలదని ఈ కథలో నిరూపితమౌతుంది.

తనకింద పనిచేసే శ్యామలరావు అనే అతణ్ణి ఒక ఆఫీసర్ అతని మీదకి ఫైల్ విసిరేసి అవమానిస్తాడు. అతని తరపున తల్లి ఆఫీసుకి వచ్చి కొడుకును అవమానించినందుకు ఆఫీసర్ని చెడామడా తిడుతుంది. ఆఫీసర్ కోపం తెచ్చుకోకుండా తల్లిని సముదాయించి పంపుతాడు. ఆఫీసర్ స్నేహితుడు కారణమేమిటని అడుగుతాడు. "శ్యామలరావు నాకంటే గొప్పవాడు. అతనికి తల్లి ఉంది. నాకు లేదు" ఈ మాటల పొందిక శిల్పానికి పరాకాష్ఠ.

**తల్లా? పెళ్ళామా? :** తరతరాల నుంచి నలుగుతున్న సమస్య ఇది. "తల్లి పొట్ట చూస్తుంది. పెళ్ళాం జేబులుచూస్తుంది. తల్లి అల్లం. పెళ్ళాం బెల్లం." ఇటువంటి సామెతలకు మనకు కొదువలేదు. ఈ నేపథ్యంలో 'వసుంధర' మమతలపై నేసిన చిక్కని నేత ఈ కథ.

"తల్లి ప్రేమ అనీ, భార్యప్రేమ అనీ ఇన్ని రకాలు లేవు. అజ్ఞానులైన మానవులు అనేక దేవుళ్ళను సృష్టించినట్లే అనేక రకాల ప్రేమలు సృష్టించారు. కానీ ప్రేమ ఒక్కటే" ఇది 'వసుంధర' తీర్పు.

స్త్రీ ప్రేమ ఆమె భర్తకీ, బిడ్డలకీ మాత్రమే పరిమితమని ఒక సిద్ధాంతం వసుంధర ప్రతిపాదించారు. మనం ఉలిక్కి పడనక్కర లేదు. మాగిన మామిడి పండులా జీవితాన్ని ఎన్నో వేల కథల్లో అనేకరకాలుగా చిత్రీకరించిన రచయితల వాక్కు అది. తమ అనుభూతిని పాఠకుడిహృదయంలోకి ప్రవేశపెట్టడంలో కథకులు చూపిన పలు దృష్టాంతాలు ఈ కథలో సాయపడ్డాయి.

**రసికరాజ తగువారముకామా! :** ఒక సంకీర్తనాచార్యుని కీర్తనయొక్క పల్లవిని "పెద్దనవలె కృతిసెప్పిన పెద్దనవలె" అని అద్భుతంగా పొగిడించుకొన్న పెద్దనగారి కథకు శీర్షికగా వాడుకొని విశ్వనాథ చెప్పిన "శిల్పంపు తెలుగు తోటను" తమ కథలో చూపించిన వసుంధర ధన్యులు.

"ఆంధ్రభోజుడన్న పేరిట శ్రీకృష్ణ దేవరాయలు ప్రస్తుతింపబడుటకు కారణము భోజుడతనికంటే ముందు పుట్టుటయే." ఈ వాక్యం కాదు కాదు ముత్యాల తోరణం కథాభవనంలోకి సహృదయులని ఆకర్షిస్తుంది.

మదగజేంద్రమునెక్కి నగరవీదులలో తిరుగుచున్న రాయలవారికి ఒకరోజు పెద్దనగారు కనిపించారు. గజేంద్రమును దిగి రాయలవారు పెద్దనతో మాటలాడుట మొదలుపెట్టినారు. తాను పూర్తి చేసిన మహాప్రబంధమును (మనుచరిత్ర) రాయలవారికి వినిపించుటకు బయలుదేరితినని పెద్దన అనగా రాయలవారు వెంటనే పెద్దనతోపాటు బయలుదేరలేదు. "ఇప్పుడు కాదు, తర్వాత మీకుకబురు పెట్టెదను. అందాకఆగ" మని రాయలవారు చెబితే పెద్దనగారితో పాటు వారి అనుబంధం తెలిసిన పాఠకులు కూడా "అరే! రాయలవారు ఇలా అన్నారేమి"టని కొంచెం మనసు నొచ్చుకొంటారు.

ఆరోజంతా పెద్దనకి కబురు రాలేదు. మరుసటి రోజు రాయలవారి దగ్గరనుండి మేనా వచ్చింది ఆహ్వానంతో. కావాలనే ఆలస్యము చేసి పెద్దన మేనా

ఎక్కి భువనవిజయ సభకు చేరారు. రాయల వారు ఎదురొచ్చి స్వయంగా ఆహ్వానించలేదు. పెద్దన చిన్నబుచ్చుకొన్నారు. కొంతసేపటికి రాయలవారు వచ్చి కావ్యాన్ని చదువుమని పెద్దనని కోరారు. తన మనస్సు బాగాలేదని అన్యులతో కావ్య పఠనము చేయించమని పెద్దన అంటే గజారోహణముకంటే మేనా గొప్పదని ఒక రోజు ఆలస్యం చేసాను. తొందరగా కావ్యాన్ని చదవండని రాయలు చిరుమందహాసంతో అంటే "మేనా, గజారోహణముకంటే ఎలా గొప్ప" దని పెద్దన రాయలవారిని ప్రశ్నించారు. "తాము పల్లకినెత్తుకొన్న బోయీ కావడానికి పెద్దనకు అ గౌరవము కల్పించుటకై నిన్న పిలవలేదని రాయలవారు చెబుతుంటే ఆనందాశ్రువులతో పెద్దన కావ్య పఠనం ప్రారంభమైంది."

"పెద్దన నోటి వెంట కావ్యము, కనులముందు తనకు  పల్లకీనెత్తిన శ్రీ కృష్ణదేవరాయలు కదలాడుతున్నారు" అని చెప్పుటతో కథ ముగుస్తుంది. కాని రసోదయం పొందిన మనస్సు మాత్రం తెలియని భావావేశముతో ఊగిసలాడుతూనే ఉంటుంది.

శైలీపరంగా రచయితలు ఈకథలో పొదిగినశిల్పం అద్భుతమంటే అది మాములుగా అందరూ చెప్పేమాటే అవుతుంది. కాని అంతకంటే గొప్ప పదం లేనప్పుడు ఆ పదప్రయోగం తప్పదు కదా!

**"సఏవ రసికో లోకే శ్రుత్వా కావ్యం పరైః కృతమ్**
**ఉత్పద్యతే చ యుగపద్వదనేక్ష్ణోశ్చ యస్యవాః"**

(సుభాషిత రత్న భాండాగారమ్-పుట39)

పరులు వ్రాసిన కావ్యాన్ని విని ఎవడికి ముఖం వికసిస్తుందో, ఎవడి కన్నులు కాంతితో మెరిసిపోతాయో వాడు రసికుడు.

ఈ కథలోని రసిక రాజు శ్రీకృష్ణదేవరాయలు, ఆయనతో తగువారము కామా! అని మనస్సులో సవాలువిసిరి, ఖేదపడి, ఆనక తనను మించిన వానిగా పరస్పరము భావించుకొన్న అపురూపఘట్టాన్ని చిత్రీకరించిన 'వసుంధర' ధన్యులు. ఇలా ఈ రసికరాజ తగువారము కామా? కథా సంపుటిలో నలభై కథలున్నాయి. అందులో ఒక పది కథలను స్పృశించే ప్రయత్నము ఈ లఘువ్యాసంలో చేసాను.

కథలను ఆసాంతం చదివినవారు "శిల్పమనల్పమ్" అని అనకపోతే అది ఈవ్యాసకర్త తప్పు అవుతుంది.

# 'ముళ్ళపూడి మార్కు' కథల జడి

సుధామ

సాహిత్యంలో ఒక పాత్రను సజీవం చేయడం అనేది ప్రతిభావంతులైన రచయితలకే సాధ్యం. జీవితం గురించిన ఒక విశాలమైన కాన్వాస్‌లో రాయబడే నవలలో అలాంటి చిరస్మరణీయపాత్రను సృజించడం ఒక మేరకు కుదిరేపనే. బుచ్చిబాబు చివరకు మిగిలేదిలో దయానిధి, గోపీచంద్ అసమర్థుని జీవయాత్రలో సీతారామారావులు మనకు గుర్తుండిపోతారు. వేయిపడగల్లో ధర్మారావునో, బాపిరాజు నారాయణరావునో ఉన్నవ మాలపల్లిలో వెంకటదాసునో మరిచిపోలేం. హాస్య నవలలాగానే రాసి మొక్కపాటివారు బారిస్టరు పార్వతీశాన్ని సజీవం చేశారు. నవలలో కాకుండా నాటకం ద్వారా గురజాడ కన్యాశుల్కం 'గిరీశం'ను సజీవపాత్రను చేసింది. వ్యాసాలలో ఆ పని పానుగంటివారు 'జంఘాలశాస్త్రి'ని ముందునిలబెట్టి చేశారు. మునిమాణిక్యం కథల 'కాంతం, భానుమతి 'అత్తగారు' అలా నిలచిపోయిన పాత్రలే.

కేవలం ఒక పాత్రను కాక అలా అనేక పాత్రలను తన సాహిత్యంతో సజీవం చేసి సమాజగతపాత్రలుగా నిలబెట్టిన ఘనత ముళ్ళపూడి వెంకటరమణదే. ఆయన సృష్టించిన బుడుగు, రాధ, గోపాలం, అప్పారావు, పక్కింటి పిన్నిగారు ముఖ్యంగా మధ్య తరగతి జీవితాల సజీవపాత్రలు. అంతేకాదు గురజాడ గిరీశాన్ని సృష్టించి వదిలేస్తే ఆ పాత్ర చేత లెక్చర్లు ఇప్పించి ఆ పాత్రను పెంచి పెద్ద చేసి సమాజంలో 'గిరీశం సంస్కృతి' ఒకటి పరివ్యాప్తమైన దాఖలాను నిలిపింది ముళ్ళపూడి వారే. హాస్యంలో 'ముళ్ళపూడి మార్కు' అనేది స్థిరీకరించిన గొప్ప కథకుడు తాను.

ముళ్ళపూడి వారి కథారమణీయంలో సీతాకళ్యాణం, ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ, జనతా ఎక్స్‌ప్రెస్, రాజకీయ బేతాళపంచవింశతి, ఋణానందలహరి, కానుక, రాధాగోపాలం, సాక్షి, ఆకలీ – ఆనందరావు, విమానం కథ ఇలా అనేకం ఉన్నాయి. విక్రమార్కుని మార్కు సింహాసనం కథలు అని సినీజగత్తు కథలూ రాశాడాయన.

కందుకూరితో సహా హాస్యరచనల్లో మునిమాణిక్యం, మొక్కపాటి అంతకుముందే చిలకమర్తి, పానుగంటి, తదనంతరం భమిడిపాటి వీరందరూ వున్నా

వారందరు సృజించిన హాస్యరచనలకూ ముళ్ళపూడి హాస్యరచనకూ తేడా వుంది. తెలుగు కథా సాహిత్యంలో ముళ్లపూడిది ఒక విశేషస్థానం. కేవలం హాస్యకథకుని గానే కాదు, సీతాకల్యాణం, కానుక, సాక్షి, ఆకలీ ఆనందరావు వంటి కథలు చదివినప్పుడు ఆయన కథా విశిష్టత మరీ ప్రత్యేకించి గోచరిస్తుంది. కథ చెప్పడంలో తనదైన ఒక సొబగును సాధించిన కథకుడాయన. హాస్యం, వ్యంగ్యం, పేరడీలతో బాటు భాషను వినూత్న పదాల పోహళింపుతో రసరమ్యం చేసిన రామణీయకత రమణ గారిదే.

సమాజాన్ని ముఖ్యంగా మధ్యతరగతి సమాజాన్నీ, అలాగే రాజకీయరంగాన్ని కథల్లో సాక్షాత్కరింపచేయడంలో ఆయన చూపిన విన్నాణం గొప్పది. ఒక 'అప్పు' అనే అంశాన్ని సర్వోతోముఖంగా విస్తరించి కథల్లో చెప్పడం ఆయనకే చెల్లింది. అలాగే టీనేజీ యువతీయువకుల ఆలోచనలు ఆయన పట్టుకున్నట్లు వాటిని అభివ్యక్తీరించినట్లు సరసరమణీయంగా మరొకరు చేయలేదేమో ముళ్లపూడి కథల భాష, కథనం తీరు ఆ తరువాత చాలామందికి ఒరవడి అయింది. నాలుగు అయిదు దశాబ్దాల క్రితం రాసిన కథలు ఆయనవన్నీ. మధ్య తరగతి బ్రతుకులకు అద్దంపడుతూ, నేటి మిడిల్‌క్లాస్ మెంటాలిటీకీ కూడా సజీవసాక్ష్యాలుగా సజీవంగా నిలచి ఆ కథలు అలరిస్తూనే వుంటాయి. 'అప్పారావు' అనే పాత్ర ఆర్థిక వ్యవస్థ ఎన్ని పరిణామాలు చెందినా ఎప్పటికీ నిలచివుంటూనే వుంటుంది. ఆయన ఊహలు, శైలి, పాత్ర చిత్రణం, భాషాకేళీవిలాసం కారణంగానే వాటికి విలక్షణత వచ్చింది. ఆ కారణంగానే 'ముళ్ళపూడి మార్కు' అనేది ఒకటి సాహిత్యంలో స్థిరమైంది.

'బుడుగు' పాత్ర బాలసాహిత్యానికే మకుటాయమానమైంది. ఇంటింటా ఒక బుడుగు, మా ఇంట్లో బుడుగు అని నేటికీ కుటుంబాలు చెప్పుకునే సంవిధానానికి ప్రాతిపదికలు వేసి రూపకల్పన చేసింది ముళ్ళపూడి వెంకటరమణే. పిల్లల అల్లరికి, అల్లరి పిల్లలకు ఒక ఆమోదముద్ర వేసి అందులో ఒక ఆనందదాయకమైన సారస్యాన్నీ, స్వారస్యాన్నీ సృజించారు ఆయన. ముళ్ళపూడి పద విన్యాసం కథల్లో కమనీయంగా కదను తొక్కుతుంది. అవి వెలార్చే అర్థాలు భాషా సరస్వతికే నవ్యాభరణాలు. బాపు ముళ్ళపూడి ఒక జమలిక. బాపు బొమ్మలు ముళ్ళపూడి పాత్రలను సాక్షాత్తు మనముందు నిలబెట్టాయి. భాష, భావం, ప్రయోగం ఏదైనా కానీయండి ముళ్లపూడిది బహుముఖీన ప్రతిభ.

ఆంధ్రసచిత్రవారపత్రిక, జ్యోతి మాసపత్రిక ముళ్లపూడి రచనలను ఆనాడు తెలుగు పాఠకలోకం మీదికి ప్రధానంగా సంధించి సమ్మోహన పరిచాయి. వార, మాస పత్రికల ప్రత్యేక సంచికలకు ముళ్లపూడి కథ ఒక వన్నె తెచ్చేది. ముళ్లపూడి కథల గురించి ఎమ్వీయల్ 'కానుక' పేర ఒక సిద్ధాంతగ్రంథం లాంటిదే రాయగా ముళ్లపూడి వెంకటరమణ సాహితీ సర్వస్వం విశాలాంధ్ర ప్రచురణల సంపాదకత్వం వహించిన ఎమ్బీయన్ ప్రసాద్ ఆ సంపుటాల్లోని అంశాలకు కరదీపికలందించే మంచి కృషి చేశాడు.

'మరల ఇదేల రామాయణమటన్న' అని విశ్వనాథ వారన్నట్లు అందరికీ తెలిసిన 'సీతాకల్యాణం ఘట్టమే ముళ్లపూడి చేతిలో హృదయాహ్లాది కథగా వెలుగొందింది. అలాగే రమణను కథకుడిగా ఒక ఉదాత్త స్థాయిలో నిలబెట్టిన కథ 'కానుక' కృష్ణుడికి ఒక చక్కని వేణువును తయారు చేసి ఇద్దామనుకున్న గోపన్న ఆరాటం, తీరా అన్ని చక్కగా కుదిరాయనుకున్న వేణువును పిల్లవాడు అటకమీద మిగతావాటితో కలిపేయడం, కృష్ణుడికి అందించాల్సిన వేళ ముంచుకురావడం అటకమీద దాచిన వేణువులన్నీ ఒక్కొక్కటీ దించి అసలుదేదో పరీక్షించే ప్రయత్నం... పుట్టిన రోజు పండుగ అయిపోకుండా చీకటిపడే వేళకు కృష్ణుడికి వేణువును పంపడానికి చివకు మిగిలిన ఒక్కదాన్ని ఇది అయి ఉంటుందని పంపడం... ఒక గొప్ప అనుభూతి రమ్యమైన పౌరాణిక స్థాయి కథ అది.

"తాను పని ముగించాడా... భగవంతుడికి సరియైన శ్రుతిబద్ధమైన వేణువును పంపాడా" ఇన్ని సంవత్సరాలు కృషి చేసి ఇన్ని వేల పరీక్షలు జరిపి, చివరకు పంపినవేణువును పరీక్షించుకోలేదు. అది కిష్టయ్యకే వదిలేశాడు. శ్రుతి సరిలేకపోతే ఆయన సరిచేసుకుంటాడు. అయినా శ్రుతిబద్ధంగా ఉందోలేదో నిర్ణయించే జ్ఞానం తనకు ఉందా !... సరిచేసే శక్తి ఆయనకు లేదని తను అనుకొన్నాడా? గోపన్నకు నవ్వు వచ్చింది.

కథ చివర్లో తీరా కిష్టయ్య మురళి వాయించేసరికి పనికిరాదనుకున్న సహస్రవేణువులా భువనమోహనంగా ఆ కుటీరంలో గానం చేయడం జరుగుతుంది. చిన్న గోపన్న తండ్రి దగ్గరకు తిరిగివచ్చి అంటాడు "అయ్యా అయ్యా ! కిష్టయ్య నీ మురళి వాయించాడే. నాకు బువ్వ పెట్టాడు. ఇక్కడ ముద్దెట్టుకున్నాడు. అయ్యా

మరేం కిష్టయ్యా నీ మురళి వాయించాడే కానీ, మరే ఎంత వాయించినా ఏమీ వినబడలే. అస్సలు పాటే రాలేదే... కాని కిష్టయ్య మంచోడు. నన్నిక్కడ ముద్దెట్టు..."

గోపన్న తలతిప్పి గదినిండా పడివున్న వేణువులను చూశాడు, ఇంతసేపూ గానం చేసి అలసిపోయిన వేణువుల వంక ఆప్యాయంగా సగర్వంగా చూసి ఒకటి తీసి ముద్దుపెట్టుకున్నాడు గోపన్న అని కథ ముగుస్తుంది.

ఈ కథ భాషలో, భావంలో, అనుభూతిలో మల్లాది రామకృష్ణ శాస్త్రిగారిని దరిచేరి అధిగమించినట్లుంటుందన్న మాట వాస్తవం. ఇదేమీ హాస్య కథ కాదు. కానీ ముళ్ళపూడి అనుభూతి పరిణతికి ఈ కథ ప్రతీక. మురళి ఒక జీవాత్మకు ప్రతీక అయితే. ఉపయుక్తమయ్యే మురళికై అన్వేషణ ఒక జీవుని వేదన. కృష్ణుడు వాయించగల మురళి నిర్మాణం అంటే జీవుడు తన బ్రతుకును మలుచుకోవడమే ననిపిస్తూ ఒక సార్వకాలిక సత్యాన్ని ప్రతీకాత్మకంగా అనుభూతిరమ్యం చేసే కథ 'కానుక'. సాహిత్య అకాడమీ వారు ఆంగ్లంలోకి అనువదింప చేసిన కథల్లో ముళ్లపూడి హాస్యకథలేవీ గాక ఇది వుండడం అనేది ఏ భాషవారికైనా కదిలించగల అనుభూతి కథనం కావడంవల్లనే అన్నమాట సత్యం.

కథలు రాయడంలో ముళ్లపూడి కలం వెలుగులు నిజంగా జగజ్జేగీయ మానాలే ! పెళ్ళి కాకుండానే, బ్రహ్మచారిగా వుండగానే ముళ్ళపూడి కుటుంబ జీవన మధురిమలను తెలిపే 'రాధాగోపాలం' కథలు రాయడం విశేషమే. ప్రణయ కలహాలను, కొత్త దాంపత్యాన్ని మధ్యతరగతి ఇంట్లో చుట్టాల బెడదలను మనోహరంగా రాశారాయన. పదచమత్కారాలు, భాషాచమత్కారాలు, సంఘటనాగత చమత్కారాలు ఇలా ఎన్నెన్నో ఆయన కథల్లో కనిపిస్తాయి. యువతీయువకుల ప్రేమ కథలకు ముళ్ళపూడి మంచి గుడికట్టారు. అలాగే ముందే చెప్పుకున్నట్లు అప్పుల గురించి రాసిన విస్తృత 'పన్'డితుడు తానే. ముళ్ళపూడి పేర అచ్చయిన తొలికథ 1953లో బాపు రాసింది. "కథలు రాస్తానని బెదిరించడమే కానీ నేను కాగితం మీద కలం పెట్టుకపోవడంతో నాకు ధైర్యం చెప్పడానికి నా పేర బాపుయే కథ రాసి బొమ్మవేసి పెట్టాడు. ఇడ్లీ కన్న పచ్చడే బాగుందంటూ సంపాదకులు వేసుకున్నారు" అని ఆంధ్రప్రభ జనవరి, 7, 1953 సంచికలో 'లక్ష్మి' కథ గురించి చెప్పుకున్న ముళ్లపూడి తాను రాసిన తొలి కథ 'ఛాయలు' 1953 మార్చిలో, తర్వాత 'ఆకలి – ఆనందరావూ' జూలై 1953లో ఆంధ్రపత్రికలో వచ్చాయి.

ఆంధ్రపత్రికలో ఉద్యోగంలో చేరాక ముళ్లపూడి కలం విజృంభించింది. కథా రచనలోనే కాదు సినిమా సమీక్షలకూ తనదైన బాణీని చూపింది ముళ్లపూడి. సినిమా మంచిని మెచ్చుతూ లోపాలను చమత్కారంగా ఎత్తి చూపుతూ ఆ సినిమా సమీక్షలను కూడా రంజయిన కథలుగా చదివించింది ముళ్లపూడియే. సినిమాలను తిట్టి సినిమాలను తీసే స్థాయికి ఎదిగిందాయనే. మొదటి సినిమా 'సాక్షి' 1959 అక్టోబర్‌లోనే కథగా రాసుకుని 1967లో సినిమా తీసారు... తాష్కెంట్ ఫిలిం ఫెస్టివల్‌కు అది ఎన్నికయింది అంటే ఆ కథ అంతర్జాతీయ స్థాయిదని వేరే చెప్పాలా?

ముళ్లపూడి కథలు వివరించి చెప్పడం కంటే ఎవరికివారు చదువుకున్నప్పుడు కనీసం ఒకరు చదువుతుంటే మరొకరు శ్రద్ధగా విన్నప్పుడు ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి. వంగూరి ఫౌండేషన్ అమెరికా వారు వంశీసంస్థ సహకారంతో హైదరాబాద్‌లో నెలానెలా వెన్నెల కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మే నెల (2010)లో 'నాకు నచ్చిన కథ' సమావేశంలో ముళ్లపూడి 'రాధమ్మ బాకీ' కథ నేను చదివి వినిపించినపుడు శ్రోతలు ఆసాంతం కదలక శ్రద్ధగా విని ఆనందించుట గమనించాను. మంచి కథలు చదవడం, చదివి వినిపించటం అనే మంచి సంస్కృతి పరివ్యాప్తమైతే నిజంగా బాగుంటుంది.

నిజానికి పరిశోధన చేయదగినంత విపుల విషయ సంచయం ముళ్లపూడి కథల్లో వుంది. ఆయన కథల్లోంచి వాచవిగా కొన్ని వాక్యాలు మాత్రం ఉటంకిస్తాను. వాటిల్లోని సొబగులు, అర్థాలు మీరే అందుకోగలరు.

* ఊహ కందే సంగీతంలో పాటకందేది శతసహస్రం ఉండదు (కానుక)
* నిశ్శబ్దం తీవ్రంగా ఉపన్యసించింది
* జోరీగల జోడు ఊరుని 'జో'కొడుతోంది (సాక్షి)
* ఇరుగుపొరుగులను ప్రేమించడం మధ్య ఇంట్లో కాపురం వున్న వారి విద్యుక్తధర్మం (వరలక్ష్మి వ్రతం)
* బాకీ తీరితే గుండెమీద రాయి దిగినట్టుంటుంది. అదేమిటో ఆ రాయి లేకపోతే నాకు నిద్రేపట్టదండి.
* అప్పిస్తానని ఒప్పించాక వాడివ్వబోయే అప్పు మనదృష్టిలో వాడివ్వవలసిన బాకీగా తయారయిపోతుంది.
* "నా మోహంలా? వుంది మీ ప్రతిపాదన"

* దివాలా ఎత్తినవాడి పరువులా సినిమా క్యూ చితికి చెల్లాచెదరైపోయింది.
* అప్పులవాళ్ళకు అందకుండా వాన చినుకులమధ్య నకులుడు గుర్రం తోలినట్టు చేతిలో డబ్బు పట్టుకెళ్లడం.
* బడిపంతుళ్ళ చేబదుళ్ళులాగా చిందరవందరగా ఉండే జుట్టూ అప్పు తెచ్చిన విచ్చు రూపాయిలా మెరిసే కళ్ళూ, బాకీల వాళ్ళకి కోపిష్ఠి వాడి జావాబులా పొట్టిగా, టూకీగా, అప్పారావు ఉంటాడు. (ఋణానందలహరి)
* తసాబుసామంటూ నాలికలు కొరుక్కుని, కోటికి పడగెత్తి, దోబుసలాడు కోవడం, కడుపారా గాలి భోంచేసి బుస్సున తేన్చడం, గాలి పుట్టలు కట్టడం – ఇది పాము భాష.
* జీడి పెట్టాను కాబట్టి గోలీ తన్నినా దీక్షితులు కృతజ్ఞాతా భావంతో ఊరుకోవాలి (కృతజ్ఞత)
* ఏవిడోళంల్డి – ఇడ్లీ నవులుతూ అనే పదం (ప్రాప్తి) ఏవిటోనండి
* పాపం... ఎవళ్డో ... ఒదిగి చెళిళవాళయి యుళ్డోడు (కృతజ్ఞత)
* – అవిరింత భాష (పాపం ఎవరో బతికి చెడ్డవాడయి వుంటాడు)
* త్మకమార్డు, జన్మ కావలెను (తమ కుమారుడు – జన్మ కావలెను)
* నిర్ఘాంతపోయాడు మళ్ళీ రాలేదు (జలప్రళయం)

ఇలా ఆయన అభివ్యక్తి చమత్కారాలు చెప్పుకుంటూ పోవాలంటే కోకొల్లలు. భాష చేత తన భావాలకు తగినట్లుగా ఎన్ని రకాల ఊడిగం చేయించుకోవాలో అంతా తెలివిగా చేయించుకున్నవాడు ముళ్లపూడి రమణ. అసలు ఒక సరికొత్త భావవినిమయ సాధనా భాషనే సృజించి గిలిగింతలు పెట్టిన రచయిత ఆయన. ఇటీవల తన ఆత్మకథను 'కోతికొమ్మచ్చి' గా రాసినప్పుడు కూడా రచనా సంవిధానంలో ఆ ఫణితిని అలాగే నిలబెట్టుకున్న వాడాయన. ముళ్ళపూడి వెంకటరమణ, ఎస్. పార్థసారథి, సి.వి. విజయలక్ష్మి, సి.వి.వి. లక్ష్మి. ఏసుదాసు వంటి కలం పేర్లు తన రచనలకు ఉపయోగించారు. పిల్లలకోసం విమానం కథ (1959లో) దక్షిణామూర్తి పేరుతో రాసిందీ ఆయనే.

శబ్దాశ్రయంగా, అర్థాశ్రయంగా అద్భుతమైన రచనలెన్నో చేశారు. అక్కినేని నాగేశ్వరరావు జీవితకథను, సినిమా వెండితెరనవలను కూడా కథగా చెప్పారు. కథ చెప్పడంలోని ఆనందం, ఆహ్లాదం ముళ్లపూడి కథల నుండి ఎంతయినా అందుకోగలం. తెలుగుకథా సాహిత్యంలో 'ముళ్ళపూడి మార్క్' చెదరిపోనిది, చెరిగిపోనిది, అందం, ఆనందం దాని పరమావధి.

# తెలుగు కథ - తీరుతెన్నులు

సి. జయపాల్‌రెడ్డి

సమాజంలో అనేకవర్గాలు, వృత్తులు, ప్రాంతాల వారి జీవితాలను, వివిధ కుటుంబాల, వ్యక్తుల జీవితాల్లోని అనేక కోణాలను చిత్రించి, సామాన్యానికి అర్థమయ్యే రీతిలో అందించే ప్రక్రియ కథ లేక కథానిక. కథల్లో కాలక్షేప కథలు, వ్యాపార కథలు, నేర కథలు, సార్వకాలీన, సార్వజనీన కథలు, ఒక ప్రాంతానికి కాలానికి, ఒక వర్గానికి, సంస్కృతికి. . . . యింకా అనేక రకాలున్నాయి.

సార్వకాలీన, సార్వజనీన కథలు ప్రపంచంలో ఎక్కడైనా, ఏ కాలంలో చదువుకున్నా అవి సులభంగా అర్థమవుతాయి. ముఖ్యంగా మానవ సహజాతాలను చిత్రీకరించే కథలు ఈ కోవలోకి వస్తాయి. పాలగుమ్మి పద్మరాజు కథ గాలివాన ఇందుకు చక్కటి ఉదాహరణ. ఏ సాహిత్య ప్రక్రియ అయినా దాని పరమార్థం సామాజిక ప్రయోజనం. కథల్లో జీవితం ఉంటుంది కాబట్టి పాఠకులను అవి ఎక్కువగా ఆకర్షిస్తాయి. కథలు సరళంగా, సూటిగా అర్థమయ్యే భాషలో ఉంటాయి. ఉండాలి కూడా. ఒక మనిషి జీవిత కాలంలో కొంతమంది జీవితాల్ని, కొన్ని ప్రాంతాలవారిని, వర్గాలవారిని మాత్రమే దగ్గరగా చూడగలుగుతాడు. ఎక్కువమంది జీవితాలను, ప్రాంతాల, వర్గాల యింకా అనేక రకాల వారి అంతరంగాలను, సాంస్కృతిక జీవితాన్ని కథల ద్వారా తెలుసుకోవచ్చును. ఇలాంటి కథల ద్వారా పాఠకులు ఎన్నో విషయాలను తెలుసుకుని తమ జీవితాలకు అన్వయించుకోవచ్చు. మెరుగు పరుచుకోవచ్చు. రచయితలు ఇట్లా సమాజానికి మేలు చేసే కథలు రాయాలి. అలాంటి కథలే కథాసాహిత్యంలో నిలుస్తాయి. అట్లా ప్రయోజనం కలిగించని కాలక్షేప కథలు కాలక్రమంలో కనుమరుగవుతాయి.

కథ ఆధునిక సాహిత్య ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆవిర్భవించి ఇప్పటికి వంద సంవత్సరాలు. ఇది వచన సాహిత్యం అవటం వల్ల జనసామాన్యానికి మరింత చేరువయ్యింది. తెలుగులో మొదటి కథగా చెప్పుకుంటున్న గురజాడ కథ "దిద్దుబాటు" సూటిగా సరళంగా వ్యావహారిక భాషలో ఉండి, సాధారణ పాఠకులకు కూడా అర్థమయ్యే రీతిలో ఉంది. గురజాడ తన కథ ద్వారా భవిష్యత్తులో రాబోయే కథలకు

పరోక్షంగా మార్గనిర్దేశం చేశారు. కథలు సూటిగా, సరళంగా, ఆసక్తికరంగా ఎక్కువమందికి అర్థమయ్యేలా, సామాజిక ప్రయోజనం కలిగించేదిగా ఉండాలనేదే ఆ మార్గ నిర్దేశం.

అయితే ఈ వందేళ్ళలో కథల్లో అనేక ప్రయోగాలు, వాదాలు, టెక్నిక్‌లూ, మాండలికాలు వచ్చి చేరాయి. వీటన్నిటి మీద ఎంతో చర్చ వాదోపవాదాలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. కథలు రాయటంలో ఎన్ని ప్రయోగాలు చేసినా వాటి అంతిమ లక్ష్యం మాత్రం ఎక్కువమంది పాఠకులకు చేరటమే. అయితే ఈ వందేళ్ళలో చాలామంది కథకులు ఈ లక్ష్యాన్ని మరచిపోయి కేవలం ప్రయోగం కోసం కథలు రాశారు. ముఖ్యంగా ఇతర దేశాల్లో వచ్చిన పోకడలను చూసి వాటిని తెలుగు కథల్లో అనుకరించే ప్రయత్నం చేశారు. దీనివల్ల ఆ కథలు ఎక్కువమంది పాఠకులకు చేరలేకపోయాయి. అయినప్పటికీ ఆ పోకడలను యిప్పటికీ అనుకరిస్తూనే ఉన్నారు. ఇటువంటి పోకడలవల్ల భారతీయ సామాజిక జీవన మూలాలను రచయితలు సరిగ్గా చిత్రీకరించలేకపోయారు. కథా సాహిత్యానికి సంబంధించి విమర్శలు చేస్తున్నప్పుడు అయా వాదాలకు సంబంధించి ఉదాహరణలుగా యిలాంటి ప్రయోగాత్మక కథలను పేర్కొనటం వల్ల ఈ పోకడలకు మరింత ప్రోత్సాహం లభిస్తోంది. ఒక దశలో కథ ప్రయోజనం వెనుకబడి ప్రయోగాలకు ప్రాథమ్యం లభించింది కూడా.

అయితే ప్రయోగాలు లేదా కొత్త పద్ధతులు పూర్తిగా అక్కరలేదని చెప్పలేం. అన్ని వస్తువులను ఒకే పద్ధతిలో సూటిగా సరళంగా చెప్పలేం. కొన్ని వస్తువులను ప్రత్యేక కథన పద్దతిలో చెబితేనే ఆ కథ బాగుంటుంది. కల్యాణసుందరీ జగన్నాథ్ "అలరాస పుట్టిళ్ళు", మునిపల్లెరాజు, "దివోస్వప్నాలతో ముఖాముఖి", సమస్పతి "నిశ్శబ్దం" (కథ-90), అల్లం రాజయ్య, "మనిషి లోపలి విధ్వంసం" లాంటి చాలా కథలు ఇందుకు చక్కటి ఉదాహరణలు. ముఖ్యంగా మనిషి అంతరంగాన్ని అత్యద్భుతంగా చిత్రీకరించిన "మనిషిలోని విధ్వంసం" గొప్ప శిల్పం ఉన్న కథ. వస్తువుకు అనుగుణంగా కొన్ని సందర్భాలలో ప్రత్యేక కథన పద్ధతులు ఎంచుకుంటే బాగుంటుంది కానీ అదే పనిగా ప్రయోగాల కోసం పాటు పడటం వల్ల ఉపయోగం ఉండదు.

ఇక తెలుగులో కథ అనగానే వర్ధమాన రచయితలు, లేదా కొత్తగా కథలు రాయాలనుకునేవారు తప్పకుండా వర్ణన ఉండాలని అనుకోవటం. కథ వర్ణనతోనే

ప్రారంభం కావాలని చాలామంది రచయితలు భావిస్తారు. కథలో అనవసర వర్ణనలు ఉండటం వల్ల వేగం తగ్గుతుంది. చెప్పదలచుకున్న విషయాన్ని పలుచన చేస్తుంది. కథ క్లుప్తంగా ఉండాలని, చెప్పదల్చుకున్న విషయాన్ని సూటిగా చెప్పాలని విమర్శకుల అభిప్రాయం. "కథకు అవసరంలేని, సంబంధంలేని వర్ణనలు ఉంటే బాగుండదు. కొన్ని కథల్లో వర్ణనలు తీసేసి చదువుకున్నా ఈ కథ అర్థం మారదు. మరి ఆ వర్ణనలు ఎందుకు? దీనివల్ల నిడివి పెరుగుతుంది. కథ వేగం తగ్గి పాఠకుడికి విసుగు కలిగిస్తుంది. కథలో ఒక్క వాక్యం కానీ, పదం కానీ ఎక్కువ ఉండరాదు, తక్కువ ఉండరాదు. ఒక పదాన్ని గానీ, వాక్యాన్ని గాని తొలగించినప్పుడు కథ అర్థం మారిపోవాలి. అంత ఖచ్చితంగా రాయాలి." అని అంటారు కథకులు, కథా సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ వేదగిరి రాంబాబు.

తమ కథల్లో అనేక విషయాలను పాఠకులకు తెలియజెప్పాలనే చాపల్యం చాలామంది రచయితలకు ఉంటుంది. ఇందుకు ప్రసిద్ధరచయితలు కూడా అతీతులు కారు. మధురాంతకం రాజారాం తమ "ఎడారి కోయిల" కథలో సంబంధంలేని విషయాలు చెప్పారని విమర్శకుల అభిప్రాయం. అలాగే "అలరాసపుట్టిళ్ళు" కథ ప్రారంభంలో చాలా వర్ణన ఉంటుంది. అందులో కొంత తగ్గించి చదువుకున్నా కథ గొప్పతనం ఏ మాత్రం తగ్గదు.

కథల్లో స్థల, కాలాలు, పాత్రలు, సంఘటనలు ఉండాలని, పాత్రలు మనుషులే కాకుండా పశుపక్ష్యాదులున్నా కథలు అనవచ్చుననీ విమర్శకుల అభిప్రాయం.

అయితే పాత్రలు లేకుండా, సంఘటనలు లేకుండా కనీసం ప్రతీకలు లేకుండా రాసి వాటిని కథలన్నారు. ఒకే ఒక పాత్రతో కూడా కథలు వచ్చాయి. అయితే కథలకు చదివించే గుణం ఉండాలి. అలా లేనప్పుడు అవి ఎక్కువ మంది పాఠకులకు చేరవు. పేరున్న కథకులు రాసిన కథలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఎమెస్కోవారు ప్రచురించిన వందేళ్ళ తెలుగు కథ 20వ శతాబ్ది ప్రతినిధి కథల సంకలనం 1990-94 కాలానికి ప్రతినిధి కథగా చోటు చేసుకున్న త్రిపుర "వలస పక్షుల గానం" కథ పూర్తిగా ప్రయోగం కోసం రాసిన కథలాగా అనిపిస్తుంది. ఓ స్థాయి ఉన్న పాఠకులకు కూడా ఈ కథ అంతగా మింగుడు పడదు. ఈ కథలో

చదివించే గుణం శూన్యం. ఈ కథలో అత్యద్భుతమైన శిల్పనైపుణ్యం ఉన్నదని భావించినందువల్ల సంకలనకర్త ఈ కథను వందేళ్ల తెలుగు కథలో చేర్చారు.

ఎంత అర్థం కాకుండా సీరియస్‌గా తీసిన సినిమా, వేసిన పెయింటింగ్ గొప్పవి అనే భావన ఉన్నట్లుగానే అలా రాసిన కథలు కూడా మంచి కథలు అనే భావన ఉంది. వాళ్ళను మేధావులైన రచయితలుగా గుర్తిస్తారు. హ్యూమర్ ఉన్న కథల్ని, సూటిగా, సరళంగా రాసిన అనేక కథలు ఏ కథా సంకలనంలో చోటు చేసుకోలేదు. సాహిత్యఅకాడమీ వారు గుర్తించిన భమిడిపాటి రామగోపాలం కథలుగానీ సూటిగా, వర్ణనలు లేకుండా రాసిన మరో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ కథా నవలా రచయిత అంపశయ్య నవీన్ కథలుగానీ ఏ ప్రాతినిధ్య కథా సంకలనంలో కూడా చోటు చేసుకోకపోవటమే ఇందుకు నిదర్శనం.

భమిడిపాటి రామగోపాలం ఎక్కువగా హ్యూమర్ ఉన్న కథలనే రాశారు. ఆయన కథలన్నీ క్లుప్తంగా, సూటిగా ఉంటాయి. హ్యూమరస్‌గా రాసిన కొన్ని కథలు చదివినప్పుడు హృదయం బరువెక్కి మనస్సు ఆర్ద్రమవుతుంది. అయినప్పటికి ఆయన కథలు ఏ సంకలనంలోనూ చోటు చేసుకోలేదు. నాటకరంగంలో కూడా ఈ జాడ్యం ఉంది. ఏ పరిషత్తు కూడా హాస్యరసం ఉన్న నాటికకు బహుమతులిచ్చిన దాఖలాలు లేవు. హాస్యం వెనువెనుకనే ఉండే విషాదాన్ని మనవాళ్ళు గుర్తించక పోవటం హ్యూమర్ అనిపిస్తుంది. అయినా ఆయనను ప్రపంచం గొప్ప రచయితగా గుర్తించింది. ఈ లోటును తెలుగు కథా సాహిత్యం పూడ్చుకోవాల్సిన అవసరం ఉంది.

ఇక ఇటీవలికాలంలో తెలుగు కథల్లో తరచుగా చర్చించే అంశం మాండలికం. కథ పూర్తిగా మాండలికంలో రాసే రచయితలు ఎక్కువయ్యారు. పూర్తిగా మాండలికంలో కథ రాయటం వల్ల యితర ప్రాంత పాఠకులకు అర్థం కాదని, సులభంగా చదవలేరని కొందరు విమర్శకుల అభిప్రాయం. తమ తమ మాండలికాల్లో రాస్తేనే కథల్లో ఆత్మ ఉంటుందని, సహజత్వానికి దగ్గరగా ఉంటుందని, మాండలికాలను ప్రోత్సహించాలని మరికొందరి అభిప్రాయం. పూర్తి మాండలికంలో వచ్చే కథల్లో అగ్రస్థానం రాయలసీమ కథకులదే. ఇటీవలి కాలంలో తెలంగాణ మాండలికంలో రాసే కథకుల సంఖ్య పెరిగింది. ఏది ఏమైనా ఏ ప్రాంతం వారికి ఆ మాండలికం బాగుంటుంది. వేరే ప్రాంతాలవారు ఆ కథలను కూడబలుక్కుని

చదవాల్సి ఉంటుంది. దీనివల్ల ఆ కథలను యితర ప్రాంతాలవారు చదవటానికి యిష్టపడరు. దీనివల్ల కథ ప్రయోజనం దెబ్బతింటుంది. "కథ సాధారణ భాషలోనే రాస్తూ సందర్భాన్ని బట్టి అవసరమనకుంటే ఆయా పాత్రలకు మాండలికాన్ని ఉపయోగిస్తే బాగుంటుంది. మొత్తం మాండలికంలో రాయటం వల్ల ఆ కథ ఎక్కువ మంది పాఠకులకు చేరదు" అని అంటారు ప్రముఖ నవలా, కథా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్. మాండలికంలోనే రాయాలనే తపన వల్ల రాసిన కథలు కృతకంగా అనిపిస్తుంటాయి. ఇటీవల వస్తున్న తెలంగాణ మాండలికం కథలు పట్టి, పట్టి కావాలని వెతికి తెచ్చిన పదాలతో రాస్తున్నట్లుగా ఉంటున్నాయి. వాస్తవానికి ఎవ్వరూ తెలంగాణలో పూర్తిగా అలాంటి పదాలు ఉపయోగించి నిజ జీవితంలో మాట్లాడరు. బహుశా యితర మాండలికాల్లో వస్తున్న కథల్లో కూడా భాష అలాగే ఉంటుందేమో ఆయా ప్రాంతాల పాఠకులే చెప్పాలి. మాండలికం తక్కువగా ఉన్నా ఆ ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించే కథలు ముఖ్యం. ఇందుకు చక్కటి ఉదాహరణ బి.ఎస్. రాములు రాసిన కథలు. ఆ కథల్లో ఎక్కడా కూడా కృత్రిమత్వం కనబడదు. ఆయన రాసిన కథలనే నిజమైన, సహజమైన తెలంగాణ కథలు అని చెప్పుకోవాలి.

కథలు చరిత్రను కూడా రికార్డు చెయ్యాలని విమర్శకుల అభిప్రాయం. కొన్ని కథలు చదివినప్పుడు ఆ కాలంలో జరిగిన చరిత్రను, ఉద్యమాలను, మార్పులను తెలియజేస్తాయి. ఆ కథల్లో ఆయా ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు ప్రతిబింబిస్తాయి. బి.ఎస్. రాములు కథలు చదివినప్పుడు తెలంగాణాలో మూడు దశాబ్దాల పాటు జరిగిన నక్సలైట్ ఉద్యమం మనకు కళ్ళకు కట్టినట్లు కనబడుతుంది. మల్లాది రామకృష్ణశాస్త్రి కథలు, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి కథలు చదవినప్పుడు గోదావరి జిల్లాల ప్రజల గురించి అవగతమవుతుంది. మధురాంతకం రాజారాం కథలు చదివినప్పుడు మనకు రాయలసీమ ప్రజల జీవితం కనిపిస్తుంది. ఇట్లాంటి కథల్లో నేపథ్యమే ప్రధానంగా కనిపిస్తుంది. నేపథ్యం తెలియనివారు ఈ కథలు చదివినప్పుడు వారికి ఇవి పెద్దగా ఆసక్తి కలిగించవు. అయితే సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవన విధానం, వివిధ వృత్తులు ఇత్యాది నేపథ్యంగా కథలు రాసినపుడు ఆ కథలు కథా సాహిత్యంలో ఎక్కువ కాలం మనగలుగుతాయి. వీటి ద్వారా యితర ప్రాంతాల ప్రజల జీవితం గురించి పాఠకులు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

కథల్లో తప్పకుండా మలుపు లేదా కొసమెరుపు ఉండాలనే భావన మొదట్లో అధికంగా ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. గురజాడ కథ దిద్దుబాటులో ఈ విధమైన మలుపు ఉండటం వల్ల కావచ్చు చాలామంది రచయితలు, విమర్శకులు మలుపు లేకుండా కథ సంపూర్ణం కాదని భావించారు. అయితే కాలక్షేప కథలు, వ్యాపార కథల్లో మాత్రమే మలుపు లేదా కొసమెరుపు ఉంటుంది. ఇలాంటి కథలు అప్పటికప్పుడు పాఠకులకు థ్రిల్, విస్మయం లేదా సంభ్రమాశ్చర్యాలు కలుగజేస్తాయి. అయితే ప్రజల జీవితాన్ని ముఖ్యంగా అట్టడుగు వర్గాల జీవితాల్లోని కోణాలను చిత్రించే కథల్లో మలుపు ఉండవచ్చు. లేకపోవచ్చు. ఇటీవలి కాలంలో మలుపులు లేకుండా జీవితచిత్రణ ప్రధానంగా ఉండే కథలే ఎక్కువగా వస్తున్నాయి. అయితే మలుపు ఉంటే కథ పాఠకులను మరింత ఆకట్టుకుని ఎక్కువకాలం గుర్తుండిపోతుంది. దోపిడీకి గురవుతున్న ప్రజల జీవితం తీసుకుని కూడా పాఠకులకు ఒళ్ళు గగుర్పొడిచే, ఊహించని గొప్ప నాటకీయ, భయానక మలుపున్న కథ కాళీపట్నం రామారావు రాసిన "యజ్ఞం" కథ. ఈ స్థాయిలో కొసమెరుపున్న కథ తెలుగులో మరొక కథ లేదు. అయితే దీనిని ప్రతీకాత్మకంగా తీసుకోవాలని విమర్శకుల అభిప్రాయం.

కొసమెరుపు కథలకు ఓ హెన్రీ కథలు పెట్టింది పేరు. తెలుగు కథలపై యూరోపియన్, అమెరికన్ రచయితలకంటె రష్యన్ కథకుల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుగు కథా సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు మనకు అర్థమవుతుంది. ఈ వందేళ్ళలో తెలుగు కథల్లో స్పృశించని వస్తువు అంటూ లేదు. అన్ని రకాల జీవితాలను, వ్యక్తిత్వాలను ప్రాంతాల ప్రజల జీవితాలను కథలుగా చిత్రించారు. స్వాతంత్ర్యోద్యమం, స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, అస్తిత్వవాదం, ఆత్మగౌరవవాదం, కమ్యూనిజం, కార్మిక పోరాటాలు, సరళీకరణ, ప్రపంచీకరణ యిట్లా ప్రపంచంలో ఏ మార్పు సంభవించినా దానిని తెలుగు కథకులు తమ కథల్లో చేర్చారు. మ్యాజిక్ రియలిజమ్, స్ట్రీమ్ ఆఫ్ కాన్షియస్‌నెస్, సింబాలిజమ్ యిట్లా ఎన్ని శిల్ప పద్ధతులున్నాయో అన్నింటినీ తెలుగు కథకులు ఉపయోగించారు. కాలంతో పాటు కొన్ని మార్పులు చేసుకుంటాయి. వాటిని కథల్లో చేరుస్తున్నారు. మొదట్లో ఉత్తరాలకు ముఖ్య భూమిక ఉండేది, తర్వాత టెలిఫోన్ చోటు చేసుకుంది. ఆ కథలను యిప్పుడు చదివితే సిల్లీగా అనిపిస్తుంది. ఎందుకంటే యిప్పుడు మొబైల్

ఫోన్, ఇంటర్‌నెట్ వచ్చాయి. రవాణా రంగం విస్తృతంగా అభివృద్ధి చెందింది. యింకా భవిష్యత్‌లో ఎన్ని మార్పులొచ్చినా ఆ మార్పులను కూడా తెలుగు కథకులు వాటిన తమ కథల్లో చేరుస్తారు. యిప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్వలింగ సంపర్కులు, థర్డ్ జండర్ గురించి చర్చ జరుగుతోంది. బహుశా తెలుగు కథల్లో ఈ అంశంతో కూడా కథలు రావచ్చు. తెలుగు కథల్లో హ్యూమర్‌కు మరింత ప్రాముఖ్యం యివ్వాల్సిన అవసరాన్ని తెలుగు కథా రచయితలు, విమర్శకులు గుర్తించాలి.

తెలుగు కథ ఈ వందేళ్ళలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో పరిఢవిల్లింది. ప్రపంచస్థాయి కంటే తెలుగుకథ మరొక్క అడుగు ముందే ఉంది అనటంలో అతిశయోక్తి లేదు. వచ్చే వందేళ్ళలో తెలుగుకథ మరింత కొంత పుంతలు తొక్కుతుందనటంలో సందేహం లేదు.

# తిలక్ కథలు - ఒక పరిశీలన

ఆచార్య ఎస్. జి. డి. చంద్రశేఖర్

భావాభ్యుదయ కవిత్వానికి సంగమ స్థానమై నిలిచి, వచన కవిత్వంలో అన్ని రసాల్ని చెప్పి అందర్నీ మెప్పించి, ఆధునికాంధ్రకవిత్వంలో లబ్ధప్రతిష్ఠుడై నిలిచిన కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. ఈయనకు తానో కవిగా కంటే కూడా, కథానికా రచయితగా మంచి పేరు ప్రతిష్ఠలు సంపాయించుకోవలనే ఆకాంక్ష ఉండేదట ! కానీ దీనికి భిన్నంగా ఆయన కథానికా రచయితగా కంటే కూడా ఆధునికాంధ్ర కవిగా మంచి పేరు ప్రతిష్ఠల్ని పొందాడు. తిలక్ కవితల్ని, నాటకాల్ని, నాటికల్ని, కథానికల్ని, వ్యాసాల్ని వ్రాసి తనదైన ప్రత్యేకతను చాటి చెప్పుకొన్నాడు.

తిలక్ రచనలు 'గోరువంకలు' అనే పద్యకవితా సంపుటం, 'ప్రభాతము సంధ్య' అనే గేయ కవితా సంపుటం, 'అమృతం కురిసిన రాత్రి' అనే వచన కవితా సంపుటాలు వెలువడ్డాయి. వాటిల్లో మొట్టమొదట వెలువడిన కవితా సంపుటి 'ప్రభాతము సంధ్య' అనేది. ఆ తరువాత వెలువడిన కవితా సంపుటి అమృతం కురిసిన రాత్రి. చివరన వెలువడిన కవితా సంపుటం 'గోరువంకలు' అనేది. తిలక్ కవితలన్నీ చాలా సాహిత్య పత్రికల్లో ప్రచురితం అయ్యాయి. తిలక్ కవితలతో పాటు సుశీల పెళ్ళి, సుప్తశిల, సాలెపురుగు అనే నాటకాల్ని, సుచిత్ర ప్రణయం, ఇరుగు పొరుగు అనే నాటికల్ని కూడా వ్రాశారు. వీటితో పాటు తిలక్ రెండు నవలల్ని వ్రాయడానికి ప్రయత్నించి వాటిని అసంపూర్ణంగానే వొదిలేశారు. తిలక్ ఈ రచనలతో పాటే 'కావ్యసృష్టి', 'యుద్ధము - రచయితలు' అనే వ్యాసాల్ని కూడా వ్రాశాడు. వీటితో పాటుగా 'హేమంత హసంతిక' అనే వ్యాసాన్ని వ్రాస్తూ అసంపూర్ణంగానే వదిలేశాడు.

ఆధునికాంధ్ర కవిత్వంలో లబ్ధ ప్రతిష్టుడై వెలుగొందిన, వెలుగొందుతూ ఉన్న తిలక్ తన మొట్ట మొదటి రచనను కథతో ప్రారంభించడం ఒక విశేషం. తిలక్ తన పదకొండవ ఏటనే వ్రాసిన కథ 'మాధురి' అనే పత్రికలో ప్రచురింప బడిందట. కానీ ఆ కథ పేరు కానీ, ఇతర వివరాలు కానీ మనకు లభించడం లేదు.

తిలక్ వ్రాసిన కథల్లో కొన్ని కథలు 'సుందరీ సుబ్బారావు' అనే కథాసంపుటిగా 1961లో వెలువడ్డాయి. దీన్ని ఏలూరులోని ప్రజాప్రచురణల సంస్థ ప్రచురించింది. ఇందులో మూడు కథలు మాత్రమే ఉన్నాయి. అవి : 1. సుందరీ సుబ్బారావు, 2. కదిలే నీడలు, 3. ఉంగరం అనేవి. ఏలూరు లోని ప్రజాప్రచురణల సంస్థే 1961లోనే 'ఊరి చివరి ఇల్లు' అనే మరో తిలక్ కథా సంపుటాన్ని ప్రచురించింది. ఈ కథల సంపుటిలో నాలుగు కథలున్నాయి. అవి : 1.ఊరి చివరి ఇల్లు, 2. ఏమీ లేదు, 3. సముద్రపు అంచులు, 4. అద్దంలో జిన్నా అనేవి. ఆ తరువాత విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ విజయవాడ వాళ్ళు 1972లో తిలక్ కథల్ని సేకరించి 'తిలక్ కథలు' అనే సంపుటాన్ని ప్రచురించారు. ఇందులో ఇరవై ఒక్క కథలున్నాయి. ఈ ఇరవై ఒక్క కథల్లో పైన పేర్కొన్న ఏడు కథలు పోను, లిబియా యెడారి, హోటెల్లో, ఆశాకిరణం, బాబు, యవ్వనం, గడియారపు గుండెలు, పలితకేశం, తీవ్రవాద నాయకుడు, కవుల రైలు, బొమ్మ, దొంగ, నల్ల జర్ల రోడ్డు, మణిప్రవాళం, ఓడిపోయిన మనిషి, సీతాపతి కథ, అతని కోరిక, జీవితం, నిర్మల మొగుడు, పరివర్తన, దేవుణ్ని చూసిన వాడు, నవ్వు, రాత్రి 9 గంటలు, మీరేనా - నీవేనా అనే పధ్నాలుగు కథలున్నాయి.

తిలక్ కథల్లోకెల్లా అతి చిన్న కథ కవుల రైలు అనే కథ. ఇది ఒకటింకాలు పేజీల్లో కొనసాగిన అతి చిన్న కథ. తిలక్ కథల్లో కొన్ని పెద్ద కథలు కూడా ఉన్నాయి. అవి- నల్లజర్ల రోడ్డు, సముద్రపు అంచులు, జీవితం లాంటి కథలు. తిలక్ కథల్లో మానవ జీవితంలోని దారిద్ర్యాన్ని చిత్రీకరించే కథలు, దాంపత్య జీవితాన్ని చిత్రించే కథలు, యాంత్రిక మానవ జీవితాన్ని చిత్రించే కథలు, యుద్ధ విముఖత్వాన్ని - శాంతి ప్రయత్నాన్ని చిత్రించే కథలు, ధనిక వర్గాల వాళ్ళ జీవన శైలుల్ని చిత్రించే కథలు, దొంగతనం, వేశ్యాజీవనంలాంటి అంశాల్ని చిత్రించే కథలు, కవుల ప్రవృత్తుల్ని చిత్రించే కథలు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని కథలు కవిత్వాన్ని గూర్చి, సాహిత్యాన్ని గూర్చి, కథల్ని వాటి విలువల్ని చిత్రించే కథలు ఉన్నాయి.

తిలక్ తన కథల్ని చక్కటి కవితా రీతులతో చదవడానికి ఆసక్తికరంగా ఉండేట్లు రాశాడు. చక్కని వ్యావహారిక భాషలో తిలక్ కథలు కొనసాగుతాయి. కానీ అక్కడక్కడా కొన్ని గ్రాంథిక ఛాయలూ మనకు కనిపిస్తూ ఉంటాయి. తిలక్ కథల్లో సంభాషణాత్మకంగా సాగిన కథలు, వర్ణనాత్మకంగా, వివరణాత్మకంగా,

విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా సాగిన కథలు మనకు కనిపిస్తాయి. కానీ ఒక్క కథ మాత్రం దినచర్య (డైరీ) పద్ధతిలో కొనసాగింది. ఆ కథ ఐదు రోజుల దినచర్యగా కొనసాగింది. ఆ కథ 'హోటెల్లో' అనే కథ.

తిలక్ కథల్లో 'బాబు' అనే కథ, 'ఊరి చివరి ఇల్లు' అనే కథ, 'నల్లజర్ల రోడ్డు' అనే కథలు బాగా ప్రసిద్ధి పొందిన కథలు. దీనికి కారణం అవి మానవతావాదాన్ని గుణంగా కలిగి ఉండడం. అమానవీయ ధోరణులు విమర్శించబడ్డమే.

'బాబు' కథ ఒక చిన్న కుర్రాడు – బాబు అనే ఒక అనాథ కుర్రాడు గౌరీనాథం అనే వడ్రంగిపని కాంట్రాక్టరు దగ్గర పనికి కుదరడం, అతడు కొట్టే దెబ్బలకు తట్టుకోలేకపోవడం, చివరకు పారిపోవాలనుకోవడం, ఆ పారిపోవడం కూడా కల్లు త్రాగాలనే ఒక ప్రలోభానికి లోనై ఒక రూపాయి గౌరీనాథం గల్లా పెట్టలోంచి కాజేయడానికి ప్రయత్నించి కొట్టు యజమాని చేతపట్టుబడి, చివరకు అతడిపై తిరుగుబాటు చేసి ఒక చెక్క పేడుతో అతణ్ణి కొట్టి పారిపోవడం లాంటి అంశాలతో పొందుపరిచాడు తిలక్. ఈ కథలో తిలక్ బాలకార్మికుల సమస్యల్ని, వాళ్ళ ఆకలి దాహాల్ని, వాళ్ళకు పని సరిగా చేతకాకపోవడం చేత యజమానుల దగ్గర దెబ్బలు తినడాన్ని, యజమానుల బూర్జువా మనస్తత్వాన్ని చాలా చక్కగా చిత్రీకరించాడు.

తిలక్ కథల్లో 'ఊరిచివరి ఇల్లు' అనే కథ కూడా బాగా ప్రాచుర్యాన్ని పొందిన కథ. ఈ కథలో బాల్యంలో తనకు ఎవరూ దిక్కు లేకపోవడం మూలంగా అనాథాశ్రమంలో పెరిగి, యవ్వనంలో వంచనకు గురై శీలం పోగొట్టుకొని, సమాజం చేత వెలివేయబడిన రమ అనే అమ్మాయి కథ చిత్రితమై ఉంది. ఈ రమకు ఊరి చివర్న ఉన్న ఇంట్లో ఉండే ఒక ముసలి అవ్వ ఆశ్రయమిస్తుంది. ఆ తరువాత ఆ అవ్వ డబ్బు మీద ఉన్న ఆశతో ఆ అమ్మాయి చేత వ్యభిచారం చేయిస్తూ ఉంటుంది. ఆ అమ్మాయి గత్యంతరం లేక పొట్టకూటికోసం వ్యభిచార వృత్తిని తనకు ఇష్టం లేకున్నా కొనసాగిస్తూ ఉంటుంది. అయితే తాను తన బాల్యంలో బాల్య మిత్రుడైన విజయరాముడు అనే వ్యక్తికి మనసిచ్చింది. అతణ్ణి మనసులోనే ఉంచుకొని అతడికే మనసిచ్చి, విటులకు తన శరీరాన్ని మాత్రమే అప్పగిస్తూ ఉంటుంది. ఒక రోజు అతడి పోలికలున్న వ్యక్తి తనకు తారసపడితే అతణ్ణి చేరదీస్తుంది. చివరకు అతడితో

తన కథను చెప్పిన తరువాత అతడు విజయరాముడు కాదని, అతడు రంగనాథం అనే వ్యక్తి అని తెలుసుకొంటుంది. రంగనాథం ఆమె దీన గాథనంతా విన్న తరువాత ఆమెను పెళ్ళి చేసుకోడానికి ఇష్టపడతాడు. ఈ విషయాన్ని పసిగట్టిన ముసలామె రమను గురించి ఇదంతా ఆమెకు మామూలే, తన దగ్గరకు వచ్చేవిటులందరితోనూ ఆమె ఈ కథ చెబుతూనే ఉంటుంది, ఆమె నైజం అంతే అని చెప్పి రంగనాథం మనసును విరిచేస్తుంది. అప్పుడు రంగనాథం విరక్తితో రమ మీదికి వెయ్యి రూపాయలున్న మనీ పర్స్ ఒకటి విసిరేసి వెళ్ళిపోతాడు. అతణ్ణి వెంబడించిన రమ రైల్వేస్టేషన్లో కదులుతూ ఉన్న రైల్లో ఉన్న రంగనాథం మీదికి ఆ మనీ పర్సును విసిరేస్తుంది. రంగనాథం ఆ పర్స్‌ను తెరచి చూస్తే అందులో వెయ్యిరూపాయలు భద్రంగా ఉంటాయి. కానీ రంగనాథం ఫోటో మాత్రం మిస్ అయి ఉంటుంది. దాన్ని చూసి రంగనాథం ఆశ్చర్యపోతాడు.

ఈ కథలో వేశ్యాజీవితంలో ఎదురయ్యే వ్యక్తులు వాళ్ళ మనస్తత్వాలు, జీవితంలో మోసపోయిన స్త్రీల వ్యక్తిత్వాలు, వాళ్ళ జీవన విధానాలు, వాళ్ళ కష్టాలు, కడగండ్లు లాంటి అంశాలు సవివరంగా చెప్పబడి ఉన్నాయి.

'నల్లజర్ల రోడ్డు' అనే కథ తిలక్ కథల్లోకెల్లా అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన కథ. ఈ కథలో ఒక వ్యక్తి ప్రాణాప్రాయ స్థితిలో ఉండి, వేరొక వ్యక్తి వల్ల సహాయం పొంది బ్రతికి బయటపడిన వ్యక్తి. ఏ వ్యక్తయితే తనకు ప్రాణదానం చేశాడో ఆ వ్యక్తే ప్రాణాపాయస్థితిలో ఉండగా, అతణ్ణి ఏమీ పట్టించుకోకుండా అతడి కూతురికి ఇరవై రూపాయలిచ్చి ఎక్కడైనా వైద్యం చేయించుకోమని ఉచిత సలహా ఒకటిచ్చి వెళ్ళిపోయిన కరుడుగట్టిన, ధనమదంతో కళ్ళూ, మనసూ రెండూ మూసుకుపోయిన వాడి అమానవత్వం కళ్ళకు కట్టినట్లు చిత్రింపబడింది.

ఈ నల్లజర్ల రోడ్డు కథ కొంత మంది మిత్రులంతా కలసి రాత్రి పూట డిన్నర్ చేసుకోవడం, ఆ తరువాత కబుర్లాడుకోవడం, ఆ కబుర్ల మధ్యలో కథ చెప్పమని అడగడం, కథ ప్రారంభం కావడంతో మొదలౌతుంది. ఈ కథ చెప్పడం మధ్య మధ్యలో ఆగి కబుర్లు కొనసాగి మళ్ళీ కథకొనసాగించబడడంగా కొనసాగుతుంది. ఈ కబుర్లలో దయ్యాల భయం, పులుల భయం, పాముల భయం లాంటివి కూడా ప్రస్తావింపబడుతూ ఉంటాయి. ఒక భయానకమైన వాతావరణంతో

కథ ప్రారంభించబడి, రాత్రి పూట ఊరి చివరి బంగ్లాలో లైట్లు పోయి బిక్కుబిక్కుమంటున్న వాతావరణంతో కథ ప్రారంభమై, దట్టమైన నల్లజర్ల అడవుల్లో భయానకమైన వాతావరణంలో కథ కొనసాగి ముగిసిపోతుంది. ఈ కథలో ప్రధాన పాత్రలు పాముల నర్సయ్య. అతని కూతురు సూరీడు. వీళ్ళతో పాటు కనిపించే నాగభూషణం, అవధాని, రామచంద్రలు కూడా ఈ కథలో ప్రధాన పాత్రలే.

ఈ కథలో పాముల నరసయ్య అతని కూతురు సూరీడు కడు పేదవాళ్ళు. నల్ల త్రాచుల నుంచి విషాన్ని సేకరించి అమ్ముకునే వృత్తి వాళ్ళది. వాళ్ళు ఆ వృత్తి కోసం నల్లజర్ల అడవిలో ఒక పాకలో నివాసం ఉంటారు. ఆ అడవిలో కార్లో ప్రయాణం చేస్తూ ఉండగా కారు రిపేరుకు వస్తుంది. ఆ కార్లో ప్రయాణిస్తున్న నాగభూషణం, అవధాని, రామచంద్రయ్యలు కారుదిగి రిపేర్ చేసే ప్రయత్నంలో ఉండగా రామచంద్రయ్యను పాము కరుస్తుంది. వాళ్ళు అక్కడెవరైనా ఉన్నారేమో అని కేక వేయగా, పాముల నర్సయ్య ఆ కేక విని వచ్చి వాళ్ళను తన గుడిసెలోకి తీసుకెళ్ళి, అడివిలోకి సూరీడును వెంటబెట్టుకొని వెళ్ళి మూలికలు తీసుకవచ్చి రామచంద్రయ్యకు వైద్యం చేయించి బ్రతికిస్తాడు. దానికి ప్రతిఫలంగా నాగభూషణం ఏమివ్వబోయినా ససేమిరా పాముల నర్సయ్య తీసుకోడు. చివరకు ఆయన ఇవ్వబోయిన భూమిని కూడా నిరాకరిస్తాడు. వాళ్ళను బస్టాండు దాకా సాగనంపి మరీ వస్తాడు. అంతేకాదు ఆ రాత్రి పూట వాళ్ళను తన గుడిసెలో పడుకోమని తాను బయట పడుకుంటాడు పాముల నర్సయ్య. అయితే ఆ కృతజ్ఞతాహీనులైన వాళ్ళలో ఒకడైన నాగభూషణం పాముల నర్సయ్య కూతరు సూరీడుని తన కోర్కె తీర్చమని, అందుకు తాను డబ్బిస్తానని అంటాడు. సూరీడు దాన్ని తిరస్కరిస్తుంది.

ఆ ముగ్గురు ధనవంతులే. వాళ్ళు ఉదయంపూట తమ పనిని చూసుకోవడంకోసం బస్సు దగ్గరకు వెళ్తూన్నప్పుడు పాముల నర్సయ్య పాముకాటుకు గురౌతాడు. ఆ సమాచారాన్ని అతని కూతురు రోడ్డుమీదికి పరుగెత్తికు వస్తూ కేకవేసి చెపుతుంది. కానీ దాన్నేమీ వాళ్ళు పట్టించుకోకుండా ఆమె చేతిలో రెండు పదిరూపాయల నోట్లు పెట్టి, 'కలెక్టర్ గారి పెళ్ళి. మేం తప్పకుండా వెళ్ళాలి... మాకేమైనా మంత్రాలు, తంత్రాలు వచ్చా, ఆయన్ను బతికించడానికి' అని అంటూ బస్సులో వెళ్ళిపోతారు నిర్దయగా. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళను నింపుకుని వాళ్ళవైపు మౌనంగా చూస్తూ ఉండిపోతుంది.

'నల్లజర్ల రోడ్డు' కథ చాలా ఉద్వేగ భరితంగా కొనసాగుతుంది. భయం భయంగా కొనసాగుతుంది. చతురోక్తులు, పొగడ్తలు, విసుర్లతో కూడా కొనసాగుతుంది. పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' కథా స్థాయికి ఏ మాత్రం తీసిపోని కథగా తిలక్ నల్లజర్ల రోడ్డు కథ నడుస్తుంది.

తిలక్ కథల్లో 'కవుల రైలు' అనే కథ చాలా విచిత్రమైన కథ. ఈ కథ గమ్మత్తుగా వ్యగ్యంగా కొనసాగేదిగా ఉంటుంది. కవులంతా ఒక రైలు బోగీలోకి ఎక్కి కిక్కిరిసిపోయి ఉంటారు. ఇంకా కొంతమంది కవులు టికెట్ కొనుక్కొని బోగీలోకి ఎక్కడానికి ప్రయత్నిస్తూ ఫుట్‌బోర్డుల మీద, కమ్మీలు పట్టుకొని వ్రేలాడుతూ హడావిడిగా ఉంటారు.

ఇంతలో ఆ బోగీలోకి ఎక్కడానికి ఒక స్త్రీ మూర్తి, అందాల రాశి, మనోహరమైన రీతిలో వస్తుంది. ఆమె మేలి ముసుగును వేసుకొని ఉంటుంది. కవులు ఎవ్వరూ ఆమెను బోగీలోకి ఎక్కనివ్వరు. ఎక్కడా చోటులేదని నిరాకరిస్తూ ఉంటారు. ఇంతకీ నువ్వెవతవమ్మా అని అడిగితే నేను 'కవిత'ను అని ఆమె సమాధానం చెబుతుంది. కవిత లేని కవుల రైలు ప్రయాణాన్ని చాలా చక్కగా వ్యంగ్యంగా విమర్శించాడు తిలక్ ఈ కవుల రైలు కథలో.

ఇలా తిలక్ కథలు మానవ జీవితంలోని వివిధ కోణాల్ని స్పృశిస్తూ; వ్యంగ్యాత్మకంగానూ, విమర్శనాత్మకంగానూ కొనసాగేవిగా ఉన్నాయి. ఈ వ్యాసంలో నాలుగు కథల్ని మాత్రమే స్పృశించడం జరిగింది. తిలక్ కథలన్నీఆయన కవితల్లాగే ప్రేమప్రణయభావాలతోనూ, అభ్యుదయ భావాలతోను కొనసాగేవిగా ఉంటున్నాయి. తిలక్ తాను ఆశించినట్లు గానే కథల ద్వారా కూడా అజరామరుడే. ఆయనే తన కవితలో అన్నట్లు అమరుడే.

# శ్రీశ్రీ కథా సాహిత్యం

పైడిముక్కల ఆనంద్‌కుమార్

చేపలు నీళ్ళలోనే బతికినట్లు మనుషులు కథల్లో బతుకుతారు. కవిత్వం కవి భావమును అభివ్యక్తీకరిస్తే రచయిత తన భావనను సమాజంలోని వివిధ భావనలను కలిపి కథ అల్లుతాడు. కవితావేశం వున్న రచయితల్లో అధికులు విచిత్రంగా కథల్లో ప్రయోగాలు చేస్తారు.

మహాకవి శ్రీశ్రీ కథలు కూడా రాశాడంటే ఆశ్చర్యం వ్యక్తం చేసేవాళ్ళు ఎందరో వున్నారు. దానిక్కారణం శ్రీశ్రీ కవితలు ప్రాచుర్యం పొందినట్లు కథలు ప్రాచుర్యం పొందకపోవడమే. మరోకారణం, అవి సాదాసీదా కథలు గాక కథనంలోనూ, శైలిలోనూ శ్రీశ్రీ అనేక ప్రయోగాలు చేయడం వలన సామాన్య పాఠకులను అవి ఆకర్షించుకోకపోవడం.

శ్రీశ్రీ రాసిన కథలు ముప్పైయైదూ, శ్రీశ్రీ అనువాదం చేసిన కథలు ఇరవైఏడూ కలిపి చలసాని ప్రసాద్ కూర్చి ఒక సంపుటం తీసుకుని వచ్చాడు. అయితే మరో అనువాద కథ 'లద్దుండ గుండె' (అమెరికన్ రచయిత్రి దురోతి పార్కర్ రాసిన 'కస్టర్డ్ హార్ట్' కి తెనిగింపు) దొరకలేదని పేర్కొన్నాడు.

శ్రీశ్రీ సాహిత్యపుటాకలి కలిగిన ఒక చదువరి. భారతీయ ప్రాచీన సాహిత్యాన్ని, ఆంగ్ల సాహిత్యాన్ని సింహభాగం నమిలినమిలి మింగి జీర్ణం చేసుకున్నవాడు. ఆంగ్ల సాహిత్యంలో ఎంతమందిని తడిమాడో పేర్లు చెప్పుకుంటూ పోతే పేజీలకు పేజీలు నిండిపోతాయి.

ఆయన తన కథలను 1926 నుండి 1979 వరకు రాశాడు. (చివరి అనువాద కథ జూన్ 1979లో అచ్చయింది). కథలు ఒక కాలానికి కట్టుబడడం ఆయనకు ఇష్టం వుండదు. 'కథని ఒక కాలానికి బంధించడం నాకిష్టంలేదు' (అనామిక కథలో). హరి పురుషోత్తమరావుకి రాసిన ఒక ఉత్తరంలో 'హోమర్స్ ఒడిస్సీ మైథలాజికల్ టైమ్‌లెస్‌నెస్ కలది' అని మెచ్చుకుంటాడు. శ్రీశ్రీ కథలు చదివేటప్పుడు కూడా ఆయన కథలు ఆయన రాసిన కాలానికి కట్టుబడిలేవన్న విషయం మనకు అనుభవంలోకి వస్తుంది.

శ్రీశ్రీ సముద్రం వున్నవూళ్ళో పుట్టాడు. సముద్రం వున్న వూళ్ళో జీవితాన్ని గడిపాడు. సముద్రం లాంటి శైలీ, కథనం అతడి కలం నుండి జాలువారడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

శ్రీశ్రీ మీద అధివాస్తవికత (సర్రియలిజం) ప్రభావం ఎక్కువగా ఉంది. ఇది శ్రీశ్రీకథల్లో స్పష్టంగా కనబడుతుంది. అయితే ఈ ప్రభావం కవిత్వంలో ఎక్కువగా కనపడదు. అతడి కవిత్వం సూటిగా గుండెల్లోకి దూసుకుపోతుంది.

యూరోపియన్ సాహిత్యంలో సర్రియలిజం పుట్టుకకు దారి తీసిన పరిస్థితులకు మూలం మొదటి ప్రపంచయుద్ధమే (1914-1918). యూరప్ కేంద్రంగా బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, పోర్చుగల్, జపాన్, యునైటెడ్ స్టేట్స్, స్పెయిన్‌లు ఒక వర్గంగా, మధ్య యూరిపియన్ దేశాలు జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, ఇటలీలు మరోవర్గంగా ప్రారంభమైన యుద్ధం ఫ్రాన్స్, ఇటలీల మధ్య జరిగిన ఒడంబడికతో ఒక మలుపు తిరిగింది. తర్వాత మధ్య యూరోపియన్ దేశాలు పరాజయం పాలయ్యాయి. ఫ్రాన్సు కూడా దెబ్బతింది.

ఆ సమయంలో యూరోపియన్ సాహిత్యంలో నిహిలిజం (ఆ కాలంలో వ్యాప్తిలోనున్న నైతికతను, మతాన్ని, సంప్రదాయాలను, పద్ధతులను ప్రశ్నించిన ఉద్యమం) ఊడలు వేసుకున్నది. దీనికి ఆద్యుడు రుమేనియన్ కవి 'జారా' ఈ ఉద్యమం క్రమంగా 'డాడాయిజం' అని మరో సాహిత్య ఉద్యమానికి దారితీసింది. స్విట్జర్లాండ్‌లో పుట్టిన ఈ ఉద్యమం (1916-22) యుద్ధ వ్యతిరేకతనూ, అప్పుడున్న రాచరిక వ్యవస్థల పట్ల వ్యతిరేకతనూ రేకెత్తించింది. ఆనాటి రాచరిక వ్యవస్థను కూలదోయడానికి అరాచకత్వాన్ని ప్రోత్సహించింది.

డాడాయిజం పునాదుల మీద, ఫ్రాయిడినిజం తోడు కాగా సర్రియలిజం జన్మించింది. పారిస్‌లో 1924లో ఫ్రెంచ్ సాహిత్యకారుడు ఆంద్రెబ్రెటన్ (1960-1966) సర్రియలిజానికి పితామహుడైనప్పటికీ అప్పటికీ, అంతకముందే అధివాస్తవిక ఛాయలు ఫ్రెంచ్ కవులు బాదలేర్, రియాన్‌బౌద్, అపోలేర్ కవితల్లో కనబడతాయి. సర్రియలిజం ధోరణులు యూరప్ అంతటా వ్యాపించాయి. అది కేవలం సాహిత్యానికే కాక యితర కళారంగాలకు వ్యాపించాయి. ఇటాలియన్ చిత్రకారుడు గిరియోడి చింకో వర్ణచిత్రాలు, జీన్ కాక్ట్ చలనచిత్రాలు ఈ కోవకే చెందుతాయి. (భారతదేశంలో

కూడా శ్యాం బెనగళ్ దర్శకత్వం వహించిన 'అనుగ్రహం' తెలుగుచలనచిత్రం, ఇటీవల వచ్చిన 'నో స్మోకింగ్' అనే హిందీ చిత్రం ఇటువంటివే.)

స్వప్నావస్థను వాస్తవికతను కలగాపులగంగా మిళితం చేయడమే అధివాస్తవికత. ఏది స్వప్నమో, ఏది నిజమో తెలియనిస్థితి. సర్రియలిస్టు రచనల్లో పదాల సూచితార్థాలను ఎక్కువగా కూర్చి రచన సాగడంతో పాఠకుడు చదవడంలో కొన్నిసార్లు యిబ్బంది ఎదుర్కొంటాడు. పదాల సూచితార్థాలకు తగిన వివరణ లేకపోతే జుత్తు పీక్కుంటాడు.

లూయీ ఆరగాన్, పాల్ యూలార్డ్, రాబర్ట్ డెన్సన్ లాంటి కవులు సర్రియలిస్టిక్ ధోరణులను శిఖరాలకు చేర్చారు.

ఆంగ్ల సాహిత్యాన్ని ఆపోసన పట్టిన శ్రీశ్రీ కథలు గానీ, అనువాద కథలు గానీ ఎక్కువగా ఈ ధోరణి అనుసరించాయి కాబట్టి శృంగార, కరుణ, భక్తి రసాల్లో ఓలలాడే తెలుగు పాఠకులలో ఈ కథలు ఆసక్తిని కలిగించలేకపోయాయి. అందుకే శ్రీశ్రీ కవిత్వానికున్న ప్రాధాన్యం, సామాజిక ధోరణులను ప్రశ్నించే కథలే అయినప్పటికి శ్రీశ్రీ కథలకు లేకుండాపోయింది.

అధివాస్తవికత తెలుగు సాహిత్యంలో ప్రవేశించిన తొలి రోజులలో అధివాస్తవికులు దానికి పెట్టుకున్న పేరు 'స్వజేళజమ్' ('అసమాప్తం' కథలో) స్వజేళజమ్ అంటే స్వతంత్రమైనది, అర్థం అక్కరలేనిది అని విరణలో యివ్వబడింది. ఈ కథా సంపుటిలో 'అసమాప్తం' కథకు మాత్రమే అధివాస్తవిక కథగా శ్రీశ్రీ పేర్కొన్నాడు. సౌందర్యాన్నీ, మృత్యువునీ కలగలిపి ఆ రెండూ ప్రేమించుకున్నాయి గాని కలుసుకోవని చెప్పాడు.

1926 నుండి 1929 మధ్య రాసిన కథలు గానీ అనువాద కథలుగానీ గ్రాంధిక భాషలో వున్నాయి. అవి ఆనందమందిరం, చిత్ర రహస్యము, సశేషము, చిన్నబాబు (ఈ కాలంలో గ్రాంధిక భాష చదివేంత ఓపిక వున్న పాఠకులేరీ?). ఈనాడు సినిమా పేర్లకు 'టాగ్' లున్నట్లు అప్పుడే కొన్ని కథలకు బ్రాకెట్లలో 'టాగ్'లు యిచ్చాడు శ్రీశ్రీ. అవి సీతయ్య (ఒక ఆలాపన), బొమ్మ (అలేఖ్యం) అసమాప్తం (అధివాస్తవిక కథ), కోనేటిదినం (ఈ కథ పూర్తి పేరు మ-రా-రా- శ్రీ జటావల్లభుల కోనేటిరావు పంతులుగారి దినచర్య), చరమరాత్రి (నరకం, భూమి, స్వర్గం అనే

మూడు కాలాలలో అలాపన). అదే ఒరవడిలో అనువాద కథలకూ ఉప శీర్షికలు యిచ్చాడు. దేవతార్చన (తె(ని)గింపు), డియర్ గ్రేటాగార్బో (అవకాశాలు).

'కరక్కాయ ముక్క అరక్కాయ కుక్క' కథలో తిరువళ్ళుర్ నీతివాక్యాన్ని బస్సులో తప్పుగా చదివాననీ, దానికి అర్థం లేదని ఒప్పుకుంటూనే దాన్నే కథా శీర్షికగా పెట్టాడు. ఈ కథలో శ్రీశ్రీ, వాస్తవానికి విడాకులిచ్చి కల్పనతో వ్యభిచరించడానికి కావలసినన్ని మార్గాలుంటాయి, కాని వాస్తవాన్ని ఆధారం చేసుకుని కొన్ని ఊహాగానాలు మాత్రం చేస్తాను' అని అంటాడు. అధివాస్తవిక కథలు ఈ పంథాలోనే పయనిస్తాయి.

శ్రీశ్రీ కథలలో బాగా ఆకట్టుకునే కథ 'చరమరాత్రి' భూత, వర్తమాన, భవిష్యత్కాలాలను నరకం, భూమి, స్వర్గం అని పోలుస్తూ రాసిన కథ. సోషలిజం మీద అచంచల విశ్వాసం గల రచయిత రాసిన కథ కాబట్టి గడచిపోయిన కాలంలో 'జీవితం భయంకరమై, దుస్సహమై, దుష్టమై, విహ్వలభావం సోకించి, శత్రువై, స్వర్గమై, శార్దూలమై, శాపమై, రావద్దనే రాక్షసిలాగ, పోపో అనే పొగలాగా కనబడుతూవుంటే, వినబడుతూవుంటే అంటాడు. కవిత్వంలా లేదూ? నిజంగానే గడిచిపోయిన కాలంలో సామాన్యుల, దరిద్రుల, దౌర్భాగ్యుల జీవితం నరకం కాక మరేమిటి? ఆ కథలు మనం విన్నాం కదూ?

అతడే వర్తమానంలోకి అంటే భూమ్మీదకు వస్తే 'మనుష్యుల విలువ కొలవడానికి స్పష్టంగా కనిపించే కొలత ధనం కాక మరేముంది ప్రస్తుత పరిస్థితులలో? అని ప్రశ్నిస్తాడు. నిర్ధనులు, నిమ్నజాతులంతా వాళ్ళ బతుకుతో వాళ్ళు తృప్తి పడుతున్నారనీ, చేసిన పాపం అనుభవిస్తున్నారనీ, అసలు వాళ్ళకి ఆత్మలే లేవనీ ఈ కొత్తరచయితలూ, కొత్త నాయకులూ బయలుదేరి వాళ్ళకి లేనిపోని ఆశలు కల్పించి, వాళ్ళలో అశాంతి రేకెత్తించి తిరుగుబాటు పురికొల్పుతున్నారనీ అంటున్న చవకరకం విమర్శలు లక్ష్యపెట్టనక్కరలేదు' అని నిర్ద్వంద్వంగా పేదవాళ్ళ పక్షాన, దళితుల పక్షాన నిలబడతాడు.

భవిష్యత్కాలం స్వర్గమని చిత్రీకరిస్తాడు. తప్పకుండా సామాన్యుడు విజయం సాధిస్తాడని, సమానత్వం సోషలిస్టు వ్యవస్థ ఏర్పడుతుందన్న విశ్వాసం ప్రకటిస్తాడు. అయితే 'పరాజయాల కాల్బలాలతో, పరాభవాల నౌకాదళాలతో, అనుమానాల

విమానాలతో దండయాత్ర సాగిస్తున్నాను అంటాడు. బీజగణిత సూత్రాలను తిరగరాస్తూ చివరికి 1+1=1 అని తీర్మానిస్తాడు. అంటే దాని అర్థం ఔను/కాదు, మంచి/చెడ్డ, వెలుగు/చీకటి, చావు/బ్రతుకు, మనిషి/దేవుడు అంతా ఒకటే అని వివరిస్తాడు. మనిషి అధిక్యాన్ని ఉగ్గడిస్తూ 'ఈ ఏకం ఎవరో కాదు. మానవుడు. అతడే సత్యం, అతడే నిత్యం, అతడే ఈశ్వరుడు' అని ప్రకటిస్తాడు. 'ఇంకా రెండేమిటి? ఒక ఒకతనం, ఒకే రెండుతనం లేకపోవడం, ఒకే నిండుతనం' ఎలుగెత్తి అరుస్తాడు (ఔనుమరి ! మన లెక్క ప్రకారం 1+1=2 కావాలి కదా !) ధనికులనీ, పేదలనీ రెండు వర్గాలుండవని, ఉండకూడదని ప్రబోధిస్తాడు. 'ఇది నా కామ్యం ! ఇది నా గమ్యం !! ఇది నా స్వర్గం!!!' అని ఎర్రబావుటాను ఎగరేస్తాడు. ప్రస్తుత వ్యవస్థకు చరమరాత్రి వుందని మన వెన్నుతట్టుతాడు.

'గాలిదారాల దేవతావస్త్రాలు' కథలో '20వ శతాబ్దానికి 78 ఏళ్ళు వచ్చేశాయి' (ఈ కథ శ్రీశ్రీ 1977లో రాశాడు) అంటూ తెలుగుదేశాన్ని (పార్టీకాదు. అప్పటికింకా అది ఏర్పడలేదు) 20వ శతాబ్దంలోకి ఈడ్చుకు రావడానికి తాను తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నానని అంటాడు. కాని మనమింకా గ్రహచారాన్ని నిందించుకుంటూ, లలాటలిఖితం అంటూ నిరాశావాదంలో కొట్టుమిట్టాడుతున్నామని వాపోతాడు. ఈ కథ స్త్రీవాదం మీద ఎక్కుబెట్టిన బాణం. ఈ తరహా కవిత్వమంతా గాలిదారాల దేవతావస్త్రం వంటిదని సూచిస్తాడు. మనస్సులు విడదీయనంతగా పెనవేసుకు పోయినపుడు స్త్రీ పురుషుల మధ్య ఏ వాదమూ ఉండదేమో? కాని ప్రస్తుత సమాజంలో ఆ ప్రేమ కూడా దేవతావస్త్రమే.

'సీతయ్య' కథలో మనుషులు చాలామంది కీలు బొమ్మలేనని రచయిత చెప్పకనే చెప్తాడు.

'బొమ్మ' కథలో మనిషి పరిస్థితులకు బానిసై ఎలా బొమ్మలా వ్యవహరిస్తాడో, ఆ బొమ్మ ఎలా వుండాలో రచయిత చెప్తాడు.

'నేటి హిరణ్యాక్షుడు' కథలో నమశ్శివాయ నేటికాలపు 'బీల్జిబబ్' అంటాడు బీల్జిబబ్ అంటే ఏమిటో మనకు వివరణ చదివేదాకా తెలియదు. దానర్థం 'క్షుద్రదేవత' అని తెలిశాక, అటువంటి వాళ్ళే సమాజాన్ని పరిపాలిస్తున్నారని, వాళ్ళనే ప్రజలు నమ్ముతున్నారని మన మీద మనమే జాలిపడతాం.

'పంచపాండవులు' కథ చదివింతర్వాత నేటి 'ఆరోగ్యశ్రీ'లను చూచి ఆనందించాలో, ఏడ్వాలో కూడా అర్థం కాదు. రోగాలు పాండవులవలె శక్తి సంపన్నమై సంఘాన్ని పీడిస్తుంటే (యుద్ధంలో పాండవులే మిగిలారు) అసలు బ్రతుకే ఒక జబ్బుగా పరిణమించిందని శ్రీశ్రీ అంటాడు (ఈ కథ, 1948లో రాశాడు).

'మొహబ్బత్ ఖాన్' కథ ప్రణాళికలను అపహాస్యం చేస్తుంది. అర్థంలేని నియమాలు ప్రజలు ఎలా పట్టించుకోకుండా వ్యవహరిస్తారో చూపిస్తాడు. జనాభా పెరుగుతూనే ఉందని కూడా గుర్తు చేస్తాడు.

**నవరసాల నాయకుణ్ణి**
**కదనం నా ఆయుధం**
**ఈ శతాబ్దినేలుతుంది**
**బీభత్స రసాయనం**

అన్నాడు ఒకప్పుడు శ్రీశ్రీ. అందుకే నవరసాల మీద కథలు రాశాడు. అవి ఈ కథల సంపుటిలో వున్నాయి. వీటిలో అద్భుతరసానికి శ్రీశ్రీ రాసిన కథ లెని'నిజం'. లెనినిజం ప్రపంచంలో మొదటిసారి సోషలిస్టు వ్యవస్థను నిర్మించింది. మార్క్సిజానికి భాష్యం చెప్పింది. ఒక అద్భుతాన్ని సృష్టించింది. ఆ లెనిన్‌ని తిరిగి ప్రాణప్రతిష్ఠ జరగాలని కోరుకోవడం 'అసంబద్ధచింతన' (Absurd Thought), వాస్తవికతను కొంత జోడిస్తూ, లెనిన్ లాంటి నాయకుడు మళ్ళీ జీవిస్తే బాగుంటుందన్న ఊహతో నడిచే ఈ కథ అసలు అద్భుతమే ఈ రోజుల్లో సర్రియలిజం అనే భ్రమలోకి పాఠకుడిని నెడుతుంది.

'నింపాదిగా కోపం చెయ్యి' అనేది రౌద్రరసం మీద శ్రీశ్రీ రాసిన గల్పిక.

హాస్యరసం మీద రాసిన 'అరవంలో కోడిగుడ్డు'లో రచయిత 'పంచద్రావిడ భాషల్లో ఒకటైన తెలుగు' అంటాడు. భారతదేశంలో ప్రధాన సాహిత్య స్రవంతిలో నాలుగు ద్రావిడ భాషలు మాత్రమే పేర్కొంటారు. అవి తమిళం, మళయాళం, కన్నడం, తెలుగు. బహుశా ఐదవ భాషగా 'తుళు'ని శ్రీశ్రీ చేర్చి వుండవచ్చు. లేక భారతదేశం బయట ఎక్కువగా మాట్లాడే భాష (రాస్తున్న భాష కాదు) బ్రాహుయిని కూడా ఉద్దేశించి వుండొచ్చు. ఎందుకంటే ద్రావిడ భాషలు రాయడం రాని (కాని, మాట్లాడ్తాడు) దౌహిత్రుడిని గురించి రాస్తున్నాడు కాబట్టి ! (ఏది ఏమైనా 85

ద్రావిడ భాషా ప్రభేదాలు ప్రపంచవ్యాప్తంగా వున్నాయి. కాని ప్రస్తుతం 26 రకాలు ఎక్కువగా వ్యాప్తిలో వున్నాయని భాషా శాస్త్రజ్ఞులంటారు). భాషలైదింటినీ సింహబలులతో పోల్చి (భీముడు, జరాసంధుడు, బకాసురుడు, కీచకుడు, దుర్యోధనుడు - కథలో దుశ్శాసనుడు వుంది. ఇది అచ్చు తప్పా? లేక రచయిత పొరబాటా?) ఒక్కదానిని సాధిస్తే మిగతా భాషలన్నీ అలవడతాయని హాస్యపూరితంగా చెప్పాడు రచయిత. స్కూల్లో అక్షరాలు నేర్పించే పద్ధతి మీద అంతర్గతంగా చురకలున్నాయి. మాతృభాష ముందు నేర్చుకోమని అన్యాపదేశం వుంది. కాని ఈ హాస్యం అందరికీ మింగుడు పడకపోవచ్చు. (మనకు విదేశీ భాష మీద మోజు ఎక్కువ). భయానకరసం కథ 'దైవభీతి'. సమాజంలో మూఢనమ్మకాలు విస్తరించివుండటం, తార్కికత లోపించడం భయానక స్థితిని సృష్టిస్తుందని చెపుతుంది.

శృంగారరసం కథ 'మదన కదన కథ'లో కథానాయకుడు డా॥ భగవంతం పేరు సెక్సీగా వుందని చమత్కరిస్తాడు. ఈ కథ 'ఓ ఇనుప శృంగారం' అని చెపుతూనే బాబాలను పరిహాసం చేస్తూ కథ ముగిస్తాడు. ఈ కథ 1976లో రాసినప్పటికీ యిప్పుడూ అప్పుడూ కూడా శృంగారానికి చిరునామా అధికంగా ఆశ్రమాలే కదా !

కుళ్ళూ, పేకుళ్ళూ (కుళ్ళూ, పీకుళ్ళూ కావచ్చు ! ఎందుకంటే కవితలో అదేవుంది) కథ కాదు కవిత. ఆ పేరు వింటేనే జుగుప్స కలుగుతుంది. (బీభత్సరసానికి స్థాయీభావం). ఈ బీభత్సరస వర్ణనలో సంఘంలో పరుచుకుపోయిన ఏహ్యాన్ని, జుగుప్సనీ కళ్ళముందుంచుతాడు శ్రీశ్రీ.

శాంతరసం కథ 'బ్రూహి ముకుందేతి' ఎవరి మీద వ్యంగ్యరచనో (సెటైర్) అందరికీ సులభంగా అర్థం అవుతుంది. ఆ గాయని పాడేపాటలో తెలుగుభాష ఎన్ని అపసోపాలు పడిందో వివరిస్తాడు శ్రీశ్రీ.

కరుణరసం కథ 'కన్నీటి కబుర్లు' ఒక గల్పిక (స్కెచ్), వీరరసం కథ 'వెలుతురు కిరణాలు'లో శ్రీశ్రీ తన రాజకీయ నిబద్ధతను చాటుతాడు. 'చావూ, పుట్టుక' స్కెచ్‌లో కూడా అంతే. ఈ కథలన్నీ సమాజ పరిస్థితులకు అద్దం పడతాయి. ఇక అనువాద కథలకు వస్తే, ఇవి 27 ఉన్నాయి. వీటిలో విలియం సోరోమన్ కథలు ఎక్కువ. విలియం సోరోమన్ ఆర్మేనియన్ అమెరికన్. (31-08-1908 నుండి 18-05-1981 వరకు జీవించాడు) సోరోమన్ ఎంత ప్రసిద్ధుడంటే అతడి

శైలి సోరోమానెస్క్‌శైలిగా పేరు పొందింది. అతడి కథానికలన్నీ ఎక్కువగా సర్రియలిస్టిక్ కథలే. ఒకటి, రెండు కథలను బట్టి అనువాదకుడి స్వాతంత్ర్యమెంత వరకు సాగిందో అంచనా వేయలేం. అనువాదంలో స్థానికతకు ప్రాధాన్యత లభించవచ్చు, లేకపోవచ్చు.

కాని శ్రీశ్రీ కథలను పరిశీలిస్తే సర్రియలిజాన్ని తెలుగు సాహితీ ప్రపంచానికి పరిచయం చేసిన విశిష్ట స్థానం శ్రీశ్రీదేననిపిస్తుంది. ఎందుకంటే ఆయన యూరోపియన్ కవులనూ, కథకులనూ, నవలాకారులను అధ్యయనం చేశాడు కాబట్టి - వారిననువదించాడు కాబట్టి, అలాగే అతడు రాసిన కథల్లో కూడా సర్రియలిజం నిండుగా కనిపిస్తుంది. పైగా ఇతర అధివాస్తవిక కథకులు రాసిన కథలేవైనా వుంటే అవి పాఠకలోకానికి శ్రీశ్రీ కథలు అందినట్లు అందలేదు.

శ్రీశ్రీ సామాజిక పరిస్థితులను, వాటిలోగల కల్మషాన్ని కడగాలని ఉద్దేశించి కథలు రాశాడు. చురకలు వేశాడు. ప్రబోధించాడు. కదనమైనా, కథనమైనా ఆయన గమ్యం ఒక్కటే, లక్ష్యం ఒక్కటే !

# నవీన్ కథలు ఒక పరిశీలన

నల్ల యాదగిరి

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వెలువడ్డ అనేక ప్రక్రియల్లో కథ ఒకటి. కథ, కథానిక సూక్ష్మభేదంతో పర్యాయ పదాలుగానే వ్యవహరిస్తున్నారు. నవలతో బాటుగా ఆధునిక కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రక్రియ కథ. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు'తో ఆవిర్భవించిన తెలుగుకథ అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. జీవితంలోని ఒకటి రెండు ముఖ్య సంఘటనలు చిత్రించడానికి కథానిక మిక్కిలి ఉపయోగపడ్తుంది. కథానికలో 'క్లుప్తత' ముఖ్యం.

నవీన్ కథలన్నీ ఆద్యంతము పాఠకుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. దీనికి కారణం చైతన్యస్రవంతి శిల్పం. ఆయన కథా భవనానికి ఎన్నుకున్న వస్తువనే పునాది గట్టిది. సమసమాజంలోని ఎన్నో జీవిత పార్శ్వాలను స్పృశించి చక్కని శిల్పనిర్మాణ కౌశలంతో కథల్ని నిర్మించాడు. అటు నవలా ప్రక్రియతో పాటు ఇటు కథా ప్రక్రియను కూడా సమానంగా నడిపించాడు.

"మంచికథ కంచికి చేరదు-జీవితం పొరలు విప్పి ఇంటికి తెస్తుంది" అంటాడు 'నానీ'లు లో గోపి. నవీన్ వ్రాసిన మంచి కథలెన్నో పాఠకుడికి జీవితం పొరలు విప్పి వాస్తవాన్ని చూపిస్తాయి. నవీన్ కథలు పేదరాశి పెద్దమ్మ కథల్లాగా ఏడు చేపల కథల్లాగా కాక సామాజిక ప్రయోజనాన్ని ఆకాంక్షించేవి. హేతుబద్ధమైనవి. నవీన్ కథల్లోని పాత్రల మానసిక వైఖరి, ఆలోచనాసరళి అంతస్సంఘర్షణ వాస్తవాతీతంగా ఉండదు. పాత్రలు నేలవిడిచిసాము చేయవు. నవీన్ వ్రాసిన దాదాపు పాతిక కథలలోని ప్రతిపాత్ర విలక్షణమైన ప్రవృత్తి కల్గిందే నవీన్ ఎన్నుకొనే వస్తువు పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు పాఠకులను హత్తుకునేట్లు చేస్తాయి.

నవీన్ కథలు 1.అథోలోకం 2.తీరిన కోరిక 3.టెక్నికల 4.నిప్పురవ్వలు 5.లైఫ్ ఇన్ ఎ కాలేజ్ 6.రెండోపెళ్లి 7.క్లబ్ 8.ట్యూషన్ మాష్టారు 9.హత్య 10.ఎండ 11.ఫ్రమ్ అనురాధ 12.విత్ లవ్ 13. దాడి 14.బలి 15.చెర 16. తెర.

'అథోలోకం' 7 పేజీల కథ అనామకుడైన (పేరులేదు) ఒక కాలేజి విద్యార్థి కోఠి వీధుల్లో నడుస్తుంటాడు. కారు హరన్ మోతవిని "అబ్బబ్బ" "Can't you

Anounce your coming like a Gentleman"అని AG Gardner కొటేషన్ స్మరించుకుంటాడు. ప్రతి చిన్న సంఘటనకు ప్రతిస్పందిస్తూ తన ఆలోచనా స్రవంతిని కొనసాగించుకుంటూ వెళ్తుంటాడు. ఫుట్‌పాత్ పై 'కుముదిని' అనే విద్యార్థినిని చూస్తాడు. మళ్లీ భావసంచలనం. లెక్చరర్ కమలాకరరావు కుముదినిలను చూసి ఏవేవో ఊహించుకోవడం. వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనుకోవడం. అందుకే కాలేజీలో అలాంటి రూమర్స్ పుట్టాయనుకోవడం జర్గుతుంది. ఏడు పేజీల ఈ కథలో తన దురాలోచనలను ఊహలను రూంకువెళ్లి తన మిత్రుడైన మురళికి చెప్పాలనుకుంటాడు. ఒక్కోసారి చెప్పకూడదనుకుంటాడు. అంతర్మథనంలో పడి చివరకు కుముదినీ కమలాకరరావుల గూర్చి తను ఊహించుకున్న విషయాలు చెప్పాడు. "పచ్చి అబద్ధం. మైగాడ్ యింత విషం నా హృదయంలో వుందా .... ఎంత పాడు పని చేశాను. ఎంత దుర్బలుణ్ణి నేను యెప్పుడూ యింతే" అంటూ అథోలోకంలోకి వెళ్లిపోతాడు. రచయిత సృష్టించిన ఈ పాత్ర తన కథతోనే చెప్పుకుంటుంది. తన చిత్తసంస్కారాన్ని తానే బేరీజు వేసుకొని అథోలోకంలోకి పయనిస్తున్నాననే విచికిత్సలో పడి అంతశ్శోధన గావించుకుంటాడు. ఉన్నత ఉత్తమలోకాల్లోకి వెళ్లడానికి మార్గాన్ని సుగమం చేసుకునే లక్ష్యం ఏర్పాటు చేసుకుంటాడు.

'తీరిన కోరిక' అనేది పాతిక సంవత్సరాల వయస్సు కలిగిన రాజారావు అనే పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌ది. ఒక రోజు మానసిక వైఖరి ప్రదర్శితవుతుంది. అతడు ఉదయం కాలేజికి వెళ్తూ ఆలోచిస్తాడు. తన భార్య సావిత్రి బొగ్గులు తెమ్మంటుంది. జేబులో పైసాలేదు. నెలాఖరు. బొగ్గులు లేకపోతే రాత్రికి వంటసున్న అని తెగేసి చెబ్తుంది. రాజారావు సౌందర్యోపాసకుడు. "ఏం బొగ్గులు తెమ్మంటుంది బొగ్గులు-నా జీవితం బొగ్గులే మిగులుస్తుంది. బొగ్గులు కాక మందారాలు మకరందాలు తెస్తుందనుకున్నాను. కాని బొగ్గులు తెచ్చింది బొగ్గులు" అనుకుంటూ ఆలోచించుకుంటూ వెళ్తుంటాడు. తనే పక్కింట్లో అడిగి వంట చేయొచ్చు కదా? సావిత్రిలో ఆ గర్వం. నైర్లక్ష్యం పుట్టింటివాళ్లు డబ్బున్నవారనే సుపీరియారిటీ కాంప్లెక్స్, తన అన్న తాసిల్దారనే బింకం. అంత గొప్ప వాళ్లయితే తనకెందుకిచ్చారు. ఏ మహారాజ కుమారుడికో యివ్వకపోయారా? తన మనస్సునర్థం చేసుకోదు? ఆడవాళ్లంతా తమ ఆర్థికావసరాలు తీర్చే సాధనంగా వాడుకుంటారు. అని ఆలోచించుకుంటూ కాలేజికి నడిచి వెళ్తుంటాడు రాజారావు. చేతిలో నోట్‌బుక్

నలిగిపోతూ ఉంటుంది. దారిలో ఇద్దరు ముగ్గురు స్టూడెంట్స్ 'గుడ్‌మార్నింగ్ సార్' అన్నా గమనించకుండా వెళ్తాడు. తమ కాపురం ఊర్వశీ పూరురవుల కాపురంలా ఉందా అని ఊహాలోకంలో తేలిపోయాడు రాజారావు. తన ఊహాలోకానికి వాస్తవ జీవితానికి ఏ మాత్రం పొంతనలేదు. తన భార్య తన ఊహకు కోరికకు భిన్నంగా ప్రవర్తించడం రాజారావులో మానసిక సంఘర్షణకు దారితీసింది. తన భార్య కోసం ఏరి కోరి రాజారావు చీరతెస్తే "ఏడ్చినట్లుంది మిరిలాగే చెత్త చీరలకి డబ్బు తగలేస్తారంది". ఆ మాటలు కాలేజికి వెళ్లేప్పుడు రోజూ తన భార్య తనకు ఎదురు రావాలని, ముద్దివ్వాలని, గాఢమైన కోరిక – ఆ కోరికా తీరని కోరికే అయి తన భార్య పుట్టింటికి వెళ్లినప్పుడు రొమాంటిక్ ఉత్తరాలు ఎన్నో ఆశించాడు. కాని ఆమె "ఏమోనండి ఆ కవిత్వం నాకు అర్థం కాలేదు" అంటుంది. రాజారావుకు స్త్రీ అంటే గౌరవం. శరత్ చలం సాహిత్యం త్రాగి బ్రతికాడు. స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యం గూర్చి పరితపించాడు. పురుషుడు, సమాజం, కట్టుబాట్లు మొదలగు కబంధ హస్తాలనుంచి బయటపడాలని వాంఛించిన సంస్కారి. రామయ్య తన భార్యను గొడ్డును బాదినట్లు బాదుతుంటే చూసి బాధపడేవాడు. రామయ్యను పశువుగా నరరూప రాక్షసుడిగా ఊహించేవాడు.

సావిత్రి రాజారావు రిక్షాలో వెళ్తుంటే తమాషాకై ఓ కూరగాయల అమ్మాయిని చూపిస్తూ, ఆ అమ్మాయి అంటే నాకిష్టం అంటాడు. సావిత్రి మగాళ్లేం చేసినా చెల్లుతుంది. అదే ఆడది చేస్తే, అంటుంది. రాజారావు, నా కిష్టమైన ఆడాళ్లున్నట్లే నీ కిష్టమైన మగాళ్లుండొచ్చు అంటాడు. "ఆ రిక్షావాడంటే నాకు చాలా యిష్టం" అంటుంది సావిత్రి ఆ రిక్షావాడు కన్పించడు. రకరకాలుగా ఊహించుకుంటాడు రాజారావు.

కాలేజీలో ప్రిన్సిపల్ అభినందించిన రోజు ఆనందం తెల్లని చీర మల్లెపూలు వెన్నెల్లో పరుచుకుందామంటాడు. "అసహ్యంగా ఉంటుంది పక్కింటివాళ్ళు చూస్తారు అంటుంది." సగటు స్త్రీ మనస్తత్వం భావభౌతిక సంఘర్షణ – ఆదర్శ వాస్తవాలకు ఘర్షణ.

Class లో prepare కాకుండా వెళ్లే Lecturer పరిస్థితిని చక్కగా వర్ణించాడు. Prepare కాకపోవడం వల్ల చెప్పే పాఠంలోని వైఫల్యానికి కారణం సావిత్రేనని ఆగ్రహించాడు. బొగ్గులు తేకపోతే తన అసమర్థతని శంకించి పుట్టింటికి వెళ్లిపోతుందా ఎవడితోనైనా లేచిపోతుందా ? అని అనుకుంటాడు.

రఘుపతి దగ్గర 10/- రూ. లు అడుగుతాడు. లేవంటాడు. సాయంకాలం ఇంటికి వస్తుంటే ఇంటిముందు రిక్షావాడు కనబడ్తాడు. మళ్లీ ఆందోళన.... సావిత్రిని కొట్టడంతో కథ ముగుస్తుంది. దాంపత్యం జీవితంలోని సంఘర్షణ చూపాడు. పైకి లెక్చరర్ గొప్పగా పాఠాలు చెప్పి Principal, Students ప్రశంసలు పొందినవాడు. Class roomను నవ్వుల పువ్వులతో విరాజిల్లచేస్తాడు. కాని అంతర్గతంగా సంస్కారం అథోలోకంలో విహరిస్తుంది.

'నిప్పురవ్వలు' క్షీణిస్తున్న బూర్జువా సంస్కృతికి నిదర్శనం. (17 పుటలు) రంగారెడ్డి ఇంట్లో పనిచేస్తున్న 'పిచ్చివాడి' మనోవేదన ఈ కథ. రెడ్డి భోగలాలసత్వం, వేశ్యాప్రియత్వంతో చివరగా తన కూతురు 'సరోజ'నే (తెలియక) వాంఛిస్తాడు. ఇంటివెనక గదిలో పిచ్చివాడితో సరోజ కోర్కెలు తీర్చుకుంటుందన్న విషయాన్ని చూసి సరోజను తంతూ కొడుతూ ఉమ్మేస్తుంటాడు. జంతువును ఈడ్చుకుపోయినట్లు ఈడ్చుకుపోతాడు. ఆమె శవంలాగా పడివుంది. ఇదే సందుచూసుకొని పిచ్చివాడు ఆ ఊరు విడిచి పారిపోతాడు. 'నిప్పురవ్వలు' కథపేరు ప్రతీకాత్మకంగా ఉండి ఒడిని చిచ్చుపెట్టుకున్నట్లు పాపాన్ని చేస్తే దహించేస్తుందన్న సత్యం ఆవిష్కరింప బడింది. అర్ధరాత్రి కుక్కలు మొరగడం, దయ్యంపిట్ట వికృతంగా అరుచుకుంటూ పోవడం రక్తం బొట్లు బొట్లు పడడం జనం చావడం మొదలగు వర్ణన కథా గమనాన్ని సూచిస్తుంది. 18 ఏళ్ల ప్రాయం కల్గిన అమాయకుడు, పుట్టుక తెలియని వాని ఆలోచనా సరళి ఎలా వుంటుందో యిందులో రచయిత చక్కగా చూపాడు. క్షీణిస్తున్న ఫ్యూడల్ సంస్కృతికి రంగారెడ్డి ప్రతీక. అతని కూతురు ఈడు గల స్త్రీలను వాంఛిస్తు "ఓహో నా బిడ్డ సరోజ వయస్సేనన్నమాట" అనడంలో (daughter fixation) కనబడుతుంది. Unconscious గా అతనిలో నిబడీకృతమైన వాంఛాప్రవృత్తి గోచరిస్తుంది. తాను తన బిడ్డకు పెళ్లి చేయాలనే ఆలోచనవస్తే భరించలేదు రెడ్డి. వియోగ తీవ్రత అనుబంధాల మీద ఆధారపడ్తుంది. పిచ్చివాడితో కొట్టంలో కులుకుతున్న తన కూతురు సరోజను చూచి అతని అస్తిత్వ గర్భకుహరం మూర్తిమత్వశీలం విచలితమవుతుంది.

నవీన్‌గారు నల్గొండ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నపుడు, ఆ కాలేజీలో ఓ క్లర్క్ ఉండేవాడట. అతడెప్పుడు నిద్రమత్తుతో సోమరిపోతుగా ఉంటూ ఆఫీస్ పని ఏమీ చేసేవాడుకాడట! ప్రిన్సిపల్ ఎంత మందలించినా అతనిలో చలనంలేదు.

దీన్ని ఆధారంగా చేసుకొని 'హత్య' కథ వ్రాశాడు నవీన్. హత్య కథలో గురవయ్య అనే రెవెన్యూ కార్యాలయపు గుమాస్తా బద్ధకానికి సోమరితనానికి నిదర్శనం. ఏ పనీ చేయడు. ఆఫీసులో బల్లమీద తలపెట్టి ఎప్పుడూ నిద్రిస్తుంటాడు. ఇద్దరు ముగ్గురు ఆఫీసర్స్ ఇతనిలో మార్పు తేవడానికి ప్రయత్నించారు. కాని విఫలులయ్యారు. గురవయ్య చిన్నప్పటి నుండీ ఇంతే. చదువుకొమ్మని వాళ్ళనాన్న కొడితే "మా నాన్న చనిపోతే బాగుండనుకుంటాడు. రెండో తరగతి చదువుతుండగా గురవయ్య నాన్న అకస్మాత్తుగా చనిపోతాడు." తండ్రి చనిపోయాడన్న వార్త అతనికి సంతోషం కలిగించింది. తను మనసులో తన నాన్న చనిపోవాలనుకోవడం వల్లనే ఇలా జరిగిందనుకునే వాడు గురువయ్య. గురవయ్య ఆఫీసర్ కొత్తగా మారాడు. కృష్ణమూర్తి చండప్రచండుడు. చాలా స్ట్రిక్టు, పంక్చువాలిటీ, డిసిప్లిన్ గల మనిషి. అందరూ ఒళ్లు వంచి పనిచేయాలని, పెండింగ్ ఫైల్స్ ఉండకూడదని చెప్పాడు. అయినా గురవయ్యలో మార్పు లేదు. అతని అసమర్థతని సోమరితనాన్ని సహించేవాడు కాదు కృష్ణమూర్తి. అతని డిస్పాచ్ సెక్షన్‌కు మారుస్తారు. అక్కడ కట్టలు కట్టలు లెటర్లు పేరుకొని పోతాయి. ఒకసారి 'అర్జంట్' అని మార్కు చేసి డిస్పాచ్ సెక్షన్‌కు పంపిస్తాడు ఆఫీసర్. వారం రోజుల తర్వాత పై ఆఫీస్ నుండి ఆ Report రాలేదని కృష్ణమూర్తికి Reminder వస్తుంది. కృష్ణమూర్తి చివాట్లు వేస్తు ఆ లెటర్ గూర్చి ప్రశ్నిస్తాడు. గురవయ్య తనకు తెలియదంటాడు. గుట్టలుగా పేరుకుపోయిన ఫైళ్ళలో అడుగున ఆ లెటర్ కనబడ్తుంది. ఆగ్రహోదగ్రుడైన ఆఫీసర్ గురవయ్యను సస్పెండ్ చేస్తాడు.

గురవయ్యలో సంచలనం ప్రారంభమవుతుంది. ఇంట్లో కూర్చొని ఆఫీసర్ చనిపోతే బాగుండనుకుంటాడు. ఒక గుడ్డబొమ్మను తయారుచేసి దానికి గుండుసూదులు గుచ్చుతూ తన ఆఫీసర్‌ను హింసిస్తున్నట్లు ఆనందిస్తాడు. చివరికి ఆ బొమ్మను ఇంటి వెనకకు తీసుకువెళ్లి యాసిడ్‌పోసి తగలబెట్టి మా ఆఫీసర్ చచ్చిపోయాడని ఏడుస్తాడు. పదిహేను రోజులపాటు ఇలా ఏడ్చి ఏడ్చి కళ్లు ఎర్రగా అయ్యాయి నిద్రలేదు. 15 రోజులు సస్పెన్షన్ తర్వాత ఆఫీసు వెళ్తాడు. కాని అతనిలో భయం. తన ఆఫీసర్‌ను చంపినందుకు జైల్లో వేస్తారేమోనని. కానీ ఈ విషయం ఎవరికీ తెలియదనుకున్నాడు. ఆఫీసులో కృష్ణమూర్తిని చూసి దయ్యం రూపమా అనుకున్నాడు. తను రాత్రే కృష్ణమూర్తిని హత్య చేశాడు. ఇంతలో ఆఫీసులో కలకలం కృష్ణమూర్తికి హార్ట్ అటాక్ వచ్చిందని. అతను విలవిల్లాడుతుంటే గురవయ్య కళ్లు తృప్తిగా వెలిగాయి. డాక్టరు వచ్చి వెంటనే హాస్పటల్ చేర్పించండి అన్నాడు.

హాస్పటల్‌లో చేర్చేలోగా అతడు తుదిశ్వాస విడిచాడు. అతని భార్యాపిల్లలు హృదయ విదారకంగా రోధిస్తున్నారు. అందరూ అతన్ని మంచివాడని, స్ట్రిక్టని, సమర్థుడని అంటారు. తనేమో గుండుపిన్నులతో గుచ్చి హత్య చేశాడు. ఈ హత్య విషయం నలుగురికి తెలిస్తే తనను చిత్రవధ చేస్తారేమోనన్న భయం వేసింది గురవయ్యకు.

ప్రతిక్షణం గురవయ్యలో పాపభీతి, మానసిక సంఘర్షణ ఎక్కువైంది. ఏక్షణంలోనైనా పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తారేమోనన్న భయం. నిద్రాలోలుడైన గురవయ్య నిద్రకు దూరమయ్యాడు. చేసిన పాపం చెబితే పోతుందనుకొని ఈ విషయం తన కొలిగ్‌కు చెప్తే అతను గురువయ్యను పిచ్చివాడిగా జమకట్టాడు. ఆఫీసర్ గుండెపోటుతో చనిపోయాడన్న వాస్తవాన్ని గురవయ్య మనస్సు అంగీకరించదు. చివరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్.ఐ.కి చెబితె ఎస్.ఐ. గూడా ఇతన్ని ఒక పిచ్చివాడిగా చూసి, వెళ్లిపొమ్మంటాడు. రెండు మూడు రోజుల అశాంతి దావాగ్నిలో కొట్టుకొని చివరకు గురవయ్య ఉరివేసుకొని చనిపోతాడు. ఎస్.ఐ., కొలీగ్, ఇద్దరూ గురవయ్య విషయాన్ని Serious గా తీసుకుంటే ఇది జరిగేది కాదేమో అనుకున్నారు.

గురవయ్య సంశ్లిష్ట ఉద్వేగాలలో (Complex emotions) పడి పరివేదనలకు గురి అవుతారు. మనో విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం చిన్ననాడు తండ్రి చేతిలో దెబ్బలకు గురయినపుడు ఇటువంటి వియోగ వ్యాకులతను (Seperation anxiety) పెంచుకుంటాడు.

'దాడి' కథ సోమయ్య అనే జీతగాడి జీవిత గాథ. అనాదిగా పెత్తందారి పాదాలక్రింద నలిగిపోయిన బడుగు బ్రతుకుల చిత్రీకరణ. రాఘవరెడ్డి సోమయ్యను వెట్టిచాకిరీ చేయించుకునే వైనం వాస్తవంగా వర్ణితమైంది. ఆ ఊళ్లో అప్పుడప్పుడే విప్లవ సంఘాలు పెట్టడం. సోమయ్య మామ సమ్మయ్య విప్లవోద్యమానికి అంకితం కావడం జరుగుతుంది. అనుకోకుండా సమ్మయ్య సోమయ్యను వెంటేసుకొని 'విశ్వం' అనే విప్లవనాయకుడున్న గుట్టల్లోకి వెళ్లి చూడడం తటస్తిస్తుంది. 16 యేళ్ల వయస్సు కల్గిన సోమయ్యలో భయం. దొర చూస్తే చంపేస్తాడని, ఆ ఊళ్లో భూస్వామి వెంకటేశ్వరరావు భూమిని అమ్మకుండా సమ్మయ్య అనుచరులు అడ్డుకుంటారు. పోలీసులు రావడం, సమ్మయ్యతోపాటు విప్లవ సానుభూతి పరులను కొట్టుకుంటూ జీపెక్కించుకొని తీసుకెళ్లడం, తర్వాత సోమయ్య దొర పశువులు మేపుతుంటే కమ్మరి దుర్గయ్య అనే ముసలాడు సోమయ్య దగ్గరకు రావడం, సోమయ్యను గుట్టల్లోకి

వెళ్ళి 'విశ్వం' వాళ్లను గుహ విడిచి వెళ్లకపోతే పోలీసుల వల్ల ప్రమాదం ఉందని చెప్పమంటాడు. సోమయ్య దొర చూస్తే కొడ్తాడేమోననే భయంతో గుట్టలపైకి పరుగెత్తి చెప్పివస్తుండగానే దొర చూస్తాడు. ఎక్కడికెళ్లి వస్తున్నావ్? అని గద్దిస్తాడు. కొడ్తాడు. సోమయ్య ఏడుస్తుంటాడు. ఇంతలో సాయుధులైన పోలీసులు రెండు జీపుల్లో వస్తారు. అరెస్టు చేసి తీసుకుపోయిన కుర్రాడు కూడా ఆ జీపులో ఉన్నాడు. పోలీసులు వచ్చి రాఘవరెడ్డితో 'విశ్వం' వాళ్లు ఈ రాత్రి ఈ గుట్టపై క్యాంపేస్తున్నారట. నా కొడుకులు ఈ సారికి తప్పించుకోలేరని చెప్తాడు. రాఘవరెడ్డి నవ్వుతూ వాళ్లెప్పుడో "తప్పించుకున్నారు. ఇగో వీడు బోయి చెప్పిండు? అని సోమయ్యను చూపెడ్తాడు. సోమయ్య (16 యేళ్ళ) కుర్రాడు భయంతో పరుగెడ్తుంటాడు. ఎస్.ఐ. వెనుకనుంచి కాల్చి చంపేస్తాడు. మరునాడు 'తీవ్రవాదులపై పోలీసులదాడి ఒక తీవ్రవాది మృతి' అనే వార్త ప్రసారమౌతుంది.

తెలంగాణాలోని ఇప్పటి పరిస్థితి కళ్లకు కట్టినట్లుగా ఉంది. అమాయకుడు, అన్నెం పున్నెం తెలియనివాడు, పాలుగారే పసిబుగ్గల జీతగాడు అస్తవ్యస్త వ్యవస్థలో ఎలా చిక్కిపోయి చచ్చాడన్నది వాస్తవంగా ప్రతిబింబిస్తుంది. తెలంగాణాలో ఏ పల్లె చూచినా ఇలాంటి భయాందోళన మధ్య చిక్కి వేగిపోతూ బిక్కు బిక్కుమంటుంది. ఒక వంక ఊళ్లో దొరతనం పెత్తనంతో పోలీసుల అన్నల మధ్య చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్న అమాయకులెందరో.

'బలి' గ్రామీణ వ్యవస్థను ప్రతిబింబింపచేసే కథ. వీరయ్య అనే బక్కచిక్కిన పేదరైతు 3ఎకరాల భూమిలో రెక్కలు ముక్కలు చేసికొని అవిశ్రాంతంగా కష్టిస్తూ క్రమక్రమంగా 50 ఎకరాల దాక సంపాదిస్తాడు. మోతుబరిరైతు అవుతాడు. ఊళ్లోవాళ్లు వీరయ్యను వీరారెడ్డిగా పిలుస్తుంటారు. అతని కొడుకులురామయ్యను రాంరెడ్డి, రాజయ్యను రాజారెడ్డిగా పిలుస్తుండేవారు. వీరయ్యకు అలా పిలుపించుకోవడం అయిష్టం. కొడుకులు మాత్రం రామయ్య రాజయ్య అని పిలిస్తే కోపం వచ్చేది. వీరయ్యను పంచాయతి బోర్డు ప్రెసిడెంట్‌గా నిలబడమని పట్వారి పటేల్ అడుగుతారు. వీరయ్య నాకిష్టంలేదంటాడు. కష్టపడి ఒక బావి తవ్విస్తాడు. పిల్లలంతా ఆ బావిలో ఈతలు కొట్టడానికి వస్తుంటారు. వీరయ్య బావి పాడవుతుందని పిల్లలని తిడ్తాడు. అందులో పట్వారి పిల్లాడు కూడా ఉంటాడు. పట్వారి పిల్లాడైతే భయమా అంటాడు. ఊళ్లో పెద్దమనుషులతో వీరయ్య సంబంధాలు పెంచుకోక తన పనేందో తన వ్యవసాయమేందో తానే చూసుకుంటాడు. వీరయ్య అంటే పట్వారి,

పటేల్ లాంటి వాళ్లకు ఈర్ష్య, కోపం. అవకాశం వస్తే ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్నారు. ఆ ఊళ్లోకి కరెంట్ రావడం, వీరయ్య బావికి కనెక్షన్ యివ్వడం కరెంట్ వాళ్లిచ్చే తప్పుడు కనెక్షన్ వల్ల నీళ్లల్లోకి కరంట్ పాసై ఇద్దరు పిల్లలు చావడం జరుగుతుంది. ఊళ్లోకి నక్సలైట్లు వచ్చి ప్రజాకోర్టు నిర్వహించి ప్రజాభిప్రాయం మేరకు 50వేలు నష్టపరిహారం మృతుల కుటుంబాలకివ్వాలని తీర్మానిస్తారు. వీరయ్య నా తప్పేమి లేదంటాడు. ఒక్కపైసా ఇచ్చేది లేదంటాడు. వీరయ్య కొడుకులు బలవంతంగా నాన్నను ఒప్పించి పత్రాలపై సంతకాలు పెట్టిస్తారు. ఇంతలో పోలీసు జీపులు రావడం ఎక్కడివాళ్లక్కడ పారిపోయారు. పోలీసు క్యాంపు పెట్టడం యివన్నీ వీరయ్యనే చేయిస్తున్నాడని జనం అనుకోవడం. పాపం వీరయ్య అమాయకుడు. ఏ విషయం తెలియదు. పోలీస్‌లకు సమాచారం అందిస్తున్నాడనే నెపంతో నక్సలైట్లు వీరయ్యను చంపేయడం జరుగుతుంది. కాని ఆ ఊళ్లో అంతకు ముందు నుంచే మామూలు దుస్తుల్లో తిరుగుతున్న పోలీస్ సి.ఐ.డి. వల్ల యిదంతా జరిగిందని ప్రజలకు తెలిసినప్పుడు 'పాపం' వీరయ్య అనుకున్నారు.

ఈ కథలో వీరయ్య కష్టపడి పొలం, డబ్బు సంపాదించాడే గాని, లౌక్యం సంపాదించలేదు. తన కాయకాష్టాన్ని నమ్ముకున్నవాడు. జీవితమంటే భయం లేనివాడు. నక్సలైట్లు చంపేస్తారని కొడుకులు కోడళ్లు భార్య ప్రాధేయపడ్డప్పుడు మనం ఎవరిసొత్తు తినలేదు. ఎవరికి భయపడను అని చెప్తాడు. మానవ సంబంధాల ఆంతర్యం తెలియక, వ్యవహార సరళి గ్రహించని మనిషికి ప్రతీక వీరయ్య. ఇట్లాంటి సంఘటనలు రోజూ మనకళ్లముందున జరుగుతున్న కథలే నవీన్ 1960లో చిత్రించాడు.

'ట్యూషన్ మాస్టార్' అనే కథ కూడా వాస్తవికతను ప్రదర్శిస్తుంది. ఈ రోజుల్లో ట్యూషన్స్ అనేవి ఒక ప్యాషన్‌గా మారాయి. KG నుండి PG వరకు ట్యూషన్లే. అవసరమున్నా లేకున్నా ట్యూషన్ మాస్టార్ దగ్గరకెళ్లడం ఎంత అసందర్భమో ఈ కథ చక్కగా తెలియచేస్తుంది.

రామచంద్రయ్య గవర్నమెంట్ స్కూల్లో లెక్కల మాస్టారు. లెక్కలతో పాటు ఆయన అన్ని సబ్జెక్టులు చెప్తాడు. పాఠాలు చెప్పాడనడం కంటే పైరవీలు చేసి పాస్ చేయిస్తాడు. పబ్లిక్ ఎగ్జామ్స్ వస్తున్నాయంటే చాలు ఎలాగోలా ప్రశ్నపత్రాలు సంపాదించడం, తన ట్యూషన్ పిల్లలకు రెండురోజులముందే ప్రశ్నపత్రాలివ్వడం, వాటికి సమాధానాలు కూడా సిద్ధం చేయించి పరీక్ష హాల్లోకి సప్లై చేయడం

జరుగుతుంది. పక్కటౌన్లో బాగా డబ్బున్న ఒక దొర తన కొడుకును ట్యూషన్ మాస్టార్ దగ్గరకు పంపిస్తారు 10th Class Pub. Exams కొరకు. లక్ష్మీసరస్వతులు ఒక్కదగ్గర కాపురం చేయవనే భయంతో దొర తన కొడుకును రామచంద్రయ్య ట్యూషన్ మాస్టర్ దగ్గరికి పంపిస్తాడు. నెలనెలా ఖర్చులు పంపిస్తానని రామచంద్రయ్య ఇంట్లోనే ఉండేట్లు ఏర్పాటు చేస్తాడు. ఆ విద్యార్థికి రామచంద్రయ్య ఇంట్లోనే ఉండి ట్యూషన్ చదవడం యిష్టంలేదు. పైగా ట్యూషన్ కూడా ఏమీ చెప్పదు. పరీక్షల్లోనే చెప్పి పాస్ చేయిస్తాడు. డబ్బు విపరీతంగా గడించాడు. అక్రమ మార్గంతో ఫలితాలు సాధించే వైనాన్ని చాటి చెప్పే కథ. చివరకు రామచంద్రయ్య తన కూతురు వనజను (అనాకారి, నల్లనిది, లావుది) ఈ అబ్బాయికి ఇవ్వాలనే నిర్ణయంతో ఇల్లు విడిచి పారిపోవడం జరుగుతుంది.

తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదవాలని అనుకోవడం సహజం. కాని తమ పిల్లల అభీష్టానికి అనుగుణంగా నడుచుకోక బలవంతంగా EMCET కై గుంటూరు, విజయవాడ, నెల్లూరు లాంటి పట్టణాలకు పంపడంవల్ల విద్యార్థులకు Home Sick ఏర్పడడం, వేలాది రూపాయలు వృథాకావడం, చదువు సజావుగా కొనసాగకపోవడం ఈ కథ చక్కగా చిత్రిస్తుంది. ఇలాంటి ట్యూషన్ మాస్టార్లు కోచింగ్ సెంటర్లు పెట్టి కోట్లాది రూపాయలు గడిస్తూ గవర్నమెంట్ విద్యాలయాల్లో పాఠాలు చెప్పక ఎన్ని అక్రమాలకు అవకతవకలకు పాల్పడుతున్నారో ఈ కథ చక్కగా తెలియచేస్తుంది. ఇష్టం లేనప్పుడు బలవంతంగా ట్యూషన్‌లకు పంపడంవల్ల ఆ విద్యార్థికి ఆ మాస్టార్‌పై ఎంత కోపం కసి ఉంటాయో 'గడ్డిబొమ్మ దగ్ధం' సంఘటన ద్వారా తెలుస్తుంది. విద్యార్థి మానసిక వికాసానికి దోహదపడే చదువే నిజమైన చదువని ఉద్బోధించే కథ.

'చెర' కథ 10వ తరగతి పాసైన ఒక బీదవాడు ప్రొఫెసర్ ప్రకాశరావు స్వార్థానికి ఎలా నలిగిపోతాడో వివరింపబడింది. తెలివిగలవాడు తెలివిలేని వాణ్ణి ఎలా మోసగిస్తారో తెలుస్తుంది. అటెండర్ ఉద్యోగమిప్పిస్తానని ఎలా ఆశలు కల్పించి హాస్పటల్‌లో సేవలు చేయించుకుంటాడో నిరూపితమైంది.

60 ఏళ్ల సంపన్నుడు రోగగ్రస్తుడై (కాన్సర్) మంచం మీద పడ్డప్పుడు కొడుకు కోడళ్లు, కూతురు అల్లుడి ప్రవర్తన ఎలా వుంటుందో 'తెర' కథ తెలియజేస్తుంది. బెల్లమున్నంతసేపే ఈగలు ముసురుతాయనడానికి తార్కాణం ఈ కథ. ఇలా నవీన్ కథలన్నీ ఏదో ఒక సమకాలీన సామాజిక అంశాన్ని ఆధారం చేసుకొని సాగుతాయి.

# కా.రా. 'చావు' కథ - అట్టడుగు స్త్రీ పాత్రలు

డా॥ తుర్లపాటి రాజేశ్వరి

"ఎవుడైతే నాయఁవని దరమఁవని పూర్వీకులు సెలవిచ్చిన కట్టుబాట్ల కొసలకండ మందంతా నడిసిన దారినే నడుస్తాడో ఆడల్ల పేదోడు. ఎవుడైతే కట్టుబాట్లొగ్గేసి, నాయవూనేదు, దరమఁవూ నేదు, నాను పెద్దోణ్ణి కావడం వొక్కటే నాకు నాయం - అనుకున్నాడో ఆడల్ల పదిమంది కొంపలార్సో, పదిపొట్టలు కొట్టో పెద్దోదవుతున్నాడు.

ఎంతకాలం మనఁవిలాగ కుళ్ళుతాం? ఎందును గురించి మనఁవిలాగ కుళ్లాల?

ఈ సలి సంకటం మన ఎన్ను బాఁవుని పట్టేసింది. ఎఁవుకులు తినీసింది. సీఁవూ నెత్తురు మరేటి మిగల్నేదు. కుక్కలో నక్కలో ఒక్కపాలే సస్తాయి. మన్ది పుట్టిన కాణ్నుండీ కొసదాకా సావే, ఒక్కపాలి సావడమంటే మనకి చెదురు. కసింత కసింత సావడం మనకి శఁవానగుంటాది. కానియ్యండి అలాగే కానియ్యండి" అంటూ సమాజ సత్యాలను తెట తెల్లం చేసి, ప్రశ్నించి, ఆపైన తనమాటని సమర్థించే వారెవరూ లేరనే ఉక్రోషంతో, నిస్సహాయతతో, వేదనతో తల్లడిల్లే అప్పారావు లాంటి యువకుల్ని కథా 'యజ్ఞ' గుండంలో నుంచి సృష్టించిన కథా బ్రహ్మ కాళీపట్నం రామారావు. దారిద్ర్యం అనుభవంలో ఎంత బీభత్సంగా ఉంటుందో - గ్రామంలో అట్టడుగు వర్గాల జీవనాలలో ఒక ముసలమ్మ 'చావు' - తదనంతర పరిణామాల ద్వారా కళ్ళకి కట్టినట్లుగా - అత్యంత నాటకీయంగా 'చావు' కథలో చిత్రీకరించారు.

**చావు : కథావస్తువు:** చలికాలం. . గ్రామాల్లో వరికోతలు - పనులు బాగా సాగే సంక్రాంతి పండుగ ముందురోజుల్లో ఒక సాయంసంధ్యా సమయంలో కథ మొదలైంది. కథా ప్రారంభం కథార్థసూచికలా, కాల్పనిక చిత్రంతో ప్రారంభమైంది.

"ఆతతాయిలు సాగించే హింసలా, చలీ, గాలీ నిరంతరాయంగా, నిరాపేక్షంగా తమ కత్తి కోత సాగిస్తున్నాయి. కొయ్య దగ్గర పడి ఉండే బక్కిటెద్దులా, ఊరు నీరసంగా వుంది. జవసత్వాలుడిగిన ముసలిరాజు వలె సూర్యుడు వెలవెలా పోతున్నాడు."

ఇన్నాళ్ళు వ్యవస్థలో తన అధికారాన్ని ప్రదర్శించిన రాజే ఇప్పుడు తన అధికారాన్ని, తేజస్సునీ కోల్పోతున్నాడు. ఆతతాయిలు పరంపరానుగతంగా భూస్వామి వర్గం - ధనికవర్గం సాగించిన దోపిడీని అడ్డుకుని కథాంతంలో జవాబు చెప్పబోతున్నారు. కట్టుకొయ్య దగ్గరున్న బక్కిటెద్దు వ్యవస్థలో బలహీనుడి స్థితిని - ముసలమ్మ మరణాన్ని సూచిస్తోంది.

మాలపేటలో కోతలు మొదలైన దగ్గరనుంచీ ఆడా, మగా అందరూ వ్యవసాయపు పనుల్లోకి వెళతారు. ఇండ్లలో ఉండేది కాటికి కాళ్లు చాచుకున్న వృద్ధులూ, పసివాళ్ళూ. ఆ మునిమాపువేళ - ఒక ఇంట్లో ముసలమ్మ చలికి వణికిపోయి గడ్డకట్టుకుపోతుంది. కబురు అందుకున్న పేట కూలీలందరూ ఆగమేఘాల మీద ఊరు చేరుతారు. మళ్ళీ తెల్లవారి అందరూ పనుల్లోకి తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి కాబట్టి ఉత్తరక్రియలన్నీ రాత్రి ముగించాలని నిర్ణయించుకుంటారు. కానీ అసలు సమస్య శవదహనానికి కట్టెలు లేకపోవడమే ! బారికాయన కన్నయ్యతో సహా కొందరు వెళ్ళి ఊరి పెద్దమనుషుల్ని లేపి, కఱ్ఱలు అడుగుతారు. వారు లేదు, కుదరదు అనటంతోనే కథారథంలో సామాజిక చలనం ప్రారంభమైంది. విపరీతంగా మంచుకురుస్తున్న ఆ రాత్రి వేళ పెద్దలందరూ శవాన్ని గొయ్యితీసి పాతిపెట్టాలని నిర్ణయించి, శ్మశానికి వెళతారు. గొయ్యి తీస్తున్నప్పుడే ఆశ్చర్యకరంగా కట్టెల మోపులు క్రింద పడ్డాయి. కథలో నాటకీయత పతాకస్థాయికి చేరింది. యువకుల్లో మొదలైన సంఘర్షణ సమష్టి చైతన్యానికి, సమన్యాయం, సమధర్మం కోసం పోరాడాలనే చర్యకి దారితీసింది. సీతయ్య నాయకత్వంలో కట్టెల మోపులు పందిరి అప్పయ్య ఇంటినుంచి యువకులు తీసుకొస్తారు. సీతయ్య తను చేసిన పనికి సుదీర్ఘవివరణ ఇస్తాడు. తాము తప్పు చేయలేదని సమర్థించుకుంటాడు. బతికిన బతుకు సరే ! సచ్చిన సావుకాడా - మనుసులికి ఇదం పదం అక్కర్నేదా !

మరి దీనిక్కఱ్ఱలు కావాల. నిన్నూ నిన్నూ అందర్నడిగినాం. మీరెవ్వరివ్వలేదు. అవి వుంటే గాని నాగ్గడవదు. అవక్కడున్నాయి. అలాటప్పుడు, అవి వూరి బాబుగారి సొమ్మే కాదు. నీ సొమ్మైనా నాను తేకమాన్ను అందుకని తెచ్చినాఁను. నీకవుసరం కాన్దానికే నువ్వడ్డమైన గడ్డి కరిసినప్పుడు, అవుసరం కొద్ది నాను సేస్తే తప్పా?

శవదహనం జరుగుతున్నప్పుడు - రచయిత ముసలమ్మ కొడుకు ఎరకయ్య భావోద్వేగాలను మనకు బొమ్మకట్టిస్తారు. అతని ముఖంలో ఒక అనిర్వచనీయమైన

ఆనందం వెల్లివిరుస్తోందంటారు. అంతేకాదు. కథా ప్రారంభం నిర్వహించిన విధంగానే కథ ముగింపు కూడా భావగర్భితంగా ప్రతీకలతో ఆలోచనాత్మకంగా ఉంటుంది. "తెల్లార్లూ. . . ఈ సలీ సీకటీ ఎప్పటికి పోతాయి. ఎర్రగా పొద్దెప్పుడు పొడుస్తాందీ, ఎప్పుడెండలో సేరిపోతాంవు అనే వుంటాది."

ఈ చలేమిటో, చీకటంటే ఏమిటో, ఎర్రటి పొద్దంటే ఏమిటో ఈపాటికి సహృదయ పాఠకుడికి అర్థమౌతుంది. ఫ్యూడల్ చలి నుండి సమాజం విముక్తమై, జ్ఞానవంతులై, చైతన్యపు జ్వాలలో వెలుగుతూ నవసమాజాన్ని ఆహ్వానించాలని రచయిత ఘోషిస్తున్నారని స్పష్టమౌతుంది.

## అట్టడుగు స్త్రీ పాత్రలు:

దేశకాలాల్లో, మనుషుల్లో, నాగరికతలలో భిన్నత్వం ఉన్నప్పటికీ స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల్లో సర్వత్రా ఏకత్వం ఉన్నది. పితృస్వామ్య సమాజంలో స్త్రీల జీవితాల చుట్టూ అణచివేత, పీడన అల్లుకునే ఉన్నాయి. అయితే ఈ సమస్యలన్నీ వ్యవస్థలో ఒక భాగమై ఉండటం వల్ల స్త్రీలు దానికి అలవాటు పడ్డారు. పురుషుడు తన అధికారాన్ని స్త్రీల మీద శారీరకంగానో, నిందాపూర్వకంగానో ప్రదర్శిస్తూనే ఉంటాడు. తన జీవితంలోకి భార్యగా ప్రవేశించిన స్త్రీని ఒక వస్తువుగా భావించటంలో స్త్రీ జీవితంలో ఇక్కట్లు ప్రారంభమౌతాయి. అయితే వర్గభేదాలను బట్టి కష్టాలలో తేడాలుండవచ్చు.

'చావు' కథలో భూస్వామ్య వర్గానికి చెందిన మహిళల జీవిత చిత్రాలు ఉన్నప్పటికీ ఈ వ్యాసంలో ప్రధానంగా అట్టడుగు మహిళల జీవన దుఃఖాన్నే వివరించదలచాను. ఇందులో చిత్రించిన వ్యవసాయ కార్మిక మహిళల జీవితాలు కష్టాలు కన్నీళ్ళతో నిండి ఉంటాయి. ఒక ప్రక్క కూలిపన్లు చేస్తూ సంసార బాధ్యతలన్నీ నిర్వహించే స్త్రీ అనేక శారీరక మానసిక ఒత్తిళ్ళకు లోనవుతుంది. ఇక పూర్తిగా మద్యానికి బానిసగా మారిన తాగుబోతు భర్తతో స్త్రీ జీవితం నరకప్రాయం.

సమాజంలో దిగువ శ్రేణికి చెందిన స్త్రీ పాత్రలు ఇందులో ముఖ్య సన్ని వేశాలలో బాధ్యతాయుతంగా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తాయి. చిన్నా, పెద్దా, వయసుతో నిమిత్తం లేకుండా ఆయా సన్నివేశాలో వారు స్పందించిన విధం - కథకుడు ఆ పాత్రలని తీర్చిదిద్దిన వైనం పఠితలని ఆలోచింపజేస్తుంది. సమాజంలో

మహిళలలో మానసికంగా వస్తున్న క్రమానుగత పరిణామం అత్త – కోడలు – కూతురు – మనుమరాలు పాత్రలలో చిత్రితమైంది.

చనిపోయిన ముసలమ్మ నారెమ్మ బ్రతుకంతా కన్నీటి కడవ. అత్తవారింట్లో అణచివేతకు, పీడనకు గురి అయింది. అత్త ఆమెని నానాకష్టాలూ పెట్టింది. భర్త తన అహంకారాన్ని తృప్తిపరచుకోవటానికి చేసే పనులే – కొట్టడం – తనకిష్టమైనపుడు కోరిక తీర్చుకోవటం – నవ్వమని బలవంతం చేయటం – ఇత్యాదులు. స్త్రీల మెదడునీ, శరీరాన్ని నియంత్రించాలనే వ్యవస్థ స్వరూపాన్ని నారెమ్మ భర్త ప్రవర్తన ద్వారా రచయిత చిత్రించారు. నారెమ్మ అణగిమణగి, ఓర్మితో జీవితాన్ని గడిపింది. ఆమె కడుపునిండా తిండికి, బట్టకీ లేని స్థితిలోనే జీవించింది – మరణించింది. జీవితకాలం వ్యవస్థ ఆమెను జలగలా పట్టి పీడించి, రక్తాన్ని పీల్చేసింది. ఆమె విషాద జీవిత గ్రంథాన్ని రచయిత మరొక వ్యక్తి చేత ఆసక్తికరంగా చెప్పిస్తారు. నారెమ్మను బాల్యంలో జలగపట్టుకుంది. అలాగే ఇంకా ఆమెతో వెళ్ళిన పిల్లల్ని పట్టుకుంది. ఈ విషయం కథకుడు యాథాలాపంగా చెబుతున్నట్లు అన్పించినా, వాస్తవానికి కథకుడు ఈ వివరణలలో వ్యవస్థా స్వరూపాన్ని సంకేతాలలో పఠితకి అందిస్తున్నాడు. ముసలమ్మ చివరిక్షణాలు మిక్కిలి దయనీయమైనవి. ఎటువంటి కర్కశ హృదయుడినైనా కరిగించి కళ్ళమ్మట నీళ్ళు పెట్టిస్తాయి. ముసలమ్మ ప్రాణం పోయేముందు చలిలో కొంకర్లు తిరిగిపోయింది. "ఒంటిమీద ఒక్క గుడ్డ ముక్కేనా లేదు" చిన్న మనవరాళ్ళు సింహాద్రి, దాలి ఇంట్లో ఉన్న పాతగుడ్డలన్నీ కప్పుతారు. అయినా గడ్డకట్టుకుపోయింది. సమాజంలో కట్టుబాట్లు, నీతి నియమాలు, అన్నింటికీ తలవొంచి బ్రతికిన ముసలమ్మ అంతరంగంలో చైతన్యజ్వాల రగులుతూ ఉండేదని ఆమె కొడుకుతో అన్న మాటలతో తెలియవస్తోంది. "అయ్యా ! నా నెప్పుడైనా యీసలికే సచ్చిపోతాన్రా, ఈ సలిసంకటంతోనే సచ్చిపోతాను. సీతాకాలం కర్రలెక్కడా దొరకవు, కర్రల్దొరకవని కప్పెటీకిమీ. ఎక్కడేనా కానో కసింత అడుక్కోనో, సివరికి దొంగతనవేసేసినా సరే, నన్ను కాల్సియాల" . . . నా యిన్నాళ్ల సలీ కాష్టమ్మీనైనా కాలిపోవాల. . . "

జీవితాంతం పట్టి పీడించిన చలినుంచి విముక్తి కలిగించమని ముసలమ్మ కోరింది. ఈ విముక్తి చైతన్యజ్వాలను తరువాత తరం స్త్రీలు అంది పుచ్చుకున్నారు.

నారెమ్మ కోడలు, తోటివారు, నిరక్షరాస్యులైన మహిళలందరూ రాత్రి, పగలు తేడా తెలియకుండా కష్టపడుతున్న వాళ్ళే. పగలంతా పొలాల్లో పనులు

చేసి, ముసలమ్మ చావు కబురు అందుకున్న జట్టు పరుగులాంటి నడకలతో గ్రామం చేరుతున్నారు. అసలు పనులు పూర్తికాకముందే మగవాళ్ళు కల్లుపాకల్లో కల్లు తాగి వచ్చారు. ఈ సన్నివేశంలో స్త్రీల సంభాషణలలో వారి చైతన్య స్థాయి మనకు తెలియవస్తుంది. ఆడవాళ్ళు తమలో తాము ఈ రాత్రి ఈ కార్యక్రమం ఎలా సాగుతుందని అనుకుంటూంటారు. అందులో ఒకామె "తాగుమోతుసంత . . . . దీంతో బయలెల్తే రాత్తిరి కాదా" అంటుంది.

ఈ మాటలకి జవాబుగా మేస్త్రీ

"ఏటి సెయ్యమన్నార్రా సలీ" అంటూ సర్దుకు రాబోయాడు అందరికన్నా ముందున్న మేస్త్రీ. గుగ్గిలాలన్నీ ఒక్కసారి భగ్గుమన్నాయి.

"మీరే మడుసులు గాని మాంకాదేట్రా? సలి మీ మొగాళ్లకే గాని మాకుండదేట్రా మావా?"

"కాదు ! ఇంటికాడ ఎలాగ తప్పదు. దార్లో కూడా తాగాలేట్రా?"

మేస్త్రీ తప్పించుకుందామని చూసినా, నిలదీసి అడగటం ఎదురు ప్రశ్నించగల వ్యక్తిత్వాన్ని ఆ మహిళలు సంతరించుకున్నారు. (కథా కాలం - 1977) తమ ధిక్కారస్వరాన్ని విన్పించారు.

చనిపోయిన నారమ్మ కోడలు, ఎరకయ్య భార్య సావాలు. ఆమె తన భర్త కంటే చురుగ్గా వ్యవహరిస్తుంది. చావు కబురు చల్లగా పరోక్షం సూచించటానికి వెంకటాపురం నాయుడు 'ఎరకయ్య మీ జట్టులో ఉన్నాడా?" అని భోగట్టా చేస్తున్నప్పుడు ఎరకయ్య ముందుకి వెళ్ళబోతుంటే సావాలు ఎరుకయ్యను ఆపి తనే ఎదురుగా వెళ్ళి "ఏంవిగదా" అని ప్రశ్నిస్తుంది. ఆ తర్వాత నాయుడి మాటల్లో చెప్పిన విషయం ఆకళించుకుని త్వరంగా ఇంటికి చేరాలని భర్తను "ఏవిక కదలరూ మత్తొదల్నేదా" అంటూ హెచ్చరిస్తుంది. ముసలమ్మ అంత్యక్రియలు అంతరాత్రే ముగించాలని అందరూ చెబుతున్నప్పుడు భర్త కంటె ముందుగా తానే స్పందించి "ఎక్కడేనా నాలుగు సందిళ్లు కఱ్ఱలు సూడండి" అంటుంది. "పోనీ ఉత్తిగ్గాదు కరీదుకు దొరికినా మా బాగే" అంటూ డబ్బు ఖర్చు పెట్టటానికి తన సంసిద్ధతను వ్యక్తం చేస్తుంది. రాత్రి వేళ కఱ్ఱలు దొరకవని, నలుగురూ పాతి పెట్టేద్దామంటుంటే సావాలు

అంగీకరించదు. ఆడబడుచులు ఎత్తి పొడుస్తారని, మాట పడటం ఇష్టం లేదని తేల్చి చెబుతుంది. ఈ మొత్తం సన్నివేశంలో ప్రతిక్షణంలో ఆమె కదలికలు కుటుంబ సంబంధాల పట్ల ఉన్న మక్కువను, ఆప్యాయతను వ్యక్తీకరిస్తున్నాను.

ముసలమ్మ కూతుళ్ళల్లో చివరి అమ్మాయి మరొక పాత్ర. ఈమె మొగుడు తాగుబోతు. వాడు పెట్టె బాధలు పడలేక మొగుడిని విడిచి ఎవరితోనో వెళ్ళిపోయింది. ఆమె సాహసంతో తన బతుకును మళ్ళీ నిర్మించుకుంది. ఆమె సాహసం తల్లికి నచ్చలేదు. జీవితాన్ని సుఖవంతం చేసుకోవటానికి స్త్రీలు 1970 దశకం నుంచీ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారనటానికి ఉదాహరణంగా ఈమెను చెప్పొచ్చు.

ముసలమ్మ రెండో మనుమరాలు పేరు నారమ్మ. ఆమెను చిన్న నారెమ్మగా వ్యవహరించవచ్చును. అయితే నాయనమ్మ కున్న ఓర్మి మనుమరాలు నారెమ్మకు లేదు. ఈమెది దుడుకు స్వభావం. పెళ్ళీడుకొచ్చినపిల్ల. నాయనమ్మ మరణం ఆమెలో దుఃఖం కల్గించలేదు. పైగా ఖర్చులకు తన వెండి కడియాలు కరిగిపోతాయనే బాధను వ్యక్తం చేస్తుంది. యౌవనం తెచ్చిన కలల మెరుపులు ఉల్లాసంతో ఉన్న చిన్న నారెమ్మను చూస్తే నాయనమ్మకు భయం. యౌవనోద్వేగంతో మనుమరాలు ఎక్కడ తప్పటడుగు వేస్తుందోనని భయం. అందుకే ఆమె దూకుడుకు కళ్ళెం వెయ్యాలని, మాటల్తో అదుపులో ఉంచాలని నాయనమ్మ ప్రయత్నం. నాయనమ్మ మనసుని అర్థం చేసుకోని మనుమరాలు ఆమెతో తగాదాపడుతూ ఉంటుంది. కథా సందర్భంలో రాత్రివేళ అప్పారావు అగ్గిపరకకోసం గదిలోకి రావటం, అప్పుడతని ప్రవర్తన గమనింపతగినవి. అప్పారావు తన కాలిబొటనవేలు ఆమెకు తగిలించాడు. పక్కనే నిలబడి చుట్ట ఎర్రగా కాల్చాడు. అంతేకాదు "గట్టిగా గుక్కెడు పొగ పీల్చి ఆమె ముఖం మీద కొదిలేడు. చప్న చూరుదాటి వాకిట్లోకి పోయాడు". అయితే సమాజంలోని న్యాయాన్యాయాలు, అసమానతలను గురించి విశ్లేషణాత్మకంగా వివరించగలిగే అప్పారావు స్త్రీలపట్ల తన ప్రవర్తనలో తన దాకా వచ్చేసరికి మామూలు సగటు మగాడిలాగానే పురుషాధిక్య భావనతో వ్యవహరించాడు. నారెమ్మ కూడా అప్పారావు చర్యలకి ముందు దూకుడుగా స్పందించినా, తర్వాత భయపడుతుంది. ఆమెలో అలజడి, ఆందోళన కలుగుతాయి. ఆమె భయపడటం అతనికి ఆనందాన్నీ, తృప్తినీ కలిగించింది. ఇది గుర్తింపదగిన అంశం.

సింహాద్రి, దాలి, కోటమ్మ, నీలమ్మ వీరందరూ చిన్నపిల్లలు. అంతా పదేళ్ళ లోపు ఆడపిల్లలు. అయినా వాళ్ళ సాహసం, సమయస్ఫూర్తి మెచ్చుకోదగిన రీతిలో ఉన్నాయి. నాయనమ్మ మధ్యాహ్నం చనిపోయినా సాయంత్రం అయ్యేవరకు ఆగి – తల్లిదండ్రులకు కబురు పెట్టాలని సింహాద్రి, దాలి నిర్ణయించుకుంటారు. వెంటనే కబురు పెడితే ఆ రోజు కూలి డబ్బులు రావని వాళ్లు తెలుసుకున్నారు. ఇక సింహాద్రి ముసలమ్మ మీద కప్పిన పాత గుడ్డలన్నీ తీసి రాత్రి తమకు కప్పుకునేందుకు ఉంచుతుంది. యథార్థ జీవితంలోనుంచి నడిచొచ్చిన ఈ సన్నివేశాల్లో – ఈ పాత్రలన్నీ జీవంతో తొణికిసలాడుతూ ఉంటాయి.

"పెంజీఁకటి కవ్వల. . ." ఉండే వెలుగును ఆవిష్కరించే క్రమంలో సంకేతార్థంలో 'చావు' కథ కళాత్మకంగా రూపు దిద్దుకుంది. కా.రా. చిత్రించిన అట్టడుగు వర్గం స్త్రీ పాత్రలు మూడుతరాల మహిళా లోకానికి ప్రతినిధులు. త్యాగం, మానవీయ విలువలు, సాహసం, సమయస్ఫూర్తి, ఆభరణాలుగా ధరించి, తమ ధిక్కారస్వరాన్ని విన్పిస్తూ చీకట్లో వెలుగుదారులనన్వేషిస్తూ పయనాన్ని సాగిస్తున్నారు. కా.రా. సృష్టించిన ఒక నారెమ్మ, ఒక సావాలు, ఇతర మహిళలు – అందరూ అందరే ! వారికి జేజేలు.

# అల్లం రాజయ్య కథల్లో దృశ్యాదృశ్య విధ్వంసం

మెట్టు రవీందర్

ఆధునిక కాలంలో పెట్టుబడి విస్తరించి విశ్వరూపం ధరించి వనారణ్యంలోకి విశృంఖలంగా దూసుకెళ్తూ గ్రీన్‌హంట్ చేస్తోంది. ఈ గ్రీన్ హంట్ అటవీప్రకృతి పచ్చదనంపై వేటే కాదు మానవ ప్రాకృతికతపై అమానుషమైన దాడి కూడా. ఇటువంటి నిరాటంకమైన దాడి పర్యవసానమే విశాల మానవ జీవితంలో అనుభూతమవుతున్న భీకర విధ్వంసం. ఈ విధ్వంసాన్ని మనిషి తన భౌతిక జీవితావరణంలోనే కాకుండా మనో ఆవరణంలోనూ అనుభవిస్తున్నాడు.

ఆధునిక కాలపు ఈ విధ్వంస పరివ్యాప్తతను నేటి తెలుగు కథ శక్తివంతంగా ప్రతిఫలిస్తోంది. ప్రత్యేకించి ప్రముఖ కథా రచయిత అల్లం రాజయ్య రాసిన 'బురద' (1993), 'మహాదేవుని కల' (1993), 'మధ్యవర్తులు' (1990), 'మనిషి లోపలి విధ్వంసం' (1989) – అనే నాలుగు కథలను ఇక్కడ విశ్లేషించుకుందాం (అల్లం రాజయ్య ఇదివరకటిలా విరివిగా కథలు రాస్తూండకపోవచ్చు. కాని యాంత్రిక ఆలోచనా చట్రాల కారణంగానే అల్లం రాజయ్య లాంటి వాళ్ళు కథలు రాయడం మానివేసారనడం సరైంది కాదు. (చూడండి: "మన కాల్పనిక సాహిత్యం – యాంత్రిక ఆలోచనాచట్రాలు" – బి. తిరుపతి రావు తేది: 10 మే 2010, సోమవారం, వివిధ – ఆంధ్రజ్యోతి దినపత్రిక) అదే నిజమైతే 'బురద', 'మహాదేవునికల', 'మధ్యవర్తులు', 'మనిషిలోపలి విధ్వంసం' లాంటి కథలను అల్లం రాజయ్య రాసివుండక పోయేవాడు. రచయిత ఆలోచన యాంత్రికంగా ఉంటే రచనలో సజీవత్వం ఉండదనే మాట నిజమే గాని ఉద్యమం అంటే యాంత్రిక చట్రానికి లోబడి సాగేదేనన్న తిరుపతిరావు గారి అవగాహన సరికాదు. బహుశా నిర్మాణాన్నే ఉద్యమం అని అనుకోవడం ఫలితమే ఆయన ఈ అ(న)వగాహన అని నా అభిప్రాయం. ఒకవేళ యాంత్రికత అనేది ఉన్నట్లయితే అది నిర్మాణానికి సంబంధించిందిగా వుంటుంది. అయితే మరింత లోతుగా ఈ చర్చ నిక్కడ చేయడం అప్రస్తుతం. కనుక ఒక రకంగా నా యీ వ్యాసాన్ని తిరుపతిరావు గారి వ్యాసానాకి ప్రతిస్పందనగా భావించవచ్చు.

మొదటగా 'బురద' కథ – ఈ కథలో ఒక గోండు స్త్రీ వనారణ్యం నుంచి జనారణ్యంలోకి దారి తప్పిన, అడవి పావురంలా వచ్చి చేరింది. అనంతమైన దుఃఖంలో నానిపోయి ఒంటరిగా దీనంగా అనాథయై ఒక బస్‌షెల్టరులో తన

పసిగుడ్డుకు పాలిస్తున్నది. పనికూన ఒంటిపై మాసిపోయిన గుడ్డపేగు కప్పి వున్నది. ఆ షెల్టరు పరిసరాల్లో నేలంతా బురదమయమై వాతావరణమతా కంపువాసనతో నిండిపోయింది. ఈ లోకంలోనే వుండి మరే లోకంలోనో ఉన్నట్టు ఆమె అచేతనంగా కూర్చొని వున్నది.

మేన్‌రోడ్డుపై అరకిలోమీటర్ దాకా ఆగివున్న లారీల వరుస, జిడ్డోడేక్లీనర్లు అటు ఇటు కలయదిరగడం, రొట్టెలు, ఆమ్లెట్లు అమ్ముతున్న తోపుడు బళ్లు, పిచ్చిపట్టిన దయ్యాల్లా తిరుగుతున్న మనుషుల తొక్కిడితో ఆ ప్రాంతమంతా గోండు స్త్రీ మనుసులాగే చిత్తడి చిత్తడిగా, రొచ్చురొచ్చుగా ఉన్నది. ఇంతలో ఇద్దరు క్లీనర్లు బస్ షెల్టరులో కొచ్చి బేరం కుదుర్చుకొని ఆ గోండు స్త్రీని చీకట్లోకి తీసుకపోయారు. వారం కూడా నిండని ఆ పసికందు సిమెంటు బెంచ్‌మీద పడుకోబెట్టబడి వున్నది.

దీన్నంతా చూస్తున్న ఒక యువకుడి మెదడు కొలిమిలా మండిపోయి ముఖంలో కోపం బుసబుస పొంగింది. మరుక్షణంలో అది చప్పున చల్లారింది. ఈ కాలపు బతుకులో ఎంత దుర్మార్గముందో అతనికి అనుభవమయ్యింది. లోకమంతా అమ్మడం, కొనడంలోనే తచ్చాడుతున్నట్టుగా అతనికనిపించింది. దగ్గర్లోని వేపచెట్టు మొదట్లో కూలబడి తలపట్టుకొని కనలికనలి రోదించాడు. ఆ రోదన జనారణ్య రోదనగానే మిగిలింది. కాసేపటికి కళ్లనీళ్ల నొత్తుకొని ఏడుస్తున్న పసికందును ఎత్తుకున్నాడు. పసిగుడ్డు ఏడుపాగింది.

మరికాసేపటికి ఆ గోండు స్త్రీ బురదకొట్టుకపోయి రేగిన చింపిరి జుట్టుతో సొలుగుతూ షెల్టరుకొచ్చింది. అది చూసి అతడు పసికందును బెంచి మీద తిరిగి పడుకోబెట్టగానే మళ్ళీ ఏడుపు మొదలయింది. ఆ ఏడుపును పట్టించుకోకుండా ఆమె కరగని మట్టి ముద్దలా మౌనంగా కూర్చుంది. ఆగినలారీల క్రీనీడల్లో ఇంకా చాలామంది స్త్రీ, పురుషులు తచ్చాడుతున్నారు. క్లీనర్లు తమకు నచ్చిన వాళ్ల నెంచుకుంటున్నారు. అప్పుడు ఆ యువకుడికి ప్రపంచమంతా బురద మయమై జుగుస్సాకరంగా తోచింది. పైకి కనిపిస్తున్న వాళ్ళ యాంత్రిక నవ్వుల వెనుక అనంతమైన హింసాదుఃఖాలున్నాయని గ్రహించాడు. ఊళ్ళ మీద పోలీసు (రాజ్యం) వరుసదాడుల వల్ల ఊళ్ళన్నీ దుంపనాశమవుతున్నాయని, ఫలితంగా స్త్రీలతో సహావేలాదిమంది పట్టణాలకు వలసవచ్చి చేరుతున్నారని అతడికి బోధపడింది.

ప్రకృతి ప్రకోపిస్తే చెలరేగే తుఫాను కాదిది. ఇది అధికారం రుచి మరిగి రాజ్యం రేపిన (అ) మానవ తుఫాను. వికృతమైన ఈ పెనుతుఫానులో కొట్టుకపోయిన వేలాదిమంది దుఃఖపు కథలన్నీ ఆ యువకుడి కళ్లముందు కదలాడినాయి.

ఇంతలో లైను క్లియరైందన్న అరుపు. లారీలు ఒక్కటొక్కటిగా రొదపెడుతూ కదలుతున్నాయి. క్లీనర్లు సైడుకోసం అరుస్తున్నారు. చీకటిగా, రొచ్చురొచ్చుగా ఉన్న ప్రదేశం ఒక్కసారిగా లారీల హెడ్‌లైట్ల వెలుతురులో సందడిగా మారింది. అప్పుడతనికి లారీల వెనకాల వచ్చి ఆగిన బస్సు దగ్గర ఇందాకటి గోండు స్త్రీ కనబడింది. ఆమె ధారపాతంగా ఏడుస్తూ తన పసికందును ఒక రైతు స్త్రీ చేతిలో పెట్టి వెనువెంటనే పరుగెత్తుకుంటూ వందలాది లారీల మధ్య మాయమయింది. దీనంతటికి ఆది, అంతం ఎక్కడ? అనే ప్రశ్నతో కథ ముగుస్తుంది.

ఈ కథలోని గోండు స్త్రీకి పైకి చూస్తే దుర్మార్గమైన తల్లిలా కనబడుతుంది. అయితే అమ్మతనాన్ని హరించిన కారణాలవైపు, అదృశ్యశక్తులవైపు మనదృష్టి సారిస్తే గాని సామ్రాజ్యవాద పెట్టుబడి విస్తరణకోసం రాజ్యం నిర్బంధం అమలు చేయడం, ఫలితంగా అడవిబిడ్డలు అడవితల్లి ఒడిని, భూమిని విడిచి మైదాన ప్రాంతాలకు వలస రావడం జరిగిందన్న విషయం మనకర్థంగాదు.

రెండవ కథ 'మహాదేవునికల'. ఆరోగ్యవంతమైన మనిషి, సృజనాత్మకత గల మనిషి ఊరితో, ప్రకృతితో తనకు గల సంబంధాన్ని తెంచివేస్తే అనారోగ్యం పాలవుతాడు. సృజనాత్మకత చచ్చిపోయి పిచ్చివాడవుతాడు. అలాంటి 'పిచ్చివాడే' ఈ కథలోని మహాదేవుడు. అతడు బ్రాహ్మణకులస్తుడే గాని, ఉత్తమ బ్రాహ్మణుల్లాగా పరాన్నజీవికాదు. రెక్కలకష్టంతో సహజంగా బతికే మనిషి. అతని తండ్రి కొడుకుల ఉద్యోగాల కోసం, బిడ్డల పెళ్ళిళ్ల కోసం భూమిని అమ్ముతూ వచ్చాడు. మహాదేవుడు శారీరకంగా కష్టం చేస్తూ వ్యవసాయం చేయడం నామోషీగా, కులావమానంగా భావించాడు అతని తండ్రి. ఉన్న కాస్తా భూమినమ్మేసి మహాదేవునికి భూమితో గల సంబంధాన్ని తెగ్గొట్టేస్తాడు. తత్‌ఫలితంగా మహాదేవుడు పిచ్చివాడయపోయి పాత జ్ఞాపకాలతో ఊళ్ళో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. రైడు చేసిన ఊరిలా అతని మెదడంతా గత జ్ఞాపకాల చిత్తడితో నిండిపోయింది. అంతా తెలిసినట్టే ఉన్నది కాని ఏమీ అర్థం గావడం లేదు. తనకు నచ్చిన పద్ధతిలో బతకడం అసాధ్యమై పోయింది. అయినా చావలేక హీనంగా బతుకుతున్నాడు. దేనికోసమో ఆశ. పెనుగులాడకుండా ఉండలేదు. ఒక్కొక్కసారి తాను చేసిన పోరాటం ఓడిపోయినట్టుగా

తోచింది. నిజంగా అతడు ఓడాడా? గెలిచాడా? ఏమీ తెలియని అయోమయంలో ఉన్నాడతడు.

ఒకప్పుడు మహాదేవుడు ప్రకృతి బిడ్డగా, ప్రకృతంతా సహజంగా బతకాలని, కాయకష్టం చేస్తూ, వ్యవసాయం జేస్తూ బతకాలని కలలుగన్నాడు. కాని అతని కలల మొదళ్ళు నరికేయబడ్డాయి. అయినా అతడు కన్నకల అతడిని వీడలేదు. ఆ కల కోసం ఆరాటపడుతున్నాడు, పెనుగులాడుతున్నాడు. కోపం, ప్రతిఘటన లుప్తమై, ఒంట్లో నెత్తురు ఇంకిపోయి, భూమి తల్లి పేగుబంధాన్ని తెంచుకోలేక పల్లె ఒడిలోనే పిచ్చివాడిలాగా తచ్చాడుతున్నాడు.

ఈ కథలో మహాదేవుడు పల్లె జీవన విధ్వంసానికి ప్రతీకగా కనిపిస్తాడు. ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేకించి తెలంగాణ పల్లెల్లో 1980వ దశకం రెండో అర్థభాగకాలంలో రాజ్యం ప్రయోగించిన నిర్బంధం, చేసిన విధ్వంసాల నేపథ్యంలో ఈ కథను చదివితే పాఠకులకు మహాదేవునిలాంటి వాళ్ళ కలలు ఎంత విలువైన, ప్రాణప్రదమైన కలలో అర్థమవుతాయి.

ఇందులో మహదేవ్ అందరి తీరుగ బతకలేకపోయినవాడు. కొందరి తీరుగ ఉన్నతమైన కలలు గంటూ, వాటి సాకారం కోసం ఆరాటపడడమే కాదు పోరాడే వాడు కూడా, కాని ఆ పోరాటాన్ని నిర్మాణయుతంగా చేయలేకపోయినవాడు. లేదా నిర్మాణయుతమైన పోరాటంలో కలవలేక పోయిన అసహాయ, అసమానధీరుడు మహాదేవుడు. పోరాటం పోరాటంకోసమే అయితే ఆ పోరాటం వల్ల సత్ఫలితం ఉండదు. పోరాటం మరింత ఉన్నతమైన మార్పుకోసం, ఒక ఉన్నతలక్ష్యం కోసం, ఉన్నతమైన ఐక్యతకోసం నిర్మాణయుతంగా చేయనట్లయితే, అలా పోరాడే మనుషులు లోకంలో మహాదేవునిలాగా పిచ్చివాళ్ళలాగ పరిగణింపబడుతారు. ప్రాకృతిక మానవ లక్షణాలను కోల్పోయిన లోకం, అందమైన రేపటికోసం వాస్తవికమైన కలలు గనలేని, పోరాడలేని లోకం తానుపిచ్చిదై మహాదేవుని లాంటి వాళ్లను పిచ్చివాళ్ళంటుంది. మహాదేవునిలాంటి వాళ్ల కలలను పిచ్చి కలలని ముద్రవేసి, జాలి చూపిస్తూ పిచ్చిలోకం తన (చెడ్డ) అహాన్ని సంతృప్తి పరచుకొంటుంది. నిర్మాణయుతమైన ఉద్యమం మహాదేవుని లాంటివాళ్ళను చేరితే తప్ప వాళ్ల కలలు సాకారం అవవు. లోకం 'పిచ్చి' కుదరదు.

మూడవకథ 'మధ్యవర్తులు' – ఈ కథ విద్యను, సమాజంపై విద్య నెరిపే ప్రభావాన్ని ఇతివృత్తంగా తీసుకొని రాసినది. మనిషి 'పైకి రావడానికి' విద్యే ఏకైక

సాధనం అన్న ప్రబలసామాజిక ధోరణికి లేదా విద్యే మానవవ్యతిరేకం, విద్యే మనిషి పరాయీకరణకు మూలకారణం అన్న ధోరణికి అద్దం పట్టేదిగా ఈ కథ నడిచింది.

ఈ కథలో ప్రధాన పాత్ర నాగేంద్రం తనకన్న మంచిగుడ్డలున్న వాళ్ల మీద కసితో, దొరలమీద కసితో, అసలు విద్య మీదనే కసితో చదువుకున్నాడు. కష్టపడి పట్టుదలతో చదివి మెడిసన్‌లో ఎం.డి. చేసి పెద్ద డాక్టరవుతాడు. "ఔరా ! నాగేంద్ర! డాక్టరీ సదువుతున్నవట" అని ఊర్లో దొరలు చేసిన అపహాస్యాన్ని ఎదుర్కొని, చదువును గెలుచుకొని జీవనసోపానంలోపైకి వచ్చాడు నాగేంద్రం. ఈ చదువుకోసమే మనసిచ్చిన ప్రేమికురాలు గంగకు దూరమయ్యాడు. డాక్టరుగా ఇప్పుడు బాగా సంపాదిస్తున్నప్పటికీ నాగేంద్రం దిక్కుతోచని ఒంటరి మనిషిగా, సామూహిక సుఖదుఃఖాలకు, సహజ ప్రేమానుబంధాలకు దూరంగా ఒక కీకారణ్యంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాడు. ఇలాంటి పరుగుపందెలంలో గెలిచిన డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఆఫీసర్లు ఎంతోమంది తన చుట్టున్నప్పటికీ అతని మనసుకు హాయిలేదు. అడ్డు అదుపూ లేకుండా ఇంట్లోకొచ్చి చేరుతున్న వస్తు (మయా) జాలంలో తానొక్కడయ్యాడు. కన్నతల్లిని, జన్మస్థలాన్ని, నమ్ముకుంటే వమ్ముచేయని భూమిని, రక్తసంబంధీకులను వదిలిపెట్టి తానెటువైపు పయనిస్తున్నాడో నాగేంద్రంకు అర్థం గావడం లేదు.

నాగేంద్రం మనసులోని ఈ సంఘర్షణ వల్లే అతడు పూర్తిగా అవమానీకరించబడలేదని మనకు తెలుస్తుంది. తాననుభవిస్తున్న మానసిక సంక్షోభం నుంచి బైటపడడానికీ మళ్ళీ పల్లెకు వెళతాడు. కన్నతల్లి, రక్త సంబంధీకులను కలుస్తాడు. ఊళ్లోని మనుషులను కలుస్తాడు. "గీదునియల సదువుకున్నోల్లంత లంగలు లేరు." "చదువుకున్నొల్లందరికీ పైసలు గావాలె, మనుషులక్కర్లేదు" లాంటి వ్యాఖ్యానాలు విన్న నాగేంద్రం మట్టి వాసనల నుంచి, తల్లి పేగుబంధాల నుంచి తనను వేరు చేసింది చదువేనని (తప్పుడు) నిర్ధారణకు వస్తాడు. నాగేంద్రం కథ చివరలో - చదువు మంచిదిగాదని చదువు మనుషులను తమ తల్లి పేగుబంధాలనుంచి వేరు చేస్తుందని, సకల అధికారాలకు, దోపిడీకి ఈ చదువుకున్న వాళ్లే మధ్యవర్తులు అని తన తమ్ముడికి చెపుతాడు.

అయితే నాగేంద్రం ఆలోచనల్లోని గందరగోళానికి కారణం అశాస్త్రీయవిద్యే. పాలకవర్గ విద్యా విధానమే. ఈ అశాస్త్రీయ విద్య వలననే చదువే మనిషి

పరాయీకరణకు కారణమని, చదువే అధికారానికి, దోపిడీకి కారణమని నాగేంద్రం తప్పుడు నిర్ధారణలు చేస్తాడు.

కాని విద్యే దానికదిగా సొంతం మానవ వ్యతిరేకం గాదు. అశాస్త్రీయ విద్యస్థానంలో శాస్త్రీయ విద్యను ప్రవేశపెట్టి, మానవశ్రమ పట్ల గౌరవభావాన్ని, శ్రమయే సామాజిక సంపదకు మూలమనే గ్రహింపును కలిగించినట్లయితే, శ్రమ దోపిడియే అన్ని సామాజిక అనర్థాలకు మూలమని మనకర్థమవుతుంది. శ్రమ (ఉత్పత్తి) క్రమానికి దూరమవుతున్నకొద్దీ మనిషి అసహజత్వంవైపు పయనిస్తాడు. అసహజత్వానికి బహురూపాలే ఈ పరాయీకరణ, అమానవీకరణ, మిథ్యాగౌరవం, తప్పుడు చైతన్యం మొదలైనవి.

మొత్తం మీద ఈ కథ మనిషి పరాయీకరణ గురించి, అందువల్ల తలెత్తే వైయక్తిక, సామాజిక సంక్షోభం గురించి, వాటి పరిష్కారాల గురించి పాఠకుల్ని లోతుగా ఆలోచింపజేస్తుంది. అలా ఆలోచించే క్రమంలోనే మనిషి పరాయీకరణకు మూలం శ్రమ పరాయీకరణలో, సొంత ఆస్తి విధానంలో వుందని తెలుస్తుంది. చైతన్యయుతమైన కృషి, నిరంతర పోరాటం ద్వారానే మనిషి సంపూర్ణమైన సంఘజీవిగా, మానవసారం తొణికిసలాడే సహజ మానవుడిగా రూపొందుతాడని మనకు అర్థమవుతుంది.

నాలుగవ కథ 'మనిషిలోపలి విధ్వంసం' ఈ కథ మనిషి విధ్వంసాన్ని, దాని ఫలితమైన పరాయీకరణను చాలా శక్తివంతంగా చిత్రిస్తుంది.

ఇందులో రామేశం గని కార్మికుడు. ఒక రోజు భార్యబిడ్డలతో ప్రయాణమైన రామేశానికి దారి మధ్యలో ఒక ప్రమాద సంఘటన కన్పిస్తుంది. రైలు క్రింద ఒక మనిషి తలపెట్టి ఆత్మహత్య చేసుకుంటాడు. అతని శవాన్ని రైల్వేలైను పక్క కంకర రాళ్ల మీద పడుకోబెడతాడు. మీద తెల్లగుడ్డ కప్పి వుంటుంది. "పట్టాలమధ్య కండ్లు భయంకరంగా తెరుచుకొన్న తల ఉన్నది. తలకు, మొండానికి మధ్య రక్తం మడుగు కట్టి జొబ్బ, జొబ్బ పెద్ద ఈగలు ముసురుతున్నాయి.

ఆ శవం రామేశంతో సహా అక్కడున్న అందరి మనుషుల్లో ఒక పెనుకల్లోలాన్ని రేపింది. ఆ మంటను ఆర్పడానికి రామేశం ఒకసారాపాకెట్టు కొరికి గటాగటా తాగేశాడు. అందుకే అక్కడ కల్లూ, సారా అమ్మకాలు పెరిగాయి. ఇది కనపడే విధ్వంసం, కనబడే హింస. కాని సమాజంలో భౌతికంగా దృశ్యమానం

కాని అదృశ్యహింస కూడా కొనసాగుతోంది. ఈ అంతర్గత హింసకు మనిషి హృదయం రగిలి రగిలి మండిపోయి మొద్దుబారుతుంది. ఈ అనుదిన అభౌతిక హింసకు గురై మనిషి నిర్లిప్తుడవుడతాడు. నిర్వేదానికి లోనై నిశ్చేష్టుడవుతాడు.

ఈ కథలో అలాంటి మనిషే శవం తండ్రి రాజారాం. అతని నిర్లిప్తతను చూసి "వీడు మనిషేనా? జంతువా? రాయి కాదు కదా? ఇంతకు వీడు చనిపోయిన పిల్లవాని తండ్రేనా?" అని లోకం విస్తుపోతుంది. బహుశా రాజారాం చిన్ననాటి నుంచే అంతర్గత హింసను భరిస్తున్నట్టుగా, లోపలి విధ్వంసాన్ని మౌనంగా ఎదుర్కొంటూ ఒక భావరహిత ఉన్మాదస్థితికి వచ్చినట్టుగా కథలోని పంక్తుల మధ్య చదివితే మనకు తెలుస్తుంది. ఒక విధ్వంసాన్ని - బైటిదయినా, లోపలిదయినా - ఎదుర్కొంటూ పోరాడకుండా మౌనంగా భరిస్తే ఆ మనిషికి ఆత్మదహనం తప్పదు. అటువంటి స్థితిలో ఉన్న రాజారాం రామేశం ఇచ్చిన సారాబత్తాలను అందుకే తీసుకోలేదు. "సారానిషాకన్న ఏదో మత్తు అతన్ని ఆవహించినట్టుంది" సమూహంలో నిరంతరం మౌన ఏకాంతాన్ని భరించడం చాలా కష్టం. అందుకే రాజారాంలో ఆలోచనానుభూతులింకిపోయాయి. లోలోపల తొలచబడి డొల్లగా మిగిలాడు రాజారాం. ఒక ధ్వంసమైన పల్లెకు ప్రతీక రాజారాం. ఇంకిపోయిన నదిలా, నెర్రెలు బాసిన భూమిలా, ఎండిన చెరువులా, మాటలు తెగిపోయిన మనిషిలా ఉన్నాడు రాజారాం. అతడు 'మర్రి చెట్టు కింద కూలబడిపోయి రెండు చేతులతో ముఖం, తల రుద్దుకుంటూ లోలోపల పూర్తిగా ధ్వంసమై పోయిన రైతు బిడ్డడు". "నాలుగు రోడ్ల కూడలిలో చిక్కటి చీకటిలో గడ్డ కట్టిన చలిలో, ఆకలితో కొడుకును, సర్వస్వాన్ని పోగొట్టుకున్న దుఃఖంతో వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు." "పూర్తిగా బొట్టుబొట్టుగా కరిగిపోతూ భూమిలోకి ఇంకిపోతూ ఏడుస్తున్నాడు.

లోలోపల జరిగిన విధ్వంసం వల్ల రాజారాం పూర్తిగా పరాయీకరింప బడినాడు. ఒక మనషి పరాయీకరణను ఎదిరించలేక నిశ్చేష్టుడై అసహాయంగా ఉండడమనేదాన్ని మన అర్ధభూస్వామ్య - అర్ధ వలస వ్యవస్థ నేపథ్యంలోంచి పరిశీలిస్తే తప్ప పరాయీకరణకు సంబంధించిన సంకీర్ణతను, సంక్లిష్టతను మనం స్పష్టంగా అర్థం చేసుకోవడం వీలు కాదు. అంతేగాదు మనిషిలోపలా, బయటా జరుగుతున్న విధ్వంసానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం ఈ రాజారాం వంటి వాళ్లను ఇంకా చేరుకోవలసే ఉన్నదన్న సూచనతో ఈ కథ ముగిసినట్టుగా మనం చెప్పవచ్చును.

# దాశరథి రంగాచార్య కథలు - జీవిత భాష్యాలు

డా॥ బన్న అయిలయ్య

తెలంగాణా ప్రాంతమే తెలుగు కథకు పుట్టిల్లు. ఈ ప్రాంతంలో 'బృహత్కథ' పుట్టి ప్రపంచానికే కథా ప్రక్రియను పరిచయం చేసింది. ఇలాంటి తెలంగాణా ప్రాంతంలోనే తెలుగు చిన్నకథ పుట్టి ఎంతో వస్తు వైవిధ్యంలో అప్రతిహతంగా కొనసాగుతూ వున్నది. తెలుగు కథా వికాసానికి దాశరథి రంగాచార్య కూడా తనదైన మార్గంలో దోహదపడ్డారు.

"1956 వరకు కలం పట్టిన వారిని తొలితరం కథకులుగా, ఆ తరువాత కాలంనాటి 1970-75 వరకు కలం పట్టిన వారిని మలితరం కథకులుగా అప్పటినుండి ఇప్పటివరకు కలం పట్టిన వారిని మూడోతరం కథకులుగా 90 తరువాత కలంపట్టిన వారిని ఈ తరం కథకులుగా గుర్తించవచ్చు. మొదటితరం కథలు రాసినవాళ్ళు కేవలం కథలు రాసి ఊరుకోలేదు. తెలంగాణా సామాజిక వికాసం కోసం సమాజంలో విస్తృతంగా పనిచేసారు. ఆ క్రమంలో కథలురాసారు. భాగ్యరెడ్డివర్మ, మాడపాటి హన్మంతరావు. సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, పి.వి.నరసింహారావు, కాళోజి నారాయణ రావు, దాశరథి రంగాచార్య మొదలైన వారి జీవితం సాహిత్యం వేరువేరు కావు". (తెలంగాణ కథలు కథన రీతులు, బి.యస్.రాములు, పుట 19,20). ఈ రచయితలు ఈ ప్రాంత సామాజిక, రాజకీయ జీవితాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి మార్పును కోరుతున్నారు. ఏదో ఒక రంగానికే పరిమితం కాకుండా సాహిత్య, సామాజిక, రాజకీయ సాంస్కృతిక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేసారు. ఆరు, ఏడు దశాబ్దాల తరువాత వీరి కృషి పలు రంగాల్లో ఎలా ప్రతిఫలించిందీ, విమర్శకులు అంచనా వేస్తూనే ఉన్నారు. తెలంగాణా ప్రాంత ప్రత్యేక పరిస్థితుల్లోంచి ఆవిర్భవించిన వీరి మేధ, సృజనాత్మకత చారిత్రక ప్రాధాన్యం కలిగింది. తెలంగాణా ప్రాంతమే వీరి కార్యాచరణకు భూమిక అయినా వారు సాధించిన ఫలితాలు సమాజమంతా అనుభవిస్తున్నాయి. వారి ఆలోచనా తరంగాలు విస్తరించని రంగాలు లేవు.

ఇలా తెలంగాణా ప్రాంతంలో రెండోతరం కథారచయితగా ప్రాదుర్భవించిన దాశరథి రంగాచార్య పండిత కుటుంబంలో పుట్టి, అక్కడే నిలిచిపోక సంప్రదాయ

భావభూమికను దాటి, ఈ ప్రాంత పోరాటాల నేపథ్యం నుండి ఎదిగివచ్చిన అరుదైన రచయిత. తాను వట్టికోటఆళ్వారుస్వామి సంప్రదాయాన్నే కొనసాగిస్తున్నానని చెప్పుకున్నా, అది ఒక కోణం నుంచి అంగీకరిస్తూనే ఇంకా విస్తృతమైన సృజన ప్రపంచంలోకి చొచ్చుకపోయిన రచయితగా సాహితీప్రపంచం వారిని గుర్తించి గౌరవించింది.

దాశరథి రంగాచార్య నిశితమైన సామాజిక పరిశీలన నుండి వెలువడిన 21 కథల సంపుటి "నల్లనాగు". ఈ కథల నిండా సామాజిక వాస్తవికతే ఉంది. తెలంగాణాలోని ఫ్యూడల్ వ్యవస్థను ప్రత్యక్షంగా చూసిన రచయిత కనుక ఆ కాలంనాటి జీవితంతో పాటు, స్వాతంత్ర్యానంతరం జనజీవితంలో ఆశించిన మార్పు రాకపోవడానికి కారణమైన రాజకీయ, పాలకవర్గాల స్థితిగతులను కథల్లో చిత్రించారు. ఏ స్వాతంత్ర్యం కోసం జీవితకాలమంతా పోరాటం చేస్తే ఆ స్వాతంత్ర్యం కాస్త కేవలం ఉత్సవాలకే ఎలా పరిమితమయ్యిందో 'దృష్టాంతం'గా కథలో రంగాచార్యగారు చిత్రించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, సమస్యల నిర్మూలనకు చేపట్టాల్సిన తక్షణ చర్యలు తీసికోకుండా ఎలా తాత్సారం చేస్తున్నారో ఈ సంపుటిలోని కథల్లో చూస్తాం. పేద, మధ్యతరగతి జీవితాలు ఎలా కకావికలైపోయాయో, అలగా జనం ధన వ్యామోహానికి బలవుతున్న తీరు, మధ్యతరగతి ఆర్భాటాలు, ఆదర్శాలు పటాపంచలైన తీరు కన్పిస్తుంది. ఒకే కుటుంబంలోని వ్యక్తుల భిన్న మనస్తత్వంతో సర్దుకుపోయి జీవించేతీరును, సమాజమంతా ఎంత వ్యాపారాత్మకమై పోయిందో రంగాచార్యగారు చక్కగా చిత్రించారు. ఫ్యూడల్ వ్యవస్థనుండి మనం బయటపడ్డామన్న భ్రాంతేకాని, ఆ లక్షణాలు సమాజంలో ఎలా పాతుకుపోయాయో, ఆర్థిక అంతరాలు ఈ సమాజంలో ఎలా ఉన్నాయో, దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం మానవ సంబంధాలను ఎలా విచ్ఛిన్నం చేస్తున్నాయో కడుదయనీయమైన స్థితిని వీరి కథల్లో చూస్తాం.

"మళ్ళీ మహాత్ముడు మన మధ్యకువచ్చాడు" కథ ఒక ఊహాచిత్రం. ఈ దేశం సుభిక్షంగా ఉండాలని స్వప్నించి, స్వాతంత్ర్యం సాధించాక మతతత్త్వశక్తుల చేతిలో మహాత్ముడు బలైపోయాడు. తాను సాధించిన స్వాతంత్ర్య ఫలాలు ప్రజలకెలా అందుతున్నాయో చూడడానికి మహాత్మగాంధి భూమిమీదికి, ఈ దేశంలోకి వస్తాడు. గాంధీగారిని ఆశ్చర్య పర్చిన దృశ్యాలు ఆకలి, దారిద్ర్యం, సమ్మెలు, కాల్పులు,

హాహాకారాలు. స్వాతంత్ర్యానికి ముందు ఈ దేశ ప్రజలు ఏ సమస్యలతో బాధపడ్డారో అనంతరం అవే సమస్యలతో సతమతమవడం ఈ దేశ జీవితంలోని విషాదం. గాంధీ ఆశయాలను కొనసాగిస్తున్న తరాలు, కొందరువ్యక్తులు కూడా ఈ దేశంలో లేకపోలేదు. వారు గాంధీలాగా పారిశుద్ధ్యపనులు చేపట్టుతూ, రోగగ్రస్తులకు సేవచేస్తూ ఉంటారు. ఖాదీ ధరిస్తే భరించలేని నాయకులే నేడు మనలను పాలిస్తున్న నాయకుల్లో ఉండడం క్షమించదగినది కాదు. ఈ నాయకులే డెమోక్రసీని 'ఫ్యాబ్రిక్ డెమోక్రసి' గా మార్చి మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్పడం విడ్డూరమే. గాంధీ ఆశయాలను ప్రచారం చేయాల్సిన నాయకులు, అలా చేస్తున్న వారిని ప్రోత్సహిస్తూ సహకరించాల్సిన పాలకులు, ఇందుకు విరుద్ధంగా జాతిపిత అడుగుజాడల్లో నడుస్తున్న వారిని నేరస్తులుగా భావించి జైల్లో పెడతారు. ఇలాంటి విషాద సన్నివేశాలను గాంధీ దర్శించి తాను స్వప్నించిన స్వతంత్ర భారతం ఇదేనా అని వాపోవడం కన్పిస్తుంది. గాంధీజీ అనుయాయుల్నే కాదు. ఆయన ఆశయాల్నీ పట్టించుకునే నాయకులే దేశంలో లేకపోవడం విషాదమే.

ప్రభుత్వ కార్యాలయాల్లో హైరార్కి వ్యవస్థ ఉంటుంది. ప్రజాసమస్యల పరిష్కారానికి దోహదం చెయ్యాలని లక్ష్యమే దీనికుంటుంది. కానీ ఈ వ్యవస్థ నేడు సమస్య పరిష్కారాన్ని తాత్సారం చేయడం ఈ దేశంలో జరుగుతున్న ప్రసహనం. చిన్న పెన్సిల్ కోసం సెక్షన్‌క్లర్క్ నోటు పెట్టడం. సూపరింటెండెంట్ అనుమతితో దాన్ని స్టోరుక్లర్క్‌కు పంపించడం గతంలో స్టోరు నుంచి తీసికున్న పెన్సిల్ ఎందుకుపోయిందో ఎక్స్‌ప్లనేషన్ అడగడం,క్లర్కు ఇచ్చిన ఎక్స్‌ప్లనేషన్ సరిగ్గాలేదని అతన్ని సస్పెండ్ చెయ్యాలనుకోవడం, ఈ చిన్న విషయానికి అతన్ని సస్పెండ్ చేయడానికి రూల్స్ ఒప్పుకోవడమే తతంగమంతా ఈ హైరార్కీలో పై నుండి కిందికి కింద నుండి పైకి సెక్షన్ల వారిగా ఫైలు తిరుగుతుంది. పోయిన పెన్సిల్ ఎలుక కన్నంలో దొరికితే దీన్ని వాడుకోవడానికి శాస్త్రోక్తంగా ఫైలు ప్రతి సెక్షనుకు వెళ్ళాలి. ఈ పెన్సిల్ వాడుకొనడమనే ప్రక్రియ పూర్తి అయ్యేసరికి సమస్య పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు ఏం కావాలి? ఇలాంటి సిస్టమ్ దేశ ప్రగతిని కుంటు పరుస్తుంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు గడిచినా అనుకున్నంత అభివృద్ధి సాధించకపోవడానికి కారణం ఇలాంటి వ్యవస్థలోనే మనం జీవిస్తున్నామని రచయిత గుర్తుచేస్తాడు.

ఈ మనస్తత్వంలో మార్పు వస్తేనే అభివృద్ధి సాధ్యమనేది ఈ కథద్వారా రచయిత చెప్పదల్చుకున్నాడు.

'నిరుద్యోగం'కు అర్థం శ్రీనాథుడు రాసిన మనుచరిత్ర డిక్షనరీని వెదికే ప్రబుద్ధుడు నిరుద్యోగం కథలో కనబడితే, రీట్రెంచ్‌మెంట్‌లో ఉద్యోగం కోల్పోయి జీవనభృతిలేక ఇష్టం లేకపోయినా ఉద్యోగం ఉన్న అమ్మాయిని వివాహం చేసికున్నవాడు "ప్రేమకథ"లో కన్పిస్తాడు.

ఈ దేశంలో 'నిరుద్యోగి' ఎవడు? తనకు నచ్చిన పని దొరకలేదనే వాడే నిరుద్యోగి. నిరర్థకమైన పనులు చేస్తూ ఫలితం ఆశించే వాడు నిరుద్యోగి. సమయస్ఫూర్తి లేనివాడు అజ్ఞానంతో ఉన్నవాడు నిరుద్యోగి... ఈ విషయం చాలామందికి తెలియకపోవడమే ఈ సమాజంలోని విషాదమని రచయిత భావనగా నిరుద్యోగి కథలో కనిపిస్తుంది. 'నిరుద్యోగి' అనే పదానికి అర్థం వెదికే క్రమంలో తన అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటూ ఇతరుల విలువైన సమయాన్ని వ్యర్థం చేసే వ్యక్తి ఈ కథలో కన్పిస్తాడు. 'నిరుద్యోగం' అనే పదానికి అర్థం తెలుసుకోవడం కోసమే పరిశోధన చేసినంత పని చేస్తాడు. ఫలితం కొండను తవ్వి ఎలుకను పట్టడం.

మేరీ తల్లిదండ్రులు రజాకార్ల అఘాయిత్యానికి గురై మరణించారు. బాల్యం నుంచి తల్లిదండ్రుల గారాబం మేరీకి తెలియదు. ఒంటరిగా 25 ఏళ్ళు గడిపింది. లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరింది. "నల్లగా, నున్నగా, గుండ్రంగా' ఉండే మేరీ జీవితాన్ని పంచుకునే భాగస్వామి కోసం ఆమె ఎదిరిచూస్తుంది. తన తలలో తెల్లవెంట్రుక కన్పిస్తే ఝుల్లుమన్నది". రోజూ తన దగ్గరికి వచ్చే సంధ్య తన కంటే చిన్నది. ఆమెను ప్రేమిస్తున్నానంటూ ఒక వ్యక్తి ప్రేమలేఖ రాసాడు. 'ప్రేమించేవాడుంటే మోసగించేవాడుంటేమి? అని తన మనస్సులోని భావాల్ని సంధ్యకు చెప్పింది. అంటే మేరీ సహచరుని కోసం ఎదిరిచూస్తుంది. ఈ క్రమంలో ఉద్యోగం కోల్పోయి నిరుద్యోగి అయిన రమేశ్‌ను పూర్తిగా నమ్మి సర్వం అర్పిస్తుంది. తనకు వస్తున్న నెల జీతాన్ని ఇష్టపడే తనతో రమేష్ ఉన్నాడనే వాస్తవం తెలుసుకున్నాక కూడా మేరీ రమేశ్‌ను ప్రేమిస్తూనే ఉంది.

"రమేశ్ నువ్వు నన్ను మోసం చేశావనను. నా జీతం చూచైనా నన్ను ప్రేమించావు. నీ ప్రేమే నా జీవితం! అంతేచాలు, నన్ను విడిచిపోకు రమేశ్. నన్ను విడువకు" అని దుఃఖంలో అన్న మాటల్లో మేరీ ఒంటి జీవితంలోకి ఎవరు వచ్చినా

బాగుండుననే తపనతో ఉంది. వచ్చేవాడు మోసగాడా? స్వార్థపరుడా? అనే ఆలోచనే ఆమెలోలేదు. ఎవరొచ్చినా విశాలభావంతో ఆహ్వానించడానికి సిద్ధపడింది. రమేశ్‌కు ఆమె అందంకంటే ఆమె జీతమే ముఖ్యం. మేరీకి ఒక మగవాడు తోడుండడమే ముఖ్యంగా ఈ కథలో కన్పిస్తుంది.

పిచ్చుకలు, కుక్కపిల్ల, విశ్వాసం కథలు మధ్యతరగతి కుటుంబంలోని భూతదయను, తమ ఇష్టాన్ని కాపాడుకోలేని బలహీనతను, కుటుంబంలోని వ్యక్తులు ఒకరికోసం ఒకరు ఎలా కాంప్రమైజ్ అవుతారో చెబుతాయి.

పిచ్చుకలు ఇంటిల్లిపాదికి సంతోషాన్ని కలిగిస్తాయి. కొత్తగా రెక్కలొచ్చి పిట్ట గెంతడాన్ని చూసి, నడకనేర్చుకోవడం చూసి ఆనందించే కుటుంబసభ్యులు ఆ పిచ్చుక తమ వద్ద ఎంతకాలం ఉంటుందో ఆలోచించరు. కుటుంబంలోని పెద్దలు దేన్ని ప్రేమిస్తే పిల్లలు దాన్నే ప్రేమిస్తారు. లేదా పిల్లల ఇష్టాన్ని పెద్దలు తమ ఇష్టంగా చూసుకుంటే పిల్లల్లో ఒక స్వతంత్ర భావన, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పిచ్చుకను మిషగా తీసికొని రెండుతరాలు ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం, మన్నించుకోవడం కన్పిస్తుంది. ఇంటిల్లిపాదికి ఇష్టమైన పిచ్చుకను గద్ద తన్నుకుపోతే అందరూ విషాదంలో మునుగుతారు. కుటుంబ సభ్యులంతా ఒకే విషాదాన్ని సమంగా పంచుకున్నట్లే ఆనందాన్ని పంచుకోగలరని రచయిత భావనగా కన్పిస్తుంది.

కుటుంబ యజమానికి పారిజాతపుష్పాలంటే ఇష్టం. ఆ చెట్టును కాంపౌండ్ లోపల నాటిస్తాడు. శ్రీమతి, పాప యజమాని ఇష్టాన్ని గౌరవించారు. పారిజాతపుష్పాలంటే తమకూ ఇష్టమే అన్నట్లు ప్రవర్తిస్తారు. అదే చెట్టుక్రింద కుక్క ఈనితే ఒక పిల్లను తెచ్చుకొని పెంచుకుందామంటే ఆ యజమాని ఇష్టపడడు. కుక్కలు అరుస్తాయి, కరుస్తాయి కాబట్టి ఆయనకిష్టం ఉండదు. శ్రీమతి, పాప పదేపదే అడిగినా కుక్కపిల్లను తేవడానికి తాత్సారం చేస్తాడు. రెండు కూనలు ఆక్సిడెంట్‌లో చనిపోయాయని చెప్పినా వినడు యజమాని. తమకారు కింద తల్లికుక్క ప్రమాదవశాత్తు పడి చనిపోతే తల్లిలేని కూనను పెంచుకోవడానికి సిద్ధపడతాడు.

అనాధ కూనను పెంచుకోవడంలో భూతదయ ఉంది. అట్లాగే ఈ కథలో భార్యాపిల్లల ఇష్టాన్ని గౌరవించినట్లు కూడా ఉంది. మధ్యతరగతి వాళ్ళకు కోరికలు అనేకం ఉంటాయి. ఆ కోరికలకు తగినట్టు జీవించాలని ప్రయత్నించి విఫలమవు తారు. వారికి కొన్ని నమ్మకాలుంటాయి. ఆ నమ్మకాలు వమ్ము అయినప్పుడు డీలాపడుతుంటారు.

సుజాతకు కుక్కలంటే ఇష్టం. ఒక కుక్కపిల్లను పెంచుతుంది. దానికి 'లైకా' అని పేరు పెట్టుతుంది. లైసెన్స్‌లేదని మున్సిపాలిటీవాళ్ళు దాన్ని తీసుకపోతానంటే భర్తతో చెప్పించి నివారిస్తుంది. లైకా కన్పించకపోతే దుఃఖిస్తుంది. దానికి గాయమైతే విలవిల్లాడుతుంది. రోజంతా లైకా ధ్యాసలో ఉండే సుజాతకు కుక్కంటే ప్రాణం. తమ ఇంటి ఎదురు బంగ్లాలో దొంగను పట్టిచ్చిన 'లైకా'పై మరింత మమకారాన్ని సుజాత పెంచుకుంది. బాగా డబ్బున్న ఆ బంగ్లా వాళ్ళు ఎంత వెల అయినా కట్టిస్తామంటే 'డబ్బు'తో అన్ని కొనలేరంటుంది. అనివార్యంగా సుజాత దంపతులు ఒక నెలరోజులు ఊరికెళ్ళాల్సి వచ్చింది. లైకాను పక్కింటి వారికి జాగ్రత్తలు చెప్పి అప్పగించారు. నెల తరువాత తిరిగి వచ్చే సరికి బంగ్లాలో దుక్కల్లాగా, పులిలాగా బలిసిన లైకాను తీసికొని రావడానికి ప్రయత్నించిన భర్త పిక్కను పట్టి కరిచింది. తమవద్ద ఎంతో విశ్వాసంగా ఉన్న 'లైకా' నెల రోజులకే ఎలా మారిందో చూసి సుజాత స్పృహతప్పి పడిపోయింది.

నిస్సందేహంగా కుక్కలు విశ్వాసం కల జంతువులే. నెలరోజులు వాటిని పోషించలేని మధ్యతరగతి ఇంట్లో అవి ఎందుకు విశ్వాసంగా ఉంటాయి. కుక్కలను, ఉన్నవాళ్ళు మాత్రమే సాదుతారని రచయిత సందేశం.

తెరవెనుక జై జవాన్ కథల్లో ఒకటి స్వార్థంతో కుట్రతో కూడుకున్న కథయితే, మరొకటి త్యాగంతో కూడుకున్న కథ.

ఊసరవెల్లి రాజకీయాలు విద్యార్థులని, సమాజాన్ని ఎంత నాశనం చేసి, అశాంతిని సృష్టిస్తాయో తెరవెనుక కథలో చూస్తాం. కుటుంబ సమస్యలతో బాధపడ్తున్న రవి ఒక విద్యార్థి. దారిద్ర్యంతో చదువు కొనసాగించలేక ఉద్యోగం కోసం రాజకీయ నాయకుడైన పరంధామయ్యను ఆశ్రయిస్తాడు రవి. పరంధామయ్య స్వార్థ పూరితమైన, విషపూరితమైన ఆలోచనలకు చక్కెర గుళికలాంటి మాటలు జోడించి "పరీక్షలుకాదు-డిగ్రీలు కావాలి" "యువజనులు సాధించలేనిదీ లేదు" అని ఉద్యమం తీస్తే సమస్యలకు పరిష్కారం దొరకుతుందని రవికి చెప్పుతాడు. రవి తన ఘాటైన ఉపన్యాసాల ద్వారా విద్యార్థులను రెచ్చగొట్టి హింస ప్రేరేపించేలా చేసి సమాజాన్ని అశాంతికి గురిచేస్తాడు.

చివరికి ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు జరుపాలని వారిని ఆహ్వానిస్తే విద్యార్థుల తరుపున పరంధామయ్య చర్చల్లో పాల్గొని, తనకు మంత్రిపదవిస్తే ఉద్యమం

ఆగిపోతుందని శాంతి వెల్లి విరుస్తుందని చెప్పి ప్రభుత్వాన్ని బ్లాక్‌మేయిల్ చేస్తాడు. తిరుగులేని విద్యార్థి శక్తిని పాచికగా వేసి మంత్రి పదవితో తెరమీదికి వస్తాడు పరంధామయ్య. మాజీమంత్రి తాజామంత్రిగా రవిని నిరాదరిస్తాడు. పరంధామయ్య అసలు స్వరూపం తెలుసుకున్న రవి మళ్ళీ విద్యార్థి ఉద్యమానికి ఊపిరిపోసి పరంధామయ్య బంగ్లా ముందు విద్యార్థులతో కలిసి ఉద్యమంగా వెళ్తాడు. తన పోలీసులతో రవిని కాల్పించిన పరంధామయ్య, 'విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనకూడదని' ఒక పత్రికా ప్రకటన ఇచ్చాడు.

మంచి వ్యవస్థ నిర్మాణానికి రాజకీయ వ్యవస్థ పనిచేయాలి కాని, స్వార్థం కోసం విధ్వంసం సృష్టించవద్దు సమాజాన్ని అశాంతి పరచవద్దు. విలువైన జీవితాలతో ఆటలాడుకోవద్దు అనేది తెరవెనుక కథ ఇస్తున్న సందేశం. ఈ కథలో తెర వెనుక ఉండి విద్యార్థులను స్వార్థం కోసం వాడుకున్న పరంధామయ్య రాజకీయ అస్థిరతని ప్రోత్సహించాడు. విద్యార్థుల, యువకుల భావోద్వేగాలను స్వార్థానికి వాడుకున్నాడు. వారి ఉద్యమంతో మంత్రిపదవి చేపట్టాక విద్యార్థులను విస్మరించడమే కాకుండా బంగారు భవిష్యత్తున్న వారిని పొట్టన పెట్టుకోవడం కన్పిస్తుంది. ఇది వర్తమాన రాజకీయ చిత్రపటమే. న్యాయన్యాయాలు రాజకీయాల్లో కనుమరుగై దుష్టవిలువైన స్వార్థమే నిజమైన విలువగా కొనసాగుతుందనేది ఈ కథలో చూస్తాం.

జవాను కూడా ఒక తల్లి బిడ్డడే. అతనికి కుటుంబం ఉంటుంది. కాని కర్తవ్య నిర్వహణలో కుటుంబ బంధనాల్లో చిక్కుకోడు. అప్పుడే అతని శౌర్యం దీప్తిమంతమవుతుంది.

భార్య పురుడుపోయి పుట్టెడు దుఃఖంలో ఉంది. ఈ విషయాన్ని ముసలి తల్లి ఎంత చెప్పినా, ప్రభుత్వం నుండి కబురురాగానే కర్తవ్యమే ఊపిరిగా ప్రయాణమై పోతున్న జవానును నివారించే ప్రయత్నం చేస్తున్న ఆవిడను చూచిన ఒక పౌరుడు, జవాన్ వీరత్వాన్ని పొగుడుతూ మెడలో పూలదండ వేస్తాడు. జవాను యుద్ధానికి వెళ్తున్నాడని బజారులోని వారందరికి తెలియగానే ఒకరివెనుక ఒకరు జవాను మెడలో పూలదండలు వేస్తారు. బహుమతులిస్తారు. జవానుకు జై కొడతారు. ఇంతమంది అపరిచితులకు ఆరాధ్యుడైన తన కొడుకు గొప్పతనం తెలుసుకున్న వృద్ధురాలు సైతం "వీర జవానుకు జై !" అంటూ నినదిస్తుంది.

తెరవెనుక కథలో రాజకీయ నాయకుడి స్వార్థం కన్పిస్తే, జై జవానులో సైనికుడి త్యాగం కనిపిస్తుంది. స్వార్థం అశాంతికి దారితీస్తే, త్యాగం సుశాంతికి దారి తీస్తుందని ఈ కథల సారాంశం.

అసమానతల వ్యవస్థలో మోసం, దగా, వంచన ఒకవైపుంటే, కుటుంబం ప్రేమ, త్యాగం ఆదర్శాలు మరొక వైపుంటాయి. ఒక మధ్య తరగతి వాడు మరో మధ్య తరగతి వాడిని ఎలా మోసం చేస్తాడో, ఆ మోసాన్ని తట్టుకోలేక ఎదుటివాడు ఎలా బలవుతాడో తెలిపే కథ "అప్పిచ్చువాడు".

వెంకట్రావ్‌ను తల్లిదండ్రులు చదివిస్తారు. భవిష్యత్తులో సహాయపడతారని తమకు తెలిసిన సంబంధాన్ని చూసాం వివాహం చేసుకోమంటారు. చదువుకునే రోజుల్లోనే తాను ప్రేమించిన సావిత్రిని ఆదర్శ వివాహం చేసుకుంటాడు. తండ్రి మరణం తర్వాత వెంకట్రావ్‌కు సమస్యలు తోరణాల్లా ఎదురు నిల్చాయి. "పట్టా ఎందుకూ పనికి రాదనుకున్నాడు. పట్టాకోసం పెట్టిన పొలం ఉన్నా బాగుండేదను కున్నాడు. ఆదర్శాలు ఆగర్భ శ్రీమంతుల సొత్తు అనుకున్నాడు. ప్రేమలు, పెళ్ళిళ్ళు పేదవారికి కావనుకున్నాడు." పెరుగుతున్న అవసరాలు కాల్చేస్తున్న ఆకలికోసం ఊళ్ళో ఉన్న భూమిని తెగనమ్మి 'కడుపుతో ఉన్న భార్య, కాలు కదపలేని తల్లి'తో కలిసి హైద్రాబాద్‌కు చేరుకుంటాడు. వెంకట్రావ్‌కు రామస్వామి ద్వారా చిన్న గుమస్తా ఉద్యోగం లభిస్తుంది. ఉద్యోగం కోసం రామస్వామి వద్ద అప్పు తీసికున్న వెంకట్రావ్ నెలా నెలా వడ్డి వాటంగానే కడుతున్నాడు. ప్రతి నెల జీతం డబ్బులు రామస్వామికి వడ్డి కట్టడానికే సరిపోతలేవు. ఇంట్లో తల్లీ భార్యాపిల్లల అవసరాలు తీరడం లేదు. రామస్వామికి ఒక నెల అప్పు కట్టకూడదని నిర్ణయించుకున్న వెంకట్రావ్ రామస్వామిని ప్రతిఘటించి వడ్డీ కట్టకుండానే వెళ్ళిపోతాడు. రామస్వామి మనుషులు వెంకట్రావ్‌పై దాడి చేసి డబ్బులు లాక్కుంటారు. ఈ చికాకుతోనే ఇంటికి వచ్చి జబ్బుతో మంచానపడ్డ తల్లికి మందులు తేలేక, భార్యాపిల్లలకు తిండిపెట్టలేక విసుగుతో పిల్లలను కొట్టి హుస్సేన్‌సాగర్‌లో దూకి చస్తాడు. ఇదొక మధ్య తరగతి జీవి వ్యథ.

ఇక తనలాంటి మధ్య తరగతివాడి బలహీనతను ఆసరా చేసికొని బతికే రామస్వామి చనిపోయిన వెంకట్రావ్‌ను చూసి ఏడుస్తాడు. ఈ ఏడుపు వెంకట్రావ్ లేకపోయినందుకు కాదు. తన అప్పు కట్టాల్సి వస్తుందనే చనిపోయాడని, తనను వెంకట్రావ్ లాస్ చేసి పోయాడనే బాధయే కన్పిస్తుంది. ఇవే మాటలను బయటికి కూడా అంటాడు రామస్వామి.

"బతికినవాడికి కట్టుబట్ట దొరకదు. చచ్చినవాడికి కొత్తగుడ్డ, చచ్చిన వాడికి ఆరడుగుల స్థలం, బతికినవాడికంటే చచ్చినవాడికే హక్కులెక్కువ" వెంకట్రావ్ శవానికి కాపలా ఉన్న కానిస్టేబుల్ అనే మాటల్లోని విషాదం మధ్య తరగతి విషాదమే. బతకడం కంటే చావడం మేలు అనే మధ్య తరగతి నిర్వేదం దీనిలో కొట్టవస్తుంది.

ప్రతివాడు తనలాగే వ్యవస్థ ఉండాలని కోరుకుంటాడు. తను ఎవరికి ద్రోహం చెయ్యనని, నియమనిష్ఠలతో జీవితం గడుపుతానని సకాలంలో అన్ని కార్యక్రమాలు చేయగలుగుతానని ఇలా మధ్య తరగతి ఆలోచనలతో ఉండి ఇదే చైతన్యవంతమైన జీవితమని, జీవిత పరమార్థం ఇదేనని అనుకుంటూ ఉష్ట్రపక్షి జీవితం గడుపుతాడు. చిన్న సమస్య ఎదురైనా జడుసుకునే ఈ జీవులు సమస్యలతో వేగిపోయే వాళ్ళను చూసినా, ముఖ్యంగా కనీస అవసరమైన 'ఆకలి' తీరని మనుష్యులను చూస్తే ఒకప్పుడు జంకూ, మరొకప్పుడు అసహ్యం కూడా కలుగుతుందని "ఆకలి" కథ చెప్తుతుంది.

జీవితమే తాను, తానే జీవితం. తానే కదలిక, తాను చైతన్యం, తాను స్పందన. "అనుకునే వేదాంతి ఎవరిని నమ్మడు. ప్రతివాడు దోచుకునేవాడే, "తెలిసినవాడు తెలియనివాణ్ణి దోచుకుంటున్నాడు?" అనే ఎరుక కలిగినట్లున్న వేదాంతి. తన స్కూటర్ రిపేరుకిస్తే 'వర్క్‌షాప్‌వాడు అన్నంత బిల్లు చెల్లించాల్సిందే!' తను ఆఫీసరైనా వర్క్‌షాపువాడికి తెలిసినంత తనకు తెలియకపోవడం వల్లనే ఈ దోపిడి జరుగుతుందనుకుంటాడు. శ్రమను విలువ కట్టడం ఎట్లాగో తెలియని వేదాంతి చదువుకున్నవాడే. శ్రమ సంస్కృతిని గౌరవించలేని ఆఫీసర్‌కు శ్రామికుల మీద గౌరవమేమి ఉంటుంది? ఆకలి అంటే ఎలా ఉంటుందో తెలియని విద్యావంతుడికి ఆకలితో అడుక్కుతినే వాళ్ళను చూస్తే ఎంత అసహ్యం వేస్తుంది? విద్యావంతుడైన వేదాంతికి, ఆఫీసరైన వేదాంతికి అడుక్కునే వాడిని చూస్తే అలాగే అసహ్యం వేసింది. రొట్టె కొనుక్కొని తింటున్న వేదాంతి దగ్గరికి అడుక్కునే వాడు వచ్చి ఆకలి అంటే వేదాంతి జంకాడు. తాను తింటున్న రొట్టెకు బదులు పైసా అందిస్తాడు. వాడికి కావాల్సింది రొట్టెకాని పైసా కాదని తెలుసుకొని వేదాంతి ఆకలి మనిషి తన చేతిలోని రొట్టెను లాక్కుండాటేమోనని భయం వేస్తుంది. ఆక్సిడెంట్‌లో వాడు చనిపోతే బాగుండనని అనుకుంటాడు. నిస్సహాయుడైన ఆకలి మనిషి వేదాంతి చేతిలోని రొట్టెను చూస్తూనే ఎదురుగా నిలబడతాడు. ఒక కుక్క వేదాంతి చేతిలోని రొట్టెను

లాక్కెళుతుంది. తాను చేయలేని పని కుక్క చేసినందుకు వేదాంతి నవ్వుకుంటాడు. "తన కంటే కుక్కలే నయం" అనుకుంటాడు.

"ఉన్నవాడిని అడిగితే ఎవడిస్తాడు? లాక్కోవడమే మందు" అని వేదాంతి చేతనే పలికిస్తాడు రచయిత. వర్గవ్యవస్థలో లాక్కోవడమే సరియైనదనేది రచయిత సందేశం.

రచయిత, పబ్లిషర్, వేశ్య పాత్రలు గల కథ 'నవల'. ఆర్థిక లేమితో బాధపడుతున్న రచయిత ఉన్న కొద్ది చిల్లరతో నోటుబుక్కు, పెన్సిల్‌కొని రైల్వేస్టేషన్‌లో కూర్చుండి నవలరాయడానికి వస్తువు కోసం ఆలోచిస్తున్నాడు. మూడు రోజుల నుండి విటులు దొరకక ఆకలి మంటతో దహించుకుపోతున్న వేశ్య 'పావలా ఇచ్చినా, బేడా ఇచ్చినా వస్తానంటూ' రచయితతో దీనంగా అంటుంది.

ఆ పూటకే కాఫీ డబ్బులు లేని రచయిత వేశ్యను చూసి జాలిపడి వేశ్య జీవితాన్నే వస్తువుగా చేసికొని "ఆకలికి అమ్ముడుపోయిన ఆడది" అనే నవల రాస్తాడు. దేహాన్నే పెట్టుబడిగా పెట్టి రాత్రంతా సంపాదించిన డబ్బుల్లోంచి రచయితకు బేడా ఇచ్చి కాఫీ తాగుమంటూ ఒక సలహా కూడా ఇస్తుంది వేశ్య. "కథల పిచ్చిమానుకో, కూలి చేసుకో" అంటూ వెళ్ళిపోతుంది.

నవలను పబ్లిషర్ తీసుకొని తగిన మూల్యం రచయితకు ఇవ్వకుండానే పది రూపాయలు చేతిలో పెట్టి వెళ్ళమన్నట్లు దండం పెడతాడు.

ఈ కథలో వేశ్య, పబ్లిఫర్ ఇద్దరూ వ్యాపారులే. ఒకరేమో తనను తాను పెట్టుబడిగా పెట్టుకొని సంపాదించిన డబ్బులతో రచయితకు కాఫీ డబ్బులిస్తే, మరొకరేమో రచయిత సృజనాత్మకతతో వ్యాపారం చేస్తూ లాభాలు గడిస్తూ ఒక రకమైన దోపిడీకి పాలుపడుతున్నారు. ఈ సంఘంలో ఎవరికి గౌరవం ఉంటుంది. వేశ్యాకా? పబ్లిషర్‌కా? రచయితకా?

అయితే కథలో విషాదమేమిటంటే నవలలోని ముగింపులాగే వేశ్య మరణిస్తుంది.

గెలుపును నిర్ణయించేది ఎట్లా? విలువలకు కట్టుబడి వైఫల్యం చెందిన వ్యక్తులు గెలిచినట్లా? లేక విలువలకు తిలోదకాలిచ్చి అడ్డదారిలో నానా గడ్డితిని సాఫల్యం పొందిన వాళ్ళు గెలిచినట్లా? అని సంశయాన్ని వ్యక్తం చేసిన కథ 'గెలుపెవరిది?

రోజురోజుకూ సమాజం వ్యాపారమయమైపోతుంది; చివరికి జాతి సాంస్కృతిక సంపదైన సృజనాత్మకత, ప్రాణం కాపాడే వైద్యవృత్తి కూడా !

లక్ష్మి, సావిత్రిలు దేన్నైనా సాధించుకోగల సమర్థులు. ఫలితమే ముఖ్యంగాని ఆ ఫలితం ఎట్లా సాధించాలనేది వారికి అనవసరం. లక్ష్మి తమ్ముడు శేఖర్. మెడిసన్ చదవాలన్న తపనే తప్ప అందుకు దగ్గ కృషి చేయడు. లక్ష్మి చేసిన పైరవీతో, డోనేషన్‌తో శేఖర్‌కు మెడిసన్ సీటు వచ్చింది. మెడిసిన్‌లో చేరడంతోనే భారీ కట్నాలతో శేఖర్‌ని అలుడిని చేసికోవడానికి పోటీపడ్డ వారున్నారు. లక్ష్మి తెలివితేటలతో ఎక్కువ కట్నమిచ్చిన సుషమతో తమ్ముడి పెళ్ళి జరిపిస్తుంది. భార్యతో జల్సాలో మునిగి మొదటి సంవత్సరం మెడిసిన్‌లో ఫెయిల్ అయ్యే పరిస్థితి తెచ్చుకొన్న శేఖర్‌ను లక్ష్మి పైరవీ చేసి మెడిసిన్ పాస్ చేయిస్తుంది.

సావిత్రి అమాంతంగా నాలుగు నవలలు రాసి వాటిని సినిమాగా తీసి డబ్బు సంపాదించాలనే నేలదిగని ఆలోచనలతో ఉంటుంది. రచయితగా కీర్తి, డబ్బు, రావాలి కాని, అందుకు అధ్యయనం కృషి అనవసరమని భావిస్తుంది. కనీసం భాషా, శైలీ పరిజ్ఞానం లేకుండా నవల రాసి పైరవీ ద్వారా దాన్ని అందంగా అచ్చువేస్తుంది కూడా !

లక్ష్మి తమ్ముడికి మార్కులు వేయించి పాస్ చేయించడం ఇష్టపడిన వ్యక్తి, అట్లాగే పేలవంగా ఉన్న సావిత్రి రచనలను పబ్లిషర్‌కు చెప్పి అచ్చు వేయించిన వ్యక్తి ఒక్కరే. ఇక్కడ గెలిచింది విలువలను ఒదిలేసిన వ్యక్తులు లక్ష్మి, సావిత్రులు. ఓడింది విలువలకు కట్టుబడిన వ్యక్తి.

రచయిత ఈ కథ రాసే నాటికి సమాజం నేడున్నంత వ్యాపారమయం కాలేదు. నేడు సృజనరంగం, వైద్యరంగం పూర్తిగా వ్యాపారమయమైనాయి. ఎంట్రెన్స్ రాయకుండానే మేనేజ్‌మెంట్ కోటలో లక్షలాది రూపాయల డొనేషన్ కట్టి ఎలాంటి సీటునైనా పొందవచ్చు. ఇది జాతి శ్రేయస్సుకు ఏ విధంగా మేలు చేకూరుస్తుందో ఆలోచించాలి.

పేదరికం ముందు ఆదర్శాలన్నీ వట్టి భ్రమలే. అనుబంధాలన్నీ బూటకమే. చివరికి తల్లీ – బిడ్డల అనుబంధాలు కూడా. ఇది వినడానికి ఆశ్చర్యం కలిగినా "విలువలు సూచనలు" కథ చెప్పేది ఈ వాస్తవాన్నే.

కరువు కాటకాలొచ్చి చెయ్యడానికి పని దొరక్క చంకబిడ్డను వెంకయ్యా దొర కమ్ముకున్న దంపతుల వ్యథార్థ గాథ గుండెలని పిండేస్తుంది. బిడ్డనమ్ముకున్న పదమూడేండ్ల తరువాత భర్త చనిపోతాడు. వృద్ధాప్యంలో కొడుకైనా తోడుంటాడనే ఉద్దేశ్యంతో దొర దగ్గర పెరుగుతున్న తన కొడుకును తన కిప్పించమంటూ కలెక్టర్‌తో ప్రాధేయపడతుందా స్త్రీ. కథ విన్న కలెక్టరు, జవానులు కూడా ఆర్ద్రమవుతారు. తల్లీ బిడ్డలను విడదీసే హక్కులేదని చట్టం చెప్పుతుందని వెంకయ్యా దొరకు కలెక్టర్ చెప్పి, వీరణ్ణి తన తల్లి దగ్గరకు పొమ్మంటే వీరడు తల్లి వెంట వెళ్ళడానికి ఇష్టపడడు. కారణం అమ్మ దగ్గర బువ్వ దొరకదంటాడు వీరడు. "అన్నం అనురాగానికంటే గొప్పదనే" కఠోర వాస్తవాన్ని, సామాజిక సత్యాన్ని ఈ కథ తెలుపుతుంది.

ఈ దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలొచ్చి ప్రజాస్వామ్యదేశంగా రూపుదిద్దు కుంటున్నా ఫ్యూడల్ సంప్రదాయం మాత్రం విడిచి పెట్టలేదు. 'దొరతనాలు పోయినా దొరలు పోలేదు. బానిసత్వం పోయింది కాని బానిసలు పోలేదని తెలిపే కథ "చదువు".

స్వతంత్ర దేశంలో మహోన్నతమైన రాజ్యాంగాన్ని నిర్మించుకొని ప్రాథమిక హక్కులను, విధులను ఏర్పాటు చేసుకున్నాం. ప్రతి బాలుడికి విద్యను పొందే హక్కున్నదని ప్రాథమిక హక్కుల్లో చెప్పుకున్నాం. పిల్లలను కూలీలుగా, కార్మికులుగా చేర్చుకుంటే యజమానిని నేరస్తుడని శిక్షించవచ్చని చట్టం చెప్పుతుంది. కాని ఆచరణలో మాత్రం శూన్యమే. చట్టం ముందే అసంఖ్యాక బాలబాలికలు, కార్మికులున్నా అది నిర్వీర్యమే అవుతుంది. వెంకన్నను చిన్నప్పుడే తండ్రి దొరకు అమ్ముకున్నాడు. దొరదగ్గర బాల వెంకన్న బానిస. వయస్సుకు మించిన పనులు చేస్తూ, పోషక విలువలను లేని ఆహారం తీసికోవడం వలన శుష్కించాడు. సమవయస్కుడైన దొరకొడుకులా చదువుకోవాలన్న కోరిక బయట పెట్టినందుకే దొర చేత తన్నులు తింటాడు. దొర చేత దెబ్బలు తిన్నాక చదువుకోవాలన్న కోరిక మరింత బలపడింది వెంకన్నలో. పంతులు సహాయంతో బాంచవృత్తి నుండి బయటపడే ఖానూనుందని తెలుసుకొని, దొరకళ్ళు తెరిపించి బాంచవృత్తి నుండి బడికి వెళ్ళిన వెంకన్న పాత్ర చైతన్యవంతమైనది. విద్యను పొందే హక్కు ప్రతి పౌరుడికుందని చెప్పిన కథ ఇది.

అలగా జనానికి ఊరిలో స్థానం ఉండదు. చెట్టుచేమల కిందే వారి నివాసం. చెట్లకిందనే సమస్త జీవితాన్ని గడిపే అలగా జనంకు హక్కులు, అధికారాలేమీ

ఉండవు. కొందరి దృష్టిలో వారిది జీవితం కాదు, అసలు వారు మనుష్యులే కాదు. పౌరులు కానేకారు. నిర్వీర్యులైన అలగా జనం అసహాయతను తెలిపే కథ "మర్రిచెట్టు"

దారిద్ర్యంలో పీడింపబడుతున్న వాళ్ళు, పౌరుల జాబితాలో స్థానం లేని వాళ్ళంతా ఏళ్ళ తరబడి ఆ మర్రిచెట్టు కిందనే ఆరుగాలం కాపురం చేస్తున్నారు. వాళ్ళతో పాటు కొంచెం వేదాంతం ఒంటబట్టించుకున్న బైరాగి శివయ్య, ఆయన భార్య గంగమ్మల కాపురం కూడా ఇక్కడే. పాటలు, తత్త్వాలు పాడుతూ ఆడుక్కునే శివయ్య దంపతులకు ఈ చెట్టు కిందే సంసారం పెరిగింది. ఎందరికో గూడైన ఈ మర్రిచెట్టు రకరకాల మనుష్యులతో ఏ భేదాభిప్రాయాలు లేని చిన్న ప్రపంచం లాగుంటుంది. ఈ చెట్టు వున్న స్థలం, ఈ చెట్టు నాదంటూ పట్టణంలోంచి వచ్చిన నారయణ ఏళ్ళ తరబడి చెట్టుకింద ఉన్న వాళ్ళంతా అద్దె కట్టాల్సిందేనంటూ బలవంతంగా అద్దె వసూళ్ళు చేస్తాడు. కొన్నాళ్ళకు తన మనుష్యులతో వచ్చి ఎన్నో ఊడలతో పాతుకుపోయిన చెట్టును నరకడానికి ప్రయత్నించగా గంగమ్మ అడ్డుచెప్తుతుంది. అయినా నారాయణ మనుషుల దుర్జనత్వం వల్ల గంగమ్మ తలకు గొడ్డలి తగిలి చనిపోతుంది. ఈ దారుణం చూసిన శివయ్య ప్రాణం విడుస్తాడు. కొన్నాళ్ళకు మర్రిచెట్టు స్థానంలో ఒక హోటల్ వెలుస్తుంది. హోటల్‌కు దూరంగా శివయ్య సామి సమాధి ఉంటుంది.

స్వార్థంతో మనిషి పల్లెలను పట్టణాలుగా, పట్టణాలను నగరాలుగా నిర్మిస్తూ ఆక్రమించుకుంటున్నాడు. సంచార జీవులైన అలగాజనానికి చెట్టు నీడ కూడా దుర్లభమే అవుతుంది.

చదువు, గుణం, అందం, డబ్బు ఉంటే కావల్సినవన్నీ వాటంతట అవే వస్తాయనుకుంటారు చాలా మంది. ఇవ్వన్నీ ఉన్న రమణి ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకొని కావాల్సిన ప్రేమను పొందలేక మోసపోయి ప్రతీకారం తీర్చుకున్న కథ "అర్థరాత్రి అరుణదోయం".

తండ్రి తప్ప అన్నీ ఉన్న రమణి వయస్సు జలపాతంలో కొట్టుకుపోతూ శరత్ ప్రేమలో నిండా మునుగుతుంది. వివాహం చెయ్యకపోతే శరత్‌తో లేచిపోతానని రమణి తన తల్లి రాజమ్మతో అంటుంది. హద్దులు మీరి భ్రమల్లో విహరిస్తున్న కూతురుకు అడిగినంత కట్నమిచ్చి శరత్‌తో వివాహం చేస్తుంది. వాస్తవ జీవితంలోకి అడుగిడిన రమణి శరత్‌కు డబ్బే ప్రధానం కాని తాను కాదని త్వరగానే గ్రహిస్తుంది.

శరత్ తల్లిని తన తల్లితో పోల్చుకొని తన తల్లిది ప్రేమ, త్యాగం, అత్తది ఆశ అని గ్రహిస్తుంది. రాజమ్మ వద్ద ఉన్న డబ్బంతా పంపినా శరత్‌కు ధనదాహం తీరలేదు. రమణి మీద ప్రేమతో నివసిస్తున్న ఇల్లును సైతం అమ్మి రాజమ్మ డబ్బు పంపించింది. అయినా అత్తకు, భర్తకు ధనదాహం తప్ప మరోటి లేదని గ్రహించి శరత్ చేతిలో మోసపోయిన తాను ఆత్మహత్యకు పాల్పడాలనుకొని విరమించుకుంది. ఇక రాజమ్మ దగ్గర డబ్బు లేదని గ్రహించి తల్లి కొడుకులు రమణిని అరబ్బుకు అమ్మివేయాలని నిర్ణయించుకున్నారని పనిమనిషి చిత్తమ్మ ద్వారా తెలుసుకుంది రమణి. చిత్తమ్మ ఇచ్చిన ధైర్యంతో తనను కొనుక్కున్న అరబ్బును, కట్టుకున్న భర్తను అర్థరాత్రి రోకలి బండతో కొట్టి చంపేస్తుంది. భర్త, అరబ్బు పీడవదలిన ఈ అర్థరాత్రే తన జీవితానికి అరుణోదయమని రమణి భావిస్తుంది.

స్త్రీ ఎప్పుడూ విలాస వస్తువుగానో, వ్యాపార వస్తువుగానో చూడబడుతుంది. కానీ రక్తమాంసాలు తప్ప మనసున్న మనిషిగా ఆమెను సమాజం గుర్తించడం లేదు ముఖ్యంగా జీవితాన్ని పంచుకున్న భర్తకూడా. ఇంతకంటే స్త్రీ జీవితంలో విషాదమేముంటుంది. ఆ విషాదంలో తనకు తానుగా చిక్కుకున్న రమణి, తనను తాను బయటపడే మార్గాన్ని వెదుక్కోవడంలోని చైతన్యం స్త్రీ జాతికి ఆదర్శం.

అందం - ఆవేశం ఒకటి సహజమైంది, మరొకటి పరిస్థితుల ప్రభావం చేత ప్రాదుర్భవిస్తుంది. అందాన్ని ఆరాధించడం మానవులకుండే సహజలక్షణమే. అందంతో పాటు ఆవేశం ఉన్న వ్యక్తిని అభిమానించడం, ఆరాధించడంతో పాటు ఆ వ్యక్తి ఆదర్శాలనూ అనుసరించడం ఉత్తమమైన మార్గం.

"అగ్గిరెమ్మలు" కథలో సుజాత అందమైనదే. కాని నిలువెల్లా ఆవేశంతో తొణకిసలాడుతుంది. ఇది వర్గవ్యవస్థ. ఈ వ్యవస్థను అంతం చేయాలనే ఆవేశం. ఈ వ్యవస్థను అర్థంచేసుకొని, ఆచరణలో పెట్టడానికి జ్ఞాన సముదాయాలైన పుస్తకాలు దోహదం చేసాయి. ఆవేశం, ఆలోచన ఉంటే వ్యవస్థను మార్చవచ్చనే విశ్వాసం ఆమెలో బలంగా కనిపిస్తుంది. సుజాత పరిచయానికంటే ముందు సమాజాన్ని ఒక రకంగా చూసిన వ్యక్తి, సుజాత పరిచయంతో విశాల దృక్పథంతో సమాజాన్ని వీక్షించడం మొదలుపెట్టాడు. విప్లవం ద్వారా మాత్రమే సమాజంలో మార్పు వస్తుందనే సుజాతతో ఏకీభవించిన వ్యక్తి ఆమె పథంలో పయనించడానికి సిద్ధపడతాడు.

సుజాతనే జీవిత భాగస్వామిని చేసికోవడానికి ఆమె అభిప్రాయాన్ని సంస్కారవంతంగా తెలుసుకుంటాడు.

వర్గవ్యవస్థను నిర్మూలించాలనే కార్యచరణలోకి దిగిన వ్యక్తులను ఈ సమాజం ఎలా ఇబ్బంది పెడుతుందో అవే ఇబ్బందుల్లో సుజాత ఉందని గ్రహించి ఆమె మార్గంలోనే తాను పయనించడానికి సిద్ధపడతాడు.

వ్యవస్థను మార్చాలనే లక్ష్యంతో ఉన్న ఈ ప్రేమికుల ఉమ్మడి అభిరుచి పుస్తకాలు చదవడమే. ఆదర్శాలు, ఆవేశాలు ఉత్తమ వ్యవస్థ నిర్మాణానికి దోహదం చేసే పుస్తకాలు చదవడం వల్లనే ఇద్దరికి మైత్రి కుదిరింది.

సభ్య సమాజంలో ఉంటూ ఉత్తమ పౌరులుగా చలామణి అవుతున్న నేరస్తులెందరో మన కళ్ళముందు కనిపిస్తారు. సాంఘిక, ముసుగులు తొడుక్కొని అటు సమాజాన్ని, ఇటు భార్యనూ మోసం చేసే పురుషులెందరో కూడా ఈ సమాజంలో ఉన్నారని చెప్పే కథ "నల్లనాగు".

విశ్వనాథం దగ్గర స్టెనోగా పనిచేసే షర్మిల ప్రమోషన్ కోసం విశ్వనాథాన్ని వలలో వేసుకోవాలని చూస్తుంది. షర్మిల కుహనాబుద్ధిని గ్రహించిన విశ్వనాథం ఆమెను ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. విశ్వనాథం భార్య, భర్త ఉత్తమ వ్యక్తిత్వాన్ని, నిగ్రహాన్ని మెచ్చుకుంటూ ముద్దు పెడుతుంది. షర్మిల వ్యవహారంలో అటు ఆఫీసులో, ఇటు ఇంట్లోనూ గొప్ప సంస్కారవంతుడిగా మార్కులు కొట్టేసిన విశ్వనాథం, భార్య ఊరికెళ్ళినప్పుడు పనిమనిషి నీలవేణికి డబ్బు ఆశ జూపి లోబర్చుకునే ప్రయత్నం చేస్తాడు. నీలవేణి ఆయన ప్రలోభాలకు లొంగక గట్టిగా ప్రతిఘటించి విశ్వనాథాన్ని ఇంట్లోంచి వీధుల్లోకి లాక్కొచ్చి విశ్వనాథం అసలు స్వరూపాన్ని తేటతెల్లం చేస్తుంది. ఎంతో ఉత్తముడనుకున్న భర్త నీచబుద్ధిని చూసి సుజాత అసహ్యించుకుంటుంది.

ఇంట్లో పని చేసే వాళ్ళను పనిమనుష్యులు అని అగౌరవపరచడం కంటే తమ సహాయకులని అంటే బాగుంటుందేమో ! కుటుంబ సభ్యుల్లా తల్లి, చెల్లి, కూతురు అందించే సేవలన్నీ అందిస్తూ, సకాలంలో యజమానుల కార్యాలు సఫలమయ్యేలా దోహదపడతారు వీరు. ఇంట్లాంటి వ్యక్తులకు పనికల్పించామనే అహంకారం యజమానులకుండడం తగదు. వీరికీ ఆత్మాభిమానంతో గౌరవంతో బతకాలనే ఉంటుందని గుర్తించే యజమానులు తక్కువ. విశ్వనాథం లాంటి గోముఖ వ్యాఘ్రాల బారిన ఎంతమంది నీలవేణిలు పడ్తున్నారో అన్పిస్తుంది.

పుట్టిన ప్రతి జీవి మరణిస్తుంది. ఇది సత్యం. ఎల్లకాలం భూమి మీద జీవించడానికి రాలేదని తెలిసినా, ఎప్పుడో వచ్చే చావును తలుచుకుంటూ వణికిపోవడం పిరికివాళ్ళ లక్షణం. ఆ భయంతో సలక్షణంగా ఉన్న వ్యక్తి చావు కెదురెళ్ళడంలోని విషాదాన్ని తెలిపే కథ "శంక".

వ్యాపారస్తుడైనా రాజయ్య తరుచూ ప్రయాణాలు చేస్తుంటాడు. ఒక రోజు బస్సులో హైద్రాబాద్‌కు వెళ్తుంటే గుండె నొప్పి వస్తుందనే అనుమానంతో భయపడి తాను చనిపోతాననే శంక కలుగుతుంది. దానితో అతని కళ్ళముందు భార్యాపిల్లలు, జొన్నచేలు, మాలపిల్ల రాములమ్మా గిర్రున తిరుగుతారు. చనిపోతే వీరంతా ఉండరు కదా ! అనుకుంటూ బెంగపడ్డాడు. డాక్టరుకు చూపించుకుంటే ఇ.సి.జి. తీసేదాక రోగమేమిటో చెప్పలేనంటాడు. దాంతో మరింత భయానికి లోనైన రాజయ్య తనకేదో పెద్ద జబ్బే చేసిందనుకుంటాడు. ఈ అనుమానానికి తోడు అప్పటికే ఆరుగురు చనిపోయిన బెడ్‌పై రాజయ్యను పడుకోబెట్టగా తను కూడా చనిపోతాననే దిగులుతో వణికిపోతాడు. ఇదే భయంతో ఏ అర్థరాత్రో బెడ్‌మీది నించి దిగి పక్కవాడి బెడ్డు క్రింద ప్రాణం విడుస్తాడు.

తనకే జబ్బులేక పోయినా ఉన్నదని భ్రమపడడం, ఉన్నా అసలే తగ్గని జబ్బు అయ్యి ఉంటుందని తనకు తానే అనుకోవడం. తననెవరూ పట్టించుకోవట్లేదనే కాంప్లెక్స్‌తో ఉండడం, డాక్టర్‌లాంటి వాళ్లు పట్టించుకున్నా ఏదో పెద్ద జబ్బే వచ్చి ఉంటుందని అనుకోవడం చివరికి ఆరుగురు చనిపోయిన బెడ్‌లో ఉంటే తాను చనిపోతానేమో అనే 'శంక'తో రాజయ్య మరణించడం జరిగింది.

ఇలాంటి పిరికివాళ్ళూ క్షణక్షణం భయపడ్తూ బతకడం కన్నా చావడమే మేలు అనేది రచయిత సందేశం.

బాల్యం అపురూపమైనది, నిర్మలమైన ప్రకృతిలాగా, బాల్యం నుండి విడివడిన మనిషి తిరిగి నిర్మాలిన్యమైన ఆ బాల్యంలోకి వెళ్ళడం దుస్సాధ్యం. కాదంటే ఆ అమాయక బాల్యంలోని జ్ఞాపకాలే చివరిదాక వెంట ఉంటాయని తెలిపే కథ "తామరపూలు".

బాల్యంలో స్నేహితురాలైన సీతకోసం తామరలు కోసివ్వడం, బాల్య స్నేహితుడైన నర్సయ్యతో రకరకాల ఆటలు ఆడుకోవడం అపురూపమైన జ్ఞాపకమే. రోజులు మారాయి. వాతావరణంలో మార్పు వచ్చింది. మనుష్యుల్లోనూ మార్పు

వచ్చింది. వర్షాలు లేక తామరపూల చెరువు ఎండిపోయి బీటలు వారింది. కప్పతల్లి ఆడడం, మహాభారతంలోని విరాట పర్వం చదవడం వలన వర్షాలు పడతాయనే విశ్వాసం ఈ జాతిలో ఉంది. కాని "మంచి మనుసు చలిస్తే ప్రకృతి కూడా పులకిస్తుంద"ని రచయిత సందేశమే ఈ కథ.

రచయిత తన రచనకు వస్తువును ఎన్నుకోవడంలో కాలం, స్థలం అమిత ప్రభావాన్ని చూపుతాయి. అట్లాగే రచయిత తన రచనను కళగా మలుచుకోవడంలో కూడా స్థల కాలాల పాత్ర తక్కువదేమీ కాదు.

రంగాచార్య కథలకు స్థలం తెలంగాణా ప్రాంతమే. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతంలోని ప్రజాజీవితం నిత్యం సంఘర్షణామయం. ఈ సంఘర్షణ వారి కథల్లో కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. అప్పిచ్చువాడు కథలో హైదరాబాద్, హుస్సేన్‌సాగర్ ప్రస్తావన ఉంది. ఆకలి కథలో వేదాంతాచారి ఉద్యోగం హైదరాబాద్‌లోనే. విలువలవలువలు, చదువు కథల్లో భూస్వాములు పిల్లలను జీతగాళ్ళుగా, కట్టు బానిసలుగా మార్చుకోవడం కన్పిస్తుంది. తెలంగాణా పల్లెల్లో ఇది యథేచ్ఛగా కనిపిస్తుంది. చైతన్యవంతమైన ప్రజలూ ఈ ప్రాంతంలో చారిత్రాత్మకమైన పాత్ర పోషించారు. అగ్గిరెమ్మలులాంటి కథలోని వర్గవ్యవస్థను కూల్చడానికి విప్లవమార్గం పట్టిన పాత్రలున్నాయి. రంగాచార్య గారు ఏడు దశాబ్దాల తెలంగాణ పరిణామాలను ప్రత్యక్షంగా చూసినవారు కనుకనే ఇక్కడ పరిస్థితులు, మనుషులు ఈ కథల్లో కన్పిస్తారు.

తామరపూలు కథలో చెరువు ఎండిపోయి పగుళ్ళు పడడం కనిపిస్తుంది. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే ప్రాంతాల్లో ఇది సాధారణమే. తెలంగాణా ప్రాంతంలో వర్షాభావ స్థితిలో చెరువులు ఎండిపోవడం, కరువు పీడించడం లాంటివి కనిపిస్తాయి. అట్లాగే ప్రేమకథల్లో మేరీ తల్లిని చెఱచి, తండ్రిని చంపింది రజాకార్లే. ఒకానొక కాలంలో హైదరాబాద్ సంస్థానంలో రజాకార్లు చేయని అరాచకంగాని, సృష్టించని బీభత్సం కాని లేదు. ప్రజాకవి కాళోజి, దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వంలో రజాకార్ల రాక్షసత్వం కళ్లకు కట్టినట్లుంటుంది.

రంగాచార్య గారు పాత్రచిత్రణలో వాస్తవికతను ప్రదర్శించారు. ఏ పాత్ర కూడా నేలవిడిచి సాము చేయలేదు. పాత్ర చిత్రణలో వీరు ఆబ్‌జెక్టివ్‌గా ఉంటారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఎలా ప్రవర్తిస్తారో పెన్సిల్‌భారతంలోని గుమాస్తా, సూపరింటెండెంట్ స్టోరు క్లర్కుల పాత్రలు అంతే సహజంగా ఉన్నాయి. అట్లాగే 'మళ్ళీ మన మధ్యకు గాంధీ వచ్చాడు'లో రాజకీయ నాయకులు ఫోటోలకు ఫోజిలిచ్చేంత వరకే ప్రజలకు సేవచేస్తున్నట్లు నటిస్తారు. ప్రేమ కథలో మేరీ, రమేశ్‌లు పరిస్థితులకు ఎంత ఆధీనులో తెలుస్తుంది. జై జవాన్ కథలో సైనికుడైన కొడుకు దేశభక్తిని చూసి తల్లి సైనికుడి అభిమానిగా మారుతుంది.

రంగాచార్య కథలు కొన్ని ప్రథమ పరుషలో నడిస్తే కొన్ని ఉత్తమ పురుషలో నడిచాయి. మళ్ళీ మహాత్ముడు మనమధ్యకొచ్చాడు, పెన్సిల్ భారతం, నిరుద్యోగం, ప్రేమకథ, తెరవెనుక, అప్పిచ్చువాడు, ఆకలి, నవల, నల్లనాగు, శంక, చదువు, మర్రిచెట్టు, అర్ధరాత్రి అరుణోదయం కథలు ప్రథమ పురుషలో నడిచాయి.

పిచ్చుకలు, జైజవాన్, అగ్గిరెమ్మలు, కుక్కపిల్ల, విశ్వాసం, విలువల వలువలు, చదువు, గెలుపెవరిది? తామరపూలు కథలు ఉత్తమ పురుషలో చిత్రించబడ్డాయి.

పిచ్చుకలు, కుక్కపిల్ల, విశ్వాసం, ఈ మూడు కథల్లో ఇతివృత్తం నోరులేని జంతువులు పక్షుల చుట్టూ తిరుగుతుంది. ఈ కథల్లో రచయిత సర్వసాక్షి కథనమే ప్రవేశపెట్టాడు.

తెరవెనుక కథలో పరంధామయ్య నేటి రాజకీయ నాయకులకు ప్రతినిధి. చెప్పేది చెయ్యరు. చేసింది చెప్పరు. నిలువెల్లా స్వార్థమే. ఇక రవి పాత్ర ఆవేశపరుడైన విద్యార్థికి ప్రతినిధి. స్వార్థ రాజకీయ నాయకుల మాటలకు మోసపోయిన కరివేప ఆకులా పరిగణింపబడి ప్రాణం కోల్పోయిన విద్యార్థి.

అప్పిచ్చువాడులో రామస్వామి, వెంకట్రావ్, కానిస్టేబుల్ పాత్రలు మధ్య తరగతి జీవితాలను ప్రతిబింబిస్తాయి. ఇదే మధ్య తరగతి జీవితాన్ని తెలిపే పాత్రలు కుక్కపిల్ల, విశ్వాసంలో కనిపిస్తాయి.

నల్లవాగులోని నీలవేణి, అగ్గిరెమ్మల్లోని సుజాత, అర్ధరాత్రి సూర్యోదయంలోని రమణి, చిత్తమ్మ పాత్రలు పాఠకుడిని నిరంతరం వెంటాడుతుంటాయి. అవి పరిస్థితులకు తలొగ్గక ధైర్యమైన నిర్ణయం తీసుకున్న ఆదర్శపాత్రలు.

ఇకపోతే విలువల వలువలులోని వృద్ధ స్త్రీ, ఆమె కొడుకు వీరని పాత్రల చిత్రణ సహజంగా ఉంది. వృద్ధాప్యంలో తోడుంటానుకున్నకొడుకు, బువ్వకోసం

దొరను విడిచి రాకపోవడం పాఠకుల హృదయాలను మెలిపెట్టే సంఘటన. కూడుకోసం నమ్ముకున్న వృద్ధ స్త్రీ హృదయవిదారకరమైన కథ విన్న కలెక్టర్ గారు దస్తీతో కళ్ళు తుడుచుకోవడం, అక్కడున్న జవాను కళ్ళలో నీళ్ళు తిరగడం సహజాతి సహజమే.

ఆకలి కోసం ఒళ్ళమ్ముకునే స్త్రీలు ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారు. నవల కథలోని వేశ్య ఈ పవిత్ర దేశానికి రాచపుండు.

సామాజిక జీవితాన్ని వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన కథలివి. ఎంతో క్లిష్టమనుకున్న సమస్యలకు సైతం సులభమైన పరిష్కారం చూపుతాయి. ఒక్కమాటలో చెప్పితే ఇవి కథలు కావు జీవిత భాష్యాలు.

# కన్నీటి కహానీల'బచ్చేదానీ'

అనిశెట్టి రజిత

రెండు దశాబ్దాల క్రితం నాటి సాహిత్యశకాన్ని మలుపుతిప్పుతూ కొన్ని మానవీయ వాదాలు లేదా విప్లవవాదానికి కొమ్మలుగా సాహిత్య ఉద్యమం అంకురించి కొత్త చూపునూ, కొత్త శక్తినీ ప్రసరిస్తూ ఎగజిమ్ముతూ జ్ఞాన ప్రపంచంలోకి దూసుకొచ్చాయి. వాటిని చదివీ, వినీ తెలుసుకున్నవాళ్ళు స్త్రీవాదమనీ, దళితవాదమనీ, పీడితజనవాదమనీ అన్నారు. అవి అణగారిన తమ వాదాలని రచయితలూ, కవులూ, కళాకారులూ అంగీకరించారు.

స్త్రీలకొక అభివ్యక్తి వాదమేమిటి? అది కథలూ, కవితలూ, వ్యాసాలూ, నవలలుగా ఆలోచనాక్షర విప్లవాన్ని ప్రభవించడమేమిటని చాంధసవాదులూ... దళితులకొక వాదమేమిటి, అది అన్నిరకాల పీడనలనూ అణిచివేతలనూ తిప్పికొడ్తూ దుయ్యబడ్తూ లావాలా సాహిత్యక్షేత్రాల్ని తడిపివేయడమేమిటని యథాతథవాదులూ, ఆధిపత్య స్థానాల్లో ఉన్న 'పెద్దలూ' 'గొప్పవాళ్ళూ' మథనపడటం జరిగింది.

ఉవ్వెత్తున లేచిన ఉద్యమ సాహిత్యపు అలలు ఇంకా పోటెత్తుతూనే ఉన్నాయి. సముద్రమున్నంత వరకూ అలలూ ఉంటాయి కదా. వెల్లువలా ముంచెత్తిన కొత్త దృష్టి కోణపు భావనలు ఇంకా సమాజానికి షాక్ ట్రీట్‌మెంట్‌లు ఇస్తూనే ఉన్నాయి. ఆ పోటెత్తే అలల్ని అనివార్యంగా ఆహ్వానిస్తున్నది పాఠకలోకం సాహితీ ప్రపంచం.

ఈ రోజున కథలూ, కవిత్వమూ రాసే రచయిత్రుల సంఖ్య పెరిగింది. అంతులేని బాధ్యతల నుండి కొంత వెసులుబాటు చేసుకొని అన్ని పనిముట్లూ పరికరాలూ పట్టిన వారి చేతులు కలాల్ని పట్టి అక్షరోన్ముఖం చేయడం, ఆయుధాలుగా ఝుళిపించడం జరుగుతున్నది.

ఎవరి ఇష్టాయిష్టాలూ ఆంక్షలు, ఆక్షేపణలూ, విమర్శలూ కన్నెర్రలూ పట్టించుకోకుండా పట్టిన పట్టు విడువకుండా ఈ తిరుగుబాటు కలాలు అవిశ్రాంత సైనికుల్లా పురోగమిస్తూనే ఉన్నాయి. నవశకానికి సరికొత్త మైలురాళ్ళను పాతుకుంటూ ప్రస్థానం కొనసాగిస్తూనే ఉన్నాయి.

రచయితలు కొందరు జరుగుబాటుకోసం రాస్తారు. కొందరు తిరుగుబాటుకోసం రాస్తారు. రచన కొందరికి ప్రవృత్తి అనీ ఇంకొందరికి వ్యావృత్తి అనీ మరికొందరికి వృత్తి అనీ అంటారు. పాత ఎంత బూజుపట్టినా, మురుగులేచినా సమర్థించేవారు కొందరు. అనునిత్యం కొత్తదనాన్ని ఆహ్వానిస్తూ ముందు నడిచేవారు కొందరు. రెండు వైరుధ్యాల నడుమ, విబేధాల నడుమ విషయాల మధ్యన ఘర్షణా సంఘర్షణా ఎప్పుడూ ఉండేవే. రచయితగానీ, మేధావి గానీ కళాకారులుగానీ సామాజిక స్పృహకలిగి ఉండటం వేరు, సామాజిక కార్యకర్తగా ఉండటం వేరు.

2003లో వచ్చిన డా. గీతాంజలి కథా సంపుటి 'బచ్చేదాని'లో 22 కథలున్నాయి. ఒక డాక్టరుగా, సామాజిక కార్యకర్తగా తన అనుభవాలను మథించి ఆమె ఈ కథల్ని ప్రకటించారు. ఇవన్నీ నిస్సహాయుల అభాగ్యుల కహానీలు.

'బోన్సాయ్' కథలో విద్యావంతురాలూ, ఉద్యోగిని అయిన ఊర్మిళ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాక ఊపిరాడకుండా ఉక్కిరిబిక్కిరవుతూ సృజనాత్మకమైన జీవితం కోసం తపిస్తుంటుంది. ఎంతో భరించిననంతరం తెగించి గడపదాటుతుంది. ఎంతో ఇష్టంగా ఇంట్లో భర్త తెచ్చి పెట్టిన 'బోన్సాయ్' తొట్టిని పెరట్లోకి తీసుకుపోయి తొట్టి పగలగొట్టి నేలలోనే నాటుతుంది. అది ఎదగడానికి వీలుగా, ఎంత అపురూపంగా చూసుకున్నా 'బోన్సాయ్' చెట్టును ఎదగనివ్వకపోవడమే జరుగుతుంది. ఎన్ని సౌకర్యాలు కూర్చినా ఇంట్లో బందీగా ఉండే ఇల్లాలు వెలుతురూ గాలీ స్వేచ్ఛకోసం తపిస్తుంది అని ఈ కథ నిరూపిస్తుంది.

'స్వయంప్రభ' మధ్యతరగతి కుటుంబంలోని యువతి. పెళ్ళి తరువాత భర్త ఇంట్లో గృహహింసకు గురవుతుంటుంది. తట్టుకోలేక పుట్టింటికి పోతే అక్కడ అందరి నిరాదరణ, మళ్ళీ భర్తింటికి తరిమేయడం... కానీ ప్రభ సాహసించి అట్లాంటి జీవితానికి స్వస్తి చెబుతుంది. ఒంటరిగా ఉండటానికి నిర్ణయించుకుంటుంది. దానికి తల్లి "ఒంటిగ ఎట్లుంటవే తల్లీ మేం లేకుండ, మగదిక్కులేకుండా' అని ఏడిస్తే 'మీరు తోడుగా ఎక్కుడున్నారే' కిరోసిన్‌పోసి తగలబెట్టజూపే మగని దగ్గరికే తోలే మీరు నాకు తోడా? అని నాకు మీరు భద్రతనివ్వరు 'నా భద్రతా సంరక్షణనేనే చూసుకుంట' ఎవ్వరి సహాయం అక్కరలేదని తల్లిదండ్రుల్ని, తమ్ముళ్నీ వెళ్ళగొడ్తుంది. అంతేగాదు వివాహం ద్వారా మాత్రమే లభించే సామాజిక గౌరవం, భద్రతా హోదా తనకవసరం లేదు, ఎంత మంది స్త్రీలు ఒంటరిగా బతకడం లేదు, తానొంటరికాదు

స్త్రీ ఉద్యమాల్లో తానొక విడదీయరాని భాగం, తాను చైతన్యవంతమైన సమూహంలో ఒకరు కాబట్టి తానొంటరి కాదనే వ్యక్తిత్వ స్పృహకి వస్తుంది. ఆమె భర్తనుండి విడాకుల కోసం కేసు దాఖలు చేసి ఒక ఆత్మవిశ్వాసంతో ఉజ్వలశక్తిగా స్వయంప్రభలా మారిపోతుంది.

స్త్రీలు ఒంటరిగా జీవించడం చుట్టూ ఎన్నోభయాలూ, అభద్రతలు సృష్టిస్తుంది కుటుంబం-సమాజం. అందరికీ ఆమోదమయిన ఒక ఆచారాన్నీ, బంధాన్ని ధిక్కరించడం సామాజిక సూత్రాల ధిక్కరణే. పెళ్ళి వద్దంటే పెద్ద ప్రమాదం, పెళ్ళినుండి బయటపడితే అదో సంక్షోభం బరితెగించిన స్త్రీలే అలా చేస్తారంటుంది, అందుకు తప్పక వారిని బహిష్కరించి శిక్షించాలని చూస్తుంది సమాజం. ఈ విషవలయాలను ఒంటరి స్త్రీ చైతన్య సమూహంలో కలిసిపోయిమాత్రమే ఛేదించగలదు. అని రచయిత్రి స్పష్టం చేయడం జరిగింది స్వయంప్రభ ద్వారా.

'కాటు' కథలో కుక్కలు కరిస్తే వాటిని తిట్టుకుంటూ వైద్యం చేయించుకునే వ్యక్తులు... ఆడవాళ్ళ శాడిస్టుభర్తలు కొట్టీ గాయపరచీ ఆ హింసలో గట్టిగా కొరకడం (కాటు) చేస్తే ఆ కాటును లోకం దృష్టినుండి కప్పిపెడ్తారు. ఆ బాధిత ఇల్లాలు పిల్లల భవిష్యత్ ఆలోచనల వల్ల ఎన్ని చిత్రహింసలైనా భరించేందుకు సిద్ధమయి ఆ హింసల్ని బతుకంతా ఓర్చుకునేందుకు సిద్ధంకావడం ఆమె అవసరం కన్నా సామాజికమైన కారణాలు ప్రభావితం చేస్తాయి అని అర్థం చేసుకోవాల్సి వస్తుంది.

స్త్రీజాతి నిస్సహాయ స్థితిమీద పడిన క్రూరమృగంలాంటి 'భర్తృత్వం', వ్యవస్థ జరిపే భీభత్సాల పరంపరలను చిత్రించింది 'ఖడ్గచాలనం' కథ. గర్భంలో ఉన్న పాప తన తల్లి, తండ్రిశాడిజం వల్ల అనుభవిస్తున్న హింసాత్మకమైన జీవితాన్ని చూసి భీతిల్లి కృంగిపోయి, రేపు పుట్టాక ఆడపిల్లగా తనకలాంటి బతుకువద్దని జననాంగాలు లేకుండా పుట్టి డాక్టర్లను విభ్రమకు గురిచేస్తుంది.

పుట్టిన పాప ఆరోగ్యంగా అంతా ఆడపిల్లలా సవ్యంగానే ఉంది. కానీ జననాంగం స్థానంలో మాత్రం 'కొనదేలిన గుచ్చుకునే కొమ్ములాంటి నిర్మాణం ఉంది'. అయితే పాప కళ్ళుమాత్రం మిలమిలా మెరుస్తున్నాయట. లోకాన్ని జయించిన సంతృప్తి ఆ కళ్ళ మెరుపుల్లో ప్రతిఫలిస్తున్నాయని రచయిత్రి చెబ్తుంది. ఖడ్గచాలనాలకి ఆడవాళ్ళు ఎందుకు ఇష్టపడాలి?

'వికలాంగుడు' కథ ఎంతోమంది భర్తల మానసిక వికలాంగత్వాన్ని పట్టి ఇస్తుంది. కిటికీ దగ్గర తిష్ఠవేసుకుని పక్కింటి అవిటివాడైన వ్యక్తికి అతని భార్య రోజూ చేసే సేవల్ని గొప్ప మానవత్వం నిండిన మనిషిలా పొగిడి 'రవి' తను లేచింది మొదలు రాత్రి పడుకునేదాకా కూర్చున్న చోటునుండి కదలకుండా తన భార్యకు ఆర్డర్లువేస్తూ చేయించుకునే చాకిరి సేవలు ఏ రకమైన మానవత్వం అని ఆత్మపరిశీలన మాత్రం చేసుకోడు. పక్కింటి వ్యక్తి వికలాంగుడే గానీ, శరీర భాగాలన్నీ సక్రమంగా ఉన్నా అన్ని రకాల చాకిరీలు చేయించుకునే నీవూ వికలాంగుడివే అని భార్య దులపరించినా బుద్ధి తెచ్చుకోకుండా, పక్కనే రోజూ భార్యను  రాచిరంపాన పెట్టే మరో మొగుడి తతంగం కనిపించే మరో కిటికీ దగ్గరికి తన స్థానం (కుర్చీ) మార్చుకుంటాడు. ఎందుకంటే భార్యను చంపుకుతినే వాడి కంటే తనెంత ఉన్నతుడో తన  భార్యముందు  నిరూపించుకునేందుకు.

'ఫేషియల్' కథ పెళ్ళైన తరువాత తన పెయింటింగ్ కళలని అటకెక్కించిన 'విశాల' కళ్ళకింది చారలు రేపిన సంచలనం. తన ముఖం తనిది కానట్టు తన కళ్ళకింది చారలు వికారంగా, ఒళ్ళు లావెక్కడం.. తీరుబడి లేకుండా అన్ని పనులూ చేసినా ఇంట్లో వాళ్ళ ఎకసెక్కాలు... బ్యూటీపార్లర్‌కి పోయి 'ఫేషియల్' చేయించుకున్నా మాయంకాని కళ్ళ కింది నల్ల చారలు రేపిన విచారం ఈ కథలో ప్రధానం.

తన పిల్లల స్కూల్లో వైస్ ప్రిన్సిపాల్‌గా తన చిన్ననాటి స్నేహితురాలు చేసిన జ్ఞానోదయంతో ఇంట్లో సంఘర్షణ పడి అందరినీ ఒప్పించి డ్రాయింగ్ టీచర్‌గా చేరిన 'విశాల' కళ్ళు మెరుస్తుంటే... తను బడికెళ్ళే తోవలో బ్యూటీపార్లర్‌లోకి వెళ్ళిన ఆడవాళ్ళను చూసి మనకు కావాల్సింది ఈ 'ఫేషియల్ కాదు' అని వారిని ఆపి చెప్పాలనిపిస్తుంది. ఆమెకు స్త్రీలకు కళ్ళలో మెరుపు గుండెల్లో సంతోషం ఇంటి చాకిరీలో పడి కొట్టుకులాడటంలో తమ కళల్నీ అస్తిత్వాన్నీ మర్చిపోవడం వల్లకాదు. తన కాళ్ళపై తను నిలబడి ఒక గుర్తింపు ఉన్న ఇష్టమైన పని చేస్తుండడం వల్లనే సంభవిస్తుంది అనే సత్యాన్ని 'ఫేషియల్' కథలో చిత్రీకరించడం జరిగింది.

'గుడ్డివాని చేతికర్ర' కథ విషాద సంగీతం వినిపిస్తుంది. అది మౌన సంగీతం. రాణి అనే యువతి గ్రాడ్యుయేటు, సంగీతకారిణి కానీ అతి  పేదరికం వల్ల వెంకటేశ్వర రావు అనే గుడ్డి సంగీతం టీచర్‌తో పెళ్ళి జరుగుతుంది. రాణి అతనికి అన్ని సపర్యలూ చేస్తుంది. బస్‌స్టాప్ వరకూ తీసుకెళ్ళి బస్ ఎక్కించి మళ్ళీ సాయంత్రం

బస్‌స్టాప్ నుండి తీసుకొస్తుంది. అతని చేతికర్ర ఎంతో రాణి అంతే. కానీ ఆమె కళ్ళు నిస్తేజంగా గాజుకళ్ళలా ముఖం విచారంగా మూగబోయిన కోయిలలా ఉంటుంది.

సాయంత్రం సంగీతం పాఠాలకు రచయిత్రి తన కూతురును వెంటబెట్టుకెళ్ళి అక్కడ గడిపినపుడు గ్రహిస్తుంది. రాణి ఇంట్లో మూగదానిలా పనులు చేస్తుంటే వెంకటేశ్వర రావు హుషారుగా పిల్లలకు హాస్యం జోడిస్తూ సంగీతం నేర్పిస్తూ ఉంటాడు. మధ్యలో రాణిని ఉద్దేశించి ఏమేవ్ ! ఓసేవ్ ! మూగిమొద్దా !... తగలడు ! అంటూ పిలిచి అవమానాలు చేస్తూ ఆర్డర్లు వేస్తుంటాడు. ఒకరోజు రాణి ఏడుస్తూ డాక్టరైన రచయిత్రి ఇంటి వస్తుంది. ఆమె ద్వారా రచయిత్రి అన్ని విషయాలు తెలుసుకొని బాధపడుతుంది.

ఒకటి పురుషాహంకారం మరోటి న్యూనతాభావం వల్ల వెంకటేశ్వరరావు రాణిని ఏమీ రాని ఏమి తెలియని మొద్దులా నిరూపించాలని ఆమెలోని శక్తి సామర్థ్యాలనూ సృజనాత్మకతను భరించలేక చంపేస్తుంటాడు. భార్యపై నిత్యం ఆధారపడుతూ... తనకూ బయిటి ప్రపంచానికీ ఏకైక వారధిలా తన నేత్రాల్లా మారి ప్రపంచాన్ని చూసేలా చేస్తున్న రాణిపై ఆధిపత్యం ప్రదర్శించడం అతనిలోని అభద్రతకూ వ్యవస్థ ఇచ్చిన పురుషాధిక్యతకూ నిదర్శనం. మాటలతోనే కాకుండా అతని చేతికర్రను కొరడాగా మార్చి ఆమెను కొట్టి బాధించడంలో అతని నేర్పరితనం ఏ సమాజం ఇచ్చిన వరం...?

ఒకవైపు స్త్రీ వ్యవస్థ ధర్మమా అని మానసికంగా శారీరకంగా బలహీనురాలూ వ్యర్థురాలిగా మారిపోతుంటుంది. ఆమె గుడ్డిదానిలాగే గుడ్డివాడైన భర్తను అనుసరిస్తూ వెలుగును వెతుకుతూ చేతిలో కర్రలా కనిపిస్తుంటుంది అని రచయిత్రి ఈ వివక్షతని ఏవగించుకుంటుంది. ఈ దృశ్యాలకు మూలమైన వ్యవస్థను నిరసిస్తుంది.

'రావిశాస్త్రి' రాసిన 'అడిగేరు' అనే కథాస్ఫూర్తితో వారి జన్మదినం అయిన జూలై 27న కోసం రాసిన కథ ఈ 'అడిగేరు' కథ.

అత్యాచారాలూ, అఘాయిత్యాలతో ఘోషిస్తున్న శోషిల్లుతున్న బలిజీవులైన బాధిత మాలికలూ, యువతులూ స్త్రీలూ అడుగుతున్న ప్రశ్నల శరాఘాతాలు ఈ 'అడిగేరు' కథా విషయం. రోజూ నిన్నా నేడూ రేపు మన ఇండ్లలో, పడకింటిలో,

తోటల్లో, తోపుల్లో పగలూ రాత్రీ చీకట్లో వెలుతుర్లలో, బడులూ, కళాశాలలో అంతటా స్త్రీలపై దాడులు, కత్తులూ, కొడవళ్ళూ, యాసిడ్‌లూ.. దాష్టీకాలు.. ఈ దారుణమారణప్రయోగాలు.. ఎందుకు? అని అడిగే ఆ అసంఖ్యాకపు నెత్తుటి గొంతుకల ప్రశ్నలవర్షం ఈ 'అడిగేరు' కథ.

'వంటింట్లో నులకమంచం' అనే కథలో ఇంటి ఇల్లాలిపై లేదా కోడలిపై బడి పారసైట్లలా బతికే సమస్త కుటుంబ సభ్యుల మానవ సభ్యతను ప్రశ్నార్థకం చేస్తుంది ఆమె నిస్సత్తువా నీరసం.

జ్వరం వచ్చినా మరేశారీరక ఇబ్బంది వచ్చి లేవలేకపోతున్నా ఉదయం కాఫీ టిఫిన్లు మొదలు రాత్రి తిండ్ల వరకూ అందరికీ అన్నీ అందించి సేవలు చేయాలనే మూర్ఖత్వం, అమానవీయత కుటుంబసంబంధాల్లో ఉండటం ఎంత విచిత్రం. ఇంతటి అసమాన విలువల్ని పాటిస్తూ మానవ సంబంధాల గురించీ కుటుంబ బాంధవ్యాల గురించీ ఆకర్షణీయమైన అద్భుత వ్యాఖ్యానాలు చేసే వారిని ఏమనాలి. వంటలు వండడాలు, వడ్డించడాలు... జ్వరంతోకునారిల్లిపోతూ కాసేపు విశ్రాంతికని వంటింటిలోకీ బెడ్‌రూమ్‌లోకీ తిరగలేక వంటింట్లోనే నులకమంచ మేసుకున్న ఇంటిబానిస 'సరళ' చెప్పిన జవాబు ఏమిటి? ఒక ఆడదానిపైబడి ఆమె శ్రమదోపిడీ చేస్తూ అందరూ హాయిగా జీవించాలా? ఎంత సిగ్గుచేటు.. పెళ్ళి పేరిట స్త్రీని ఇంటిబానిసను చేయడమేనా వైవాహిక దాంపత్య ధర్మం....? హృదయ విదారకంగా ఈ అంశాలను చిత్రించిన కథ 'వంటింట్లో నులకమంచం'.

'ఓసిఎన్' కథ ఏళ్ళతరబడి ప్రజా సంఘాల్లో పనిచేస్తూ ఎందరి బాధలనో పంచుకున్న అరుణక్క దారుణంగా ఆత్మహత్య చేసుకొని చనిపోతుంది. కారణం ఆమెకు వచ్చిన 'ఓసిఎన్' జబ్బు అంటే చేసిన పనినే మళ్ళీ మళ్ళీ చేయడం.

ఆ జబ్బు ఎందుకొచ్చింది. వంటింటి పని తప్పనిసరై ఆమెకు ఒత్తిడీ చికాకు కలగడం వల్ల. అనేక సభల్లో స్త్రీ సమానత్వం ఇంటిపనులూ వంటపనులూ మగవాళ్ళు పంచుకోవాల్సని మాట్లాడినా, స్త్రీలుగా అనివార్యంగా ఇంటికెళ్ళి సమస్త ఇంటిపనీ వంటపనీ నిర్వర్తించాల్సి రావడంలోని నిస్త్రాణత మానసిక సమస్యగా మారి ఓసియన్ జబ్బు బారినపడటం. అరుణక్కకు అంతిమ వీడ్కోలు చెప్పడానికి వెళ్ళిన మిత్రురాలు హైమ ఇదంతా ఆలోచిస్తూ మరో మిత్రురాలి ఇంటికెళ్ళకుండా

'ఇంటికెళ్ళాలి పిల్లలు ఆకలితో మాడుతుంటారని' ఇంటిదారి పట్టడం అది వంటింటిదారే అని రచయిత్రి వ్యాఖ్యానం చివరగా స్త్రీ ఏ రంగంలో తన సేవల్ని అందిస్తున్నా ఇంటి చాకిరీ బరువు నుండి మాత్రం విముక్తి కాలేకపోవడం గురించిన కఠిన వాస్తవాన్ని కడుపులో కాల్చేసేలా చెబుతుందీ కథ.

'మమ్మీ' కథ కూడా బాధాతప్త స్త్రీల అస్వేచ్ఛామయ జీవితాలకు సంబంధించినదే. ఇంటి నిర్ణయాధికారం ఏమీ లేకుండా అణిచివేయబడిన ఆమెతల్లి జబ్బున పడ్తుంది. ఇక్కడ తన పరిస్థితీ బండెడు ఇంటి చాకిరి నాన్‌స్టాప్ సేవలు. కోరికలకు ఇష్టాలకు విలువలేదు. జబ్బుపడిన తల్లి పాదాలకు గోరువెచ్చటి నూనెతో మసాజ్ చేస్తున్న ఆమెను కూతురు పదకొండేళ్ళ పూజిత ఏదో పుస్తకం చదువుతూ 'మమ్మీలేంటి..మమ్మీ అంటే మదర్ కదా ! పిరమిడ్స్‌లో మమ్మీలకు ఏవో లేపనాలు రాస్తారంట చాలాకాలం ఉండటానికి" అని అడుగుతుంది. దానికి ఆమె "పిరమిడ్స్ అంటే పెళ్ళైన ఆడవాళ్ళుండే మెట్టినిళ్ళమ్మా.... మమ్మీలంటే" ఆమె గొంతు వణుకుతుంది. చనిపోయిన మనిషి శవాన్ని చెడిపోకుండా సంవత్సరాల తరబడి ఉంచడానికి రసాయనాలూ మూలికలూ, లేపనాలో నూనెలూ పూస్తారు. ఒక్క ప్రాణం మాత్రం పోయలేరు" అని చెబుతూ ఎదురుగా కాంతి విహీనమైన కళ్ళతో ఉన్న తన తల్లిని చూపిస్తూ "ఈ ఇంట్లో అమ్మమ్మ మమ్మీనే.. మనింట్లో నేనూ మమ్మీని.. రేపు నువ్వు మమ్మీవే.. మనమంతా మమ్మీలమేనమ్మా" అని వణికే కంఠంతో చెబుతుంది.

ఈ వ్యవస్థ గృహస్థ జీవితంలో స్త్రీలకు కేటాయించిన స్థానం ఇచ్చిన రూపం, ఆదేశించిన హోదా.. ఎక్కించిన అందలం... పిరమిడ్స్‌లో 'మమ్మీలను పెట్టినట్లు ఇండ్లలో స్త్రీలను! ఎంతప్రేమ...ఎంత గౌరవం...

'చీకట్లోంచి చీకటిలోకి కథ వ్యక్తిలోని మానవతకూ చేతనకూ మధ్య జరిగిన ఘర్షణ వివరిస్తూ పలాయనత్వపు మనస్తత్వాన్ని చిత్రీకరించింది. హృదయంగా జాలీకరుణా ఉన్నా చొరవచేసి సహాయం చేయలేని సగటు మనిషి పడే వేదన ఈ కథాంశం. 'యాడి' బాలకార్మిక వ్యవస్థ కుక్కగోళ్ళకు చిక్కి గిలగిలలాడే పసిపిల్లల (పనిపిల్లల) మౌన కన్నీటి ఘోష వినిపస్తుంది.

ఇక 'బచ్చేదాని' (గర్భసంచి) కథకొస్తే పరదాల చాటున రగులుతున్న ముస్లిం స్త్రీల ఆక్రోశాలూ ఆర్తనాదాల కథనాలే... దుర్భరమైన పేదరికం. అందులో పురుషాధిక్యం. నిరంతరం పిల్లల్ని కనవలసిరావడం. మగపిల్లల్ని కనలేకపోతే భార్య

బలహీనమై యౌవనం సడలిపోతే మర్దలోగ్ మరో షాదీ చేసుకోవడం సర్వ సామాన్యమైన విషయాలు. ఇందులో రక్తస్రావాలూ గర్భసంచీల చుట్టూ తిరిగే జీవన్మరణ సమస్యలు.

"వీళ్ళకొచ్చే టెన్షన్లకు, హిస్టీరియాలకు నేనిచ్చే మజిల్ రిలాక్సెంట్లు, కాంపోజ్ గోలీలు, సెడేషన్లు సరిపోతయ్యా"? అని ముస్లిం స్త్రీల శరీరాలపైనే నడుస్తున్న ఒక నర్సింగ్‌హోంలో డాక్టర్ అయిన రచయిత్రి ప్రశ్నించుకుంటుంది? పన్నెండో కాన్పుకొచ్చిన బదరిమా పురిటినొప్పులు నడుమ "యా ఖుదా! ఔరత్‌కో యే బచ్చేదాని క్యోందియా" ! అని అరుస్తుంది. తనను ఉపయోగించుకొని ఒదిలేసి, మరోస్త్రీని పెళ్ళిచేసుకునే పన్నాగాలు పన్నుతున్న మర్ద్ మోసాన్ని అమాయకంగా నమ్ముతున్న జుబేదాకు తెలియజేసి ఇక ఆ మోసానికి తలాక్ ఇవ్వాలనే నిశ్చయంతో "ఉస్సే పహలే అప్నీ అమన్ సాఫ్ కర్నా చాహ్‌తీహై మేడం" అని ఒక బాధితురాలు. "ఆమె గర్భసంచీ సాఫ్ చేస్తుంటే మొత్తం వ్యవస్థను శుభ్రం చేస్తున్నట్లనిపించింది" అని రచయిత్రి అంటుంది.

ఒకరు బచ్చేదాని ఎందుకిచ్చావు అల్లా అనీ మరొకరు అబకేబార్ బచ్చాహోనా అనీ విలపిస్తుంటారు. మొత్తంగా ముస్లిం పేద స్త్రీల మనుగడలో హింస ప్రముఖస్థానం ఆక్రమించగా వారి వారి శరీరాలు యంత్రాలుగా చేసి వ్యవస్థ పురుషశాసనం ఏ విధంగా హింసిస్తుందో "బచ్చేదాని" ఒక బలమైన ప్రతీకగా ప్రతిబింబిస్తుంది.

"బచ్చేదాని"లోని ప్రశ్న, ఊరికి పోదాం భూదేవి, నీడ, అల్లాహో అక్బర్, కథ 2020, బచ్చిగాడు, సంటిది, బచ్‌డాచమన్ లాంటి కథల్లో మనిషి మనస్తత్వం మానసిక పొరల్లోకోణాల్లోని అనేక పార్శ్వాల్లోని ఒత్తిళ్లూ, స్వార్థాలూ వేదనలూ ప్రవర్తనలూ అన్ని హృద్యంగా చిత్రీకరించారు రచయిత్రి.

సుప్రసిద్ధ కథా నవలా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ కథా సంపుటి 'ఊటబాయి' చదివినప్పుడు కలిగిన తుదిలేని ఆవేదన 'బచ్చేదాని' చదువుతున్నప్పుడూ కలిగింది. ఈ నొప్పే ఆవేదన అపసవ్యతలూ అరాచకాలూ అన్నీ సమాజం స్పందించే మనసున్న రచయిత్రికిచ్చిన శిక్షలే. ఎందుకంటే తన ప్రమేయం లేకుండా విషాద దృశ్యాలనూ బాధల నిజ గాధల గాయాలనూ రచయిత్రిని కమ్ముకున్నాయి. అవి బాధితుల నుండి రచయిత్రికి సంక్రమించాయి. ఆ బాధల బరువునూ ఆ గాయాల నెత్తుటి తడినీ దింపేసుకుని కడిగేసుకునే ఒక మార్గం, ఒక వైద్యం ఈ రచనలు.

ఇవి చదివిన వారందరినీ ఇందులోని పాత్రల నిట్టూర్పులు కాలుస్తాయి, కన్నీళ్ళు దహిస్తాయి. వారివారి గాయాలు  పాఠకులకు సలపరింతగా మారుతాయి.

వ్యవస్థ పొట్ట విప్పితే బయటపడిన విషకీటకాలూ, క్రిములూ మనల్ని దిగ్భ్రాంతికి గురిచేస్తాయి. ఆ దుఃఖాలనూ కష్టాలనూ అక్షరీకరించిన రచయిత్రి వృత్తిరీత్యా వైద్యురాలు కావడం ఆమెకు బాధితులతో ఉన్న ప్రత్యక్ష సంబంధం స్పష్టంగా కనిపిస్తుంది ఈ కథల్లో. ఇంకా... గీతాంజలి డాక్టరు మాత్రమే కాదు సమాజంతో సంబంధం ఉన్న సామాజిక కార్యకర్త కూడా. అందుకే ఈ కథల్లో కొరివితో కాలిస్తే మంట పుట్టినంత యథార్థత, పాము కాటు వేస్తే కలిగినంత నొప్పిలాంటి వాస్తవికత అనుభూతై చదువరులను అతలాకుతలం చేస్తుంది. మనసులు కల్లోలితమవుతాయి. మనం మనుషులమా మృగాలమా లేదా అటూ ఇటూ సగం సగం నైజమున్న వాళ్ళమా అని ప్రశ్నించుకునేలా చేస్తుంది.

నాకీ గర్భసంచీ (బచ్చేదాని) ఎందుకిచ్చావు దేవుడా ! అని రోదించే స్త్రీలను తయారు చేసిన వ్యవస్థ ఎంత సిగ్గుపడినా తక్కువే. పశ్చాత్తాపం ప్రాయశ్చిత్తం లేనిదే ఏదీ మారదు. ఒక్కసారి మనుషులుగా మనమందరం మన 'బచ్చేదనీ'లను తడుముకుందాం. ఇది యంత్రం కాదు ఒక అద్భుత జీవసృష్టి కేంద్రం అని తెలుసుకుందాం. ఇంకా ఈ ఆధునిక సమాజంలోనూ పురుషుడు అనునిత్యం తనపురుషత్వాన్ని నిరూపించుకోడానికి తన ఆధిక్యత ప్రదర్శించుకోవాల్సిన అవసరం ఉందా? మేల్ ఐడెంటిటీకి నిర్వచనం బలప్రయోగమేనా? ఇంట్లోకి ఇల్లాలు వచ్చిందంటే మంచి పనిమనిషీ, సేవకురాలూ, బానిసా వచ్చినట్లేనా?

చాలా సామాన్యంగా శాంతంగా ఆధునికంగా అందంగా కనిపించే ఇండ్లలో జరుగుతున్నదేమిటి? ఏ పునాదుల మీద గృహవ్యవస్థ నిలిచి ఉన్నది? ఎవరిమౌనం.. ఎవరి సహనం? ఎవరిత్యాగం? ఎవరి నిస్సహాయం మీద ఇంటి శాంతి ఆధారపడి ఉన్నది? ఈ ఉరితాళ్ళూ...విషపానీయాలూ... కిరోసిన్ దహనాలూ..బలవన్మరణాలూ బలవంతపు ఆత్మహత్యలూ పిండహత్యలతో కలుపుకొని ఎంతమంది ఆడప్రాణులను ఈ లోకం నుండి అదృశ్యం చేస్తూ జీవించే హక్కును కాలరాస్తున్నారు. ఇది ఆదర్శ వ్యవస్థనా? ప్రశ్నలు! ప్రశ్నలు! ప్రశ్నలు! ఏవీ సమాధానాలు...?

# వ్యథాభరిత గాథలు - శ్రీ కె.కె. మీనన్ కథలు

డా॥ కె.ఎల్.వి. ప్రసాద్

మన తెలుగు సాహిత్యంలో, ఇతర సాహిత్యాల మాదిరిగానే, కథా ప్రక్రియకు ప్రత్యేక స్థానం ఉంది. ఒకానొకప్పుడు జోడు గుర్రాల మాదిరిగా కథ, నవల, ఒకదానిని మరొకటి అధిగమిస్తూ ఆయా కాలాల్లో ప్రాచుర్యం పొందాయి.

ఈనాడు కథ తన ప్రత్యేకతను నిలబెట్టుకుని, తన స్థానాన్ని సుస్థిరంగా పటిష్ఠం చేసుకుని, అగ్రస్థానంలో ఉండి వంద సంవత్సరాల వయస్సును మూటగట్టుకున్నది.

ప్రస్తుతం తెలుగువాడి ప్రశ్న – తెలుగు మాతృభాషగా బ్రతికి బట్టకడ్తుందా? అన్నది. ఈ ప్రశ్న ఉదయించిన వారికి, 'తెలుగు కథ' పై కూడా యిటువంటి అనుమానం రాకమానదు. కారణం తెలుసుకుని, 'దిద్దుబాటు' మార్గంలో పయనిస్తే, తెలుగు భాషకు ప్రాచీన హోదాతో పాటు ఆధునిక హోదా కూడా సంక్రమిస్తుంది. తెలుగు కథకు వెయ్యిసంవత్సరాల వయస్సును మన తెలుగువాడు చూడకపోతాడా?

మనిషి ప్రతి విషయంలోనూ ఆశాజీవిగా బ్రతకవలసిందే ! అలా భవిష్యత్తుల మీద ప్రగాఢ విశ్వాసము, గట్టి నమ్మకము ఉన్న వాళ్ళు భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలను దృష్టిలో ఉంచుకునే మనకు కథా సాహిత్యాన్ని అందించారు. గొలుసుకట్టులా యీ కథారచన, తరాన్ని మరోతరం అందుకుని, ముందుకు కొనసాగవలసిందే !

ఈ రోజున 'కథ' ఒక మహావృక్షమై భిన్నమైన శాఖోపశాఖలతో విస్తరించుకుని ఉంది. కుల, మత, ప్రాంత, వర్గ, మాండలిక, రంగులు పులుముకున్న నేటి తెలుగు కథ. అన్ని వర్గాల మూలాలను వెతికి, వారి సంస్కృతి, సంప్రదాయం, భాష, వంటి ప్రధాన అంశాలను బయట ప్రపంచానికి అందించగలుగుతున్నాం.

ఒకప్పుడు కథలు వ్రాసే వాళ్ళు తక్కువగా ఉండేవారు. ఆ రోజుల్లో పత్రికల సంఖ్య కూడా కాస్త తక్కువగానే ఉన్నా, పత్రికలు చదివేవాళ్ళ సంఖ్య మాత్రం బాగానే ఉండేది.

కాని తరువాత కాలక్రమంలో జనాభాకు సరిపడినంత మంది లేదా పాఠకుల నిష్పత్తికి సరిపడ రచయితల నిష్పత్తి లేకపోవడం కొంచెం బాధాకరమైన విషయమే!

అదృష్టవశాత్తు కథను అందించగలిగే మాధ్యమాలు ఈ రోజున మనకు లెక్కకు మించి ఉన్నాయి. కథ చదివేవాళ్ళ సంఖ్య నిజంగా తగ్గితే, మనకు అందుబాటులో ఉన్న యిన్ని పత్రికలు బ్రతికి బట్టకడతాయని నేను అనుకోను.

ఇక కథారచనకు సంబంధించి అయితే 'కథ' బాల్యంలో బొమ్మలు, అమ్మలు చెప్పగా విన్నవి, ఆ తర్వాత అక్షరజ్ఞానం ప్రాప్తించిన పిదప, రచయి(త్రు)తల ద్వారా, 'చందమామ' వంటి మాసపత్రికల మాధ్యమంగా, ఆ తర్వాత రచయితలు అందించిన కథ, రేడియో, టి.వి. దిన, వార, పక్ష, మాస పత్రికల ద్వారా, ఇప్పుడు ఆధునికంగా 'నెట్ మ్యాగజీన్స్' ద్వారా పాఠకుడికి, లేదా శ్రోతకు అందుతున్నవి. బాల్యంలో, 'అనగా... అనగా' అన్న కథలు విన్నవాళ్ళందరూ, ఆ తర్వాత కథలు వ్రాశారో లేదో తెలీదు. ఊహ తెలిసినప్పటి నుంచి పుంఖాను పుంఖాలుగా కథలు చదివినవాళ్ళందరూ కథలు వ్రాయడానికి సాహసించి ఉండకపోవచ్చు. పండిత కుటుంబంలో పుట్టి నిత్య, సాహిత్య సమావేశాల నడుమ పెరిగి పెద్ద వాళ్ళు అయిన వాళ్ళందరూ కథలు వ్రాసే ప్రయత్నం చేసి వుంటారని కూడా నేను అనుకోను ! సరస్వతీ కటాక్షం కలిగి ఉండి, పదుగురికి పాఠాలు చెప్పిన వారందరు కథా రచన జోలికి పోయివుండకపోవచ్చు.

వీటన్నింటికి భిన్నమైన వాతావరణంలో ఒక రైతు బిడ్డగా పుట్టి, పెరిగి, విద్యావంతుడయి, తన పాఠశాల స్థాయి నుంచి కూడా కలానికి పదునుపెట్టి, ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోదగ్గ కథలు వ్రాసి, తెలుగు పాఠకలోకానికి అందించిన కథా రచయిత శ్రీ కె.కె. మీనన్.

మీనన్ గారి గురించి పూర్తిగా తెలియనివాళ్ళు ఆయన పేరు వినగానే, సహజంగానే ఆయనను ఒక మళయాళీగా భ్రమపడతారు. కాని వాస్తవానికి, ఆయన నూటికి నూరుశాతం కోస్తా (తూ.గో.జి.) ప్రాంతానికి చెందిన తెలుగువాడు.

ఆ రోజుల్లో, కేరళ రాష్ట్రానికి చెందిన గొప్ప కమ్యూనిష్టు నాయకుడి పేరును, వారి తండ్రి స్వర్గీయ కానేటి తాతయ్య గారు మీనన్ గారికి నామకరణం చేయడం జరిగింది. నిజానికి ఆయన పుట్టినప్పుడు పెట్టిన పేరు కానేటి కృష్ణమూర్తి.

మీనన్ గారు తన హైస్కూలు (జిల్లా పరిషత్ హైస్కూల్ - రాజోలు) జీవితం నుంచి కూడా, కథల పట్ల ఆసక్తి చూపడం కథలు వ్రాయాలనే కోరిక కలగడానికి గల కారణం, ఆయన అప్పటికే గొప్ప పరిశీలనాశక్తిని కలిగి వుండడం. సమాజంలో ఎదురుపడ్డ సమస్యలకు తక్షణమే స్పందించడం వాటికి సరయిన పరిష్కారమార్గాలు కనుగొనే రచనలు చేయడం వంటి లక్షణాలను కలిగి వుండడం వల్ల, కథను మాధ్యమంగా చేసుకొని, తన అభిరుచులను, అభిప్రాయాలను, బయట ప్రపంచానికి వెళ్ళబుచ్చడం నేర్చుకున్నారు.

మీనన్ గారు రాజోలు హైస్కూలులో వుండగా కథలు వ్రాసినా, 'వెస్ట్ గోదావరి'లోని భీమవరం కళాశాల విద్యార్థిగా కథలు వ్రాసినా, నాగపూర్‌లోని 'సాగర్' యూనివర్సిటీలో ఎం.ఎ. (ఎకనామిక్స్) చదువుతుండగా కథలు వ్రాసినా, అసలైన సిసలైన కథకుడిగా నిలదొక్కుకున్నది, ఎ.జి. ఆఫీస్ (హైదరాబాద్) ఉద్యోగంలో చేరిన తరువాతే !

ఎ.జి. ఆఫీసులో పనిచేస్తున్న తెలుగువాళ్ళు, మాతృభాష పట్ల, తెలుగు సాహిత్యం పట్ల అభిరుచి కలిగినవారు, కవులు, రచయితలు, వ్యాసకర్తలు ఏర్పరచుకున్న సాహిత్యసంస్థ 'రంజని'.

'రంజని'కి అప్పట్లో శ్రీ ఇసుకవల్లి దక్షిణామూర్తి గారు అధ్యక్షులుగా వుండేవారు. మీనన్ గారిని అసలయిన, సిసలైన కథకుడిగా గుర్తించిన తొలి రచయిత ఆయనే అని నా అభిప్రాయం. దక్షిణామూర్తి గారు స్వయంగా మంచి కథా రచయిత. మూర్తి గారి మిత్రుత్వంతో రంజనికి చేరువయి, రంజని సభ్యుడిగా, ఉపాధ్యక్షుడిగా, ఆ పిదప అధ్యక్షుడిగా, 'రజతరంజని' వంటి సాహిత్య ప్రత్యేక సంచికను తీసుకురావడంలో, ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తిగా, రంజని సంస్థతో మమేకమై గొప్ప గొప్ప సాహితీవేత్తలతో పరిచయం కావడానికి దారి తీసింది.

శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ శీలావీర్రాజు, గరిమిళ్ళ రామమూర్తి, డి. వెంకట్రామయ్య, ప్రముఖ చిత్రకారుడు రచయిత శ్రీచంద్ర, దేవిప్రియ, డా॥ శివారెడ్డి, జీడిగుంట రామచంద్రమూర్తి, కాళీపట్నం రామారావుమాష్టారు, వాకాటి పాండురంగారావు గారు, నాళేశ్వరం శంకరం వంటి సాహితీ ప్రముఖులతో స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. వీరందరు కూడా మీనన్‌గారిని కథారచయితగా ప్రోత్సహించినవారే !

అయితే, అందరిలోనూ, మీనన్‌గారికి అత్యంత సన్నిహిత మిత్రుడు శ్రీ శీలావీర్రాజు గారు, సందర్భం వచ్చినప్పుడల్లా మీనన్ గారి నోటి నుండి వచ్చే మాట వీర్రాజు గారి పేరే.

కె.కె. మీనన్ గారి కథా ప్రస్థానంలో రెండే రెండు కథా సంపుటాలు వెలుగుచూచాయి. సంపుటీకరణ చేయని కథలు చాలా మిగిలేవున్నాయి. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులవల్ల, మరో మొదటి కథా సంపుటి 'ఇది స్ట్రీకింగ్ కాదు', రెండవది 'పులికూడు'. మొదటిది ప్రసిద్ధ చిత్రకారుడు శ్రీ బాపు గీసిన ముఖచిత్రంతోనూ, రెండవది కవి, రచయిత వ్యాసకర్త, ఉపన్యాసకుడు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అన్నింటికీ మించి చిత్రకారుడు శ్రీ శీలావీర్రాజు గారు రూపొందించిన ముఖచిత్రంతోను వెలువడ్డాయి.

కథకుడిగా కె.కె.మీనన్ పేదల పక్షపాతి. వామపక్ష భావాలను నరనరాన జీర్ణించుకున్న వ్యక్తి. తను పుట్టి పెరిగిన ప్రాంత వాతావరణము, అక్కడి ప్రజలు, వారి సమస్యలు ముఖ్యంగా పేదరికం, దళిత జీవితం, అన్యాయాలు, అక్రమాలు, రైతు కూలీల అగచాట్లు, వారు చేపట్టిన ఉద్యమాలు మొదలైన అంశాలను నేపథ్యంగా తీసుకొని కథా రచనలు చేశారు. అందుచేతనే ఆయన కలం నుండి జాలువారిన ప్రతి కథలోనూ, ఈ సువాసనలు వెదజల్లుతుంటాయి.

మీనన్ గారి కథలు చదివిన ఒక ప్రముఖ సాహితీవేత్త 'కె.కె. మీనన్, దళిత కథలు కూడా బాగా వ్రాయగలడు' అని, నా ముందు వ్యాఖ్యానించాడు. ఆయనకు కాదు, మీనన్‌గారి గురించి విన్న చాలా మందికి ఆయనవి 'దళిత మూలాలు' అన్న సంగతే తెలీదు.

కె.కె. మీనన్ కథా రచనా వ్యాసంగం ప్రారంభించేనాటికి, కథా రచయితలు వివిధ వర్గాలుగా విడిపోయి రచనలు చేసినవారు కాదు ! అందుచేతనే యీయన కూడా అలాంటి వర్గాల జోలికి పోయినట్లు లేదు.

క్లుప్తత, స్పష్టత, సమస్య పరిష్కారం, మీనన్ గారి కథల ముఖ్య లక్షణాలు. ఎంత పెద్ద కథాంశాన్నయినా, తక్కువ పరిధిలో మొత్తం కథను దాని సారాంశాన్ని పాఠకుడికి అందించడంలో ఆయన సిద్ధహస్తుడనే చెప్పాలి. అందుకే ఆయన కథల రుచి అన్ని వర్గాల పాఠకులకు అందింది.

పేదరికం గురించి పరాకాష్ఠగా ఆయన వ్రాసిన కథ 'ఇది స్ట్రీకింగ్ కాదు' స్ట్రీకింగ్ అంటే నగ్నంగా పరిగెత్తడం. మగాడు నగ్నంగా పరిగెడితే, ఆ ఒక్క మగాడు మాత్రమే సిగ్గుపడాలి. కాని యౌవనంలో మిసమిసలాడుతున్న ఒక స్త్రీ మూర్తి రోడ్డు మీద నగ్నంగా పరిగెడ్తుంటే, సర్వ సభ్యసమాజము సిగ్గుపడవలసిందే కదా! ఇక్కడ పరిస్థితికి గల కారణాలు వెతకాలి. ఒక ఇంట్లో పనిచేసే పనిమనిషి ప్రియుడు, తను దొంగిలించిన ఇంటి యజమానురాలి చీరను బహుమతిగా యిస్తే, ఒకానొక రోజున పనిమనిషి ఆ చీరతో ముస్తాబయి పనికి వెళ్తుంది. తను పోగొట్టుకున్న చీరను గుర్తించిన ఆ యజమానురాలు, దొంగతనానికి శిక్షగా పనిమనిషి బట్టలు వూడదీయించి బయటకు నెట్టిస్తుంది. అప్పుడు ఆ పనిమనిషి నిస్సహాయురాలై నడిరోడ్డు మీద నగ్నంగా పరిగెడుతూ ఇంటికిచేరుకుంటుంది. తోటి స్త్రీ అన్న కనీసమైన జాలి కూడా చూపించకుండా, యజమానురాలు ప్రవర్తించిన తీరు జుగుప్సావహం. ఇది ఆమె కేవలం తను ధనిక వర్గాల ప్రతినిధి అన్న విషయాన్ని తెల్పుతుంది. ఆ యజమానురాలి దుర్మార్గపు ప్రవర్తనను, యీ కథలో మీనన్ గారు చిత్రీకరించిన తీరును చదివితే, హృదయం జ్వలించి పనిమనిషిపట్ల, అపారమైన సానుభూతి కలుగుతుంది. ఈ కథ చదివినవాళ్ళు, యిది సాధ్యమా? అని ముక్కు మీద వేలు వేసుకోక్కరలేదు. ఇది నిజంగా జరిగిన కథ. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని ఆధారం చేసుకుని గొప్ప కథగా మలిచారు మీనన్ గారు.

ఈ కథ చాలామంది పాఠకులతో పాటు, అనేకమంది చేయి తిరిగిన కథా రచయితల ప్రశంసలను కూడా అందుకుంది. ఆ తర్వాత యీ కథను, ప్రసిద్ధ హిందీ ప్రొఫెసర్, రచయిత అనువాదకులు అయిన డా. భీమ్‌సేన్ నిర్మల్ (ఉస్మానియా యూనివర్సిటీ) హిందీ భాషలోనికి అనువాదం చేసి, ఒక మంచి తెలుగు కథను హిందీ పాఠకులకు అందించారు.

పేదరికం ఎక్కడ ఉందో, అక్కడ కమ్యూనిజం అక్కడ పుట్టుకొస్తుంది. పెరుగుతుంది. పోషించబడుతుంది. అందుచేతనే కమ్యూనిస్టు పార్టీ బీదవాళ్ళ పార్టీగా ప్రచారంలోనికి రావడమే కాదు, అందులోని సాధారణ కార్యకర్తలందరు, పేద, దళిత వర్గాలవారే అధికంగా వుంటారు. మీనన్ గారు పుట్టిన ఊరు కూడా యీ వాతావరణాన్నే కలిగి వుండేది. పైగా మీనన్ గారికి జన్మనిచ్చిన తండ్రిగారు, స్వర్గీయ కానేటి తాతయ్యగారు, అప్పట్లో మంచి కమ్యూనిష్టు కార్యకర్త. అప్పటికి యింకా

కమ్యూనిస్టు పార్టీ ముక్కలు చెక్కలు కాలేదు. ఇంట్లోను, బయట, యిటువంటి వాతావరణంలో పెరిగిన మీనన్ గారికి లెఫ్టిస్ట్‌భావాలు బాగ వంటపట్టినవి. దొరతనం, దోపిడి, అన్యాయం, వంటి విషయాలపట్ల ఆయన మనస్సు నిత్యం వ్యథ చెందుతుండడమే గాక, నాస్తికత్వ లక్షణాలు కూడా ఆయనలో చోటు చేసుకున్నాయి. అందుచేతనే అనుకుంటా ఆయన కలం నుండి "బడిని తన్నిన గుడి అనే పాము కథ" రాగలిగింది.

ఈ కథ నేపథ్యం కూడా మీనన్‌గారి స్వస్థలం అయిన కోనసీమకు సంబంధించినవే. ఆయన తూర్పుగోదావరి జిల్లా, నాటి రాజోలు తాలూకా, నేటి మల్కీపురం మండలం, 'దిండి' అనే గ్రామంలో స్వర్గీయ కానేటి తాతయ్య, వెంకమ్మ దంపతులకు జ్యేష్ఠ పుత్రుడిగా జన్మించినా, ప్రక్క గ్రామమైన రామరాజులంక (అమ్మమ్మ ఊరు) కు చెందిన, పెద్దమ్మ పెద్దనాన్నలు స్వర్గీయ గోనమండ సత్తెమ్మ, గోనమండ జేమ్స్ గార్లకు దత్తపుత్రుడిగా వెళ్ళినారు. ఆ రామరాజులంక గ్రామానికి చెందిన కథనమే, "బడిని తన్నిన గుడి అనే పాము కథ". రామరాజులంక గ్రామం అంచున దళితుల ఇళ్ళు అధికంగా ఉండేవి. ముఖ్యంగా 'మాదిగ' వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసించేవారు. ఇతర వర్గాల నుండి దూరంగా విసిరేసినట్లు ఉండేవి ఆ ఇళ్ళు. కాని, వారి చుట్టుతా ఉన్న భూములు మాత్రం పెద్ద పెద్ద భూస్వాములవి. అక్కడ అధికారులు, కొంత ప్రభుత్వ స్థలాన్ని సేకరించి, అక్కడి పేదలకోసం, ఒక ప్రాథమిక పాఠశాలను మంజూరు చేయించారు. విషయం తెలిసిన అగ్రకులాలవారికి యీ ప్రతిపాదన నచ్చలేదు. ఆ పేదపిల్లలు చదువుకుని బాగుపడడం అసలు యిష్టం లేదు. అందుచేత అతి కొద్దికాలంలోనే, పాఠశాలకు కేటాయించిన స్థలంలో శ్రీ సుబ్రమణ్యస్వామి వారు ప్రత్యక్షమయినట్లుగా ప్రచారం చేసి, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలను బాగా ఆకర్షించగలిగారు. ప్రతి రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు అక్కడికి తండోపతండాలుగా వచ్చి పూజలు చేయడం ప్రారంభించారు. ఇంకేముంది, పెద్దలు తలుచుకుంటే జరగనిదంటూ ఏముంటుంది? అనతి కాలంలోనే అక్కడ దేవాలయం వెలసింది బడి హుష్‌కాకి ! అయింది. దాని గురించి ఎవ్వరు పెదవి విప్పింది లేదు. ఈ కథను ఎంతో బాధతో, చాలా వ్యంగ్యంగా రచించారు కె.కె. మీనన్ గారు.

అన్యాయాలను, అక్రమాలను తట్టుకోలేక చలించిపోయి, అధికంగా స్పందించే గుణం గల మీనన్ గారు కథలుగా వ్యక్తం చేసిన సంఘటనలు కోకొల్లలు. దానికి ఒక మంచి ఉదాహరణ 'ఎర్రతికోణం' అనే కథ. మీనన్ గారు కోస్తాప్రాంతం వాడయినా, స్థిరనివాసం ఏర్పరచుకున్నది హైద్రాబాద్ (కాకతీయనగర్)లో నైనా ఈ కథ నేపథ్యం మాత్రం, వరంగల్ జిల్లా, మహబూబాబాద్ పట్టణానికి చెందినది. 1982 నుండి 1994 వరకు, ఆయన రెండవ సోదరుడి ద్వారా యీ ప్రాంతంలో సత్సంబంధాలు ఉన్నప్పటికి, కథా కాలం అంతకముందు కొన్ని సంవత్సరాలనాటిది.

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు స్వర్గీయ కామ్రేడ్ కందకట్ల నాగభూషణం గారి సోదరుడు స్వర్గీయ కందకట్ల మందేశ్వర్రావు గారు, మహబూబాబాద్ పట్టణానికి దగ్గరలోని బలపాల అనే గ్రామంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసేవారు. అందున సాహిత్యాభిలాషి, మంచి చిత్రకారుడు కూడా ! దూరపు బంధువు, మిత్రుడు అయిన మందేశ్వర్రావు గారిని కలవడానికి అప్పుడప్పుడు మీనన్ గారు హైద్రాబాద్ నుండి బలపాల గ్రామానికి వెళ్తుండేవారు. అక్కడ ఒక మతిస్థిమితం లేని వ్యక్తికి జరిగిన అన్యాయం గురించి, హృదయవిదారకమైన సంఘటనను, కథగా మలిచారు మీనన్‌గారు.

కుటుంబసంక్షేమ కార్యక్రమాలు, చాలా పెద్ద ఎత్తున ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. ఆ కార్యక్రమం మీద ఆనాటి ప్రధానమంత్రి ద్వితీయ పుత్రుడు శ్రీ సంజయ్ గాంధీ ప్రభావం కూడా చాలా ఉండేది.

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో ఒక మతిస్థిమితం లేని వ్యక్తి రైల్వే ఫ్లాట్‌ఫారం మీద అటు యిటు తిరుగుతూ, రేడియోలో వార్తలు చదువుతున్నట్లుగా చదువుతుండేవాడు. భిక్షాటనతో బ్రతుకు కొనసాగించేవాడు. ఒకానొక రోజున అతను ఆరోగ్యకార్యకర్తల దృష్టిలో పడ్డాడు. అంతే వాళ్ళ టార్గెట్‌లో సంఖ్యను పెంచుకొనడానికి ఉపయోగపడ్డాడు. బలవంతంగా, అతనికి యిష్టం లేకపోయినా 'వేసెక్టమీ' ఆపరేషను చేయించారు. వేలిముద్ర వేయించుకొని, వాళ్ళ భాగం వాళ్ళు నొక్కిపట్టి, మిగతాసొమ్ము అతని చేతిలో పెట్టి బయటికి పంపించారు. ఆ రకంగా అతను ఒక బీటు కానిస్టేబుల్ దృష్టిలో పడ్డాడు. ఇంకేముంది, కారణం లేకుండానే లాఠీకి పనిపెట్టి అతని దగ్గరి డబ్బులు గుంజుకున్నాడు. ఆపరేషన్ కుట్టు వూడి

రక్తస్రావంతో, బాధతో మూలుగుతూ బాధితుడు ఒకచోట కుప్పకూలతాడు. ఇది కథలోని సారాంశం. ఈ కథ చదువుతుంటే కళ్ళ నుండి నీళ్ళు ఉబికి వస్తాయి. అంత గొప్పగా ఆనాటి కుటుంబ సంక్షేమ కార్యక్రమములోని అవకతవకల గురించి అన్యాయాలను గురించి, లంచగొండితనం గురించి, అనవసర పోలీసు జులుం గురించి, 'ఎర్ర త్రికోణం' కథలో మీనన్‌గారు చర్చించారు.

కృష్ణమీనన్ గారి కథల్లో ఎక్కడా పెద్దగా వర్ణనలు కన్పించవు. అనవసరపు సాగతీతలు వుండవు. చెప్పదలచుకున్న అంశాన్ని స్పష్టంగా, పఠనీయంగా, ఆసక్తిగా, క్లుప్తంగా చెప్పడమే ఆయన కథల్లోని ప్రత్యేకత. స్థలాభావం వల్ల యిక్కడ మచ్చుకి కొన్ని కథలను మాత్రమే తీసుకుని ఆయన కథా రచనా విధానం గురించి క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. ఆయన ప్రేమకథలు కూడా వ్రాశారు. ప్రతి కథలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఆయన స్వంతం.

శ్రీ కానేటి కృష్ణమీనన్, గొప్ప రచయితఅయినప్పటికీ, ప్రచారానికి యిష్టపడని వ్యక్తి కావడం వల్ల ఆయన ప్రతిభ పదిమందికి చేరకపోవడంలో పెద్దగా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

అవార్డులు, సన్మానాల పట్ల పెద్దగా మక్కువలేని యీ కథా రచయిత, నాటి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి, స్వర్గీయ పేర్వారం జగన్నాథం గారి హయాంలో కథల విభాగంలో పురస్కారం అందుకొనక తప్పలేదు.

పన్నెండేళ్ళ క్రితం. ఏ.జి. ఆఫీసులో పదవీవిరమణ చేసిన మీనన్ గారు. కథా రచనకు కూడా రిటైర్‌మెంట్ యిచ్చారు. "మీరు కథలు ఎందుకు వ్రాయడం లేదు" అని ఒకానొక సందర్భంలో యీ వ్యాస రచయిత ప్రశ్నించినపుడు "నా కంటే యిప్పుడు క్రొత్తగా వ్రాస్తున్నవాళ్ళు చాలా బాగా కథలు వ్రాస్తున్నారు. ఇప్పుడు యిక నేను వ్రాయకపోవడమే మంచిది" అని సెలవిచ్చారు.

ప్రస్తుతం అనారోగ్యం వల్ల మీనన్ గారు అసలు కలం పట్టుకోలేని స్థితిలో ఉన్నారు. వందేళ్ళ కథా సాహిత్య చరిత్రలో కె.కె. మీనన్ గారు కూడా ఒక ముఖ్య పాత్ర కావడం తెలుగువాళ్ళ అదృష్టం.

# ముదిగంటి సుజాతారెడ్డి "మింగుతున్న పట్నం" విశ్లేషణ

డా॥ వేలూరి శ్రీదేవి

రచయితలు కొందరు కళాశాలలో విద్యను ఆర్జించి మేధావులై తమ మేధా సంపత్తితో రచనలు సాగిస్తారు. మరికొందరు సమాజంలోని మనుషుల జీవితాలను చదివి వివేకవంతులై ప్రజల స్థితిగతులను తమ రచనల్లో చూపిస్తారు. కాని అతికొద్ది మంది మాత్రమే చరిత్రను కళాశాలలో పఠించి, వర్తమానాన్ని సమాజం ద్వారా అధ్యయనం చేసి ఈ రెండింటిని ఒక దానినొకటి సమన్వయపరుస్తూ నేటి సమాజస్థితిని, భవిష్యత్ కాలాన్ని ఊహించి కలిగే ఉపద్రవాలను ముందుగానే హెచ్చరిస్తూ సమాజాన్ని జాగృతం చేయడానికి తమ రచనలను సాగిస్తారు. మొదటి రెండింటిలో ముదిగంటి సుజాతారెడ్డి గారికి స్థానంలేదు.

ముదిగంటి గారి గురించి కొత్తగా పరిచయం చేయాల్సిందేమీ లేదు. తెలంగాణా కథల సామ్రాజ్యంలో ఆమె ఒక సామ్రాజ్ఞి. విద్యాధికురాలు. ఉపాధ్యాయ వృత్తి. వర్తమాన సమాజాన్ని తన రచనల్లో ప్రతిబింబింపజేయడం ప్రవృత్తి.

"మింగుతున్న పట్నం" సుజాతారెడ్డి గారి రెండవ కథల సంపుటి. ఈ కథా సంకలనంలోని కథలలో ఆమె రచన అంతా పక్షపాత ధోరణిలో సాగుతుంది. ఆ పక్షపాతమంతా పేదలపై, వారి నిస్సహాయతలపైన మాత్రమే. గ్రామీణ యాసను, తెలంగాణా మాండలికాన్ని అవసరమైనంత మేరకు తన రచనల్లో సమర్థంగా ఉపయోగించింది. స్త్రీ సహజమైన కరుణ రసాన్ని, మానవతా విలువలను సంపుటి అంతా గుమ్మరించింది. సంపుటి ఆసాంతం చదివిన తర్వాత కళ్ళు చెమర్చక మానవు. హృదయం అదో రకమైన భావనకు లోనుకాక తప్పదు.

మింగుతున్న పట్నం కథా సంపుటిలోని "మనసులోని మాట" లను గమనించినట్లైతే" నాకు గత చరిత్రేకాదు. నడుస్తున్న చరిత్ర కూడా అభిమాన విషయమే. చరిత్ర గతిలోని లోతులను, మెలికలను పరిశీలించడం నాకిష్టమైన పని. అందుకే నా కథలు నడుస్తున్న చరిత్రను చెపుతున్నాయి". అంటూ ఆమె వర్తమాన విషయాలను తాను ఏ విధంగా చిత్రించదల్చుకుందో సగర్వంగా చెప్పుకుంది.

"మనసు గొడవ" దేవులపల్లి కృష్ణశాస్త్రిదైతే "మనుషుల గొడవ" శ్రీశ్రీది. అన్యాయాన్ని ఎదిరించేవాడు నాకు ఆరాధ్యుడు అన్న "నా గొడవ" కాళోజీదైతే మమతానురాగాల సంఘర్షణలే ముదిగంటి గారి మింగుతున్న పట్నం.

మింగుతున్న పట్నంలో సాధారణంగా బయటికి కనిపించే విషయం జనజీవనాన్ని (గ్రామీణ – పట్టణ) పట్నం ఏ విధంగా ఛిద్రం చేస్తుందో సూక్ష్మం నుంచి మోక్షం వరకు విభిన్న కోణాల్లో వివరిస్తుంది. అయితే అంతర్గతంగా కనిపించే మరో సూత్రం కుటుంబ వ్యవస్థ ముఖ్యంగా స్త్రీ జీవితం చిన్నాభిన్నమైన తీరం దాదాపుగా ప్రతి కథలో స్పష్టంగా కనిపిస్తుంది. రచయిత స్త్రీ కావడం వల్ల వారి జీవితాలను అంతలా అర్థం చేసుకుందేమో అందుకే అంత సమర్థంగా, సమగ్రంగా వారి జీవితాలను చిత్రీకరించింది.

ముదిగంటి గారు స్త్రీ రచయితే గాని స్త్రీవాద రచయిత మాత్రం కాదు. ఈ విషయాన్ని కూడా ఆమె "మనసులో మాట"లో లీలగా చెపుతుంది. మనుషులలోని మానవత్వాన్ని కరుణరసభరితంగా, ఆర్ద్రతా పునీతంగా పాఠకులకు అందించడంలో ఆమెది అందెవేసిన చేయి. అదే ఆమె బలం. బలహీనత కూడా.

ఈమె రచనల్లో ప్రతి అక్షరం వెనుక ఒక ఆవేదన ఉంది. ఆ ఆవేదన వెనుక ఒక ఆశయం కనబడుతుంది. ఆ ఆశయం తనచుట్టూ ఉన్న పరిస్థితులపట్ల ఆమెకు గల అవగాహనతో ఏర్పడింది. ఆమె అవగాహనాస్థాయిని మనం చేరుకోగలిగినప్పుడు మన చుట్టూ ఉన్న సమాజాన్ని మరింత అర్థవంతంగా అర్థం చేసుకోగలుగుతాం. అందుకు ఆమెను తడారిన కళ్ళతో, బరువెక్కిన హృదయంతో అభినందించకుండా ఉండలేం.

మింగుతున్న పట్నం సంపుటిలో మొత్తం 17 కథలు ఉన్నాయి. ఇందులో నుండి మూడు కథలను విశ్లేషిస్తూ సాగింది ఈ వ్యాసం. అవి 1) పాలుపొంగే పుణ్యభూమి 2) మింగుతున్న పట్నం 3) చిల్లిగవ్వ బతుకు.

పాలుపొంగే పుణ్యభూమిలోని కథా సారాన్ని గమనిస్తే పాత్రల పరంగా ఎల్లమ్మ, పోచయ్య, పెద్దోడు, చిన్నోడు ప్రధాన పాత్రలుగా కనబడతాయి. కాగా గణేశుడు, వీరయ్య, డ్రైవర్, కండక్టర్, ప్యాసింజర్, లారీ డ్రైవర్, కాంట్రాక్టర్, డాక్టర్, జీన్‌ప్యాంట్ యువకుడు, ఆడవాళ్ళు, ఇద్దరమ్మాయిలు, పాలమ్ముకునేవాడి పాత్రలు క్షణకాలం దర్శనమిస్తూంటాయి.

అయ్యగారి పాలెంలో ఎల్లమ్మ, పోచయ్య భార్యాభర్తలు. అక్కడ వానలు లేనందున కరువు కాటకాలతో దుర్భర జీవితాన్ని కొనసాగించడం ఇష్టంలేక తన తోటి రైతు వీరయ్య సలహా మేరకు పట్నం వైపుకు బయలుదేరుతారు. చేతిలో అంతంత మాత్రంగానే ఉన్న డబ్బులతో భార్యాపిల్లలతో పట్నానికి ప్రయాణమయ్యే సమయంలో బస్ కండక్టర్‌తో అవమానం పొంది లారీ డ్రైవర్‌కి 30 రూపాయలిచ్చి అర్ధరాత్రి పట్నం చేరుతారు. మగాడికి 40 రూపాయలు, ఆడదానికి 30 రూపాయల కూలీతో పనిలోకి చేరిన పోచయ్య, ఎల్లమ్మ తమ జీవితంలో కష్టాలన్నీ పోయి మంచి రోజులొచ్చాయని సంబరపడతారు. కాని వారికి సుఖాలు క్షణికాలని, కష్టాలు అనంతాలని త్వరలోనే తెలుస్తుంది.

కాంట్రాక్టర్ చూపుతున్న నరకం ఒక కారణంగా, ఆగని యంత్రంవలె పని చేయడం మూలంగా వారుండే స్థలంలో విపరీతమైన దోమల బాధ మరోకారణంగా భార్యాభర్తలిద్దరూ జబ్బున పడతారు. రెండు రోజుల కూలీ డాక్టర్‌కు, నాలుగు రోజుల కూలీ మందులకు, టానిక్కులకు సరిపోతుంది.

ఎల్లమ్మకు జ్వరం తగ్గినా నీరసం మాత్రం వదలలేదు. పోచయ్యకూ అలాగే ఉన్నా పనికి పోక తప్పలేదు. జ్వరంతో చిక్కి శల్యమైన ఎల్లమ్మ రొమ్ములు ఎండిపోయాయి. చిన్నోడికి పాలులేవు. ఈ పరిస్థితి పగవాడికి కూడా రావద్దని మొక్కుకుంటూ లోలోపలే రోదిస్తూంటుంది. ఆ సమయంలో పెద్దోడు "గణేశుడు పాలు తాగుతున్నాడే" అని చెపుతాడు. చిన్నోడికి పాలు తాగించాలనే ఆత్రుతలో గుడి దగ్గరికి బయలుదేరుతుంది ఎల్లమ్మ.

గుడి దగ్గర బారులు తీరి జనం పాలగ్లాసులతో, చెంబులతో నిలబడి ఉన్నారు. వారిలో ఫెమినిస్టులు, నాస్తికులు, ఆస్తికులు అందరూ కనబడతారు. కాని ఒక్కచుక్కపాలకోసం ఎల్లమ్మ చేసే ఆక్రందనను ఎవరూ పట్టించుకోరు. చివరికి పాలమ్మేవాడుకూడా బూతులు మాట్లాడుతాడు. కాని పాలను పోయడు. "ఇంతమంది చేతుల్లో పాలున్నాయి. ఎవరూ గిన్ని పాలుపోస్తలేరు. పెద్దోని తర్వాత పుట్టిన ఇద్దరు పోరగాండ్లు జ్వరంతో దావఖానాకు తీసుకుపోయేటాల్లకు సచ్చిపోయినారు. వీడు ఆకలితో సచ్చిపోతాడో ఏందో" అనుకూంటూ దుఃఖిస్తుంది ఎల్లమ్మ "పైన తథాస్తు దేవతలు ఆ మాటలు విన్నారో ఏమో !". రాతెండి గిన్కె నిండా పాలుపట్టుకుని ఎదురుగా పెద్దోడు కనబడుతాడు. గర్భగుడి నుంచి వచ్చే కాలువలో పాలు వరదలా కనిపించాయి. కాని పాలు తాగడానికి చిన్నోడు మాత్రం గుటకేయలేదు.

ముత్తమ్మ ఆమె ఇద్దరు పిల్లలు "మింగుతున్న పట్నం" లోని ప్రధాన పాత్రలు కాగా ముత్తమ్మ భర్త సత్తయ్య, ఆసాములు, కాంట్రాక్టరు, దొర మిగతా పాత్రలుగా కథలో అక్కడకూడా కనిపిస్తుంటారు.

ఇక కథా నేపథ్యాన్ని తీసుకుంటే ముత్తమ్మకు పెళ్ళయి కొత్తగా ఊరికి వచ్చినప్పుడు ఊరంతా, వారి ఇల్లంతా ఎంతో అందంగా ఉండేది. గుడిసె దాటి కొంచెం దూరం పోతే పచ్చని పొలాలు, చెల్కలు, ఎన్నో చింతచెట్లు, తుమ్మచెట్లు, వేపచెట్లు ఇలా పచ్చని చెట్ల ప్రకృతి అందాలతో ఎంతో మనోహరంగా ఉండేది. అత్తమామలు, మొగుడు పెళ్ళాలతో సంసారం హాయిగా గడిచేది. వీరికి రెండెకరాల చెల్కే యావదాస్తి. ఇందులో ఒకసారి జొన్నలు, మరోసారి పెసళ్ళు, ఇంకోసారి వేరుసెనగ పంటలు పండిస్తూ జీవితాన్ని హాయిగా గడిపేవారు.

ఒకసారి పట్నపోల్లు వచ్చి భూములు కొంటామంటారు. అడ్డికి పావుసేరు లెక్కన ఖరీదు చేస్తారు. ఒకర్ని చూసి మరొకరు భూములమ్ముకుంటారు. ఇష్టమున్నా లేకున్నా ఒకరు అమ్ముకున్నా ఇంకొకరు అమ్ముకోక తప్పలేదు. అమ్మమని ఎవరైనా మొండికేస్తే "సర్కారోల్లు జప్తుచేసుకుంటారు. అప్పుడు ఉత్తపుణ్యానికి భూములు పోతాయి" అని భయపెట్టి భూములు కొనుక్కుంటారు. ఈ నేపథ్యంలో ఆ ఊర్లో ఎవరికీ భూములు లేకుండా అవుతుంది. ఇదే క్రమంలో ముత్తమ్మ, సత్తయ్యల పరిస్థితి ఉంటుంది. భూములమ్మగా వచ్చిన పైసలు కొంత అప్పులకు పోగా కొంత జల్సాలకవుతుంది. ఈ బాధలోనే అత్తామామలు చనిపోతారు.

ఇక్కడి నుండే ముత్తమ్మ, సత్తెయ్యలకు కష్టాలు ప్రారంభమవుతాయి. సత్తయ్యకు తాగడం అలవాటవుతుంది. కష్టాలు ఎలా పెరుగుతున్నాయో అలా సత్తయ్య తాగుడూ పెరిగింది. కల్తీ కల్లు తాగి సత్తెయ్య ప్రాణాలు వదులుతాడు. మొదట అండగా ఉన్న అత్తామామల్ని, తర్వాత మొగుణ్ణి పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న ముత్తమ్మ చంటోడితో కలిపి నలుగురు పిల్లలతో ఒంటరిగా మిగిలిపోతుంది.

పసిడి పంటలతో కళకళలాడే పల్లె నేడు బీడుబారి పోయింది. అక్కడక్కడ సిమెంటు భవంతులు కట్టబడుతున్నాయి. తారు రోడ్డు కింద పంటపొలాలు సమాధి అయ్యాయి. పొలాల యజమానులు కాస్త భవంతుల నిర్మాణాలకు కూలీలుగా

మారిపోయారు. ఈ పరిస్థితి ముత్తమ్మ ఒకదానికే కాదు. దాదాపుగా ఊరంతా అదే స్థితి. "పూలమ్ముకున్న చోటనే కట్టెలమ్ముకునే పరిస్థితి. కూలీపనికి వెళ్ళడానికి మొదట్లో నామోషీ పడ్డా తర్వాత తర్వాత అలవాటైంది. కాని అప్పటికే పనులు లేవు. "కులం చెడ్డా సుఖం దక్కని పరిస్థితి". అభిమానాన్ని చంపుకుని ఇంట్లో ఊడిగం చేద్దామని అనుకున్నా దొర ఇంట్లో యంత్రాలతో పనవుతుంది. ఏదో చిన్నా చితకా పనిచేసి పొట్టపోసుకుందామనుకున్నా అక్కడి వాళ్ళు "నీలాంటి పల్లెటూరి వాళ్ళు పని చేయడానికి పనికిరారు" అంటూ తిరస్కరిస్తారు.

అభిమానం పోయింది. పిల్లల ఆక్రందన ఒక్కటే మిగిలింది. పెద్దపిల్ల సరమ్మ 10 సంవత్సరాలు అయినప్పటికీ తిండిలేక 8 సంవత్సరాల పిల్లలాగా కనిపిస్తుంది. దాని తర్వాత ముగ్గురు పిల్లలు. పెద్దోడు, చిన్నోడు, చంటోడు. ఈ ముగ్గురు పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టిన రోజు గుర్తులేదామెకు. ఈ విషయం పదే పదే తల్చుకుని కన్నీళ్ళతో బాధపడుతుంది ముత్తవ్వ.

నిత్యం ఈ బాధల నుంచి విముక్తి కోసం సంఘర్షిస్తుందామె. ఆ సంఘర్షణలోంచి ఆలోచన, అందులోనుండి ఒక పరిష్కారం దొరికిందామెకు. వెంటనే ఆమె చేతిలో పెళ్ళినాటి కడియం తళుక్కున మెరిసింది. అది అమ్మి బియ్యం, ఎండు మిరపకాయలు కొంటుంది. ఈ సంగతి తెలిసిన పిల్లలు పరమానందభరితులవుతారు. చాలా రోజులకు కడుపునిండా తినే అవకాశం వస్తున్నందుకు, వేడన్నంలో మిరం (మిరపకారం) వేసుకుని తింటే ఎంత బాగుంటుందో అని ఊహించుకుంటూ ఎదురు చూస్తూంటారు. వారు ఊహించని, అనుకోని ఒక పదార్థం ఆ అన్నంలో కలిసిందని అదే ఎలుకల మందని వారి అంచనాకైనా అందని నిజం. ఆ అన్నాన్ని కడుపారా భోంచేసి శాశ్వత నిద్రలోకి వెళ్ళిపోతారు.

అనురాధ, అనిల్, విజయ (అనిల్ భార్య) కథలో ప్రధాన పాత్రలుగా కనబడగా జూనియర్ డాక్టర్, సర్జన్, అనురాధ భర్త, అనురాధ తల్లిదండ్రులు, అజయ్ భార్య (రంజని) వంటి మిగతా పాత్రలతో "చిల్లిగవ్వ బతుకు" అల్లబడింది.

అనురాధ తల్లిదండ్రుల దగ్గర అల్లారుముద్దుగా పెరిగిన బిడ్డ. ఒక్కతే కూతురు. వాళ్ళిద్దరికి ప్రాణసమానమై పెరుగుతుంది. యుక్త వయస్సురాగానే పెళ్ళిచేసి సాగనంపుతారు. తల్లిదండ్రులిచ్చిన ఆస్తి భర్త స్వాధీనమైంది. ఆ తర్వాత ఆ ఆస్తిని

ఆయన తమ ఇద్దరు కొడుకులకు సమానంగా పంచి ఇచ్చి కాలంచేసాడు. "నాకు ఆధారం ఏదో ఉండాలి కదా ! కొంత ఆస్తి నా పేర ఉండనివ్వండి" అని మనసు చంపుకుని, అడ్డువస్తున్న అహాన్ని పక్కకు నెట్టి అడిగినప్పటికి అనురాధ భర్త "ఆస్తిని నువ్వేం చేసుకుంటావ్ రెండు పూటలా తిండి చాలదా నీకు. అదీ వాళ్ళు పెడ్తారులే" అంటాడు. దాంతో పెకలాల్సిన ఆమె నోరు మూతబడిపోతుంది.

అనురాధ దంపతులకు కలిగిన ఇద్దరు మగపిల్లల్లో మొదటివాడు అజయ్, ఇతడి భార్య రంజన. కాగా రెండవవాడు అనిల్, ఇతడి భార్య విజయ. అజయ్‌కి పెద్ద ఉద్యోగం. సంపాదన కూడా పెద్దగానే ఉంటుంది. అతని పరిచయాల పెద్దపెద్ద వాళ్ళతో, పెద్దపెద్ద దేశాలతో, అమెరికన్ డెలిగేట్స్ అంటూ ఎప్పుడూ బిజీగా ఉంటాడు. భర్తకు తగ్గ ఇల్లాలు రంజన. ఏ ఉద్యోగం లేకపోయినా ఆమె కూడా బిజీయే. వీరిద్దరూ అనురాధను పట్టించుకునే పరిస్థితుల్లోలేరు.

అనిల్, విజయలు చిరు ఉద్యోగాలతో సతమతమవుతూ ఉంటారు. చిన్న ఇంట్లో వారితో అనురాధ సర్దుకుపోలేకపోతుంది. ప్రతిక్షణం కోడలి సూటిపోటి మాటలతో నరకయాతన అనుభవిస్తూంటుంది.

ఒకనాటి రాత్రి అకస్మాత్తుగా అనురాధకు గుండెలో నొప్పి మొదలవుతుంది. విజయ ఆ నొప్పిని తేలిగ్గా తీసిపారేస్తుంది. అసహనంగా అనిల్ ఆమెను హాస్పిటల్‌కి తీసుకెళ్తాడు. పరీక్షల అనంతరం జూనియర్ డాక్టర్ ఆమె నొప్పి హార్ట్ ఎటాక్‌గా నిర్ధారిస్తాడు. సర్జన్ ఆంజియోగ్రామ్ పరీక్ష చేసి గుండెలో వాల్వులు మూడు మూసుకుపోయాయని, వెంటనే ఆపరేషన్ అవసరం అంటాడు. అనురాధ కూడా ఆపరేషన్ చేయించుకుని, బ్రతికి చేసేదేముంది అని నిట్టూరుస్తుంది.

మెడికల్ రీ ఇంబర్స్‌మెంట్ అవకాశం ఉన్న అజయ్ అమ్మ ఆపరేషన్‌కు డబ్బు ఇస్తానంటాడు. కాని ఆపరేషన్ తర్వాత అమ్మను చూసుకోవడానికి నాకు తీరికలేదు. నువ్వే చూసుకోవాలి అని తమ్ముడితో చెపుతాడు.

ఈ క్రమంలో అనిల్, విజయల మధ్య గొడవ మొదలవుతుంది. ఆపరేషన్ సవ్యంగానే జరుగుతుంది. ప్రాణాలతో బయటపడ్డానన్న ఆనందం అనురాధకు ఏకోశానా లేదు.

రెండు వారాల తర్వాత డాక్టరు అనురాధను డిశ్చార్జ్ చేస్తూ బోలెడన్ని మందులు రాసిస్తాడు. ఇంటికెళ్ళగానే అనిల్ ఆ మందులు చీటీని అమ్మకిస్తాడు.

అనురాధ ఏం మాట్లాడదు. విజయ మాత్రం ఆ మందులన్నీ కొనడానికి డబ్బులెక్కడున్నాయని దీర్ఘాలు తీస్తుంది. అన్నయ్య రాకకోసం అనిల్ ఎదురుచూస్తూంటాడు. అయితే అజయ్ రాడు కాని, మందులు నువ్వుకొను. రావడానికి నాకు కుదర్లేదు వచ్చినప్పుడు డబ్బులిస్తానంటాడు. పరిస్థితినంతా గమనిస్తున్న అనురాధ తన జీవనస్థితిని, వైరాగ్యపు ఉనికిని, దుర్బలమైన పరాధీనపు జీవితాన్ని చూసి దుఃఖిస్తుంది మౌనంగా. ఆ మౌన బాధలోంచే నిద్రలోకి జారుకుంటుంది. అలా మూతపడ్డ ఆ కళ్ళు మళ్ళీ తెరుచుకోలేదు.

రెండు చేతులు చాచి స్వర్గస్థుడైన తండ్రి రా ! రా ! పరుగెత్తి రా ! అని పిల్చినట్లు అనిపించి తప్పటడుగులతో అనురాధ అతని చేతుల్లోకి వెళుతుంది. దుః ఖం, బాధ ఏదీ లేదక్కడ ! ఉందల్లా ఆమె ముఖం మీద చిరునవ్వు మాత్రమే. "ఇక్కడ ఎంత హాయి. ఎంత సుఖం " ! అనుకుంది అనురాధ.

అనిల్ చేతికి తల్లి శరీరం ఏమార్దవం లేని రాయిలా తగిలింది.

ముదిగంటి సుజాతారెడ్డి కథలు "మింగుతున్న పట్నం" అనే శీర్షికతో వెలువడ్డ కథా సంకలనంలో నుండి పై మూడు కథలను గ్రహించడం జరిగింది. ఈ సంకలనంలో ఉన్న మొత్తం కథల్లో ప్రతీదీ ఏదో ఒక పత్రికలో ప్రచురితమయిందే. ఈ సంకలనంలోని అన్ని కథలను ఒకే రకమైన విలక్షణ శైలిలో చెప్పడం జరిగింది. కథా ప్రారంభం వర్తమానంలో ఉండి భూతకాలంలోకి వెళ్ళడం, అక్కడి నుండి మళ్ళీ వర్తమానంలోకి వచ్చి ముగుస్తుంది.

"పాలు పొంగే పుణ్యభూమి" 1996 కదంబం రచయిత్రుల కథల సంకలనంలో.

"చిల్లిగవ్వ బతుకు" 1999 సెప్టెంబర్, అక్టోబర్ భూమికలో

"మింగుతున్న పట్నం" 2001, జనవరి 28 వార్త ఆదివారంలో ప్రచురితమైంది.

రచయిత స్త్రీ కావడంవల్ల కథల్లో స్త్రీ హృదయాన్ని హృద్యంగా ఆవిష్కరించిందని అనిపిస్తుంది. ఈ సంకలనంలోని దాదాపు అన్ని కథలు స్త్రీని ప్రధాన పాత్రధారిగా చేసుకుంటూ చిత్రింపబడ్డవే. పై మూడు కథలు ఈ విషయాన్ని

మరింత బలంగా ఈ వాదనను వినిపిస్తాయి.

పాలుపొంగే పుణ్యభూమిలో గుక్కెడు పాలను కూడా ఇవ్వలేని ఆ తల్లి నిస్సహాయ స్థితి కారణంగా ఆమె పిల్లాడి మృత్యువును చూసిన మాతృమూర్తిగా మింగుతున్న పట్నంలో గుక్కెడు విషం పిల్లలకు ఇచ్చి తానూ పుచ్చుకుని తనతో పాటు పిల్లలను మృత్యుదేవత ఒడిలోకి లాక్కెళ్ళిన అసహాయురాలిగా పిల్లల ఆదరణకు, ప్రేమకు దూరమై అవసాన దశలో వారి అభిమానాన్ని కోల్పోయి నికృష్టపు చావును కొనితెచ్చుకున్న తల్లిగా చిల్లిగవ్వ బతుకులో కనబడుతుంది.

అయితే గమనించాల్సిన విషయమేమిటంటే ఈ మూడు కథల్లో ముగింపు విషాదమే. అతి ప్రధాన పాత్రలైన ఆ స్త్రీల జీవితాలకు మరణమే అంతిమ మజిలీగా కనబడుతుంది. పరిస్థితులను ఎదిరించి పోరాడే శక్తిలేక, అభిమానాన్ని చంపుకున్నా అవమానాలు తప్పక, ఆకలి తీరక నిస్సహాయురాలైన స్త్రీగా మింగుతున్న పట్నంలో ముత్తెమ్మ చిత్రీకరణ కనబడుతుంది. "అడ్డాల నాడే బిడ్డలు గాని గడ్డాల నాడు బిడ్డలా" అన్నట్లు తన జీవితాన్ని, సర్వస్వాన్ని పిల్లలకోసం ధారపోసి ఆస్తిపాస్తులు పంచిన తర్వాత చివరి దశలో వృద్ధాప్యంలో నిరాదరణకు గురై మృత్యువు ఒడిలోకి జారిపోయిన పాత్రగా అనురాధ చిల్లిగవ్వ బతుకులో కనబడుతుంది. ఎల్లమ్మ ఒకప్పుడు, పల్లెలో మంచి జీవితాన్ని గడిపి పట్నం వచ్చి దుర్భర జీవితాన్ని గడుపుతూ సిమెంటు, కాంక్రీటు అరణ్యాలలో మానవత్వాన్ని మంటగలిపే పట్నవాసుల దౌష్ట్యాన్ని రుచి చూసి నిస్సహాయంగా తన పిల్లవాడిని కోల్పోయిన పాత్ర పాలుపొంగే పుణ్యభూమిలో కనబడుతుంది.

ఈ పాత్రలు ఏవీ కూడా ధీరోదాత్తమైన పాత్రలుగా కనబడవు. నేటి మన సమాజంలో సాధారణ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలనుండి వడబోసిన పాత్రలుగా కనబడుతాయి. అందుకే సమస్యను ఎదిరించి పోరాడవు. అలాగని సమస్యలకు భయపడి పారిపోవు. సమస్య వారిని ఎలా తీసుకెళ్తే అలా ముగింపునందుకుంటాయి.

మింగుతున్న పట్నం కథా సంకలనంలోని ఏ కథా శైలిని గమనించినా సహజత్వాన్ని సిరాగా నింపుకుని ఆ కాలంనాటి, ఆ సమాజంలోని పరిస్థితులను

మాండలికాలకు అనుగుణంగా రచించినట్లు కనిపిస్తుంది. ఈ మూడు కథల్ని పరికిస్తే పై వాక్యాలకు ఇవేం మినహాయింపుకావు. అయితే మానవతా విలువలు కృశించిపోతున్న వైనాన్ని సూటిగా, సున్నితంగా, నిశితంగా, వాడిగా పాఠకుల హృదయాలకు నేరుగా హత్తుకునేటట్లు ఈ కథలు కనబడుతాయి.

సుజాతారెడ్డిగారి కథలు చదువుతున్నంతసేపు కథా నేపథ్యం కథా సారాంశానికి బలీయమైన అంశంగా కనబడుతుంది. ఈ కథా నేపథ్యమే ప్రతి ఒక్క పాఠకుడిని ఆ కథలో తమను తాము ఐడెంటిఫై చేసుకునేటట్లు కనబడుతుంది. ఈమె రచనల్లోని మరో విశేషమేమిటంటే విషయంలో క్లిష్టత లేకపోవడం. కథను పాఠకుడు చదవడం మొదలు పెట్టగానే అతడు దాదాపుగా ముగింపుని ఊహించగలడు. అయినప్పటికి పాఠకుడు కథను మొత్తం ఏకబిగిన చదవడానికే ఇష్టపడతాడు. ఇదే ఆమె రచనా శైలికి, పాత్ర చిత్రణలో నేర్పరితనానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు.

# 'అలరాస పుట్టిళ్ళు' - విశిష్ట కథ

డా॥ పంతంగి వెంకటేశ్వర్లు

కల్యాణ సుందరీ జగన్నాథ్ మంచి కథలు రాస్తున్న రచయిత్రుల్లో ఒకరు. చెన్నైలో స్థిరపడ్డ ఈమె గత 5,6 దశాబ్ధాలుగా కథలు రాస్తున్నారు. చెన్నైలో భారతి పత్రికకు సంపాదకులుగా ఉన్న మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రోత్సాహంతో ఈమె కథలు రాయడం ప్రారంభించారు. 1941లో ఈమె రాసిన 'ఒక చిన్నకథ' భారతి పత్రికలో అచ్చయింది. ఇది ఆమె మొదటి కథ. ఇదే సమయంలో ఆమె తమ్ముడు చనిపోవడం, ఆ తరువాత ఒక సంవత్సరానికి పెద్దమ్మాయి చనిపోవడం సుందరీ జగన్నాథ్ తన జీవితంలో చవిచూచిన అత్యంత విషాదం. ఈ విషాదం నుంచి కోలుకోవడానికి ఆమెకు ఒక దశాబ్దకాలమే పట్టింది. 1954లో 'మాడంతమబ్బు'తో రెండోసారి కథా రచనకు శ్రీకారం చుట్టిన ఆమె ఆ తరువాత వరుసగా కథలు రాస్తూ వచ్చారు.

1977లో అప్పటివరకు రాసిన కథలను 'అలరాసపుట్టిళ్ళు' పేరుతో కథా సంకలనంగా అచ్చువేశారు. సౌభాగ్యవతి, పుట్టినరోజు, అసురసంధ్య, మూడంతమబ్బు, అగ్నిపుష్పం, రాలినపువ్వులు, ఎండమావులు, చిరుచెమటలు -చందనం, రక్షాక్షతలు, సర్పకంకణం మట్టిగోడలు, అలరాసపుట్టిళ్ళు కథలు ఈ కథా సంపుటిలో చోటుచేసుకున్నాయి. 1962లో భారతి ఉగాది ప్రత్యేక సంచికలో అచ్చయిన 'అలరాసపుట్టిళ్ళు' పేరుతోనే ఈ కథా సంకలనాన్ని అచ్చువేసింది. ఈ కథ ఆమెకు ఎంతోపేరు తేవడమే కాదు, రచయిత్రిగా ఆమె ప్రతిభకు తార్కాణంగా నిలిచింది.

తన రచనల మీద ఆంగ్ల రచయిత థామస్‌హార్డీ రచనల ప్రభావం ఉందని ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో సుందరీ జగన్నాథ్ చెప్పుకున్నారు. "మానవ ప్రయత్నాలను మానకూడదు" అన్న థామస్ హార్డీ అభిప్రాయాలను బలంగా నమ్మే ఈ రచయిత్రి గ్రామీణ వాతావరణాన్ని, మరుగున పడిపోతున్న మన పూర్వపు నాగరికత, ఔన్నత్యం, సంప్రదాయాలు, నమ్మకాలు, తలవంపులు తెచ్చే అజ్ఞానం, మూఢత్వం, మొదలైన వాటిని తన రచనల్లో ప్రతిఫలింపజేస్తుంది. 'అలరాస పుట్టిళ్ళు' కథ ద్వారా ఆమె కథల్లోని వైవిధ్యాన్ని అంచనా వేయడమే ఈ వ్యాసోద్దేశం.

**ఇతివృత్తం:** సం(ప్రదాయాలు, కట్టుబాట్లు, పరువు (ప్రతిష్ఠల మధ్య పెరిగిన ఒక (స్త్రీ తనను (ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోలేకపోవడం ఇందులో కథాంశం. సత్యవతి తను (ప్రేమించిన చెంగల్వరాయుడుని పెళ్ళి చేసుకోలేకపోతుంది. సం(ప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో, తలవంపులు తెచ్చే మూఢత్వంతో తన సొంత అన్న అయిన సుబ్బారాయుడు సత్యవతిని హత్యచేస్తాడు. కాలం చెల్లిన సం(ప్రదాయాలు, మనుషుల మూఢత్వాలు ఎలా (ప్రాణాంతకంగా పరిణమిస్తాయో 'అలరాసపుట్టిళ్ళు' కథ వివరిస్తుంది. ఒక చిన్న పొరపాటు పర్యవసానం వల్ల అలనాటి రాచరికపు పుట్టిళ్ళు వైభవం ఎలా తుడుచుకుపెట్టుకు పోయిందో చెప్పే కథ ఇది.

**కథాకథనం:** 'అలరాసపుట్టిళ్ళు' కథలో కథనం చాలా సాఫీగా నడచింది. కథ చెప్పడంలో మృదుత్వం, సున్నితత్వం, సంయమనం కన్పిస్తాయి. అక్కమ్మ అనే పాత్ర ఫ్లాష్‌బ్యాక్ ద్వారా రచయిత్రి ఈ కథను నడిపించింది. అలనాటి రాచరికపు పుట్టిళ్ళు గురించి ఇందులో చెప్పదలచుకుంది గనుక కథ (ప్రారంభంలో తను ఏ ఇంటిని గురించి చెప్పదలచుకుందో ఆ ఇంటివర్ణన చేసింది. ఇంటి వర్ణన చేసే ముందు ఇంటికి దగ్గరలో ఉన్న అమ్మవారి గుడి వర్ణన చేసింది. 'అమ్మవారి గుడి పాడుపడి ఉంది' అంటూ (ప్రారంభించి ఆ తరువాత ఇల్లు ఎట్లా పాడుబడిపోయిందో చెప్పింది. 'మునసబుగారి లోగిలి అరుగులు విరిగి, రాళ్ళు బయటపడ్డాయి' అంటూ ఇంటిని గురించి చెప్పి, ఆ తరువాత వీధికి అటుపక్కగా ఉన్న పెద్ద దొడ్డిలో వ్యవసాయ సంబంధమైన పనిముట్లు ఎలా మూలబడి పోయాయో వివరించింది. 'విరిగిన గోనె మడతమంచాలు, నులకమంచాలు, తుప్పుపట్టిన నాగటి క(రులు, కొడవళ్ళూ, గొడ్డళ్ళూ, నాగలికొయ్యలు, పలుపులు మేటగా పడిఉన్నాయి. కట్టుకొయ్యలన్నీ ఖాళీ అంటూ ఒకప్పుడు ఆ ఇంటి వ్యవసాయం ఎంత ఉన్నతంగా ఉండేదో ఈ పాడుబడ్డ వస్తువుల ద్వారా సూచించింది. అక్కడితో ఆగకుండా ఇంటికి దూరంగా ఉన్న చెరువు గురించి, సమాధుల గురించి, సమాధుల మీద ఊడిపోతున్న సున్నం గురించి చెప్పడం రచయిత్రి సూక్ష్మ పరిశీలనా శక్తికి నిదర్శనం. శిథిలమైన వస్తు వర్ణనల ద్వారా శిథిలమైన ఆ ఇంటి మనుషులను గురించి పరోక్షంగా తెలిపింది. కథ (ప్రారంభంలోనే ఈ వర్ణనలను చదివిన పాఠకుడు ఆ ఇంటి వైభవం ఇప్పుడు ఏమైంది? ఎందుకు అలా అయింది? అన్న ఉత్కంఠకు లోనవుతాడు.

ఇంట్లో మంచం మీద కొన ఊపిరితో ఉన్న సుబ్బరాయుడిని చూడటానికి ఒక్కొక్క బంధువు చేరుకుంటుంటారు. మొదటగా వచ్చిన బంధువు అక్కమ్మ గతాన్ని

నెమరు వేసుకోవడం ద్వారా (ఫ్లాష్ బ్యాక్‌లో) ఈ కథ సగం పూర్తవుతుంది. ఇంతలో మళ్ళీ ఎవరో చుట్టాలు రావడం, మంచం మీద ఉన్న సుబ్బరాయుడిని పలకరించడం అతను 'సత్యవతి రాలేదా'? అని అడగడంతో అక్కమ్మ మనసుతో రెండో ఫ్లాష్ బ్యాక్ మొదలవుతుంది. బంధువులు ఒక్కొక్కరు ఇలా చేరుకోవడం, సుబ్బారాయుడ్ని పలకరించడం, అతను సత్యవతి రాలేదా అనడం కథ చివరివరకు కొనసాగి పాఠకుడిలో గొప్ప ఉత్కంఠను రేకెత్తిస్తుంటుంది. అక్కమ్మ ఫ్లాష్‌బ్యాక్ ద్వారా సత్యవతి ఎవరో? సుబ్బారాయుడు ఎవరో? ఆ ఇంటి గత వైభవం ఏమిటో పాఠకుడికి తెలుసున్నప్పటికీ సత్యవతి సుబ్బారాయుడి చివరి చూపుకైనా వస్తుందా? రాదా? అన్నది పెద్ద సస్పెన్స్‌గానే మిగులుతుంది. మునసబు మరణించడం, మునసబు పెద్ద కొడుకు అయిన సుబ్బారాయుడు ఇంటి విషయం పట్టించుకోకపోవడం, గమిడిపోతుల్ని అమ్మివేయడం, వ్యవసాయం ఛిన్నాభిన్నం కావడం అక్కమ్మ తన ఫ్లాష్‌బ్యాక్ ద్వారా గుర్తుచేసుకుంటుంది. చిలకపంజరం తలకు తగలడంతో ప్రారంభమైన అక్కమ్మ రెండో ఫ్లాష్‌బ్యాక్ సత్యవతి ఇంటి నుంచి వెళ్ళిపోయిన తరువాత ఇంట్లో జరిగిన తదనంతర పరిణామాలకు అద్దం పడుతుంది. సత్యవతి ఏమైందో అక్కమ్మకు కూడా తెలియదు కాబట్టి సత్యవతి రాకకోసం అందరిలాగే అక్కమ్మ కూడా ఎదురు చూస్తుంటుంది. ఇంకా అక్కమ్మ ఫ్లాష్‌బ్యాక్ ద్వారా కథ చివరివరకు కొనసాగి ఊహించని మలుపుతో ముగుస్తుంది.

**పాత్రలు:** ఈ కథలో అక్కమ్మ, సత్యవతి, చంద్రమ్మ, సుబ్బారాయుడు, వీరయ్య, చెంగల్వరాయుడు మొదలైన పాత్రలు ఉన్నప్పటికీ వీటిలో సత్యవతి, సుబ్బారాయుడు పాత్రలకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా వాటిని ఇక్కడ సమగ్రంగా పరిచయం చేస్తున్నాను.

**సత్యవతి:** ఈ కథలో సత్యవతి సుబ్బారాయుడి చెల్లెలు. మునసబు చివరి సంతానం. సంప్రదాయాలు, కట్టుబాట్లను గౌరవించే కుటుంబంలో పుట్టింది. పరువు ప్రతిష్ఠలకు ప్రాణం ఇచ్చే కటుంబంలో పెరిగింది. ప్రేమించిన వ్యక్తిని పెళ్ళి చేసుకోలేక, మూఢ సంప్రదాయాన్ని గౌరవించలేక కొట్టుమిట్టాడి చివరకు సొంత అన్న చేతిలోనే ఈమె ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది.

సత్యవతి చెంగల్వరాయుడిని ప్రేమించింది. చెంగల్వరాయుడు తమ ఇంటికి ఆశ్రితుడుగా వచ్చిన వ్యక్తి. తను ఎనిమిది ఏళ్ళప్రాయంలో ఉన్నప్పుడు ఒకరోజు

ఉదయం చెంగల్వరాయుడు చేతికి రక్తం కారుతున్న చారికలతో తమ ఇంటికి వచ్చాడు. అప్పటి వరకు ఆటలాడి వగర్చుకుంటూ వచ్చిన సత్యవతి రక్తం చారికలున్న చెంగల్వరాయుడిని చూసి జాలిపడింది. వెంటనే తడిగుడ్డ తీసుకువచ్చి చెంగల్వరాయుడికి ఇవ్వబోయింది. తన అన్న సుబ్బారాయుడికి వెనుక ముందు ఎవరు లేకపోవడంతో తమ కుటుంబం అతనికి ఆశ్రయమిచ్చింది.

తండ్రి, అన్నలు ఉన్నప్పటికీ కన్నతల్లి ప్రేమను నోచుకోని సత్యవతికి చెంగల్వరాయుడుని చూసినప్పుడు కన్నతల్లే లేచి వచ్చినట్లుండేది. పొలానికి వెళ్ళినా, బయటికి వెళ్ళినా, సత్యవతికి ఇష్టమైనది ఏదైనా తెచ్చేవాడు. సత్యవతికి జ్వరం వచ్చినప్పుడు సోలెడు గమ్మపాలు తెచ్చి స్వయంగా మంచం దగ్గర పెట్టేవాడు. సత్యవతి పెద్దదవుతుంది. ఇంట్లో గడపదాటనివ్వడం లేదు. సత్యవతికి మాత్రం చెంగల్వరాయుడు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా దేవగానం వినపించినట్టుండేది. చెంగల్వరాయుడు తనకోసం ప్రమాదకరమైన పాములు ఉండే దుబ్బల్లోకెళ్ళి మల్లెపూలు తెచ్చేవాడు. "ఈ పూవులు లేకపోతే పోయిందిలే వెళ్ళొద్దు ఆ దుబ్బల్లో పాములున్నాయి" అంటూ అతన్ని ఒకసారి సత్యవతి హెచ్చరించింది కూడా. "నీవు నా పక్క చూస్తావున్ననాళ్ళూ నన్నే పాము ఏమి చెయ్యదు" అని చెంగల్వరాయుడు అందుకు సమాధానంగా అన్నప్పుడు సత్యవతి హృదయం సముద్రం పొంగినట్టు పొంగేది. ఎప్పుడు తనకోసం ఏదో ఒకటి తెచ్చే చెంగల్వరాయుడు ఒకసారి దారిలో దొరికిన చిలకపిల్లను తెచ్చి సత్యవతికి ఇచ్చాడు. మరోసారి సంత నుంచి చిలుక పంజరాన్ని, గోధుమ పూసలను తెచ్చి ఇచ్చాడు. చెంగల్వరాయుడు ఒకసారి సంతకు బండి కట్టుకొని వెళుతున్నపుడు సత్యవతి దొంగచాటుగా అతన్ని కలుసుకొని చెంగుముడితో తెచ్చిన అమ్మవారి కుంకుమను అతని నొసటపెట్టి ధైర్యం చెప్పింది. చెంగల్వరాయుడు సత్యవతిని అడిగాడు. "దోసెడు ముత్యాల్లోనూ, దోసెడు రత్నాలలోనూ పుట్టావు నువ్వు. నేనంటే నీకు ఎందుకు ఇష్టం" అని. నా పుట్టుక మాటేంగాని నాకు నువ్వే పుట్టెడు బంగారం" అంది సత్యవతి బదులుగా.

సత్యవతి, చెంగల్వరాయుడి మధ్య ప్రేమ క్రమక్రమంగా పెరిగింది. ఇంతలో వీళ్ళిద్దరి ప్రేమ గురించి సుబ్బారాయుడికి తెలియడం, చెంగల్వరాయుడిని పిలిపించి, ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మని చెప్పడం వెంటవెంటనే జరిగిపోతాయి. చెంగల్వ రాయుడు, వెళ్ళిపోతున్నప్పుడు సత్యవతి అతన్ని దారిలో కలుసుకొని ఏడ్చింది. అతనికోసం ఏడ్చి ఏడ్చి ఆ చీకట్లోనే ఆదమరచి నిద్రపోయింది. ఇక ఆ

ఎండాకాలంలోనే సత్యవతి పెళ్ళి బలవంతంగా మరొకరితో జరిగిపోయింది. పెద్దలు జరిపిన పెళ్ళిని అంగీకరించలేక, ప్రేమించిన వ్యక్తిని మరచిపోలేక సత్యవతి మనసు ఎంతో క్షోభను అనుభవించింది. అయితే ఈ కారణాలే సత్యవతి పుట్టింటికి పారిపోయి వచ్చే సాహసానికి కూడా కారణం అయ్యాయి. పెళ్ళైన వారం రోజులకే పుట్టింటికి పారిపోయి రావడానికి ప్రయత్నించి భంగపడింది. గోనెలేరు దాకా పారిపోయి వచ్చిన సత్యవతి ఏరు దగ్గర భయపడి వెనక్కి వెళ్ళిపోయింది. తన చిన్నప్పుడు ఆ ఏటిలో జరిగిన ఒక సంఘటనకు సంబంధించిన భయం ఆమె మనసులో ఉండటం ఒక కారణం అయితే, రాత్రిపూట కూడా కావడం అందుకు మరో కారణం.

రెండోసారి పారిపోయి వచ్చినప్పుడు ఆమెకు గోనెలేరు భయం కలుగలేదు. తను ప్రేమించిన వ్యక్తిని పొందలేక పోయానన్న బాధ, భయం మరింత బలీయం ఎప్పుడైతే అయిందో అప్పుడు గోనెలేరును సులభంగా దాటగలిగింది. నిజానికి గోనెలేరును దాటుతున్నానన్న స్పృహను కోల్పోయిన స్థితిలో సత్యవతి ఆ ఏరును దాటి ఉంటుంది. పారిపోయి ఇంటికి రావడంతోనే ఆమె సరాసరి ఇంట్లోకి వెళ్ళలేక ఇంటి గుడిసెల పక్కన దాక్కుంది. తన వాళ్ళ దృష్టిలో, సమాజం దృష్టిలో తను పారిపోయిరావడం తప్పు. అయితే ఆమెలో ఇంకా మిగిలి ఉన్న ప్రేమకు సంబంధించిన ఆశ ఆమెను ఇలా చివరి క్షణంలో పరుగులెత్తించిందనుకోవాలి. ఇంట్లో వాళ్ళందరు నిద్రలేచి సత్యవతి రాకపట్ల పెదవి విరిచారు. సుబ్బారాయుడికి కోపం వచ్చినప్పటికీ మొదటిసారి గనుక కోపాన్ని కొంత అణచుకున్నడు. ఈ సమయంలో తనతో చిన్నప్పటి నుంచి కలిసిపెరిగిన నేస్తం అక్కమ్మ ఒక్కతే సత్యవతిని కొంతవరకు ఊరడించగలిగింది. ఒకవైపు ఊరడిస్తూనే "యేటికి ఎదురీదడం కష్టం సత్యవతీ" అంటూ కఠిన వాస్తవాన్ని సత్యవతికి చెప్పింది. తను పారిపోయి రావడం ఇంట్లో ఉన్న వాళ్ళందరికి కోపం తెప్పిస్తే, సంతోషంతో చిందులు వేసింది పంజరంలోని చిలుక ఒక్కతే. మరుసటిరోజు మళ్ళీ బలవంతంగా సత్యవతిని అత్తవారింటికి పంపించారు పుట్టింటివారు. అక్కమ్మను, వీరయ్యను వెంట పంపించారు. ఈసారి ఎన్నో హెచ్చరికలు చేస్తూ పంపారు. వీళ్ళందరిలో సత్యవతికి కొంత ఊరటను ఇచ్చిన వ్యక్తి అక్కమ్మే. అక్కమ్మ కూడా ఆశ్రిత కుటుంబంలోని వ్యక్తే. కుటుంబ సభ్యులను ఎదురించి సత్యవతికి సపోర్ట్ చేయగలగడం ఆమె వల్ల అయ్యే పనికాదు. సత్యవతి కన్నతల్లి బతికి ఉంటే తల్లితో చెప్పుకోగలిగిన స్వేచ్ఛ కొంతైనా ఆమెకు ఉండేది. ఆ అవకాశం కూడా లేదు. మునసబు ముసలాయన.

8 మంది పిల్లలు కలిగిన తరువాత మళ్ళీ పెళ్ళిచేసుకొని 5 గురిని కన్నాడు. మిగిలిన ఆడపిల్లల పెళ్ళిళ్ళకు ఆటంకం కలుగకుండా ఉండాలన్నా ఆయన మాట్లాడకుండా ఉండాల్సిందే. ఆయన వృద్ధాప్యం కూడా ఇందుకు మరోకారణం కావచ్చు. సత్యవతి తన కష్టాలన్నీ తలపోస్తూ అత్తవారింటికి వెళ్ళింది.

మరోసారి సత్యవతి రాత్రి భోజనాల వేళకు పారిపోయి వచ్చింది. ఈసారి సుబ్బారాయుడి కోపం వర్ణనాతీతం. చిలుక మాత్రం ఎప్పటిలాగే సంతోషపడింది. "ఈ గడపతొక్కొద్దు అనలే. ఈ శని మీకు విరగడకాలే? తల ఎత్తుకొని బ్రతకనివ్వదల్లే ఉంది... వచ్చిన దారినే నడు" అంటూ సుబ్బారాయుడు చిందులు వేస్తూ అదే రాత్రి ఆమెను తీసుకొని అత్తవారింటికి తనొక్కడే బయలుదేరాడు.

ముఖ్యమైన ఆచారాలు, కట్టుబాట్లు, పద్ధతుల వల్ల సత్యవతి ఈ కథలో తను ప్రేమించిన వ్యక్తిని పెళ్ళిచేసుకోలేక పోవడంతోపాటు తన సొంత అన్న చేతుల్లోనే చంపబడుతుంది. కథా రచయిత్రి ఈ పాత్రను కరుణార్ద్ర హృదయంగా చిత్రించింది. సత్యవతి ప్రేమను, ఆ ప్రేమకు కారణమైన విషాదాన్ని ఆమె చిత్రించిన తీరు అద్భుతం. సత్యవతి తీరని కోరిక, ప్రేమ పాఠకునిలో కన్నీళ్ళు తెప్పిస్తాయి. మనలను నియంత్రించే విధిలీలలకు నిశ్శబ్దంగా తలవంచడమే ఆమె పాత్రల స్వభావం అనడానికి ఈ పాత్ర మంచి ఉదాహరణ అని చెప్పవచ్చు.

**సుబ్బారాయుడు:** అలరాసపుట్టిళ్ళు కథలో మరో ముఖ్యమైన పాత్ర సుబ్బారాయుడిది. ఇతను సాలూరు మునసబు కొడుకు. జమీందారి, భూస్వామ్య భావజాలానికి ఇతని పాత్ర ప్రతీక. సంప్రదాయాలు, కట్టుబాట్లు సుబ్బారాయుడికి ముఖ్యం. వాటికోసం దేనికైనా సిద్ధపడే మనస్తత్వం ఈయనది. పరువు ప్రతిష్ఠల కోసం తన సొంత చెల్లెలినే నిర్దాక్షిణ్యంగా చంపిన మూర్ఖుడు. చేసిన పాపాన్ని ఎవరికి చెప్పకుండా మనసులోనే దాచిపెట్టుకున్నాడు. చివరికి అదే అతని పాలిట శత్రువైంది. పాపభీతి ఇతనిలో మానసిక వ్యథకు దారితీసింది. అదే అతని చావుకు, ఆస్తిపాస్తులు పోవడానికి కారణమైంది.

సుబ్బారాయుడుకి సత్యవతి అనే చెల్లెలు ఉంది. తన ఆరుగురు తమ్ముళ్ళ తరువాత సత్యవతి పుట్టింది. ఒక్కతే చెల్లెలు కావడంతో సహజంగానే ప్రేమను పెంచుకున్నాడు. సత్యవతి పెరిగి పెద్దదైన తరువాత చెంగల్వరాయుడిని ప్రేమించింది. చెంగల్వరాయుడు ఒక అనాథగా ఆ ఇంట్లో అడుగుపెట్టినవాడు. సాలూరులో ధాన్యం అమ్ముకోవడానికి తండ్రితోపాటు చెంగల్వరాయుడు వచ్చాడు. తండ్రి అదే గ్రామంలో

అకారణంగా మరణించడంతో సుబ్బారాయుడి కుటుంబం అతన్ని ఆదరించింది. చెంగల్వరాయుడు ఎంతో నమ్మకంగా ఆ ఇంటి వ్యవసాయ పనులు చూస్తుండటంతో తమ ఇంటి నిర్వహణను సయితం మునసబు అతనికే అప్పగించాడు. చెంగల్వరాయుడికి ఇంటి నిర్వహణ పనులను తండ్రి అప్పగించిన సమయంలో కూడా సుబ్బారాయుడు ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు. దిక్కులేని వాళ్ళను ఆదరించే స్వభావం సుబ్బారాయుడిలో కూడా ఉంది. చంద్రమ్మ కుటుంబాన్ని ఆదరించడం వెనుక కూడా ఇదే స్వభావం సుబ్బారాయుడిలో కన్పిస్తుంది. చంద్రమ్మను, చంద్రమ్మ భర్తను ఆ ఊరి పున్నయ్యచెరువుకు కాపలాపెట్టి ఆ కుటుంబాన్ని ఆదుకున్నది కూడా సుబ్బారాయుడే. చంద్రమ్మ మాటల్లో అయితే సుబ్బారాయుడు "మానీతిమంతుడు. అతనికి కోపం ఎంత ఉందో కనికరం కూడా అంతే ఉంది".

ఒక అనాథగా వచ్చిన చెంగల్వరాయుడిని సత్యవతి ప్రేమించింది. తాము ఎంతగానో నమ్మి ఇంటి నిర్వహణను సయితం అప్పగించిన చెంగల్వరాయుడు సయితం తన యజమాని కూతురు అని కూడా చూడకుండా సత్యవతిని ప్రేమించాడు. ప్రేమ అన్నది ఒక్కసారి పుట్టిన తరువాత అది ఏదో ఒకరోజు నలుగురి దృష్టిలోకి రాకుండా ఉండడమనేది అరుదు. దీంతో సుబ్బారాయుడికి తమ కుటుంబానికి సంబంధించిన పరువు ప్రశ్నర్థాకమైంది. నిజానికి చెంగల్వరాయుడు తమ కులంవాడే అయినప్పటికీ ఒక అనాథగా తమ ఇంట్లోకి అడుగు పెట్టినవాడు. ఎంత ఇంటి నిర్వహణ బాధ్యతను అతనికి ఇచ్చినా ప్రాథమికంగా అతను పనిమనిషే. అటువంటి వ్యక్తిని సుబ్బారాయుడి గారాబాల చెల్లెలు ప్రేమించింది. వీళ్ళిద్దరి ప్రేమ వ్యవహారం సుబ్బారాయుడికి కొంత అర్థం అవుతూ అసంతృప్తి కలిగిస్తూనే ఉంది. అందుకే ఒకసారి "చిలుక నిద్రలేకుండా చేస్తుంది. దాని పీక పిసికేస్తాను" అంటూ పరోక్షంగా చెల్లెలి మీద మండిపడ్డాడు. అదే కోపంతో గొడ్ల చావట్లోకి వెళ్ళి కారు దున్నపోతును కర్ర తీసుకొని కొట్టాడు. అకారణంగా కొట్టాడనుకుందేమో సుబ్బారాయుడు కనిపించినప్పుడల్లా అది బుసకొట్టేది.

ఇదే సమయంలో సుబ్బారాయుడి భార్యమాటలు అతన్ని మరింత ప్రభావితం చేశాయి. "వయసు వచ్చిన పిల్ల. అతగాడితో ఈ సఖ్యం ఏమిటండీ" అంది ఆయన భార్య. అతనికి కోపం వచ్చింది. "ఎవరన్నా ఏవన్నా అన్నారా ఊళ్ళో" అన్నాడు సుబ్బారాయుడు. తన ఇంటి విషయం బయటివాళ్ళకు తెలవడాన్ని అతను

భరించలేడు. అతను పరువు ప్రతిష్ఠలకు ఎంతగా కట్టుబడి ఉంటాడో ఈ మాటలే నిదర్శనం. ఎవరో దొంగలు ఎత్తుకొచ్చిన సొత్తు తమ పొలంలో దాచుకున్నారని తెలిసి, ఆ నల్లగుడ్డ మూటను కోనేట్లో వేయించిన వ్యక్తి సుబ్బారాయుడు. ఏ రకమైన లోకనిందనైనా అతను భరించలేడనే విషయం ఇక్కడ అర్థం అవుతుంది. అందుకే వీరయ్యతో చెంగల్వరాయుడిని పిలిపించి వెంటనే ఇంటినుంచి పంపించి వేశాడు. ఇంకా ఆలస్యం చేస్తే ఈ వ్యవహారం ముదురుతుందని భావించాడు. "బయట ఎక్కడైనా మాట పుట్టుకొచ్చిందంటే ఇక చావాల్సిందే" అన్నంతగా భయపడ్డాడు సుబ్బారాయుడు అందుకే అతన్ని వెంటనే పంపించివేశాడు.

అదే ఎండాకాలం సత్యవతికి పెళ్ళి చేశాడు. వారం రోజులు తిరగక ముందే ఆమె అత్తవారింటి నుంచి పారిపోయి వచ్చింది. భూమి పుట్టినప్పటి నుంచి ఈ ఇంటి ఆడవాళ్ళు ఎవరూ ఇలా చేయలేదని అతను బాధపడ్డాడు. రేప్పొద్దున నలుగురిలో తల ఎత్తుకోవడం ఎట్లా? అని మథనపడ్డాడు. మరుసటిరోజు వీరయ్యను, అక్కమ్మను వెంట పంపుతూ సత్యవతిని అత్తగారింటికి పంపించాడు. మళ్ళీ తిరిగి వస్తే "గడపకు అడ్డంగా నరుకత" అంటూ గాండ్రించాడు. సత్యవతిని పంపించిన తరువాత కూడా అతని మనసు కుదుటపడలేదు. ఇంట్లో, గొడ్ల చావట్లో అటు ఇటు పచార్లు చేస్తూనే సత్యవతి వల్ల జరుగుతున్న అవమానాన్ని తలచుకొని బాధపడ్డాడు.

తన చెల్లెలుతో చెంగల్వరాయుడి ప్రేమవ్యవహారమే సుబ్బారాయుడికి కోపం తెప్పించింది తప్ప మరేరకంగానూ అతనిమీద సుబ్బారాయుడికి కోపం లేదు. చెంగల్వరాయుడు వెళ్ళిపోయిన తరువాత చెంగల్వరాయుడి మంచితనాన్ని గుర్తుచేసుకోవడమే అందుకు ఉదాహరణ. తనను చూడగానే బుసలుకొట్టే పాపిస్థిదున్న చెంగల్వరాయుడిని చూడగానే పసిపిల్లలా ఎట్లా చూసేదో సుబ్బారాయుడు గుర్తుచేసుకున్నాడు.

సత్యవతి మూడోసారి కూడా పారిపోయి రావడాన్ని సుబ్బారాయుడు భరించలేకపోయాడు. సత్యవతి పారిపోయి వచ్చిన రాత్రే ఆమెను అత్తవారింటిలో వదిలిపెట్టి వచ్చే మిషతో ఆమెను తీసుకొని వెళుతూ మార్గమధ్యంలో బల్లకట్టు నుంచి నీళ్ళలోకి తోసివేసి చంపివేశాడు. ఆ తరువాత ఈ విషయం ఎవరికి చెప్పలేక తనలోతను కుమిలిపోయాడు. అప్పటినుంచి తన ఇంటి గురించి, ఆస్తిపాస్తుల గురించి శ్రద్ధవహించలేకపోయాడు. గమిడిపోతులు, దుక్కిటెడ్లు, పాడిపశువులు అన్నీ అమ్మేశాడు. తను పట్టెమంచం పడక మానేశాడు. చావిట్లో నులకమంచం

వేసుకొని భోజనం, పడక అన్నీ అక్కడే సాగించాడు. అమ్మవారి గుడిని కూడా పట్టించుకోకపోవడంతో సత్తెమ్మ సంబరాలు కూడా ఆగిపోయాయి. ఆస్తిమొత్తం హారతి కర్పూరంలా కరిగిపోయింది. ఆశ్రిత సేవక గణం ఇల్లు విడిచి వెళ్ళిపోయింది. సవతితల్లి బిడ్డలను ఏదో తగుపాటి సంబంధాలను చూసి పెళ్ళిళ్ళు చేశాడు. చివరికి ఇల్లు ఒక్కటే మిగిలింది. దాని మీద కూడా అప్పులయ్యాయి. సుబ్బారాయుడు అకాలంలో వృద్ధుడయ్యాడు. అతన్ని చూసి చిలుక కూడా భయపడింది.

పరువుప్రతిష్ఠల కోసం తన సొంత చెల్లెలిని చంపిన సుబ్బారాయుడు అదే పరువు ప్రతిష్ఠలకు భయపడి బయటికి చెప్పలేకపోయాడు. ఒక పాపాన్ని బలవంతంగా బంధించడం వల్ల అతని మనసుపై అది తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. వేళ్ళు తొలచబడిన చెట్టులా అతనితోపాటు ఆ ఇంటివైభవం కూడా కుప్పకూలిపోయింది. సత్యవతి విషయం అతను బయటికి చెప్పకపోయినా అతని అంతరాత్మ అతన్ని వదిలిపెట్టలేదు. పాపానికి సంబంధించిన అంతర్మథనం సుబ్బారాయుడి అంతానికి కారణమైంది. సత్యవతి హత్య అతన్ని సమాజ, దృష్టిలో హంతకుడిని చేయకపోయినా అంతరాత్మ పరంగా అతను హంతకుడే అయ్యాడు.

అందుకే మంచంలో పడి చనిపోయే ముందు అతను సత్యవతికోసం కలవరించాడు. సత్యవతిని చూడాలన్న అతని ఆరాటమే సత్యవతిని తాను చంపిన సంఘటన అతని మీద ఎటువంటి గాఢమైన ప్రభావాన్ని చూపిందో అర్థం అవుతుంది. సుబ్బారాయుడు చనిపోయేముందు సత్యవతిని తాను చంపిన విషయం చెప్పాడనడం కంటే, ఒక పాపానికి సంబంధించిన నిజం బద్దలైనట్లుగా బయటికి వచ్చిందనడం ఎంతైనా సమంజసం.

**ముగింపు:** ఈ కథలోని ముగింపు పాఠకుడి ఊహకు అందని విధంగా నడచింది. సత్యవతి తన అన్నను క్షమిస్తుందా? వచ్చి చూస్తుందా? సుబ్బారాయుడు చివరకు ఆమెను చూడగలుగుతాడా? మొదలైన ప్రశ్నల పరంపర పాఠకుడి మనసులో కొనసాగుతుండగానే ఊహకు అందని మలుపు తిరగి ఒక్కసారిగా ఈ కథ ముగుస్తుంది. అప్పటి వరకు సత్యవతి వచ్చిందా అని, అమాయకంగా అడుగుతూ పాత్రలను, పాఠకులను మభ్యపెట్టుకుంటూ వచ్చిన సుబ్బారాయుడు సత్యవతిని తానే బల్లకట్టు పైనుంచి నీటిలోకి తోసివేసి చంపివేశాడని చెప్పడం కథలో కొసమెరుపు. సుబ్బారాయుడి ఈ మాటలతో పాఠకులు నివ్వెరపోతారు. రచయిత్రి ఇలా అతనిచేత చెప్పించడంలో ఎంతో మెళకువను, నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

# Blank page



426